
వాల్మీకి రామాయణము

పుల్లెల శ్రీరామచంద్రుడు

యుద్ధ కాండము



వాల్మీకి రామాయణము

యథామూలానువాదము

యుద్ధకాండము

పద్మశ్రీ పురస్కృత, మహామహోపాధ్యాయ

ఆచార్య డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

వాల్మీకి రామాయణము
యథామూలానువాదము

ప్రథమముద్రణ 2013

ప్రతులు 10,000

మూల్యం
(ఏడు కాండల సెట్)రూ. 495/- (US $ 15)

రచన : **ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు**

చిత్రకారుడు : బాపు

9 788192 771519

ప్రకాశకులు:

T.L.P Publishers
A Division of Excellent Enterprises
క్వీన్‌హౌస్, సాగర్‌సొసైటీ రోడ్,
బంజారాహిల్స్, రోడ్ నెం. 2, హైదరాబాదు - **500034.**
ఫోన్: +91 040 23542515

ముద్రణ:
కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్.

యుద్ధకాండ విషయసూచిక

సర్గ	విషయము	పుట

శ్రీః

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము

మొదటి సర్గము

శ్రీరాముడు హనుమంతుని ప్రశంసించి అతనిని కౌగిలించుకొనుట.

హనుమంతుడు ఉన్నదున్నట్లుగా చెప్పుచు పలికిన మాటలు విని, రాముడు సంతోషించుచు ఇట్లు పలికెను.(1)

"ఈ భూలోకములోని ఇతరులెవ్వరూ మనస్సుచేత కూడ చేయజాలని, భూమియందు దుర్లభమైన, గొప్ప కార్యమును హనుమంతుడు చేసినాడు. గరుత్మంతుడు, వాయువు, ఈ హనుమంతుడు తప్ప సముద్రమును దాటగలిగినవారెవ్వరూ మరొకరు నాకు కనబడుటలేదు. దేవ - దానవ - యక్ష - గంధర్వ - ఉరగ - రాక్షసులలో ఎవ్వరూ కూడ ఎదిరింపరాని, రావణపాలితమైన లంకలో కేవలము తన బలముతో ప్రవేశించి ఎవ్వడైనా ప్రాణాలతో తిరిగి రాగలడా? ఎదిరింప శక్యము కానిది, రాక్షసులచేత బాగుగా రక్షింపబడుచున్నదీ అయిన లంకలోనికి, వీర్యబలములతో సంపన్నుడై, హనుమంతునితో సమానుడైనవాడు తప్ప మరెవ్వడు ప్రవేశింపగలడు? హనుమంతుడు పరాక్రమమునకు తగిన తన బలమును ప్రదర్శించి, సుగ్రీవునకు భృత్యుడు చేయవలసిన గొప్ప కార్యమును సాధించిపెట్టినాడు. చేయుటకు చాల కష్టమైన పని చేయుటకు ప్రభువు నియమించగా ఆ పనిని ఆసక్తితో చేయు భృత్యుడు పురుషులలో శ్రేష్ఠుడు అని చెప్పుదురు. బుద్ధిమంతుడైయుండి, సమర్థుడై ఉండి కూడ ఏ భృత్యుడు రాజుకు ప్రియమైన పనిని చెప్పినదానికంటె అధికము చేయడో అతడు మధ్యముడైన నరుడని చెప్పుదురు. ఒక కార్యమునందు నియుక్తుడైన భృత్యుడు, బుద్ధిమంతుడై ఉండి, సమర్థుడై ఉండి ప్రభువు కార్యమును శ్రద్ధగా చేయకపోయినచో వాడు పురుషులలో అధముడు అని చెప్పుదురు. కార్యమును చేయుటకై నియుక్తుడై హనుమంతుడు ఆ పనిని



సాధించినాడు. తనను ఏ మాత్రము తెలికపరచుకొనలేదు. సుగ్రీవునకు సంతోషము కలిగించినాడు. హనుమంతు డిప్పుడు సీతను చూచి వచ్చి నన్ను, రఘువంశమును, మహాబలుడైన లక్ష్మణుని ధర్మానుసారము రక్షించినాడు. కాని నేను, ప్రియవార్తను చెప్పిన ఈతనికి తగు ప్రియమును చేయ జాలకున్నాను. అదియే దీనుడనైన నా మనస్సును చాల పీడించుచున్నది. అట్టి మహాత్ముడైన హనుమంతునకు, ఈ సమయమునందు నేను నా సర్వస్వమైన ఆలింగనమును ఇచ్చుచున్నాను."(2-13)

రాము డిట్లు పలికి, సంతోషముతో శరీరము పులకించగా, తన కార్యమును పూర్తిచేసి వచ్చిన హనుమంతుని కౌగిలించుకొనెను.(14)

కొంచెము సేపు ఏదో ఆలోచించి, వానరప్రభువైన సుగ్రీవుడు వినుచుండగా అతడు మరల ఇట్లు పలికెను. "హనుమంతుడా! మీరు అన్నివిధాల సీతాన్వేషణమును చక్కగా చేసినారు. కాని నా మనస్సు, సముద్రము స్మృతికి రాగానే ఏమి చేయవలెనో తోచకుండ అయిపోవుచున్నది. ఈ వానరు లందరూ కలిసి అధికమైన జలముతో అగాధమైన, దాటశక్యము కాని సముద్రము దక్షిణతీరమును ఎట్లు చేరగలరో! నాకు సీతావృత్తాంతము తెలిసినది. అది బాగుగానే ఉన్నది కాని ఈ సముద్రము వానరులెట్లు దాటగలరు అను దానికి సమాధానమేమి?"(15-18)

రాముడు హనుమంతునితో ఇట్లు పలికి శోకాక్రాంతుడై ఆలోచించసాగెను. (19)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఒకటవ సర్గము సమాప్తము.

రెండవ సర్గము

సుగ్రీవుడు శోకసంతప్తుడైన రామునకు ధైర్యము చెప్పుట.

దశరథకుమారుడైన రాముడు ఈ విధముగా దుఃఖించుచుండగా శ్రీమంతుడైన సుగ్రీవుడు అతనితో శోకమును తొలగించు ఈ వచనము పలికెను. "వీరుడా! సాధారణమానవుడు వలె ఇట్లు దుఃఖించుచున్నా వేమి? నీవు ఈవిధముగా ఉండగూడదు. కృతఘ్నుడు స్నేహమును విడిచినట్లు నీ శోకమును విడిచిపెట్టుము. రామా! సీత వార్త తెలిసినది. శత్రువు ఎక్కడ ఉన్నాడో కూడ తెలిసినది. అందుచేత ఇంక నీవు దుఃఖించుటకు కారణ మేమీ నాకు కనబడుటలేదు. నీవు బుద్ధిమంతుడవు. శాస్త్రము తెలిసినవాడవు. ఆలోచనాశక్తి కలవాడవు. తగు నిర్ణయములు చేయగలవాడవు. అందుచేత బుద్ధిమంతుడు కార్యవిఘాతకమైన ఆలోచనలు విడచినట్లు, ఈ సామాన్యపు ఆలోచనలను విడిచిపెట్టుము. పెద్ద మొసళ్ళతో నిండియున్న సముద్రము దాటి లంకలో ప్రవేశించెదము. నీ శత్రువును సంహరించెదము. ఉత్సాహము లేక శోకముతో బుద్ధి వ్యాకులమై, దీనుడుగా ఉన్న పురుషుని కార్యము లన్నీ చెడిపోవును. అతడు కష్టాల పాలగును. మన చుట్టూ నిలచి ఉన్న ఈ వానరనాయకు లందరూ శూరులు, సమర్థులు. నీకు ప్రియమును చేయుటకై అగ్నిలో దుముకుటకు కూడా ఉత్సాహవంతులై ఉన్నారు. నే నీ విషయమును వీరి సంతోషమును బట్టి తెలుసుకున్నాను. నా కీ విషయమున పూర్తి నమ్మక మున్నది. శత్రువు, పాపకర్మలు ఆచరించువాడు అయిన రావణుని సంహరించి, సీతను తీసికొనివచ్చుటకు తగిన ఉపాయమును ఆలోచించుము. రామా! సముద్రముపై సేతువు కట్టి రాక్షసరాజైన ఆ రావణుని నగరమైన లంకను మనము చేరు ఉపాయము ఆలోచించుము. మనము త్రికూటపర్వతశిఖరము మీద ఉన్న లంకాపురమును చూచిన పిమ్మట యుద్ధములో రావణుడు మన కంటపడిన వెంటనే మరణించగలడని నమ్ముము. భయంకరమైన సాగరముపై సేతువును బంధించకుండగా ఇంద్రసహితులైన సురాసురులు కూడ లంకను పీడింపజాలరు. లంకాసమీపమునందు సముద్రము మీద సేతువును బంధించి నా సైన్యము అంతా దాటిన వెంటనే మనము జయించితిమనియే నమ్ముము. ఇచ్ఛానుసారము రూపములను ధరించగలిగిన ఈ వానరులు యుద్ధములో వీరులు.(1-13)

రాజా! సకలకార్యములను నశింపచేయు మనోవ్యాకులత్వమును విడిచిపెట్టుము. ఈ లోకములో శోకము మానవుని శౌర్యమును

తగ్గించివేయును.(14)

మనుష్యుడు చూపవలసిన శౌర్యమును అవలంబించుము. దానిని చూపువానికి అది తప్పక కార్యసాధకము అగును.(15)

మహాబుద్ధిశాలియైన ఓ! రామా! ఈ సమయమునందు తేజస్సుతో బలమును చూపుము. ఎవరైన కనబడకుండ పోయినపుడు గాని, నశించినప్పుడు గాని నీవంటి శూరులు, మహాత్ములు అయిన పురుషులు శోకము చెందుట సకలకార్యములను నశింపచేయును. నీవు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవు. సమస్తమైన శాస్త్రవిషయములు తెలిసినవాడవు. అందుచేత నీవు నావంటి సహాయులతో కలిసి శత్రువును జయించుము. రామా! నీవు యుద్ధరంగములో ధనుస్సు ధరించి ఉండగా నీకు ఎదురుగా నిలబడగలవాడు ఎవ్వడూ నాకు ఈ మూడులోకములలో కూడ కనబడుటలేదు. వానరులు చేయవలసి ఉన్న నీ కార్యము ఎన్నటికీ చెడదు. నీవు అచిరకాలములో అపారమైన సముద్రమును దాటి సీతను చూడగలవు. అందుచేత, ఓ! రాజా! శోకమును అవలంబించకుము. శత్రువుమీద క్రోధమును చూపుము. ప్రయత్నహీనులైన క్షత్రియులు మందులు. శూరుడై కోపమును చూపువానికి అందరూ భయపడుచుందురు. సూక్ష్మబుద్ధి గల నీవు ఇప్పుడు, నదులకు ప్రభువైన, భయంకరమైన సముద్రమును ఎట్లు దాటవలెనో మా అందరితో కలసి ఆలోచించుము. సైన్యములు ఆ సముద్రమును దాటినచో మనకు జయము వచ్చినదని నిశ్చయించుము. మనము సముద్రమును దాటినచో జయము లభించినట్లే అని నిస్సంశయముగా చెప్పవచ్చును. ఈ వానరులందరు ఇష్టానుసారము రూపము ధరించగలవారు. యుద్ధమునందు శూరులు. వీరు శిలలను, వృక్షములను వర్షించి శత్రువులను నశింపచేయగలరు. ఓ! శత్రుసంహారకుడా! ఏదో విధముగ సముద్రమును దాటివేయగల మని, యుద్ధమునందు రావణుడు చంపబడుననీ ఊహించుచున్నాను. ఇంక చాల మాటలు చెప్పనేల? అన్నివిధములా నీకు విజయము లభించును. నాకు మంచి శకునములు కనబడుచున్నవి. నా మనస్సు ఉత్సాహభరితమై ఉన్నది."(16-25)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని రెండవ సర్గము సమాప్తము.

మూడవ సర్గము

లంకను గూర్చి సవివరముగా చెప్పుమని రాముడు హనుమంతుని అడుగగా అతడు చెప్పుట.

సుగ్రీవుడు పలికిన యుక్తియుక్తములైన మంచి అర్థము గల మాటలు విని రాముడు నీవు చెప్పినది నిజమే అని అంగీకరించెను. పిమ్మట హనుమంతునితో హనుమంతుడా! తపస్సుచేత గాని, సేతువును నిర్మించి గాని, సముద్రమును ఎండిపోవునట్లు చేసిగాని, అన్నివిధాల సముద్రమును దాటుటకు నేను సమర్థుడను. ప్రవేశించుటకు కష్టమైన ఆ లంకాపట్టణములో ఎన్ని దుర్గము లున్నవో చెప్పుము. ఆ విషయము నంతను ప్రత్యక్షముగా చూచినట్లు తెలిసికొన గోరుచున్నాను. సైన్యపరిమాణమును, ద్వారముల ఏర్పాటును, దుర్గముల నిర్మాణమును, లంకలో చేసిన ఇతర రక్షణోపాయములను, రాక్షసుల గృహములను, నీవు సుఖముగా, ఉన్నవి ఉన్నట్లుగా లంకలో చూచినావు కదా? దాని నంతను విశదముగా చెప్పుము. నీవు చాల సమర్థుడవు కదా!" అని పలికెను. (1-5)

మాటలాడుటలో మంచి నేర్పు గల హనుమంతుడు రాముని మాటలు విని, అతనితో ఇట్లు అనెను – "రామా! దుర్గములను ఏర్పాటు చేయుట ద్వారా లంకాపట్టణము ఏ విధముగా రక్షింపబడుచున్నదో, సైన్యములచేత ఎట్లు రక్షింపబడుచున్నదో ఆ విషయము నంతా చెప్పెదను; వినుము. రాక్షసుల ప్రభుభక్తి, రావణుని తేజస్సుచేత లంకలో ఉన్న గొప్ప సమృద్ధి, సముద్రము భయంకరముగా ఉండుట, సేనావిభాగములు, వాహనముల ఏర్పాట్లు, ఈ విషయములను అన్నింటినీ చెప్పెదను. (6-9)

"మదించిన ఏనుగులతోను, రథములతోను నిండినదై, రాక్షసగణముల నివాసముగా ఉన్న అతివిశాలమైన ఆ లంక సంతోషానందములతో ప్రకాశించుచున్నది. ఆ నగరమునకు చాల పెద్దవైన, విశాలములైన, నాలుగు ద్వారములున్నవి. దృఢములైన వాటి తలుపులు పెద్ద గడియలతో బంధింపబడి ఉన్నవి. అక్కడ పెద్ద పెద్ద, బలమైన యంత్రము లున్నవి. అవి బాణములను, శిలలను ప్రయోగించును. వాటి సాహాయ్యముతో అక్కడికి వచ్చిన శత్రుసైన్యమును నివారించుచుందురు. భయంకరములు, వాడియైనవి, ఇనుముతో తయారు చేయబడినవి అయిన వందలకొలది శతఘ్నులను ఏ క్షణమునందైనను, ఉపయోగించుటకు వీలుగా సంస్కరించి, ద్వారములవద్ద అమర్చినారు. వాటిని

ఉపయోగించగల అనేక రాక్షసులు గూడ అక్కడ నిలుపబడి ఉన్నారు. చాలా పెద్దదైన ఆ నగరము బంగారపు ప్రాకారమును ఎవ్వరూ ఆక్రమింపజాలరు. అది మధ్య మధ్య మణులతోను, పొగడములతోను, వైదూర్యములతోను, ముత్యములతోను అలంకరింపబడి ఉన్నది. ఆ ప్రాకారముల చుట్టూ చాల భయంకరములైన అందమైన పరిఖలున్నవి. చల్లని జలముతో నిండిన ఆ పరిఖలలో మొసళ్లు, మీనములు నివసించుచున్నవి. ప్రాకారద్వారములకు ఎదురుగా ఆ పరిఖలమీద చాలా పొడవైన నాలుగు వంతెన లున్నవి. అనేకమైన యంత్రములు అమర్చబడినవి; పెద్ద గృహముల పంక్తులు కూడ ఉన్నవి. పరసైన్యము వచ్చినప్పుడు ఆ యంత్రముల ద్వారా పరిఖల అన్ని వైపులయందు బాణశిలాదులను వర్షించి ఆ వంతెనలను రక్షించుచుందురు. వాటిలో ఒక వంతెన చాల బలముగా, దృఢముగా, కదల్చశక్యము కానిదై ఉన్నది. అది అనేకమైన బంగారు స్తంభములతోను, వేదికలతోను ప్రకాశించుచుండును. (10-18)

రామా! రావణుడు స్వయముగా యుద్ధము చేయుటకు సన్నద్ధుడై ఉన్నాడు. అయినను అతని మనస్సులో భయమనేది లేదు. సైన్యములను పరీక్షించుటలో ఏమరిపాటు లేక ఉత్సాహవంతుడై ఉన్నాడు. ఎత్తైన పర్వతశిఖరము మీద ఉండుటచే ఆ లంకలో ప్రవేశించుటకు ఆధార మేదీ లేదు. భయంకరమైన ఆ లంకలో దేవతలు కూడ ప్రవేశించజాలరు. దాని చుట్టూ నది ప్రవహించుటచే నదీదుర్గము, పర్వతము లుండుటచేత పర్వతదుర్గము, అరణ్యము లుండుటచే వనదుర్గము, ప్రాకారము లుండుటచేత కృత్రిమదుర్గము అను నాలుగు దుర్గములు ఉన్నవి. రామా! ఆ లంక అతిదూరమైన సముద్రదక్షిణతీరమునందు ఉన్నది. అక్కడికి వెళ్ళుటకు నౌకామార్గము లేదు. ఏ వైపునుండీ కూడా వార్తలను పంపు అవకాశము లేదు. అమరావతితో సమానమైన ఆ లంకాపట్టణము శైలాగ్రమునందు నిర్మింపబడినది. ప్రవేశింప శక్యము కానిది. గుఱ్ఱములతోను, ఏనుగులతోను నిండిన ఆ పురమును ఎవ్వరూ జయింపజాలరు. దురాత్ముడైన ఆ రావణుని పట్టణమైన ఆ లంకకు పరిఖలు, శతఘ్నులు అనేకవిధములైన యంత్రములు అలంకారములుగా ఉన్నవి. (19-23)

"ఆ లంకలో పదివేలమంది రాక్షసులు తూర్పుద్వారమునందు కాపలా ఉన్నారు. వాళ్ళందరూ శూలములను హస్తములందు ధరించి ఉందురు; సేనాగ్రమునందు ఖడ్గములు ధరించి యుద్ధము చేయగలవారు. లంక దక్షిణద్వారమునందు లక్షమంది రాక్షసులు కాపలా కాయుచున్నారు.

చతురంగసైన్యముతో కూడి అక్కడ ఉన్న యోధులు కూడా చాల శ్రేష్ఠమైన వారు. లంకలో పది లక్షలమంది రాక్షసులు పశ్చిమద్వారమునందు కాపలా కాయుచున్నారు. కత్తి, డాలు ధరించి ఉన్న ఆ రాక్షసు లందరూ అన్ని అస్త్రములయందు నైపుణ్యము కలవారు. ఉత్తరద్వారమునందు ఒక కోటిమంది రాక్షసులు కాపలా కాయుచున్నారు. వారిలో రథికులు, అశ్వములు వాహనములుగా గలవారు, మాననీయులైన ఉత్తమకులసంజాతులు ఉన్నారు. మధ్యయందున్న సేనానివేశములో వందలకొలది, వేల సంఖ్యలో ఎదిరింప శక్యము కాని రాక్షసులు, కోటికి మించిన రాక్షసులు ఉన్నారు."(24-28)

"నేను ఆ వంతెనలను కూల్చివేసితిని. పరిఖలు పూడ్చివేసితిని. లంకానగరమును కాల్చివేసితిని. ప్రాకారములను కూల్చివేసితిని. మహావీరులైన రాక్షసుల సైన్యములో ఒక భాగమును నశింపచేసితిని. ఏదో మార్గముచేత సముద్రమును దాటెదము. వానరులు లంకానగరమును నశింపచేసినారే అని నిశ్చయించుకొనుము."(29, 30)

"రామా! మిగిలిన సైన్యము మాట ఎందుకు? అంగదుడు, ద్వివిదుడు, మైందుడు, జాంబవంతుడు, పనసుడు, అనలుడు, సేనాపతియైన నీలుడు ఎగురుచు వెళ్ళి పర్వతములు, వనములు, పరిఖలు, ముఖద్వారములు, ప్రాకారములు, భవనములు - వీటితో కూడిన, రావణుని మహానగరమైన ఆ లంకను నశింపచేసి సీతను తీసికొని రాగలరు. వెంటనే సకలసైన్యములు కలిసి వచ్చునట్లు ఆజ్ఞాపించి మంచి ముహూర్తమునందు ప్రయాణము చేయుటకు నిశ్చయించుము."(31-34)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని మూడవ సర్గము సమాప్తము.

నాలుగవ సర్గము

రాముడు వానరసైన్యముతో బయలుదేరి వెళ్ళి సముద్రతీరమునందు విడియుట.

రాముడు హనుమంతుడు చెప్పిన యథార్థమైన మాటలను క్రమానుసారముగా విని ఇట్లు పలికెను- "హనుమంతుడా! నీవు చెప్పిన భయంకరుడైన ఆ రాక్షసుని పట్టణమైన లంకను శీఘ్రముగా అల్లకల్లోలము చేసెదను. నీకు నిజముగా చెప్పుచున్నాను." "సుగ్రీవా! ఈ ముహూర్తమునందే ప్రయాణమును నిశ్చయింపుము.

ఇది విజయ మనే తగిన ముహూర్తము. సూర్యుడు ఆకాశమధ్యమునం దున్నాడు. ఆ రావణుడు సీతను హరించుగాక. కాని అతడు ప్రాణములతో ఎక్కడకు వెళ్ళగలడు? నేను యుద్ధమునకై ప్రయాణ మైతినని విని సీతకు, విషము త్రాగి పీడితుడైనవానికి ప్రాణాపాయసమయమునందు అమృతమును స్పృశించుటచేత వలె, జీవితమునందు ఆశ కలుగును. నేడు ఉత్తరఫల్గునీనక్షత్రము. చంద్రుడు రేపు హస్తనక్షత్రములో ఉండును. అందుచే సుగ్రీవా! సకల సైన్యములతో కూడి నేడే బయలుదేరెదము. ఇప్పుడు ఏ శకునములు కనబడుచున్నవో వాటిని బట్టి నేను రావణుని సంహరించి సీతను తీసికొనిరాగల నని తలచుచున్నాను. పైభాగమునందు అదురుచున్న నా నేత్రము నేను కోరుచున్న విజయము లభించి నట్లు(లభించ నున్నట్లు) చెప్పుచున్నదా అన్నట్లు ఉన్నది."(1-7)

పిమ్మట సుగ్రీవుడు, లక్ష్మణుడు రాముని మాటలను అంగీకరించి అతనిని పూజించిరి. ధర్మాత్ముడు, కార్యములను ఎరిగినవాడు అయిన రాముడు మరల ఇట్లనెను- నీలుడు బలవంతులైన లక్షమంది వానరులతో కలిసి, మార్గమును చూచుటకై, నీ సేనకు ముందు వెళ్ళుగాక. సేనాపతివైన ఓ! నీలుడా! ఈ సైన్యమును, ఫలములు, మూలములు(దుంపలు), చల్లని అడవులు, ఉదకము, తేనె ఉన్న మార్గమున శీఘ్రముగా ప్రయాణము చేయించుము. మనము ప్రయాణము చేసే మార్గములో ఉన్న మూల-ఫల-జలములను దురాత్ములైన రాక్షసులు పాడుచేయవచ్చును. అందుచే నీవు జాగర్తతో వాళ్ళనుండి మూలాదులను రక్షించుము. వానరులు పల్లపు ప్రదేశములలోను, దుర్గములైన అరణ్యములలోను, వనములలోను ప్రవేశించి అక్కడ ఎవరైనా శత్రుసైనికులు ఉన్నారా అని చూచెదరు గాక. బలము లేని సైన్యము కిష్కింధలోనే ఉండిపోవుగాక. ఎందుచేతననగా మనము చేయుచున్న ఈ కార్యము చాలా భయంకరమైనది; పరాక్రమముచేత సాధింపదగినది. మహాబలవంతులైన వానరవీరులు వందలకొలది, వేలకొలది, సంఘములుగా ఏర్పడి సముద్రజలసముదాయము వంటి, భయంకరమైన, ముందు వెళ్ళవలసిన సైన్యమును నడిపింతురుగాక."(8-14)

"మదించిన ఆబోతు, ఎద్దుల మందకు ముందు నడచుచు వెళ్ళినట్లు, పర్వతము వంటి గజుడు, మహాబలుడైన గవయుడు, గవాక్షుడు సైన్యము ముందు నడచెదరుగాక. వానరుల నాయకుడు, వానరశ్రేష్ఠుడూ అయిన ఋషభుడు వానరసేన కుడి పార్శ్వమును రక్షించుచు వెళ్ళుగాక. మదించిన ఏనుగువలె ఎదిరింప శక్యముకానివాడు, బలశాలీ అయిన గంధమాదనుడు వానరసైన్యము ఎడమ

ప్రక్కను అధిష్ఠించి (పాలించుచు) వెళ్ళుగాక. నేను, దేవేంద్రుడు ఐరావతము నెక్కినట్లు హనుమంతుని వీపుమీద ఎక్కి, సేనాసముదాయమునకు ఉత్సాహమును వృద్ధిచేయుచు, సేన మధ్యలో వెళ్లెదను. యక్షుల ప్రభువైన కుబేరుడు సార్వభౌమమను దిగ్గజమును అధిష్ఠించినట్లు యమునితో సమానుడైన లక్ష్మణుడు అంగదుని అధిరోహించి వెళ్ళుగాక. మహాబలవంతుడు, భల్లూకరాజు అయిన జాంబవంతుడు, సుషేణుడు, వేగవంతుడు - ఈ ముగ్గురూ సేనామధ్యభాగమును రక్షించెదరుగాక." (15-20)

రాముని మాటలు విని, సర్వసేనాధిపతి, వానరశ్రేష్ఠుడు అయిన సుగ్రీవుడు వానరులను, రాముడు చెప్పినట్లు చేయుటకు ఆజ్ఞాపించెను. గొప్ప తేజస్సు గల ఆ వానరు లందరూ ఒక్కుమ్మడిగా లేచి వెంటనే గుహలనుండి, శిఖరములనుండి పైకి ఎగిరిరి. రాముడు సుగ్రీవునిచేత, లక్ష్మణునిచేత పూజింపబడుచు దక్షిణదిక్కు వైపు ప్రయాణమయ్యెను. అప్పుడా రాముడు వందలకొలది, పదివేలకొలది, లక్షలకొలది, కోట్ల కొలది ఏనుగుల వంటి వానరులతో కూడినవాడై వెళ్ళెను. విశాలమైన ఆ వానరసేన ముందు వెళ్ళుచున్న ఆ రాముని అనుసరించి వెళ్ళెను. సుగ్రీవునిచేత పాలింపబడిన ఆ వానరులందరు ఉత్సాహవంతులై చాల సంతోషించుచుండిరి. ఎగురుచు, మండలాకారముగా ఎగురుచు, గర్జించుచు, సింహనాదములు చేయుచు, అరచుచు దక్షిణమువైపు వెళ్ళిరి. దారిలో మంచి సువాసన గల తేనెలను, ఫలములను భక్షించుచు, గుత్తుల సముదాయములతో నిండిన పెద్ద వృక్షములను మోయుచు వెళ్ళిరి. గర్వించిన కొందరు వానరులు పరస్పరము పైకి ఎత్తి క్రిందికి పడవేయుచుండిరి. కొందరు క్రిందికి దుమికి పైకి ఎగురుచుండిరి. మరికొందరు ఇతరులను క్రిందికి పడద్రోయుచుండిరి. (21-28)

"రామునకు దగ్గరగా ఉన్న వానరులు మనము రావణుని, సమస్తమైన రాక్షసులను చంపవలెను అని గర్జించుచుండిరి. ఋషభుడు, నీలుడు, వీరుడైన కుముదుడు మొదలైన వాళ్ళందరు కలిసి ముందు నడచుచు సైన్యము వచ్చే మార్గమును బాగుచేయుచుండిరి. శత్రుసంహారకులైన సుగ్రీవుడు, రాముడు, లక్ష్మణుడు బలవంతులు, భయంకరులు అయిన వానరులతో కూడి సేనామధ్యమునందు ప్రయాణము చేసిరి. (29-31)

పదికోట్ల వానరులతో కూడిన వీరుడైన శతబలి ఒక్కడే వానరసైన్యము నంతను అధిష్ఠించి రక్షించుచుండెను. నూరుకోట్ల పరివారము గల కేసరి, పనసుడు, గజుడు, చాలమంది వానరులతో కూడిన అర్కుడు ఒక సైన్యపార్శ్వమును

రక్షించుచుండిరి. అనేక భల్లూకములతో కూడిన సుషేణజాంబవంతులు సుగ్రీవుని ఎదుట ఉంచుకొని సైన్యము వెనుకభాగమును రక్షించుచుండిరి. ఆ వానరుల సేనాపతి, నియమవంతుడు, ప్రాణులలో శ్రేష్ఠుడు అయిన నీలుడు సైన్యమును పర్యవేక్షించుచు పాలించుచుండెను. వలీముఖుడు, ప్రజంఘుడు, జంభుడు, రభసుడు – ఈ వీరులందరు నాల్గుప్రక్కలా తిరుగుచు, వానరులను తొందర పెట్టుచు వెళ్ళిరి. (32-36)

బలముచేత గర్వించిన ఆ వానరశ్రేష్ఠులు ఈ విధముగా వెళ్ళుచు, అనేకమైన చిన్న పర్వతములతో కూడిన, పర్వతశ్రేష్ఠమైన సహ్యాపర్వతమును, వికసించిన పుష్పములు గల సరస్సులను, శ్రేష్ఠములైన చెరువులను చూచిరి. సముద్రజలసముదాయమువలె భయంకరముగా ఉన్న ఆ గొప్ప వానరసైన్యము, భయంకరమైన కోపము గల రాముని ఆజ్ఞను స్మరించుచు, భయపడి, నగర సమీపప్రాంతములను, గ్రామములను పరిహరించుచు చాల భయంకరము, భయంకరమైన ధ్వని గలదీ అయిన సముద్రము వలె ప్రయాణము చేసెను. శూరులైన ఆ వానరశ్రేష్ఠ లందరూ, తోలిన ఉత్తమాశ్వముల వలె రాముని ప్రక్క శీఘ్రముగా ఎగురుచు వెళ్ళిరి. హనుమదంగదుల భుజముల నెక్కి వెళ్ళుచున్న ఆ రామలక్ష్మణులు రెండు పెద్ద గ్రహములతో కూడిన సూర్యచంద్రులవలె ప్రకాశించిరి. ధర్మాత్ముడైన రాముడు సుగ్రీవునిచేత, లక్ష్మణునిచేత పూజింపబడుచు దక్షిణదిక్కు వైపు ప్రయాణ మయ్యెను. (37-43)

లక్ష్మణుడు, అంగదుని భుజముపై కూర్చుండి ప్రయాణము చేయుచు, పరిపూర్ణమైన అర్థము కలుగునట్లు రామునితో– "ఆర్యా! రావణుని శీఘ్రముగా సంహరించి, వానిచేత అపహరించబడిన సీతను పొంది, కృతకృత్యుడవై, ఐశ్వర్యసమృద్ధమైన అయోధ్యకు వెళ్ళగలవు. నీ కార్యసిద్ధిని సూచించు అన్ని శుభశకునములు కనబడుచున్నవి. మంగళకరము, మృదువు, హితము, సుఖకరము అయిన వాయువు సేనకు అనుకూలముగా (సేన ఏ వైపునకు వెళ్ళుచున్నదో ఆ వైపునకే) వీచుచున్నది. ఈ మృగములు పక్షులు కూడా పూర్ణము, మధురమూ అయిన స్వరముతో ధ్వని చేయుచున్నవి. దిక్కులన్నీ ప్రసన్నములుగా ఉన్నవి. సూర్యుడు నిర్మలముగా ఉన్నాడు. భృగుమహర్షి పుత్రుడైన శుక్రుడు ప్రసన్నమై కాంతితో నీకు అనుకూలముగా ఉన్నాడు. సప్తర్షిమండలముతో కూడిన ధ్రువుడు పరిశుద్ధముగా ఉన్నాడు. సప్తర్షులు అందరూ కూడ పరిశుద్ధులై, కాంతిమంతులై ధ్రువునికి ప్రదక్షిణముగా సంచరించుచు ప్రకాశించుచున్నారు. మహాత్ములైన

ఇక్ష్వాకువంశీయుల వంశమునందు జన్మించినవాడూ, మన ముత్తాత, రాజర్షీ అయిన త్రిశంకువు, ఎదుట పురోహితుడైన విశ్వామిత్రునితో ప్రకాశించుచున్నాడు." (44-50)

"విశాఖానక్షత్రములు ఉపద్రవ మేమీ(దుష్టగ్రహసంబంధాదికము) లేనివై నిర్మలములై ప్రకాశించుచున్నవి. ఇది మహాత్ములైన మన ఇక్ష్వాకువంశీయుల నక్షత్రము. నిరృతి దేవతగా గల, రాక్షసనక్షత్రమైన మూలనక్షత్రము పీడింపబడుచున్నది. మొదలుగల(అనగా స్తంభాకారముగా ఉన్న) తోకచుక్క స్పృశించుటచే మూలనక్షత్రము తపింపచేయబడుచున్నది. మృత్యువు ఆసన్నమైన వారి నక్షత్రము గ్రహముచేత పీడించబడును కదా! అందుచేత ఇది అంతా రాక్షసుల వినాశమునకే వచ్చినది. జలములు నిర్మలములుగా నున్నవి. వాటి రుచి బాగున్నది. వనములు ఫలములతో నిండినవి. గంధముతో నిండిన వాయువులు మందముగా వీచుచున్నవి. వృక్షములు ఋతువుల ప్రకారము పుష్పించినవి. ఓ! ప్రభూ! వ్యూహములుగా ఏర్పడిన ఈ కపిసైన్యాలు తారకాసురుని సంహారసమయమునందు దేవతల సైన్యములు వలె అధికముగా ప్రకాశించుచున్నవి. ఆర్యా! ఈ విధముగా ఉన్న ఈ శుభశకునములను చూచి నీవు సంతోషము పొందుము." అని పలికెను. (51-55)

అప్పుడు వానరసేన గోళ్ళు, కోరలు ఆయుధములుగా గల శ్రేష్ఠములైన భల్లూకములచేతను, వానరులచేతను భూమినంతను కప్పివేయుచు ప్రయాణము చేసెను. వానరులు హస్తాగ్రములచేత, పాదాగ్రములచేత ఎగురగొట్టిన భయంకరమైన పరాగము సూర్యునికాంతిని నివారించి, పర్వతములతోను, అరణ్యములతోను, ఆకాశముతోను గూడిన లోకమును కప్పివేసెను. భయంకరమైన ఆ సేన, మేఘసముదాయము ఆకాశమును కప్పినట్లు దక్షిణదిక్కును కప్పుచు వెళ్ళెను. (56-59)

సేన అవిచ్ఛిన్నముగా నదులలో దిగి వాటిని దాటుచున్నప్పుడు అవి అనేకయోజనముల దూరము వెనుకకు ప్రవహించెను. ఆ సేనలు నిర్మలమైన ఉదకము గల సరస్సులు, వృక్షములతో నిండిన పర్వతములు, సమమైన ప్రదేశములు, ఫలములతో నిండిన వనములు - వీటినన్నింటిని మధ్యభాగములందు, నలువైపులనుండి, అడ్డముగాను, క్రింది భాగములనుండి ప్రవేశించినవి. గొప్పదైన ఆ సేన సమస్తమైన భూమిని కప్పుచు వెళ్ళెను. వాయువుతో సమానమైన వేగము గల ఆ వానరులందరూ సంతోషించిన ముఖములతో వెళ్ళిరి. రామకార్యసాధనము

నిమిత్తము ఆ వానరులు సహజముగా లేని బలమును కూడా తెచ్చి పెట్టికొనుచు, బలాధిక్యమువలన, పరస్పరము సంతోషమును, వీర్యమును చూపుచు, యౌవనోద్రేకమువలన కలిగిన గర్వముతో మార్గమునందు అనేక చేష్టలు చేసిరి.(60-64)

వనములో సంచరించే ఆ వానరులలో కొందరు అక్కడ శీఘ్రముగా నడచి వెళ్ళుచుండిరి. కొందరు ఎగురుచుండిరి. మరికొందరు కిచకిచలాడుచుండిరి. కొందరు తోకలు గట్టిగా జాళించుచుండిరి. కొందరు నేలమీద అడుగులు గట్టిగా వేయుచుండిరి. కొందరు భుజములు విసరుచు పర్వతములను వృక్షములను విరుచుచుండిరి. కొందరు వానరులు పర్వతశిఖరములెక్కి గొప్ప ధ్వనులు చేయుచుండిరి. మరికొందరు సింహనాదములు చేయుచుండిరి. కొందరు తొడల వేగముచేత అనేకములైన లతాసముదాయములను నలగగొట్టుచుండిరి. మరికొందరు పరాక్రమశాలులు అవయవములను కదల్చుచు శిలలతోను, వృక్షములతోను క్రీడించుచుండిరి.(65-68)

భూమి అంతయు వేలకొలది, లక్షలకొలది, కోట్ల కొలది భయంకరులైన వానరులచేత కప్పబడి శోభాయుక్తముగా ఉండెను. విశాలమైన ఆ వానరసేన రేయింబగళ్ళు ప్రయాణము చేయుచునే ఉండెను. సుగ్రీవుని రక్షణలో ఉన్న ఆ వానరు లందరు ఆనందోత్సాహములతో నిండి ఉండిరి. అందరు యుద్ధోత్సాహముతో శీఘ్రముగా వెళ్ళుచుండిరి. సీతను విడిపింప దలచుకున్న వారు ముహూర్తకాలము కూడ ఎక్కడా నిలబడలేదు. వానరులు వృక్షములతో దట్టముగా ఉన్న, అనేకమృగములతో నిండిన సహ్యపర్వతము చేరి దానిమీదికి ఎక్కిరి. రాముడు కూడ సహ్యమలయపర్వతముల విచిత్రములైన అడవులను, నదులను, సెలయేళ్ళను చూచుచు వెళ్ళెను. వానరులు మార్గములో ఉన్న చంపక - తిలక - చూత - ప్రసేక - సిందువారక - తినిశ - కరవీర వృక్షములను సేవించి వాటి ఫలాదులను అనుభవించిరి. అశోక - కరంజ - ప్లక్ష - న్యగ్రోధ - జంబుక - ఆమలక వృక్షములను సేవించిరి.(69-75)

సుందరములైన చరియలమీద ఉన్న అరణ్యవృక్షములు వాయువేగముచేత కదలినవై ఆ వానరులమీద పుష్పములు చల్లినవి. మకరందము సువాసనలు గల వనములో చందనము వలె చల్లగా ఉన్న వాయువు, ధ్వని చేయుచున్న తుమ్మెదలతో కూడినదై శరీరమునకు సుఖస్పర్శ కలిగించుచు వీచెను. ఆ సహ్యపర్వతము గైరికాదిధాతువులతో అధికముగా ప్రకాశించుచుండెను. వాయువేగము

ఆఘాతముచేత ఆ ధాతువులనుండి పరాగము ఎగిరి విశాలమైన ఆ సైన్యమును అంతటా కప్పివేసెను.(76-78)

సంతోషభరితులైన ఆ వానరులు, రమ్యములైన ఆ పర్వతము చరియలమీద ఉన్న పుష్పించిన మొగలిడొంకలను, సిందువారములను, వసంతర్తువులో పుష్పించు మనోహరములైన మాధవీలతలను, పుష్పించి సుగంధముతో నిండిన మల్లెతీగలను, చిరిబిల్వ - మధూక - మంజుల - వకుల - రంజక - తిలక - నాగ - చూత - పాటలిక - కోవిదార- ముచులింద - అర్జున - శింశపా - కుటజ - ధవవృక్షములను, బూరుగుచెట్లను, ఎఱ్ఱగోరింటచెట్లను, హింతాల - తినిశ - చూర్ణక - నీపక - నీలాశోక - సరల - అంకోల - పద్మకములను వ్యాకులము చేసిరి.(79-84)

ఆ పర్వతముమీద దిగుడుబావులు, రమ్యములైన చిన్న చెరువులు, సుందరమైన సరస్సులు ఉండెను. వాటియందు చక్రవాకములు, కారండవములు, నీటికాకులు, క్రౌంచపక్షులు విహరించుచుండెను. వరాహములు, లేళ్ళు, ఎలుగుబంట్లు, చిరుతపులులు, సింహములు, భయంకరములైన పులులు, అనేక దుష్టగజములు, నలుమూలలా వాటి జలమును త్రాగుచూ ఆశ్రయించి ఉండెను. పద్మములు, మంచి సువాసన గల కలువలు, తెల్లకలవలు, నల్లకలవలు, ఇంకా జలమునందు పుట్టు ఇతర పుష్పములు - వీటితో ఆ సరస్సులు నిండియుండెను. వాటిని వానరులు వ్యాకులము చేసిరి.(85-87)

ఆ పర్వతము చరియలపై అనేకవిధములైన పక్షులు కూయుచుండెను. వానరులు ఆ జలములో స్నానము చేసి, నీళ్ళు త్రాగి క్రీడించిరి. ఆ పర్వతము నెక్కి జలముతో పరస్పరము తడుపుకొనిరి. అధికమైన మదము గల ఆ వానరులు అక్కడ నున్న చెట్లనుండి అమృతము వంటి సువాసన గల ఫలములను, మూలములను, పుష్పములను కోసిరి. తేనె రంగు శరీరము గల వాళ్లు వ్రేలాడుచున్న ద్రోణము ప్రమాణము గల తేనెలను త్రాగుచు, సంతోషించుచు, చెట్లను విరచుచు, తీగలను లాగుచు, కొండలను ఇటు అటు ఎగురగొట్టుచు వెళ్ళిరి. కొందరు వానరులు మధుపానముచేత మత్తులై ధ్వని చేయుచు చెట్లమీదినుండి వెళ్ళిరి. కొందరు వృక్షములను ఎక్కిరి. మరికొందరు అధికముగా త్రాగుచుండిరి.(88-93)

పచ్చని శరీరములు గల ఆ వానరశ్రేష్ఠులతో నిండిన భూమి పండిన వరిచేలతో నిండిన భూమివలె ఉండెను. మహాబాహువైన రాముడు మహేంద్రపర్వతమును

చేరి వృక్షములచేత అలంకరించబడిన శిఖరమును ఎక్కి తాబేళ్లతోను, చేపలతోను వ్యాప్తమైన జలముతో వ్యాకులముగా ఉన్న సముద్రమును చూచెను. వారు సహ్యపర్వతమును మలయపర్వతమును దాటి క్రమముగా, భయంకరమైన ధ్వని గల సముద్రమును సమీపించిరి.(94-97)

రాముడు సుగ్రీవలక్ష్మణసమేతుడై ఆ పర్వతముపై దిగి సముద్రతీరమునందున్న వనమునకు వెళ్లెను. పిమ్మట అతడు, హటాత్తుగా లేచుచున్న ఉదక సముదాయములచేత (తరంగములచేత) కడిగివేయబడిన శిలలతో నిండిన సముద్రతీరమును సమీపించి "సుగ్రీవా! ఇదిగో మనము సముద్రము దగ్గరకు వచ్చినాము. మనము పూర్వమనుకొన్న "సముద్రము దాటుట ఎట్లా" అను చింత ఇక్కడ ఇప్పుడు వచ్చినది. నదుల భర్తయైన ఈ సముద్రమునకు ఇటుపైన తీరము లేదు. దీనిని ఉపాయముచేత గాని దాటలేము. అందువలన, ఇక్కడ సైన్యము నిలచుగాక. ఈ వానరసేన అవతలి ఒడ్డు చేరు ఉపాయమును, ఇక్కడ ఆలోచించెదము" అని సుగ్రీవునితో పలికెను.(98-102)

సీతాహరణముచేత కృశించి ఉన్న మహాబాహువైన ఆ రాముడు అప్పుడు సముద్రసమీపము చేరి "సేన ఆగవలెను" అని ఆజ్ఞాపించుచు- "ఓ! వానరశ్రేష్ఠుడా! సేనలను అన్నింటినీ సముద్రతీరమునందు విడిది చేయించుము. ఇక్కడ మనకు, సముద్రము దాటుట విషయమున ఆలోచించు సమయము వచ్చినది. ఎవ్వరూ తమ తమ సేనను విడచి ఎక్కడికీ వెళ్ళకూడదు. ఎందుచేతననగా మనకు రహస్యమైన భయహేతువు ఉండవచ్చును. అందుచే శూరులైన వానరులు వెళ్ళి తమ తమ సైన్యములను పర్యవేక్షించుకొనుచుండవలెను" అని పలికెను.(103-105)

రాముని మాటలు విని సుగ్రీవలక్ష్మణులు, వృక్షములతో కూడిన సముద్రతీరమునందు సేనను విడిదిచేయించిరి. సముద్రసమీపమునందున్న ఆ సైన్యము తేనె వలె పచ్చని రంగు గల జలముతో నిండిన రెండవ సాగరము వలె ప్రకాశించెను. ఆ వానరశ్రేష్ఠులు సముద్రతీరమునందలి వనమును చేరి, ఆ మహాసముద్రము అవతలి ఒడ్డు చేరవలె నని కోరుచు అక్కడ విడిది చేసిరి. వానరులందరు నివేశము చేయుచుండగా, సైన్యసంచలనమువలన పుట్టిన ధ్వని సముద్రము చేయు మహాధ్వనిని కప్పివేసి వినబడెను. మూడు భాగములుగా(వానరములు, గోపుచ్ఛములు, భల్లూకములు అని) విభక్తమై విడిది చేసి ఉన్న, సుగ్రీవపాలితమైన ఆ వానరసేన రాముని కార్యమును పూర్తిచేయవలె

నను నిశ్చయముతో ఉండెను. ఆ సేన మహాసముద్రమును చేరి, వాయువేగముచేత కదల్చబడుచున్న ఆ సముద్రమును చూచుచు సంతోషించెను. విశాలము, రాక్షసనివాసమూ అయిన ఆ సముద్రము ఆవతలి ఒడ్డు చాల దూరాన ఉండెను. అట్టి సముద్రమును చూచుచు వానరనాయకులు అక్కడ నిలిచిరి.(106-112)

దివసాంతమునందు, రాత్రిప్రారంభసమయమునందు, అనగా సంధ్యాకాలమునందు, క్రూరమైన మొసళ్ళతో భయంకరముగా ఉన్న ఆ సముద్రము నురుగుల సముదాయములచేత నవ్వుచున్నట్లు, తరంగములచేత నృత్యము చేయుచున్నట్లు కనబడుచుండెను. చంద్రోదయసమయమునందు పొంగుచుండెను. అంతటా చంద్రుని ప్రతిబింబములతో నిండి ఉండెను. తీవ్రమైన వాయువు వంటి పెద్ద మొసళ్ళతోను, తిములతోను, తిమింగిలములతోను వ్యాప్తమై ఉండెను. వరుణునకు నివాసస్థానమైన ఆ సముద్రము మండుచున్న పడగలతో కూడినవా అన్నట్లున్న సర్పములతో వ్యాప్తమై ఉండెను. దానిలో అనేకములైన పెద్ద జంతువులు, అనేకపర్వతములు మునిగి ఉండెను. వాటిచేత, లోనికి ప్రవేశింప శక్యముకాని ఆ సముద్రపు మార్గము కూడా ప్రవేశింపశక్యము కాకుండెను. అగాధమైన ఆ సముద్రము అసురుల నివాసస్థానమై ఉండెను. మొసళ్ళు, సర్పములు మునిగి ఉన్న జలరాశు లు వాయువుచేత కదల్చబడినవై, వృద్ధి చెంది, పైకి ఎగిరి పడుచుండెను. ఆ సముద్రము అంతటా అగ్ని చూర్ణము చల్లినట్లు(పై భాగమునందు నక్షత్రాదిప్రతిబింబముచేత) మెరయుచుండెను. ప్రకాశించుచున్న ఉదకము, మహాసర్పములు గల ఆ సముద్రము ఎల్లప్పుడు రాక్షసులకు నిలయమై పాతాళమువలె భయంకరమై ఘోరముగా ఉండెను. (113-117)

సముద్రము ఆకాశమువలె, ఆకాశము సముద్రము వలె ఉండెను. సముద్రమూ, ఆకాశమూ అను భేదము లేకుండా కనబడుచుండెను. సముద్రజలము ఆకాశముతోను, ఆకాశము సముద్రజలముతోను కలిసిపోయెను. అందుచే నక్షత్రములతో నిండిన ఆకాశము, రత్నములతో నిండిన సముద్రము పరస్పరము తుల్యములై ఉండెను. మేఘములు ఎగురుచున్న ఆకాశమునకు, తరంగపంక్తులతో వ్యాకులమైన సముద్రమునకు, ఈ రెండింటికీ భేదము కనబడలేదు. ఒకదానితో ఒకటి కలిసి కొట్టుకొనుచున్న సముద్రతరంగములు భయంకరమైన శబ్దముతో ఆకాశమునందు, పెద్ద భేరీల వలె ధ్వనిచేయుచుండెను.(118-121)

వానరులు ఆ సముద్రమును చూచిరి. అది వాయువుతో కలిసిపోయినట్లుండి,

రత్నాల ప్రోగుల ధ్వనులతోను, జలధ్వనులతోను నిండి, కోపించినదా అన్నట్లు పైకి ఎగురుచుండెను. జలజంతువుల సముదాయముతో నిండిన ఆ సముద్రములోని జలము వాయువుచేత కొట్టబడుచుండెను. వాయువు, ఆకాశము మీదికి ఎగురగొట్టు చుండగా బయలుదేరిన తరంగములతో సముద్రము ఏమేమో మాటలాడుచున్నట్లుండెను. పైకి లేచి మెలికలు తిరుగుచున్న తరంగముల ధ్వనులతో నిండి కదలిపోవుచున్నదా అన్నట్లుండెను. వానరు లందరు ఆశ్చర్యచకితులై అట్లే నిలచి ఆ సముద్రమును చూచిరి.(122-124)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నాలుగవ సర్గము సమాప్తము.

ఐదవ సర్గము

రాముడు సీతను స్మరించుచు విలపించుట.

నీలుడు యథావిధిగా సావధానము చేయుచు, బాగుగా రక్షించుచున్న ఆ సేన సముద్రము ఉత్తరతీరమునందు బాగుగా నిలుపబడెను. వానరశ్రేష్ఠులైన మైందద్వివిదు లిద్దరూ రక్షణము నిమిత్తము ఆ సేనలో అన్ని దిక్కులందు సంచరించిరి.(1, 2)

సముద్రతీరమునందు సైన్యము నిలచిన పిమ్మట రాముడు ప్రక్కనే ఉన్న లక్ష్మణునితో ఇట్లు పలికెను- "కాలము గడచుచుండగా శోకము శాంతించు నని చెప్పుదురు. కాని నా ప్రియురాలు కనబడకుండుటచేత నా శోకము రోజురోజుకు వృద్ధిచెందుతున్నది. ప్రియురాలు దూరమునందున్నందుకు నాకు దుఃఖములేదు. ఆమె హరింపబడినందుకు నాకు దుఃఖములేదు. ఆమె వయస్సు దాటిపోవుచున్నది. దీనిని గూర్చియే విచారించుచున్నాను."(3-5)

"ఓ! వాయువా! నా ప్రియురాలు ఉన్న వైపు నుండి ఇటు వీచుము. ఆమెను స్పృశించి నన్ను కూడ స్పృశించుము. నీ ద్వారా నాకు నా ప్రియురాలి శరీరము స్పర్శ లభించును. ఆమె చూచిన చంద్రుని చూచుటచే ఆమె చూపులతో నా చూపులకు సంబంధము ఏర్పడును. హరించబడుచున్న సమయమునందు నా ప్రియురాలు హా! నాథా! అని విలపించి యుండును. అది నా మనస్సులో ఉండి, త్రాగిన విషమువలె నా అవయవములను కాల్చివేయుచున్నది. ఆమె వియోగ మనే కట్టెలు, ఆమెను గూర్చిన చింత అనే తీవ్రమైన జ్వాలలు గల మన్మథాగ్ని రేయింబవళ్ళు నా

శరీరమును కాల్చివేయుచున్నది."(6-8)

"లక్ష్మణా! నీవు లేకుండగా నేనొక్కడనే ఈ సముద్రములో దిగి పండుకొనెదను. ఈ విధముగా సముద్రములో నిద్రించుచున్న నన్ను ప్రజ్వలించుచున్న కామము కాల్చకుండా ఉండునేమో! నేను, ఆమె ఒకే భూమిమీద ఉన్నాము అనునదియే కామాతురుడనైన నాకు ఎంతో గొప్ప విషయము; దీనిచేత జీవించుటకు శక్యమగును. ఆమె జీవించి ఉన్నదని వినుటచే, నీళ్ళు లేని వరిచేను, నీళ్ళు ఉన్న వరిచేను ప్రక్కన ఉండుటచే దాని తడి తగిలి జీవించినట్లు జీవించుచున్నాను. నేను శత్రువులను జయించి, పద్మములవంటి నేత్రములు గల సమృద్ధమైన రాజ్యలక్ష్మి వలె ఉన్న సీతను ఎన్నడు చూడగలనో కదా? అందమైన దంతములు, ఓష్ఠములు కల పద్మతుల్యమైన ఆమె ముఖమును కొంచెము పైకెత్తి రోగి శరీరారోగ్యవర్ధకమైన రసాయన మనే ఔషధమును త్రాగినట్లు ఎన్నడు త్రాగెదనో! దగ్గరగా కలసి ఉన్నవి, బలిసినవి, తాలఫలముల వలె ఉన్నవి, కదలుచున్నవి అయిన ఆమె వక్షోజములు నాకెప్పుడు ఆనందము కలిగించునో కదా!(9-14)

"నల్లని నేత్రాంతములు గల ఆ సీత రాక్షసుల మధ్య ఉన్నదై, నాథుడనైన నేను ఉన్నను, నాథుడు లేనిది వలె రక్షకు లెవ్వరూ లేక దుఃఖించుచున్నది. జనకమహారాజు కూతురు, నాభార్య, దశరథుని కోడలు అయిన ఆ సీత, రాక్షసస్త్రీల మధ్య ఎట్లు శయనించుచున్నదో కదా! శరత్కాలమునందు చంద్రరేఖ నల్లని మేఘములను తప్పించుకొని పైకి వచ్చినట్లు ఆమె క్షోభింపశక్యము కాని రాక్షసులను దూరముగా త్రోసివేసి పైకి రాగలదు. స్వభావముచేతనే సన్నముగా ఉండు సీత, దేశకాలముల వైపరీత్యమువలన, శోకముచేతను, భుజించకపోవుటచేతను ఇంకను చిక్కిపోయి ఉండును."(15-18)

రావణుని వక్షఃస్థలముపై బాణములను ప్రయోగించి, మనస్సులోని శోకమును తొలగించుకొని సీతను ఎప్పుడు తిరిగి తీసికొని వచ్చెదనో కదా! పతివ్రత, దేవతాస్త్రీతో సమానురాలూ అయిన సీత బెంగతో నా కంఠమును కౌగిలించుకొని ఆనందమువలన కలిగిన కన్నీళ్ళను ఎప్పుడు విడచునో కదా! సీతావియోగమువలన కలిగిన ఈ శోకమును, మాసిపోయిన వస్త్రమును విడచినట్లు వెంటనే ఎప్పుడు విడచెదనో!"(19-21)

రాముడు అక్కడ ఈ విధముగా విలపించుచుండగా పగలు గడచిపోవుటచే మందమైన శరీరము గల సూర్యుడు అస్తమించెను. పద్మపత్రములవంటి నేత్రములు

గల సీతను స్మరించుచు శోకముతో బాధపడుచున్న ఆ రాముడిని లక్ష్మణుడు ఓదార్చెను. పిదప అతడు సంధ్యను ఉపాసించెను.(22, 23)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఐదవ సర్గము సమాప్తము.

ఆరవ సర్గము

లంకలో రావణుడు రాక్షసులతో ఆలోచన చేయుట.

మహాత్ముడైన హనుమంతుడు, దేవేంద్రుడు వలె లంకలో చేసిన భయంకరములు, ఘోరములు అయిన కృత్యములను చూచి, రావణుడు సిగ్గుతో కొంచెము తల వంచుకొని మంత్రు లందరితో ఇట్లు పలికెను - "ఆ వానరమాత్రుడు వచ్చి ఎదిరింప శక్యముకాని లంకానగరమును ఎదిరించి, ప్రవేశించి, సీతను చూడగలిగినాడు. ఆ హనుమంతుడు చైత్యప్రాసాదమును ధ్వంసము చేసినాడు. గొప్పరాక్షసవీరులను చంపివేసినాడు. లంకాపట్టణము నంతా వ్యాకులము చేసినాడు.(1-3)

"మీకందరికి క్షేమమగుగాక. ఇప్పుడు నేనేమి చేయవలెను? ఏది యుక్తము? ఏది చేసినచో మంచిదిగా ఉండునో, ఏది మనకు హితమో అది చెప్పుడు. ఓ! మహాబలశాలులారా! మంత్రము(ఆలోచన) వలననే విజయము సిద్ధించు నని పండితులు చెప్పుదురు. అందుచే రాముని విషయమును ఆలోచించవలె నని కోరుచున్నాను."(4, 5)

"లోకములో ఉత్తములు, మధ్యములు, అధములు అను మూడు విధాల మనుష్యులుందురు. వారి అందరి గుణదోషములను గూర్చి చెప్పెదను. హితము కోరువారు, మంత్రమును నిర్ణయించుటయందు సమర్థులూ అయిన మంత్రులతో గాని, ఒకే విధమైన ప్రయోజనము గల మిత్రులతో గాని, అధికులైన బంధువులతో గాని కలసి ఆలోచన చేసి ఎవడు పనులను ప్రారంభించునో, దైవమును అనుకూలము చేసికొనుటకు కూడ యత్నము చేయునో, అతడు పురుషులలో ఉత్తముడు అని చెప్పుదురు. ఎవడు ఒంటరిగానే ఆలోచన చేయునో, ఒంటరిగానే ధర్మమును నిర్ణయించునో, ఒంటరిగానే పనులు చేయునో అతనిని మధ్యముడు అని అందురు. గుణదోషములను సరిగా నిర్ణయించకుండగా దైవము మీదనే ఆధారపడి, "చేయవచ్చునులే" అని కార్యమును ఉపేక్షించువాడు నరాధముడు."(6-10)

“పురుషులలో ఉత్తములు, మధ్యములు, అధములు ఉన్నట్లే, మంత్రములలో కూడా ఉత్తమము, మధ్యమము, అధమము అను భేదములు నిత్యము ఉన్నవి. శాస్త్రములో చెప్పబడిన దృష్టిని(విధానమును) అనుసరించి, ఐకమత్యమును పొంది, మంత్రులు ఏ ఆలోచనయందు స్థిరముగా ఉందురో అది ఉత్తమము. మొదట అభిప్రాయభేదము లున్నను మంత్రులు చేసే నిర్ణయము చివరికి ఒకే విధముగా ఉన్నట్లయితే ఆ మంత్రము మధ్యమము. ఎవరికి వారు వేరు వేరు అభిప్రాయములతో మాటలాడుచు ఐకమత్యమునందు ప్రీతిని చూపించక చేయు మంత్రము అధమము. అందుచే ఉత్తమమైన బుద్ధిగల మీరందరు బాగుగా ఆలోచించి ఇప్పుడు చేయవలసిన కార్యమును నిర్ణయింపుడు. దానినే నేను అంగీకరించి చేసెదను.”(11-15)

“రాముడు ధీరులైన వేలకొలది వానరులతో కలిసి మనలను ఎదిరించుటకై లంకాపురమునకు వచ్చుచున్నాడు. అతడు తగిన బలముచేత, తమ్మునితోను, సైన్యముతోను, ఇతరులైన అనుచరులతోను కూడినవాడై సముద్రమును సుఖముగా తప్పక దాటగలడు. అతడు సముద్రమును ఎండింపచేసినా చేయవచ్చును; పరాక్రమముచేత మరేమైన చేయవచ్చును. అందుచేత వానరులతో కూడా విరోధము కలిగి ఇట్టి పరిస్థితి ఏర్పడిన ఈ సమయమునందు నా పురమునకు, సైన్యమునకు ఏది హితమో అట్టి కార్యమును ఆలోచించుడు.”(16-19)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఆరవ సర్గము సమాప్తము.

ఏడవ సర్గము

రాక్షసులు “ఏ మాత్రము దిగులుచెందవలసిన పనిలేదు” అని రావణునకు చెప్పుట.

రాక్షసరాజైన రావణుని మాటలు విని, మహాబలశాలులు, నీతికి దూరమైనవారు, బుద్ధివిహీనులు అయిన ఆ రాక్షసు లందరు అంజలి ఘటించి శత్రువున కున్న బలాబలములు తెలియక అతనితో ఇట్లు పలికిరి- “రాజా! పరిఘలు, శక్తులు, ఋష్టులు, పట్టిశములు - వీటితో నిండిన గొప్ప సైన్యము మనకున్నది. నీవు ఎందుకు దిగులు చెందెదవు?(1, 2)

నీవు పాతాళమునం దున్న భోగవతీనగరమునకు వెళ్ళి యుద్ధములో పన్నగులను జయించినావు. చాలామంది యక్షులతో కలసి కైలాసపర్వతమునందు నివసించుచున్న

కుబేరునితో యుద్ధముచేసి అతనిని లొంగదీసుకొన్నావు. ఓ! ప్రభూ! మహేశ్వరుని స్నేహితుడ నని గర్వపడుచున్న మహాబలుడు, లోకపాలుడూ అయిన ఆ కుబేరునిపై కోపించి నీవు యుద్ధములో ఓడించినావు. యక్షుల సముదాయములను పడగొట్టి, క్షోభింపచేసి, కొందరిని బంధించి కైలాసపర్వతశిఖరమునుండి (అలకాపట్టణము నుండి) ఈ విమానము తీసికొనివచ్చినావు. దానవప్రభువైన మయుడు నీకు భయపడి, నీతో మైత్రిని కోరి, తన కుమార్తెయైన మండోదరిని నీకు ఇచ్చి వివాహము చేసినాడు. ఓ! మహాబాహూ! దానవుల ప్రభువు, పరాక్రమముచేత గర్వించినవాడు, ఎదిరింపశక్యము కానివాడు, నీ సోదరియైన కుంభీనసి భర్తా అయిన మధువును యుద్ధముచేసి ఓడించితివి. రసాతలమునకు వెళ్ళి నాగులను జయించితివి. వాసుకిని, తక్షకుని, శంఖుని, జటిని వశము చేసికొంటివి. ఓ! ప్రభూ! నీవు సంవత్సరకాలము యుద్ధముచేసి, స్వబలముచేత శూరులైన కాలకేయు లను దానవులను జయించితివి. ఆ దానవులు బ్రహ్మవలన వరములు పొంది చూర్ణము చేసినను మరల పుట్ట శక్తి కలవా రగుటచే క్షయము లేనివారు. మహాబలవంతులు. అట్టివారిని కూడా యుద్ధములో స్వబలముచేత లొంగదీసికొని వాళ్ళనుండి మాయలను నేర్చుకొంటివి. (3-11)

"ఓ! మహాభాగ్యవంతుడా! నాలుగు విధములైన సైన్యముగల, శూరులు, బలవంతులు అయిన వరుణుని పుత్రులను నీవు రణములో జయించితివి. యమలోక మనే మహాసముద్రమును, యముని సైన్య మను సాగరమును ప్రవేశించి గొప్ప విజయమును సాధించి యముని పారిపోవునట్లు చేసినావు. ఆ సముద్రము యమదండ మను పెద్ద మొసలితోను, శాల్మలీవృక్షాకారములో ఉన్న ముళ్ళతో నిండిన ఆయుధములతోను, కాలపాశ మను పెద్ద తరంగముతోను, యమభటు లను సర్పములతోను భయంకరమై, అక్కడనే మహాజ్వరదేవత ఉండుటచే ఎదిరింప శక్యముకానిదై ఉండెను. అక్కడ నీవు చేసిన గొప్ప యుద్ధమును చూచి జనులందరు చాల సంతోషించిరి. (12-15)

"ఈ భూమిమీద అంతటా, వృక్షములు వ్యాపించి ఉన్నట్లు, వీరులు, ఇంద్రునితో సమానమైన పరాక్రమము కలవారు అయిన అనేకక్షత్రియులు వ్యాపించి ఉండెడివారు. రాజా! యుద్ధములో వారు చూపిన వీర్యము, గుణములు, ఉత్సాహము – వాటిని పట్టి చూడగా, వారికి రాముడు సాటిరాడు. యుద్ధములో జయింపశక్యము కాని అట్టి క్షత్రియులను కూడా నీవు ఎదిరించి చంపివేసినావు."(16, 17)

"మహారాజా! నీకు శ్రమ ఎందుకు? నీవు ఉండుము. ఈ వానరు లందరినీ ఈ ఇంద్రజిత్తు ఒక్కడే నశింపచేయగలడు. అతడు మహేశ్వరుడు దేవతగా గల చాలా శ్రేష్ఠమైన యజ్ఞముచేసి లోకములో ఇతరులకెవ్వరికీ లభించని వరమును పొందినాడు. అట్టి ఇంద్రజిత్తు దేవతల సైన్య మను సముద్రములో ప్రవేశించి, దేవేంద్రుని పట్టుకొని, లంకకు తీసికొనివచ్చెను. ఆ సైన్యసముద్రము శక్తులు, తోమరములు అను మీనములతోను, చిందరవందరగా పడియున్న ప్రేగులు అను నాచుతోను నిండి, ఏనుగు లను తాబేళ్ళతో ఇరుకుగా ఉండెను. దానిలో అశ్వము లను కప్పలు ఎగురుచుండెను. ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు అను పెద్ద మొసళ్ళతోను, సప్తమరుత్తులు, అష్టవసువులు అను మహాసర్పములతోను భయంకరముగా ఉండెను. కాలిబంటు లనే ఇసుకతిన్నెలు గల ఆ సముద్రము రథములు, అశ్వములు, గజములు అను జలముతో నిండి ఉండెను. రాజా! సకలదేవతలచేతను నమస్కరించబడిన, వృత్రశంబరాసుర సంహారకుడైన ఆ దేవేంద్రుణ్ణి బ్రహ్మదేవుని ఆజ్ఞచే నీ కుమారుడు విడువగా అతడు స్వర్గలోకమునకు వెళ్ళినాడు. నీ కుమారుడైన ఆ ఇంద్రజిత్తును పంపిన చాలును. అతడే రామునితో సహా ఆ వానరసేనను నశింపచేయగలడు. రాజా! నీకు రాకూడని ఈ ఆపద సామాన్యమానవునినుండి వచ్చినది. దీనిని నీవు మనస్సులో పెట్టుకొనకుము. నీవు రాముణ్ణి చంపివేయగలవు."(18-25)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏడవ సర్గము సమాప్తము.

ఎనిమిదవ సర్గము

ప్రహస్తాదులు "రామాదులను చంపివేసెదము" అని చెప్పి రావణునకు ధైర్యము చెప్పుట.

పిమ్మట నల్లని మేఘముతో సమానుడు, శూరుడు, సేనాపతీ అయిన ప్రహస్తుడనే రాక్షసుడు చేతులు జోడించి, "రాక్షసరాజా! నీవు యుద్ధములో దేవతలను, దానవులను, గంధర్వులను, పిశాచములను, పక్షులను, సర్పములను అందరినీ ఎదిరించగలవు; ఇద్దరు మానవుల మాట చెప్పవలెనా? మన మందరము ఎవరేమి చేయగలరులే అను నమ్మకముతో ఏమరిపాటు చెంది ఉన్నప్పుడు హనుమంతుడు మనల నందరిని మోసము చేసినాడు. అట్లు కానిచో నేను జీవించి ఉండగా ఆ వానరుడు ప్రాణాలతో తిరిగి వెళ్ళగలుగునా? సముద్రపర్యంతమైన ఈ భూమియందు,

పర్వతములమీదా అడవులలోను ఒక్క వానరుడు కూడ లేకుండా చేసెదను; నీ వాజ్ఞాపించుము. రాక్షసరాజా! సుగ్రీవాదులనుండి అపద కలుగకుండా నేను రక్షణమునకు ఏర్పాట్లు చేసెదను. నీవు చేసిన సీతాపహరణరూపమైన అపరాధమువలన నీకేమీ దుఃఖము రాకుండ చూచెదను" అని పలికెను. (1-5)

దుర్ముఖు డను రాక్షసుడు చాల కోపముతో రావణునితో - "ప్రభూ! ఆ వానరుడు మనల కందరికీ చేసిన ఈ అవమానము సహించరానిది. లంకాపురమునకు, అంతఃపురమునకు హనుమంతుడు చేసిన ఈ పరాభవము, సుగ్రీవుడు శ్రీమంతుడైన రావణుని ఎదిరించుచు వచ్చుట - ఇవి ఇంకను సహించరానివి. ఈ క్షణమునందే బయలుదేరి వెళ్ళి నేను వానరులను, వాళ్ళు సముద్రములో ప్రవేశించినా, భయంకరమైన పాతాళమునకు వెళ్ళినా, ఆకాశములోనికి ఎగిరినా మరల్చెదను(చంపివేసెదను)" అనెను. (6-8)

పిమ్మట గొప్ప బలము గల వజ్రదంష్ట్రుడు మాంసము, రక్తము పూసిఉన్న భయంకరమైన పరిఘను గ్రహించి చాలా కోపముతో- "రాక్షసరాజా! ఎదిరింప శక్యముకాని రాముడు, సుగ్రీవుడు, లక్ష్మణుడు ఉండగా, దీనుడు(రహస్యసంచారాదులు చేసినవాడగుటచే) జాలిపడదగినవాడు అయిన హనుమంతునితో మన కేమి పని? ఇప్పుడు నేనొక్కడనే వెళ్ళి పరిఘతో రామలక్ష్మణసుగ్రీవులను వధించి వానరసేనను క్షోభింపచేసి వచ్చెదను. (9-11)

రాజా! నీవు ఇష్టపడితే నేను మరొక మాట చెప్పెదను వినుము. ఉపాయములయందు నేర్పు కలవాడు మాత్రమే అలసత్వము (సోమరితనము) లేనివాడై శత్రువులను జయించగలుగును. ఓ! రాక్షసరాజా! స్వేచ్ఛానుసారము రూపములను ధరించగలవారు, శూరులు, చాల భయంకరులు, చూచువారికి భయము కలిగించువారు, దృఢనిశ్చయవంతులు అయిన వేలకొలది రాక్షసులు మనుష్యరూపము ధరించి అందరూ రాముని వద్దకు వెళ్ళి ఏమాత్రము కంగారుపడక అతనితో- "మమ్ము నీ తమ్ముడైన భరతుడు పంపినాడు. అతడు సైన్యమును సిద్ధమును చేసికొని వచ్చుచున్నాడు" అని చెప్పవలెను. పిదప మేము శీఘ్రముగా శూలములు, శక్తులు, గదలు, ధనుర్బాణములు, ఖడ్గములు ధరించి, తొందరపడుచు అక్కడికి వెళ్ళెదము. ఆకాశములో గుంపుగుంపులుగా నిలచి ఆ వానరసేనపై రాళ్ళను, ఆయుధములను కురిపించి కొట్టి యమలోకమునకు పంపివేసెదము. రామలక్ష్మణులు ఈ విధముగా మనము చేసిన వంచనలో చిక్కుకున్నచో తప్పక ఈ వంచనచేత జీవితమును విడవగలరు" అని చెప్పెను. (12-18)

వీరుడు, పరాక్రమవంతుడు అయిన నికుంభు డను కుంభకర్ణుని కుమారుడు చాలా కోపించి, లోకములను మొరపెట్టించిన రావణునితో- "మహారాజా! మీరందరూ అట్లే ఉండండి. నేనొక్కడనే వెళ్ళి రామలక్ష్మణులను, సుగ్రీవహనుమంతులను, వానరులను అందరిని చంపివేసెదను" అనెను.(19, 20)

పిమ్మట వజ్రహనువు అను పర్వతము వంటి ఆకారము గల రాక్షసుడు నాలుకతో చెలివెలు నాకుచు, కోపముతో- "మీరందరు ఏ చింతా లేనివారై నిర్భయముగా మీ పనులు చేసికొనుడు. స్వస్థులై క్రీడించుడు. నిశ్చింతులై మద్యపానము చేయుడు. నేను ఒక్కడనే ఆ వానరసైన్యమునంతను భక్షించెదను(చంపెదను). ఇప్పుడు నేను ఒక్కడనే లక్ష్మణసుగ్రీవులను, హనుమంతుని, అంగదుని, సమస్తవానరులను చంపివేసెదను" అని పలికెను.(21-24)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఎనిమిదవ సర్గము సమాప్తము.

తొమ్మిదవ సర్గము

విభీషణుడు నీతివాక్యములు చెప్పుచుండగా, రావణుడు గృహములోనికి వెళ్ళిపోవుట.

అటుపిమ్మట తేజస్సుతో మండుచున్నారా అన్నట్లున్న నికుంభుడు, రభసుడు, మహాబలవంతుడైన సూర్యశత్రువు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, మహాపార్శ్వమహోదరులు, ఎదిరింప శక్యముకాని దుర్ధర్షుడు, రశ్మికేతువు, రావణకుమారుడైన బలవంతుడైన ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, విరూపాక్షుడు, గొప్ప బలముగల వజ్రదంష్ట్రుడు, ధూమ్రాక్షుడు, నికుంభుడు, దుర్ముఖుడు అను రాక్షసు లందరు పరిఘలు, పట్టిశములు, శూలములు, ప్రాసములు, శక్తులు, గండ్ర గొడ్డళ్ళు, మంచి బాణములు గల ధనుస్సులు, లోతైన నీటిరంగువంటి రంగు గల ఖడ్గములు ధరించి లేచి రావణునితో- "రామలక్ష్మణసుగ్రీవులను, లంకను పాడుచేసిన దీనుడైన ఆ హనుమంతుణ్ణి ఇప్పుడే చంపివేసెదము" అని పలికిరి.(1-6)

విభీషణుడు, ఆయుధములు ధరించి లేచిన ఆ రాక్షసుల నందరినీ నివారించి, వాళ్ళను మరల కూర్చుండునట్లు చేసి అంజలి ఘటించి- "ఒక కార్యమును సామ-దాన-భేదోపాయములు మూడింటిచేత సాధించజాలనప్పుడే పరాక్రమమును

చూపుటకు తగిన కాలమని బుద్ధిమంతులు చెప్పుదురు. నాయనా! ఏమరి ఉన్నవారు, మరొక శత్రువుచేత ఆక్రమించబడినవారు, దైవము ప్రతికూలముగా ఉన్నవారు – వీరి విషయమున బాగుగా పరీక్షించి శాస్త్రానుసారముగా పరాక్రమమును ఉపయోగించినచో అది సఫల మగును. రాముడు బలవంతుడై, ఏ మాత్రము ఏమరుపాటు లేక, జయించవలె నను కోరికతో ఉన్నాడు. కోపమును జయించినవాడు, ఎదిరింపశక్యము కానివాడు అయిన ఆ రాముణ్ణి ఎట్లు ఎదిరించగల మని మీరు అనుకొనుచున్నారు? (పశ్చిమముఖముగా ప్రవహించే) నదములకు (పూర్వాభిముఖముగా ప్రవహించే) నదులకు పతియైన సముద్రమును దాటి వచ్చి హనుమంతుడు తిరిగివెళ్ళిపోయినా డనగా దీనిని ఎవరైన తెలిసికొనగలరా? ఊహించగలరా?(7-11)

రాక్షసులారా! శత్రువుల సైన్యములు, పరాక్రమములు కూడ ఇంత అని చెప్ప శక్యముకానివి. అందుచే ఏ విధముగాను కూడ ఆలోచన లేకుండగా వారి విషయమున అనాదరము చూపకూడదు. ఈ రాక్షసరాజు కీర్తిమంతుడైన రాముని భార్యను జనస్థానమునుండి అపహరించినాడు కదా! అట్లు చేయుటకు రాముడు పూర్వ మేమైనా అపకారము చేసినాడా? మితిమీరి ప్రవర్తించిన ఖరుణ్ణి రాముడు యుద్ధములో చంపినా డనగా అందులో తప్పేమి? ఏ ప్రాణియైన తన బలము ననుసరించి ప్రాణములను తప్పక రక్షించుకొనవలెను కదా? అందుచేత మనకు సీతవలన గొప్ప భయము కలిగెను. తీసికొనివచ్చిన ఆమెను మరల వెనుకకు పంపివేయవలెను. కలహమునకు మూలమైన కార్యములను చేసి ఏమి ప్రయోజనము?(12-15)

పరాక్రమవంతుడు, ధర్మమును అనుసరించువాడు అయిన రామునితో వ్యర్థముగా వైరము పెట్టుకొనుట మంచిది కాదు. సీతను అతనికి ఇచ్చివేయవలెను. గజములతోను, అశ్వములతోను, అనేకరత్నములతోను నిండి ఉన్న ఈ లంకాపట్టణమును, రాముడు బాణములచేత చీల్చివేయకముందే సీతను అతనికి అర్పించుట మంచిది. చాల భయంకరము, ఎదిరింప శక్యము కానిదీ అయిన గొప్ప వానరసేన మన లంకను ఆక్రమించుటకు పూర్వమే సీతను ఇచ్చివేయవలెను. రాముని ప్రియభార్యయైన సీతను అతనికి స్వయముగా తీసికొనివెళ్ళి అప్పగించనిచో ఈ లంకాపురము, రాక్షసు లందరూ కూడ నశించగలరు. నేను బంధువునగుటచేత బ్రతిమాలుచున్నాను; నా మాట వినుము. నేను హితము, సత్యము అయిన మాట చెప్పుచున్నాను. రామునకు సీతను ఇచ్చివేయుము. రాముడు నిన్ను చంపుటకై శరత్కాలసూర్యుని కిరణములతో సమానములు, నూతనములైన కొనలు పొన్నులు

కలవి, చాలా దృఢములు, వ్యర్థములుకానివి అయిన శరములను విడువగలడు. అంతకుముందుగానే రామునకు సీతను ఇచ్చివేయుము. సుఖమును ధర్మమును నశింపచేయు కోపమును వెంటనే విడిచిపెట్టి ఆనందమును, కీర్తిని వృద్ధిపొందించు ధర్మమును సేవించుము. అనుగ్రహించుము. మన మందరము పుత్రులతోను, బంధువులతోను కలిసి సుఖముగా జీవించుదము. రామునకు సీతను ఇచ్చివేయుము."(16-22)

రాక్షసరాజైన రావణుడు విభీషణుని మాటలు విన్న పిమ్మట ఆ రాక్షసుల నందరినీ పంపివేసి ఇంటిలోనికి వెళ్ళిపోయెను.(23)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని తొమ్మిదవ సర్గము సమాప్తము.

పదవ సర్గము

విభీషణుడు అన్నగారి ఇంటికి వెళ్ళి, చెడ్డ శకునములను గూర్చి చెప్పుచు మరల అతనికి ఉపదేశించుట.

ధర్మార్థముల విషయమునందు స్థిరమైన నిశ్చయము గల విభీషణుడు మరునాడు ప్రాతఃకాలమునందు రావణుని గృహమునకు వెళ్లెను.(1)

ఆ గృహము పర్వతశిఖరముల సముదాయము వలె ఉండెను. పర్వతశిఖరమువలె ఎత్తుగా ఉండెను. దానిలోని గదు లన్నీ చక్కగా వేరువేరుగా ఉండెను. గొప్ప పండితులు అక్కడ నివసించుచుండిరి. ఆ గృహమునందు, బుద్ధిమంతులు, అనురాగవంతులు అయిన ప్రధానులు నివసించుచుండిరి. ఆప్తులు, సమర్థులు అయిన రాక్షసులు అంతటా దానిని రక్షించుచుండిరి. మదించిన గజముల నిఃశ్వాసములచేత అక్కడ గాలి వ్యాకులముగా చేయబడుచుండెను. శంఖఘోషములతోను, అనేకతూర్యముల ధ్వనులతోను మారుమ్రోగుచుండెను. ఆ గృహము స్త్రీజనముతో కిక్కిరిసి ఉండెను. విశాలములైన మార్గములయందు జనుల సంభాషణ కోలాహలము వినబడుచుండెను. బంగారు బురుజులతోను, ఉత్తమములైన అలంకారములతోను, అలంకరించబడి ఉండెను. ఆ రావణభవనము గంధర్వుల గృహమువలె, మరుత్తుల గృహమువలె, రత్నముల సముదాయముతో నిండి ఉండుటచే(పాతాళములోని) సర్పముల గృహమువలె ఉండెను. (2-6)

గొప్ప కాంతి గల వీరుడైన ఆ విభీషణుడు తేజస్సుతో నిండిన కిరణములు గల సూర్యుడు మహామేఘమును ప్రవేశించినట్లు, అన్నయైన రావణుని గృహమును ప్రవేశించెను. అతడు అక్కడ తన సోదరుని విజయమును గూర్చి వేదవేత్తలు చదువుచున్న పవిత్రమైన పుణ్యాహమంత్రములను వినెను. దధిపాత్రలు, నెయ్యి, పుష్పములు, అక్షతలు సమర్పించి పూజింపబడుచున్న, మంత్రములలోను బ్రాహ్మణములలోను ప్రవీణులైన, బ్రాహ్మణులను చూచెను. అతడు రాక్షసులచేత పూజింపబడుచు లోపల ప్రవేశించి, తన సహజతేజస్సుతో ప్రకాశించుచు, ఆసనాసీనుడై ఉన్న రావణునకు నమస్కరించెను.(7-10)

ఏ సమయములో ఎట్లు ప్రవర్తించవలెనో తెలిసిన విభీషణుడు, రాజదర్శన సమయమునందు అనుసరించవలసిన ఆచారమును ("జయ విజయీ భవ" ఇత్యాది శబ్దములు పలుకుట మొదలైనదానిని) పాటించి, మహారాజైన రావణుడు కనుసంజ్ఞచేసి చూపిన బంగారు ఆసనముపై కూర్చుండెను. ఇతరజనులు ఎవ్వరూ లేక మంత్రులు మాత్రమే ఉన్న ప్రదేశములో, అతడు మహాత్ముడైన రావణునితో, హేతువులచేత నిశ్చితము, మిక్కిలి హితము అయిన వచనమును పలికెను. లోకములోని మంచి చెడ్డలను ఎరిగిన ఆ విభీషణుడు మంచి మాటలతో అన్నగారిని అనుగ్రహింపచేసుకొని, దేశకాలప్రయోజనములకు అనుగుణమైన వాక్యమును పలికెను-(11-13)

"ఓ! శత్రుసంహారకా! సీత వచ్చినది మొదలు ఇక్కడ మనకు అశుభమును సూచించు శకునములు కనబడుచున్నవి. మంత్రములతో యథావిధిగా హోమము చేసినను అగ్ని బాగుగా ప్రజ్వలించుటలేదు. ఎక్కువగా స్ఫులింగములు ఎగురుచున్నవి. జ్వాలతో ధూమము కలియుచున్నది. అగ్ని పుట్టినప్పుడే ధూమముతో కలసి పుట్టుటచే ప్రకాశహీనముగా ఉంటూన్నది. వంటిండ్లలోను, అగ్నిగృహములలోను, వేదాధ్యయనశాలలలోను సర్పములు కనబడుచున్నవి. హోమము చేయు నెయ్యి, పాయసము మొదలైన వాటిలో చీమలు కనబడుచున్నవి. ఆవుల పాలు విరిగిపోవుచున్నవి. ఉత్తమమైన ఏనుగులు కూడా మదములేకుండా ఉన్నవి. గుఱ్ఱములు దీనముగా సకిలించుచు పచ్చగడ్డియందు ఆసక్తి చూపుటలేదు. గాడిదలు, ఒంటెలు, కంచరిగాడిదలు రోమములు ఊడిపోయి కన్నీళ్ళు కార్చుచున్నవి. యథాశాస్త్రముగా చికిత్స చేసినను స్వాస్థ్యమును పొందుటలేదు. క్రూరములైన కాకులు గుంపులు గుంపులుగా చేరి అరచుచున్నవి. గుంపులుగా కలసి ఇండ్ల పైభాగములందు కూర్చుంటున్నవి. గ్రద్దలు పట్టణముమీద మండలాకారముగా తిరుగుచు వ్రాలుచున్నవి. రెండు సంధ్యాకాలములయందు నక్కలు నగరసమీపము



చేరి అమంగళముగా కూయుచున్నవి. మాంసాహారులైన క్రూరమృగములు గుంపులు గుంపులుగా నగరద్వారముల వద్ద చేరి పిడుగు చప్పుళ్ళవంటి అత్యధికమైన ధ్వనులు చేయుచున్నవి.(14-21)

ఈ విధముగా దుష్టనిమిత్తములు కనబడుటచేత వాటికి పరిహారము చేయవలసి ఉన్నది గాన రామునకు సీతను ఇచ్చివేయుటయే తగిన పరిహారమని నేను తలచుచున్నాను. మహారాజా! నే నీ మాటలు అజ్ఞానమువల్లగాని, లోభము (మనమందరము సుఖముగా ఉండవలెనను కోరిక) వలనగాని పలుకుచున్నను నీవు మరొక విధముగా భావింపకుము (కోపింపకుము). ఈ దుర్నిమిత్తములు నాకు మాత్రమే కాదు; రాక్షసులకు, రాక్షసస్త్రీలకు, పట్టణమునకు, అంతఃపురమునకు, ఇక్కడ ఉన్న అందరికీ కనబడుచున్నవి. ఈ విషయమును నీకు చెప్పుటకు మంత్రులందరూ సందేహించుచున్నారు. నేను చూచినది, విన్నది తప్పక నీకు చెప్పవలెను గాన చెప్పుచున్నాను. అందుచేత నీవు న్యాయానుసారముగా ఏమి చేయవలెనో అది చేయుము."(22-25)

విభీషణుడు మంత్రుల మధ్యనున్న రాక్షసశ్రేష్ఠుడు, సోదరుడు అయిన రావణునితో ఈ విధముగా హితమైన వాక్యము పలికెను.(26)

రామునితో విరోధము పెట్టుకొనుటయందే ఆసక్తిగల ఆ రావణుడు హితము, గొప్ప అర్థము గలది, మృదువు, హేతువులతో కూడినది, భూత-వర్తమాన-భవిష్యత్కాలములలో తగినది అయిన అతని మాట విని, కోపించి- "భయమునకు కారణ మేమీ నాకు కనబడుట లేదు. రాముడు ఏనాటికీ సీతను పొందజాలడు. ఇంద్రాదిదేవతలతో కలిసి వచ్చినను రాముడు యుద్ధములో నా ఎదుట నిలువగలడా?" అని పలికి, దేవతాసైన్యమును నశింపజేసినవాడు, మహాబలము కలవాడు, యుద్ధములో తీవ్రమైన పరాక్రమము కలవాడు అయిన రావణుడు తనకు హితమును బోధించుచున్న విభీషణుని పంపివేసెను.(27-29)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పదవ సర్గము సమాప్తము.

పదకొండవ సర్గము

రావణుడు మరల మంత్రగృహమునకు వెళ్ళుట; మంత్రులు, విభీషణుడు కూడ అక్కడికి వెళ్ళుట.

సీతయందు కామముచేత మోహింపబడిన పాపాత్ముడైన ఆ రావణుడు మంచి హృదయము గల విభీషణాదులను అవమానించుటచేతను, పాపకర్మచేతను కృశించిపోయెను. సమయము మించిపోయిన ఆ కాలమునందు రావణుడు మంత్రులతోను, మిత్రులతోను కలిసి యుద్ధములో చేయదగినదానిని గూర్చి ఆలోచించెను. (1, 2)

అతడు బంగారు వల కప్పిన, మణులతోను పొగడములతోను అలంకరించబడిన, శిక్షితములైన గుఱ్ఱములు గల, మహామేఘముతో సమానమైన ధ్వని గల రథశ్రేష్ఠమును ఎక్కి సభకు వెళ్ళెను. కత్తులు, డాలులు ధరించిన యోధులు, సమస్తమైన ఆయుధములు ధరించిన రాక్షసులు ఆ రావణుని ముందు బయలుదేరిరి. విశిష్టరూపములో ఉన్న అనేకవిధములైన వేషములు ధరించి, అనేకవిధములైన అలంకారములచేత అలంకరించబడిన రాక్షసులు ఆ రావణుని పార్శ్వభాగములయందు, వెనుక భాగమునందు నడచి వెళ్ళిరి. అతిరథులైన రాక్షసులు రథములను, మదించిన శ్రేష్ఠములైన గజములను, క్రీడించుచున్న అశ్వములను ఎక్కి శీఘ్రముగా రావణుని వెంట వెళ్ళిరి. కొందరు గదలను, పరిఘలను ధరించిరి. కొందరు శక్తులు, తోమరములు ధరించిరి. కొందరు గండ్రగొడ్డళ్ళు ధరించిరి. మరికొందరు శూలములు ధరించిరి. (3-8)

రావణుడు సభాభవనమునకు వెళ్ళుచున్న సమయమునందు వేలకొలది వాద్యముల ధ్వని, వ్యాకులమైన శంఖధ్వని బయలుదేరెను. ఆ మహారథము చక్రాంతముల ధ్వనిచేత ధ్వనింపచేయుచు శీఘ్రముగా సుందరమైన రాజమార్గమును ప్రవేశించెను. రావణుని శిరస్సుమీద పట్టిన, నిర్మలముగా తెల్లగా ఉన్న ఛత్రము పూర్ణచంద్రుడు వలె ప్రకాశించెను. అతని కుడి ఎడమ ప్రక్కలయందు, మధ్య మధ్య బంగారు సూత్రములు గల, పరిశుద్ధమైన స్ఫటికముతో సమానమైన ఆకారముగల చామరములు ప్రకాశించుచుండెను. నేలమీద నిలిచిఉన్న ఆ రాక్షసు లందరు రథముమీదనున్న ఆ రాక్షసశ్రేష్ఠునకు తలలువంచి అంజలి ఘటించి నమస్కరించిరి. శత్రుసంహారకుడు, మహాతేజఃశాలీ అయిన రావణుడు రాక్షసులచేత "జయ విజయీ భవ" అను ఆశీర్వాదవాక్యములతో స్తుతింపబడుచు, అప్పుడు ఏర్పరచిన సభను

సమీపించెను. ఆ సభాభవనము ప్రాంతభాగములయందు బంగారముచేత, వెండిచేత కప్పబడి మధ్యభాగమున స్ఫటికమాణిక్యములు పొదగబడి ఉండెను. దాని పైభాగమున బంగారువస్త్రము కప్పబడెను. నిత్యము ప్రకాశించుచున్న ఆ సభను ఆరువందల పిశాచములు రక్షించుచుండెను. విశ్వకర్మ చక్కగా నిర్మించిన ఆ సభలో రావణుడు ప్రవేశించి వైదూర్యమాణిక్యవికారమైన శ్రేష్ఠమైన ఆసనముపై కూర్చుండెను. ప్రియకమృగాజినము కప్పిన ఆ ఆసనముమీద దిండులు అమర్చబడి ఉండెను. (9-17)

పిమ్మట రావణుడు రాజాధికారము చూపుచు "గొప్ప కార్యము ఉన్నది; శత్రువులు ఏమి చేయనున్నారో తెలిసినది. అందుచే రాక్షసులనందరిని శీఘ్రముగా నావద్దకు ఇక్కడికి తీసికొనిరండు" అని దూతలను ఆజ్ఞాపించెను. రాక్షసులాతని మాటలు విని విహారస్థానములలోను, శయనములపైన, ఉద్యానములలోను విహరించుచున్న రాక్షసుల నందరినీ ప్రేరేపించుచు, భయపడక లంకలోని ఇంటింటికి వెళ్ళిరి. (18-20)

ఆ రాక్షసులలో కొందరు అందమైన రథములను ఎక్కి సభకు వెళ్ళిరి. కొందరు గర్వించి బలముగల గుఱ్ఱములను ఎక్కిరి. కొందరు ఏనుగులను ఎక్కిరి. కొందరు కాలినడకచేత వెళ్ళిరి. శీఘ్రముగా వచ్చుచున్న రథములచేత, ఏనుగులచేత, గుఱ్ఱములచేత, పూర్తిగా వ్యాపింపబడిన ఆ నగరము పక్షులతో నిండిన ఆకాశమువలె ప్రకాశించెను. ఆ రాక్షసులు రథగజాదివాహనములను నిలిపి, సింహములు పర్వతగుహలో ప్రవేశించినట్లు ఆ సభలోనికి పాదచారులై ప్రవేశించిరి. వాళ్ళు రాజుకు పాదాభివందనము చేసిరి. రాజుచే అభినందింపబడి కొందరు ఆసనములమీద, కొందరు ఆస్తరణములమీద, మరికొందరు నేలమీద కూర్చుండిరి. ఆ రాక్షసులు రాజాజ్ఞానుసారము సభలో చేరి రాక్షసరాజైన రావణుని తగు విధముగా సమీపించిరి. నిర్ణయించిన కార్యమును ఆచరించుటయందు పండితులైన మంత్రులు, సద్గుణవంతులు, అన్నీ తెలిసినవారు, బుద్ధిబలముచేత చూడగలిగినవారు అయిన అమాత్యులు, వందలకొలది ఎందరో శూరులు సకలకార్యములను సుఖముగా నిర్ణయించుటకై అక్కడ బంగారువర్ణము గల సభకు వారి వారి అధికారక్రమమును పాటించుచు వచ్చిచేరిరి. (21-27)

కీర్తిశాలి, మహాత్ముడు అయిన విభీషణుడు విశాలము, మంచి గుఱ్ఱములు కట్టినది, బంగారముచేత విచిత్రమైన ఆ యా భాగములు కలది, మంగళప్రదము

శ్రేష్ఠము అయిన రథమునెక్కి అన్నగారి సభకు వెళ్ళెను. తమ్ముడైన విభీషణుడు అన్నగారికి తన పేరు చెప్పుచు పాదాభివందనము చేసెను. శుకుడు, ప్రహస్తుడూ కూడ అట్లే చేసిరి. అప్పుడా రావణుడు వారందరికి యోగ్యతానుసారముగా వేరు వేరు ఆసనములను చూపి కూర్చుండు దని ఆజ్ఞాపించెను.(28, 29)

అనేకవిధములైన మణులు పొదిగిన బంగారు అలంకారములు, మంచి వస్త్రములు ధరించి ఆ సభకు వచ్చిన రాక్షసుల శ్రేష్ఠమైన అగురు-చందనము సువాసనలు, పుష్పమాలల సువాసనలు అంతటా వ్యాపించినవి.(30)

ఆ సభాసదులలో ఏ ఒక్కరూ గట్టిగా మాటలాడుటగాని, అరచుట గాని చేయలేదు. అసత్యము పలుకలేదు. అందరూ కార్యములను సాధించినవారే. అందరూ భయంకరమైన పరాక్రమము కలవారే. అందరూ ప్రభువు ముఖము చూచుచు కూర్చుండిరి. ఆత్మాభిమానవంతుడైన ఆ రావణుడు ఆ సభలో, ఆయుధములను ధరించిన ఆత్మాభిమానవంతులైన, మహాబలశాలులైన ఆ రాక్షసుల సమూహములో వసువుల మధ్య దేవేంద్రుడు వలె కాంతితో ప్రకాశించెను.(31, 32)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పదకొండవ సర్గము సమాప్తము.

పన్నెండవ సర్గము

నగరరక్షణాదికము చేసి కుంభకర్ణునకు ఈ వృత్తాంతము తెలుపవలెనని రావణుడు ప్రహస్తుని ఆదేశించుట.

అప్పుడు రావణుడు ఆ పరిషత్తును కలియ చూచి, సేనాపతియైన ప్రహస్తుని- "సేనాపతీ! సుశిక్షితులైన చతుర్విధయోధులు,(చతురంగసైన్యమునకు సంబంధించిన యోధులు) నగరరక్షయందు జాగరూకులై ఉండునట్లు చేయుము" అని ఆజ్ఞాపించెను. సావధానచిత్తుడైన ప్రహస్తుడు రాజాజ్ఞ ప్రకారము, గృహము వెలుపల, లోపల కూడ సైన్యమునంతను ఉంచెను. పిమ్మట ప్రహస్తుడు సైన్యమునంతను నగరరక్షణముకొరకై నిలిపి రాజుతో "ప్రభూ! బలవంతుడవైన నీ సైన్యమును లోపల వెలుపలా కూడ నిలిపితిని. ఇప్పుడు ఏ విచారమూ లేనివాడవై నీ కిష్టమైన పనిని చేయుము" అని విన్నవించెను.(1-5)

రాక్షసరాజైన రావణుడు రాజ్యము హితమును కోరు ప్రహస్తుని మాటలు విని

మిత్రుల మధ్య ఇట్లు పలికెను. "ధర్మార్థకామములకు సంబంధించిన కష్టము లేర్పడినపుడు ఏది ప్రియమో ఏది అప్రియమో, ఏది సుఖమో ఏది దుఃఖమో, ఏది లాభమో ఏది నష్టమో, ఏది హితమో ఏది అహితమో మీరు బాగుగా నిర్ణయింపగలరు. ఎల్లప్పుడు మీరు ప్రారంభించి ఆలోచనాపూర్వకముగా నిర్వహించిన నా కార్యము లేవీ ఎన్నడూ వ్యర్థము కాలేదు. చంద్రగ్రహనక్షత్రములు, ఇతర దేవతలు చుట్టూ ఉన్న దేవేంద్రుడువలె, మీరందరూ చుట్టూ ఉన్న నేను మిక్కిలి ఐశ్వర్యమును పొందగలను. నేను మీకందరికీ మరల గుర్తుచేయుటకు ప్రయత్నించుచున్నాను. కుంభకర్ణునకు మాత్రమే, అతడు నిద్రలో ఉండుటచేత పూర్వము ఈ విషయమును తెలుపలేదు. గొప్ప బలము గలవాడు, ఆయుధములను పట్టిన వీరులందరిలో ముఖ్యుడు అయిన కుంభకర్ణుడు ఆరు మాసములు నిద్రించి ఇప్పుడు లేచి ఉన్నాడు." (6-11)

రాముని ప్రియురాలైన భార్యయైన సీతను రాక్షసులు సంచరించు దండకారణ్యమునుండి తీసికొని వచ్చితిని. మందగామినియైన ఆ సీత నా శయనమును ఎక్కుటకు అంగీకరించుటలేదు. ఈ మూడు లోకాలలోను సీతతో సమానురాలు మరొక స్త్రీ ఉన్నదని నేను భావించను. ఆమె నడుము సన్ననిది. కటిప్రదేశము విశాలము. ముఖము శరత్కాలచంద్రుని వలె ఉన్నది. బంగారు ప్రతిమ వలె ఉన్న ఆమె మయుడు నిర్మించిన మాయ వలె ఉన్నది. మృదువైన ఆమె పాదముల అడుగు భాగములు చాలా ఎఱ్ఱగా ఉన్నవి. నేలపై చక్కగా ఆను ఆ పాదముల గోళ్ళు ఎఱ్ఱగా ఉన్నవి. అట్టి పాదములను చూచి నా కామము వృద్ధిపొందుచున్నది. హోమము చేసినప్పుడు బయలుదేరిన అగ్నిజ్వాల వలె, సూర్యకిరణమువలె ఉన్న ఈమెను, ఎత్తైన ముక్కుతో, అందమైన నేత్రములతో సుందరముగా నిర్మలముగా ఉన్న ఈమె ముఖమును చూడగానే కామమునకు వశుడు అయినాను. ఈ కామము నన్ను క్రోధసమయమునందు, సంతోషసమయము నందు, శోకసమయమునందు, సంతాపసమయమునందు కూడ సమముగా నిత్యమూ వెంటాడుచున్నది. అట్టి కామముతో నిండియున్నాను. విశాలనేత్రియైన ఆ సీత భర్తకొరకై ఎదురుచూచుచు, ఒక సంవత్సరము కాలము ఇమ్మని నన్ను కోరినది. సుందరములైన నేత్రములు గల ఆమె శుభవచనమును నేను అంగీకరించితిని. ఆగకుండా పరుగెత్తిన గుఱ్ఱమువలె నేను కామమువలన చాల అలసిపోయి ఉన్నాను. (12-19)

అనేక జంతువులతో వ్యాప్తమైన క్షోభింప శక్యముకాని సముద్రమును వానరులు

కాని, ఆ రామలక్ష్మణులు కాని ఎట్లు దాటగలరు? లేదా, ఒక్క వానరుడు వచ్చి మనకు చాల నష్టము చేసినాడు. అందుచేత, ఎప్పుడేమి జరుగునో తెలిసికొనుట కష్టము. మీ మీ బుద్ధి ననుసరించి ఏమి చేయవలెనో చెప్పుడు. మనుష్యునివలన మనకేమీ భయములేదు. అయినను మీరు ఆలోచించండి. పూర్వము నేను మీతో కలసి దేవాసురయుద్ధములో దేవతలను జయించినాను. మీరు కూడా జయించినారు. రామలక్ష్మణులు సీత జాడ తెలిసికొని సుగ్రీవాదివానరులతో కలిసి సముద్రము అవతలితీరమునందు, సముద్ర సమీపమునకు వచ్చినారు. సీతను ఇవ్వకుండగా ఎట్లు ఉండగలమో, రామలక్ష్మణులను ఎట్లు చంపగలమో బాగుగా ఆలోచించి చెప్పుడు. రాక్షసులు తప్ప, మరెవ్వడూ వానరులతో కలిసి సముద్రము దాటి రాజాలడు. అందుచేత నాకే జయము తప్పక లభించగలదు."(20-26)

కామార్తుడైన ఆ రావణుని అసంబద్ధప్రలాపమును విని కుంభకర్ణుడు కోపించి ఇట్లు పలికెను- "రాముని భార్యయైన సీతను బలాత్కారపూర్వకముగా ఇక్కడికి తీసికొనివచ్చు నప్పుడే నీవు బాగుగా ఆలోచించి ఉన్నచో చిత్తము, యమున యమునాహ్రదమును చేరినట్లు, ఒక నిర్ణయమును పొంది ఉండెడిది. నీవు సీతాపహరణము చేయుటకు పూర్వమే ఈ మంత్రణమును మాతో కలిసి చేసి ఉన్నచో బాగుండెడిది. రావణా! ఏ రాజు కార్యములను న్యాయానుసారముగా నిశ్చయించుకొని చేయునో అతనికి పశ్చాత్తాపము చెందవలసిన పని ఉండదు. ఉపాయమును ఆలోచించకుండగా చేసిన కర్మలు, విపరీతములైన కర్మలు, అశు చియైనవాళ్ళు ఇచ్చు హవిస్సుల వలె చెడిపోవును. నీతి ఏదో, నీతి కానిది ఏదో తెలియనివాడే ముందు చేయవలసిన పనులు తరువాత,తరువాత చేయవలసిన పనులు ముందు చేయుచుండును. అధికమైన బలమున్నది కదా అని కార్యములను చాపల్యముతో చేయువాని ఛిద్రములను (వానిలోని లోపములను), కుమారస్వామి క్రౌంచపర్వతమునకు చేసిన రంధ్రము ద్వారా పక్షులు ప్రయాణము చేసి ఈ మూలనుండి ఆ మూలకు వెళ్ళినట్లు, ఇతరులు గ్రహించి తద్ద్వారా లాభమును పొందుదురు. నీవు సరిగా ఆలోచించకుండగా ఈ గొప్ప కార్యమును ప్రారంభించినావు. విషము కలిసిన మాంసము వలె రాముడు, నీ అదృష్టము కొలది నిన్ను చంపలేదు.(27-34)

రావణా! అందుచే నీవు శత్రువుల విషయమునందు ప్రారంభించిన ఈ గొప్ప కార్యమును, నేను ఆ శత్రువులను చంపి సరిచేసెదను. నీ శత్రువులను నేను నశింపచేసెదను. ఆ శత్రువులు ఇంద్రసూర్యులైనా, అగ్నివాయువులైనా,

కుబేరవరుణులైనా వారితో యుద్ధము చేసెదను. పర్వతము వంటి శరీరము, తీక్ష్ణమైన కోరలు గల నేను గొప్ప పరిఘను ధరించి యుద్ధము చేయుచు గర్జించుచుండగా దేవేంద్రుడు కూడ భయపడును కదా! రాముడు నన్నొక బాణముతో కొట్టి, మరల రెండవ బాణము ప్రయోగించుటకు పూర్వమే అతని రక్తమును త్రాగివేసెదను. నీవు నిర్భయముగ ఉండుము. రాముణ్ణి చంపివేసి నీకు సుఖమును కలిగించు జయమును సంపాదించిపెట్టుటకు ప్రయత్నించెదను. రామలక్ష్మణులను చంపిన పిమ్మట వానరనాయకుల నందరినీ తినివేసెదను. స్వేచ్ఛగా క్రీడించుము. శ్రేష్ఠమైన మద్యమును సేవించుము. ఏ భయమూ లేనివాడవై హితములైన కార్యములు చేసికొనుము. నేను రాముణ్ణి చంపివేసిన పిమ్మట సీత చాల కాలము నీ వశురాలై ఉండును."(35-40)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పన్నెండవ సర్గము సమాప్తము.

పదమూడవ సర్గము

సీతను బలాత్కరించుము అని మహాపార్శ్వుడు చెప్పగా, బ్రహ్మశాపముచే అట్లు చేయజాలను అని రావణుడు చెప్పుట.

కుంభకర్ణుని మాటలకు రావణునకు కోపము వచ్చి నట్లు గ్రహించి గొప్పబలము గల మహాపార్శ్వుడు కొంచెము సేపు ఆలోచించి, అంజలి ఘటించుచు- "ఓ! శత్రువినాశకుడా! క్రూరమృగములతో వ్యాప్తమై ప్రవేశింప శక్యము కాని అరణ్యములో ప్రవేశించి మధువును పొందిన పిమ్మట కూడ ఆ మధువును త్రాగనివాడు మూఢుడు. సర్వసమర్థుడవైన నీకు ప్రభువు ఎవరు? నీవు శత్రువుల శిరస్సులపై పాదముంచి సీతతో కూడ క్రీడించుము. ఓ! మహాబలుడా! కోడిపుంజు ప్రవర్తించి నట్లు ప్రవర్తించి, సీతను బలాత్కారముచేత ఆక్రమించి ఆక్రమించి, అనుభవించుము; ఆనందించుము. నీ కోరిక తీరిన తరువాత ఇంక నీకేమి భయము? అటుపైన ఏమైన అపాయము వచ్చినచో దానికీ, రానున్నదానికీ ప్రతిక్రియ చేసుకొందము. కుంభకర్ణుడు, మహాబలశాలియైన ఇంద్రజిత్తూ మాతో కలిసి వజ్రాయుధమును ధరించిన ఇంద్రునికూడ ఎదిరించగలరు. కార్యములను సాధించుటకై కొందరు బుద్ధిమంతులు దానమును గాని, సామమునుగాని, భేదమును గాని ప్రయోగించుచుందురు. ఆ మూడింటిచేత కాక దండముచేతనే కార్యము

ప్రయోగింతురు. ఓ! మహాబలుడా! వచ్చిన నీ శత్రువుల నందరినీ మేము ఆయుధబలముచేత వశముచేసికొనగలము; సంశయము లేదు" అని పలికెను.(1-8)

రాక్షసరాజైన రావణుడు మహాపార్శ్వుని మాటలు విని, మెచ్చుకొనుచు ఇట్లు పలికెను- "మహాపార్శ్వుడా! నాకు సంబంధించిన ఒక రహస్యమును తెలిసికొనుము. పూర్వము చాలకాలము క్రితము జరిగిన, ఒక విషయమును చెప్పెదను. అగ్నిశిఖ వలె ప్రకాశించుచున్న పుంజికస్థల అను అప్సరస్త్రీ నన్ను చూచి భయపడి నక్కి నక్కి బ్రహ్మదేవుని గృహమునకు ఆకాశమార్గమున వెళ్ళుచుండగా చూచితిని. నేను ఆమెను వివస్త్రను చేసి బలాత్కారముగా అనుభవించితిని. పిదప ఆమె నలిపివేసిన పద్మలతవలె బ్రహ్మదేవుని గృహమునకు వెళ్ళినది. అప్పుడా విషయము మహాత్ముడైన బ్రహ్మదేవునకు తెలిసిన దని అనుకొనుచున్నాను. అందుచేతనే ఆ బ్రహ్మదేవుడు కోపించి- "ఈనాడు మొదలు నీవెవరైన పరస్త్రీని బలాత్కారముగా పొందినట్లయితే నీ శిరస్సు నూరు ముక్కలుగా బ్రద్దలగును; సందేహము లేదు" అని నన్ను శపించెను. నేను ఈవిధముగా బ్రహ్మ ఇచ్చిన శాపమునకు భయపడి సీతను హటాత్తుగా బలాత్కరించి నా సుందరమైన శయనముపైకి ఎక్కించుటలేదు.(9-15)

నా వేగము సముద్రవేగము వంటిది. నా గమనము వాయుగమనము వంటిది. రాముడు ఈ విషయమును ఎరుగక పోవుటచేత నామీదకి వచ్చుచున్నాడు. అట్లు కానిచో పర్వతగుహలో నిద్రించుచున్న సింహమును వలె, కోపించి కూర్చున్న మృత్యువును వలె నన్ను లేపుటకు ఎవడు ప్రయత్నించును! యుద్ధములో నేను ప్రయోగించిన, రెండు నాల్కల సర్పముల వలె ఉన్న బాణములను రాముడు చూడలేదు. అందుచేతనే నన్ను ఎదిరించుటకై వచ్చుచున్నాడు. వందల సంఖ్యలో ధనుస్సునుండి బయలుదేరిన బాణములచేత, రాముణ్ణి, కొరవులచేత ఏనుగును పీడించినట్లు, శీఘ్రముగా పీడించెదను. ప్రాతఃకాలమునందు ఉదయించిన సూర్యుడు నక్షత్రముల కాంతిని అణచివేసి నట్లు, నేను, సైన్యముతో కూడినవాడనై అతని బలమును అణచివేసెదను. వేయి నేత్రములు గల దేవేంద్రుడుగాని, వరుణుడు గాని యుద్ధము చేసి నన్ను గెలువజాలరు. పూర్వము కుబేరుడు పాలించిన ఈ లంకాపురమును నేను బాహుబలముచేత జయించినాను."(16-21)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పదమూడవ సర్గము సమాప్తము.

పదునాలుగవ సర్గము

సీతను రామునకు ఇచ్చివేయుము అని విభీషణుడు రావణునకు ఉపదేశించుట.

రావణుని మాటలను, కుంభకర్ణుని గర్జితములను విని విభీషణుడు రావణునితో హితము, మంచి అర్థము కలదీ అయిన వాక్యమును పలికెను. "రాజా! సీత అను ఈ మహాసర్పాన్ని నీ మెడకు చుట్టబెట్టినవాడు ఎవడు? దీనికి వక్షఃస్థలమే పడగల విశాలప్రదేశము. చింతయే విషము. చిరునవ్వే కోరలు. ఐదు వ్రేళ్ళు ఐదు తలలు. దీని శరీరము చాలా పెద్దది. కోరలు, గోళ్ళు ఆయుధములుగా ఉపయోగించు పర్వతశిఖరప్రమాణవంతులైన వానరులు లంకను చుట్టుముట్టక ముందే సీతను రామునకు ఇచ్చివేయుము. వజ్రసమానములైనవి, వాయువు వంటి వేగము గలవి అయిన రాముడు ప్రయోగించిన బాణములు రాక్షసవీరుల శిరస్సులను ఛేదించుటకు ముందే సీతను రామునకు ఇచ్చివేయుము. రాజా! కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, మహాపార్శ్వుడు, మహోదరుడు, నికుంభుడు, కుంభుడు, అతికాయుడు – వీరిలో ఏ ఒక్కడూ కూడా యుద్ధములో రాముని ఎదుట నిలువజాలడు. నిన్ను సూర్యుడుగాని, మరుత్తులు గాని రక్షించుచున్నను, నీవు దేవేంద్రునివద్దకుగాని, యమునివద్దకుగాని వెళ్ళి వారి రక్షణము కోరినను ఆకాశమును, పాతాళమును ప్రవేశించినను నిన్ను రాముడు ప్రాణములతో విడువడు."(1–6)

విభీషణుని మాటలు విని ప్రహస్తుడు – "మాకు భయ మనేది తెలియదు. మాకు దేవతలవలన గాని, దానవులవలనగాని ఎన్నడూ భయములేదు. మాకు యుద్ధములో గంధర్వులనుండి గాని, మహోరగులనుండి గాని, పక్షులనుండిగాని, ఉరగులనుండిగాని భయములేదు. అట్టి మాకు రాజకుమారుడైన రామునినుండి, యుద్ధములో ఎన్నడైనా భయ ముండునా?" అనెను. (7, 8)

ధర్మార్థకామముల విషయమునందు స్థిరమైన బుద్ధిగలవాడు, రాజు హితమును కోరువాడు అయిన విభీషణుడు, ప్రహస్తుని హితముకాని మాటలు విని– "ప్రహస్తుడా! రాముని విషయములో మన రాజూ, మహోదరుడూ, నీవు, కుంభకర్ణుడూ చెప్పిన విధముగ చేయుట, అధర్మశీలునికి స్వర్గమునకు వెళ్ళుట ఎట్లు శక్యము కాదో అట్లు శక్యము కాదు. కార్యములలో నేర్పుగ రాముణ్ణి చంపుట అనునది నాకుగాని, నీకు గాని, రాక్షసులందరికీ గాని, నావ లేనివానికి సముద్రమును దాటుటవలె, ఎట్లు శక్యమగును? ఇక్ష్వాకువంశము నందు జనించిన రాజైన రాముడు ధర్మమునే

అనుసరించువాడు. కార్యములలో సమర్థుడు. అట్టి రాముని సమక్షమునందు దేవతలు కూడ ఏమీ చేయజాలక మూఢులై నిలచెదరు. గ్రద్దరెక్కలు కట్టిన, తీక్ష్ణములైన, ఎదిరింప శక్యముకాని రామబాణములు నీ శరీరమునింకా ఛేదించలేదు; అందుచేతనే నీవు ఇట్లు బడాయి చెప్పుచున్నావు. రాముడు విడచిన, వజ్రముతో సమానమైన వేగము గల, వాడియైన, ప్రాణాంతకములైన బాణములు నీ శరీరమును ఛేదించి ప్రవేశించలేదు. అందుచేతనే నీ విట్లు బడాయి చెప్పుచున్నావు. దేవేంద్రునితో సమానుడైన రాముణ్ణి యుద్ధములో ఎదిరించి నిలచుటకు రావణుడుగాని, గొప్ప బలము గల త్రిశీర్షుడు గాని, కుంభకర్ణుని పుత్రుడైన నికుంభుడు గాని, ఇంద్రజిత్తుగాని, నీవుగాని సమర్థులు కారు. దేవాంతకుడు గాని, నరాంతకుడుగాని, మహాత్ముడూ అతిరథుడూ అయిన అతికాయుడు గాని, పర్వతమువంటి సారము గల అకంపనుడు గాని యుద్ధములో రాముని ఎదుట నిలువజాలరు. (9-16)

ఈ రాజు వ్యసనాలకు లోనైనవాడు. తీక్ష్ణస్వభావము గలవాడు. ఆలోచించకుండా మీరందరూ మిత్రులే అయినా అమిత్రులవలె తల లూపుచున్నారు. ఇది రాక్షసవినాశానికే దారితీయుచున్నది. ఈ రాజును పెద్ద శరీరము, గొప్ప బలము గల భయంకరమైన వేయిపడగలు గల గొప్ప బలము కల భయంకరమైన సర్పము బలవంతముగా పెనవేసికొని ఉన్నది. అట్టి ఈ రాజును మీరు పైకి లేవదీసి విడిపించండి. రాజువల్ల అన్ని కోరికలు పొందుతున్న స్నేహితులందరూ కలిసి, భయంకరమైన బలము గల భూతములచేత ఆవహించబడినవానిని రక్షించినట్లు, రాజును జుట్టుపట్టియైనా బలాత్కారపూర్వకముగా నిగ్రహించి రక్షించవలెను. మన రాజును అత్యధికమైన జలము గల రాముడనే సముద్రము బలవంతముగా కప్పివేయుచున్నది. ఇతడు రాముడనే పాతాళము ముఖములో పడిపోవుచున్నాడు. అట్టి ఈతనిని మీరందరూ కలిసి దాటించవలెను. ఈ పట్టణమునకు, ఇందు నివసించు రాక్షసులకు, రాజుకు, అతని మిత్రులకు హితమైన, నాకు ఇష్టమైన ఈ వాక్యమును చెప్పుచున్నాను. ఇతడు రామునకు సీతను ఇచ్చివేయుగాక. శత్రువుల బలమును తన బలమును తెలిసికొని, తన పక్షమునందున్న స్థితిని, అభివృద్ధిని, నష్టమును బుద్ధిచేత పరిశీలించి యుక్తమైన విధముగా ప్రభువునకు హితమైన విషయమును ఉపదేశించువాడే ఉత్తముడైన మంత్రి." అని పలికెను. (17-22)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పదునాలుగవ సర్గము సమాప్తము.

పదిహేనవ సర్గము

ఇంద్రజిత్తు విభీషణుని అధిక్షేపించుట, విభీషణుడు అతనికి సమాధానము చెప్పుట.

బృహస్పతితో సమానమైన బుద్ధిగల విభీషణుడు పలికిన ఆ మాటలు శ్రద్ధగా విని, మహాబుద్ధిశాలి, రాక్షససైన్యములో ప్రధానుడూ అయిన ఇంద్రజిత్తు– "పినతండ్రీ! ఏమిది! నీవు అర్థరహితముగాను పిరికితనముతోను మాటలాడుచున్నావు! మన కులములో పుట్టనివాడు కూడ, సామాన్యకులములో పుట్టినవాడు కూడ ఇలా మాటలాడడు; ఇట్లు చేయడు. మన కులములో బలము, వీర్యము, పరాక్రమము, ధైర్యము, శౌర్యము లేని వ్యక్తి, మా తండ్రి గారి తమ్ముడైన ఈ విభీషణుడు ఒక్కడే. ఓ! పిరికివాడా! మనుష్యమాత్రులైన ఆ రాజపుత్రు లనగా ఎంత? మనలో సామాన్యుడైన ఒక్క రాక్షసుడు కూడా వాళ్ళను చంపివేయగలడు. ఎందుకు ఇట్లు భయపెట్టుచున్నావు? మూడు లోకములకు ప్రభువు, సమర్థుడూ అయిన దేవేంద్రుని నేను పూర్వము నేలపై పడవేసితిని. దేవత లందరు భయాక్రాంతులై దిక్కులు పట్టి పారిపోయిరి. నేను వికృతస్వరముతో అరచుచున్న ఐరావతమును నేలపై పడవేసి, బలాత్కారముగా దాని దంతములు ఊడబెరికి దేవతాగణముల నన్నింటినీ భయపెట్టితిని. నేను దేవతల గర్వము కూడ అడచితిని. ఉత్తములైన దైత్యులకు కూడ శోకము కలిగించితిని. అట్టి మహాపరాక్రమవంతుడ నైన నేను సామాన్యమానవు లైన ఆ రాజకుమారులను ఓడించజాలనా?" అని విభీషణుని నిందించెను. (1–7)

శస్త్రధారులలో శ్రేష్ఠుడైన ఆ విభీషణుడు ఇంద్రునితో సమానుడు, ఎదిరింప శక్యము కానివాడు, గొప్ప తేజస్సు కలవాడు అయిన ఇంద్రజిత్తు మాటలు విని, "నాయనా! నీవింకా చిన్నవాడవు. బుద్ధిపరిపాకము లేనివాడవు. మంత్రణము విషయమున నీకు నిశ్చయము లేదు. అందుచేతనే నీవు ఆత్మవినాశమునకు హేతువైన అర్థములేని మాట లేవేవో ప్రేలినావు. ఓ! ఇంద్రజిత్తూ! రామునినుండి రావణునకు కలుగనున్న వినాశమును గూర్చి విని కూడ నీవు దానికి అంగీకరించుచున్నావు. అందుచేత నీవు రావణుని కుమారు డను పేరుతో మిత్రుడుగా కనబడు శత్రువుడవు. నీవు చంపదగినవాడవు. బాలుడవు, ఎక్కువ సాహసము చేయువాడవు అయిన నిన్ను ఇప్పుడు ఇక్కడికి తీసికొనివచ్చి మంత్రణము చేయువారి వద్ద కూర్చుండబెట్టిన దుష్టబుద్ధి కల అత దెవరో వాడు కూడా చంపదగినవాడు. ఓ! ఇంద్రజిత్తూ! నీవు మూఢుడవు; తెలివితక్కువవాడవు; వినయము లేనివాడవు; నీ స్వభావము చాల

తీక్షణ మైనది; అల్పమైన బుద్ధికలవాడవు; దుష్టబుద్ధివి; మూర్ఖుడవు; చాల చెడ్డ బుద్ధి కలవాడవు; తెలియకపోవుటచేత ఇట్లు మాట్లాడుచున్నావు. రాముని బాణములు బ్రహ్మదండమువంటి ప్రకాశము గలవి. కిరణములతో ప్రకాశించునవి. మృత్యుదేవతతో సమానములు. యమదండములవంటివి. అట్టి బాణములను రాముడు యుద్ధములో ఎదుట నిలచి ప్రయోగించుచుండగా వాటిని ఎవడు సహించగలడు? రాజా! ధనములను, రత్నములను, అలంకారములను, శ్రేష్ఠమైన వస్త్రములను, చిత్రములైన మణులను,సీతాదేవిని రామునకు సమర్పించి మనమందరము సుఖముగా నివసించెదము" అని పలికెను.(8-14)


శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పదిహేనవ సర్గము సమాప్తము.

పదహారవ సర్గము

రావణుడు విభీషణుని తిరస్కరించుట. విభీషణుడు అతనిని విడచి వెళ్ళిపోవుటకు బయలుదేరుట.

చాల స్థిరమైన ఆలోచనతో హితమైన వాక్యము పలికిన ఆ విభీషణునితో, రావణుడు కాలముచేత ప్రేరేపించబడినవాడై పరుషమైన వాక్యమును పలికెను. "శత్రువుతోను, కోపించిన సర్పముతోను కలిసి నివసించవచ్చు నేమో కాని మిత్రుడ నని చెప్పుకొను శత్రువుతో మాత్రము నివసింప శక్యము కాదు. అన్ని లోకాలలోను జ్ఞాతుల స్వభావ మెట్లుండునో నాకు తెలియును. ఈ జ్ఞాతులు ఎల్లప్పుడూ, తమ జ్ఞాతులకు ఆపదలు వచ్చినప్పుడు సంతోషించుచుందురు. రాక్షసుడా! జ్ఞాతులు ప్రధానుడు, కార్యసాధకుడు, విద్యావంతుడు, ధర్మస్వభావము కలవాడు, శూరుడు అయిన జ్ఞాతిని చిన్నగా చూచుచు తిరస్కరించుచుందురు. క్రూరులైన జ్ఞాతులు తమ హృదయములలోని భావములను దాచుకొని ద్రోహచింతతో భయంకరులై, తమ జ్ఞాతికి ఆపద వచ్చినప్పుడు ఒకరితో ఒకరు చెప్పుకొని నిత్యము సంతోషించుచుందురు. (1-5)

పూర్వము పద్మవనములో పాశములతో వచ్చిన మనుష్యులను చూచి ఏనుగులు పలికిన శ్లోకములు ప్రసిద్ధముగా వినవచ్చుచున్నవి; చెప్పెదను; వినుము. "మనకు అగ్నివలనగాని, ఇతరశస్త్రములవలనగాని, పాశములవలన గాని భయములేదు.



స్వార్థముతో ప్రవర్తించు క్రూరులైన జ్ఞాతులవల్లనే మనకు భయము. ఈ జ్ఞాతులు, మనలను ఎట్లు పట్టుకొనవలెనో ఉపాయమును చెప్పగలరు; సందేహములేదు; మనకు అన్ని భయములకంటె ఈ జ్ఞాతిభయమే చాల గొప్పది" అని అవి అన్నవి. గోవులలో సంపద ఉన్నది. జ్ఞాతులనుండి భయమున్నది. స్త్రీలలో చాపల్యము ఉన్నది. బ్రాహ్మణునియందు తపస్సు ఉన్నది. అందుచేతనే నేను ఈ విధముగా లోకములలో గౌరవింపబడుటను, ఐశ్వర్యసంపన్నుడను అగుటను, శత్రువులను అణగద్రొక్కి ఉండుటను నీవు చూడలేకున్నావు.(6-10)

తామరాకుమీద పడిన జలబిందువులు ఏవిధముగా ఆకులతో దగ్గరగా కలియవో, చెడ్డవారితో స్నేహము కూడా అట్లే. శరత్కాలమునందు మేఘములు ఎంత గర్జించినను అవి వర్షించగా జలముతో తడుపుట(అనగా అవి వర్షించుట, జలముచేత భూమి తడియుట అనునవి) ఎట్లు జరుగదో చెడ్డవారితో స్నేహము కూడా అట్టిదే. మకరందమును తీసికొనుచున్నను తుమ్మెద ఆ పుష్పమునందు నిలవక, ఇంకను కావలె నను ఆసక్తివలన మరొక పుష్పము వద్దకు పోవును. నీవును అట్లే శత్రుపక్షము వహించుచున్నావు. అనార్యులతో స్నేహము ఇట్లే ఉండును. తుమ్మెద అత్యాసక్తితో రెల్లుపూవుపై వాలి మకరందమును త్రాగ ప్రయత్నించినా దానికి రస మేమీ ఎట్లు లభించదో అనార్యులతో స్నేహము కూడా అట్లే ఉండును. ఏనుగు ముందు స్నానము చేసి పైకి వచ్చి తొండముతో బూడిద తీసికొని తన శరీరము మీద చల్లుకొనును. ఆ గజము చేసిన స్నానము ఎట్లు

నిష్ఫలమో అనార్యులతో స్నేహము కూడా అట్లే నిష్ఫలము. ఓ! రాక్షసుడా! మరొక డెవ్వడైనా ఈ విధముగా మాటలాడి ఉన్నచో, ఈ ముహూర్తమునందే వానిని లేకుండ చేసెడివాడను. ఛీ! కులమును చెరచినవాడా!"(11-16)

రావణుడు ఈ విధముగా పరుషవాక్యములు పలుకగా, న్యాయమునే పలుకు స్వభావము గల విభీషణుడు గద ధరించి ఆకాశములోనికి ఎగిరెను. అతనితో నలుగురు రాక్షసులు కూడా ఎగిరిరి. అప్పుడు కోపించిన విభీషణుడు ఆకాశములో నిలచి సోదరుడైన రావణునితో- "రాజా! నీవు నా అన్నవు. నీ కిష్టము వచ్చినట్లు అనుము. అన్నగారు తండ్రివంటివాడు. ధర్మమార్గములో లేకున్నా గౌరవింపవలసినవాడే. కాని, నీవు అన్నవే అయినా, నీ పరుషవాక్యములను సహించజాలను. రావణా! మనస్సును అదుపులో ఉంచుకొనని వాళ్ళు కాలమునకు లొంగిపోయినవారై, హితమును కోరి, బాగా నిర్ణయించి చెప్పిన మాటలు వినరు. రాజా! ఎల్లప్పుడూ ఇష్టమైన మాటలే చెప్పే పురుషులు అనాయాసముగా లభించుదురు. కాని, ప్రియము కాకపోయినను హితమైన(భవిష్యత్తులో సత్ఫలితమును ఇచ్చే) మాటలు చెప్పేవారు అరుదు. అట్టివారు ఉన్నను వినేవారు అరుదు.(17-21)

సకలప్రాణులను సంహరించే కాలుని పాశములచే కట్టబడి నీవు నశించి పోవుచుండగా, మండిపోవుచున్న ఇంటిని ఎట్లు ఉపేక్షించజాలనో అట్లే ఉపేక్షించజాలను. రాముడు నిన్ను మండుచున్న అగ్నివలె ఉన్న, బంగారు అలంకారములు గల వాడియైన బాణములతో చంపుచుండగా చూడజాలను. శూరులు, బలవంతులు, అస్త్రనిపుణులు అయిన నరులు కూడా కాలము వచ్చినప్పుడు, ఇసుకతో కట్టిన ఆనకట్టవలె, యుద్ధములో నశింతురు. నీవు అన్న వగుటచే నీ హితమును కోరి నేను చెప్పిన మాటలు క్షమింపుము. నిన్ను, రాక్షసులను, ఈ నగరమును అన్ని విధాలా రక్షించుకొనుము! నీకు క్షేమమగుగాక. నేను వెళ్ళిపోవుచున్నాను! నేను లేకుండా సుఖముగా ఉండుము. రావణా! నీ హితము కోరి నేను చెప్పిన మాటలు నీకు నచ్చుటలేదు. విపరీతకాలమునందు, ఆయువు మూడిన నరులు మిత్రులు చెప్పిన హితమును అంగీకరించరు" అని పలికెను.(22-27)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పదహారవ సర్గము సమాప్తము.

పదిహేడవ సర్గము

విభీషణుడు రాముణ్ణి ఆశ్రయించుటకు వెళ్ళుట; రాముడు మంత్రులతో ఆలోచించుట.

విభీషణుడు రావణునితో ఇట్లు పరుషములైన మాటలు పలికి ముహూర్తకాలములో, లక్ష్మణసహితుడైన రాము డున్న చోటికి వచ్చెను. మేరుశిఖరము వలె ప్రకాశించు, మెరుపువలె ఆకాశములో ఉన్న ఆ విభీషణుని నేలమీద ఉన్న వానరనాయకులు చూచిరి. భయంకరమైన పరాక్రమము గల అతని నలుగురు అనుచరులు కూడ కవచములను ఆయుధములను ధరించి, ఉత్తమ భూషణములను అలంకరించుకొని ఉండిరి. మేఘముతోను పర్వతముతోను సమానుడు, వజ్రాయుధము వంటి కాంతి గలవాడు అయిన, వీరుడైన ఆ విభీషణుడు కూడ శ్రేష్ఠములైన ఆయుధములు ధరించి దివ్యాభరణములచేత అలంకృతుడై ఉండెను. వానరప్రభువు, పరాక్రమవంతుడు అయిన సుగ్రీవుడు, నలుగురు రాక్షసులతో కలిసి వచ్చిన విభీషణుని చూచి వానరులతో ఆలోచించెను. (1-5)

అతడు ముహూర్తకాలము ఆలోచించి, హనుమంతుడు మొదలైన ఆ వానరు లందరితో "ఈ రాక్షసు డెవడో అన్ని ఆయుధములు ధరించి, నలుగురు రాక్షసులతో కూడ వచ్చుచున్నాడు; చూడుడు. మనలను చంపుటకే వచ్చుచున్నాడు. సందేహము లేదు." అనెను. ఆ వానరోత్తము లందరూ సుగ్రీవుని మాటలు విని, మద్దిచెట్లను పర్వతములను ఎత్తి, - "రాజా! ఈ దురాత్ములను చంపుటకు వెంటనే మాకు ఆజ్ఞ ఇమ్ము. ఈ మందబుద్ధులు మాచే చంపబడి నేలమీద పడగలరు." అనిరి. సముద్రము అవతలి ఒడ్డు చేరిన విభీషణుడు ఆ వానరులు ఇట్లు పరస్పరము మాటలాడుకొనుచుండగా కంగారుపడకుండా ఆకాశమునందు నిలచి ఉండెను. (6-10)

మహాబుద్ధిమంతుడైన, ఆ విభీషణుడు సుగ్రీవుణ్ణి, ఆ వానరులను చూచి, ఆకాశమునందే నిలచి పెద్ద కంఠస్వరముతో, "రాక్షసులకు ప్రభువు, చెడ్డ నడవడికగలవాడు అయిన రావణు డను రాక్షసు డున్నాడు. విభీషణు డను పేరు గల నేను వాని తమ్ముడను. అతడు జటాయువును చంపి సీతను జనస్థానమునుండి తీసికొనివచ్చి, వివశురాలై, దీనురాలై ఉన్న ఆమెను బంధించినాడు. ఆమెను రాక్షసస్త్రీలు రక్షించుచున్నారు. సీతను చక్కగా రామునకు ఇచ్చివేయు మని నేను యుక్తియుక్తములైన మాటలు అనేకవిధముల చెప్పి, మాటిమాటికి అతనికి



బోధించితిని. ఆ రావణుడు కాలముచేత ప్రేరేపించబడుటచే, నేను చెప్పిన హితవాక్యమును, ఆయుస్సు మూడిన విపరీతబుద్ధి గలవాడు ఔషధమునువలె, అంగీకరించలేదు. అతడు పరుషవాక్యములు పలికి నన్ను బానిసను అవమానించి నట్లు అవమానించినాడు. అందుచేత నేను భార్యాపుత్రాదులను విడచి వచ్చి రాముణ్ణి శరణు పొందుచున్నాను. విభీషణు డను పేరుగల నేను వచ్చినట్లుగా మహాత్ముడు, సకలలోకములను రక్షించువాడు అయిన రామునకు శీఘ్రముగా తెలుపుడు." అని పలికెను. (11-17)

శీఘ్రమైన పరాక్రమము గల సుగ్రీవుడు ఈ మాటలు విని, లక్ష్మణుని సమక్షమునందు రామునితో, చాల కంగారుపడుచు- "ప్రభూ! ఊహించకుండగా వచ్చి శత్రుసైన్యములో ప్రవేశించిన శత్రువు, అవకాశము దొరకగానే గుడ్లగూబ కాకులను చంపినట్లు చంపివేయును. ఓ! శత్రువినాశకా! వానరులకు లాభకరమైన మంత్రమునందు, వ్యూహమునందు, నీతియందు, గూఢచారిప్రయోగమునందు సావధానచిత్తుడవై, పరులు ప్రయోగించు మంత్ర-వ్యూహ-నీతి-గూఢచారి ప్రయోగాదులయందు కూడ అప్రమత్తుడవై ఉండుము. నీకు భద్రము కలుగుగాక. ఈ రాక్షసులు అంతర్ధానము పొందగలవారు. ఇష్టమైన రూపము ధరించగలవారు. శూరులు. కపటోపాయములు తెలిసినవారు. వారిని ఎన్నడూ నమ్మకూడదు. ఇతడు రాక్షసరాజైన రావణుని గూఢచారియై ఉండును. ఇతడు మన మధ్య ప్రవేశించి, మనలో భేదమును కలిగించును; సందేహము లేదు. లేదా బుద్ధిమంతుడైన ఇతడే స్వయముగా మనలోని లోపములు తెలిసికొని, ప్రవేశించి, విశ్వాసముతో ఉన్న నీపైన దెబ్బ తీయవచ్చును. (18-23)

శత్రువుల సైన్యము తప్ప, మిత్రుల సైన్యమును, ఆటవికుల సైన్యమును, పరంపరాగతమైన సైన్యమును, తాత్కాలికభృతి నిర్ణయించి కూర్చుకొన్న సైన్యమును- ఈ అన్ని విధముల సైన్యమును కూడా గ్రహించవచ్చును. ఓ! ప్రభూ! ఇతడు

సహజముగానే రాక్షసుడు. శత్రువునకు సోదరుడు. సాక్షాత్తు శత్రువుదగ్గరనుండి వచ్చుచున్నాడు. ఇతనిని విశ్వసించుట ఎట్లు? విభీషణు డను పేరుగల రావణుని తమ్ముడు నలుగురు రాక్షసులతో కూడ వచ్చి నిన్ను శరణు పొందుచున్నాడు. ఓర్పు కలవారిలో శ్రేష్ఠుడైన రామా! రావణుడే ఆ విభీషణుని పంపి ఉండునని తలచెదను. అతనిని నిగ్రహించుటయే యుక్తమని తలచెదను. రామా! కుటిలమైన ఆలోచనలతో రావణుడు పంపగా ఈ రాక్షసుడు, విశ్వాసము చెందిన నీయందు, మాయాబలము చేత రహస్యముగా దెబ్బతీయుటకై వచ్చినాడు. ఈ విభీషణుడు క్రూరుడైన రావణుని సోదరుడు. అందుచే ఈతనిని, ఈతని మంత్రులను కూడ తీవ్రమైన దండన మిచ్చి చంపించివేయుము." అని పలికెను.(24-29)

ఎట్లు మాటలాడవలెనో తెలిసిన, సేనానాయకుడైన సుగ్రీవుడు, మాటలలో నేర్పరియైన ఆ రామునితో, కంగారుపడుచు ఇట్లు పలికి మౌనము వహించెను. మహాబలశాలియైన రాముడు సుగ్రీవుడు పలికిన ఆ మాటలు విని, దగ్గర ఉన్న, హనుమంతుడు మొదలైన వానరులతో- "విభీషణుని విషయములో సుగ్రీవుడు పలికిన, మంచి యుక్తులతో కూడిన మాటలు మీరు కూడ విన్నారు కదా? శాశ్వతమైన అభివృద్ధిని కోరు సమర్థుడైన బుద్ధిమంతుడు, మిత్రులకు కార్యములలో కష్టము లేర్పడినప్పుడు ఉపదేశించుట యుక్తము. అందుచేత మీ మీ అభిప్రాయములను చెప్పుడు" అని పలికెను.(30-33)

రామునిచేత ఈ విధముగా ప్రశ్నింపబడిన ఆ వానరులు అలసత్వములేనివారై రామునకు ప్రియము చేయవలె నను కోరికతో తమ తమ అభిప్రాయములను ఆదరపూర్వకముగా ఇట్లు తెలిపిరి. "రామా! ఈ మూడు లోకములలో నీకు తెలియనిది లేదు. అయినను మేము నీ స్నేహితులముగాన మమ్ములను అడుగుచున్నావు. ఆ విధముగా నీ గౌరవమును పెంపొందించుకొనుచున్నావు. నీవు సత్యవ్రతుడవు. శూరుడవు. ధర్మాత్ముడవు. దృఢమైన పరాక్రమము కలవాడవు. పరీక్షించి పనులు చేయువాడవు. విషయములను బాగుగా స్మరించువాడవు. తనను తానుగా స్నేహితులకు అధీనము చేసికొన్నవాడవు. అందువలన బుద్ధిమంతులు, సమర్థులూ అయిన నీ మంత్రులు తగిన యుక్తులు చూపుచు ఒక్కరొక్కరుగా మాటలాడెదరు."(34-37)

ఆ వానరు లట్లు పలికిన పిమ్మట బుద్ధిమంతుడైన అంగదుడు, "ముందుగా విభీషణుని పరీక్షించవలెను." అని రామునితో పలికెను. "విభీషణుడు శత్రువు దగ్గరనుండి వచ్చినాడు. అన్ని విధాల సందేహించదగినవాడే. అందుచేత తొందరపడి

అతనిని విశ్వాసపాత్రునిగా చేయకూడదు. కుటిలమైన బుద్ధికలవారు తమ మనస్సులోని భావములను పైకి తెలియనీయకుండా ప్రవర్తించుచు అవకాశము వచ్చినప్పుడు దెబ్బతీయుదురు. అది గొప్ప అనర్థమును కలిగించును. లాభనష్టములను నిశ్చయించుకొని ప్రయత్నమును ఆరంభించవలెను. గుణము లున్నచో స్వీకరించవలెను. దోషము లున్నచో విడువవలెను. ఈ విభీషణునిలో అధికముగా దోషములున్నచో నిఃసంశయముగా ఇతనిని విడిచివేయవలెను. అట్లు కాక చాలా గుణము లున్నచో స్వీకరించవలెను." అనెను. (38-42)

శరభుడు బాగుగా ఆలోచించి, "నరులలో శ్రేష్ఠుడవైన రామా! ఈతని పరీక్షించుటకై వెంటనే గూఢచారిని పంపవలెను. గూఢచారిని పంపి, సూక్ష్మబుద్ధి గల ఆ గూఢచారిచేత బాగా పరీక్షించి అటుపిమ్మట న్యాయానుసారము ఇతనిని స్వీకరించవచ్చును; లేదా విడువవచ్చును." అని చెప్పెను. (43, 44)

పిమ్మట నేర్పరియైన జాంబవంతుడు ఆ విషయము నంతను శాస్త్రీయదృష్టితో పరిశీలించి, గుణములు గలది, దోషములు లేనిది అయిన వాక్యమును, "రామా! ఈ విభీషణుడు నీతో వైరము కట్టిన పాపాత్ముడైన రావణుని వద్దనుంచి దేశముకాని దేశమునకు, కాలము కాని కాలమునందు వచ్చినాడు. ఇతనిని గూర్చి అన్ని విధాలా శంకించవలసి ఉన్నది." అని పలికెను. (45,46)

పిమ్మట, ఏది నీతియో ఏది కాదో తెలిసినవాడు, మంచి వచననైపుణ్యము గలవాడు అయిన మైందుడు ఆలోచించి, మంచి హేతువులను చూపించుచు- "ఓ! రాజాధిరాజా! ఈ విభీషణుడు రావణుని తమ్ముడు కదా. ఇతనిని మధురమైన మాటలతో మెల్లగా ప్రశ్నించుట మంచిది. ఇతని అభిప్రాయమేమో యథార్థముగా తెలిసికొని, ఇతడు దుష్టుడా, కాదా అను విషయము కూడ గ్రహించిన పిమ్మట నీవు తగు విధముగా చేయవచ్చును." అని చెప్పెను. (47-49)

పిమ్మట వివిధశాస్త్రముల అభ్యాసముచేత కలిగిన సంస్కారము గలవాడు, మంత్రులలో ఉత్తముడు అయిన హనుమంతుడు మృదువు, మంచి అర్థముగలది, మధురము, లఘువు అయిన వచనమును పలుకుచు, "రాజా!నీవు బుద్ధిచేత గొప్పవాడవు; సమర్థుడవు; మాటలాడువారిలో ఉత్తముడవు. అట్టి నిన్ను బృహస్పతి కూడా మాటలాడి అతిశయించజాలడు. నేను కేవలము వాదము నిమిత్తము గాని, ఇతరమంత్రులతో పోటీపడుటచేతగాని, వారికంటె అధికుడ ననిగాని, నా ఇష్టానుసారముగా గాని చెప్పుటలేదు. కేవలము నాపై నీవుంచిన గౌరవమును పట్టి

(లేదా నీపై నాకున్న గౌరవమును బట్టి) ఏది యథార్థమని నాకు తోచినచో అది చెప్పెదను. విభీషణునివలన కలుగు లాభనష్టములను పరీక్షించవలె నని నీ మంత్రులైన అంగదాదులు చెప్పినారు. కాని దానిలో నాకు దోషము కనబడుచున్నది. ఎందుచేత ననగా అట్లు చేయుటకు తగిన విధానము కుదరదు. విభీషణుని ఏదైన ఒక కార్యమునందు నియమించకుండగా అతని సామర్థ్యము తెలిసికొనుట శక్యము కాదు. క్రొత్తవానిని వెంటనే ఒక కార్యములో నియమించుట మంచిది కాదని నా అభిప్రాయము. గూఢచారులను పంపవలె నని నీ మంత్రులు కొందరు చెప్పినారు. ఎదుట నిలచి ఉన్నవాని రహస్యములను గూఢచారుల ద్వారా తెలిసికొనుట అనునది అసంభవము గాన ఆ ఉపాయము కూడా కుదరదు. విభీషణుడు దేశము కాని దేశమునందు, కాలము కాని కాలమునందు వచ్చినా డని కొందరు చెప్పినారు కదా? ఆ విషయమునందు నాబుద్ధి ననుసరించి నేను చెప్పవలెనని కోరుచున్నాను. వినుము. ఒక్కొక్క పురుషుని చేరి గుణము దోషము గాను దోషము గుణముగాను అగును. అట్లే ఈ ప్రస్తుతవిషయమునందు ఇదే తగిన దేశము, కాలము అని ఏదో విధముగా, అనగా స్థితిని పట్టి, నిరూపించవచ్చును. రావణుని దుష్టత్వమునూ, నీ పరాక్రమమునూ చూచి, ఈ కాలమునందు, ఈ దేశమునందు అతడు వచ్చుట యుక్తమే కదా? ఇది అతని బుద్ధికి తగినట్లున్నది. (50-58)

రాజా! అతడు తెలుసుకొనజాలని పురుషులను పంపి అతనిని ప్రశ్నించవలెనని కొందరు చెప్పినారు కదా? ఆ విషయమున నేను పరీక్షించగా కలిగిన అభిప్రాయ మొకటి ఉన్నది. (59)

ఒక బుద్ధిమంతుని దగ్గరకు హటాత్తుగా వెళ్ళి ప్రశ్నించగానే అతడు ప్రశ్నించువాని మాటలను శంకించును. అట్టి సందర్భాలలో అప్రయత్నముగా లభించిన మిత్రుణ్ణి వంచనపూర్వకముగా ప్రశ్నించుటచే ఆ మిత్రుడు విముఖుడై పోవును. ఎదుటివాని మాటలలోని స్వరమును పట్టి తెలిసికొనకలిగినవారికి ఎంతో నేర్పు ఉంటే తప్ప ఎదుటివాని భావమును శీఘ్రముగా తెలిసికొనుట శక్యము కాదు. ఈతడు మాటలాడుచున్నప్పుడు దుష్టమైన భావ మేదీ ఉన్నట్లు ఒక్కమారు కూడ కనబడలేదు. ఇతని ముఖము కూడ ప్రసన్నముగా ఉన్నది. అందుచేత నాకు ఇతని విషయమునందు సంశయము లేదు. కపటబుద్ధికలవాడు ఎట్టి శంకా లేక స్వస్థుడై దగ్గరకు రాడు. ఈతని మాటలలో దోషము కూడా లేదు. అందుచే నాకు సంశయము లేదు. ఎంత కప్పికొన్నను ఆకారమును దాచుట శక్యము కాదు. అది మానవుల మనస్సులో ఉన్న భావమును బలాత్కారముగా ప్రకటించి తీరును. కార్యములను ఎరిగిన

వారిలో శ్రేష్ఠుడవైన రామా! దేశమునకు కాలమునకు అనుగుణముగా ఉన్న, అనగా దేశము కాలము అనుకూలముగా ఉన్న కార్యమును వెంటనే ప్రయోగముతో కూర్చినచో, అనగా వెంటనే ఆచరించినచో, అది కర్తకు ఫలమును ఇచ్చును. దేశకాలములు అనుకూలముగా ఉన్నాయని తెలిసికొని ఇతడు వెంటనే కార్యాచరణమునకు ఉద్యుక్తుడైనాడు. నీవు ఉద్యమశీలుడ వను విషయమును, రావణుని దుష్టప్రవృత్తినీ చూచి, వాలి చంపబడి నట్లు, సుగ్రీవుడు రాజ్యాభిషిక్తుడై నట్లు విని, రాక్షసరాజ్యమును పొందవలెనను కోరికతో ఆలోచనాపూర్వకముగానే ఇతడు ఇక్కడికి వచ్చినాడు. ఈ ఒక్క విషయము పట్టి కూడా ఈతనిని స్వీకరించుట యుక్తము. ఈ రాక్షసుడు ఋజుస్వభావము కలవాడే అను విషయమును గూర్చి యథాశక్తిగా చెప్పినాను. వినిన పిమ్మట మిగిలిన కార్యము ఎట్లు చేయవలెనో నిర్ణయించుటకు నీవే ప్రమాణము" అని చెప్పెను.(60-68)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పదిహేడవ సర్గము సమాప్తము.

పదునెనిమిదవ సర్గము

విభీషణుని స్నేహమును అంగీకరించుటయే యుక్త మని రాముడు తన నిర్ణయమును తెలుపుట.

పిమ్మట, ఎదిరింప శక్యముకానివాడు, శాస్త్రాధ్యయనసంపన్నుడు అయిన రాముడు హనుమంతుని మాటలు విని సంతోషించి తన మనస్సులో ఉన్న అభిప్రాయమును- "విభీషణుని గూర్చి నేను కూడా చెప్పవలె నని అనుకొనుచున్నాను. మన శ్రేయస్సు కోరు మీరందరు వినుడు. నేను మిత్రుడ నని చెప్పుకొనుచు వచ్చినవానిని, వానిలో దోషమున్నను నేను విడువను. ఇట్లు చేసినయెడల సత్పురుషులు నిందింపకుండా ఉందురు." అని తెలిపెను.(1-3)

వానరరాజైన సుగ్రీవుడు రాముని మాటలు అనువదించి, బాగుగా ఆలోచించి, మరల మిక్కిలి శుభకరమైన వాక్యమును పలికెను- "ఈ రాక్షసుడు దుష్టుడు అయినా, కాకపోయినా మన కెందుకు? ఇట్టి ఆపదలో ఉన్న సోదరునే విడిచిపెట్టిన వానికి విడవదగనివా డంటూ ఎవడైనా ఉండునా!"(4, 5)

రాముడు సుగ్రీవుని మాటలు విని, అందరినీ చూచుచు, చిరునవ్వు నవ్వుచూ

లక్ష్మణునితో "సుగ్రీవుడు పలికిన ఈ మాటలను, శాస్త్రములు చదువనివారు, పెద్దల సేవ చేయనివారు మాటలాడజాలరు. ఇక్కడ మిక్కిలి సూక్ష్మమైన ఒక విషయ మున్నట్లు నాకు తోచుచున్నది. ఇది రాజుల కందరికీ స్పష్టముగా తెలిసినది, లోకప్రసిద్ధమూ కూడ. ఒకే కులమునకు చెందినవాళ్ళు, ప్రక్కనే ఉన్న దేశములో ఉన్నవాళ్ళు శత్రువు లనీ, ఆపదలలో దెబ్బతీయుచుందు రనీ పెద్దలు చెప్పుదురు. అందుచేతనే ఇతడు ఇక్కడికి వచ్చినాడు. ఆ కులమునకే చెందినవారై నను దుష్టులు కానివాళ్ళు తమ హితులను గౌరవించుచుందురు. కాని రాజులు సాధారణముగా మంచివానిని కూడ శంకించుచుందురు. (ఇతడు మంచివాడే అయినను రావణుడు ఈతనిని శంకించినాడు.) మనము ఈతని కులమునకు చెందినవారము కాము. అందుచేత అతనికి మనతో సహజశత్రుత్వ మేదీ లేదు. ఈ విభీషణునికి రాజ్యమునందు కోరిక ఉన్నది. రాక్షసుడే కదా బుద్ధివిహీనుడై ఉండును అని అనుటకు కూడ వీలులేదు; ఎందుచేత ననగా వాళ్ళల్లో కూడ పండితులు (బుద్ధిమంతులు) ఉండవచ్చును. అందుచేత విభీషణుడు మిత్రుడుగా గ్రహింపదగినవాడే. జ్ఞాతు లెవ్వరూ భయములేక, సంతోషముతో కలిసిమెలసి ఉండజాలరు. అందుచేతనే వాళ్ళు విడిపోవుచుందురు. ఇతనికి రావణునినుండి భయము వచ్చి యుండును. అందువల్లనే ఈతని ధ్వని చాలా అధికముగా ఉన్నది. నాయనా! అందరు సోదరులూ భరతునివంటివారే ఉండరు. తండ్రుల కుమారు లందరూ నావంటివాళ్ళే ఉండరు. స్నేహితు లందరూ నీవంటివారే ఉండరు."(6-15)

మహాబుద్ధిశాలియైన సుగ్రీవుడు రాముని మాటలు విని, లేచి, నమస్కరించుచు- "ఆ రాక్షసుణ్ణి రావణుడే గూఢచారిగా పంపి యుండును అను విషయమును గ్రహించుము. అందుచేత అతనిని నిగ్రహించుటయే యుక్త మని తలచెదను. రామా! ఈ రాక్షసుడు రావణుడు పంపగా, విశ్వాసముతో కూడిన నిన్ను గాని, నన్నుగాని, లక్ష్మణుని గాని చంపుటకై వక్రబుద్ధితో ఇక్కడికి వచ్చినాడు. ఈ విభీషణుడు క్రూరుడైన రావణుని సోదరుడు కదా? అందుచేత ఇతనిని, ఇతని మంత్రులను కూడ బంధించవలెను." అని పలికెను.(16-18)

ఎట్లు మాటలాడవలెనో తెలిసిన సేనానాయకుడైన సుగ్రీవుడు, మాటలలో నేర్పరియైన రామునితో ఇట్లు పలికి మౌనము వహించెను.(19)

రాముడు సుగ్రీవుని మాటలు విని బాగుగా ఆలోచించి అతనితో ఎక్కువ శుభమైన వాక్యమును పలికెను- "ఈ రాక్షసుడు చాలా దుష్టుడైనా, కాకపోయినా ఏమీ భయములేదు. ఇతడు ఏ విధముగాను కూడ నాకు ఏ మాత్రము అపకారము

చేయజాలడు. సుగ్రీవా! నేను తలచుకొన్నచో ఈ భూమిమీద ఉన్న పిశాచములను, దానవులను, యక్షులను, రాక్షసులను కూడా వ్రేలికొనతో చంపగలను. పావురము శరణుజొచ్చిన శత్రువును న్యాయానుసారముగా పూజించి వానికి తన మాంసమును ఆహారముగా పెట్టినదని వినుచున్నాము కదా? తన భార్యను చంపిన ఆ శత్రువు ఇంటికి వచ్చినప్పుడు ఆ పావురము వానిని అతిథిగా స్వీకరించెను కదా? అదే అట్లు చేసినప్పుడు నావంటి వాని మాట చెప్పవలెనా?(20-24)

కణ్వమహర్షి పుత్రుడు, సత్యమును పలుకువాడు, అయిన కండువను మహర్షి పూర్వము ధర్మసమ్మతమైన గాథలు గానము చేసినాడు(చెప్పినాడు) వాటిని వినుము. శత్రుసంహారకుడవైన ఓ! రాజా! అంజలి ఘటించి, దీనుడై ప్రార్థించుచు శరణుజొచ్చిన శత్రువును కూడ, తనకు క్రూరుడను అపకీర్తి రాకూడదు అనుకొనువాడు చంపకూడదు. శరణుజొచ్చిన శత్రువు ఆర్తుడైనా, గర్వితుడైనా, వానిని, ఉత్తమమైన మనస్సు గలవాడు తన ప్రాణముల నైనా ఇచ్చి రక్షించవలెను. శరణు పొందబడినవాడు శరణుజొచ్చిన వానిని భయమువలన గాని, అజ్ఞానమువలన గాని, ఏదైన కోరికవలనగాని న్యాయానుసారముగా స్వశక్తి చేత రక్షింపకపోయినచో అతడు లోకమందు నిందితమైన పాపము చేసిన వాడగును. శరణుజొచ్చినవాడు, రక్షింపబడకుండగా ఆ రక్షింపగలవాడు చూచుచుండగానే, మరణించినచో అతడు వాని పుణ్యము నంతను తీసికొనిపోవును. శరణుపొందిన వారిని రక్షించక పోవుటలో ఇట్టి గొప్ప దోషమున్నది. ఇది స్వర్గమును చెరచును; అపకీర్తి నిచ్చును. బలమును, వీర్యమును నశింపచేయును. కండువు చెప్పిన ఉత్తమమైన పై వచనమును యథార్థము చేసెదను. అట్లు చేయుట ధర్మసమ్మతము. కీర్తిని పెంచును. స్వర్గము నిచ్చును. సత్ఫలమును వృద్ధిచేయును.(25-31)

ఎవ్వడైన వచ్చి నేను నీవాడను అని చెప్పుచు ఒక్కమాటు నన్ను శరణుపొందిన చాలును; వానికి సకలప్రాణులనుండి అభయము నిచ్చెదను. ఇది నా వ్రతము. వానరశ్రేష్ఠుడవైన సుగ్రీవా! ఆ వచ్చినవాడు విభీషణు డైనా లేదా సాక్షాత్తు రావణుడే అయినా అతనిని తీసికొని రమ్ము. నేను అతనికి అభయము ఇచ్చినాను".(32, 33)

సుగ్రీవుడు రాముని మాటలు విని, స్నేహభావముతో నిండిన మనస్సుతో రామునితో ఇట్లు పలికెను- "ధర్మములు తెలిసినవాడా! మహాబలశాలివి, ఉత్తమమార్గమునందు ప్రవర్తించువాడవు అయిన నీవు ఈవిధముగా పూజించదగిన మాటలు మాటలాడుచున్నా వన్నచో దీనిలో ఆశ్చర్యము ఏమున్నది! ఈ విభీషణుడు

మంచివాడే అని నా అంతరాత్మ కూడా చెప్పుచున్నది. ఊహను పట్టి, ఈతనిలో కనబడు భావమును పట్టీ అన్ని పక్షములనుండీ బాగుగా పరీక్షింపగా అట్లు కనబడుచున్నాడు. అందువలన గొప్ప బుద్ధికల ఈ విభీషణుడు శీఘ్రముగా మాతో సమానుడై మనకు మిత్రు డగుగాక."(34-37)

పిమ్మట రాజైన రాముడు సుగ్రీవుని మాటలు విని, అతడు చెప్పిన విధముగా, వెంటనే దేవేంద్రుడు గరుత్మంతునితో కలిసినట్లు విభీషణునితో కలిసెను.(38)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పదునెనిమిదవ సర్గము సమాప్తము.

పందొమ్మిదవ సర్గము

ఆకాశమునుండి దిగి వచ్చి విభీషణుడు రాముని శరణుజొచ్చుట; రాముడు సముద్రుని సాహాయ్యము కోరుచు దీక్ష బూని సముద్రతటముపై కూర్చుండుట.

రాముడు అభయ మిచ్చిన పిమ్మట, రావణుని తమ్ముడు, మహాబుద్ధిమంతుడూ అయిన విభీషణుడు క్రిందికి వంగి భూమిని చూచెను. అతడు సంతోషించుచు భక్తులైన అనుచరులతో కూడ ఆకాశమునుండి దిగి రాముని దగ్గర నేలను స్పృశించెను. అటుపిమ్మట నలుగురు రాక్షసులతో కలిసి రాముని పాదములపై పడి, అతనితో ధర్మసంమతము, యుక్తియుక్తము, తగినది, ఆనందకరము అయిన వాక్యమును పలికెను- "రామా! నేను రావణుని తమ్ముడను. అతనిచేత అవమానింపబడినాను. సకలప్రాణులకు రక్షకుడ వైన నిన్ను శరణుపొందినాను. నేను లంకను, మిత్రులను, ధనములను పరిత్యజించి వచ్చినాను. నా రాజ్యము, జీవితము, సుఖములూ కూడా నీపై ఆధారపడి ఉన్నవి."(1-5)

రాముడు అతని మాటలు విని నేత్రములతో త్రాగుచున్నాడా అన్నట్లు ప్రేమపూర్వకముగా చూచుచు, మాటలతో ఓదార్చి – "రాక్షసుల బలాబలములను నాకు యథార్థముగా చెప్పుము." అని అడిగెను.(6, 7)

రాముడు ఇట్లు ప్రశ్నించగా ఆ విభీషణుడు రావణున కున్న బలమును గూర్చి పూర్తిగా చెప్పుటకు ఇట్లు ప్రారంభించెను- "రామా! బ్రహ్మ వరము లిచ్చి ఉండుటచే, రావణుని గంధర్వులు గాని, ఉరగులుగాని, పక్షులు గాని, మరి ఏ



ప్రాణులు గాని చంపజాలవు. రావణుని తరువాతి వాడైన సోదరుడు, నాకంటె పెద్దవాడు, గొప్ప పరాక్రమము, తేజస్సు గలవాడు అయిన కుంభకర్ణుడు యుద్ధములో దేవేంద్రుని ఎదిరించగలిగిన బలము కలవాడు. అతని సేనాపతియైన ప్రహస్తుని గూర్చి నీవు విని ఉందువు. అతడు కైలాసపర్వతముమీద జరిగిన యుద్ధములో మణిభద్రుణ్ణి ఓడించినాడు. ఇంద్రజిత్తు యుద్ధములో గోధను (వ్రేళ్ల తొడుగులను) కట్టుకొని, భేదింపశక్యము కాని కవచమును తొడిగికొని, ధనుస్సు ధరించి యుద్ధములో నిలబడినచో అతడు ఇతరులకు కనబడడు. అతడు అగ్నిని హోమములచే తృప్తిపొందించి అంతర్ధానము చెంది, గొప్ప సేనావ్యూహములు గల యుద్ధములలో శత్రువులను సంహరించును. లోకపాలులతో సమానులైన మహోదరమహాపార్శ్వులు, అకంపనుడు అను ముగ్గురూ యుద్ధములో ఇతని సేనానాయకులు. లంకాపురములో స్వేచ్ఛగా రూపములను ధరించగల, రక్తమాంసములు భుజించు పదివేల కోట్ల మంది రాక్షసులు నివసించుచున్నారు. రావణుడు ఆ రాక్షసులతో వెళ్ళి లోకపాలులతో యుద్ధము చేసెను. ఆ లోకపాలులు, ఇతర దేవతలూ కూడా దురాత్ముడైన ఆ రావణుని చేతిలో ఓడిపోయిరి."(8-16)

రాముడు విభీషణుని మాటలు విని, ఆ విషయము నంతా మనసా పరిశీలించి– "విభీషణా! రావణుడు శౌర్యముతో పూర్వము చేసిన పనులను గూర్చి నీవు చెప్పితివి. వాటిని బాగుగా అర్థము చేసుకొన్నాను. నేను రావణుని, ప్రహస్తుని, ఇంద్రజిత్తును చంపి నిన్ను రాజును చేసెదను. నేను నిజముగా చెప్పుచున్న మాట వినుము.

రావణుడు రసాతలములో ప్రవేశించినా, పాతాళములో ప్రవేశించినా, బ్రహ్మదేవుని లోకమునకు వెళ్ళినా నేను అతనిని ప్రాణాలతో విడువను. యుద్ధములో రావణుణ్ణి వాని పుత్రపరివారబంధువులతో సహా చంపకుండా అయోధ్యలో ప్రవేశించను. నా ముగ్గురు సోదరులమీద ఒట్టు పెట్టి చెప్పుచున్నాను" అని విభీషణునితో పలికెను.(17-21)

విభీషణుడు రాముని మాటలు విని, తల వంచి నమస్కరించి మాటలాడుటకు ఉపక్రమించి- "రామా! లంకను ముట్టడించి రాక్షసులను చంపుటకు నీకు సహాయము చేసెదను. నా శక్తిని అనుసరించి, శత్రుసైన్యములో ప్రవేశించి యుద్ధము కూడ చేసెదను." అనెను.(22, 23)

రాముడు సంతోషించి, ఈవిధముగా పలుకుచున్న విభీషణుని కౌగిలించుకొని లక్ష్మణుని - "లక్ష్మణా! సముద్రమునుండి జలము తీసికొనిరమ్ము. మహాబుద్ధిశాలియైన ఈ విభీషణుణ్ణి ఆ జలముతో, రాక్షసరాజునుగా వెంటనే అభిషేకించుము; నేను సంతోషించెదను." అని ఆదేశించెను. లక్ష్మణుడు రాముని మాటలు విని, వానరనాయకుల మధ్య రాముని ఆజ్ఞ ప్రకారము ఆ విభీషణుని రాక్షసరాజునుగా అభిషిక్తుని చేసెను. రాముడు వెంటనే చూపిన అనుగ్రహమును చూచి సంతోషముతో ధ్వని చేయుచు వానరులు "బాగు బాగు" అని ఆ మహాత్ముడైన రాముణ్ణి ప్రశంసించిరి.(24-27)

"గొప్ప తేజస్సు గల ఈ వానరులతో కలిసి మన మందరము, క్షోభింపశక్యము కాని, వరుణదేవనివాసస్థానమైన సముద్రమును దాటుట ఎట్లు?" అని సుగ్రీవ-హనుమంతులు విభీషణుని అడిగిరి. "పశ్చిమాభిముఖముగా ప్రవహించే నదాలకు, పూర్వాభిముఖముగా ప్రవహించే నదులకు పతియైన ఈ సముద్రమును సైన్యసహితులమైన మన మందరము బలముతో దాటుటకై ఉపాయముతో సమీపించెదము. అట్టి ఉపాయములు చెప్పుము." అని వారు కోరిరి.(28, 29)

విభీషణుడు వారి మాటలు విని - "రాజైన రాముడు సముద్రమును శరణుపొందుట మంచిది. తెలియ శక్యము కాని ప్రమాణము గల ఈ మహాసముద్రమును రాముని పూర్వుడైన సగరుడు త్రవ్వించినాడు. అందుచేత ఇతడు బంధువైన రాముని కార్యమును చేయగలడు." అని వారితో అనెను.(30,31)

పిమ్మట, సుగ్రీవుడు పండితుడైన విభీషణుని మాటలు విని రామలక్ష్మణు లున్న చోటికి వెళ్ళి, విభీషణుడు చెప్పిన శుభమైన వచనమును, రాముడు సాగరమును

ఉపాసించవలె నను విషయమును చెప్పెను. సహజముగా ధర్మస్వభావుడైన రామునకు కూడ అది నచ్చెను. అతడు విభీషణుని మాటలు ఆదరించుచు, లక్ష్మణుని, పనులలో సమర్థుడు, వానరప్రభువూ అయిన సుగ్రీవుని, చూచి చిరునవ్వు నవ్వుచు– “లక్ష్మణా! విభీషణుని ఈ ఆలోచన నాకు నచ్చినది. సుగ్రీవుడు పండితుడు. నీవు ఎల్లప్పుడు ఆలోచనలలో సమర్థుడవు. మీరిద్దరూ నిర్ణయించి, మీ కేది ఇష్టమో చెప్పుడు.” అని అడిగెను. (32–36)

వీరులైన సుగ్రీవలక్ష్మణులిద్దరూ రాముని మాటలు విని వినయపూర్వకముగా– “నరులలో శ్రేష్ఠుడవైన ఓ! రామా! ఈ సమయమునందు సుఖమును కలిగించు(ఇప్పుడు అనుకూలమైన) విభీషణుని వాక్యము మాకు మాత్రము ఇష్టము కాకుండునా? వరుణదేవుని నివాసస్థానమైన ఈ భయంకరసముద్రముమీద సేతువును కట్టకుండగా ఇంద్రునితో కూడిన సురాసురులు కూడ లంకలో ప్రవేశింపజాలరు. శూరుడైన విభీషణుడు చెప్పినట్లు చేయుము. ఆలస్యము చేయవద్దు. సైన్యముతో లంకాపురిలో ప్రవేశించుటకు వీలు కల్పించుటకై సముద్రుని ఆదేశించుము.” అని పలికిరి. (37–41)

రాముడు వారి మాటలు విని సముద్రతీరమునందు కుశలు పరచుకొని వాటి పై, వేదిలో అగ్నివలె, శయనించెను. (42)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని పందొమ్మిదవ సర్గము సమాప్తము.

ఇరువదవ సర్గము

రావణుడు శుకుణ్ణి సుగ్రీవునివద్దకు దూతగా పంపుట; వానరు లాతనిని పీడించుచుండగా రాముడు వారించుట.

పిమ్మట పరాక్రమవంతు డైన శార్దూలు డను రాక్షసుడు వచ్చి వ్యూహములుగా నిలుపబడి సుగ్రీవునిచేత పాలింపబడుచున్న వానరసైన్యమును చూచెను. రావణుని గూఢచారియైన ఆ రాక్షసుడు ఆ సేన నంతనూ జాగర్తగా చూచి వేగముగా లంకకు తిరిగి వెళ్ళి రావణునితో– “ప్రభూ! అగాధము, ఇంత అని నిర్ణయించ శక్యముకానిది అయిన ఈ వానరుల సేన, భల్లూకముల సేన రెండవ సముద్రము వలె లంకను సమీపించి ఉన్నది. ఉత్తములు, మంచి రూపము గలవారు, గొప్ప కాంతి గలవారు,

దశరథకుమారులు, సోదరులూ అయిన ఆ రామలక్ష్మణులు సీత ఉన్న స్థానమును తెలిసికొని సముద్రసమీపమున నిలచి ఉన్నారు. వానరసైన్యము కూడా అన్ని ప్రక్కలా పది యోజనములు విశాలమైన అవకాశమును ఆక్రమించుకొని విడిసి ఉన్నది. మహారాజా! నీ వీ సత్యమును వెంటనే గ్రహించవలెను. మరికొందరు దూతలు కూడ వెంటనే వెళ్ళి తెలుసుకొనుట మంచిది. ఈ విషయమునందు దానోపాయమును గాని, సామోపాయమునుగాని, భేదోపాయమును గాని ప్రయోగించుము. దండమునకు అవకాశమే లేదు." అని చెప్పెను.(1-7)

రావణుడు శార్దూలుని మాట విని, కంగారు పడుచు, వెంటనే తన ప్రయోజనమును నిశ్చయించుకొని, విషయములను తెలిసికొనగలవారిలో శ్రేష్ఠుడైన శుకు డను రాక్షసుని- "నీవు వెంటనే వానరరాజైన సుగ్రీవుని వద్దకు వెళ్ళి నా సందేశము తూ. చా. తప్పకుండా మధురములు, ఉత్తమములు అయిన మాటలతో నిర్భయముగా నామాటగా ఇట్లు చెప్పుము- 'మహారాజా! నీవు ఉత్తమకులములో పుట్టినావు. మహాబలవంతుడవు. ఋక్షరజస్సు కుమారుడవు. నీ కీ యుద్ధమువలన ఏ లాభమూ లేదు; నష్టమూ లేదు. కాని ఓ! వానరరాజా! నీవు నాకు సోదరుని వంటివాడవు. సుగ్రీవా! నేను రాముని భార్యను హరించినచో దానితో నీకేమి సంబంధము? నీవు తిరిగి కిష్కింధకు పొమ్ము. వానరులు ఏ విధముగానూ కూడ లంకలో ప్రవేశింపజాలరు. దేవతలు, గంధర్వులూ కూడ ప్రవేశింపజాలని లంకలో నరులు, వానరులు ప్రవేశింపజాల రని వేరే చెప్పవలెనా?' అని చెప్పుము." అని ఆదేశించి పంపెను.(8-12)

రావణుడు పంపిన శుకుడు పక్షిరూపము ధరించి శీఘ్రముగా ఆకాశములోనికి ఎగిరి సముద్రము పైపైననే చాల దూరము వెళ్ళి, ఆకాశమునందే నిలచి సుగ్రీవునికి రావణుడు చెప్పిన దంతా చెప్పెను. అతడు ఆ మాటలు చెప్పుచుండగా వానరులు పైకి ఎగిరి వెంటనే వాని రెక్కలు ఊడబెరుకుటకు, పిడికిళ్ళతో కొట్టుటకు వాని దగ్గరకు వెళ్ళిరి. ఆ వానరు లందరూ బలాత్కారముగా ఆ రాక్షసుని నిగ్రహించి వెంటనే వానిని పట్టుకొని ఆకాశమునుండి భూమిమీదకు దింపిరి.(13-16)

వాళ్ళు అట్లు పీడించుచుండగా శుకుడు, "రామా! ఎవ్వరూ దూతలను చంపరు. అందుచేత వానరులను నివారించుము. ఏ దూత ప్రభువు అభిప్రాయమును కాక తన అభిప్రాయమును చెప్పునో, దూత అయి ఉండి తన ప్రభువు చెప్పనిదానిని చెప్పు ఆ దూత మాత్రమే చంపదగినవాడు." అని ప్రార్థించెను. రాముడు శుకుని

మాటలను, ఏడ్పును విని, అతనిని కొట్టుచున్న వానరశ్రేష్ఠులతో, "వానిని చంపకుడు." అని పలికెను. వానరులనుండి భయము లేదని గ్రహించిన పిమ్మట అతడు తేలికయైన రెక్కలతో ఆకాశముపై నిలచి- "ధైర్యశాలివీ, మహాబలపరాక్రమములు గలవాడవూ అయిన ఓ! సుగ్రీవా! లోకములను పీడించి ఏడ్పించు రావణునికి నీ మాటగా నేనేమి సమాధానము చెప్పవలెను?" అని అడిగెను.(17-21)

వానరరాజు ఆ మాటలు విని, రావణుని దూతయైన పరిశుద్ధుడైన శుకునితో నిర్భయముగా ఇట్లు పలికెను- "చంపుటకు తగిన ఓ! రావణా! నీవు నాకు మిత్రుడవు కావు. జాలి చూపదగినవాడవు కావు. నాకు ఉపకారము చేసినవాడవు కావు. నాకు ఇష్టుడవు కావు. రామునితో విరోధము పెట్టుకొన్నావు. అందుచేత వాలి వలె నీవు కూడ నీ పరివారముతో సహా చంపదగినవాడవే. నేను నిన్ను, నీ కుమారులను, బంధువులను, జ్ఞాతులను, చంపివేసెదను. గొప్ప సైన్యముతో కలిసివచ్చి లంకనూ లంకానివాసుల నందరినీ కూడ భస్మము చేసెదను. ఓ! మూఢుడవైన రావణా! ఇంద్రుడు, ఇతరదేవత లందరూ కలసి నిన్ను రక్షించినా, నీవు అంతర్ధానము పొందినా, సూర్యమండలములోనికి గాని, పాతాళమునకు గాని వెళ్ళినా, ఈశ్వరుని పాదపద్మముల దగ్గరకు చేరినా రాముడు నిన్ను విడిచిపెట్టడు. నిన్ను, నీ తమ్ముని కూడా రాముడు చంపివేసినట్లే. నిన్ను రక్షించేవాడు ఈ మూడు లోకములలో నా కెవ్వడూ కనబడుటలేదు. పిశాచము గాని, రాక్షసుడు గాని, గంధర్వుడుగాని, అసురుడు గాని నిన్ను రక్షించజాలడు. నీవు ముసలివాడైన గృధ్రరాజు, జటాయువును చంపినావు. నీవు ఏ సీతను అపహరించి నీ మహాపరాధమును తెలిసికొనజాలకున్నావో అట్టి విశాలాక్షియైన సీతను నీవు రాముడు, లక్ష్మణుడు దగ్గర ఉండగా ఎందుకు అపహరించలేదు? మహాబలశాలి, మహాత్ముడు, దేవతలచేత కూడ ఎదిరింప శక్యము కానివాడు అయిన రాము డనగా ఎట్టివాడో నీకు తెలియుటలేదు. అతడు నీ ప్రాణాలు హరించనున్నాడు."(22-29)

అప్పుడు వానరశ్రేష్ఠుడు, వాలిపుత్రుడూ అయిన అంగదుడు- "వానరరాజా! ఇతడు దూతకాదు; గూఢచారిగా నాకు తోచుచున్నాడు. ఇతడిక్కడ నిలబడి నీ సైన్యము నంతనూ అంచనా వేసినాడు. ఇతనిని బంధించుట మంచిది. ఇతనిని లంకకు వెళ్లనీయకూడదు. ఇది నా అభిప్రాయము." అని పలికెను. సుగ్రీవుడు ఆజ్ఞాపించగా వానరులు ఎగిరి రక్షకుడు లేక విలపించుచున్న అతనిని పట్టుకొని బంధించిరి. తీవ్రస్వభావము గల ఆ వానరులు పీడించగా ఆ శుకుడు దశరథపుత్రుడు, మహాత్ముడు అయిన రాముణ్ణి గూర్చి అరచుచు- "నా రెక్కలు ఊడబెరికి

వేయుచున్నారు. నా కళ్ళు పేలిపోవుచున్నవి. నేను మరణించినట్లయితే నేను పుట్టిన రాత్రి(నాడు) మొదలు చచ్చిన రోజు వరకు చేసిన నా పాపము లన్నీ నీకే సంక్రమించును." అని పలికెను. అప్పుడు రాముడా ఏడ్పు విని "దూతగా వచ్చిన వానిని చంపకుడు." అని పలికి వానరులాతనిని చంపకుండే టట్లు చేసెను. (30-36)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువదవ సర్గము సమాప్తము.

ఇరువది ఒకటవ సర్గము

సముద్రము మార్గ మివ్వకపోవుటచే రాముడు కోపించి బాణసంధానము చేయగా సముద్రము క్షోభ చెందుట.

శత్రువినాశకుడైన రాముడు సముద్రతీరమునందు దర్భలు పరచుకొని సముద్రమునకు నమస్కరించి, సర్పశరీరము వలె ఉన్న బాహువును తలగడగా ఉంచుకొని శయనించెను. రాముని బాహువును పూర్వము మణులు పొదిగిన బంగారు దండకడియాలు, శ్రేష్ఠములైన ముత్యములు అలంకారముగా గల ఉత్తమస్త్రీల భుజములు అనేకవిధముల స్పృశించినవి. పూర్వము ఆ భుజమునకు తెల్లని చందనము, అగురువు, బాలసూర్యునివంటి కాంతి గల చందనము పూయబడుచుండెడివి. పూర్వము శయ్యమీద సీత శిరస్సు ఈ భుజముమీద ఉండెడిది. అది గంగాజలములో మునిగిన తక్షకుని శరీరము వలె ఉండెను. కాడివలె దీర్ఘమైన ఆ భుజము యుద్ధములో శత్రువుల శోకమును వృద్ధిపొందించునది, మిత్రులకు ఆనందము కలిగించునది, భూమండలమున కంతకు ఆశ్రయమైనది. (1-6)

సమర్థుడు, మహాబాహువు అయిన రాముడు బాణములు విడుచుచున్న ధనుస్సుచేత చర్మముమీద కాయలు కాయునట్లు చేయబడిన ఎడమదైన బాహువును, మహాపరిఘతో(కోట గడియతో) సమానము, వేలకొలది గోవులు దానము చేసినది అయిన కుడిభుజమును తలగడగా పెట్టుకొని, "నేను సముద్రమును దాటనైనా దాటవలెను, లేదా మరణించవలెను." అని దృఢముగా సంకల్పించి, యథాశాస్త్రముగా నియమము పాటించుచు, మౌనియై, సముద్రము దగ్గర శయనించెను. నియమమును పాటించుచు రాముడు దర్భలు పరచిన నేలమీద శయనించి ఉండగా మూడు

రాత్రులు గడచిపోయినవి. నీతి తెలిసినవాడు, ధర్మమునందు ఆసక్తి కలవాడు అయిన రాముడు అక్కడ మూడు దినములు శయనించి నదుల భర్తయైన సముద్రుని ఉపాసించెను. (7-11)

ఆ విధముగా అతడు నియమవంతుడై యథావిధిగా పూజించినను మూఢుడైన సముద్రుడు అతనికి ప్రత్యక్షము కాలేదు. పిమ్మట కొనలయందు ఎఱ్ఱగా ఉండు నేత్రములు గల రాముడు సముద్రము మీద కోపించి దగ్గరనే ఉన్న, లక్ష్మణునితో– "లక్ష్మణా! ఈ సముద్రము ప్రత్యక్ష మగుటలేదు; ఎంత గర్వము! సత్పురుషులలో ఉన్న శాంతి, ఓర్పు, ఋజుత్వము, ప్రియముగా మాటలాడుట అను ఈ గుణములను గుణములు లేనివారు సామర్థ్యము లేకపోవుటనుగా పరిగణించుచుందురు. ఈ లోకము, ఆత్మస్తుతి చేసికొనేవాడు, దుష్టుడు, ధార్ష్ట్యము కలవాడు, ఇటూ అటూ పరుగులెత్తేవాడు, అందరిపైన దండప్రయోగము చేసేవాడూ అయిన మానవుణ్ణి సత్కరించును. లక్ష్మణా! ఈ లోకములో సామముచేత కీర్తిగాని, యశస్సుగాని, యుద్ధభూమిలో విజయము గాని పొందశక్యము కాదు. ఈ సముద్రజలమునందు అంతటా నా బాణములచేత ఛేదించబడిన మొసళ్ళు తేలుచు నీటిని అడ్డుకొనేటట్లు చేసెదను; చూడుము. ఈ సముద్రములోని సర్పముల శరీరములను, మత్స్యముల విశాలములైన దేహములను, నీటి ఏనుగుల తొండములను ఖండించివేసెదను; చూడుము. శంఖములతో, ముత్యపుచిప్పలతో, మీనములతో, మకరములతో నిండిన ఈ సముద్రమును వీటి అన్నింటితో సహా, మహాయుద్ధములో ఎండింపచేసెదను. ఓర్పు గల నన్ను చూచి ఈ సముద్రుడు అసమర్థు దని అనుకొనుచున్నాడు. ఇట్టివాని విషయమునందు ఓర్పు చూపించుట ఎంత తప్పు! ఇతడు బ్రతిమాలుచున్న నాకు ప్రత్యక్ష మగుటలేదు. లక్ష్మణా! ధనుస్సునూ, సర్పములవంటి బాణములనూ తీసికొనిరమ్ము. ఈ సముద్రమును ఎండింపచేసెదను. అప్పుడు వానరులు దీనిని నడచి దాటగలరు. ఇపుడు కోపించిన నేను క్షోభింపశక్యముకానిదైనను ఈ సముద్రమును క్షోభింపచేసెదను. తీరములయందు కట్టుబాటును పాటించుచు, తీరములను దాటకుండా ఉన్న, వేలకొలది తరంగములతో వ్యాకులమైన ఈ సముద్రమును బాణములచే తీరమును దాటునట్లు చేసెదను. మహాదానవులతో నిండిన ఈ మహార్ణవమును క్షోభింపచేసెదను." అని పలికి, రాముడు ధనుస్సు చేతిలో ధరించి, క్రోధముచేత కండ్లు పెద్దవి చేసి, ప్రజ్వలించుచున్న ప్రళయకాలాగ్ని వలె చూడ శక్యము కానివాడై ఉండెను. (12-25)

భయంకరమైన ధనుస్సును దృఢముగా పట్టుకొని, బాణములచేత జగత్తును

కంపింపచేయుచు, దేవేంద్రుడు వజ్రాయుధమును ప్రయోగించి నట్లు ఉగ్రములైన బాణములను ప్రయోగించెను. తేజస్సుతో మండుచున్న, మహావేగము గల ఆ శ్రేష్ఠమైన బాణములు, సర్పములు భయపడునట్లుగా సముద్రజలములోనికి ప్రవేశించెను. అప్పుడు మీనముల ధ్వనితోను, మకరముల ధ్వనితోను, వాయుధ్వనితోను కూడి ఆ సముద్రజలవేగము చాలా భయంకరముగా ఉండెను. వెంటనే ఆ సముద్రమునందు పెద్ద పెద్ద తరంగములు వెడలెను. సముద్రమంతా శంఖములు కప్పివేయుచుండెను. తరంగములు తిరిగి పోవుచుండెను. ధూమము వెడలెను. ప్రజ్వలించుచున్న ముఖములు, నేత్రములు గల సర్పములు, గొప్ప పరాక్రమము గల పాతాళమునందు నివసించు దానవులు వ్యథ చెందిరి. వింధ్యపర్వతము వలె మందరపర్వతము వలె పెద్దవైన వేలకొలది తరంగములు, చిన్నవి, పెద్దవి అయిన మొసళ్ళతో సముద్రమునుండి పైకి ఎగిరినవి. మహాధ్వనితో నిండిన ఆ సముద్రములో తరంగసముదాయములు తిరిగి పోయెను. ఉరగులు, రాక్షసులు భయపడిరి. పెద్ద జలజంతువులు క్రిందికి మీదికి తిరిగిపోవుచుండెను. (26-32)

అప్పుడు లక్ష్మణుడు శీఘ్రముగా వెళ్ళి, ఉగ్రమైన వేగము గల కోపముతో నిట్టూర్చుచు సాటిలేని ధనుస్సును లాగుచున్న రామునితో "వద్దు వద్దు" అని పలుకుచు ఆ ధనుస్సును పట్టుకొని, "ఈ విధముగా సముద్రమును నశింపచేయకపోయినను మహావీరుడ వైన నీ కార్యము ఇప్పుడు సిద్ధింపచేసికొనవచ్చును. నీవంటి వాళ్ళు క్రోధమునకు వశులు కారు కదా. అతిప్రాచీనకాలమునుంచీ వచ్చుచున్న సత్పురుషుల ప్రవృత్తిని నీవు దృష్టిలో ఉంచుకొనుము." అని ప్రార్థించెను. బ్రహ్మర్షులు, దేవర్షులు ఆకాశములో అంతర్హితులై ఉండి, "వద్దు వద్దు" అని గట్టిగా అరచుచు, "ఎంత కష్టము" అని పలికిరి. (32-35)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది ఒకటవ సర్గము సమాప్తము.

ఇరువది రెండవ సర్గము

సముద్రుని అనుమతిచేత నీలుడు సేతువును నిర్మింపగా రాముడు సైన్యసహితుడై సముద్రమును దాటుట.

పిమ్మట రాముడు సముద్రునితో భయంకరమైన మాటను పలికెను– "సముద్రుడా! పాతాళముతో సహా నిన్ను ఇప్పుడు ఎండింపచేసెదను." సముద్రుడా! నేను బాణములచేత నీ ఉదకమును కాల్చివేసి జంతువులను చంపివేసెదను. అప్పుడు నీనుండి గొప్ప పరాగము బయలుదేరును. నేను ధనుస్సు నుండి బాణవర్షము కురిపించెదను. వానరులు దాని సాహాయ్యముతో కాలినడకనే అవతలి ఒడ్డుకు వెళ్ళగలరు. నీవు పరిశీలించి కూడ నా పౌరుషమును, పరాక్రమమును గుర్తింపజాలకున్నావు. నావలన ఇప్పుడు సంతాపము పొందగలవు."(1–4)

మహాబలశాలియైన రాముడు బ్రహ్మదండమువలె ఉన్న బాణముపై బ్రహ్మాస్త్రమును కూర్చి, దానిని శ్రేష్ఠమైన ధనుస్సు మీద సంధించి లాగెను. రాముడా ధనుస్సును లాగగానే వెంటనే భూమ్యాకాశములు బద్ధలైనట్లు అయెను. పర్వతములు కంపించెను. లోకమంతా చీకటి కమ్మెను. దిక్కులు ప్రకాశించలేదు. సరస్సులు, నదులు క్షోభించెను. చంద్రసూర్యులు నక్షత్రములు గమనము తప్పి, అడ్డముగా నడచుచు కలిసెను. ఆకాశము సూర్యకిరణములచేత కొంచెమే ప్రకాశింపచేయబడినదై, అధికముగా తమస్సుచే ఆవరించబడి, మండుచున్న వందలకొలది ఉల్కలతో మండెను. ఆకాశమునుండి పెద్ద ధ్వనితో వాయుసంఘర్షములు బయలుదేరెను. అప్పుడు ఆకాశము పైభాగమునందు ఒకదానిపై ఒకటి చొప్పున ఉండే పరివాహము మొదలైన ఏడు వాయుస్కంధములు చాల వేగముతో వీచినవి. ఆ సమయమునందు వాయువు మేఘములను చిమ్మివేయుచు వృక్షములను విరుగగొట్టెను. శైలాగ్రములను పీడించుచు శిఖరములను విరచెను. మహావేగము గల వాయువులు ఆకాశమునందు కలిసినవై గొప్ప ధ్వనితో కూడి విద్యుత్తుకు సంబంధించిన అగ్నులను విడచెను. ఆ అగ్నులు పిడుగులుగా మారెను. కంటికి కనబడే ప్రాణులు పిడుగులతో పాటు బిగ్గరగా అరచెను. కనబడని పిశాచాదులు కూడ భయంకరమైన ధ్వని చేసెను. (ప్రాణులు)పిడుగులచేత పీడింపబడి భయముతో, ఉద్వేగముతో పండుకొనెను. చాల వ్యథచెంది భయమువలన కదలకుండ పడియుండెను.(5–13)

అప్పుడు జలముతోను, తరంగములతోను నిండినది, ప్రాణులతోను,

నాగములతోను, రాక్షసులతోను కూడినది అయిన మహాసముద్రము హఠాత్తుగా భయంకరవేగము గలదిగా అయి, ఆ వేగముచేత నీరు ముంచెత్తుకొని రాగా అవతలివైపున ఉన్న తీరమును యోజనము దూరము దాటెను. రాముడు ఉన్న వైపునుండి ఒక యోజనము లోపలికి పోయెను. రఘువంశసంజాతుడు, శత్రువినాశకుడు అయిన రాముడు ఆ విధముగా దూరమునకు తొలగిన ఆ దృష్టుడైన సముద్రుని విషయమున బాణప్రయోగము చేసి ధర్మాతిక్రమము చేయలేదు. (14-16)

అప్పుడు సముద్రమునుండి సముద్రుడు, మేరుపర్వతమునుండి సూర్యుడు ఉదయించినట్లు స్వయముగా ఆవిర్భవించెను. నున్నగా ఉన్న వైదూర్యమణి వలె ఉన్న ఆ సముద్రుడు బంగారు అలంకారములు ధరించి, మండుచున్న ముఖములు గల సర్పములతో కలిసి వచ్చి కనబడెను. పద్మము రేకులవంటి నేత్రములు గల ఆ సముద్రుడు రత్నహారములు, రత్నములు పొదిగిన వస్త్రములు ధరించి శిరస్సుపై అన్ని పువ్వులు (లేదా పూర్తిగా పువ్వులతోనే) గుచ్చిన మాలను అలంకరించుకొనెను. బంగారముతో చేసిన అలంకారములు, మెరుగు బంగారము అమర్చిన అలంకారములు, తనలోనే పుట్టిన రత్నములతో కూడిన అలంకారములు ధరించి అనేకవిధములైన ధాతువులతో అలంకరించబడిన హిమవత్పర్వతము వలె ఉండెను. ఏకావళిమధ్యయందున్న కౌస్తుభమణికి జతయైన తెల్లని మణిని విశాలమైన వక్షఃస్థలముపై ధరించెను. సముద్రుడు లేచివచ్చునప్పుడు సముద్రము మేఘవాయువులచేత వ్యాకులమై ఉండెను. తరంగములు క్రిందికి మీదికి ఎగురుచుండెను. దేవతాస్త్రీలతో సమానమైన వివిధరూపములు ధరించి గంగాసింధునదులు మొదలైన నదులు అతని వెనుక వచ్చిరి. అట్టి సముద్రుడు అంజలి ఘటించి రామా! అని పిలచుచు, ధనుస్సు ధరించి ఉన్న రామునితో- (17-24)

"సౌమ్యుడవైన రామా! భూమి, వాయువు, ఆకాశము, జలము, అగ్ని ఇవి శాశ్వతమైన మార్గమును అనుసరించి తమకు ఏది స్వభావమో దానిని దాటకుండా ఉండును. లోతుగా దాటశక్యము కాకుండ ఉండుట అనేది నా స్వభావము. లోతు లేనివాడనైనచో అది నా స్వభావమునకు విరుద్ధము. ఈ విషయమును నీకు చెప్పుచున్నాను; వినుము. రాజకుమారా! మొసళ్ళతో వ్యాకులముగా ఉండు జలమును నేనెన్నడూ ఏదైన కోరికవలన గాని, లోభమువలనగాని, భయమువలనగాని, ప్రేమవలనగాని స్తంభింపచేయను. రామా! నీవు దాటుటకు వీలగునట్లుగా ఏర్పాటు



చేసెదను. వానరులు దాటుటకు నేను స్థలమును ఏర్పరచి సహించి ఉందును. సేన దాటువరకు జలజంతువులు అపకారము చేయకుండునట్లు చేసెదను." అని పలికెను. (25-28)


అప్పుడు రాముడు అతనిని- "సముద్రుడా! నేను చెప్పు మాట వినుము. నా ఈ బాణము వ్యర్థమగుటకు వీలులేదు. దీనిని ఎక్కడ ప్రయోగింతును?" అని ప్రశ్నించెను. గొప్ప తేజస్సు గల సముద్రుడు రాముని మాటలు విని, ఆ గొప్పదైన బాణమును కూడ చూచి రామునితో- "నాకు ఉత్తరముగా ఒక పవిత్రమైన స్థానమున్నది. నీవు లోకములో ప్రసిద్ధి పొందినట్లు అది 'ద్రుమకుల్యము'అని ప్రసిద్ధము. అక్కడ చూచుటకు భయంకరులు, ఉగ్రమైన పనులు చేయువారు, పాపాత్ములు అయిన ఆభీరులు మొదలైన దస్యువులు నా జలము త్రాగుచున్నారు. రామా! పాపాత్ములైన వాళ్ళు చేసే ఆ పాపమైన స్పర్శను సహించలేకున్నాను. ఈ శ్రేష్ఠమైన బాణమును ఆ ప్రదేశమున, వాళ్ళ మీద ప్రయోగించి అమోఘ మగునట్లు చేయుము" అనెను. (29-33)

రాముడు మహాత్ముడైన ఆ సముద్రుని మాటలు విని, ఆతడు వ్రేలితో చూపగా, ప్రజ్వలించుచున్న శ్రేష్ఠమైన ఆ బాణమును విడచెను. అతడు వజ్రముతోను, పిడుగుతోను సమానమైన కాంతి గల ఆ బాణమును ప్రయోగించిన స్థానము, భూమియందు(అంతకు పూర్వము) మరుకాంతార మను పేరుతో ప్రసిద్ధిచెందినది. రాముడు ప్రయోగించిన బాణము అగ్రభాగముచేత పీడించబడిన భూమినుండి గొప్ప ధ్వని బయలుదేరెను. బాణము ఛేదించిన ఆ ప్రదేశమునందు పాతాళమునుండి

జలము పైకి ఎగిరి వచ్చెను. అప్పుడు ఏర్పడిన కూపమునకు వ్రణము అని ప్రసిద్ధి కలిగెను. దాని నుండి సముద్రమునుండి వలె, జలము అవిచ్ఛిన్నముగా వచ్చుచుండెను. ఆ ప్రదేశమును బాణము పడి చీల్చుటవలన గొప్ప ధ్వని కలిగెను. రాముడు ఈ విధముగా బాణమును ప్రయోగించి అక్కడ ఉన్న దస్యువులు ఉపయోగించిన కూపతటాకాదులలోని ఉదకము ఎండిపోవునట్లు చేసెను. ఆ మరుకాంతారము, మూడు లోకములలో ప్రసిద్ధి చెందెను. రాముడు అక్కడ ఉన్న కూపతటాకాదులను ఎండింపచేసి ఆ మరుకాంతారమునకు వరమిచ్చెను. అతడు వరము నిచ్చుటచేత ఆ మరుకాంతారము పశువులు నివసించుటకు యోగ్యము అయ్యెను. అక్కడ రోగములు నశించెను. ఫలములు, మూలములు, రసము(తేనె), నెయ్యి, పాలు సమృద్ధిగా లభించెను. ఆ ప్రదేశమంతా అనేక విధములైన ఓషధులతో సువాసనలు నిండి ఉండెను. ఈ విధముగ అనేకములైన ఉత్తమలక్షణములతో ఆ మరుప్రదేశము మంగళకరమైన మార్గముగా ఏర్పడెను. (34-42)

అప్పుడు ఆ కుక్షి దగ్గమైన పిమ్మట నదీపతియైన సముద్రుడు సర్వశాస్త్రములు తెలిసిన రామునితో – "ఓ! సౌమ్యుడా! ఈ నలుడు విశ్వకర్మ కుమారుడు. శ్రీమంతుడైన ఇతనికి తండ్రి వరముల నిచ్చి ఉన్నాడు. ఇతడు విశ్వకర్మతో సమానుడు. మహోత్సాహవంతుడైన ఈ వానరుడు నామీద సేతువును నిర్మించుగాక. నేను దానిని ధరించెదను. నాకు ఇతని తండ్రి ఎంతో ఇతడు కూడ అంతే." అని చెప్పెను. (43-45)

సముద్రుడు ఇట్లు పలికి అంతర్ధానము చెందెను. అప్పుడు వానరశ్రేష్ఠుడైన నలుడు లేచి మహాబలశాలియైన రామునితో – "రామా! సముద్రుడు చెప్పినది నిజమే. నేను నా తండ్రి సామర్థ్యముచేత(ఆశీర్బలముచేత) విశాలమైన ఈ సముద్రముమీద సేతువును నిర్మించెదను. భయంకరమైన మహాసముద్రుడు, సగరపుత్రులచేత వృద్ధిపొందింపబడినను, కృతజ్ఞతాభావము లేక, దండమువలన భయముచేత సేతువును చూడదలచి రామునకు లోతు లేకపోవుటను చూపినాడు. విశ్వకర్మ పూర్వము మందరపర్వతముమీద నా తల్లికి – 'ఓ! దేవీ! నీకు నాతో సమానుడైన పుత్రుడు పుట్టును.' అని వరము ఇచ్చెను. నేను విశ్వకర్మ ఔరసపుత్రుడను. అతనితో సమానుడను. ఈ సముద్రుడు చెప్పగా స్మరణమునకు వచ్చినది. ఈతడు చెప్పినది యథార్థమే. మీరు అడుగకుండగా చెప్పుట మంచిది కాదని నా గుణములను గూర్చి చెప్పుకొనలేదు. సముద్రముమీద సేతువును కట్ట సామర్థ్యము నాకున్నది. అందుచేత వానరవీరు లందరు ఇప్పుడే సేతువును కట్టుటకు ప్రయత్నము ప్రారంభించెదరుగాక."



అని పలికెను.(46-51)


అప్పుడు రాముడు పంపగా వందలకొలది వేలకొలది వానరవీరులు సంతోషించుచు అన్ని వైపులనుండీ మహారణ్యమువైపు వెళ్ళిరి. పర్వతములవంటి దేహములు గల ఆ వానరసేనానాయకులు పర్వతములను, వృక్షములను విరచి, వాటిని సముద్రము దగ్గరకు లాగికొనివచ్చి సాల - అశ్వకర్ణ - ధవవృక్షములచేత, వెదుళ్ళచేత, కుటజ - అర్జున - తాల - తిలక - తినిశవృక్షములచేత, మారేడు చెట్లచేత, ఏడాకుల అరటిచెట్లచేత, పుష్పించిన కర్ణికారవృక్షములచేత, చూతవృక్షములచేత, అశోకవృక్షములచేత సముద్రమును నింపివేసిరి. ఆ వానరశ్రేష్ఠులు కొన్ని చెట్లను మొదళ్ళతో సహాను, మరికొన్నింటిని మొదళ్ళు లేకుండగాను, ఇంద్రధ్వజములను వలె పైకి ఎత్తి తీసికొనివెళ్ళిరి. వాళ్ళు ఆ యా ప్రాంతములనుండి తాటి చెట్లు, పొదలవలె ఉన్న దానిమ్మ చెట్లు, కొబ్బరిచెట్లు, విభీతకవృక్షములు, కరీర - వకుల - నింబవృక్షములు తీసికొనివచ్చిరి. పెద్ద శరీరములు, గొప్ప బలము గల ఆ వానరులు ఏనుగంత ప్రమాణము గల రాళ్ళను, పర్వతములను పెకలించి, యంత్రములద్వారా తీసికొని వచ్చిరి.(52-58)

పర్వతములను హటాత్తుగా పడవేయుటచే లేచిన నీరు ఆకాశమునకు ఎగిసి మరల అక్కడినుండి ఇటు అటు వ్యాపించెను. అన్నివైపులా పడుచున్న ఆ పర్వతములు సముద్రమును క్షోభింపచేసినవి. కొందరు నూరు యోజనముల దూరము కూడ కొలత దారములను పట్టుకొనుచుండిరి. నలుడు సముద్రమధ్యమునందు గొప్ప

సేతువును కట్టెను. అప్పుడు భయంకరమైన కర్మలు చేయు వానరులు సేతువును నిర్మించిరి. కొందరు వానరులు సూత్రములు కట్టిన దండములను పట్టుకొనుచుండిరి. కొందరు రాళ్ళు మొదలైనవాటిని ఏరుచుండిరి. మేఘముల వలె, పర్వతముల వలె ఉన్న వందలకొలది వానరులు రాముని ఆజ్ఞను అనుసరించుచు తృణములచేత, కఱ్ఱలచేత సేతువుకు సంబంధించిన కొన్ని భాగములను కట్టుచుండిరి. పుష్పించిన అగ్రభాగములు గల వృక్షములతో సేతువును కట్టుచుండిరి. దానవుల వంటి కొందరు వానరులు పర్వతములవంటి శిలలను, పర్వతశిఖరములను పట్టుకొని ఇటు అటు పరుగెత్తుచు కనబడుచుండిరి. అప్పుడు ఆ మహోదధిలో శిలలను దూరమునుండి విసిరివేయుచుండగా, పర్వతములను పడవేయుచుండగా చాలా అధికమైన ధ్వని బయలుదేరెను. (59-65)

తొందరపడుచున్న ఉత్సాహవంతులైన, ఏనుగులతో సమానులైన వానరులు మొదటి దివసమునందు పదునాలుగుయోజనముల సేతువు నిర్మించిరి. అదే విధముగా రెండవ రోజున ఇరువది యోజనముల సేతువు నిర్మించిరి. అట్లే మూడవ రోజున తొందరపడుచూ సముద్రములో ఇరువదియొక్క యోజనముల సేతువు నిర్మించిరి. పిమ్మట నాల్గవ రోజున ఇంకను ఇరువది రెండు యోజనముల సేతువు కట్టిరి. ఐదవ రోజున సముద్రపు అవతలి ఒడ్డు చేరునట్లు ఇరువది మూడు యోజనముల సేతువు కట్టిరి. విశ్వకర్మ కుమారుడు, బలవంతుడు, శ్రీమంతుడు అయిన ఆ నలుడు తన తండ్రి ఎట్లు కట్టి ఉండేవాడో అట్లే సముద్రము మీద సేతువు బంధించెను. (66-71)

మొసళ్ళకు నివాసస్థానమైన ఆ సముద్రము మీద నలుడు నిర్మించిన అందమైన, శోభాయుక్తమైన ఆ సేతువు ఆకాశమునందలి నక్షత్రమార్గము వలె కనబడెను. అప్పుడు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ఆ అద్భుతమైన సేతువును చూడవలెనను కోరికతో వచ్చి ఆకాశమునందు నిలచిరి. నలుడు నిర్మించిన ఆ సేతువు పది యోజనముల వెడల్పు, నూరు యోజనముల పొడవు ఉండెను. నిర్మించుటకు చాల కష్టమైన ఆ సేతువును దేవతలు, గంధర్వులు చూచిరి. వానరులలో కొందరు సంతోషాతిశయముతో చాల ఎత్తుగా దుముకుచుండిరి. కొందరు తక్కువ ఎత్తు దుముకుచుండిరి. కొందరు గర్జించుచుండిరి. ఊహించుటకు శక్యము కానిది, ఇతరు లెవ్వరూ ప్రయత్నించుటకు కూడా శక్యము కానిది, ఆశ్చర్యకరము, రోమాంచము కలిగించునది అయిన, సాగరమునందు నిర్మించిన ఆ సేతుబంధమును సకలభూతములు చూచినవి. (72-76)



గొప్ప తేజస్సు గల ఆ వెయ్యికోట్ల వానరులు సముద్రము మీద సేతువును నిర్మించుచునే సముద్రము అవతలి ఒడ్డు చేరిరి. సముద్రముమీద విశాలముగా, అందముగా నిర్మించి, చక్కని భూమితో చదును చేసి ఉన్న ఆ సేతువు సముద్రములో పాపిడి వలె ఉండెను. పిమ్మట విభీషణుడు తన అనుచరులతో కూడ, గదాధారియై శత్రువులను ముట్టడించుటకై సముద్రము అవతలి ఒడ్డుపై నిలచెను. సుగ్రీవుడు రామునితో – " ఓ! వీరుడా! మొసళ్ళకు నివాసస్థానమైన ఈ సముద్రము చాలా విశాలముగా ఉన్నది కదా. నీవు హనుమంతుని భుజముపై ఎక్కుము. లక్ష్మణుడు అంగదుని భుజముపై ఎక్కును. వీరిద్దరూ మిమ్ములను ఆకాశమార్గాన తీసికొనివెళ్ళగలరు." అని చెప్పెను. రాముడు ధనుస్సు చేత ధరించి, లక్ష్మణసుగ్రీవులతో కలసి ఆ సైన్యము ముందు భాగమున వెళ్ళెను. (77-82)

ఆ వానరులలో కొందరు సేతుమధ్యమునందు నడిచి వెళ్లగా, కొందరు ప్రక్కలయందు నడచి వెళ్ళిరి. కొందరు కావలెనని నీటిలో దుముకుచుండిరి. కొందరు నీటిలో పడిలేచి సరియైన మార్గమును చేరుచుండిరి. కొందరు ఆకాశమార్గమునందు గరుత్మంతుని వలె ఎగిరి వెళ్ళిరి. దాటుచున్న, భయంకరమైన ఆ వానరసైన్యము గొప్ప ధ్వనిచేత, అత్యధికము, భయంకరము అయిన సముద్రధ్వనిని కప్పివేసెను. నలుడు నిర్మించిన సేతువు మీదుగా సముద్రమును దాటిన ఆ వానరసేనను రాజైన సుగ్రీవుడు అధికమైన మూలములు, ఫలములు, ఉదకము గల తీరమునందు నిలిపెను. (83-85)

ఆశ్చర్యకరము, ఇతరు లెవ్వరూ చేయజాలనిదీ అయిన రాముడు చేసిన ఆ పని చూచి దేవతలు, సిద్ధులు, చారణులు, మహర్షులు వచ్చి సంతోషసూచకముగా రామునిమీద, వేరువేరుగా పవిత్రమైన జలమును చల్లిరి. "మహారాజా! నీవు శత్రువులను జయించి అనేక సంవత్సరములు సముద్రముతో సహా భూమండలమునంతను పాలించుము." అని పలుకుచు ఆ దేవగంధర్వాదులు సకలరాజులచేత ఆదరింపబడిన ఆ రాముణ్ణి పూజించిరి. (86, 87)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది రెండవ సర్గము సమాప్తము.

ఇరువది మూడవ సర్గము

రాముడు లోకవినాశసూచకములైన శకునములు లక్ష్మణునకు చూపుట, లంకపై ఆక్రమణము చేయుట.

శుభాశుభనిమిత్తముల ఫలములు తెలిసిన రాముడు నిమిత్తములను చూచి లక్ష్మణుని కౌగిలించుకొని ఇట్లు పలికెను - "లక్ష్మణా! చల్లని జలము ఉన్న, ఫలములు గల వనములను నివాసముకొఱకై స్వీకరించి, ఈ సేనాసముదాయమును విభజించి వ్యూహములుగా చేసి నిలచెదము. లోకక్షయమునకూ, వీరులైన భల్లూకములను, వానరులను, రాక్షసులను నశింపచేయుటకు కారణమైన భయంకరమైన ఆపద వచ్చినట్లు కనబడుచున్నది. (1-3)

వాయువులు ధూళితో నిండి వీచుచున్నవి. భూమి కంపించుచున్నది. పర్వతముల శిఖరములు వణుకుచున్నవి. చెట్లు పడిపోవుచున్నవి. రాక్షసులవలె భయంకరములు, క్రూరములు అయిన మేఘములు పరుషమైన ధ్వనితో రక్తబిందువులతో కలిసిన ఉదకమును భయము కలుగు నట్లు వర్షించుచున్నవి. సంధ్య ఎఱ్ఱని చందనము వలె ఎఱ్ఱగా చాల భయంకరముగా ఉన్నది. మండుచున్న సూర్యమండలమునుండి అగ్నిపిండములు రాలుచున్నవి. చుట్టుప్రక్కల నున్న క్రూరమృగములు దీనములై చాల భయము కలుగునట్లుగా, సూర్యుని వైపు తిరిగి దీనస్వరముతో అరచుచున్నవి. ప్రళయకాలమునందు ఉదయించినవాడు వలె ఉన్న చంద్రుడు ప్రాంతములందు నల్లగాను ఎఱ్ఱగాను ఉండి, రాత్రి ప్రకాశవిహీనుడై మనస్సుకు భయము కలిగించుచున్నాడు. నిర్మలమైన సూర్యమండలము చుట్టూ చిన్నది, క్రూరము,

అప్రశస్తమూ అయిన ఎఱ్ఱని గూడు, ఆ మండలము మధ్య నల్లని మచ్చ కనబడుచున్నవి. నక్షత్రములు గొప్ప పరాగముచేత కప్పబడినవై లోకములకు ప్రళయము రానున్నదని చెప్పుచున్నవా అన్నట్లు ఉన్నవి, చూడుము. కాకులు, డేగలు, గ్రద్దలు క్రిందగా ఎగురుచున్నవి. నక్కలు చాలా భయము కలుగునట్లు అమంగళకరమైన కూతలు కూయుచున్నవి. వానరులు రాక్షసులు విడచిన పర్వతములతోను, శూలములతోను, ఖడ్గములతోను వ్యాప్తమైన భూమి మాంసరక్తముల బురదతో నిండిపోగలదు. మనము ఇప్పుడే సమస్తమైన వానరులతో కలిసి శీఘ్రముగా, వేగముగా, రావణుడు పాలించుచున్న ఈ లంకను ముట్టడించెదము."(4-13)

లోకాభిరాముడు, యుద్ధములో శత్రువులను ఎదిరించువాడు, ప్రభువు అయిన రాముడు ఇట్లు పలికి ధనుస్సు ధరించి, లంకాభిముఖుడై, ముందుగా ప్రయాణమాయెను. విభీషణసుగ్రీవులతో కూడిన వానరు లందరూ సింహనాదములు చేయుచు, ధైర్యవంతులైన శత్రువులను వధించుటకై బయలుదేరిరి. గొప్ప పరాక్రమవంతులైన వానరులు తనకు సంతోషము గలిగించుటకై చేయు పనులు, చేష్టలు చూచి రాముడు సంతోషించెను.(14-16)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది మూడవ సర్గము సమాప్తము.

ఇరువది నాలుగవ సర్గము

సేనను వ్యూహములుగా నిలుపు మని రాముడు లక్ష్మణుని ఆదేశించుట; శుకుడు రావణునకు రాముని సైన్యశక్తిని గూర్చి వర్ణించి చెప్పుట.

వ్యూహములు తీర్చి నిలచిన ఆ వానరసేన రాజైన రామునితో, సుందరములైన నక్షత్రములు గల శరత్కాలపూర్ణిమ చంద్రునితోవలె ప్రకాశించెను. సముద్రము వంటి ఆ సేనాప్రవాహముచేత పీడింపబడిన భూమి, ఆ వేగమునకు భయపడి చలించెను. ఇంతలో ఆ వానరులకు లంకనుండి, వ్యాకులము రోమాంచమును కలిగించునదీ అయిన సైనికుల సింహనాదము, భేరీమృదంగముల ధ్వని వినబడెను. వానరనాయకులు ఆ ధ్వనిని విని చాలా సంతోషించిరి. ఆ ధ్వనిని సహించక అంతకంటె ఎక్కువగా ధ్వని చేసిరి. మదించిన ఆ వానరుల గర్జనము ఆకాశమునందు ఉరుముచున్న మేఘముల ధ్వనివలె ఉండెను. అట్టి గర్జనమును

రాక్షసులు కూడా వినిరి.(1-5)

విచిత్రములైన ధ్వజములతోను, పతాకలతోను ప్రకాశించుచున్న ఆ లంకాపట్టణమును చూచి రాముడు దుఃఖించుచున్న మనస్సుతో సీతను స్మరించి- "అంగారకగ్రహముచేత ఆక్రమింపబడిన రోహిణి వలె, లేడి కళ్ళ వంటి కళ్ళు గల ఆ సీత రావణునిచేత ఈ నగరమునందే బంధింపబడి ఉన్నది కదా!" అనుకొనెను. (6,7)

రాముడు దీర్ఘముగా, వేడిగా నిట్టూర్చి, లక్ష్మణుని చూచి, తనకు ఆ సమయమునందు హితమైన వాక్యము పలికెను- "లక్ష్మణా! పర్వతాగ్రముమీద విశ్వకర్మ మనస్సుచేత నిర్మించినాడా అన్నట్లు ఉన్నది ఈ ఎత్తైన లంకాపట్టణము. ఆకాశమును ఒరయుచున్నట్లున్నది. చూడుము. పూర్వము నిర్మింపబడిన ఈ లంకాపట్టణము అత్యున్నతములైన భవనములతో నిండి యుండుటచేత ఆకాశమంతా తెల్లని మేఘాలతో కప్పబడినట్లు ఉన్నది. ఈ లంక అనేకవిధములైన పక్షుల ధ్వనులతోను, పుష్పములే ఫలములుగా గల మల్లికాదిలతలతోను కూడిన, పుష్పించిన, సుందరములైన చిత్రరథోద్యానముతో పోల్చదగిన ఉద్యానములతో ప్రకాశించుచున్నది. ఈ ఉద్యానవనప్రాంతములలోని పక్షులు మదించి ఉన్నవి. తుమ్మెదలు పుష్పములలో అణిగి ఉన్నవి. కోకిలధ్వనులు అంతటా వ్యాపించుచున్నవి. అట్టి ఈ ఉద్యానములను మంగళకరమైన మందవాయువు కదల్చుచున్నది."(8-12)

రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికి, శాస్త్రోక్త విధానమున (గరుడవ్యూహాకారమున) సేనానివేశము చేసి, సేనానాయకాదులను ఈ విధముగా శాసించెను- "పరాక్రమవంతుడు, జయింపశక్యము కానివాడు అయిన అంగదుడు ఈ సైన్యము నుండి తనకు చెందిన సేనాభాగమును తీసికొని నీలునితో గరుడాకారములో ఉన్న ఈ వ్యూహము వక్షఃస్థలమునందు నిలబడవలెను. ఋషభుడు వానరుల సముదాయముతో కూడి వానరసేన కుడి పార్శ్వమునందు ఉండవలెను. మదగజము వలె ఎదిరింప శక్యముకాని, బలశాలియైన గంధమాదనుడు వానరసేన ఎడమ పార్శ్వమునందు నిలచి ఉండవలెను. నేను లక్ష్మణునితో కలిసి యుద్ధసన్నద్ధుడనై శిరఃస్థానమునందు నిలచెదను. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి-మహాత్ములైన ఈ ముగ్గురు భల్లూకనాయకులు కుక్షిప్రదేశమును రక్షించవలెను. తేజస్సుతో కూడిన వరుణుడు పశ్చిమదిక్కును రక్షించునట్లు సుగ్రీవుడు వానరసేన పుచ్ఛభాగమును రక్షించవలెను." వ్యూహరూపమున చక్కగా విభజించి మహావానరులు రక్షించుచున్న

ఆ సేన మేఘములు సంచరించుచున్న ఆకాశము వలె ప్రకాశించెను. వానరులు యుద్ధములో రాక్షసులను(లేదా లంకను) మర్దించవలె నను కోరికతో పర్వతశిఖరములను, పెద్ద వృక్షములను గ్రహించి లంకను చేరిరి. "ఈ లంకాపట్టణముపై పర్వతశిఖరములను విసరెదము; లేదా పిడికిళ్ళతో బ్రద్దలు కొట్టెదము." అని ఆ వానరవీరులు మనస్సులలో నిశ్చయించుకొనిరి.(13-21)

పిమ్మట మహాతేజఃశాలియైన రాముడు సుగ్రీవునితో - "సైన్యములను వ్యూహరూపమున నిలుపుట పూర్తియైనది గాన శుకుణ్ణి విడిపింపుము." అని పలికెను. సుగ్రీవుడు రాముని మాట విని, అతని ఆజ్ఞానుసారము దూతయైన శుకుణ్ణి విడిపించెను. వానరులచేత పీడితుడై రామునిచేత విడిపింపబడిన ఆ శుకుడు చాలా భయపడుచు రావణుని వద్దకు వెళ్ళెను. అతని వికృతరూపము చూచి రావణుడు నవ్వుచు - "నీ రెక్కలను కట్టివేసినారా? నీ రెక్కలు ఊడిపోయినట్లు కూడా కనబడుచున్నవి. నీవు అనేకవిధములైన ఆలోచనలు చేయు శత్రువుల చేతిలో చిక్కలేదు కద!" అని అడిగెను.(22-26)

శుకుడు రావణునకు ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను - "నేను సముద్రము అవతలి తీరము చేరి, నీ సందేశము ప్రకారము మృదువైన మాటలతో బ్రతిమాలుకొనుచు, దోషము లేవీ లేని విధమున, నీ మాటలు యథాతథముగా చెప్పితిని. నన్ను చూడగానే ఆ వానరులు కోపముతో పైకి ఎగిరి నన్ను పట్టుకొని పిడికిళ్ళతో కొట్టుచు, నా రెక్కలు పీకుట ప్రారంభించిరి. మహారాజా! ఆ వానరులతో మాటలాడుట శక్యముకాదు. వారిని ప్రశ్నించే అవకాశమే లేదు. వాళ్ళు కోపస్వభావులు; తీక్ష్ణమైనవారు. విరాధుణ్ణి, కబంధుణ్ణి, ఖరుణ్ణి చంపిన ఆ రాముడు సుగ్రీవునితో కూడ సీత ఉన్న ప్రదేశమునకు వచ్చియున్నాడు. అతడు సాగరముమీద సేతువు నిర్మించి, లవణసముద్రమును దాటి, రాక్షసులను ఎగురగొట్టి (తృణీకరించి) ధనుస్సు చేత బూని నిలచి ఉన్నాడు. పర్వతమువలె, మేఘముల వలె ఉన్న భల్లూకముల, వానరుల సముదాయములచే ఏర్పడిన, వేలకొలది అనీకములు (సేనావిభాగములు) భూతలమును కప్పివేసి ఉన్నవి. రాక్షసుల సైన్యము, వానరుల సైన్యము, ఈ రెండు సైన్యములకు మధ్య దేవదానవుల మధ్యవలె సంధి అనేది ఉండదు. ఆ వానరులు ప్రాకారము దగ్గరికి రాగలరు. అందుచేత వెంటనే రామునకు సీతనైనా ఇచ్చివేయుము; లేదా యుద్ధమైనా ఇమ్ము(చేయుము). శీఘ్రముగా ఏదో ఒకటి చేయుము."(27-35)

శుకుని మాటలు విని రావణుడు, రోషముచేత కండ్లు ఎఱ్ఱబడగా చూపులతో అతనిని కాల్చివేయుచున్నాడా అన్నట్లు చూచుచు- "నాకు సర్వలోకములనుండి భయము కలిగినను, దేవతలు, గంధర్వులు, దానవులు నాకు ఎదురుగా నిలచి యుద్ధము చేసినను సీతను ఇవ్వను. వసంతఋతువులో మదించిన తుమ్మెదలు పుష్పించిన వృక్షము మీదికి శీఘ్రముగ వెళ్ళినట్లు నా బాణములు రాముని మీదికి శీఘ్రముగా ఎప్పుడు వెళ్ళిపడునో కదా! ఏనుగుల మీద కొరవులు విసిరి పీడించినట్లు ధనుస్సునుండి బయల్వెడలిన ప్రజ్వలించుచున్న బాణములచేత, రక్తముతో తడసిన దేహముగల ఆ రాముణ్ణి ఏనాడు పీడించెదనో కదా! ఉదయించుచున్న సూర్యుడు సమస్త నక్షత్రముల కాంతిని హరించినట్లు, నేను గొప్ప సైన్యముతో కూడి అతని సైన్యము నంతను(లేదా బలమును) అణచివేసెదను. నా వేగము సముద్రవేగము వంటిది. నా బలము వాయుబలమువంటిది. రామునకు ఈ విషయము తెలియదు. అందుచేతనే నాతో యుద్ధానికి వచ్చుచున్నాడు. నా అంబులపొదిలోని, విషముతో కూడిన పాములవంటి బాణాలను రాము డెన్నడూ యుద్ధములో చూడలేదు; అందుచేతనే నాతో యుద్ధము చేయాలని కోరుచున్నాడు. ఆ రాముడు పూర్వ మెన్నడూ యుద్ధములో నా పరాక్రమమును చవిచూడలేదు. నేను యుద్ధమునందు శత్రుసేన అనే మహారంగములో ప్రవేశించి బాణములనే కోణములచేత మ్రోగింపబడిన నారి చేయు ధ్వనులతో వ్యాకులము, భయంకరము, దీనాలాపముల ధ్వనులతో నిండినది, నారాచబాణముల మొదళ్ళ ధ్వనులతో కూడినది అయిన నా ధనుస్సు అనే వీణను మ్రోగించెదను. వేయి నేత్రములున్న దేవేంద్రుడు గాని, సాక్షాత్తు వరుణుడు గాని, యముడు గాని, సాక్షాత్తు కుబేరుడు గాని నన్ను మహాయుద్ధములో బాణాగ్నితో ఎదుర్కొనజాలరు." అని పలికెను. (36-45)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది నాలుగవ సర్గము సమాప్తము.

ఇరువది ఐదవ సర్గము

రావణుడు శుకసారణులను గూఢచారులుగా వానరసేనలోనికి పంపుట; విభీషణుడు వాళ్ళను గుర్తించి పట్టుకొనుట.

రాముడు సైన్యముతో సముద్రము దాటిన పిమ్మట రావణుడు మంత్రులైన శుకసారణులను– "వానరసైన్య మంతా దాటశక్యము కాని సాగరమును దాటినది. రాముడు సాగరము మీద పూర్వ మెన్నడూ ఎవ్వరూ చేయని సేతునిర్మాణము చేసినాడు. రాముడు సముద్రము మీద సేతుబంధము చేసినాడను విషయమును నేను ఏ విధముగానూ నమ్మలేకున్నాను. ఆ వానరసైన్య మెంత ఉన్నదో లెక్కపెట్టవలసి కూడా ఉన్నది. మీరిద్దరూ ఎవరికీ తెలియకుండగా వానరసైన్యములో ప్రవేశించి ఆ సైన్యము ఎంత ఉన్నదో, దాని బలము ఎట్టిదో, దానిలో ముఖ్యులైన వానరులు ఎవరో, సముద్రముమీద ఆ సేతువును ఎట్లు నిర్మించినారో, ఆ వానరులను ఎట్లు నిలిపినారో, రామసుగ్రీవులతో కలసి పని చేయుచున్న మంత్రులు ఎవరో, శూరులైన ఏ వానరులు సైన్యానికి ముందు ఉన్నారో, రామలక్ష్మణుల ఉద్యమము ఎట్లు ఉన్నదో, వారివద్ద ఏ ఆయుధములు ఉన్నవో యథార్థముగా తెలిసికొని రండు. ఆ వానరుల సేనాపతి ఎవడు? ఆ విషయము కూడా తెలిసికొని శీఘ్రముగా రండు." అని చెప్పి పంపెను.(1–8)

రావణుడు ఈ విధముగా ఆజ్ఞాపించగా, వీరులైన శుకసారణు లను రాక్షసులు వానరరూపము ధరించి వానరసైన్యములో ప్రవేశించిరి. ఆ శుకసారణులు ఊహింప శక్యముకాని, రోమాంచజనకమైన ఆ వానరసైన్యమును లెక్కింపజాలకపోయిరి. ఆ సైన్యము పర్వతశిఖరములమీదా, కొండకాలువలలోను, గుహలలోను, సముద్రతీరప్రదేశములలోను, వనములలోను, ఉద్యానములలోను ఉండెను. కొంత సేన దాటగా మరికొంత సేన దాటుచుండెను. మరికొంత సేన దాటుటకు ప్రయత్నించుచుండెను. భయంకరమైన ధ్వని చేయుచున్న గొప్పబలము గల ఆ సేనలో కొంత భాగము ఒక పద్ధతి ప్రకారము నిలుపబడి ఉండెను. ఒక భాగము నిలుపబడుచుండెను. క్షోభింపశక్యము కాని అట్టి సేనాసముద్రమును ఆ రాక్షసు లిద్దరూ చూచిరి.(9–12)

గొప్ప తేజస్సు గల విభీషణుడు రూపాంతరములో ఉన్న శుకసారణులను ఇద్దరినీ చూచి, పట్టుకొని రామునకు– "రామా! వీళ్లిద్దరూ రావణుని మంత్రులైన శుకసారణులు. లంకనుండి గూఢచారులుగా వచ్చినారు." అని చూపెను. ఆ

రాక్షసులిద్దరూ రాముణ్ణి చూచి భయపడి బాధపడుచున్నవారై జీవితముపై నిరాశ చెంది చేతులు జోడించి- "సౌమ్యుడవైన రామా! మేము, రావణుడు పంపగా ఈ సైన్యమునంతనూ పరీక్షించి తెలిసికొనుటకు వచ్చినాము." అని చెప్పిరి. సకలప్రాణుల హితమునందు ఆసక్తి గల రాముడు ఆ ఇద్దరి మాటలు విని నవ్వుచు- "మీరు సైన్యము నంతనీ చూచినారా? మమ్ములను కూడా బాగుగా చూచినారా? మీ ప్రభువు ఆదేశించినట్లు పని పూర్తిచేసుకున్నారా? మీ పనులు పూర్తి అయినచో ఇంక స్వేచ్ఛగా తిరిగి వెళ్ళవచ్చును. ఇంకా ఏమైనా చూడకుండా మిగిలిపోయినచో దానిని మరల చూడవచ్చును. కావలసినచో విభీషణుడు అంతా మీకు పూర్తిగా మరల చూపించగలడు. ఈ విధముగా పట్టుబడినందుకు జీవితమును గూర్చి భయపడవలసిన పనిలేదు. ఆయుధములు లేని పట్టుబడ్డ దూతలను చంపగూడదు గదా? విభీషణా! ఎల్లప్పుడు శత్రుపక్షమువారిని పీడించుటకై ప్రయత్నించు, ప్రచ్ఛన్నరూపములో గూఢచారులుగా వచ్చిన ఈ రాక్షసులనిద్దరినీ విడిచిపెట్టుము. (13-21)

మీరిద్దరు లంకకు వెళ్ళి రాక్షసరాజైన రావణునితో నా మాటలు చెప్పినవి చెప్పినట్లుగా చెప్పుడు- 'నీవు ఏ బలమును చూచుకొని నా సీతను అపహరించినావో ఆ బలమును నీ సైన్యముతోను, బంధువులతోను కలసి వచ్చి, నీ ఇష్టము వచ్చినట్లు చూపుము. రేపు ప్రాతఃకాలమునందే ప్రాకారములతోను, ముఖద్వారములతోను కూడిన నీ లంకానగరమును, రాక్షససైన్యమును బాణములచేత నశింపచేయనున్నాను; చూచుకొనుము. రావణా! నేను రేపు ప్రాతఃకాలమునందే వజ్రమును ధరించిన దేవేంద్రుడు దానవులపై వజ్రమును విడచినట్లు సైన్యసహితుడవైన నీపై నా భయంకరమైన క్రోధమును విడచెదను.' అని పలికెను. (22-25)

రామునిచేత ఈ విధముగా ఆజ్ఞాపించబడిన శుకసారణులు ధర్మమునందు ప్రేమగల రాముణ్ణి "జయ విజయీ భవ" అని అభినందించి, లంక చేరి రావణునితో ఇట్లు పలికిరి- "రాక్షసరాజా! విభీషణుడు మమ్ములను పట్టుకొని చంపబోగా ధర్మాత్ముడు, గొప్ప తేజస్సు గలవాడు అయిన రాముడు చూచి విడిపించినాడు. దశరథకుమారుడైన రాముడు, శ్రీమంతుడైన లక్ష్మణుడు, విభీషణుడు, మహాతేజఃశాలి, మహేంద్రునితో సమానమైన పరాక్రమముగలవాడు అయిన సుగ్రీవుడు, లోకపాలులతో సమానులు, శూరులు, అస్త్రములందు నిపుణులు, దృఢమైన పరాక్రమము గలవారు అయిన ఈ నలుగురు పురుషశ్రేష్ఠులు కలిసినచో ఈ లంకాపట్టణమును ప్రాకారముఖద్వారాదులతో సహా పీకివేసి మరొక చోటకు

తీసికొనిపోవుటకు సమర్థులు. మిగిలిన వానరుల మాట అటుండ నిమ్ము. మిగిలిన ముగ్గురితో కూడ పనిలేదు. రాముని ఆ ఆకారము, ఆయుధములు ఎట్టివనగా అత డొక్కడే లంకాపట్టణమును నశింపచేయగలడు. రామలక్ష్మణులచేతను, సుగ్రీవునిచేతను రక్షింపబడుచున్న ఆ సేనను సమస్తమైన సురాసురులు కలిసి వచ్చినను ఎదిరించజాలరు. ఇప్పుడే యుద్ధము చేయుటకు సిద్ధముగా ఉన్న మహాత్ములైన వానరుల సేనలోని యోధు లందరూ ఉత్సాహముతో ఉన్నారు. విరోధమును విడిచి సంధి చేసికొనుము. సీతను రామునకు తిరిగి ఇచ్చివేయుము."(26-34)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది ఐదవ సర్గము సమాప్తము.

ఇరువది ఆరవ సర్గము

సారణుని మాటలు విని రావణుడు వానరసైన్యమును చూచుటకై ప్రాసాదముపైకి ఎక్కుట.

సారణుడు పలికిన యథార్థములైన, పిరికితనము లేని ఆ మాటలు విని రావణుడు సారణునితో- "దేవతలు, గంధర్వులు, దానవులు నన్ను ఎదిరించినను, సమస్తలోకములనుండి భయము వచ్చినను నేను సీతను ఇవ్వను. సౌమ్యుడా! నిన్ను వానరులు బాగా పీడించుటచేత భయపడి నీవు ఇప్పుడే సీతను ఇచ్చివేయుట మంచిదని తలచుచున్నావు. నన్ను యుద్ధములో ఏ శత్రువు ఓడించగలడు?" అని పలికెను. రావణుడు ఈ విధముగా పరుషమైన వాక్యము పలికి పిమ్మట వానరసైన్యమును చూడవలెనను అభిలాషతో మంచువలె తెల్లగా ఉన్న ఎన్నో తాటిచెట్లు ఎత్తు గల ప్రాసాదమును ఎక్కెను.(1-5)

క్రోధముతో నిండిన ఆ రావణుడు ఆ గూఢచారు లిద్దరితో కలిసి సముద్రమును, పర్వతములను, వనములను చూచుచు, ఆ భూమి అంతా వానరులతో నిండి ఉన్నట్లు గమనించెను. అతడు ఆ వానరసేనను చూచి సారణుణ్ణి- "ఈ వానరులలో ముఖ్యులు ఎవరు? శూరులు ఎవరు? మహాబలవంతులు ఎవరు? గొప్ప ఉత్సాహముతో యుద్ధములో అన్ని చోట్లా ముందుకు వచ్చువాళ్ళు ఎవరు? సుగ్రీవుడు ఎవరి మాట వినును? యూథనాయకుల నాయకులు ఎవరు? ఈ వానరుల ప్రభావ

మెట్టిది? సారణుడా! ఈ విషయమునంతా నాకు చెప్పుము." అని ప్రశ్నించెను. (6-9)

రావణుడు ఇట్లు ప్రశ్నించగా, వానరులలో ఉన్న ముఖ్యులను గూర్చి తెలిసిన సారణుడు ఆ వానరముఖ్యులను గూర్చి ఇట్లు చెప్పెను - "ఏ వానరుడు లక్షమంది వానరనాయకులు చుట్టూ ఉండగా లంకాభిముఖుడై అరచుచున్నాడో, ఎవని గొప్ప ధ్వనిచేత ప్రాకారములతోను, ముఖద్వారములతోను, శైలములతోను, వనములతోను, అరణ్యములతోను కూడిన లంక ప్రతిధ్వనించుచున్నదో అతడు నీలు డను పేరుగల వీరుడైన వానరసేనానాయకుడు. అతడు సమస్తమైన వానరులకు ప్రభువైన మహాత్ముడైన సుగ్రీవుని సైన్యము ముందు నిలచి ఉన్నాడు. పద్మము కింజల్కముల వంటి శరీరచ్ఛాయ గల, పర్వతశిఖరము వలె ఉన్న పరాక్రమవంతుడైన ఆ వానరుడు చేతులు పైకి ఎత్తి పాదాలతో నేలపై నడచుచు లంకవైపు తిరిగి కోపముతో మిక్కిలి విజృంభించుచున్నాడు. ఈతడు తోక కదల్చి చేసిన శబ్దము పదిదిక్కులందు వ్యాపించుచున్నది. అతడు సుగ్రీవుని యౌవరాజ్యమునందు అభిషిక్తుడైన యువరాజు, అంగదుడు. అతడు నిన్ను యుద్ధానికి పిలుచుచున్నాడు. ఈ అంగదుడు వాలికి తగిన పుత్రుడు. ఎల్లప్పుడు సుగ్రీవునకు ప్రేమపాత్రుడు. దేవేంద్రునికోసమై వరుణుడు పరాక్రమించి నట్లు రామునికోసమై పరాక్రమించుచున్నాడు. రాముని హితమును కోరు వేగవంతుడైన హనుమంతుడు సీతను చూచినా డనగా ఇది అంతా ఈతని బుద్ధిబలముచేతనే. పరాక్రమవంతుడైన ఈ అంగదుడు వానరనాయకుల అనేక సముదాయములను తన వెంట తీసికొని, నిన్ను తన సేనచేత మర్దించుటకై వచ్చుచున్నాడు. (10-20)

యుద్ధములో మహావీరుడైన ఈ నలుడు అంగదుని వెనుకనే గొప్ప సైన్యముతో నిలిచి ఉన్నాడు. సేతువును నిర్మించినది ఇతడే. చందనవనములో నివసించే వెయ్యికోట్ల ఎనిమిదిలక్షల ఆ వానరశ్రేష్ఠులు శరీరములు బిగబట్టి, సింహనాదము చేయుచు, గర్జించుచున్నారు. కోపముతో లేచి విజృంభించుచున్నారు. ఈ నలుణ్ణి అనుసరించి ఉన్న ఈ వానరవీరు లందరూ సహింపశక్యము కానివారు; భయంకరులు; తీవ్రమైన పరాక్రమము గలవారు; ఈ సైన్యము సహాయముతో ఈ నలుడు లంకను మర్దించుటకు అభిలషించుచున్నాడు. (21-24)

వెండివంటి తెల్లని శరీరచ్ఛాయ గలవాడు, చపలుడు, భయంకరమైన పరాక్రమము గలవాడు, బుద్ధిమంతుడు, శూరుడు, మూడు లోకములలో ప్రసిద్ధుడు అయిన శ్వేతుడను వానరుడు తొందరగా సుగ్రీవుని వద్దకు వెళ్ళి, మధ్యనుండి

వెళ్ళుటచేత వానరసేనలను పాయలుగా చీల్చివేయుచు, సైనికులకు సంతోషము కలిగించుచు మరల తన స్థానమునకు వెళ్ళుచున్నాడు. గోమతీతీరమునందు రమ్య మను పర్వత మున్నది. అనేకవిధములైన వృక్షములతో నిండిన ఆ పర్వతమునకు సంరోచన మని కూడా పేరు. కుముదుడను ఈ సేనానాయకుడు పూర్వము ఆ పర్వతప్రాంతమునందు సంచరించేవాడు. అక్కడ రాజ్యము చేసేవాడు. ఇతడు లక్షలకొలది వానరుల నాయకుడుగా ఉన్నాడు. చాల పొడవైన అతని తోకమీద ఉన్న రోమములు ఎఱ్ఱగా, పచ్చగా, తెల్లగా, చాలా తెల్లగా, ఉండి ఎగురుచు, ఎన్నో బారల పొడవుగలవై చూచుటకు భయంకరముగా ఉన్నవి. దైన్యము లేనివాడు, తీవ్రస్వభావము గలవాడు అయిన ఈ వానరుడు యుద్ధమును కోరుచున్నాడు. ఈతడే తన సేనతో లంకను మర్దించవలె నని అభిలషించుచున్నాడు.(25-30)

రాజా! కపిలవర్ణము(చామనిచాయ) పొడవైన జూలు కలిగి సింహము వలె ఉన్న ఇతడు రంభుడను సేనానాయకుడు. అక్కడ నిశ్చలముగా నిలబడి చూపులతో కాల్చివేయనున్నాడా అన్నట్లు లంకవైపే చూచుచున్నాడు. ఇతడు ఎల్లప్పుడు వింధ్య - కృష్ణగిరి - సహ్యా - సుదర్శన పర్వతములపై నివసించుచుండును. వానరులలో శ్రేష్ఠులు, భయంకరులు, తీవ్రమైన పరాక్రమము గలవారు అయిన నూట ముప్పది లక్షల వానరులు ఈతని వెంట, లంకను తమ తేజస్సుచేత నశింపచేయుటకు వచ్చుచున్నారు.(31-33)

మహారాజా! అక్కడ ఒక సేనానాయకుడు చెవులు కదుపుచు మాటిమాటికి ఆవులించుచున్నాడు. మృత్యువునుండి భయపడుటలేదు. యుద్ధభూమినుండి పారిపోడు. కోపముతో వణికిపోవుచు మరల అడ్డముగా చూచుచున్నాడు. తోక చూచుకొనుచు సింహనాదము చేయుచున్నాడు. మహాబలశాలియైన ఇతడు శరభుడు. తేజస్సుచేత, ఏమాత్రము భయములేనివాడై, ఎల్లప్పుడు రమ్యమైన సాల్వేయపర్వతముమీద నివసించుచున్నాడు. రాజా! ఈతని విహారులను పేరు గల ఒక లక్ష నలుబదివేలమంది సేనానాయకులు అందరు చాల బలము గలవారు.(34-37)

దేవతల మధ్య నున్న దేవేంద్రుని వలె వానరుల మధ్య ఉన్న ఎవడు పెద్ద మేఘము ఆకాశమును ఆవరించినట్లు ఆవరించినాడో, యుద్ధమును కోరుచున్న ఎవని సైనికులైన వానరుల ధ్వని భేరీధ్వని వలె వినబడుచున్నదో, అతడు నిత్యము యుద్ధమునందు సహింపశక్యము కాని పనసు డను సేనానాయకుడు. అతడు

పారియాత్ర మను ఉత్తమమైన పర్వతముమీద నివసించుచున్నాడు. వేరు వేరు యూథములుగా ఏర్పరుపబడిన ఏభైలక్షల సేనానాయకులు, సేనానాయకులలో శ్రేష్ఠుడైన ఇతనిని సేవించుచున్నారు.(38-41)

సముద్రతీరమునందు రెండవ సముద్రము వలె ఉన్న భయంకరమైన , కదలుచున్న సేనను ప్రకాశింపచేయుచు దర్దురపర్వతము వలె ఉన్న ఇతడు వినతు డను సేనానాయకుడు. ఇతడు నదులలో ఉత్తమమైన కృష్ణవేణానది జలమును త్రాగుచు సంచరించుచున్నాడు. ఇతని సైన్యములో అరువది లక్షల మంది వానరులు ఉన్నారు. క్రథను డను వానరుడు విక్రమవంతులు బలవంతులు అయిన వానరులను, వానరయూథములను వేరువేరుగా ఎవరు ఉండవలసిన చోట వారిని ఉంచి నిన్ను యుద్ధముకొరకు పిలుచుచున్నాడు. గైరికధాతువు వర్ణము వంటి శరీరచ్ఛాయతో ప్రకాశించుచున్న ఆ వానరుడు తేజఃశాలియైన గవయుడు. ఎల్లప్పుడు బలముచేత గర్వితుడైన ఇతడు వానరుల నందరినీ కాదని తానే నిన్ను ఎదిరించుటకు వచ్చుచున్నాడు. ఈ గవయుణ్ణి డెబ్బది లక్షల మంది వానరులు సేవించుచున్నారు. ఇతడే తన సైన్యముతో లంకను మర్దించుటకు కోరుచున్నాడు. వీరులైన ఈ యూథనాయకులు, యూథనాయకులలో శ్రేష్ఠులైన వానరులు ఎదిరింప శక్యముకానివారు. వీరిని లెక్కపెట్టుటకు కష్టము. వీరు వేరు వేరుగా యూథములుగా విభజింపబడి ఉన్నారు."(42-48)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది ఆరవ సర్గము సమాప్తము.

ఇరువది ఏడవ సర్గము

సారణుడు ఆ యా వానరవీరుల పేర్లు చెప్పుచు వారి పరాక్రమమును వర్ణించుట.

"రాముని నిమిత్తమై పరాక్రమము చూపుచు తమ జీవితమును గూర్చి కూడ లక్ష్యము లేని ఆ యూథనాయకులను గూర్చి నీకు చెప్పెదను; వారిని చూడుము. భయంకరములైన పనులు చేయు ఎవని తోకమీద నున్నగాను, ఎఱ్ఱగాను, పచ్చగాను, తెల్లగాను, బాగా తెల్లగాను ఉన్న బారెడేసి పల్చని రోమములు ప్రోగుచేసిన సూర్యకిరణముల వలె ఉన్నవో, నేలమీద కూడా ఈడ్చుకొని పోవుచున్నవో అతడు

హరుడు అను వానరుడు. సుగ్రీవుని కింకరులై, అతని ఆజ్ఞప్రకారము వచ్చిన వందలకొలది, వేలకొలది యూథనాయకులు లంకను ఆక్రమించవలెనను ఉత్సాహముతో వృక్షములను ఎత్తి ఈతని వెనుకనే వచ్చుచున్నారు.(1-4)

రాజా! నల్లని పెద్ద మేఘముల వలె, నల్లని కాటుకవలె కనబడుచున్న వాళ్ళు భల్లూకములు. వీళ్ళు యుద్ధమునందు సత్యమైన పరాక్రమముగలవారు. లెక్కింపశక్యము కానివారు. మరియొక సముద్రతీరము వలె ఇందరు అని చూపశక్యముకాని వారు. వీరిలో కొందరు పర్వతములమీదా, కొందరు సమతలపు దేశాలలోను, మరికొందరు నదులలోను నివసించుచుందురు. చాలా భయంకరులు. వీళ్ళందరూ నిన్ను ఎదిరించుటకై వచ్చుచున్నారు. మహారాజా! వీళ్ళమధ్యలో భయంకరమైన నేత్రములతో చూచువారికి భయము కలిగించుచు చుట్టూ నల్లని మేఘములున్న పర్జన్యుడు వలె ఉన్నవాడు, ధూమ్రు డను పేరు గల సకలభల్లూకములకు ప్రభువైన సేనానాయకుడు. ఇతడు నర్మదాజలమును త్రాగుచు పర్వతశ్రేష్ఠమైన ఋక్షవంతముమీద ఉండును.(5-9)

పర్వతముతో సమానుడైన అతనిని చూడుము. అతడు ధూమ్రుని తమ్ముడు. రూపమునందు సోదరునితో సమానుడు. కాని పరాక్రమమునందు అతనికంటె గొప్పవాడు. ఎన్నో భల్లూకయూథముల నాయకులకు నాయకుడైన ఇతని పేరు జాంబవంతుడు. ఇతడు పరాక్రమవంతుడు. పెద్దల విషయమున వినయము గలవాడు. యుద్ధములో ఎదుటివారిని సహించడు. ధీమంతుడైన ఈ జాంబవంతుడు దేవాసురయుద్ధమునందు దేవేంద్రునకు గొప్ప సాహాయ్యము చేసి అనేకవరములు కూడ పొందినాడు. పెద్ద శరీరము గలవారు, రాక్షసులతోను, పిశాచములతోను సమానులు, రోమములతో నిండినవారు, గొప్ప తేజస్సు గలవారు అయిన ఈతని సైనికులు సంచరించుచు పర్వతములపైకి ఎక్కి అక్కడినుండి పెద్ద మేఘములవంటి శిలలను క్రిందికి త్రోయుచుందురు. మృత్యువుకు భయపడరు.(10-14)

మహారాజా! అక్కడ ఎక్కువ కోపముతోను తొందరతోను ఎగురుచున్నట్లుగా ఆ వానరనాయకుణ్ణి వానరులందరు చూచుచున్నారు. అతడు యూథనాయకుల యూథమునకు నాయకుడైన దంభుడను సేనానాయకుడు. సైన్యముతో కూడిన ఇతడు బలముచేత దేవేంద్రునికి కూడ సాహాయ్యము చేయుచుండును. యోజనము దూరములో ఉన్న ఆ పర్వతమునకు పార్శ్వభాగముచేత ఆనుకొని యోజనము ఎత్తైన దేహముతో ఉన్నవాడు వానరుల పితామహుడైన సంనాదను డను

యూథనాయకుల యూథమునకు నాయకుడు. చతుష్పాదజంతువులలో ఇతని దేహమునకు మించిన దేహము దేనికీ ఉండదు. ధీమంతుడైన ఇతడు పూర్వము రణరంగములో దేవేంద్రునితో కూడ యుద్ధముచేసి పరాజయమును పొందలేదు. పరాక్రమించుచున్న ఇతని పరాక్రమము దేవేంద్రుని పరాక్రమమువంటిది. ఇతడు గంధర్వకన్యయందు అగ్నివలన పుట్టినాడు.(15-20)

రాక్షసరాజా! శ్రీమంతుడు, బలవంతుడు, యుద్ధములలో బడాయిని చెప్పుకొననివాడు, వానరశ్రేష్ఠుడు అయిన క్రథను దను పేరు గల ఈ యూథనాయకుడు, ఏ పర్వతముమీద కుబేరుడు జంబూవృక్షమును చేరి విహరించుచుండునో, ఏది అనేక కింనరులకు నివాసస్థలములైన పర్వతరాజులకు రాజో, ఏది నీ సోదరుడైన కుబేరునకు విహారసుఖము నిచ్చునో ఆ కైలాసపర్వతముమీద నిత్యము విహరించుచుండును. వెయ్యికోట్ల వానరులతో కూడి నిలచి ఉన్న ఈతడే తన సైన్యముచేత లంకను మర్దించవలెనని కోరుచున్నాడు. వానరయూథములకు ప్రభువు, నాయకుడూ, అయిన గర్జించుచున్న ఈ ప్రమాథి ఏనుగులకు వానరులకు మధ్య ఉన్న పూర్వవైరమును స్మరించుచు గజయూథనాయకులను భయపెట్టుచూ గంగాప్రాంతమునందు నివసించుచుండెను. పర్వతగుహలలో నివసించుచు, వృక్షములను పీడించుచు వనగజములను అడ్డుకొనుచుండెను. వానరసేనానాయకుడైన ఈ వానరశ్రేష్ఠుడు గంగానదీప్రాంతమునందు ఉశీరబీజ పర్వతమును, పర్వతశ్రేష్ఠమైన మందర పర్వతమును ఆశ్రయించి సాక్షాత్తు స్వర్గములో దేవేంద్రుడు వలె ఆనందముతో నివసించుచుండును. శక్తిచేత పరాక్రమముచేత గర్వించినవారు, బాహుబలము గలవారు, గర్జించుచున్నవారు అయిన వేయిలక్షలమంది వానరులు ఈతని వెంట ఉన్నారు. మహారాజా! ఇతడు మహాత్ముడైన వానరులకు నాయకుడు, ఎదిరింప శక్యముకానివాడు అయిన ప్రమాథి అను యూథనాయకుడు. గాలికి ఎగురుచున్న మేఘమువలె కనబడుచున్న అతడే ప్రమాథి. ఆ ప్రాంతమునందు గాలిచేత ఎగురగొట్టబడి అంతటా వ్యాపించిన ఎఱ్ఱని అధికమైన పరాగము అనేకవిధములుగా తిరుగుచున్నది. అక్కడ ఉన్న బలశాలులైన వానరుల విజృంభించుచున్న సైన్యము ఈ ప్రమాథి సైన్యమే.(21-31)

మహారాజా! నల్లని ముఖములు గల భయంకరులైన వందలక్షలమంది గోలాంగూలులు సేతువును దాటి వచ్చి తమ యూథములకు నాయకుడైన గవాక్షుడను గోలాంగూలుని చుట్టూ నిలచి, బలముతో లంకను మర్దించుటకై సింహనాదము చేయుచున్నారు.(32,33)

మహారాజా! వానరనాయకులలో ముఖ్యుడైన, కేసరి అను ఈ వానరసేనానాయకుడు, ఏ పర్వతము మీద ఉన్న, అన్ని కాలములయందు ఫలముల నిచ్చే వృక్షములు తుమ్మెదలతో నిండి ఉండునో, సూర్యుడు తన వంటి వర్ణమూ, కాంతీ గల దేనికి ప్రదక్షిణము చేయుచుండునో, దేని కాంతిచేత అక్కడనున్న మృగములు పక్షులు ఎల్లప్పుడు బంగారు కాంతితో ప్రకాశించుచుండునో, మహాత్ములైన మహర్షులు దేని చరియలు విడువరో, దేని మీద అన్ని కోరికలను తీర్చు వృక్షములన్నీ ఫలములతో నిండి ఉండునో, ఏ పర్వతశ్రేష్ఠమునందు మధువులు చాలా శ్రేష్ఠమైనవో, అట్టి రమ్యమైన మేరుపర్వతము మీద నివసించును. ఆ మేరుపర్వతప్రాంతమునందు అరువదివేల బంగారు పర్వతము లున్నవి. దోషరహితుడవైన ఓ! మహారాజా! వాటిమధ్య, రాక్షసులమధ్య నీవు వలె, ఒక పర్వతశ్రేష్ఠమున్నది. చివరి పర్వతముమీద ఈ వానరులు నివసించుచుందురు. వీరిలో కొందరు నల్లగాను, కొందరు తెల్లగాను, ఎఱ్ఱని ముఖములతోను, తేనె రంగుతోను ఉందురు. వీళ్ళు తీక్ష్ణములైన కోరలు గలవారు; గోళ్ళే వీళ్ళకు ఆయుధములు. సింహముల వలె నాలుగేసి దంతములు గల వీళ్ళు వ్యాఘ్రముల వలె సమీపింప శక్యము కానివారు. అందరూ కూడ అగ్నితో సమానులు; ప్రజ్వలించుచున్న సర్పములతో సమానులు. మదించిన ఏనుగులతో సమానులైన వీరి తోకలు చాలా దీర్ఘముగా, అందముగా ఉండును. పెద్ద పర్వతముల వంటి ఆకారములు గల ఈ వానరులు పెద్ద మేఘముల వలె గర్జించుచుందురు. వీళ్ళ నేత్రములు గుండ్రముగా, పచ్చగా ఉండును. వీరి గమనము ధ్వనీ కూడా చాలా భయంకరము. వీళ్ళు లంకాసమీపమునందు నిలచి చూపులతో నీ లంకాపట్టణమును మర్దించుచున్నారా అన్నట్లు ఉన్నారు.(34-42)

మహారాజా! శతబలి అను పేరుతో భూమియందు ప్రసిద్ధుడు, వానరుల నాయకుడు, అయిన ఇతడు వీరి మధ్య నిలబడి ఉన్నాడు. ఇతడు జయమును సంపాదింప గోరుచు నిత్యము సూర్యుని పూజించుచుండును. ఈతడొక్కడే తన సైన్యముతో కలసి వచ్చి లంకను మర్దించవలెనని అభిలషించుచున్నాడు. పరాక్రమవంతుడు, బలవంతుడు, శూరుడు, తన పురుషకారమునందే నమ్మకము గలవాడు అయిన ఈ శతబలి రామునకు ప్రియమును చేయుటకై తన ప్రాణములను కూడా లెక్కచేయడు.(43-45)

గజుడు, గవాక్షుడు, గవయుడు, నలుడు, నీలుడు, ఒక్కొక్కడు కోట్లకొలది యోధులతో కూడియున్నాడు. శీఘ్రముగా పరాక్రమమును చూపగలిగిన వింధ్యపర్వతవాసులైన వానరులు ఇంకా ఎందరో ఉన్నారు. వాళ్ళు చాలామంది

ఉండుటచేత లెక్కపెట్టుటకు శక్యముకాదు. మహారాజా! ఈ వానరులలో అందరు గొప్ప ప్రభావముగలవారే. అందరూ పెద్ద పర్వతములతో సమానమైన దేహములు గలవారే. క్షణకాలములో ఈ భూమిపై ఉన్న పర్వతములన్నింటిని ధ్వంసము చేసి చెల్లా చెదరు చేయుటకు అందరూ సమర్థులే."(46-48)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది ఏడవ సర్గము సమాప్తము.

ఇరువది ఎనిమిదవ సర్గము

శుకుడు రామ-లక్ష్మణ-హనుమత్-సుగ్రీవ-విభీషణాదులను గూర్చి చెప్పి వానరసైన్యము సంఖ్య తెలుపుట.

సారణుడు తన మాటలు పూర్తి చేసిన పిమ్మట శుకుడు ఆ సమస్త సైన్యమును జూపుచు రావణునితో ఇట్లు పలికెను. - "మహారాజా! మదించిన మహాగజములవలె, గంగాతీరమునందున్న మఱ్ఱిచెట్ల వలె, హిమవత్పర్వతముమీద ఉన్న మద్దిచెట్ల వలె నిలచి మనకు కనబడుచున్న ఈ వానరులందరూ ఎదిరింప శక్యము కానివారు. బలవంతులు. స్వేచ్ఛానుసారము రూపములు ధరించగలవారు. దైత్యులతోను, దానవులతోను సమానులు. యుద్ధములో దేవతలవంటి పరాక్రమము గలవారు. ఇరవై ఒక్క కోట్ల మంది వానరులు, వెయ్యి శంకువుల వానరులు, నూరు వృందముల వానరులు ఉన్నారు. దేవతలకు గంధర్వులకు పుట్టిన, స్వేచ్ఛానుసారముగా రూపములు ధరించగలిగిన, సుగ్రీవసచివులైన ఈ వానరులు ఎల్లప్పుడు కిష్కింధలో నివసించుచుందురు. (1-5)

దేవతలవంటి ఆకారము గల, ఒకరితో ఒకరికి చాలా పోలికలు ఉన్న ఇద్దరు అక్కడ నిలబడి యున్నారు కదా; వాళ్ళు మైంద-ద్వివిదులు. యుద్ధములో వాళ్ళతో సమానుడు లేడు. బ్రహ్మదేవుని అనుమతిచేత అమృతమును త్రాగిన ఆ ఇద్దరూ తమ తేజస్సుచేత లంకను మర్దించుటకు ఉద్యుక్తులై నట్లు కనబడుచున్నారు. (6,7)

మహారాజా! మదోదకము స్రవించుచున్న ఏనుగు వలె ఏ వానరుడు అక్కడ నిలచి యున్నాడో, ఎవడు కోపించినచో సముద్రమును కూడ క్షోభింపచేయగలడో అతడు లంకకు వచ్చి, సీతను నిన్నూ కూడ చూచిన వానరుడు. పూర్వము చూచిన ఈ వానరుడే మరల వచ్చినాడు. సముద్రమును లంఘించిన, హనుమంతు డను

పేరు గల ఇతడు కేసరికి జ్యేష్ఠపుత్రుడు. వాయుపుత్రు డని ప్రసిద్ధి చెందినవాడు. కోరిన రూపము ధరించగలిగిన ఈ వానరశ్రేష్ఠుడు గొప్ప బలము, ఆకారము గలవాడు. వాయువువలె అడ్డులేని గమనము గలవాడు. బాలుడుగా ఉన్న ఈ హనుమంతుడు ఆకలిగొని 'ఫలాదులచేత నా ఆకలి శాంతించదు, ఆహారముగా సూర్యుణ్ణి గ్రహించెదను.' అని మనస్సులో నిర్ణయించుకొని ఆకాశముమీద మూడువేల యోజనములు ఎగిరి, బలముచేత దర్పితుడై సూర్యుని వైపు వెళ్ళెనట. దేవతలు, ఋషులు, రాక్షసులూ కూడ ఏ మాత్రము ఎదిరించలేని ఆ సూర్యుని దగ్గరకు చేరకుండగానే సూర్యోదయపర్వతముపై పడిపోయెను. ఇతడు ఒక రాతిమీద పడిపోగా ఇతని గడ్డమునకు ఒక ప్రక్క కొంచెము దెబ్బతగిలెను. అందుచేత, దృఢమైన గడ్డముగల ఈతనికి హనుమంతు డని పేరు వచ్చినది. ఈ వానరుని గూర్చిన యథార్థవృత్తాంతము నాకు ఆప్తుల మాటల ద్వారా తెలిసినది. ఇతని బలముగాని, రూపము గాని, ప్రభావముగాని, పూర్తిగా వర్ణించి చెప్పుటకు శక్యము కాదు. ఈత డొక్కడే తన తేజస్సుతో, లంకను మథించుటకు కోరుచున్నాడు. నీ లంకాపట్టణములో ఈతడు అంటించిన అగ్ని ఇంకా మండుచునే ఉన్నది. అట్టి ఈ వానరుని ఎట్లు మరిచిపోయినావు?(8-17)

మహారాజా! హనుమంతునకు దగ్గరగా ఉన్న నీలదేహచ్ఛాయ గలవాడు, పద్మముతో సమానమైన నేత్రములు గలవాడు అయిన శూరుడు రాముడు. ఇతడు ఇక్ష్వాకువంశీయులలో అతిరథుడు. లోకములో ప్రసిద్ధమైన పౌరుషము గలవాడు. అతని నుండి ధర్మమెన్నడు చలించదు. అతడు ధర్మమునుండి చలించడు. వేదవేత్తలలో శ్రేష్ఠుడైన అతడు బ్రహ్మాస్త్రమును, వేదములను ఎరిగినవాడు. బాణములచేత ఆకాశమును బ్రద్దలుకొట్టగలడు. భూమిని చీల్చివేయగలడు. అతని క్రోధము మృత్యువు క్రోధమువంటిది. అతని భార్యయైన సీతనే జనస్థానమునుండి హరించి తీసికొని వచ్చినావు. అట్టి ఈ రాముడు నీతో యుద్ధము చేయుటకు ఎదురుచూచుచున్నాడు.(18-21)

పరిశుద్ధమైన బంగారమువంటి వర్ణము, విశాలమైన వక్షఃస్థలము, ఎఱ్ఱని నేత్రములు, నల్లని వంకరజుట్టు కలిగి, ఆ రాముని ప్రక్కనే ఉన్నవాడు లక్ష్మణుడు. ఇతడు తన సోదరునకు ప్రియమును, హితమును చేయుటకు ఆసక్తి గలవాడు. సకలఆయుధధారులలో శ్రేష్ఠుడైన ఇతడు నీతియందు, యుద్ధమునందూ కూడా సమర్థుడు. ఈ లక్ష్మణుడు కోపస్వభావము గలవాడు, జయింప శక్యము కానివాడు, జయము సంపాదించువాడు, బుద్ధిమంతుడు, బలవంతుడు, నిత్యము రామునకు

కుడిచేయి వంటివాడు, బైట సంచరించు ప్రాణమువంటివాడు. రామునకు సహాయము చేయవలసి వచ్చినప్పుడు ఇతడు తన ప్రాణములను కూడ రక్షించుకొనడు. ఇతడే యుద్ధములో రాక్షసుల నందరిని చంపుటకు ఉత్సాహము చూపుచున్నాడు. (22-25)

రాముని ఎడమప్రక్క నలుగురు రాక్షసుల మధ్య ఉన్నవాడు రాజైన విభీషణుడు. రాజాధిరాజైన శ్రీమంతుడైన రామునిచేత లంకారాజ్యమునకు రాజుగా అభిషిక్తుడైన ఇతడు నిన్ను గూర్చి చాల కోపము చూపుచు యుద్ధము చేయుటకై నిలచినాడు. (26,27)

ఆ వానరుల మధ్య కదల్చుటకు శక్యముకాని పర్వతము వలె నిలబడి ఉన్నవాడు సకలవానరనాయకులకు ప్రభువు, గొప్ప తేజస్సు కలవాడు అయిన సుగ్రీవుడు. హిమవత్పర్వతము, ఇతరపర్వతములను అతిశయించినట్లు ఇతడు తేజస్సుచేత, యశస్సుచేత, బుద్ధిచేత, బలముచేత, వంశముచేత ఇతరవానరులను అతిశయించి ఉన్నాడు. ఇతడు ప్రధానులైన సేనానాయకులతో కలసి అరణ్యములతోను, వృక్షములతోను నిండినది, పర్వతములపై ఉండుటచేత ప్రవేశించుటకు శక్యముకానిది, ప్రాకారాదిదుర్గములు గలది అయిన కిష్కింధ అను గుహలో నివసించుచున్నాడు. వంద పద్మములు గల మనోహరమైన ఏ బంగారు మాలయందు దేవతల లక్ష్మి, మనుష్యుల లక్ష్మి నిక్షిప్తమై ఉన్నదో అట్టి మాలను ధరించి ఉన్నాడు. రాముడు వాలిని చంపి ఈతనికి ఈ మాలను, తారను, శాశ్వతమైన వానరరాజ్యమును ఇచ్చినాడు. (28-32)

వంద లక్షలు ఒక కోటి. లక్షకోట్లు ఒక శంకువు. వెయ్యి శంకువులు మహాశంకువు. వెయ్యి మహాశంకువులు వృందము. వెయ్యి వృందములు మహావృందము. వెయ్యి మహావృందములు పద్మము. వెయ్యి పద్మములు మహాపద్మము. వెయ్యి మహాపద్మములు ఖర్వము. వెయ్యి ఖర్వములు మహాఖర్వము. వెయ్యి మహాఖర్వములు సముద్రము. వెయ్యి సముద్రములు ఓఘము. వెయ్యి ఓఘములు మహౌఘము. (33-38)

గొప్ప బలపరాక్రమములు కలవాడు, నిత్యమూ గొప్ప సైన్యముతో కూడినవాడు, వానరరాజు అయిన సుగ్రీవుడు వీరుడైన విభీషణునితోను, మంత్రులతోను కూడి యుద్ధము నిమిత్తము నీ మీదకు వచ్చుచున్నాడు. ఈతని వెంట వెయ్యికోట్లు, నూరు శంకువులు, వెయ్యి మహాశంకువులు, నూరు వృందములు, వెయ్యి మహావృందములు, నూరు పద్మములు, వెయ్యి పద్మములు, నూరు ఖర్వములు, నూరు సముద్రములు,

మహౌఘము, కోటి మహౌఘములు సంఖ్య గల సముద్రముతో సమానమైన వానరసైన్యము ఉన్నది. మహారాజా! ప్రజ్వలించుచున్న గ్రహములతో సమానమైన, వచ్చి ఉన్న ఈ వానరసేనను చూచి, మనకు జయము కలుగునట్లు పరులనుండి పరాభవము కలుగకుండునట్లు చేయుము."(39-44)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది ఎనిమిదవ సర్గము సమాప్తము.

ఇరువది తొమ్మిదవ సర్గము

రావణుడు శుకసారణులను నిందించి పంపివేయుట; అతడు గూఢచారులను పంపగా రాముని అనుగ్రహముచేత వాళ్ళు బైటపడి తిరిగి వచ్చుట.

రావణుడు శుకునిచేత చూపబడిన లక్ష్మణుణ్ణి, రాముని దగ్గరనే ఉన్న తన సోదరుడైన విభీషణుణ్ణి, సమస్తవానరులకు రాజైన భయంకరమైన పరాక్రమము గల సుగ్రీవుణ్ణి, బలవంతుడు, వాలి కుమారుడూ అయిన అంగదుణ్ణి, పరాక్రమశాలియైన హనుమంతుణ్ణి, జయింప శక్యము కాని జాంబవంతుణ్ణి, సుషేణ-కుముద-నీల-నల-గజ-గవాక్ష-శరభ -మైంద-ద్వివిదులను చూచి కొంచెము మనస్సులో దిగులు చెంది, కోపముతో (చెప్పవలసిన) మాటలన్నీ చెప్పిన తరువాత వీరులైన ఆ శుకసారణులను భయపెట్టెను.(1-5)

నమస్కరించి తలలు క్రిందికి వంచి నిలచిన ఆ శుకసారణులతో రోషముచేత గద్గదమైన వాక్కుతో, తొందరగా పరుషముగా ఇట్లు పలికెను– "ప్రభువును ఆశ్రయించి జీవించే అనుచరులు నిగ్రహానుగ్రహసమర్థుడైన రాజు ఎదుట అతనికి అప్రియమైన మాటలు చెప్పుట యుక్తము కాదు. మీరిద్దరూ ఈ విధముగా, ఏ సందర్భము లేకపోయినను, యుద్ధమునకై వచ్చిన ప్రతికూలులైన శత్రువులను స్తుతించుచు మాటలాడుట యుక్తమా? మీరిద్దరూ చేసిన ఆచార్యుల, గురువుల, వృద్ధుల సేవ వ్యర్థము; ఎందుచేతననగా మీరు గ్రహించవలసిన రాజనీతిశాస్త్రముల సారమును గ్రహించలేదు. లేదా శాస్త్రములను గ్రహించి కూడ మీరు అర్థముచేసికొనలేదా! లేదా అజ్ఞానభారమును మోయుచున్నారా? మూర్ఖులైన ఇలాంటి సచివులతో నేను జీవించి ఉన్నాననగా అది కేవలము నా అదృష్టమే. నాలుక కదిపినంతమాత్రముచేతనే(మాటమాత్రము చేతనే) శుభాశుభములను ఇవ్వగలిగిన

శాసకుడ నైన నా ఎదుట ఇట్టి పరుషవాక్యమును పలుకుటకు మీకు మృత్యువునుండి భయము కలుగలేదా? వనములో అగ్నిస్పర్శ కలిగినను వృక్షములు జీవించవచ్చునేమో గాని రాజదండముచేత స్పృశింపబడిన అపరాధులు మాత్రము జీవించరు. మీరు నాకు పూర్వము చేసిన ఉపకారములచేత నా కోపము తగ్గి ఉండకపోయినచో నేను శత్రుపక్షమును ప్రశంసించుచున్న ఈ పాపాత్ములను మిమ్ములను, చంపి ఉండెడివాడిని. నా ఎదుటినుండి దూరముగా పొండి; కనబడకండి. మీరు పూర్వము చేసిన ఉపకారములను స్మరించుటచేత మిమ్ములను చంపుటలేదు. నామీద స్నేహము లేని కృతఘ్నులైన మీ ఇద్దరూ చచ్చినట్లే."(6-14)

రావణునిచేత ఈ విధముగా నిందింపబడిన శుకసారణులు సిగ్గుపడుచు రావణుని చూచి జయశబ్దము పలికి వెళ్ళిపోయిరి. రావణుడు దగ్గరనే ఉన్న మహోదరునితో- "గూఢచారులను వెంటనే నావద్దకు తీసికొని రమ్ము." అని పలికెను. మహోదరుడు వెంటనే గూఢచారులను ఆజ్ఞాపించెను. పిమ్మట గూఢచారులు రాజాజ్ఞచేత తొందరగా వచ్చి, అంజలి ఘటించి, "జయ విజయీ భవ" అను ఆశీర్వాదవాక్యము పలుకుచు సమీపించిరి. పిమ్మట రాక్షసరాజైన రావణుడు విశ్వాసపాత్రులు, శూరులు, ధీరులు, భయము లేని వారు అయిన ఆ గూఢచారులతో- "రాముడు ఎట్టి ప్రయత్నములు చేయుచున్నాడో, అతనికి ఆలోచనలలో ఎవరు ఆంతరంగికులో, ప్రేమచేత ఎవరు అతని పక్షమునందు ఉన్నారో పరీక్షించుటకై ఇక్కడి నుండి బయలుదేరి వెళ్ళుడు. రాముడు ఎట్లు నిద్రపోవుచున్నాడో, ఎట్లు మేలుకొనుచున్నాడో, ఇప్పుడు ఏమి చేయనున్నాడో అన్ని విషయములు పూర్తిగా నేర్పుతో తెలిసికొని రావలెను. బుద్ధిమంతులైన రాజు చారుల ద్వారా శత్రువును గూర్చి తెలుసుకొన్నచో అతనిని యుద్ధములో స్వల్పప్రయత్నముచేతనే ఓడించవచ్చును." అని చెప్పెను.(15-22)

ఆ గూఢచారులు సంతోషించుచు అట్లే చేసెదము అని పలికి శార్దూలుణ్ణి ముందు ఉంచుకొని ఆ రాక్షసరాజుకు ప్రదక్షిణము చేసి, లక్ష్మణసహితుడైన రాముడున్న ప్రదేశమునకు వెళ్ళిరి. వాళ్ళు రహస్యముగా వెళ్ళి సువేలపర్వతముదగ్గర సుగ్రీవవిభీషణులతో కలసి ఉన్న రామలక్ష్మణులను చూచిరి. ఆ రాక్షసులు ఆ సైన్యమును చూడగానే భయముచేత వ్యాకులులైరి. ఇంతలో ధర్మాత్ముడైన విభీషణుడు వాళ్ళను చూచెను. దైవవశముచేత విభీషణుని దగ్గరకు వెళ్ళిన వాళ్ళను విభీషణుడు భయపెట్టి, "ఈ రాక్షసుడు పాపాత్ముడు."అని చెప్పి శార్దూలుణ్ణి బంధింపచేసెను. శార్దూలుణ్ణి వానరులు చంపుచుండగా రాముడు విడిపించెను. క్రూరస్వభావము

లేని ఆ రాముడు ఇతర రాక్షసులను కూడ విడిపించెను. ఆ వానరులు పరాక్రమించి ఆ రాక్షసులను పీడించగా వాళ్ళు నష్టమైన మనస్సులతో(స్పృహ కోల్పోయి) నిట్టూర్పుచు మరల లంక చేరిరి. గూఢచారులుగా ఎల్లప్పుడు బైట తిరుగుచుండు మహాబలవంతులైన ఆ రాక్షసులు రావణుని వద్దకు వెళ్ళి రాముని సైన్యము సువేలపర్వతము దగ్గర ఉన్నది అని తెలిపిరి.(23-30)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఇరువది తొమ్మిదవ సర్గము సమాప్తము.

ముప్పదవ సర్గము

శార్దూలుడు వానరసైన్యములో ఉన్న ప్రముఖవీరులను గూర్చి రావణునకు చెప్పుట.

"క్షోభింప శక్యము కాని సైన్యముతో రాముడు సువేలపర్వతముమీద నిలచి ఉన్నాడు" అని ఆ గూఢచారులు రావణునకు తెలిపిరి. మహాబలశాలియైన రాముడు వచ్చి ఉన్నాడని గూఢచారులనుండి వినగానే రావణునకు కొంచెము దిగులు పుట్టెను. అతడు శార్దూలునితో- "శార్దూలా! నీ శరీరచ్ఛాయ మామూలుగా లేదు. దీనుడవుగా కూడ కనబడుచున్నావు. కోపించిన శత్రువులకు నీవు పట్టుబడలేదు కద!" అని ప్రశ్నించెను.(1-3)

రావణుడు ఈ విధముగా ప్రశ్నించగా భయముచేత వ్యాకులుడై ఉన్న ఆ శార్దూలుడు మెల్లగా అతనితో- "రాజా! విక్రమవంతులు, బలవంతులు, రాముని రక్షణలో కూడ ఉన్నవారూ అయిన ఆ వానరశ్రేష్ఠులను గూఢచారుల ద్వారా పరీక్షించుట శక్యము కాదు. వాళ్ళతో మాటలాడుటకు కూడ శక్యము కాదు. వాళ్ళను ప్రశ్నించే అవకాశమే లేదు. పర్వతములవంటి వానరులు మార్గమునంతను అన్నివైపులా రక్షించుచున్నారు. నేను సైన్యములో ప్రవేశించగానే, ఇంకను సైన్యమును పరీక్షించకుండగానే, నన్ను వాళ్ళు గుర్తించిరి. విభీషణుని అమాత్యులైన రాక్షసులు నన్ను బలాత్కారముగా పట్టుకొనిరి. నన్ను వాళ్ళు అనేక విధముల పరీక్షించిరి. కోపముతో ఆ వానరులు నన్ను మోకాళ్ళతోను, పిడికిళ్ళతోను, దంతములతోను, అరచేతులతోను మిక్కిలి పీడించి సైన్యము మధ్య ఊరేగించిరి. వాళ్ళు ఆ విధముగా నన్ను ఊరేగించి రాముని దగ్గరకు తీసికొనివెళ్ళిరి. నా శరీరమంతా రక్తముతో

పూయబడి ఉండెను. వ్యాకులుడనైన నా ఇంద్రియములు చలించిపోయెను. వానరులు ఆ విధముగా నన్ను పీడించుచుండగా నేను అంజలి ఘటించి రాముణ్ణి ప్రార్థించితిని. రాముడు నన్ను రక్షించుటచేత ఎటులనో జీవించి ఉన్నాను.(4-10)

ఈ రాముడు శిలలచేత, పర్వతములచేత సముద్రమును నింపి ఆయుధములను ధరించి లంక ద్వారము వద్ద ఉన్నాడు. రాముడు నన్ను విడిపింపచేసి, గరుడవ్యూహముగా ఏర్పడిన వానరులు నలువైపులా కూడా అనుసరించుచుండగా లంకవైపే వచ్చుచున్నాడు. రాముడు ప్రాకారము వరకూ వచ్చేలోగా ఏదో ఒకటి చేయుము. వెంటనే సీతనైనా ఇచ్చివేయుము, లేదా యుద్ధము చేయుము." అని చెప్పెను.(11-13)

రాక్షసాధిపుడైన ఆ రావణుడు ఆ వాక్యమును విని, మనస్సుచేత ఆ పరిస్థితిని ఊహించుకొని శార్దూలునితో ఇట్లు పలికెను. "నాకు సర్వలోకముల నుండి భయము కలిగినను, దేవతలు, గంధర్వులు, దానవులు నాకు ఎదురుగా నిలచి యుద్ధము చేసినను సీతను ఇవ్వను." మహాతేజఃశాలియైన రావణుడు ఇట్లు పలికి - "నీవు వానరసైన్యమును పరీక్షించితివి కదా? ఈ సైన్యములో శూరులైన వానరులు ఎవరు? సద్గుణవంతుడవైన ఓ! సౌమ్యుడా! ఎదిరింప శక్యము కాని ఏ వానరు లున్నారో వాళ్ళు ఎట్టి కాంతి గలవారు? ఎట్టివారు? ఎవరి పుత్రులు? ఎవరి పౌత్రులు? నీ వీ విషయము చెప్పుము. వాళ్ళ బలాబలములను తెలిసికొని ఏమి చేయవలెనో నిర్ణయించెదను. యుద్ధమునకై వచ్చినవారిని తప్పక లెక్కపెట్టవలెను కదా?" అని మరల అడిగెను.(14-18)

ఉత్తమగూఢచారియైన శార్దూలుడు రావణుని మాటలు విని, అతని సమక్షమున ఇట్లు పలుకుటకు ఉపక్రమించి- "ఇతడు ఋక్షరజస్సు పుత్రుడు, యుద్ధములో జయింప శక్యము కానివాడు అయిన సుగ్రీవుడు. గద్గదుని పుత్రుడు ప్రసిద్ధుడు అయిన జాంబవంతుడు ఇక్కడ ఉన్నాడు. ఇతడు గద్గదుని మరియొక కుమారుడైన ధూమ్రుడు. ఇతడు బృహస్పతి పుత్రుడైన కేసరి. ఈ కేసరి పుత్రుడైన హనుమంతుడే ఒంటరిగా రాక్షసులను సంహరించినాడు. రాజా! యమధర్మరాజు కుమారుడు, ధర్మాత్ముడు, పరాక్రమవంతుడు అయిన సుషేణుడు, చంద్రుని కుమారుడు, సౌమ్యుడు అయిన దధిముఖుడు ఇక్కడ ఉన్నారు. సుముఖుడు, దుర్ముఖుడు, వేగదర్శి అను ఈ వానరులు బ్రహ్మదేవుడు వానరరూపములో సృజించిన మృత్యువే(లేదా మృత్యుదేవత కుమారులు). స్వయముగా సేనాధిపతిగా ఉన్న అగ్నిపుత్రుడైన నీలుడు, హనుమంతు డని ప్రసిద్ధి చెందిన వాయుకుమారుడు ఇక్కడ ఉన్నారు. దేవేంద్రుని

పౌత్రుడు, ఎదిరింప శక్యము కానివాడు, బలవంతుడు, యువకుడు అయిన అంగదుడు, అశ్వినీదేవతల కుమారులైన మైందద్వివిదులు, గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు అను ప్రలయకాల మృత్యుదేవతలతో సమానులైన యముని పుత్రులు ఐదుగురు, యుద్ధముచేయుటకై ఉత్సాహపడుచున్న శూరులైన కోట్ల కొలది వానరులు ఇక్కడ ఉన్నారు. ఇంక మిగిలిన శ్రీమంతులైన దేవపుత్రులను గూర్చి నేను చెప్పజాలను. (19-27)

సింహము అవయవనిర్మాణమువంటి అవయవనిర్మాణము గల ఈ యువకుడు దూషణుణ్ణి, ఖరుణ్ణి, త్రిశిరస్కుణ్ణి చంపిన, దశరథకుమారుడైన రాముడు. విరాధుణ్ణీ, యమునివంటి కబంధుణ్ణీ చంపిన రామునివంటి పరాక్రమము గలవాడు ఎవడూ ఈ లోకములో లేడు. జనస్థానములో ఉన్న అందరు రాక్షసులను చంపిన రాముని గుణములను చెప్పగలిగినవా డెవ్వడూ ఈ లోకములో లేడు.(28-30)

ఎవని బాణముల దారిలోనికి వచ్చినచో దేవేంద్రుడు కూడ జీవించజాలడో, అట్టి ధర్మాత్ముడైన శ్రేష్ఠమైన గజమువలె ఉన్న లక్ష్మణుడు కూడ ఇక్కడ ఉన్నాడు. సూర్యుని కుమారులైన శ్వేత-జ్యోతిర్ముఖులు, వరుణుని కుమారుడైన హేమకూటుడు, విశ్వకర్మ కుమారుడు, వీరుడూ అయిన నీలు డను వానరశ్రేష్ఠుడు, వసువుల కుమారుడు, విక్రమము కలవాడు, వేగవంతుడు అయిన దుర్ధరుడు ఇక్కడ ఉన్నారు. రాక్షసులలో శ్రేష్ఠుడు, నీ సోదరుడూ అయిన విభీషణుడు రాముని హితమును కోరుచు లంకను ముట్టడించి నిలచి ఉన్నాడు. సువేల పర్వతమునందున్న వానరసైన్యమునంతనూ గూర్చి నీకు వర్ణించి చెప్పినాను. ఇటుపై ఏమి చేయవలెనో నీవే నిర్ణయించవలెను." అని చెప్పెను.(31-35)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పదవ సర్గము సమాప్తము

ముప్పది ఒకటవ సర్గము

రావణుడు రాముని మాయాశిరస్సు తీసికొనివచ్చి సీతకు చూపి ఆమెకు దుఃఖము కలిగించుట.

పిమ్మట, క్షోభింపశక్యముకాని సైన్యము గల రాముడు లంకలో సువేలపర్వతముమీద నిలచి ఉన్నట్లు రావణుని గూఢచారులు అతనికి తెలిపిరి. రాముడు గొప్ప సైన్యముతో వచ్చి ఉన్నాడని రావణుడు గూఢచారుల ద్వారా తెలిసికొని, కొంచెము దిగులుచెంది అనుచరులతో- "మాకు ఆలోచన చేయు సమయము వచ్చినది. అందుచేత మంత్రులైన రాక్షసు లందరు సావధానచిత్తులై వెంటనే వచ్చెదరుగాక." అనెను. అతని ఆజ్ఞ ప్రకారము మంత్రులు శీఘ్రముగా వచ్చిరి. పిమ్మట అతడు సచివులైన రాక్షసులతో తరువాత చేయవలసినదానిని గూర్చి ఆలోచించి, ఆ మంత్రులను పంపివేసి, తన ఇంటిలో ప్రవేశించెను. (1-5)

పిమ్మట, గొప్ప మాయలు గల ఆ రావణుడు మాయలు తెలిసిన, మహాబలవంతుడైన విద్యుజ్జిహ్వుని వెంట బెట్టుకొని సీత ఉన్న చోటుకు వెళ్ళెను. అతడు మాయలు తెలిసిన ఆ విద్యుజ్జిహ్వునితో - "జనకుని కూతురైన సీతను మాయచేత మోహింపచేసెదము. రాముని శిరస్సును, అతని ధనుర్బాణములను మాయచేత నిర్మించి, నా వద్దకు తీసికొని రమ్ము." అని పలికెను. రావణుని మాటలు విని విద్యుజ్జిహ్వుడు "అట్లే చేసెదను." అని పలికి తాను బాగుగా చేసిన మాయను రావణునకు చూపెను. రావణుడు సంతోషించి అతనికి ఒక ఆభరణమును బహూకరించి సీతను చూడవలె నను కోరికతో అశోకవనములో ప్రవేశించి, అక్కడ నేలపై కూర్చొని ఉన్న దీనురాలైన సీతను చూచెను. దైన్యమునకు తగని ఆమె శోకాక్రాంతురాలై, ముఖము క్రిందికి వ్రాల్చి కూర్చుండి భర్తను మాత్రమే ధ్యానించుచుండెను. (6-11)

భయంకరముగా ఉన్న రాక్షసస్త్రీలు సీత సమీపమునందే కూర్చుండి ఆమెను రక్షించుచుండిరి. అట్టి సీతను సమీపించి రావణుడు సంతోషవార్త చెప్పుచున్నట్లు మాటలాడుచు ధార్ష్ట్యముతో కూడిన మాటలు పలికెను. (12, 13)

"ఓ! సీతా! నేను ఎంత బ్రతిమాలినను ఎవని అండ చూచుకొని నీవు నన్ను అనాదరము చేసినావో, ఆ ఖరసంహారకుడైన, నీ భర్త, రాముడు రణములో చంపివేయబడినాడు. అన్ని విధాలా నీ మూలమును ఛేదించి నీ గర్వమును అణచివేసినాను. ఈవిధముగా వ్యసనములో చిక్కుకున్న నీవు నా భార్యవు అగుము.



మూఢురాలా! ఇంక తెలివి తక్కువ ఆలోచనలు వదిలిపెట్టుము. చచ్చినవానితో ఏమి చేసెదవు? ఓ! మంగళప్రదురాలా! నా అందరి భార్యలమీదా ఆధిపత్యము పొందుము. భయంకరమైన వృత్రాసురవధవంటి నీ భర్త వధను గూర్చి వినుము. రాముడు సుగ్రీవునిచేత నడుపబడిన గొప్ప సైన్యముతో కూడి నన్ను చంపుటకై సముద్రము దాకా వచ్చినాడట. పిమ్మట రాముడు సూర్యాస్తమయమునందు గొప్ప సైన్యముతో సముద్రతీరమున విడిదిచేసి ఉండెను. మార్గమునందు బాగా అలసి అర్ధరాత్రియందు నిద్రించి ఉన్న ఆ సైన్యమును ముందుగా నా గూఢచారులు బాగుగా పరీక్షించిరి. ప్రహస్తునిచేత నడిపింపబడిన నా గొప్ప సైన్యము రామలక్ష్మణులు ఉన్న ప్రదేశమునందే, రాత్రియందు రాముని గొప్ప సైన్యమును చంపివేసెను. రాక్షసులు పట్టిశములు, పరిఘలు, చిన్న చక్రములు, పెద్ద చక్రములు, ఋష్టులు, దండములు, గొప్ప ఇతర ఆయుధములు, బాణములు, శూలములు, మెరయుచున్న ముద్గరములు, యష్టులు, తోమరములు, ప్రాసలు, ముసలములు ఎత్తి ఎత్తి వానరులమీద పడవేసి వాళ్ళను సంహరించిరి. (14-23)

పిమ్మట హింసించే స్వభావము గలవాడు, మంచి నేర్పరి అయిన ప్రహస్తుడు నిద్రపోవుచున్న రాముని శిరస్సును గొప్ప ఖడ్గముచేత, ఎట్టి అడ్డంకులు లేకుండగా, నరికివేసెను. దైవవశముచేత రాక్షసులు ఎగిరి ఆక్రమించి విభీషణుని కూడ పట్టుకొనిరి. లక్ష్మణుడు ఇతరవానరులతో కూడా దిక్కులు పట్టి పారిపోయినాడు. వానరరాజైన సుగ్రీవుని కంఠమును రాక్షసులు విరిచివేసిరి. హనుమంతుని గడ్డమును పగులగొట్టి చంపిరి. యుద్ధములో మోకాళ్ళమీద పైకిలేచిన జాంబవంతుడు చంపబడినాడు. అనేకమైన పట్టిశములచేత భేదింపబడి వృక్షము వలె క్రింద

పడగొట్టబడినాడు. ఎత్తైన శరీరములు గలవారు, శత్రువినాశకులు అయిన మైందద్వివిదు లను వానరశ్రేష్ఠులు, నిట్టూర్చుచు, రక్తముతో తడిసి, ఏడ్చుచుండగా నడుముల దగ్గరకు నరకబడిరి. పనసుడు కోసిన పనసచెట్టువలె నేలపై బడి ఏడ్చుచున్నాడు. దరీముఖుడు అనేక నారాచబాణములచేత ఛేదింపబడి గుహలో పడిఉన్నాడు. గొప్ప తేజస్సు గల కుముదుడు అరచుచుండగా బాణముల చేత చంపబడినాడు. రాక్షసులు చేరి అనేక బాణములచేత ఛేదించగా అంగదుడు, తన అంగదములు నేలమీద పడిపోగా, రక్తమును స్రవించుచు పడి ఉన్నాడు. అక్కడ నిద్రపోవుచున్న ఇతరవానరులను ఏనుగులు, రథములు, మేఘములను వాయువేగములు వలె మర్దించుచున్నవి. మరికొందరు వానరులు, ఏనుగులను సింహములువలె, రాక్షసులు వెనుకనుండి తరుముతూ వచ్చి కొట్టుచుండగా భయపడి పారిపోయిరి. కొందరు వానరులు సముద్రములో పడిపోగా మరి కొందరు ఆకాశముమీదికి ఎగిరిపోయిరి. కొందరు వానరులు, భల్లూకములు చెట్లపైకి ఎక్కినవి. చాలామంది వానరులను వికృతములైన నేత్రములు గల రాక్షసులు సముద్రతీరప్రదేశములయందు, పర్వతములయందు, ఉపవనములందు చంపివేసిరి. ఈ విధముగా నా సైన్యము నీ భర్తను అతని సేనను చంపివేసినది. రక్తముతో తడిసిన అతని శిరస్సు తీసుకొనివచ్చితిని."(24-37)

పిమ్మట రావణుడు సీత వినుచుండగా ఒక రాక్షసిని, "క్రూరకర్మ లాచరించు రాక్షసుడైన ఏ విద్యుజ్జిహ్వుడు రాముని శిరస్సును యుద్ధరంగమునుండి స్వయముగా తీసికొని వచ్చినాడో అతనిని ఇక్కడికి తీసికొనిరమ్ము." అని ఆజ్ఞాపించెను. (38,39)

అప్పుడు విద్యుజ్జిహ్వుడు ఆ శిరస్సును, ధనుస్సును తీసికొనివచ్చి, తలవంచి నమస్కరించి రావణుని ఎదుట నిలచెను. పిమ్మట రావణుడు తన దగ్గర సంచరించువాడు(అంతరంగిక సేవకుడు), పెద్ద నాలుక గలవాడు, రాక్షసుడూ అయిన అక్కడ నిలచి ఉన్న విద్యుజ్జిహ్వుని- "రాముని శిరస్సును శీఘ్రముగా సీత ఎదుట ఉంచుము. దీనురాలైన ఈమె భర్తకు కలిగిన అంత్యావస్థను బాగా చూచుగాక." అని ఆదేశించెను. (40-42)

రావణుని మాటలు విని ఆ రాక్షసుడు చూచుటకు అందముగా ఉన్న ఆ శిరస్సును సీత దగ్గర ఉంచి, వెంటనే అంతర్ధానము చెందెను. "ఇది మూడు లోకములలో ప్రసిద్ధమైన రాముని ధనుస్సు." అని పలుకుచు రావణుడు ప్రకాశించుచున్న ఆ ధనస్సును సీత ఎదుటకు పడవేసెను. "నారి కట్టిన నీ రాముని ధనుస్సు ఇదే. రాత్రి ఆ మానవుణ్ణి చంపివేసి ప్రహస్తుడు ఇక్కడికి తీసికొని వచ్చినాడు."

అని అనుచు, విద్యుజ్జిహ్వునితో కూడిన ఆ రావణుడు, రాముని శిరస్సును, ధనుస్సును జనకరాజపుత్రి, కీర్తిమంతురాలు అయిన సీత ఎదుట పడవేసి, "నీవు నాకు వశురాలవు అగుము." అని ఆమెతో పలికెను.(43-46)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది ఒకటవ సర్గము సమాప్తము.

ముప్పది రెండవ సర్గము

రాముని శిరస్సును చూచి సీత విలపించుట; ఇంతలో ఎవరో వచ్చి ఏమో చెప్పగా రావణుడు వెళ్ళిపోవుట.

సీత ఆ శిరస్సును, ఉత్తమమైన ఆ ధనుస్సును చూచెను. పూర్వము హనుమంతుడు చెప్పిన రామసుగ్రీవుల సఖ్యమును స్మరించి ఆ సుగ్రీవాదుల విషయమే ఈ రావణుడు చెప్పుచుండుట గమనించెను. భర్త నేత్రములు, ముఖము, ముఖవర్ణము, కేశములు, లలాటప్రదేశము, సుందరమైన చూడామణి మొదలైన గుర్తులచేత ఆ శిరస్సు రామునిదే అని గుర్తించి దుఃఖాక్రాంతురాలై గోరింకవలె ఏడ్చుచు ఈ ఆపదకు కారణమైన కైకేయిని నిందించెను- "కైకేయీ! నీ కోరిక తీరినది. వంశమును ఆనందింపచేయు ఈ రాముడు చంపబడినాడు. కలహశీలురాలైన నీవు కులము నంతను నశింపచేసినావు. పూజ్యుడైన ఈ రామునకు నారచీరలు ఇచ్చి నాతో కూడ అరణ్యమునకు పంపివేసినావు కదా; ఈతడు నీకేమి అపకారము చేసినాడు?" బాల, దీనురాలు అయిన సీత ఇట్లు పలుకుచు, వణికిపోవుచు, తెగగొట్టిన అరటిచెట్టు వలె నేలమీద పడిపోయెను.(1-6)

విశాలమైన నేత్రములు గల సీత ముహూర్తకాలములో ఊరడిల్లి, స్పృహ చెంది, ఆ శిరస్సు దగ్గరకు వెళ్ళి విలపించెను- "అయ్యో! గొప్ప బాహువులు గలవాడా! వీరుల వ్రతమును పరిపాలించువాడా! నేను చచ్చితిని! నీ చివరి అవస్థను చూడవలసివచ్చినది! విధవను అయితిని! భార్య దోషమువలననే భర్త ముందు మరణించునని చెప్పుదురు. మంచి నడవడిక గల నీవు నేనింకా జీవించి ఉండగానే, నాకంటే ముందు మరణించినావు. గొప్ప దుఃఖమును పొంది శోకసాగరములో మునిగి ఉన్న నన్ను రక్షించుటకై ప్రయత్నించిన నీవు చంపబడితివి కదా! రామా! తన లేగగూడమీద చాలా ప్రేమగల ఆవువంటిదైన నా అత్త కౌసల్యకు,

ఆ ఆవుకు లేగదూడ లేకుండా చేసినట్లు, పుత్రుడవైన నీవు లేకుండా చేసినారు. నీవు దీర్ఘాయుర్దాయము కలవాడ వని జ్యోతిష్కులు కూడ చెప్పినారు. కాని వాళ్ళ మాట అసత్యమైనది. నీవు అల్పాయుర్దాయవంతుడవు అయినావు. లేదా చాలా బుద్ధిమంతుడవే అయినను నీ బుద్ధి నశించి ఉండును; అందుచేతనే నీవు నిద్రావశుడవై మృతిచెందితివి. సకలభూతములకు కారణమైన కాలము నిన్ను కూడ కర్మవిపాకము పొందించినది! నీతి శాస్త్రము బాగా తెలిసిన నీవు తెలియకుండా (నిద్రలో) ఎట్లు మృత్యువు పొందినావు! ఉపాయములు ఎరిగిన నీవు కష్టములను దాటుటకు సమర్థుడవు కదా? పద్మముల వంటి నేత్రములు గల ఓ రామా! భయంకరురాలు, చాల క్రూరురాలూ అయిన కాళరాత్రి(మృత్యుదేవత) నిన్ను ఆ విధముగా కౌగిలించుకొని నా నుండి లాగికొని పోయినది. ఓ! పురుషశ్రేష్ఠుడా! నన్ను విడచి, భూమిని ప్రియురాలినివలె కౌగిలించుకొని ఇక్కడ శయనించి ఉన్నావు. వీరుడా! ఇది బంగారముచేత అలంకరింపబడినది, నాకు ఇష్టమూ అయిన నీ ధనుస్సు. దీనిని నీవు నాతో కలసి ఎల్లప్పుడు గంధముతోను, పుష్పమాలలతోనూ పూజించుచుండెడివాడవు. (7-17)

దోషములు లేని రామా! నీవు స్వర్గమునందు నా మామగారు నీ తండ్రి అయిన దశరథునితోను, అందరు పితృదేవతలతోను కలిసికొని ఉందువు. నీవు స్వర్గలోకమునంతను నక్షత్రమువలె ప్రకాశింపజేయు గొప్ప కర్మ చేసినావు. నీవు పుణ్యమైన నీ రాజర్షివంశమును ఉపేక్షించి వెళ్ళిపోయినావు. రాజా! బాలుడుగా ఉన్న నీవు బాలురాలనై ఉండగా నన్ను భార్యగా స్వీకరించితివి. నీతో కూడా ఉండే నన్ను ఎందుకు చూచుటలేదు? ఎందువలన బదులు చెప్పుట లేదు? రామా! వివాహసమయమునందు నీవు చెప్పిన 'నీతో కలిసియే సంచరించెదను. ధర్మాచరణాదికము చేసెదను.' అను ప్రతిజ్ఞ స్మరించుము. దుఃఖితురాలనైన నన్ను కూడా తీసికొని వెళ్ళుము. సకల జీవులలో శ్రేష్ఠుడవైన రామా! నన్ను విడచి నీవు ఎందుకు వెళ్ళిపోయినావు? దుఃఖించుచున్నను నన్ను విడచి ఈ లోకమునుండి పరలోకమునకు ఎందుకు వెళ్ళిపోయినావు? మంగళప్రదములైన అలంకారాదులచేత అలంకరింపబడిన ఏ శరీరమును నేను కౌగిలించుకొనుచుండెడి దాననో ఆ శరీరమునే మాంసభక్షకములైన జంతువులు భక్షించుచున్నవి కదా! ముందు ముందు పరిపూర్ణదక్షిణలు ఇచ్చిన అగ్నిష్టోమాదియాగములు చేసి యజ్ఞియాగ్ని చేత సంస్కారము పొందవలసిన నీవు అట్టి సంస్కారమును పొందకుండా మరణించినావేమి? దుఃఖాక్రాంతురాలైన కౌసల్య ప్రవాసమునకు వెళ్ళిన ముగ్గురిలో తిరిగి వచ్చిన ఒక్క

లక్ష్మణుణ్ణి మాత్రమే చూడగలదు. అతడు కౌసల్య అడుగగా రాత్రియందు రాక్షసులు నీ మిత్రసైన్యమును, నిన్ను వధించినారని తప్పక చెప్పును. రామా! నీవు నిద్రించుచుండగా చంపబడినట్లు, నేను రాక్షసగృహములో ఉన్నట్లు వినగానే గుండె బ్రద్దలైపోయి ఆమె జీవించదు.(18-27)

దోషములు లేనివాడు, రాజకుమారుడు, పరాక్రమవంతుడు అయిన రాముడు చెడ్డదాననైన నా నిమిత్తమై సముద్రమును దాటి గోష్పదములో మరణించినాడు. దశరథకుమారుడైన రాముడు నా కులమునే అపవిత్రము చేసిన నన్ను వివాహమాడినాడు! ఆర్యపుత్రుడైన రామునకు భార్యయే మృత్యుదేవత అయినది. అతిథుల నందరినీ సత్కరించు రాముని భార్యనై ఉండి కూడ నేను ఇక్కడ, ఇప్పుడు ఈ విధముగా దుఃఖించుచున్నా ననగా నేను నిజముగా పూర్వజన్మలో ఎవరో చేయుచున్న ఉత్తమమైన కన్యాదానమునకు అడ్డుతగిలి ఉందును. రావణుడా! నన్ను కూడా వెంటనే రామునిపై పడవేయించి చంపించుము. భర్తను భార్యతో కలిపి ఉత్తమమైన పుణ్యకార్యము చేయుము. రాముని శిరస్సును నా శిరస్సుతోను, అతని శరీరమును నా శరీరముతోను కలుపుము. మహాత్ముడైన భర్తను అనుసరించి వెళ్లెదను." సీత భర్త శిరస్సును ధనుస్సును మాటిమాటికి చూచుచు, దుఃఖాక్రాంతురాలై ఈ విధముగా విలపించెను.(28-33)

ఆమె ఈ విధముగా విలపించుచుండగా ద్వారమువద్దనుండు సాయుధభటుడైన ఒక రాక్షసుడు, నమస్కరించుచు అక్కడికి ప్రభువువద్దకు వచ్చెను. అతడు "మహారాజా! జయము పొందుము! (సర్వోత్కర్షతో ఉండుము)" అని అభివాదనము చేసి, అనుగ్రహింపచేసికొని సేనాపతియైన ప్రహస్తుడు వచ్చినట్లు తెలిపెను. "మహారాజా! మంత్రు లందరితో కలిసి ప్రహస్తుడు వచ్చినాడు. నీ దర్శనము కోరుచు అతడు నన్ను పంపినాడు. ఓర్పు గల ఓ! మహారాజా! రాజ్యమునకు సంబంధించిన ఏదో ఒక తొందరగా చూడదగిన కార్యము ఉన్నది. అందుచేత నీవు వారి దర్శనము చేయుము." అని చెప్పెను. రావణుడు ఆ రాక్షసుడు చెప్పిన మాటలు విని అశోకవనమును విడచి మంత్రులను చూచుటకై వెళ్ళెను. అతడు మంత్రులతో ఆలోచించి తాను చేయవలసిన కృత్యమును నిర్ణయించి, సభలో ప్రవేశించి రాముని పరాక్రమమును గూర్చి తెలిసికొని, అప్పుడు చేయదగిన కార్యములు చేసెను. రావణుడు వెళ్ళిపోయిన వెంటనే ఆ శిరస్సు, ఉత్తమమైన ఆ ధనుస్సు అంతర్ధానమును పొందెను.(34-40)

అప్పుడు రావణుడు, భయంకరమైన పరాక్రమము గల మంత్రులతో కూడ

రామునితో యుద్ధమునకు సంబంధించిన కార్యముల విషయమున నిర్ణయములు చేసెను. దగ్గరనే ఉన్న, తన హితమును కోరు సైన్యాధిపతులందరిని– "దండములతో గట్టిగా భేరీలు మ్రోగించి నా సైన్యములను అన్నింటినీ తీసికొని రండి. వారికి ఎందుకు పిలచుచున్నామో చెప్పవద్దు." అని ఆజ్ఞాపించెను. ఆ దూతలు రావణుని ఆజ్ఞ ప్రకారము అప్పుడే, శీఘ్రముగా గొప్ప సైన్యమును తీసికొని వచ్చి, సైన్యము వచ్చిన దని యుద్ధము కోరుచున్న ఆ రావణునకు తెలిపిరి.(41-44)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది రెండవ సర్గము సమాప్తము.

ముప్పది మూడవ సర్గము

"ఇది రావణుడు మాయచేత కల్పించినది" అనీ "రాముడు సముద్రము దాటి వచ్చినాడు" అనీ సరమ సీతకు చెప్పుట.

అప్పుడు సీతకు ప్రియసఖురాలైన సరమ కలతచెందిన సీతను చూచి, ఇష్టురాలైన ఆమె దగ్గరకు వెళ్లి, రావణుడు మాయచేత మోసముజేయగా మిక్కిలి దుఃఖించుచున్న ఆమెను ఓదార్చెను. రావణునిచే సీతను రక్షించుటకై నియమింపబడిన, జాలిగుండె గల మంచి నియమవంతురాలైన ఆ సరమను అమె రక్షణలో ఉన్న సీత తన స్నేహితురాలినిగా చేసికొని ఉండెను. సఖురాలైన సరమ స్పృహ తప్పి ఉన్న సీతను చూచెను. ఆమె పరాగములో దొర్లి లేచిన, పరాగముచేత కప్పబడిన ఆడగుఱ్ఱమువలె ఉండెను.(1-4)

సరమ ఉత్తమవ్రతము గల సీతను ప్రేమతో ఓదార్చెను – "ఓ! సీతా! ఊరడిల్లుము. మనస్సులో వ్యథ చెందకుము. భయస్వభావము కలదానా! రావణుని మాటలు, నీవు తిరిగి పలికిన మాటలు అవి అన్నీ నేను నీపై ఉన్న స్నేహముచేత రావణునినుండి భయపడక, శూన్యమైన ఆకాశప్రదేశములో దాగి ఉండి విన్నాను. సీతా! నీయందున్న స్నేహభావముచే నేను రావణునకు ఏ మాత్రము భయపడుట లేదు. రావణుడు తొందరగా ఎందుకు వెళ్ళిపోయినాడో ఆ విషయము నంతా నేను బైటకు వెళ్ళి తెలిసికొంటిని. ప్రసిద్ధమైన బుద్ధి గల రాముని విషయమున ఎవరూ నిద్రలో ఆక్రమణము చేయజాలరు. పురుషశ్రేష్ఠుడైన అతనిని చంపుట అనునది అసంభావ్యము. దేవేంద్రునిచేత దేవతల వలె రామునిచేత రక్షింపబడుచున్న,

వృక్షములతో యుద్ధముచేయు వానరులను కూడ ఆ విధముగా చంపుట శక్యము కాదు.(5-10)

సీతా! పొడవుగా, గుండ్రముగా ఉన్న భుజములు, విశాలమైన వక్షఃస్థలము గల, గొప్ప శోభగల రాముడు ప్రతాపవంతుడు, ధనుర్ధరుడు, అందమైన అవయవముల కూర్పుగలవాడు, ధర్మాత్ముడు, భూమియందు ప్రసిద్ధుడు, పరాక్రమవంతుడు, నిత్యము తనను ఇతరులను కూడా రక్షించువాడు, సోదరుడైన లక్ష్మణునితో కలిసి ఉండువాడు, మంచి కులమునందు పుట్టినవాడు, నీతి శాస్త్రపారంగతుడు, శత్రువుల సేనాసముదాయములను సంహరించువాడు, ఊహింపశక్యము కాని బలము పౌరుషము గలవాడు, శత్రుసంహారకుడు. అట్టి రాముడు చంపబడలేదు. జీవించియే ఉన్నాడు.(11-13)

చెడ్డ ఆలోచనలతో చెడ్డ పనులు చేయుచు సమస్త ప్రాణులను ద్వేషించు మాయావియైన, భయంకరుడైన రావణుడు నీ విషయమున ఇక్కడ మాయ ప్రయోగించినాడు. నీ దుఃఖమంతా తొలగిపోయినది. నీకు మంగళము లభించనున్నది. నిశ్చయముగా నిన్ను లక్ష్మి పొందును. నీకు ప్రియము జరుగును. వినుము. రాముడు వానరసైన్యముతో సముద్రమును దాటి సముద్రము దక్షిణతీరము చేరి విడిసి ఉన్నాడు. సిద్ధించిన ప్రయత్నము గల లక్ష్మణసహితుడైన రాముణ్ణి నేను చూచినాను. ఒక్కచోట కలిసి సముద్రసమీపమునందున్న సైన్యములచేత రక్షింపబడుచు అక్కడ ఉన్నాడు. రావణుడు శీఘ్రముగా వెళ్ళగల రాక్షసులను పంపినాడు. వాళ్ళందరూ రాముడు సముద్రమును దాటినాడని వార్త తీసికొనివచ్చినారు. సీతా! రాక్షసరాజైన ఈ రావణుడు ఆ వార్త విని మంత్రులతో కూడ మంతనములు చేయుచున్నాడు."(14-19)

సీతతో సరమ ఇట్లు మాటలాడుచుండగా సైనికులందరు ఒక్కుమ్మడి సన్నద్ధులగుటచేత ఏర్పడిన భయంకరమైన శబ్దము వినబడెను. మధురముగా మాటలాడు సరమ దండముతో గట్టిగా కొట్టుటచేత ధ్వని చేయుచున్న రణభేరి ధ్వని విని సీతతో ఇట్లు పలికెను- "భయస్వభావము గల సీతా! భయంకరమైన ఈ భేరీధ్వని యోధులు యుద్ధమునకు సిద్ధ మగుటకై చేయునది. మేఘధ్వని వంటి ధ్వని గల, గంభీరమైన ఈ భేరీనాదమును వినుము. మదించిన ఏనుగులను సిద్ధము చేయుచున్నారు. రథములకు గుఱ్ఱములు కట్టబడుచున్నవి. ప్రాసలు ధరించిన వేలకొలది భటులు అశ్వములను ఎక్కి కనబడుచున్నారు. వేలకొలది అశ్వయోధులు యుద్ధసంనద్ధులై ఆ యా ప్రదేశములలో శీఘ్రముగా వచ్చి చేరుచున్నారు. వేగము

గల, ధ్వని చేయుచున్న జలప్రవాహములచేత సముద్రము వలె చూచుటకు ఆశ్చర్యము కలిగించు సైన్యములచేత రాజమార్గములు నింపబడుచున్నవి. నిర్మలముగా ఉన్న ఆయుధములు, డాలులు, కవచములు, రావణుని అనుసరించు రథములు, అశ్వములు, గజములు, ఉత్సాహముతో కూడిన బలవంతులైన రాక్షసులు అనేకవిధములైన రంగులతో కూడిన కాంతిని ప్రసరింపచేయుచు తొందరలో ఉన్నారు. ఈ కాంతి గ్రీష్మర్తువునందు వనమును కాల్చుచున్న అగ్నిరూపము వలె ఉన్నది. చూడుము. ఏనుగుల గంటల ధ్వని, రథముల ధ్వని, సకిలించుచున్న గుఱ్ఱముల ధ్వని, వాద్యముల ధ్వని వినవచ్చుచున్నది. వినుము. రావణుని అనుసరించు రాక్షసులు ఆయుధములు ధరించి చేయుచున్న ఈ ధ్వని వ్యాకులముగా నున్న సంభ్రమము రోమాంచము కలిగించేదిగా ఉన్నది."(20-29)

"శోకమును నశింపచేయు సంపద నిన్ను చేరగలదు. రాక్షసులకు ముప్పు వచ్చినది. దేవతలలో దేవేంద్రునివంటివాడు, కమలపత్రములవంటి నేత్రములు కలవాడు, జయించబడిన క్రోధము కలవాడు, ఊహింప శక్యము కాని పరాక్రమము గలవాడు, నీ భర్తా అయిన, రాముడు ఆ రావణుణ్ణి యుద్ధములో జయించి నిన్ను పొందగలడు. విష్ణుసహితుడైన శత్రుసంహారకుడైన దేవేంద్రుడు శత్రువులయందు వలె, లక్ష్మణసహితుడైన నీ భర్త రాక్షసులయందు పరాక్రమము చూపగలడు. శత్రువు చంపబడిన పిమ్మట కోరిక తీరినదానవై నీవు నీ వద్దకు వచ్చిన రాముని సమీపమునం దుండగా శీఘ్రముగా చూడగలవు. ఓ! సీతా! నీవు భర్తను చేరి విశాలమైన వక్షఃస్థలము గల ఆ రాముని వక్షఃస్థలముమీద ఆనందాశ్రువులను రాల్చగలవు. మహాబలశాలియైన రాముడు, నీవు చాలా మాసముల నుండి ధరించుచున్న, నీ కటిప్రదేశము వరకు వ్రేలాడుచున్న ఒంటిజడను కొద్ది దివసములలో విప్పగలడు. ఓ! దేవీ! ఆ రాముని ఉదయించిన పూర్ణచంద్రునివంటి ముఖమును చూచి, ఆడసర్పము కుబుసమును విడచినట్లు దుఃఖమువలన కలిగిన కన్నీటిని విడువగలవు. సుఖములకు తగిన రాముడు కొంచెము కాలములోనే యుద్ధములో రావణుణ్ణి సంహరించి, ప్రియురాలైన నీతో కూడినవాడై, సుఖము పొందగలడు. మంచి వర్షములు పడగా సస్యముతో కూడిన భూమి వలె నీవు మహాత్ముడైన రామునితో కూడినదానవై సంతోషించగలవు. ఓ! సీతా! గుఱ్ఱము మండలాకారముగా తిరిగినట్లు ఏ సూర్యుడు మేరుపర్వతము చుట్టూ అతిశీఘ్రముగా తిరుగుచుండునో ఆ సూర్యుణ్ణి శరణు పొందుము. ఈ సూర్యుడే ప్రజలకు కారణము కదా?"(30-39)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది మూడవ సర్గము సమాప్తము.

ముప్పది నాలుగవ సర్గము

సీత కోరగా సరమ రావణుడు ఏమి చేయుచున్నాడో తెలిసికొని వచ్చి సీతకు చెప్పుట.

చాలా దుఃఖితురాలై ఆ మాటలచేత సంతోషించిన సీతను సరమ, ఎండకు బాగా కాలి ఉన్న భూమిని నీటితో తడిపినట్లు, ఈ మాటలతో ఆనందింపచేసెను. పిమ్మట ఎప్పుడు ఏమి చేయవలెనో ఎరిగిన, చిరునవ్వుతో మాటలాడు ఆ సరమ సఖురాలైన సీతకు హితమును చేయవలె నను కోరికతో ఆ సమయమునందు– "సీతా! ఎవరికీ కనబడకుండా వెళ్ళి, నీ వార్తను క్షేమమును రామునకు తెలిపి తిరిగి రాగలను. ఏ ఆధారము లేని ఆకాశములో ప్రయాణము చేయుచున్న నన్ను వాయువు గాని, గరుత్మంతుడు గాని అనుసరింపజాలరు." అని పలికెను.(1–4)

సీత ఆ విధముగా పలుకుచున్న సరమతో, శోకచ్ఛాయతో కలసి ఉన్న, మృదువైన వాక్కుతో మధురముగా ఇట్లు పలికెను– "నీవు ఆకాశములోనికి పాతాళమునకు వెళ్ళగలవు. ఎంతో కష్టమైన కార్యమును కూడ నా నిమిత్తము చేసెద వని నాకు తెలియును. నాకు ప్రియమైన పని చేయవలెనని నీకు స్థిరమైన నిశ్చయము ఉన్నచో నీవు వెళ్ళి రావణుడు ఏమి చేయుచున్నాడో తెలిసికొని రావలె నని కోరుచున్నాను. మాయాబలము కలవాడు, క్రూరుడు, శత్రువులను ఏడిపించువాడు, దుష్టబుద్ధి అయిన రావణుడు త్రాగిన వెంటనే మద్యము మోహింపచేసి నట్లు నన్ను మోహింప చేయుచున్నాడు. నిత్యము, నాకు కాపలా కాయుచున్న చాల భయంకరలైన రాక్షసస్త్రీలచేత, ఇతడు నన్ను నిత్యమూ, మాటి మాటికీ చేష్టలచేతను మాటలచేతను భయపెట్టించుచున్నాడు. నేను దిగులు చెంది శంకితురాలనై ఉన్నాను. నా మనస్సు కూడ స్వస్థముగా లేదు. అశోకవనములో ఉన్న నేను అతనికి భయపడుచు దిగులుచెంది ఉన్నాను. అతనికి సంబంధించిన వృత్తాంతము ఏదైన ఉన్నచో, నిశ్చితమైన విషయమేదైన ఉన్నచో దానినంతను నీవు తెలిపినచో నా విషయమున గొప్ప అనుగ్రహము చూపినదానవు అగుదువు."(5–11)

మృదువుగా మాటలాడు ఆ సరమ కూడ కన్నీటితో వ్యాకులమైన ఆ సీత ముఖమును తుడుచుచు, ఆ విధముగా పలుకుచున్న ఆమెతో ఇట్లనెను. "ఓ! జానకీ! నీ అభిప్రాయమిట్లు ఉన్నచో నేను వెళ్లెదను. శత్రువు అభిప్రాయమును తెలిసికొని వచ్చెదను." అని చెప్పి, ఆమె ఆ రాక్షసుని సమీపమునకు వెళ్ళి మంత్రులతో కూడిన ఆ రావణుని సంభాషణమును వినెను. కార్యనిర్ణయములను తెలిసికొన

సమర్థురాలైన ఆ సరమ దురాత్ముడైన ఆ రావణుని నిశ్చయమును గూర్చి విని, శీఘ్రముగా అశోకవనమునకు తిరిగి వచ్చెను. ఆమె అశోకవనములో ప్రవేశించి పద్మములు లేని లక్ష్మివలె ఉన్న సీతను చూచెను. ఆమె సరమకోసమే నిరీక్షించుచుండెను. తిరిగి వచ్చిన, మృదుభాషిణి యైన ఆ సరమను సీత స్నేహపూర్వకముగా కౌగిలించుకొని స్వయముగా ఆసన మిచ్చెను. "నీవు ఈ ఆసనముమీద సుఖముగా కూర్చుండి క్రూరుడు, దురాత్ముడూ అయిన ఆ రావణుని నిశ్చయమునంతను యథార్థముగా చెప్పుము." అని భయముతో వణకిపోవుచున్న సీత పలుకగా, సరమ మంత్రిసహితుడైన రావణుని సంభాషణము నంతను చెప్పెను. (12-19)

"సీతా! నిన్ను విడువవలసిన దని రావణుని అతని తల్లియైన కైకసి, మంత్రులలో వృద్ధుడైన అవిద్ధుడు- "మానవుల ప్రభువైన రామునకు సత్కారపూర్వకముగా సీతను ఇచ్చివేయుము. జనస్థానములో జరిగిన ఆశ్చర్యకరమైన విషయము రాము డెంతటివాడో తెలుపుటకు సరిపడిన నిదర్శనము కదా? హనుమంతుడు సముద్రము లంఘించుట, సీతను చూచుట కూడ గొప్ప నిదర్శనములే. ఈ భూలోకములో ఏ మానవుడు యుద్ధములో రాక్షసులను చంపగలడు?" అని ఉపదేశించిరి. వృద్ధులైన మంత్రులు, తల్లీ ఈ విధముగా ఎంత బోధించినను ఆ రావణుడు, ధనమునందు ఆసక్తి గల లోభి ధనమును ఎట్లు విడవజాలడో, అట్లే నిన్ను విడువజాలకున్నాడు. సీతా! అతడు యుద్ధములో మరణించకుండగా నిన్ను విడచుటకు ఇష్టపడుటలేదు. ఇది మంత్రిసహితుడైన ఆ క్రూరుని నిశ్చయము. ఈ విధముగా అతనికి ఈ స్థిరమైన, ఆలోచన మృత్యువుకొరకే కలిగినది. అతడు యుద్ధములో సమస్తమైన రాక్షసులతో కలిసి మరణించిన తరువాత నిన్ను విడుచును గాని భయపడి విడచుటకు సిద్ధముగా లేడు. సీతా! రాముడు వాడియైన బాణాలచేత రావణుణ్ణి యుద్ధములో చంపి తప్పక నిన్ను అయోధ్యకు తిరిగి తీసుకుని వెళ్ళగలడు."(20-26)

ఇంతలో భూమిని కంపింపచేయుచు, సమస్తసైన్యముల ధ్వని భేరీధ్వనితో కలిసి వినవచ్చెను. (27)

ఆ వానరసేనాశబ్దమును వినగానే లంకలో ఉన్న, రావణుని పరిపాలనలో ఉన్న ప్రజల తేజస్సు నశించెను. దైన్యముచేత వాళ్ళ చేష్టలన్నీ కుంటుపడెను. ఈ విధముగా రాజు చేసిన అపరాధమునకు ఫలితముగా వాళ్ళు శ్రేయస్సును కోల్పోయిరి. (28)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది నాలుగవ సర్గము సమాప్తము.

ముప్పది ఐదవ సర్గము

లంకలో కనబడుచున్న దుఃశకునములను గూర్చి చెప్పి మాల్యవంతుడు రామునితో సంధి చేసికొనుమని రావణునికి బోధించుట.

శంఖధ్వనితో కూడిన గొప్ప నాదము గల భేరీధ్వనితో శత్రుపురములను జయించువాడు, మహాబాహువు అయిన రాముడు వచ్చెను. రాక్షసరాజైన రావణుడు అప్పుడు ఆ ధ్వనిని విని, ముహూర్తకాలము ఏదో ఆలోచించి, మంత్రుల వైపు చూచెను. అతడు అక్కడ ఉన్న మంత్రు లందరిని పలకరించి, నిందించుచు సభ అంతా మారు మ్రోగునట్లు- "రాముడు సముద్రమును దాటిన విషయమును, అతని పరాక్రమము, బలము, పౌరుషము-వీటి విషయమును మీరు చెప్పగా వింటిని. యుద్ధమునందు సత్యమైన పరాక్రమము గల మీరు రాముని పరాక్రమము తెలిసికొని, ఏమీ చేయకుండా, ఒకరి మొగము ఒకరు చూచుకొనుచు కూర్చొని ఉన్నా రను విషయము కూడా నాకు తెలియును." అని పలికెను.(1-5)

రావణుని మాటలు విని, గొప్ప బుద్ధిగలవాడు, అతని మాతామహుడూ అయిన మాల్యవంతు డను రాక్షసుడు ఇట్లు పలికెను- "రాజా! విద్యలు బాగుగా అభ్యసించి నీతిమార్గమును అనుసరించు రాజు చిరకాలము ఐశ్వర్యమును పాలించును. శత్రువులను వశములో ఉంచుకొనగలుగును. సమయానుసారముగా శత్రువులతో సంధి చేసుకొనువాడు, వారితో విరోధము పెట్టుకొనువాడు అయిన రాజు తన పక్షమునకు అభివృద్ధిని చేకూర్చుకొనుచు గొప్ప ఐశ్వర్యమును పొందును. రాజు, తాను శత్రువుకంటె దుర్బలుడుగా గాని, సమబలము కలవాడుగా గాని ఉన్నప్పుడు అతనితో సంధి చేసికొనవలెను. శత్రువుకంటె ఎక్కువ బలముగా ఉన్నప్పుడు విరోధము కొనసాగించవలెను. రావణా! అందువలన నీవు రామునితో సంధి చేసికొనుట నాకు ఇష్టము. ఏ సీత కోసమై రాముడు నీ మీద దండెత్తి వచ్చినాడో ఆ సీతను అతనికి ఇచ్చివేయుము. దేవతలు, ఋషులు, గంధర్వులు వీరందరూ ఆ రామునకే జయము కలుగవలె నని కోరుచున్నారు. రామునితో విరోధము చేయకుము. అతనితో సంధి చేసికొనుటకు నీవు ఇష్టపడుము. భగవంతుడైన బ్రహ్మదేవుడు సురుల పక్షము, అసురుల పక్షము అను రెండు పక్షములనే సృజించెను. సురులు ధర్మమును, అసురులు అధర్మమును ఆశ్రయించి ఉందురు. రావణా! ధర్మము మహాత్ములైన దేవతల పక్షమని, అధర్మము రాక్షసుల, అసురుల పక్షము అని వినబడుచున్నది. ధర్మము అధర్మమును అణగద్రొక్కినప్పుడు కృతయుగము

ఆవిర్భవించును. అధర్మము ధర్మమును ఆక్రమించినప్పుడు కలియుగము ప్రవర్తించును. నీవు లోకములలో సంచరించుచు గొప్ప ధర్మమును నశింపచేసితివి. అధర్మమును కూడా స్వీకరించితివి. అందుచేతనే శత్రువులు మనకంటె బలముగా ఉన్నారు."(6-15)

నీవు చేసిన పొరబాటువలన వృద్ధి పొందిన అధర్మము మనలను మ్రింగివేయుచున్నది. సురులకు అనుకూలమై వాళ్ల పక్షమును వృద్ధిపొందించుచున్నది. భోగములయందు ఆసక్తుడవై ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించిన నీవు అగ్నితో సమానులైన ఋషులకు గొప్ప భయము కలిగించితివి. ప్రజ్వలించుచున్న అగ్ని వలె ఋషీశ్వరుల ప్రభావము ఎదిరింప శక్యము కానిది. ఈ ఋషుల మనస్సులు తపస్సుచేత పవిత్రమైనవి. వీరు ధర్మమును అభివృద్ధి చెందించుటయందు ఆసక్తి కలవారు. ఈ ద్విజులు ముఖ్యములైన యజ్ఞములు చేయుచు, అగ్నులలో హోమము చేయుచు, యథావిధిగా వేదములను బిగ్గరగా పఠించుచు, రాక్షసులను తిరస్కరించి వేదఘోషములను చేయగా, ఆ రాక్షసులందరూ, గ్రీష్మమునందు మేఘములు వలె పారిపోవుచుందురు. అగ్నితో సమానులైన ఋషీశ్వరుల అగ్నిహోత్రములనుండి లేచిన ధూమము నాలుగు దిక్కులయందు వ్యాపించి, రాక్షసుల తేజస్సును హరించును. పవిత్రములైన యజ్ఞములు చేయుటకై నియమము అవలంబించి, ఆ యా దేశములలో ఈ ఋషులు చేయు తీవ్రమైన తపస్సు రాక్షసులను తపింపచేయును. దేవ-దానవ-యక్షులనుండి భయము లేకుండునట్లు నీవు వరము తీసికొంటివి. కాని ఇప్పుడు గొప్ప బలము, దృఢమైన పరాక్రమము గల మనుష్యులు, వానరులు, భల్లూకములు, గోలాంగూలములు వచ్చి గర్జించుచున్నారు. (16-24)

నాకు అనేకవిధములైన ఉత్పాతములు, బహువిధములైన ఘోరవిషయములు కనబడుచున్నవి. అందుచే రాక్షసు లందరికీ వినాశము రానున్న దని భావించుచున్నాను. వికృతములైన ఆకారములతో పరుషముగా గర్జించుచున్న భయంకరములైన మేఘములు లంకయందు అంతటా వెచ్చని రక్తము వర్షించుచున్నవి. గజాశ్వాదివాహనములు ఏడ్చుచు కన్నీటి బిందువులు కార్చుచున్నవి. ఆ గజాశ్వాదులు దుమ్ము కొట్టుకొని చెడిన వర్ణము గలవై పూర్వము వలె ప్రకాశించుటలేదు. మాంసము తినే క్రూరమృగములు, నక్కలు, గ్రద్దలు చాలా భయంకరముగా అరచుచున్నవి. అవి లంకలో ప్రవేశించి, ఉద్యానములో గుంపులుగా ఏర్పడుచున్నవి. నల్లని ఆకారము గల స్త్రీలు ప్రతికూలముగా మాటలాడుచు, ఇళ్ళను దోచుకొనుచు, ఎదురుగా నిలబడి తెల్లని పళ్ళు కనబడేటట్లు నవ్వుచున్నట్లుగా స్వప్నములలో

కనబడుచున్నారు. దేవతలకొరకు వేసిన, కాకులు మొదలైనవి తినవలసిన, బలులను కుక్కలు తినుచున్నవి. ఆవులకు గాడిదలు, ముంగిసలకు ఎలుకలు పుట్టుచున్నవి. పిల్లులు పులులతోను, పందులు కుక్కలతోను, కింనరులు రాక్షసులతోను, రాక్షసులు మనుష్యులతోను కలియుచున్నట్లు కనబడుచున్నది. ఎఱ్ఱని పాదములు గల తెల్లని పావురములు,కాలముచేత ప్రేరేపింపబడినవై, రాక్షసుల వినాశమును సూచించుచు సంచరించుచున్నవి. ఇళ్ళల్లో ఉన్న గోరింకలు కలహించే ఇతరపక్షులచేత జయింపబడి, కిచకిచలాడుచు, చుట్టబెట్టుకొని నేలమీద పడుచున్నవి. అన్ని పక్షులు, మృగములు సూర్యునివైపు తిరిగి ఏడ్చుచున్నవి. భయంకరుడు వికృతమైన ఆకారము గలవాడు, బోడితలవాడు, క్రూరుడు, నల్లగా ధూమ్రవర్ణముతో ఉన్నవాడు అయిన కాలుడు(మృత్యుదేవత) ప్రాతఃసాయంకాల సంధ్యాసమయములయందు అందరి ఇళ్ళలోనికీ చూచుచున్నాడు. ఇవే కాక ఇంకా మరికొన్ని దుష్టశకునముల కూడా కనబడుచున్నవి.(25-35)

రాముడు మనుష్యరూపము ధరించిన విష్ణువే అని తలచుచున్నాము. సముద్రముమీద చాల అద్భుతమైన సేతువును నిర్మించిన, దృఢపరాక్రమవంతుడైన ఈ రాముడు మనుష్యమాత్రుడు కాడు. రావణా! నరుల రాజైన రామునితో సంధి చేసికొనుము. చేయవలసిన పనులు తెలిసికొని, నిర్ణయించుకొని, భవిష్యత్తులో శ్రేయస్కరమైన పని చేయుము."(36,37)

శ్రేష్ఠులైనవారిలో ఉత్తమమైన పౌరుషము, బలము గల మాల్యవంతుడు వానితో ఇట్లు పలికి, అతని ముఖవర్ణాదులచే అతని భావము కనిపెట్టి, అతని వైపు మరల ఒక మారు చూచి మౌనముగా కూర్చుండెను.(38)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది ఐదవ సర్గము సమాప్తము.

ముప్పది ఆరవ సర్గము

రావణుడు మాల్యవంతుని ఉపదేశము తిరస్కరించి, నగరద్వారరక్షణమునకై మంత్రులను నియోగించి గృహములోనికి వెళ్ళుట.

దుర్బుద్ధియైన రావణుడు కాలమునకు వశుడై, మాల్యవంతుడు పలికిన ఆ హితవచనమును సహించలేదు. కోపమునకు వశుడై, కనుబొమ్మలు విరిచి, కోపముచేత తిరిగిపోవుచున్న నేత్రములతో మాల్యవంతునితో ఇట్లు పలికెను – "శత్రువుల పక్షములో చేరి, హితమని చెప్పుచు, పరుషముగా పలికిన అహితవచనము నా చెవికి ఎక్కదు. రాముడు మానవమాత్రుడు, దీనుడు, ఒంటరివాడు, వానరులను ఆశ్రయించువాడు, తండ్రి విడిచివేయగా అడవులలో తిరుగుచున్నవాడు. అట్టి రాముడు సమర్థుడని ఎట్లు అనుకొనుచున్నావు! రాక్షసులకు ప్రభువును, దేవతలకు కూడ భయంకరుడను అయిన నన్ను, అన్నివిధముల పరాక్రమములతో పరిపూర్ణుడనైన నన్ను, తక్కువవానినిగా ఎందుకు అనుకొనుచున్నావు? సజాతీయుడైన వీరుని విషయములో అసూయచేతనో, శత్రువుమీద పక్షపాతముచేతనో, నేను ఏమీ అనకుండా ఉండుటచేతనో నీవు ఈ విధముగా నాతో పరుషముగా మాటలాడినావని అనుకొనుచున్నాను. ఎవరో వెనుకనుండి ప్రోత్సహించకపోయినచో, శాస్త్రతత్త్వము తెలిసిన పండితుడు ఎవడైనా సమర్థుడైన, అధికారములో ఉన్నవానితో ఈ విధముగా పరుషముగా మాటలాడునా? చేతిలో పద్మములు లేని లక్ష్మి వంటి సీతను వనమునుండి తీసికొని వచ్చి నేను రామునికి భయపడి ఎందుకు తిరిగి ఇచ్చివేయవలెను? కొన్ని రోజులలో నేను కోట్ల కొలది వానరులతోను, సుగ్రీవునితోను, లక్ష్మణునితోను కూడిన రాముణ్ణి చంపివేసెదను. చూడుము. యుద్ధములో దేవతలు కూడ ఎవనితో ద్వంద్వయుద్ధమునకు నిలువజాలరో అట్టి రావణుడు యుద్ధములో ఎట్లు భయపడును? నేను రెండు ముక్కలుగా విరిగిపోనైనా విరిగిపోవుదునుగాని ఎవ్వరికీ వంగను. ఇది నాలోని సహజమైన దోషము. ఈ స్వభావము దాట శక్యము కానిది. దైవవశముచేత రాముడు సముద్రముమీద సేతువును కట్టినంతమాత్రాన నేను భయపడవలసినంత ఆశ్చర్యమేమి ఉన్నది? వానరసేనతో సముద్రము దాటి వచ్చిన రాముడు ప్రాణాలతో తిరిగి వెళ్ళడు; నీకు ప్రతిజ్ఞ చేసి సత్యమును చెప్పుచున్నాను."(1-13)

ఈ విధముగా తొందరపాటుతో మాటలాడుచున్న రావణుడు కోపించి ఉన్నాడని తెలిసికొని, మాల్యవంతుడు సిగ్గుపడి, ప్రత్యుత్తర మేమీ చెప్పలేదు. అతడు జయాశీర్వాదములను ప్రయోగించి రాజును అభినందించి అతని అనుజ్ఞ

తీసికొని తన గృహమునకు వెళ్ళిపోయెను. అప్పుడు రావణుడు మంత్రులతో ఆలోచించి, కర్తవ్యమును నిర్ణయించి, లంకకు రక్షణను ఏర్పరచెను. తూర్పుద్వారమునందు ప్రహస్తుణ్ణి, దక్షిణద్వారమునందు గొప్ప బలముగల మహోదరమహాపార్శ్వలను, పశ్చిమద్వారమునందు గొప్ప మాయలు తెలిసిన, చాలామంది రాక్షసులతో కూడిన, తన పుత్రుడైన ఇంద్రజిత్తును నిలిపెను. ఉత్తర ద్వారమునందు, శుకసారణులను నియమించి, "నేను కూడ అక్కడికి వెళ్ళెదను" అని ఆ మంత్రులతో చెప్పెను. గొప్ప వీర్యపరాక్రమములు గల విరూపాక్షు డను రాక్షసుని, అనేకులైన ఇతరరాక్షసులతో కూడ సేనామధ్యభాగమునందు నిలిపెను. రావణుడు లంకలో ఈ విధముగా ఏర్పాట్లు చేసి, వినాశకాలము దాపురించుటచే కృతకృత్యుడై నట్లు భావించుచుండెను. అతడు ఈ విధముగా నగరరక్షణమునకు పూర్తిగా ఏర్పాట్లు చేసి, మంత్రులు వెళ్ళుటకు అనుమతి ఇచ్చి, ఆ మంత్రులందరు జయాశీర్వాదము చేసి వెళ్ళిపోయిన పిమ్మట ఐశ్వర్యసమృద్ధమైన అంతఃపురములో ప్రవేశించెను. (14-22)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది ఆరవ సర్గము సమాప్తము.

ముప్పది ఏడవ సర్గము

లంకారక్షణమునకై రావణుడు చేసిన ఏర్పాట్లను గూర్చి విభీషణుడు రామునకు చెప్పుట. లంకాద్వారములను ఆక్రమింపుడని రాముడు వానరసేనానాయకులను ఆదేశించుట.

శత్రుదేశములో ప్రవేశించిన రామసుగ్రీవులు, హనుమంతుడు, ఋక్షముల రాజైన జాంబవంతుడు, విభీషణుడు, వాలి పుత్రుడైన అంగదుడు, లక్ష్మణుడు, శరభుడు, పరివారసహితుడైన సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు, గజుడు, గవాక్షుడు, కుముదుడు, నలుడు, పనసుడు - వీరందరు కలిసి ఆలోచించిరి. "రావణునిచేత పాలింపబడుచు అసురులచేత గాని, ఉరగులచేతగాని, గంధర్వులచేత గాని, దేవతలచేతగాని జయింప శక్యము కాని ఆ లంకాపట్టణము ఇదే; ఎదుట కనబడుచున్నది. రాక్షసుల ప్రభువైన రావణుడు నిత్యము ఈ నగరమునందు ఉండును. అందుచేత మనము తలపెట్టిన కార్యము ఎట్లు సిద్ధించునో నిర్ణయించుటకు ఆలోచన చేయుడు."(1-5)

వాళ్ళందరు ఇట్లు అనుకొనుచుండగా రావణుని తమ్ముడైన విభీషణుడు గ్రామ్యములైన పదములు లేని, పరిపూర్ణార్థము గల వాక్యము పలికెను- "నా మంత్రులైన అనలుడు, పనసుడు, సంపాతి, ప్రమతి లంకకు వెళ్ళి మరల వచ్చినారు. వాళ్ళందరూ పక్షిరూపములు ధరించి శత్రుసైన్యములో ప్రవేశించి శత్రువులు చేసికొనిన ఏర్పాట్లన్నీ చూచి వచ్చినారు. రామా! దురాత్ముడైన రావణుడు చేసిన ఏర్పాట్లను గూర్చి వాళ్ళు చెప్పిన విషయము నంతా నేను ఉన్నదున్నట్లు చెప్పుచున్నాను; వినుము. గొప్ప పరాక్రమము గల ప్రహస్తుడు తూర్పుద్వారమువద్ద, మహాపరాక్రమవంతులైన మహాపార్శ్వమహోదరులు దక్షిణద్వారమువద్ద ఉన్నారు. రావణకుమారుడైన ఇంద్రజిత్తు పట్టిశములు, ఖడ్గములు, ధనుస్సులు, శూలములు, ముద్గరములు ధరించిన చాలామంది రాక్షసులతోను, అనేకవిధములైన ఆయుధములు ధరించిన శూరులతోను కూడి పశ్చిమద్వారమునందున్నాడు. ఆలోచనలో నేర్పరియైన రావణుడు ఆయుధములు ధరించిన వేలకొలది రాక్షసులతో కూడి స్వయముగా ఉత్తరద్వారము వద్ద ఉన్నాడు. అతడూ, రాక్షసులూ కూడా దిగులుచెంది ఉన్నారు. విరూపాక్షుడు శూలములు, ఖడ్గములు, ధనుస్సులు ధరించిన గొప్ప సైన్యముతో, చాలామంది రాక్షసులతో సేనామధ్యమునందు ఉన్నాడు. నా మంత్రులందరు లంకకు వెళ్ళి అక్కడ ఉన్న ఈ సేనానివేశములను చూచి మరల వచ్చినారు. యుద్ధములలో పరాక్రమము చూపువారు, బలవంతులు, క్రూరులు అయిన పదివేలమంది గజములను అధిష్ఠించు యోధులు, పదివేలమంది రథికులు, రెండువేలమంది ఆశ్వికులు, కోటికి మించిన పదాతులైన రాక్షసులు- వీళ్ళందరూ రావణునకు ఇష్టులైన వారు. రామా! యుద్ధమునందు ఈ రాక్షసులలో ఒక్కొక్కనికి పది లక్షలమంది పరివారముగా వచ్చి ఉందురు."(6-18)

మహాబాహువైన విభీషణుడు తన మంత్రులు తీసికొనివచ్చిన లంకకు సంబంధించిన ఈ వార్తను ఈ విధముగా చెప్పి ఆ రాక్షసులను(మంత్రులను) చూపెను. శ్రీమంతుడైన విభీషణుడు రామునకు లంకలోని వార్తలను తన మంత్రులచేత కూడ చెప్పించి, రామునికి, ప్రియము చేయవలెనను కోరికతో, మరల ఇట్లనెను- "రామా! రావణుడు కుబేరునితో యుద్ధమునకై వెళ్ళినప్పుడు అతనితో అరవైలక్షలమంది రాక్షసులు వెళ్ళిరి. వాళ్లందరూ కూడా పరాక్రమముచేత, వీర్యముచేత, తేజస్సుచేత, బలాధిక్యముచేత, గర్వముచేత దురాత్ముడైన రావణునకు తగినవారు. నేను శత్రువులను వర్ణించుచున్నందుకు కోపించకుము. నీకు శత్రువులపై కోపము తెప్పించుటకు ఇది చెప్పినాను కాని భయపెట్టుటకు కాదు. నీవు

పరాక్రమముచేత దేవతలను కూడా జయించుటకు సమర్థుడవు కదా. అందుచేత నీవు ఈ వానరసేనను వ్యూహములుగా నిలిపి చతురంగసైన్యముతో కూడిన రావణుని వధించగలవు."(19-24)

విభీషణు డిట్లు చెప్పుచుండగా విని రాముడు శత్రువులను ఎదుర్కొనుటకొరకు ఇట్లు పలికెను- "వానరశ్రేష్ఠుడైన నీలుడు చాలామంది వానరులతో కలిసి లంక తూర్పుద్వారమునందు ప్రహస్తుణ్ణి ఎదుర్కొనవలెను. వాలిపుత్రుడైన అంగదుడు గొప్ప సైన్యముతో కూడి దక్షిణద్వారమునందు మహాపార్శ్వమహోదరులను బాధించవలెను. వాయుపుత్రుడు, అప్రమేయమైన బుద్ధిబలము గలవాడు అయిన హనుమంతుడు చాలమంది వానరులతో కూడి పశ్చిమద్వారమును పీడించి లంకలో ప్రవేశించుగాక. దైత్యులను, దానవులను, మహాత్ములైన ఋషులను పీడించుటయందు ఆనందము కలవాడు, వరదానమువలన కలిగిన బలము కలవాడు, నీచుడు, సర్వలోకములలో సంచరించుచు అక్కడి ప్రజలను పీడించువాడు అయిన రావణుని నేనే స్వయముగ చంపవలె నని దృఢనిశ్చయము చేసితిని. అందుచే నేను లక్ష్మణసమేతుడనై సైన్యముతో కూడిన రావణుడు ఉన్న ఉత్తరద్వారమును పీడించి లంకలో ప్రవేశించెదను. బలవంతుడైన సుగ్రీవుడు, వీర్యవంతుడైన జాంబవంతుడు, విభీషణుడు మధ్యయందున్న సైన్యములో ఉందురుగాక. యుద్ధములో వానరులెవ్వరూ మనుష్యరూపము ధరించకూడదు. ఈ యుద్ధములో వానరసైన్యమునందు మనకు ఇదే గుర్తు. మనవారిలో అందరూ వానరులుగా ఉండుటయే గుర్తు కాగలదు. గొప్ప తేజస్సు గల నా సోదరుడైన లక్ష్మణుడు, నేను, విభీషణుడు, అతని నలుగురు మంత్రులు - మేము ఏడుగురమూ మనుష్యరూపముతోనే శత్రువులతో యుద్ధము చేసెదము."(25-35)

బుద్ధిమంతుడు, ప్రభువూ అయిన రాముడు విభీషణునితో ఇట్లు పలికి, అందమైన సువేలపర్వతము చరియను చూచి కార్యసిద్ధికొరకై, అనగా లంకను బాగుగా పరిశీలించి చూచుటకై, ఆ పర్వతమును ఎక్కవలెనని అనుకొనెను. గొప్ప బుద్ధి, ధైర్యము గల రాముడు గొప్ప సైన్యముచేత భూమినంతను కప్పివేసి చాల సంతోషించుచు, శత్రువధ చేయ సంకల్పించి లంకవైపు వెళ్లెను.(36-38)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది ఏడవ సర్గము సమాప్తము.

ముప్పది ఎనిమిదవ సర్గము

రామలక్ష్మణులు వానరముఖ్యులతో కలసి సువేలపర్వతము నధిరోహించుట.

లక్ష్మణునితో కూడిన రాముడు సువేల పర్వతము నెక్కుటకు నిశ్చయించి, సుగ్రీవునితోను, తనయం దనురక్తుడు, ధర్మములు, ఆలోచన, శాస్త్రమూ తెలిసినవాడూ అయిన విభీషణునితోను మృదువైన వాక్కుతో ఇట్లు పలికెను- "వందలకొలది ధాతువులతో వ్యాప్తమైన ఈ శ్రేష్ఠపర్వతమైన సువేలమును ఎక్కెదము. ఈ రాత్రి దీనిపై నివసించెదము. దురాత్ముడైన ఏ రావణుడు తన చావుకోసమే నా భార్యను అపహరించినాడో, ఎవడు ధర్మమును సచ్చరితమును కులమును చూడకుండగా నీచమైన రాక్షసబుద్ధితో ఇట్టి నీచకార్యము చేసినాడో ఆ రావణుని నివాసమైన లంకను చూచెదము. ఆ రాక్షసాధముని పేరు వినగానే నాకు కోపము కలుగుచున్నది. ఆ నీచుని అపరాధమునకు ఫలితముగా సకల రాక్షసులను చంపగలను. ఒక నీచుడు కాలపాశమునకు వశుడై పాపము చేయగా అతడు చేసిన అపచారమునకు ఫలితముగా కులము నశించును."(1-7)

రావణునియందు కోపము గల రాముడు ఈ విధముగా మాట్లాడుచునే విచిత్రమైన చరియలు గల సువేలపర్వతమును సమీపించి దానిపైకి ఎక్కెను. పరాక్రమవంతుడైన లక్ష్మణుడు బాణముతో కూడిన గొప్ప ధనుస్సును సిద్ధముగా ఉంచుకొని, సావధానచిత్తుడై రాముని వెనుక వెళ్ళెను. అతని వెనుక సుగ్రీవుడు, అతని మంత్రులు, విభీషణుడు వెళ్ళిరి. హనుమంతుడు, అంగదుడు, నీలుడు, మైందుడు, ద్వివిదుడు, గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, పనసుడు, కుముదుడు, హరుడు, రంభుడు, జాంబవంతుడు, సుషేణుడు, ఋషభుడు, దుర్ముఖుడు, శతబలి మొదలైన ఇంకా ఎందరో వాయువేగము వంటి వేగము గల, పర్వతసంచారులైన వందలకొలది వానరులు రాముడు ఎక్కిన ఆ సువేలపర్వతముపైకి ఎక్కిరి. వారందరూ శీఘ్రముగా నలువైపులనుండి ఆ పర్వతమునెక్కి దాని శిఖరముమీద ఆకాశములో వ్రేలాడుచున్నదా అన్నట్లు ఉన్న లంకాపట్టణమును చూచిరి. ఆ వానరనాయకులు శ్రేష్ఠమైన ద్వారములతోనూ, ఉత్తమమైన ప్రాకారముతోను ప్రకాశించుచున్న, రాక్షసులతో నిండిన ఆ సుందరమైన లంకాపట్టణమును చూచిరి. నల్లని దేహచ్ఛాయ గల రాక్షసులు ప్రాకారముమీద ఎక్కి వరుసగా నిలబడి ఉండుటచే మరొక ప్రాకారము నిర్మించబడినదా అన్నట్లుండుటను ఆ వానరశ్రేష్ఠులు చూచిరి. వానరులు యుద్ధమును కోరుచున్న

ఆ రాక్షసులను చూచి, రాముడు చూచుచుండగా అనేకవిధములైన ధ్వనులు చేసిరి.(8-17)

అప్పుడు సంధ్యచేత ఎఱ్ఱనైన సూర్యుడు అస్తమించెను. పూర్ణచంద్రునిచేత ప్రకాశింప చేయబడిన రాత్రి వచ్చెను. రాముడు, లక్ష్మణుడు, సేనానాయకుల సముదాయముతో కూడిన వానరసేనాధిపతియైన సుగ్రీవుడు విభీషణునిచేత అభినందించి సత్కరింపబడినవారై ఆ సువేలపర్వతము పైభాగమున సుఖముగా ఉండిరి.(18, 19)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది ఎనిమిదవ సర్గము సమాప్తము.

ముప్పది తొమ్మిదవ సర్గము

రాముడు, వానరులు సువేలపర్వతము శిఖరమునుండి లంకను చూచుట.

వీరులైన వానరసేనానాయకులు ఆ రాత్రి ఆ సువేలపర్వతముమీద ఉండి, లంకలోని వనములను, ఉద్యానములను చూచిరి. ఆ వనములు, ఉద్యానములు కూడ సమముగా హెచ్చు తగ్గులు లేని విధమున పెరిగి విశాలముగాను, దీర్ఘముగాను, అందముగాను ఉండెను. చూచుటకు రమ్యమైన వాటిని చూచి ఆ వానరులు ఆశ్చర్యపడిరి. ఆ లంక చంపక-అశోక-తాల-సాల-తమాల-పనస-నాగవృక్షములచేత కప్పబడి ఉండెను. అంతటా కూడ హింతాల-అర్జున-నీపవృక్షములతోను, బాగా పుష్పించిన ఏడాకుల అరటిచెట్లతోను, విచిత్రములైన పుష్పములు, ఎఱ్ఱని మృదువైన చిగుళ్ళు గల అనేక ఇతర వృక్షములతోను, అగ్రభాగములయందు పుష్పములతో నిండిన, లతలచే చుట్టబడిన వృక్షములతోను ఇంద్రుని అమరావతి వలె ప్రకాశించుచుండెను.(1-6)

అక్కడ ఉన్న వృక్షములు - సువాసనతో కూడిన, చాల రమ్యములైన పుష్పములను, ఫలములనూ, మానవులు అలంకారములను ధరించినట్లు ధరించెను. అన్ని ఋతువులకు సంబంధించి పుష్పఫలాదులతో నిండినవై, తుమ్మెదలతో కూడిన ఆ వనము చైత్రరథమువలె, నందనవనము వలె మనోహరముగా ఉండెను. వనమునందలి జలప్రవాహమునందు దాత్యూహములు, కోయష్టిభకములు అను పక్షుల ధ్వని, నృత్యము చేయుచున్న నెమళ్ళ ధ్వని, కోకిలల ధ్వని వినబడెను. ఆ

వనములలోను, ఉద్యానములలో ఉన్న పక్షులు నిత్యము మదించి ఉండెను. అంతటా తుమ్మెదలు ఎగురుచుండెను. వృక్షసముదాయములు కోకిలలతో వ్యాకులమై ఉండెను. పక్షుల ధ్వనులు, తుమ్మెదల గీతములు గోరింకల కూతలు, ఖంజనపక్షుల ధ్వనులు, సారసపక్షుల నాదములు అంతటా వ్యాపించి ఉండెను. సంతోషానందములతో కూడిన వీరులైన ఆ కామరూపము గల వానరులు ఆ వనములలోను, ఉద్యానములలోను ప్రవేశించిరి. గొప్ప తేజస్సు గల ఆ వానరులు ప్రవేశించుచుండగా, పుష్పముల సంపర్కముచేత పరిమళించుచున్న, ఘ్రాణేంద్రియమునకు సుఖకరమైన వాయువు వీచెను.(7-13)

కొందరు వానరులు సైన్యమునుండి బైటకువచ్చి సుగ్రీవుని అనుజ్ఞ తీసుకొని పతాకలతో శోభించుచున్న లంకకు వెళ్ళిరి. ధ్వని చేయువారిలో గొప్పవారైన ఈ వానరులు పక్షులను భయపెట్టుచు, మృగములకు, ఏనుగులకు భయము పుట్టించుచు, తమ ధ్వనులచేత ఆ లంకను కంపింపచేయుచు వెళ్ళిరి. గొప్ప వేగము గల ఆ వానరులు భూమిని తమ పాదములచేత పీడించుచు వెళ్ళిరి. వాళ్ళ పాదాలచేత పైకి లేచిన పరాగము వెంటనే ఎత్తుగా ఎగిరెను. ఆ శబ్దమునకు ఉలికిపడి భయపడిన ఎలుగుబంట్లు, సింహములు, మహిషములు, ఏనుగులు, మృగములు, పక్షులు పది దిక్కులకు పారిపోయినవి. ఆకాశమును స్పృశించు అత్యున్నతమైన త్రికూటపర్వతశిఖర మొకటి ఉన్నది. బంగారము వంటి ఆ శిఖరము నలుప్రక్కల పుష్పవృక్షములచేత కప్పబడి, నూరుయోజనముల విస్తారముతో నిర్మలముగా, చూచుటకు అందముగా ఉన్నది. శోభాయుక్తము, సుందరము అయిన ఈ మహాశిఖరమును పక్షులు కూడా ఎక్కుట చాల కష్టము. జనులు దీనిని మనస్సుచేత కూడ ఎక్కజాలరు. ఇంక నడిచి ఎక్కజాలరని వేరే చెప్పవలెనా?(14-19)

పది యోజనముల విస్తారము, ఇరవై యోజనముల పొడవు గల రావణపాలితమైన లంక ఆ శిఖరముమీద ఉన్నది. ఆ లంక తెల్లని మేఘముల వంటి ఉన్నతములైన గోపురములతోను, బంగారు ప్రాకారముతోను, వెండి ప్రాకారముతోను శోభించుచుండెను. పెద్ద భవనములచేత, విమానములచేత(అందమైన గృహములచేత) అలంకృతమైన ఆ లంక వర్షాకాలమునందు మేఘావృతమైన ఆకాశము వలె ఉండెను. అక్కడ వెయ్యి స్తంభములచేత అలంకరింపబడిన చైత్యప్రాసాదము రావణుని నగరమునకు అలంకారముగా ఉండెను. అది కైలాసశిఖరము వలె ఆకాశమును ఒరయుచుండెను. దానిని నిత్యము పూర్తి రాక్షససేన రక్షించుచుండెను. మనోహరమైన ఆ లంక బంగారముతో నిండి యుండెను.

అనేకవిధములైన ధాతువులతో విచిత్రవర్ణము గల పర్వతములతోను, ఉద్యానవనములతోను ప్రకాశించుచుండెను. అనేక విధములైన పక్షుల ధ్వనులతో నిండిన ఆ నగరములో అనేకవిధములైన మృగములు నివసించుచుండెను. అనేక విధములైన పుష్పములతో నిండిన ఆ నగరములో అనేకవిధములగు రాక్షసులు నివసించుచుండిరి. ఐశ్వర్యసమృద్ధమై, సమృద్ధమైన ధనము గల ఆ నగరమును శోభాసంపన్నుడైన రాముడు, వానరులు చూచిరి.(20-27)

పరాక్రమవంతుడైన రాముడు గొప్ప భవనములతో ఇరుకుగా ఉన్న, స్వర్గతుల్యమైన ఆ నగరమును చూచి ఆశ్చర్యము చెందెను. అనేకములైన శ్రేష్ఠవస్తువులతో నిండిన ఆ నగరములో అనేకవిధములైన ఏర్పాట్లు చేయబడెను. ప్రాసాదముల పంక్తులచే అలంకరించబడిన ఆ మహానగరమునందలి తలుపులకు పెద్ద పెద్ద యంత్రములు అమర్చబడి ఉండెను. అంతటా సైన్యము ఆ నగరమును రక్షించుచుండెను. అట్టి లంకానగరమును రాముడు చూచెను.(28, 29)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ముప్పది తొమ్మిదవ సర్గము సమాప్తము.

నలుబదవ సర్గము

సుగ్రీవరావణుల మల్లయుద్ధము.

పిమ్మట రాముడు సుగ్రీవునితోను, వానరసేనానాయకులతోను కలసి వెళ్ళి రెండు యోజనముల మండలాకారమైన విశాలప్రదేశము గల సువేల పర్వతమును ఎక్కెను. అతడు అక్కడ ముహూర్తకాలము ఉండి పది దిక్కులను చూచుచు, రమ్యమైన త్రికూటపర్వతశిఖరముపైన విశ్వకర్మ మంచి ఏర్పాటులతో నిర్మించిన, అందమైన వనములతో ప్రకాశించుచున్న లంకను చూచెను. జయింపశక్యము కానివాడైన రాక్షసరాజు రావణుడు ఆ నగరమునందు గోపురాగ్రమునందు కూర్చొనియుండగా రాము డాతనిని చూచెను. ఆ రావణుని రెండు పార్శ్వములందు తెల్లని వింజామరలు, తలపై విజయచ్ఛత్రము శోభించుచుండెను. నల్లని మేఘము వలె ఉన్న అతడు ఎఱ్ఱని చందనము పూసికొని ఎఱ్ఱని అలంకారములు ధరించెను. అతని వస్త్రముమీద బంగారు రచనలు ఉండెను. ఐరావతము దంతము దెబ్బలు తగిలి అతని వక్షఃస్థలముమీద కాయలు కాచెను. చెవులపిల్లి రక్తమువంటి ఎఱ్ఱని



వస్త్రము ధరించి ఉండుటచేత అతడు సాయంకాలపు ఎండ వ్యాపించిన మేఘరాశి వలె కనబడుచుండెను. (1-6)

రావణుణ్ణి చూడగానే సుగ్రీవుడు, వానరనాయకు లందరూ చూచు చుండగా, రాముడు కూడా చూచు చుండగా హటాత్తుగా పైకి లేచెను. ధైర్యబలసంపన్నుడైన ఆ సుగ్రీవుడు క్రోధావేశముతో పర్వతాగ్రమునుండి పైకి ఎగిరి గోపురమువైపు దుమికెను. అతడు క్షణకాలము నిలచి పరిశీలించి చూచి నిర్భయమైన మనస్సుతో ఆ రాక్షసుణ్ణి గడ్డిపరక వలె చూచుచు పరుషమైన వచనమును పలికెను. - "రాక్షసుడా! నేను సమస్తలోకముల ప్రభువైన రాముని మిత్రుడను; అతని దాసుడను. ఇప్పుడు ఆ రాముని తేజస్సుచేత నేను నిన్ను విడువను." ఇట్లు పలికి శీఘ్రముగా వానిపైకి దుమికి అతని విచిత్రవర్ణములు గల కిరీటమును లాగి క్రింద పడవేసెను. శీఘ్రముగా వచ్చుచున్న ఆ సుగ్రీవుని చూచి రావణుడు- " నీవు నా ఎదుటికి రానంతవరకు సుగ్రీవుడవే కాని ఇప్పుడు హీనగ్రీవుడవు కాగలవు." అని పలుకుచు సుగ్రీవుణ్ణి బాహువులతో పట్టి క్రింద పడవేసెను. సుగ్రీవుడు బంతివలె లేచి చేతులతో రావణుణ్ణి క్రిందికి పడవేసెను. (7-13)

మహాబలవంతులైన ఆ రావణసుగ్రీవు లిద్దరూ చెమటకారుచున్న, రక్తముచేత ఎఱ్ఱనైన దేహములుకలవారై, పరస్పరము గట్టిగా అదిమి పట్టుకొనుటచేత నిరోధింపబడిన చేష్టలు కలవారై, పుష్పించిన శాల్మలీవృక్షము కింశుకవృక్షమూ వలె ఉన్నవారై, పిడికిళ్ళతోను, అరచేతులతోను, అరత్నులతోను, హస్తాగ్రములతోను కొట్టుకొనుచు సహింపశక్యము కాని యుద్ధము చేసిరి. చాల తీవ్రమైన వేగము గల ఆ రావణసుగ్రీవులు గోపురము వేదిమధ్యయందు చాల సేపు బాహుయుద్ధము చేసి శరీరములను ఎత్తీ ఎత్తి వంచి, పాదక్రమముచేత (క్రమముగా అడుగులు వేయుచు) గోపురవేదియందు నిలిచిరి. వాళ్ళు ఒకరినొకరు గట్టిగా అదిమిపట్టి, దగ్గరగా ఉన్న దేహములు కలవారై ప్రాకారమునకు, పరిఖకు మధ్యయందు పడిరి. ముహూర్తకాలము నిట్టూర్చుచు నిలబడి, మళ్ళీ ఒకరినొకరు పట్టుకొని నేలమీదికి పైకి దుమికిరి. వాళ్ళిద్దరూ యుద్ధమునందు కౌగిలించుకొని బాహుపాశములతో

ఒకరినొకరు కట్టివేసిరి. తొందరతోను, అభ్యాసమువలన ఏర్పడిన నేర్పుతోను, బలముతోను కూడిన వాళ్ళిద్దరూ అప్పుడు యుద్ధమార్గమునందు సంచరించిరి. కోరలువచ్చిన పెద్దపులీ, సింహమూవలె, కలిసిన ఏనుగుపిల్లలవలె వాళ్ళు కలసి చేతులతో ఒండొరుల బలమును తెలిసికొని, ఒక్కమారుగా నేలమీద పడిరి. వాళ్ళు ఒకరినొకరు పైకెత్తి క్రిందపడవేయుచు యుద్ధమార్గమునందు అనేకవిధముల సంచరించిరి. వ్యాయామమువలన, అభ్యాసమువలన కలిగిన బలము గల ఆ వీరులిద్దరూ వెంటనే అలసటను పొందలేదు.(14-20)

ఉత్తమములైన ఏనుగుల వలె ఉన్న వారిరువురూ, ఏనుగ తొండములవంటి ఉత్తమములైన బాహువులతో ఒకరినొకరు నివారించుచు, చాలసేపు యుద్ధము చేసి శీఘ్రముగా గుండ్రముగా తిరిగిరి. ఒకరినొకరు చంపుటకు ప్రయత్నించుచున్న వాళ్ళిద్దరూ ఒక భక్ష్యముకొరకు పోట్లాడుచున్న పిల్లులవలె మాటిమాటికి ఒకరి నొకరు ఆక్రమించుచుండిరి. యుద్ధమార్గమునందు నేర్పుగల ఆ రావణసుగ్రీవులు మల్లయుద్ధములో మల్లులు తిరుగు అనేక మండలములు తిరుగుచు, అనేకవిధములైన స్థితులను చేయుచు విచిత్రములైన గోమూత్రికలను, చిత్రములైన గతప్రత్యాగతములను, తిర్యగ్గమన-వక్రగమనములను, ప్రహారములను, పరిమోక్షమును, వర్జనమును, పరిధావనమును, అభిద్రవణమును, ఆప్లావమును, అవస్థానమును, పరావృత్త-అపావృత్త-అపద్రుత- అవప్లుతములను, ఉపన్యస్త-అపన్యస్తములను చరించిరి.(21-26)

ఇంతలో రావణుడు తన మాయాబలమును చూపుటకు ప్రారంభించెను. సుగ్రీవుడు ఆ విషయము కనిపెట్టి జయముతో ప్రకాశించెను. ఏ మాత్రము అలసట లేనివాడై ఆకాశముమీదికి ఎగిరిపోయెను. రావణుడు ఈ విధముగా సుగ్రీవునిచేత మోసగింపబడి అక్కడనే ఉండిపోయెను. పిమ్మట వానరప్రభువైన సుగ్రీవుడు యుద్ధములో కీర్తి పొంది, రావణునకు యుద్ధమునందు శ్రమ కలిగించి, అతివిశాలమైన ఆకాశమును దాటి వానరసేనామధ్యమునందున్న రాముని పార్శ్వము చేరెను. సూర్యపుత్రుడైన ఆ సుగ్రీవుడు అక్కడ ఆ విధముగా చేసి, రాముని యుద్ధోత్సాహమును వృద్ధి పొందించుచు, సంతోషించుచు, వానరనాయకులచే పూజింపబడుచు, వాయువేగముతో సైన్యములోనికి వచ్చి చేరెను.(27-30)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబదవ సర్గము సమాప్తము.

నలుబది ఒకటవ సర్గము

ఇట్టి దుస్సాహసము చేయగూడదని రాముడు సుగ్రీవునకు చెప్పి, అంగదుని రావణునివద్దకు దూతగా పంపుట.

పిమ్మట రాముడు ఆ ప్రదేశమునందు కనబడుచున్న శకునములను చూచి, సుగ్రీవుణ్ణి కౌగిలించుకొని ఇట్లు పలికెను– "నీవు నాతో ఆలోచించకుండగా ఇట్టి సాహసము చేసినావు! ప్రభువులైనవాళ్ళు ఇట్టి సాహసకృత్యములు చేయరు. నీవు ఇట్టి కష్టమైన సాహసకృత్యము చేసి నన్ను, ఈ సైన్యమును, ఈ విభీషణునీ కూడా సంశయస్థితితో ఉంచినావు. శత్రువినాశకుడవైన ఓ! వీరుడా! ఇటుపైన ఇట్టి కార్యము ఎన్నడూ చేయకుము. నీకు ఏ మాత్రము ఆపద కలిగినా నాకు సీతతో కాని, భరతునితో గాని, తమ్ముడైన లక్ష్మణునితో గాని, శత్రుఘ్నునితో గాని, నా శరీరముతో గాని ఏమి ప్రయోజనము? మహేంద్రునితోను, వరుణునితోను, సమానుడవైన ఓ! మహాబలశాలివైన సుగ్రీవుడా! నీవు మరల తిరిగి రానిచో, 'రావణుణ్ణి, అతని పుత్ర–సైన్య వాహనములను యుద్ధమునందు సంహరించి, విభీషణుణ్ణి లంకలో అభిషిక్తుని చేసి, పిదప భరతునకు రాజ్యము ఇచ్చివేసి ప్రాణత్యాగము చేయుదము.' అని, నీ పరాక్రమము తెలిసినవాడనే అయినను, నేను నిశ్చయించుకొంటిని."(1–7)

రాముని మాటలు విని సుగ్రీవుడు– "వీరుడవైన రామా! నీ భార్యను అపహరించిన రావణుడు నా కంటబడిన తరువాత, నాకున్న బలము తెలిసిన నేను, ఎట్లు ఊరకుండగలను?" అనెను.(8,9)

రాముడిట్లు పలుకుచున్న ఆ సుగ్రీవుణ్ణి అభినందించి, శోభాసంపన్నుడైన లక్ష్మణునితో ఇట్లు పలికెను– "లక్ష్మణా! చల్లని నీరు, ఫలములతో నిండిన వనము ఉన్న చోటు చూచుకొని, ఈ సైన్యమును వ్యూహములుగా ఏర్పరచి నిలచెదము. లోకక్షయమునకు హేతువు, వీరులైన భల్లూకములు, వానరులు, రాక్షసులు నశించేటట్లు చేసేది అయిన భయంకరమైన భయనిమిత్తము వచ్చినట్లు చూచుచున్నాను. గాలులు తీవ్రముగా వీచుచున్నవి. భూమి అదురుచున్నది. పర్వతశిఖరములు కదలిపోవుచున్నవి. పర్వతములు ధ్వని చేయుచున్నవి. క్రూరమృగముల వలె భయంకరములైన పరుషముగా ధ్వనిచేయుచున్న క్రూరములైన మేఘములు, భయము కలుగునట్లుగా, రక్తబిందువులతో కూడిన జలమును వర్షించుచున్నవి. ఎఱ్ఱని చందనమువంటి రంగుతో సంధ్య చాల భయంకరముగా

ఉన్నది. సూర్యునినుండి ఒక అగ్నిమండలము మండుచూ క్రింద పడుచున్నది. క్రూరములు అమంగళకరములు అయిన మృగములు, పక్షులు దీనములై, దీనమైన స్వరముతో సూర్యునకు ఎదురుగా నిలచి అరచుచు గొప్ప భయమును పుట్టించుచున్నవి. ప్రళయకాలమునందు వలె పర్యంతభాగములందు నల్లగాను, ఎఱ్ఱగాను ఉన్న కిరణములు గలిగి అప్రశస్తుడుగా ఉన్న చంద్రుడు రాత్రులయందు సంతాపమును(మనస్సుకు భయమును) కలిగించుచున్నాడు. లక్ష్మణా! సూర్యమండలమునందు నల్లని కలంకము, చిన్నది, భయంకరము, చాల ఎఱ్ఱనిది, అప్రశస్తము అయిన పరివేషము కనబడుచున్నది. నక్షత్రములు పూర్వము ఉన్న విధముగా కనబడుటలేదు. ఈ విధముగా కనబడుచున్న ఈ దుశ్శకునసముదాయము లోకమునకు ప్రళయము రానున్నట్లు చెప్పుచున్నదా అన్నట్లు ఉన్నది. చూడుము. కాకులు, డేగలు, గ్రద్దలు క్రింది భాగమునందు ఎగురుచున్నవి. గొప్ప ధ్వని గల నక్కలు కూడ అమంగళకరమైన కూతలు కూయుచున్నవి. వానరులు, రాక్షసులు ప్రయోగించిన పర్వత -శూల-ఖడ్గములచేత కప్పబడిన భూమి మాంసము రక్తము అను బురదతో నిండగలదు. మనమిప్పుడు వెంటనే వానరులతో కూడి ఎదిరింప శక్యము కాని, రావణరక్షితమైన లంకానగరమును వేగముగా అన్ని వైపులనుండీ ముట్టడించెదము."(10-22)

రాముడు లక్ష్మణునితో ఇట్లు పలుకుచు ఆ పర్వతాగ్రమునుండి శీఘ్రముగా దిగెను. దిగి, శత్రువులచేత ఎదిరింప శక్యముకాని తన సైన్యమును చూచెను. ఏ సమయమునందు ఏమి చేయవలెనో తెలిసిన సుగ్రీవసహితుడైన రాముడు విశాలమైన ఆ వానరసైన్యమును సిద్ధముగా ఉండునట్లు చేసి, తగు సమయమునందు యుద్ధమునకై ప్రేరేపించెను. పిమ్మట అతడు పెద్ద సైన్యముతో కూడి, తగిన ముహూర్తమునందు ధనుర్ధరుడై ముందు నడచుచు లంకాపురమువైపు బయలుదేరెను. అపుడు విభీషణసుగ్రీవులు, హనుమంతుడు, జాంబవంతుడు, నలుడు, నీలుడు, లక్ష్మణుడు రాముని వెంట వెళ్ళిరి. వాళ్ల వెనుకనే గొప్పదైన వానరభల్లూకసేన విశాలమైన భూమిని కప్పివేయుచు వెళ్ళెను. శత్రువినాశకులు, ఏనుగులతో సమానులు అయిన వానరులు పర్వతశిఖరములను, వందలకొలది మహావృక్షములను గ్రహించి వెళ్ళిరి. రామలక్ష్మణులు స్వల్పకాలములోనే రావణపాలితమైన ఆ లంకానగరమును సమీపించిరి.(23-30)

పతాకల పంక్తులతో కూడిన ఆ లంకానగరము ఉద్యానవనములతో ప్రకాశించుచుండెను. దాని ప్రాకారము చిత్రముగాను ఉన్నతముగాను ఉండెను.

ముఖద్వారములు చాల ఎత్తుగా ఉండెను. రామునిచేత ప్రేరేపింపబడిన ఆ వానరులు దేవతలచేత ఎదిరింప శక్యము కాని సుందరమైన లంకను రామాజ్ఞప్రకారము పీడించుచు దాని చుట్టూ ముట్టడించుటకు సిద్ధముగా నిలచిరి. లక్ష్మణసహితుడైన రాముడు ధనుస్సు ధరించి, పర్వతశిఖరము వలె ఎత్తైన లంకానగరోత్తరద్వారమును రక్షించుచు లోనివాళ్ళెవరూ బైటకు రాకుండునట్లు నిరోధించెను. అతడు లక్ష్మణసమేతుడై రావణునిచే రక్షింపబడుచున్న లంక చేరి, దేని దగ్గర రావణుడు ఉండెనో అట్టి ఉత్తరద్వారము దగ్గర నిలచెను. రావణుని చేత అధిష్ఠింపబడిన ఆ ద్వారము వరుణుడు అధిష్ఠించి ఉన్న సాగరము వలె చాల భయంకరమైనది. ఆయుధములు ధరించిన భయంకరులైన రాక్షసులు దానిని అన్నివైపుల నుండీ రక్షించుచుండిరి. దానవులతో కూడిన పాతాళము వలె ఆ ద్వారము సామాన్యులకు భయము కలిగించును. అట్టి ఆ ద్వారమును రక్షించుటకు(ముట్టడించుటకు) రాముడు తప్ప మరెవ్వరూ సమర్థులు కాదు కదా? అక్కడ ఉన్న యోధులకు చెందిన అనేకవిధములైన ఎన్నో ఆయుధములను, కవచములను చూచెను.(31-37)

వానరసేనాధిపతి, పరాక్రమవంతుడు అయిన నీలుడు మైందునితోను, ద్వివిదునితోన కలిసి తూర్పు ద్వారము వద్ద నిలచెను. అంగదుడు ఋషభ-గవాక్ష-గజ-గవయులతో కలసి దక్షిణద్వారము వద్ద నిలచెను. బలశాలియైన హనుమంతుడు ప్రజంఘతరసులతోను, ఇతరులైన వీరులతోను కూడి పశ్చిమద్వారమువద్ద నిలచెను. సుగ్రీవుడు గరుత్మంతునితోను, వాయువుతోను సమానులైన సమస్తవానరశ్రేష్ఠులతో కూడి స్వయముగా మధ్యమగుల్మమునందు (సేనామధ్యమునందు) నిలచెను. సుగ్రీవుడు ఉన్న చోటనే ప్రసిద్ధ సేనానాయకులైన ముప్పదియారుకోట్ల మంది వానరులు రాక్షసులను ఎదిరించుటకై నిలిచి ఉండిరి. లక్ష్మణవిభీషణులు రాముని ఆజ్ఞ ప్రకారము ప్రతిద్వారమువద్ద ఒక్కొక్క కోటి వానరులను నిలిపిరి. సుషేణుడు, జాంబవంతుడు, అధికమైన సైన్యముతో మధ్యమగుల్మమునందు, రామునకు పశ్చిమముగా, సమీపమునందు నిలిచిరి.(38-44)

పెద్దపులులవలె కోరలు గల ఆ వానరశ్రేష్ఠులు వృక్షములను, పర్వతశిఖరములను గ్రహించి, ఉత్సాహముతో యుద్ధమునకై బయలుదేరిరి. ఆ వానరులందరు తోకలను పైకి ఎత్తి ఉండిరి. కోపోద్రేకముచేత వాళ్ళ ముఖములు, శరీరము వికారముచెంది విచిత్రముగా ఉండెను. ఆ వానరులలో కొందరు పది ఏనుగుల బలము గలవారు, కొందరు నూరు ఏనుగుల బలము గలవారు, కొందరు వేయి ఏనుగుల బలము గలవారు ఉండిరి. కొందరు ఓఘసంఖ్యలో ఉన్న ఏనుగుల

బలముగలవారు. కొందరు పది ఓఘముల ఏనుగుల బలముగలవారు. కొందరు వానరనాయకుల బలము ఇంత అని చెప్పశక్యముకాదు. అక్కడ గుమిగూడిన వానరసైన్యములు మిడతలదండువలె ఆశ్చర్యకరముగాను, విచిత్రముగాను ఉండెను. కొందరు వానరులు లంక చేరిరి. కొందరు చేరుచుండిరి. అట్టి వానరులతో భూమ్యాకాశములు పూర్తిగా నిండిపోయినట్లుండెను. కోటి భల్లూకములు, కోటి మంది వానరులు వేరు వేరుగను, మరికొందరు వానరులును, యుద్ధము చేయుటకై అన్ని వైపులనుండి లంకానగరద్వారములను చేరిరి. ఆ పర్వతము అన్ని ప్రాంతములందూ వానరులచేత కప్పబడి ఉండెను. వెయ్యి అయుతముల వానరులు ఆ పట్టణము చుట్టూ చేరిరి. వృక్షములు ధరించిన బలవంతులైన వానరులచేత అన్ని వైపులా చుట్టుముట్టబడిన ఆ లంకలోనికి గాలి కూడ ప్రవేశించుటకు శక్యము కాకుండా ఉండెను.(45-53)

వానరులు హటాత్తుగా వచ్చి లంకను ముట్టడించగానే రాక్షసులందరు ఆశ్చర్యపడిరి. ఒడ్డు బ్రద్దలు కొట్టి(తెంచుకొని) వచ్చుచున్న సముద్రము వలె అక్కడ వానరసైన్యము వచ్చి చేరుచుండగా, సముద్ర జలధ్వని వంటి గొప్ప ధ్వని కలిగెను. చాలా గొప్పదైన ఆ శబ్దానికి ప్రాకారములతో, ముఖద్వారములతో, ఉద్యానములతో, అరణ్యములతో సహా ఆ లంక అంతా అదిరిపోయెను. రామలక్ష్మణసుగ్రీవులచేత రక్షింపబడుచున్న ఆ వానరసేన సురాసురు లందరూ వచ్చిననూ జయింప శక్యముకానిదిగా ఉండెను. దేని తరువాత ఏది చేయవలెనో అను విషయమూ, కార్యతత్త్వమూ బాగుగా తెలిసిన రాముడు తన సైన్యమును రాక్షసుల సంహారము నిమిత్తమై ఈ విధముగా నిలిపి, మంత్రులతో మాటిమాటికి ఆలోచించి, నిశ్చయించి, తరువాత చేయదగిన దానిని చేయవలె నను కోరికతో రాజధర్మమును పాటించుచు, విభీషణుని సలహాప్రకారము వాలిపుత్రుడైన అంగదుని పిలచి ఇట్లు పలికెను- (54-60)

"సౌమ్యుడవైన ఓ! అంగదుడా! నీవు నిర్భయముగా లంకాపురము ప్రాకారము దాటి, మరణించవలెననే కోరికచేత చెడిపోయిన మనస్సు గల ఐశ్వర్యభ్రష్టుడైన రావణునివద్దకు వెళ్ళి, నా మాటగా అతనితో ఇట్లు చెప్పుము- 'ఓ! రావణా! ఋషులు, దేవతలు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, యక్షులు, రాజులు వీరి విషయమున నీవు మదాంధుడవై చేసిన పాపమునకు భరింపరాని ఫలము ఇప్పుడు ప్రాప్తించనున్నది. బ్రహ్మదేవుడిచ్చిన వరములవలన కలిగిన నీ గర్వమంతా నశించే సమయము ఆసన్నమైనది. భార్యను హరించుటద్వారా పీడ కలిగింపబడిన నేను

అట్టి నీకు దండమును విధించువాడను. నీకు దండమును విధించుటకై లంకాద్వారమునందు నిలచి ఉన్నాను. ఓ! రాక్షసుడా! నాచేత చంపబడి నీవు దేవతలు, మహర్షులు, రాజర్షులు నీ మూలమున ఏ మార్గమును(మరణమును) పొందారో ఆ మార్గమున పోయెదవు. ఓ! రాక్షసాధమా! నీవు ఏ బలమును చూచుకొని మాయచేత నన్ను దూరము చేసి సీతను హరించినావో ఆ బలమును చూపుము. నీవు సీతను అప్పగించి శరణు వేడకపోయినచో వాడియైన బాణములచేత ఈ లోకములో ఎక్కడా రాక్షసులు లేకుండా చేసెదను. ధర్మాత్ముడు, రాక్షసశ్రేష్ఠుడు అయిన విభీషణుడు నన్ను చేరినాడు. ఇతడు ఏ శత్రుబాధాదికమూ లేని లంకాధిపత్యమును పొందగలడు. మూర్ఖులైన మంత్రులు మొదలైన సహాయులు గల పాపాత్ముడవు, ఆత్మనిగ్రహము లేనివాడవు అయిన నీవు ఇంక క్షణకాలము కూడ అధర్మమార్గమునందు ఆ రాజ్యమును అనుభవించజాలవు. ఓ! రాక్షసుడా! నీవు ధైర్యముతో శౌర్యమును అవలంబించి యుద్ధము చేయుము. యుద్ధములో నా బాణములచేత చంపబడి శాంతి పొందెదవు. పక్షిరూపము ధరించి మూడులోకములలో ప్రవేశించినను నీవు నా కంట బడిన పిమ్మట తిరిగి వెళ్ళజాలవు. నీకు హితమైన వాక్యము చెప్పుచున్నాను - పరలోకమునకు ఉపకరించు శ్రాద్ధాదికమును చేసికొనుము. లంకను చివరిసారిగా బాగా చూచుకొనుము. నీ ప్రాణములు నాచేతిలో ఉన్నవి."(61-73)

రాముడు చెప్పిన మాటలు విని తారాకుమారుడైన అంగదుడు శరీరము ధరించిన అగ్నిదేవుడు వలె ఆకాశములో ప్రవేశించి వెళ్ళెను. అతడు క్షణకాలములో రావణుని భవనమును చేరి మంత్రులతో కూడి కూర్చొని ఉన్న రావణుణ్ణి ఏ మాత్రము భయము లేనివాడై చూచుచు, దగ్గరగా దిగి నిలబడెను. అతడు తనను గూర్చి తానే వారికి తెలిపి, ఉత్తమమైన ఆ రామసందేశమును అంతనూ ఉన్నదున్నట్లుగా, ఎక్కువగాని, తక్కువగాని, కాకుండా మంత్రిసమేతుడైన ఆ రావణునకు తెలిపెను. - "నేను వాలిపుత్రుడనైన అంగదుడను. కోసలాధిపతియైన రాముని దూతను. నీవు విని యుండవచ్చును. రఘువంశసంభూతుడు, కౌసల్య ఆనందమును వృద్ధి పొందించువాడు అయిన రాముడు నీతో ఇట్లు చెప్పుచున్నాడు - 'ఓ క్రూరుడా! నీవు బైటకు వచ్చి యుద్ధము చేయుము. పౌరుషమును చూపుము. నిన్ను నీ అమాత్యులను, పుత్రులను, జ్ఞాతులను, బంధువులను చంపివేసెదను. నీవు మరణించిన పిదప మూడు లోకములు భయములేకుండా ఉండగలవు. దేవ-దానవ-యక్ష-గంధర్వ- ఉరగ-రాక్షసులకు శత్రువు, ఋషులకు బాధ

కలిగించువాడవు అయిన నిన్ను ఇప్పుడు నశింపచేసెదను. నీవు నమస్కరించి సత్కారపూర్వకముగా సీతను అప్పగించకపోయినచో నీవు చంపబడగలవు. అప్పుడు నీ ఐశ్వర్యము విభీషణునికి చెందగలదు.'(74-82)

వానరశ్రేష్ఠుడైన అంగదు డిట్లు పరుషముగా మాటలాడుచుండగా అది విని రావణుడు కోపమునకు వశుడయ్యెను. రోషావిష్టుడైన అతడు "ఈ దుర్బుద్ధిని పట్టుకొనండి, చంపండి." అని మంత్రులను ఆజ్ఞాపించెను. రావణుని మాటలు విని భయంకరులైన నలుగురు రాక్షసులు మండుచున్న అగ్నివలె ఉన్న ఆ అంగదుని పట్టుకొనిరి. బుద్ధిమంతుడు, వీరుడూ అయిన అంగదుడు ఆ రాక్షసుల సముదాయమునందు తన బలమును చూపుటకు తనంతట తానే పట్టుబడి, తన బాహువులమీదనుండి, వ్రేలాడుచున్న ఆ రాక్షసులను పక్షులను వలె గ్రహించి పర్వతము వలె ఉన్న ప్రాసాదముమీదికి ఎగిరెను. అతడు పైకి ఎగిరే వేగముచేత దులిపివేయబడినవారై ఆ రాక్షసులు నలుగురూ రావణుడు చూచుచుండగానే అక్కడ నేలమీద పడిపోయిరి. పిమ్మట అంగదుడు పర్వతశిఖరము వలె ఉన్నతమైన రావణుని ప్రాసాదము అగ్రభాగముమీదికి ఎక్కెను. అతడు ఎక్కగానే ఆ ప్రాసాదశిఖరము, పూర్వము వజ్రాయుధముచేత బ్రద్దలుకొట్టబడిన హిమవత్పర్వతశిఖరము వలె, రావణుడు చూచుచుండగానే, బ్రద్దలైపోయెను. అంగదుడు ప్రాసాదశిఖరమును విరుగగొట్టి, తన పేరును చాటి, ఎక్కువ ధ్వని కలుగునట్లుగా అరచి, ఆకాశమార్గమున ఎగిరివెళ్ళి, రాక్షసులందరికీ బాధ కలిగించుచు, వానరులకు ఆనందము కలిగించుచు, వానరుల మధ్యలో ఉన్న రాముని చేరెను.(83-92)

తన ప్రాసాదమును ఆ విధముగా ఆక్రమించుట వలన రావణునకు చాల కోపము వచ్చెను. అతడు తన వినాశము ఆసన్నమైనదని ఊహించుకొని ఎక్కువ నిట్టూర్పులు విడచెను. సంతోషముతో ధ్వనిచేయుచున్న అనేక వానరులతో కూడిన రాముడు శత్రువును చంపవలెనని కోరుచు యుద్ధమునకే సన్నద్ధుడై ఉండెను. గొప్ప పరాక్రమము గలవాడు, పర్వతశిఖరమువంటి ఆకారము గలవాడు అయిన సుషేణుడు స్వేచ్ఛానుసారము రూపము ధరించగల చాలామంది వానరులతో కూడి అక్కడ ఉండెను. ఎదిరింపశక్యము కాని ఆ సుషేణుడు సుగ్రీవుని వచనము ప్రకారము ద్వారముల నన్నింటిని అద్దగించి, చంద్రుడు ఆ యా రాసులలో సంచరించినట్లు సంచరించుచుండెను. లంక సమీపమున విడిసి సముద్రము వైపున ఉన్న వానరుల అనేక అక్షౌహిణులను చూచి కొందరు రాక్షసులు ఆశ్చర్యపడిరి.

కొందరు భయపడిరి. కొందరు యుద్ధమునందు ఉత్సాహము కలవారగుట చేత సంతోషించిరి. దీనులైన రాక్షసులు ప్రాకారమునకు అగడ్తకు మధ్యనున్న ప్రదేశమంతా వానరులచే ఆక్రమింపబడి వానరులనే ప్రాకారము కట్టబడినట్లు ఉందుట చూచిరి. రాక్షసులు భయముతో హాహాకారము చేసిరి. చాలా భయంకరమైన ఆ కోలాహలము ప్రారంభము అయిన వెంటనే లంకలో, రాక్షసులు గొప్ప ఆయుధములు ధరించి ప్రళయకాలఝంఝామారుతముల వలె సంచరించిరి.(93-100)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది ఒకటవ సర్గము సమాప్తము.

నలుబది రెండవ సర్గము

వానరులు లంకను ఆక్రమించుట, రాక్షసులతో యుద్ధము చేయుట.


అక్కడనున్న రాక్షసులు రావణుని ఇంటికి వెళ్ళి "వానరులతో కూడిన రాముడు లంకను ముట్టడించినాడు." అని చెప్పిరి. నగరము ముట్టడింపబడిన దని విని రావణుడు రక్షణకై రెట్టింపు ఏర్పాట్లు చేసి ప్రాసాదము పైకి ఎక్కెను. అతడు యుద్ధము కోరుచున్న లెక్కింపశక్యముకాని వానరసముదాయములచేత అన్నివైపులా చుట్టుముట్టబడిన, శైల-వన-అరణ్యసహితమైన లంకను చూచెను. వానరులందరు కప్పివేయుటచేత కపిలవర్ణముతో(పసుపుపచ్చగా) ఉన్న భూమిని చూచి, వీళ్ళని నశింపచేయుట ఎట్లా అని ఆలోచనలో మునిగెను. చాలసేపు ఆలోచించి, ధైర్యము అవలంబించి, ఆశ్చర్యముచేత వికసించిన నేత్రములతో రాముణ్ణి, వానరసైన్యములను చూచెను.(1-5)

రాముడు సంతోషించుచు సైన్యముతోకూడ కొంచెము ముందుకు శీఘ్రముగా వెళ్ళెను. అంతటా నిండిఉన్న రాక్షసులచేత రక్షింపబడుచున్న లంకను చూచెను. విచిత్రములైన ధ్వజములు, పతాకలు గల లంకను చూచి రాముడు దుఃఖించుచున్న మనస్సుతో- "సీత శోకముతో బాధపడుచు, కృశించి, నేలమీద శయనించుచు నా కోసమే పీడింపబడుచున్నది కదా!" అని సీతను స్మరించెను. రాముడు బాధింపబడుచున్న సీతను స్మరించుచు శత్రువులను సంహరించుటకై వానరులను వెంటనే ఆజ్ఞాపించెను. రాముని మాటలు విని వానరులు, ఒకరితో ఒకరు పోటీపడుచు దిక్కులను సింహనాదములతో నింపిరి. "ఈ లంకపై పర్వతశిఖరములను

వర్షించెదము; లేదా పిడికిళ్ళతో బ్రద్దలు కొట్టెదము." అని ఆ వానరనాయకులు మనస్సులలో తలచిరి.(6-11)

వానరసేనాయకులు పర్వతశిఖరములను ఎత్తి, పెద్ద శిఖరములను, అనేకవిధములైన వృక్షములను పెకలించి యుద్ధసన్నద్ధులై నిలచి ఉండిరి. వానరసైన్యములు గుంపులు గుంపులుగా ఏర్పడి, రావణుడు చూచుచుండగానే, రామునకు సంతోషము కలిగించవలెనను కోరికతో లంకను ఎక్కినవి. ఎఱ్ఱని ముఖములు, బంగారు శరీరచ్ఛాయ గల ఆ వానరులు రాముని కొరకై జీవితములను విడచుటకు ఉద్యుక్తులై వృక్షములను, పర్వతములను ఆయుధములనుగా తీసికొని లంకవైపు వెళ్ళిరి. వాళ్లు వృక్షముల చేత, పర్వతశిఖరములచేత, పిడికిళ్ళ చేత అనేకములైన ప్రాకారశిఖరములను, ముఖద్వారములను పడగొట్టిరి. నిర్మలమైన ఉదకముతో నిండిన పరిఖలను, మట్టి, పర్వతశిఖరములు, గడ్డి, కఱ్ఱలు వేసి నింపివేసిరి. వేయి యూథములు గల యూథనాయకులు, కోటి యూథములు గలవారు, వందకోట్లు యూథములు కలవారు, లంకమీదకు దండెత్తిరి. వానరులు బంగారు ముఖద్వారములను విరుగగొట్టుచు, కైలాస శిఖరముల వంటి గోపురములను పడగొట్టుచు లంకను ఆక్రమించిరి. మహాగజములవంటి ఆ వానరులు ఎగురుచు, దుముకుచు, గర్జించుచు ఆ లంక వైపు పరుగెత్తిరి. కోరిన రూపములు ధరించగల ఆ వానరులు "గొప్ప బలము గల రాముడు సర్వోత్కర్షగా ఉన్నాడు; మహాబలశాలియైన లక్ష్మణుడు, రామునిచేత రక్షింపబడుచున్న రాజైన సుగ్రీవుడు సర్వోత్కర్షగా ఉన్నారు." అని ఘోషించుచు, గర్జించుచు లంకాప్రాకారమువైపు పరుగెత్తిరి.(12-21)

వీరబాహువు, సుబాహువు, నలుడు, పనసుడు అను వానరనాయకులు లంకాప్రాకారమును ఆక్రమించి ఉండిరి. సైన్యమును మోహరించిరి. బలవంతుడైన కుముదుడు, జయశీలులైన కోటిమంది వానరులతో కూడి తూర్పుద్వారమును (ఆగ్నేయభాగమును) అడ్డగించుచు నిలచెను. ఆ కుముదునకు సాహాయ్యము చేయుటకై ప్రసభుడు, పనసుడు వానరులతో కలిసి నిలిచి ఉండిరి. వీరుడు, బలవంతుడూ అయిన శతబలి ఇరవైకోట్ల మంది వానరులతో కలసి దక్షిణద్వారమును, నైరృతిభాగమును అడ్డుకొని నిలబడెను. బలవంతుడు, తారతండ్రీ అయిన సుషేణుడు నైరృతిద్వారమును కోటికోట్ల వానరులతో కూడి వెళ్ళి ఆక్రమించెను. లక్ష్మణసహితుడైన రాముడు, వానరనాయకుడైన సుగ్రీవుడు ఉత్తరద్వారము చేరి, దానిని అడ్డగించి నిలచిరి. మహాపరాక్రమవంతుడైన ధూమ్రుడు భయంకరమైన కోటి భల్లూకములతో రాముని ప్రక్కనే నిలచెను. గొప్ప పరాక్రమము గల విభీషణుడు, గద హస్తమునందు



ధరించి, యుద్ధసంనద్ధుడై, యుద్ధమునకు సంసిద్ధులుగా ఉన్న మంత్రులతో కూడి, మహాబలశాలియైన రాముడు ఉన్న ప్రదేశమునందే నిలచెను. గజ-గవాక్ష-గవయ-శరభ-గంధమాదనులు అన్నివైపులా తిరుగుచు వానరసైన్యమును రక్షించిరి. (22-30)

అప్పుడు రాక్షసరాజైన రావణుడు కోపముతో నిండిన మనస్సుతో, "వెంటనే సర్వసైన్యములు యుద్ధమునకై బయల్వెడలవలెను." అని ఆజ్ఞాపించెను. రావణుని ముఖమునుండి ఆ మాటలు వెలువడగానే రాక్షసులు భయంకరములైన ధ్వనులు కలుగునట్లు సింహనాదములు చేసిరి. పిమ్మట అన్నివైపుల నుండి, రాక్షసులు బంగారు దండముల అగ్రములచేత కొట్టుచు చంద్రుడువలె తెల్లనైన పుష్కరములు గల భేరులను మ్రోగించిరి. భయంకరులైన రాక్షసుల ముఖవాయువులచేత నింపబడినవై, వందలకొలది, వేలకొలది శంఖములు గొప్ప ఘోషముతో ధ్వని చేసినవి. శంఖములు చేతులలో ధరించి ఉన్న, అందమైన నల్లని శరీరములు గల రాక్షసులు, మెరుపుల మండలముచే చుట్టబడిన, కొంగలతో కూడిన మేఘముల వలె ఉండిరి. అప్పుడు రావణునిచేత ప్రేరేపింపబడిన సైనికులు సంతోషించుచు ప్రలయకాలములో నిండిపోవుచున్న సముద్రపు జలప్రవాహముల వలె బయలుదేరిరి. వానరసైన్యము అన్ని ప్రదేశములయందు చేసిన ధ్వని, చరియలతోను, విశాలశిలలతోను, గుహలతోను కూడిన మలయపర్వతమును నింపివేసినది. బలవంతులైన ఆ రాక్షసుల శంఖధ్వని, దుందుభిధ్వని, వానరుల సింహనాదము భూమ్యాకాశసముద్రములను ధ్వనింపచేసెను. గజముల ఘీంకారములతోను, గుఱ్ఱముల సకిలింపులతోను, రథచక్ర ధ్వనులతోను, రాక్షసుల పాదధ్వనులతోను

కలిసి శంఖాదిధ్వని భూమ్యాకాశాదులందు వ్యాపించెను.(31-39)

ఇంతలో పూర్వము దేవాసురుల మధ్య జరిగినట్లు, రాక్షసుల వానరుల మధ్య ఘోరమైన యుద్ధము జరిగెను. ఆ రాక్షసులు తమ పరాక్రమమును గూర్చి చెప్పుచు వానరులను ప్రకాశించుచున్న గదలతోను, శక్తులతోను, శూలములతోను, గండ్రగొడ్డళ్ళతోను కొట్టిరి. పెద్ద శరీరములు గల వానరులు వేగముగా ఆ రాక్షసులను వృక్షములతోను, పర్వతశిఖరములతోను కొట్టిరి. "రాజైన సుగ్రీవుడు సర్వోత్కర్షగా ఉన్నాడు" అను గొప్ప ధ్వని కూడా అక్కడ వ్యాపించెను. భయంకరులైన మరి కొందరు రాక్షసులు ప్రాకారముపైన ఉండి "రాజా! నీకు జయము కలుగుగాక, జయము కలుగుగాక" అని పలుకుచు, తమ తమ పేర్లు చెప్పుచు, నేలమీద ఉన్న వానరులను భిందిపాలములతోను, శూలములతోను చీల్చిరి. నేలమీద ఉన్న వానరులు కోపించి, ఆకాశములోనికి ఎగిరి, ప్రాకారముమీద ఉన్న రాక్షసులను తమ బాహువులతో లాగి క్రింద పడద్రోసిరి. ఆ రాక్షసవానరుల మధ్య జరిగిన, మాంసరక్తము లను బురదతో నిండి వ్యాకులమైన ఆ యుద్ధము ఆశ్చర్యకరముగా ఉండెను.(40-46)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది రెండవ సర్గము సమాప్తము.

నలుబది మూడవ సర్గము

ద్వంద్వయుద్ధములో వానరులు రాక్షసులను ఓడించుట.

ఆ మహాత్ములైన వానరులు రాక్షసులు యుద్ధము చేయుచుండగా సైన్యమునందు చాలా భయంకరమైన రోషావేశము కలిగెను. భయంకరమైన పనులు చేయు రాక్షసులు, రావణునకు జయము కలగవలెనని కోరుచు, పది దిక్కులను ధ్వనింపచేయుచు, బంగారు శిరోభూషణములు గల గుఱ్ఱములతోను, అగ్నిజ్వాలలవంటి ఏనుగులతోను, సూర్యునివంటి రథములతోను, మనోహరములైన కవచములతోను బయల్వెడలిరి. జయమును కోరుచున్న వానరుల గొప్ప సేన కూడ ఘోరములైన పనులు చేయు ఆ రాక్షసుల సైన్యమునకు ఎదురుగా పరుగెత్తెను. ఇంతలో ఎదురుగా పరుగెత్తుచున్న ఆ రాక్షసులకు, వానరులకు మధ్య ద్వంద్వయుద్ధము జరిగెను.(1-5)

గొప్ప తేజస్సు గల ఇంద్రజిత్తు వాలిపుత్రుడైన అంగదునితో, అంధకాసురుడు శివునితో యుద్ధము చేసినట్లు యుద్ధము చేసెను. ఎల్లప్పుడు యుద్ధములో ఎదిరింప శక్యము కాని సంపాతి అను వానరుడు ప్రజంఘునితోను, హనుమంతుడు జంబుమాలితోను యుద్ధము చేసెను. రావణుని తమ్ముడైన విభీషణుడు తీవ్రమైన వేగము గల శత్రుఘ్నునితో చాల కోపముతో యుద్ధము చేసెను. గొప్ప బలము గల గజుడు తపను డను రాక్షసునితోను, గొప్ప తేజస్సు గల నీలుడు నికుంభునితోను యుద్ధము చేసెను. వానరరాజైన సుగ్రీవుడు ప్రఘసునితోను, శ్రీమంతుడైన లక్ష్మణుడు విరూపాక్షునితోను యుద్ధమునకై తలబడిరి. ఎదిరింపశక్యము కాని అగ్నికేతువు, రశ్మికేతువు, మిత్రఘ్నుడు, యజ్ఞకోపుడు రామునితో యుద్ధానికి తలబడిరి. వజ్రముష్టి మైందునితోను, అశనిప్రభుడు ద్వివిదునితోను తలబడిరి. వీరుడు, యుద్ధములో ఎదిరింపశక్యము కానివాడు, భయంకరుడు అయిన ప్రతపనుడు అను రాక్షసుడు, తీవ్రమైన వేగముగల నలునితో యుద్ధము చేసెను. యముని పుత్రుడు, బలవంతుడు, వానరశ్రేష్ఠుడు అయిన సుషేణుడు విద్యున్మాలితో యుద్ధము చేసెను. భయంకరులైన ఇతరవానరులు కూడా ముందుగా చాలమందితో యుద్ధము చేసి, పిమ్మట ఇతరరాక్షసులతో ద్వంద్వయుద్ధమునకు దిగిరి. (6-15)

అక్కడ జయమును కోరుచున్న వీరులైన రాక్షసవానరుల మధ్య రోమాంచమును కలిగించే వ్యాకులమైన గొప్ప యుద్ధము జరిగెను. వానరరాక్షసుల శరీరములనుండి స్రవించిన రక్తనదులు ప్రవహించెను. ఆ ప్రవాహములలో కేశములు గడ్డికుప్పల వలె, శరీరములు కట్టెల వలె కొట్టుకొని పోవుచుండెను. ఇంద్రజిత్తు కోపించినవాడై, శత్రుసైన్యమును చీల్చివేయుచున్న వీరుడైన అంగదుణ్ణి, దేవేంద్రుడు వజ్రాయుధముతో కొట్టినట్లు గదతో కొట్టెను. అంగదుడు వేగమును చూపుచు ఆ ఇంద్రజిత్తు ఎక్కిన బంగారముచేత చిత్రములైన చక్రాద్యవయవములు గల రథమును విరుగగొట్టి గుఱ్ఱములను, సారథిని చంపివేసెను. ప్రజంఘుడు మూడు బాణములు ప్రయోగించి కొట్టగా సంపాతి రణాగ్రమునందు ఆ ప్రజంఘుని మద్దిచెట్టుతో చంపివేసెను. మహాబలుడైన జంబుమాలి రథస్థుడై, చాలా కోపించి, యుద్ధమునందు హనుమంతుని వక్షఃస్థలమునందు శక్తి అను ఆయుధముతో, వక్షఃస్థలము బ్రద్దలగునట్లు కొట్టెను. వాయుపుత్రుడైన హనుమంతుడు శీఘ్రముగా వాని రథము నెక్కి అరచేతి దెబ్బలతో ఆ రాక్షసుణ్ణి, రథమునూ కూడ నశింపచేసెను. భయంకరుడైన ప్రతపనుడు గర్జించుచు నలునిమీదికి పరుగెత్తగా వెంటనే నలుడు వాని నేత్రములను పడగొట్టెను. హస్తలాఘవము గల ప్రఘసుడు వాడియైన బాణములచేత శరీరమునంతనూ

భేదించగా, వానరరాజైన సుగ్రీవుడు, వేగము చూపుచు, సైన్యమును మ్రింగివేయుచున్నాడా అన్నట్లున్న ఆ రాక్షసుణ్ణి సప్తపర్ణవృక్షముచేత చంపివేసెను. లక్ష్మణుడు చూచుటకు భయంకరుడైన విరూపాక్షుణ్ణి బాణవర్షముచేత పీడించి, ఒక్క బాణముతో చంపివేసెను. ఎదిరింప శక్యము కాని అగ్నికేతువు, రశ్మికేతువు, మిత్రఘ్నుడు, యజ్ఞకోపుడు రాముణ్ణి బాణాలతో భేదించిరి(గాయపరిచిరి). రాముడు కోపించి అగ్నిజ్వాలలవంటి నాలుగు భయంకరములైన బాణములతో యుద్ధమునందు ఆ నలుగురి శిరస్సులను ఛేదించెను. యుద్ధరంగమునందు మైందుడు పిడికిలితో కొట్టగా, వజ్రముష్టి రథముతోను, అశ్వములతోను సహా నగరప్రాకారశిఖరమువలె నేలమీద పడిపోయెను. యుద్ధమునందు నికుంభుడు నల్లని కాటుకప్రోగువంటి కాంతి గల నీలుణ్ణి, సూర్యుడు కిరణము చేత మేఘమును కొట్టినట్లు, వాడియైన బాణములతో కొట్టెను. హస్తలాఘవము గల ఆ నిశాచరుడైన నికుంభుడు మరల నూరు బాణములు ప్రయోగించి యుద్ధరంగమునందు ఆ నీలుణ్ణి గాయపరచి అట్టహాసము చేసెను. యుద్ధరంగమునందు నీలుడు, ఆ నికుంభుని రథచక్రముతోనే, రణమునందు మహావిష్ణువువలె, అతని శిరస్సును, సారథి శిరస్సును ఛేదించెను.(16-31)

వజ్రముతోను, పిడుగుతోను సమానమైన స్పర్శగల ద్వివిదుడు, రాక్షసులందరూ చూచుచుండగా అశనిప్రభుణ్ణి పర్వతశిఖరముతో కొట్టెను. యుద్ధరంగమునందు వృక్షములతో యుద్ధముచేయుచున్న ఆ వానరనాయకుడైన ద్వివిదుని అశనిప్రభుడు వజ్రాయుధమువంటి బాణములతో కొట్టెను. ఆ ద్వివిదుడు బాణములచేత కొట్టబడిన శరీరము గలవాడై, క్రోధముతో నిండినవాడై, ఒక సాలవృక్షముచేత అశ్వములతోను, రథములతోను సహా అశనిప్రభుణ్ణి చంపెను. రథము నెక్కి ఉన్న విద్యున్మాలి బంగారముచేత అలంకరించిన బాణములతో సుషేణుణ్ణి అనేకపర్యాయములు కొట్టి సింహనాదము చేసెను. అప్పుడు వానరోత్తముడైన సుషేణుడు రథమునందున్న ఆ రాక్షసుని చూచి వెంటనే, పెద్ద పర్వతశిఖరముచేత ఆ రథమును విరుగగొట్టెను. మంచి నేర్పుగల విద్యున్మాలి ఆ రథమును విడచి, చేతిలో గద ధరించి నేలమీద నిలచెను. అప్పుడు వానరశ్రేష్ఠుడైన సుషేణుడు కోపముతో చాల పెద్ద శిలను తీసికొని ఆ రాక్షసుని మీదకి వెళ్లెను. నిశాచరుడైన ఆ విద్యున్మాలి మీదికి వచ్చుచున్న ఆ వానర శ్రేష్ఠుడైన సుషేణుణ్ణి వెంటనే, గదతో వక్షఃస్థలముమీద కొట్టెను. ఆ మహాయుద్ధములో సుషేణుడు ఆ ఘోరమైన గద దెబ్బను లక్ష్యపెట్టక మాటలాడకుండగా ఆ శిలను అతని వక్షఃస్థలముమీద పడవేసెను. శిలచేత కొట్టబడిన ఆ విద్యున్మాలి

హృదయము నలిగిపోగా, ప్రాణములు విడిచి నేలమీద పడెను. (32-41)


శూరులైన ఆ రాక్షసులు ఈ విధముగా ఆ ద్వంద్వయుద్ధమునందు శూరులైన ఆ వానరులచేత, దేవతలచేత దైత్యులవలె నశింపచేయబడిరి. మృతదేహములను తినుటకై వచ్చిన నక్కలతో నిండిన ఆ రణభూమి భల్లబాణాదులతోను, గదా-శక్తి-తోమర-పట్టిశములతోను, విరిగిపడియున్న రథములతోను, మరణించిన యుద్ధాశ్వములతోను, చంపబడిన మదగజములతోను, వానరరాక్షసులతోను, విరిగి నేలమీద పడియున్న రథచక్రములతోను, ఇరుసులతోను, కాడికట్టెలతోను, వ్యాకులమై భయంకరముగా ఉండెను. దేవాసురయుద్ధము వంటి ఆ వ్యాకులమైన యుద్ధమునందు వానరుల మొండెములు, రాక్షసుల మొండెములు దిక్కులయందు ఎగిరినవి. అప్పుడు వానరులచేత కొట్టబడుచు రక్తముతో నిండిన శరీరములు గల రాక్షసులు, సూర్యాస్తమయమునకై ఎదురుచూచుచు, బలమును ప్రదర్శించి మరల యుద్ధమునకు ఉద్యుక్తులైరి. (42-46)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది మూడవ సర్గము సమాప్తము.

నలుబది నాలుగవ సర్గము

రాత్రి జరిగిన యుద్ధములో ఇంద్రజిత్తు అదృశ్యుడై రామలక్ష్మణులను నాగపాశములతో బంధించుట.

ఆ వానరులు, రాక్షసులు యుద్ధము చేయుచుండగానే, అప్పుడు సూర్యుడు అస్తమించెను. ప్రాణములను హరించు రాత్రి వచ్చెను. అప్పుడు పరస్పరము వైరము వహించి, జయమును కోరుచున్న భయంకరులైన ఆ వానరులకు రాక్షసులకు రాత్రియుద్ధము ప్రారంభమైనది. ఆ ఘోరమైన అంధకారములో "నీవు రాక్షసుడవు" అని పలుకుచు వానరులు, "నీవు వానరుడవు"అని పలుకుచు రాక్షసులు, యుద్ధములో తమలో తామే చంపుకొనిరి. (రాక్షసులను రాక్షసులు, వానరులను వానరులు చంపిరి). ఆ సైన్యములో- "చంపుము; చీల్చుము; రమ్ము; పారిపోవుచున్నావేమి?" అని వ్యాకులములైన అరుపులు వినబడెను. నల్లని దేహములతో బంగారు కవచములు ధరించిన రాక్షసులు ఆ చీకటిలో ప్రకాశించుచున్న ఓషధులు గల పర్వతముల వలె కనబడిరి. దాట శక్యము కాని ఆ చీకటి యందు రాక్షసులు క్రోధముతో నిండినవారై



వానరులను భక్షించుచు మహావేగముతో వచ్చిపడిరి. భయంకరమైన కోపము, బలము గల ఆ వానరులు యుద్ధమునందు పైకి దుమికి, శిరస్సులపై బంగారు అలంకారములు గల గుఱ్ఱములను, సర్పముల వంటి ధ్వజములను చీల్చివేసిరి. రాక్షససైన్యమును క్షోభింపచేసిరి. ఏనుగులను, ఏనుగులపై ఉన్నవాళ్ళను పతాకలతోను ధ్వజములతోను కూడిన రథములను క్రిందికి లాగి దంతములతో కరచిరి. రామలక్ష్మణులు సర్పములవంటి బాణములతో, కనబడీ కనబడకుండా ఉన్న రాక్షసవీరులను చంపిరి. (1-9)

గుఱ్ఱముల డెక్కలచేత నలిగిన నేలపైనున్న పరాగము రథ చక్రాంతములచేత పైకి లేపబడినదై యుద్ధము చేయుచున్న వారి చెవులు, కండ్లు నింపివేసెను. రోమాంచమును కలిగించు ఘోరమైన యుద్ధము ఆ విధముగా జరుగుచుండగా అక్కడ రక్తప్రవాహములతో కూడిన చాల భయంకరములైన నదులు ప్రవహించినవి. అంతలో శంఖధ్వనులతోను, చక్రధ్వనులతోను కలిసిన, ఆశ్చర్యకరమైన భేరీ-మృదంగ-పణవముల ధ్వని బయలుదేరెను. అక్కడ సకిలించుచున్న గుఱ్ఱముల ధ్వని చంపబడుచున్న రాక్షసవానరుల అరపుల ధ్వని భయమును కలిగించునట్లు వెడలెను. ఆ యుద్ధభూమియందు రక్తమను బురద వ్యాపించి ఉండెను. వానరవీరులు, కామరూపవంతులైన పర్వతాకారముగల రాక్షసులు మరణించి పడియుండిరి. శక్తులు, శూలములు, గండ్రగొడ్డళ్ళు పడిఉండెను. ఆయుధము లనే పుష్పములు అలంకారార్థమై చల్లినట్లుండెను. అట్టి ఆ భూమి గుర్తించుటకు గాని, ప్రవేశించుటకు గాని శక్యము కాకుండా ఉండెను. ఏ భూతములకూ, ప్రాణులకూ కూడ అతిక్రమింప శక్యము కాని ప్రళయకాలరాత్రి వలె భయంకరమైన ఆ రాత్రి వానరులకు రాక్షసులకు నాశహేతువయ్యెను. (10-16)

అక్కడ చాల భయంకరముగా ఉన్న ఆ చీకటిలో రాక్షసులు ఉత్సాహముతో బాణములను వర్షించుచు రాముని ఎదిరించిరి. రాక్షసులు కోపముతో గర్జించుచు వచ్చి పడుచుండగా ఆ ధ్వని ప్రళయకాలమునందు సముద్రముల ధ్వని వలె ఉండెను. రాముడు రెప్పపాటు కాలములో అగ్నిజ్వాలలవంటి ఆరు వాడియైన బాణములు ప్రయోగించి, ఆ రాక్షసులలో ఆరుగురిని కొట్టెను. ఎదిరింప శక్యము కాని యజ్ఞశత్రువు, మహాపార్శ్వమహోదరులు, పెద్ద శరీరము గల వజ్రదంష్ట్రుడు, ఆ శుకసారణులిద్దరు - ఆ ఆరుగురూ రామునిచేత బాణసముదాయములతో అన్ని మర్మస్థానములందు కొట్టబడి, అక్కడినుండి పారిపోవుటచే వారి ఆయుర్దాయము ఇంకను శేషించెను. మహారథుడైన రాముడు అగ్నిజ్వాలలవంటి బాణములతో రెప్పపాటు కాలములో దిక్కులను విదిక్కులను నిర్మలము లగునట్లు అనగా రాక్షసులు లేకుండునట్లు చేసెను. రామునకు ఎదురుగా నిలచిన ఇతర రాక్షసులు కూడ అగ్నిని సమీపించిన మిడతలవలె నశించిరి. అన్నివైపులా పడుచున్న బంగారు పొన్నులు గల ఆ రామబాణములతో వ్యాప్తమై, ఆ రాత్రి, మినుగుడు పురుగులు ఎగురుచున్న శరత్కాలరాత్రి వలె చిత్రవర్ణము కలదై ప్రకాశించెను. భయంకరమైన ఆ రాత్రి ఆ నాడు, రాక్షసుల ధ్వనులచేత, భేరీనాదములచేత ఇంకను చాల భయంకరముగా ఉండెను. అంతటా వృద్ధి పొందిన ఆ గొప్ప ధ్వని గుహలలో వ్యాపించగా త్రికూటపర్వతము మాటలాడుచున్నట్లుండెను. చీకటివంటి శరీరచ్ఛాయ, పెద్ద దేహములు గల గోలాంగూలములు రాక్షసులను బాహువులతో కౌగిలించుకొని భక్షించివేసెను. (17-27)

శత్రువులను చంపుటకై యుద్ధరంగమునం దున్న అంగదుడు ఇంద్రజిత్తును, సారథిని, గుఱ్ఱములను కూడా ఒకే పర్యాయము కొట్టెను. అప్పుడు చాల దారుణము, భయంకరము అయిన యుద్ధము జరుగుచుండగా అంగదుడు అశ్వములను, సారథిని చంపగానే మహామాయావి అయిన ఇంద్రజిత్తు రథమును విడిచి అక్కడనే అంతర్ధానము చెందెను. పూజింపదగిన అంగదుడు చేసిన ఆ పనిని మహర్షులు, దేవతలు, రామలక్ష్మణులు ఇద్దరూ కూడ స్తుతించిరి. యుద్ధములో ఇంద్రజిత్తు కున్న ప్రభావ మెంతటిదో అందరికీ తెలిసి ఉండుటచే వాళ్ళందరూ అంగదుని చేతిలో ఆ మహాత్ముడు ఓడిపోవుట చూచి సంతోషించిరి. అప్పుడు సుగ్రీవవిభీషణులతో సహా వానరులందరూ శత్రువు ఓడింపబడుటను చూచి సంతోషించుచు “బాగు బాగు” అని పలికిరి. (28-33)

భయంకరమైన కర్మ చేయగల అంగదుడు యుద్ధములో ఓడింపగా



ఇంద్రజిత్తునకు అతి తీవ్రమైన కోపము కలిగెను. పాపాత్ముడు, యుద్ధమునందు క్రూరుడూ అయిన ఆ రావణకుమారుడైన ఇంద్రజిత్తు అంతర్ధానము చెంది వజ్రాయుధము వంటి వాడియైన బాణములను విడచెను. అతడు కోపించి యుద్ధములో భయంకరములైన సర్పరూపములైన బాణములతో, రామలక్ష్మణుల అవయవములను అన్నింటినీ చీల్చివేసెను. కపటయుద్ధము చేయు ఆ రాక్షసుడు మాయచేత కప్పబడినవాడై, ఏ భూతములకు కనబడనివాడుగా ఉండి, యుద్ధమునందు రామలక్ష్మణులను మోసగించుచు, ఆ సోదరు లిద్దరినీ శరబంధముచేత బంధించెను. ఆ ఇంద్రజిత్తు సర్పబాణములను ప్రయోగించి పురుషశ్రేష్ఠులైన ఆ వీరులైన రామలక్ష్మణులను బంధించుటను వానరులు చూచిరి. ఆ దురాత్ముడు ఎదురుగా నిలబడి ఆ రామలక్ష్మణులను బాధింపజాలక, మాయను ప్రయోగించుచు ఆ రాజకుమారు లిద్దరినీ బంధించెను. (34-39)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది నాల్గవ సర్గము సమాప్తము.

నలుబది ఐదవ సర్గము

ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణములచేత రామలక్ష్మణులు సంజ్ఞ కోల్పోవుట; వానరులు శోకించుట.

ప్రతాపవంతుడు, మహాబలశాలీ అయిన రాముడు ఆ రాక్షసుని మార్గమును తెలిసికొనుటకై పదిమంది వానరసేనానాయకులను- సుషేణుని కుమారులను ఇద్దరినీ, వానరనాయకుడైన నీలుణ్ణి, వాలిపుత్రుడైన అంగదుణ్ణి, బలము గల శరభుణ్ణి, ద్వివిదుణ్ణి, హనుమంతుణ్ణి, గొప్ప బలము గల సానుప్రస్థుణ్ణి, ఋషభుణ్ణి, ఋషభస్కంధుణ్ణి ఆజ్ఞాపించెను. ఆ వానరులందరు ఉత్సాహముతో భయంకరములైన వృక్షములను ధరించి పది దిక్కులను వెదకుచు ఆకాశములో ప్రవేశించిరి. అస్త్రముల నెరిగిన ఆ ఇంద్రజిత్తు అస్త్రములు సంధించిన, మంచి వేగము గల బాణములచేత వేగవంతులైన ఆ వానరుల వేగమును శమింపచేసెను. నారాచబాణములచేత గాయపరుపబడిన శరీరములు గల, భయంకరమైన వేగము గల వానరులు, ఆ ఇంద్రజిత్తును, మేఘములచేత కప్పబడిన సూర్యుని వలె, అంధకారములో చూడలేకపోయిరి. (1-6)

ఇంద్రజిత్తు సమస్తదేహమును భేదించివేయునట్లు బాణములను రామలక్ష్మణుల శరీరములందే గ్రుచ్చుకొనునట్లు మాటి మాటికి ప్రయోగించెను. అతడు బాణములుగా అయిన సర్పములతో వీరులైన ఆ రామలక్ష్మణుల శరీరముల మీద ఎక్కడా చోటు మిగలకుండా కొట్టెను. ఆ ఇద్దరి శరీరములనుండి అత్యధికముగా రక్తము స్రవించెను. ఆ రామలక్ష్మణులు అప్పుడు పుష్పించిన మోదుగచెట్లవలె ప్రకాశించిరి. పిమ్మట, కొనలయందు ఎఱ్ఱగా ఉన్న నేత్రములు గలవాడు, విడగొట్టిన కాటుక కుప్పతో సమానుడు అయిన ఇంద్రజిత్తు అంతర్హితుడుగానే ఉండి రామలక్ష్మణులతో- "నేను అంతర్ధానము చెంది యుద్ధము చేయుచున్నప్పుడు దేవతల ప్రభువైన ఇంద్రుడు కూడ చూడజాలడు; సమీపించజాలడు. ఇంక మీ మాట చెప్పవలెనా! ఓ రామలక్ష్మణులారా! కోపముతో నిండిన మనస్సు గల నేను గ్రద్ద రెక్కలు కట్టిన బాణముల సముదాయముచేత మీ ఇద్దరినీ కప్పివేసి యమలోకమునకు పంపెదను." అని అనుచు, వాడియైన బాణాలతో వారిద్దరినీ ఛేదించెను. ఆనందముతో సింహనాదము చేసెను. కాటుక కొండవంటి నల్లని శరీరము గల ఇంద్రజిత్తు పెద్దదైన ధనుస్సు చరచుచు ఆ మహాయుద్ధమునందు మరల భయంకరములైన బాణములను ప్రయోగించెను. మర్మస్థానములు తెలిసిన ఆతడు రామలక్ష్మణుల

మర్మస్థానములయందు మాటిమాటికి బాణములు దిగగొట్టుచు ధ్వని చేసెను.(7-15)



యుద్ధరంగమునందు నిమేష కాలములో ఈ శరబంధముచేత కట్టబడిన రామలక్ష్మణులు చూడలేక పోయిరి. వారి శరీరములు పూర్తిగా తూట్లుపడి బాణముల ములికలతో నిండి యుండెను. మర్మస్థానములను చీల్చి వేయుటచే పీడితులైన ఆ వీరులు త్రాళ్ళు విప్పివేసిన ఇంద్రధ్వజమువలె కదలిపోవుచు నేలపై ఒరిగిరి. వీరులైన ఆ రామలక్ష్మణుల శరీరములు పూర్తిగా బాణములచేత కప్పబడి యుండెను. మిక్కిలి పీడింపబడి దుఃఖితులైన వారిరువురు వీరశయనము మీద శయనించిరి. (మహావీరుడు నేలపై పడిపోవుటను వీరశయనముమీద శయనించుట అని కవులు వర్ణింతురు.) వారి శరీరములయందు అంగుళము మాత్రము చోటు కూడ దెబ్బలు తగలనిది లేదు. చేతి చివర భాగమువరకు బాణములచేత తూట్లు పడునట్లు చేయబడని భాగముగాని, కదలకుండునట్లు చేయబడని భాగము గాని లేకుండెను. క్రూరుడు, స్వేచ్ఛానుసారము రూపములు ధరించ సమర్థుడు అయిన ఆ రాక్షసునిచే కొట్టబడి ఆ రామలక్ష్మణులు ప్రస్రవణపర్వతములు జలమును స్రవించినట్లు అధికమైన రక్తమును స్రవించిరి.(16-21)

పూర్వము ఇంద్రుణ్ణి జయించిన ఆ ఇంద్రజిత్తు కోపముతో బాణములచేత మర్మస్థానములందు కొట్టుటచే ముందుగా రాముడు నేలపై పడిపోయెను. నాగపాశములచేత బంధించిన పిమ్మట ఆ ఇంద్రజిత్తు బంగారు పొన్నులు, వాడియైన కొనలు గల పైనుండి క్రిందికి శీఘ్రముగా పడుచున్న నారాచ-అర్ధనారాచ-భల్ల-అంజలిక-వత్సదంత- సింహదంష్ట్ర-క్షుర బాణములతో రాముణ్ణి కొట్టెను. బంగారముచేత అలంకరింపబడి, మూడు ప్రదేశములలో వంపులు గల ధనుస్సు నారి ఊడిపోయి, పిడికిలి పట్టు జారిపోవుటచే రాముని చేతినుండి దూరముగా పడిపోయెను. ఆ విధముగా ధనుస్సును దూరముగా పడవేసి రాముడు వీరశయనముమీద శయనించెను. ధనుస్సునుండి విడచిన బాణము పడునంత దూరములో పురుషశ్రేష్ఠుడైన రాముడు పడిపోవుట చూచి లక్ష్మణుడు జీవితమునందు

ఆశను వదులుకొనెను. సోదరుడైన రాముడు శరబంధముచేత గాయపడి నేలపై పడిపోవుట చూచి అతడు దుఃఖించెను. వానరులు రాముణ్ణి చూచి చాల దుఃఖము చెంది, శోకముచేత పీడింపబడిన వారై కన్నీళ్ళు కార్చుచు గొప్ప ధ్వని కలుగునట్లు ఏడ్చిరి. హనుమంతుడు మొదలైన వానరులు చేరి బద్ధులై వీరశయనముమీద శయనించి ఉన్న ఆ రామలక్ష్మణుల చుట్టూ నిలబడి దుఃఖపీడితులై ఉండిరి. (22-28)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది ఐదవ సర్గము సమాప్తము.

నలుబది ఆరవ సర్గము

మూర్ఛితులైన రామలక్ష్మణులను చూచి వానరులు దుఃఖించుట. ఇంద్రజిత్తు తండ్రికి శత్రువధవృత్తాంతమును చెప్పుట.

పిమ్మట వానరులు ఆకాశము వైపు చూచుచు, పూర్తిగా బాణములతో కప్పబడిఉన్న సోదరులైన రామలక్ష్మణులను చూచిరి. దేవుడైన పర్జన్యుడు వర్షించి శమించినట్లు ఇంద్రజిత్తు తన పని ముగించుకొని విరమించగా సుగ్రీవునితో కూడ విభీషణుడు ఆ ప్రదేశమునకు వచ్చెను. నీలుడు, ద్వివిదుడు, మైందుడు, సుషేణుడు, కుముదుడు, అంగదుడు హనుమంతునితో కలసి రామలక్ష్మణులను గూర్చి దుఃఖించిరి. రక్తముచేత తడిసి చేష్టలు ఉడిగిన ఆ రామలక్ష్మణులు మందముగా ఊపిరి పీల్చుచుండిరి. కదలజాలక, బాణములతో నిండి, శరతల్పము మీద శయనించి ఉండిరి. నిశ్చేష్టులై, పరాక్రమము మందగించగా సర్పములవలె నిట్టూర్చుచుండిరి. రక్తప్రవాహముచేత తడిసిన శరీరములతో బంగారు ధ్వజముల వలె ఉన్న ఆ వీరులు మందమైన చేష్టలు కలవారై వీరశయనము నందు శయనించి ఉండగా, బాణముల సముదాయము శరీరములందు గ్రుచ్చుకొని ఉన్న ఆ సోదరుల చుట్టూ నిలచి కన్నీళ్ళు కార్చుచు సేనానాయకు లందరు చూచుచుండిరి. అట్టి రామలక్ష్మణులను చూచి వానరులు, విభీషణుడు చాలా దుఃఖించిరి. (1-7)

వానరులు ఆకాశములోని అన్ని దిక్కులలోనికి ఎంత పరికించి చూచినను యుద్ధములో మాయచేత దాగి ఉన్న ఆ ఇంద్రజిత్తు వాళ్లకు కనబడలేదు. విభీషణుడు మాయ సాహాయ్యముతోనే చూడగా అతనికి మాయచేత కప్పబడి ఎదుట నిలచి ఉన్న ఆ ఇంద్రజిత్తు కనబడెను. తేజస్సు, యశస్సు, పరాక్రమము గల ఆ విభీషణుడు

సాటిలేని పనులు చేయువాడు, యుద్ధములో ఎదురులేనివాడు, బ్రహ్మనుండి వరమును పొందుటచేత అంతర్ధానము చెంది ఉన్నవాడు అయిన ఆ ఇంద్రజిత్తును చూచెను. ఇంద్రజిత్తు తాను చేసిన పనిని, నేలపై పడియున్న రామలక్ష్మణులను చూచి చాల సంతోషించి, సమస్తరాక్షసులకు సంతోషము కలిగించుచు- "ఖరదూషణులను సంహరించిన మహాబలశాలులైన సోదరులైన రామలక్ష్మణులు నా బలముచేత చంపబడినారు. సురులు, అసురులు, ఋషిసంఘములు - అందరూ కలసి వచ్చినా కూడా ఈ రామలక్ష్మణులను బాణబంధమునుండి విడిపింపజాలరు. ఈ రామలక్ష్మణు లనేవారు మనకందరికీ మూలమునే త్రుంచివేయు అనర్థముగా ఏర్పడినారు. ఈ అనర్థమును గూర్చి చింతించుచుండుటచే నా తండ్రి ప్రక్కపై శయనించకుండగా రాత్రులను గడపవలసివచ్చినది. దీని కారణమున లంకానగరమంతా వర్షాకాలమునందు నదివలె వ్యాకులమైనది. అట్టి ఈ అనర్థమును నేనిప్పుడు తొలగించినాను. రామలక్ష్మణుల పరాక్రమములు, అందరి వానరుల పరాక్రమములు, శరత్కాలమునందు మేఘముల వలె వ్యర్థమైనవి." అని పలికి, అక్కడ నిలచి చూచుచున్న వానరసేనాయకులను కూడా బాణములతో కొట్టెను. (8-17)

శత్రుసంహారకుడైన ఆ ఇంద్రజిత్తు నీలుణ్ణి తొమ్మిది బాణములచేత కొట్టి, మైందద్వివిదులను మూడేసి బాణాలచేత పీడించెను. జాంబవంతుణ్ణి ఒక్క బాణముతో వక్షఃస్థలముమీద కొట్టి వేగవంతుడైన హనుమంతుని వక్షఃస్థలమునందు పది బాణములను ప్రయోగించెను. మహావేగము గల ఇంద్రజిత్తు అమితపరాక్రమము గల ఆ గవాక్షశరభులను, రెండేసి బాణములతో కొట్టెను. కొండముచ్చుల నాయకుణ్ణి, వాలిపుత్రుడైన అంగదుణ్ణి అనేక బాణములచేత కొట్టెను. ఈ విధముగ అగ్నిజ్వాలలవంటి బాణములచేత ఆ వానరశ్రేష్ఠుల శరీరములు బ్రద్దలగు నట్లు కొట్టి సింహనాదము చేసెను. బాణసముదాయములచేత వాళ్ళను పీడించి వానరులను భయపెట్టి, గట్టిగా నవ్వి- "రాక్షసులారా! సేనాగ్రమునందు ఈ సోదరులైన రామలక్ష్మణులను భయంకరమైన శరబంధముచేత కట్టివేసినాను; చూడుడు." అని పలికెను. కపటయుద్ధము చేయు ఆ రాక్షసులందరూ ఆ మాటలు విని, అతడు చేసిన పనికి చాలా ఆశ్చర్యపడుచు సంతోషించిరి. గొప్ప ధ్వనులు చేసిరి. రాముడు చంపబడినాడని తెలిసికొని ఇంద్రజిత్తును పూజించిరి. (18-26)

అప్పుడు నిశ్చలముగా, శ్వాస లేకుండగా నేలమీద పడియున్న సోదరులైన రామలక్ష్మణులను చూచి ఇంద్రజిత్తు, వారు మరణించినా రని తలచి, సంతోషించుచు,

సకల రాక్షసులను సంతోషపెట్టుచు, లంకాపురమును ప్రవేశించెను. బాణములచేత వ్యాప్తములైన రామలక్ష్మణుల శరీరములను హస్తపాదాద్యంగములను, వ్రేళ్లు మొదలైన ఉపాంగములను చూడగానే సుగ్రీవుని భయము ఆవహించెను. వానరరాజైన ఆ సుగ్రీవుడు భయపడి, కన్నీళ్లతో నిండిన ముఖముతో, శోకముచేత వ్యాకులములైన నేత్రములతో దీనుడై ఉండెను. అట్టి సుగ్రీవునితో విభీషణుడు, "సుగ్రీవా! భయపడకుము. కన్నీటి వేగమును నిగ్రహించుకొనుము. యుద్ధములు ఈ విధముగానే ఉండును. విజయము నిశ్చితము కాదు. మన అదృష్టమేమైనా మిగిలి ఉన్నట్లయితే, మహాత్ములు, మహాబలులు అయిన ఈ రామలక్ష్మణులు మోహమును విడువగలరు. నీవు ధైర్యముగా ఉండి రక్షకుడు లేని నాకు కూడా ధైర్యము కలిగించుము. సత్యమునందు ధర్మమునందు ఆసక్తి కలవారికి మృత్యువులవలన భయము లేదు." అని పలికెను. విభీషణుడు ఇట్లు పలికి నీటితో తడిసిన చేతితో సుగ్రీవుని అందమైన నేత్రములు తుడిచెను. పిమ్మట ధర్మాత్ముడైన విభీషణుడు నీరు తీసికొని రాక్షసమాయను తెలిసికొనగలిగిన మంత్రముచేత అభిమంత్రించి, సుగ్రీవుని నేత్రములు తుడిచెను. (27-35)

బుద్ధిమంతుడైన ఆ సుగ్రీవుని ముఖము తుడిచి సమయానుగుణమైన వచనమును ఎట్టి తొందరపాటూ లేకుండగా ఇట్లు పలికెను- "సుగ్రీవుడా! ఇది దుఃఖించవలసిన సమయము కాదు. ఈ సమయమునందు అతిస్నేహము కూడా మరణమునకు దారితీయును. అందువలన అన్ని కార్యములను భగ్నము చేయు మానసవ్యాకులత్వమును విడచి రాముడు రక్షకుడుగా గల సైన్యములకు ఇప్పుడు ఏది హితమో ఆలోచించుము. లేదా తిరిగి సంజ్ఞ పొందేవరకు రాముణ్ణి రక్షించెదము. సంజ్ఞ పొందిన పిమ్మట రామలక్ష్మణులు మనల నిద్దరినీ రక్షించగలరు. ఇది రామునకు ఒక పెద్ద విషయము కాదు. రాముడు మరణించబోడు. ఈతనిని కాంతి విడువదు (విడువలేదు). ఆయుర్దాయము చెల్లినవారికి ఇట్టి కాంతి ఉండదు. అందువలన నీవు నీ మనస్సును కుదుటపరచుకొని నీ సైన్యమును ఓదార్చుము. నేను ఇంతలో సైన్యములను అన్నింటినీ ధైర్యము చెప్పి నిలిపెదను. వానరశ్రేష్ఠుడా! ఆ వానరులు కండ్లు పెద్దవిచేసి భయముతో తొందరపడుచు ఒకరి చెవిలో ఒకరు ఏమేమో చెప్పుకొనుచున్నారు. సైన్యమును ఉత్సాహపరచుటకై నేను శీఘ్రముగా ఇటు అటు వెళ్ళుచుండగా నన్ను జూచి, ఈ వానరులు ఇంద్రజిత్తు అను భ్రమచేత భయపడుచున్నారు. వారు అట్టి భయమును, ఉపయోగించిన పుష్పమాలను పరిత్యజించినట్లు, పరిత్యజించేటట్లుగా చేయుము." (36-43)

రాక్షసశ్రేష్ఠుడైన విభీషణుడు ఈ విధముగా సుగ్రీవునకు ధైర్యము చెప్పి పారిపోవుచున్న ఆ వానరసైన్యమును మరల ఓదార్చెను. గొప్ప మాయగల ఇంద్రజిత్తు సమస్త సైన్యముతో లంకానగరములో ప్రవేశించి, తండ్రి దగ్గరకు వెళ్ళెను. అతడు అక్కడ రావణుని సమీపించి, అంజలి ఘటించి నమస్కరించి, "రామలక్ష్మణులను చంపివేసితిని." అని అతనికి ప్రియమైన వచనమును చెప్పెను. రావణుడు శత్రువులు చంపబడినారను వార్తను రాక్షసుల మధ్య విని సంతోషముతో ఎరిగి గంతువేసి పుత్రుణ్ణి కౌగిలించుకొనెను. అతడు సంతోషించిన మనస్సుతో ఇంద్రజిత్తును శిరస్సు మీద వాసనచూచి(ముద్దు పెట్టుకొని) "ఎట్లు చంపితివి?" అని ప్రశ్నించెను. ఇంద్రజిత్తు ఆ విధముగా ప్రశ్నించుచున్న తండ్రికి తాను ఆ సోదరుల నిద్దరినీ శరబంధముచేత ఎట్లు బంధించెనో, ఎట్లు కాంతివిహీనులనుగా చేసెనో ఆ విషయమునంతా జరిగినది జరిగినట్లు చెప్పెను. రావణుడు మహారథుడైన ఇంద్రజిత్తు మాటలు విని ఆనందాతిరేకముతో నిండిన మనస్సుగలవాడై, రాముని వలన కలిగిన మనస్తాపమును విడచెను. ఆనందముతో కూడిన మాటలతో పుత్రుణ్ణి అభినందించెను. (44-50)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది ఆరవ సర్గము సమాప్తము.

నలుబది ఏడవ సర్గము

రావణుని ఆజ్ఞచేత రాక్షసస్త్రీలు సీతను యుద్ధభూమికి తీసికొని వెళ్ళి ఆమెకు రామలక్ష్మణులను చూపుట. సీత దుఃఖించుట.

ఇంద్రజిత్తు తాను చేయదలచిన పని పూర్తిచేసికొని లంకలో ప్రవేశించిన పిమ్మట వానరశ్రేష్ఠులు, రాముని చుట్టూ నిలచి అతనిని రక్షించిరి. హనుమంతుడు, అంగదుడు, నీల-సుషేణులు, కుముదుడు, నలుడు, గజ-గవాక్షులు, పనసుడు, సానుప్రస్థుడు, జాంబవంతుడు, ఋషభ-సుందులు, రంభ-శతబలి-పృథులు ఈ వానరులందరు వృక్షములు ధరించి, అన్నివైపుల సేనలు నిలిపి, యుద్ధసన్నద్ధులై నిలచిరి. అన్ని దిక్కులు, అడ్డముగాను, పైకి చూచుచు గడ్డిపరక కదలినను రాక్షసులని అనుకొనుచుండిరి. (1-4)

రావణుడు సంతోషించి, కుమారుడైన ఇంద్రజిత్తును పంపివేసి, పిమ్మట

సీతను రక్షించుచున్న రాక్షసస్త్రీలను పిలిపించెను. ఆ రావణుని ఆజ్ఞ ప్రకారము రాక్షసస్త్రీలు, త్రిజట అతనిదగ్గరకు వచ్చిరి. పిమ్మట సంతోషించిన రావణుడు ఆ రాక్షసస్త్రీలతో- "ఇంద్రజిత్తుచేత రామలక్ష్మణులు చంపబడి రని సీతకు చెప్పుడు. ఆమెను పుష్పకము నెక్కించి తీసుకొనివెళ్ళి యుద్ధములో చంపబడిన రామలక్ష్మణులను చూపుడు. ఆమె ఎవని ఆశ్రయము చూచుకొని గర్వితురాలై నన్ను చేరుటలేదో అట్టి ఆమె భర్త, అతని సోదరుడూ కూడ యుద్ధరంగమునందు చంపబడినారు. సీత సకలాలంకారములు అలంకరించుకొని రాముడు వచ్చుననే శంకగాని, భయముగాని, ఆశగాని లేనిదై నన్ను చేరగలదు. విశాలాక్షియైన ఆ సీత ఈనాడు యుద్ధములో మరణించిన రామలక్ష్మణులను చూచి తిరిగి వచ్చి, మరొక గతి ఏదీ లేకపోవుటచే రాముణ్ణి అపేక్షించక స్వయముగా నాదగ్గరకు రాగలదు." అని ఆజ్ఞాపించెను. (5-10)

ఆ రాక్షసస్త్రీలు దురాత్ముడైన రావణుని మాటలు విని, "అట్లే చేసెదము" అని పలికి పుష్పకవిమానమున్న చోటికి వెళ్ళిరి. దానిని అశోకవనములో ఉన్న సీతదగ్గరకు తీసికొనివెళ్ళిరి. భర్తను గూర్చిన శోకముచే పీడించబడిన ఆ సీతను తీసికొనివచ్చి ఆ పుష్పకవిమానము మీద ఎక్కించి ఆమెకు రామలక్ష్మణులను చూపుటకు తీసికొని వెళ్ళిరి. రాక్షసరాజైన రావణుడు సంతోషముతో లంకాపట్టణమును పతాకలతోను, ధ్వజములతోను అలంకరింపచేసి, "యుద్ధములో ఇంద్రజిత్తు రామలక్ష్మణులను చంపివేసినాడు." అని చాటింపు వేయించెను. సీత త్రిజటతో కూడ విమానము ఎక్కి వెళ్ళి అక్కడ చంపిపడవేయబడిన వానరసైన్యము నంతను చూచెను. అక్కడ సంతోషముతో ఉన్న రాక్షసులను, రాముని ప్రక్క చాల దుఃఖముతో బాధపడుచున్న వానరులను చూచెను. (11-18)

పిమ్మట ఆమె బాణములచేత పీడింపబడి శరతల్పముమీద సంజ్ఞలేకుండా శయనించి ఉన్న రామలక్ష్మణులను ఇద్దరినీ చూచెను. ఆ వీరుల కవచములు విరిగిపోయెను. వారి ధనుస్సులు దూరముగా పడి యుండెను. వారి శరీరములు పూర్తిగా బాణములచేత భేదింపబడి ఉండెను. వారు నేలమీద బాణము లనే గడ్డితో నిండి ఉండిరి. మహావీరులు, పురుషశ్రేష్ఠులు, శరతల్పముమీద శయనించి ఉన్నవారు, అగ్నిపుత్రులైన, వీరులైన, స్కందవిశాఖుల వలె ఉన్నవారు, పద్మములవంటి నేత్రములు గలవారు అయిన ఆ సోదరులు అట్టి స్థితిలో ఉండుట చూచి సీత దుఃఖపీడితురాలై దీనముగా మిక్కిలి విలపించెను. దోషములు లేని అవయవములు గలది, నల్లని నేత్రములు కలది అయిన సీత, పరాగములో పడివున్న భర్తను, లక్ష్మణునీ చూచి ఏడ్చెను. దేవతాపుత్రులవంటి ప్రభావము గల ఆ సోదరులను

చూడగానే సీత కన్నీరు కార్చుచు, శోకపీడితురాలై, వారు మరణించినారని తలచి దుఃఖముతో ఇట్లు పలికెను.(19-24)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది ఏడవ సర్గము సమాప్తము.

నలుబది ఎనిమిదవ సర్గము

సీత విలపించుట. రామలక్ష్మణులు జీవించియే ఉన్నారని త్రిజట సీతకు నమ్మకము కలిగించి తిరిగి లంకలోనికి తీసికొనిపోవుట.

సీత చంపబడిన భర్తను, మహాబలుడైన లక్ష్మణునీ చూచి మిక్కిలి శోకముచేత కృశించినదై దీనముగా ఏడ్చెను. "నన్ను చూచి పూర్వము సాముద్రికశాస్త్రజ్ఞులు ఈమె పుత్రవంతురాలు అగుననీ, వైధవ్యము లేనిదనీ చెప్పి ఉన్నారు. కాని ఇప్పుడు రాముడు మరణించుటచే ఆ పండితు లందరు అసత్యము చెప్పినట్లయినది. పూర్వము ఏ పండితు లందరూ నన్ను గూర్చి ఈమె యజ్ఞములు చేసినవాని పట్టమహిషి అగుననీ, యాగములు చేసినవాని ధర్మపత్ని అగుననీ చెప్పినారో వారు ఇప్పుడు రాముడు మరణించుటచే అసత్యము చెప్పినట్లయినది. వీరులైన రాజుల భార్యలందరిలోను నేను భర్త గౌరవమునకు పాత్రురాల నగుదు నని చెప్పిన పండితులు, ఇప్పుడు రాముడు మరణించుటచేత, అసత్యము పలికినవారైనారు. దైవజ్ఞులైన ఏ ద్విజులు, నేను వినుచుండగా, 'ఈమె సౌభాగ్యవతి అగును.' అని చెప్పినారో ఆ పండితు లందరూ ఇప్పుడు రాముడు చనిపోవుటచేత అసత్యము పలికినట్లయినది. నా పాదములలోని పద్మములు ఉన్న స్త్రీలు రాజులైన భర్తలతో కూడ చక్రవర్తిత్వమునందు అభిషేకింపబడుదురు కదా? నాయందున్న మంచి లక్షణము లన్నీ వ్యర్థమైపోయినవి. ఏ అవలక్షణములున్న స్త్రీలు దౌర్భాగ్యవతులై వైధవ్యమును పొందుదురో అట్టి అవలక్షణము లేవీ వెదకి చూచినను నాయందు కనబడుటలేదు. స్త్రీల కున్న ఏ ధ్వజములు పద్మములు మొదలైన లక్షణములు తప్పక మంచి ఫలము నిచ్చునవిగా చెప్పబడినవో నా శరీరమునందు ఉన్న ఆ లక్షణము లన్నీ, ఇప్పుడు రాముడు మరణించుటచే వ్యర్థములైపోయినవి. నా కేశములు(జుట్టు) సన్నగా సమముగా నల్లగా ఉన్నవి. కనుబొమ్మలు కలవకుండా ఉన్నవి. పిక్కలు గుండ్రముగా రోమములు లేనివై ఉన్నవి. దంతములకు ఎడము లేదు. నా శంఖములు (నేత్రముల పక్కనున్న లలాట పార్శ్వభాగములు), నేత్రములు,

చేతులు, పాదములు, మణవలు, తొడలు సమములై పుష్టిగా ఉన్నవి. నా వ్రేళ్లు అనువృత్తములైన గోళ్ళతో నున్నగా సమముగా ఉన్నవి. నా వక్షోజములు బలిసి దగ్గరగా ఉన్నవి. వీటి అగ్రభాగములు లోనికి అణగి ఉన్నవి. ఉన్నతప్రదేశము గల నాభి లోతుగా ఉన్నది. నా పార్శ్వభాగములు, వక్షఃస్థలమూ గూడ పుష్టిగా ఉన్నవి. నా శరీరవర్ణము మాణిక్యవర్ణము వంటిది. రోమములు మెత్తనివి. నేలమీద నిలచునపుడు పదివ్రేళ్ళు అరికాళ్ళు ఆన్చి నిలబడు నేను శుభలక్షణములు గలదాన నని చెప్పిరి. నా చేతుల వ్రేళ్ళమీద పాదాల వ్రేళ్ళమీద ఉన్న యవలు (యవల ఆకారములో ఉండు గుర్తులు) పూర్తిగా ఉన్నవి. వ్రేళ్లు దగ్గర చేర్చినపుడు రంధ్రములు లేవు. చేతులు పాదములు కూడ మంచి వర్ణము గలవి. నేను చిరునవ్వు గలదానను అని కన్యాలక్షణము లెరిగిన పండితులు చెప్పిరి. నేను భర్తతో కలసి చక్రవర్తిత్వమునందు అభిషిక్తురాలను కాగలను అని దైవజ్ఞులైన బ్రాహ్మణులు చెప్పినదంతా వ్యర్థమై పోయినది. (1-14)

జనస్థానమునంతా వెదకి, నా వృత్తాంతము తెలిసికొని క్షోభింపశక్యముకాని సముద్రమును దాటి వచ్చిన ఈ రామలక్ష్మణులు చివరికి అవుకాలి దెక్కగుంటలో పడి మరణించినారు. రామలక్ష్మణులవద్ద వారుణ-ఆగ్నేయ-ఐంద్ర-వాయవ్యాస్త్రములు, బ్రహ్మశిరోనామకాస్త్రము ఉన్నవి కదా! అనాథురాలనైన నాకు రక్షకులైన, దేవేంద్రునితో సమానులైన ఈ రామలక్ష్మణులను ఆ రాక్షసుడు మాయచేత కనబడకుండా ఉండి యుద్ధములో చంపినాడు! యుద్ధములో రాముని కంటబడిన శత్రువు మనోవేగమువంటి వేగము కలవాడైనా ప్రాణాలతో తిరిగి వెళ్ళడు కదా? రాముడు కూడా సోదరునితో పాటు యుద్ధములో చంపబడి పడి ఉన్నాడనగా కాలము చేయజాలని పని లేదు. దైవమును జయించుట చాల కష్టము. దీనురాలైన నా అత్తగారిని గూర్చి దుఃఖించినట్లుగా రాముణ్ణి గూర్చి గాని, మహారథుడైన లక్ష్మణుని గూర్చి గాని, నన్ను గూర్చి గాని, నా తల్లిని గూర్చిగాని దుఃఖించను. అరణ్యవాసమును పూర్తిచేసుకొని తిరిగి వచ్చిన రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, సీతను ఎప్పుడు చూచెదనా అని కౌసల్య ఎల్లప్పుడూ ఆలోచించుచుండును." (15-21)

ఇట్లు విలపించుచున్న సీతతో త్రిజట ఇట్లు పలికెను. "ఓ! దేవీ! దుఃఖించకుము. నీ భర్తయైన రాముడు జీవించియే ఉన్నాడు. దేవీ! సోదరులైన ఈ రామలక్ష్మణులు జీవించియే ఉన్నారనుటకు తగిన మంచి కారణములను కూడ చెప్పెదను. ప్రభువు మరణించినట్లయితే యోధుల ముఖములు కోపముతో నిండినవై గాని, సంతోషముతో కూడినవి గాని అయి ఉండవు కదా? ఓ! సీతా! రామలక్ష్మణులు మరణించినచో

పుష్పకమను ప్రసిద్ధనామము గల ఈ దివ్యమైన విమానము నిన్ను మోయదు. యుద్ధములలో ప్రధానవీరుడు మరణించినప్పుడు సేన ఉత్సాహము లేనిదై, ప్రయత్నవిహీనమై చుక్కాని విరిగిన ఓడ నీటిలో తిరిగినట్లు తిరుగుచుండును. దీనురాలవైన ఓ! సీతా! ఈ సేన ఐతే భయపడక, దిగులు లేనిదై, నేను నీకు ప్రేమతో తెలిపిన విధముగా జీవించియే ఉన్న ఈ రామలక్ష్మణులను రక్షించుచున్నది. ఈ ఊహల ఫలము సుఖకరమైనది. అందుచేత నీవు పూర్తి విశ్వాసముతో ఉండుము. ఈ రామలక్ష్మణులు మరణించలేదు. చూడుము. నేను నీపై ఉన్న స్నేహముచేత చెప్పుచున్నాను. సీతా! నేనెన్నడు పూర్వము అసత్యము పలుకలేదు. ఇటుపైన కూడ పలుకను. నీవు పాతివ్రత్య మనే మంచి శీలము గలదాన వగుటచేత, నా మనస్సును ఆకర్షించినావు. ఇంద్రునితో కూడిన సురాసురు లందరూ వచ్చినా యుద్ధములో వీరిద్దరినీ జయింపజాలరు. వీరు జీవించి ఉన్నట్లు సూచించు అట్టి దృశ్యములను చూచి నేను నీకు చెప్పినాను. సీతా! బాణములచే కొట్టబడి సంజ్ఞ లేకుండా పడిపోయినా కూడ ఈ రామలక్ష్మణులను కాంతి విడచుటలేదు. గొప్ప ఆశ్చర్యకరమైన ఈ విషయమును చూడుము. ఆయుర్దాయము చెల్లి ప్రాణములు విడచిన వారి ముఖములు సాధారణముగా చాల వికృతములుగా ఉండును. సీతా! రామలక్ష్మణుల నిమిత్తమై శోకమువలన కలిగిన ముఖవికారాదికమును, దుఃఖమును, మనోవ్యాకులత్వమును విడువుము. ఇట్టి ముఖశోభాదులు కల రామలక్ష్మణులు మరణించుట కుదరదు."(22-33)

దేవకన్య వంటి మిథిలారాజకుమారియైన సీత ఆమె మాటలు విని, అంజలి ఘటించి "నీ మాట సత్యమగుగాక" అని పలికెను. త్రిజట మనోవేగము గల ఆ పుష్పకవిమానమును వెనుకకు మరల్చి సీతను లంకలోనికి తీసికొని వెళ్ళెను. పిమ్మట త్రిజటతో కూడ పుష్పకమునుండి దిగిన ఆ సీతను రాక్షసస్త్రీలు అశోకవనములో ప్రవేశపెట్టిరి. సీత అనేకవృక్షసముదాయములు గలది, రావణుని విహారస్థానము అయిన అశోకవనిలో ప్రవేశించి,మనసా రామలక్ష్మణులనే చూచుచు వారిని గూర్చి ఆలోచించుచు, చాల దుఃఖార్తురా లయ్యెను.(34-37)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది ఎనిమిదవ సర్గము సమాప్తము.

నలుబది తొమ్మిదవ సర్గము

తిరిగి స్పృహ వచ్చిన రాముడు లక్ష్మణునికొరకు విలపించుట.

సుగ్రీవుడు మొదలైన మహాబలవంతులైన ఆ వానరశ్రేష్ఠులందరూ, భయంకరమైన శరబంధములచేత బంధింపబడి సర్పముల వలె నిట్టూర్చుచు, రక్తముచేత తడిసిన మహాత్ములైన ఆ రామలక్ష్మణుల చుట్టూ శోకముతో నిండినవారై నిలచిరి. ఇంతలో పరాక్రమవంతుడైన రాముడు శరములచేత బంధింపబడినను, మానసికస్థైర్యము ఉన్నవా డగుటవలనను, బలము గలవాడగుటవలనను స్పృహలోకి వచ్చెను. (1-3)

రక్తముతో తడిసినవాడు, క్షీణించినవాడు, గాఢముగా నేలమీద పడవేయబడినవాడు, దీనమైన ముఖముగలవాడు అయిన సోదరుని చూచి రాముడు దుఃఖార్తుడై విలపించెను – "యుద్ధములో జయింపబడి ఉన్న సోదరుని చూడవలసి వచ్చిన నాకు సీతతో కాని, జీవితముతో కాని ఏమి ప్రయోజనము? అన్వేషించగా ఈ భూలోకములో సీతవంటి స్త్రీ దొరకవచ్చును. కాని సాహాయ్యము చేసేవాడు, యుద్ధమునందు సమర్థుడు అయిన లక్ష్మణుని వంటి సోదరుడు లభించడు. లక్ష్మణుడు మరణించినట్లయితే నేను కూడ వానరులు చూచుచుండగా ప్రాణాలు విడచెదను. తల్లియైన కౌసల్యకు, కైకేయికి, పుత్రుని చూడవలె నని ఆసక్తితో ఎదురుచూచుచున్న తల్లియైన సుమిత్రకు ఏమి చెప్పెదను? లక్ష్మణుడు లేకుండగా తిరిగి వెళ్ళిన నేను తల్లియైన సుమిత్ర పుత్రుడు లేక వణికిపోవుచు గోరింకవలె ఏడ్చుచుండగా ఆమెను ఎట్లు ఓదార్చగలను? 'ఏ లక్ష్మణుడు నాతో వనమునకు వచ్చినాడో, అతడు లేకుండా నేను తిరిగి వచ్చినాను' అని శత్రుఘ్నునితోను, యశశ్శాలియైన భరతునితోను ఎట్లు చెప్పగలను? సుమిత్ర చేయు నిందను సహించజాలను. అందుచేత ఇక్కడనే దేహమును విడచెదను. జీవించుటకు ఇచ్ఛగించను. (4-11)

ఛీ! నేనెంత పాపాత్ముడను! ఎంత చెడ్డవాడను! ఈ లక్ష్మణుడు నానిమిత్తమై పడగొట్టబడినవాడై మరణించి నట్లు శరతల్పము మీద శయనించి ఉన్నాడు. 'లక్ష్మణా! నేను దుఃఖాక్రాంతుడనై నప్పుడల్లా నీవు నన్ను ఓదార్చుచుండేవాడవు. ఇప్పుడు నీవు మరణించి, దుఃఖితుడనైన నాతో మాటలాడుటలేదు. ఈనాడు ఏ నీవు యుద్ధములో అనేక రాక్షసులను చంపి నేలమీద పడవేసినావో ఆ నీవు ఇప్పుడు బాణాలచేత చంపబడినవాడివై, ఆ నేలమీదనే శయనించి ఉన్నావు. బాణముల సముదాయముతో నిండినవాడవై, రక్తముచేత తడిసి ఈ శరతల్పముమీద శయనించి

ఉన్న నీవు అస్త్రాద్రి చేరుచున్న సూర్యుడు వలె ఉన్నావు.' మర్మస్థానములు బాణములచేత కొట్టబడుటచేత ఇతడు మాటలాడలేకున్నాడు. మాటలాడకపోయినను, చూపులోని ఎరుపువలన ఈతని బాధ వ్యక్తమగుచున్నది. గొప్ప కాంతి గల ఇతడు వనమునకు వెళ్ళుచున్నప్పుడు నన్ను ఎట్లు అనుసరించినాడో అట్లే నేను కూడ యమలోకమునకు ఈతని వెనుక వెళ్లెదను. ఎల్లప్పుడు బంధువులయందు ప్రేమగలవాడు, నిత్యము నన్ను అనుసరించువాడూ అయిన ఇతడు అనార్యుడనైన నా చెడ్డపనులచేత ఇట్టి అవస్థ పొందినాడు. వీరుడైన లక్ష్మణుడు ఎంతకోపము వచ్చినను, ఎన్నడూ కూడ పరుషము, అప్రియము అయిన మాట పలికినట్లు నాకు గుర్తు లేదు.(12-19)

"వెయ్యి భుజములు గల ఏ కార్తవీర్యార్జునుడు ఒక్క ప్రయత్నముచేత, ఐదువందల బాణములు ప్రయోగించేవాడో అతని కంటె కూడా లక్ష్మణుడు బాణప్రయోగములో అధికుడు. ఏ లక్ష్మణుడు మహాత్ముడైన దేవేంద్రుని అస్త్రములను కూడ అస్త్రములచేత కొట్టివేయగలడో, ఉత్తమమైన శయనముపై పరుండుటకు తగిన అట్టి లక్ష్మణుడు చంపబడి నేలపై పడి ఉన్నాడు. విభీషణుణ్ణి రాక్షసరాజుగా చేయలేకపోయితిని. అందుచే "నిన్ను రాజును చేసెదను" అని నేను విభీషణునితో పలికిన అసత్యప్రలాపము నన్ను కాల్చివేయును; సందేహము లేదు.(20-22)

వానరరాజా! సుగ్రీవా! నీ వీ ముహూర్తమునందే బయలుదేరి ఇక్కడినుండి వెళ్ళిపొమ్ము. నేను నీతో లేనని తెలిసి రావణుడు నిన్ను తిరస్కరించును. నువ్వు సైన్యముతోను, పరివారముతోను, అంగద-నీల-నలులతోను సముద్రము దాటి వెళ్ళిపొమ్ము. యుద్ధములో మరెవ్వరూ చేయజాలని పనులు జాంబవంతుడు, గోలాంగూలముల ప్రభువు చేసినందుకు సంతోషించుచున్నాను. అంగదుడు, మైందుడు, ద్వివిదుడు గొప్ప పనులు చేసినారు. యుద్ధరంగములో కేసరి, సంపాతి ఘోరమైన యుద్ధము చేసినారు. గవయుడు, గవాక్షుడు, శరభుడు, గజుడు, నానిమిత్తమై ప్రాణములను త్యజించుటకు సిద్ధమైన ఇతరవానరులు గొప్ప యుద్ధము చేసిరి. సుగ్రీవా! మానవులు దైవమును అతిక్రమింపజాలరు. ఓ! శత్రుసంహారకుడా! మంచి హృదయము గల మిత్రుడు చేయగలిగిన దంతా ధర్మభీతి గల నీవు చేసినావు. ఓ! వానరశ్రేష్ఠులారా! మీరు మిత్రులు చేయవలసిన కార్యము చేసినారు. మీ అందరికీ అనుజ్ఞ ఇచ్చుచున్నాను; మీ కిష్టమైన ప్రదేశములకు వెళ్ళుడు."(23-29)

రాముని విలాపము విన్న వానరులందరూ నేత్రములనుండి కన్నీళ్లు కార్చిరి. ఇంతలో విభీషణుడు సైన్యముల నన్నింటినీ ధైర్యము చెప్పి నిలిపి, గద హస్తమునందు

ధరించి రాముడున్న చోటికి శీఘ్రముగా వచ్చెను. నల్లని కాటుక రాసి వలె ఉన్న ఆ విభీషణుడు శీఘ్రముగా వెళ్ళుట చూచి వానరు లందరూ ఇంద్రజిత్తు అని అనుకొని పారిపోయిరి.(30-33)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని నలుబది తొమ్మిదవ సర్గము సమాప్తము.

ఏబదవ సర్గము

గరుత్మంతుడు వచ్చి రామలక్ష్మణులను నాగపాశమునుండి విముక్తులను చేసి వెళ్లుట.

అప్పుడు గొప్ప తేజస్సు, బలము గల సుగ్రీవుడు - "మూఢమైన వాయువుచేత ఓడ నీటిలో వ్యాకులమైనట్లు ఈ సైన్యము వ్యథ చెందినదేమి?" అని ప్రశ్నించెను. సుగ్రీవుని మాటలు విని వాలిపుత్రుడైన అంగదుడు - "మహాత్ములైన దశరథకుమారులు రాముడు, మహారథుడైన లక్ష్మణుడు బాణముల సముదాయముచేత కప్పబడి, రక్తముచేత తడిసి శరతల్పముమీద శయనించి ఉన్నారు కదా! నీవు ఆ వీరులను చూడలేదా?" అనెను. పిమ్మట వానరరాజైన సుగ్రీవుడు పుత్రుడైన అంగదునితో - "ఇది కారణము లేకుండా జరుగుచున్నదని అనుకొనను; ఏదో భయకారణము ఉండి ఉండవలెను. ఇక్కడ ఈ వానరులు దిగులు చెందిన ముఖములతో, భయముచేత విప్పారిన కళ్ళతో, ఆయుధములు విడచి నాల్గు దిక్కులకు పారిపోవుచున్నారు. ఈ వానరులు ఒకరిని చూచి ఒకరు సిగ్గు పడుటలేదు. వెనుకకు తిరిగి చూచుట లేదు. ఒకరినొకరు లాగుచున్నారు. పడిపోయినవానిని దాటి వెళ్ళిపోవుచున్నారు" అనెను.(1-6)

ఇంతలో చేతిలో గద ధరించిన వీరుడైన విభీషణుడు వచ్చి జయశబ్దమును ఉచ్చరించుచు సుగ్రీవునకు, రామునకు అభివాదనము చేసెను. వానరులు భయపడుటకు కారణము విభీషణుడే అని గ్రహించి సుగ్రీవుడు సమీపమునందున్న మహాత్ముడైన జాంబవంతునితో- "ఈ విభీషణుడు వచ్చినాడు. ఈతనిని చూచి వానరశ్రేష్ఠులు ఇంద్రజిత్తు అనే శంకచేత భయపడి పారిపోవుచున్నారు. భయపడి అన్ని వైపులకు పారిపోవుచున్న వీళ్ళకు శీఘ్రముగా వెళ్ళి ధైర్యము చెప్పుము. విభీషణు డని వాళ్ళకు చెప్పుము." అని పలికెను. భల్లూకముల రాజైన జాంబవంతుడు

సుగ్రీవుని ఆజ్ఞ ప్రకారము వెళ్ళి పారిపోవుచున్న వానరులను వెనుకకు మరల్చి వారికి ధైర్యము చెప్పెను. ఆ వానరులందరు జాంబవంతుని మాటలు విని, విభీషణుని చూచి, భయము విడచి మరల తిరిగి వచ్చిరి.(7-12)

ధర్మాత్ముడైన విభీషణుడు బాణములచేత అంతటా గ్రుచ్చబడిన రామలక్ష్మణుల శరీరములు చూచి అప్పుడు చాల వ్యథ చెందెను. అతడు నీళ్ళతో తడిసిన చేతితో వారి కళ్లు తుడిచి, శోకముచేత పీడించబడిన మనస్సు గలవాడై ఏడ్చుచు విలపించెను– "అధికబలము గలవారు, పరాక్రమవంతులు, యుద్ధమునందు ఆసక్తి గలవారు అయిన అట్టి ఈ రామలక్ష్మణులను కపటయుద్ధము చేయు రాక్షసులు ఇట్టి స్థితి పొందించినారు! కపటము ఎరుగని పరాక్రమము గల వీరిద్దరినీ దుష్టపుత్రుడు, చెడ్డబుద్ధి కలవాడు అయిన నా సోదరుని కుమారుడు రాక్షససహజమైన కుటిల బుద్ధితో వంచించినాడు. బాణములచేత అధికముగా కొట్టబడి, రక్తముతో తడిసి నేలమీద పడి ఉన్న ఈ రామలక్ష్మణులు శల్యకమ్మృగముల వలె కనబడుచున్నారు. ఏ రామలక్ష్మణుల పరాక్రమమును ఆశ్రయించి నేను రాజ్యము పొందవలెనని కోరుకొంటినో అట్టి ఈ మానవశ్రేష్ఠులు ప్రాణములను విడచుటకై పడియున్నారు. నా రాజ్యలాభాశ నశించుటచేత నేను ఇప్పుడు జీవించి ఉన్నా ఆపదలలో ఉన్నాను. శత్రువైన రావణుని ప్రతిజ్ఞ నెరవేరి వాని కోరిక తీరినది."(13-19)

బలశాలి, వానరరాజు అయిన సుగ్రీవుడు ఈ విధముగా విలపించుచున్న విభీషణుని కౌగిలించుకొని– "ధర్మము తెలిసిన ఓ! విభీషణా! నీవు లంకారాజ్యము పొందగలవు; సందేహము లేదు. రావణుడు, అతని కుమారుడు అనుకొన్నట్లు వారి కోరిక సఫలము కాదు. ఈ రామలక్ష్మణులిద్దరూ మరణమును కలిగించు బాధచేత పీడింపబడుటలేదు. కేవలము మోహము చెంది ఉన్నారు. మోహమును విడచి యుద్ధములో పరివారసహితుడైన రావణుని చంపగలరు." అని పలికెను. సుగ్రీవుడు విభీషణుని ఈ విధముగా ఓదార్చి, విశ్వాసము కలిగించి, ప్రక్కనే ఉన్న మామగారైన సుషేణునితో– "నీవు శూరులైన వానరులతో కలిసి, సంజ్ఞ వచ్చిన శత్రుసంహారకులైన ఈ సోదరులను, రామలక్ష్మణులను తీసికొని కిష్కింధకు వెళ్లుము. నేను రావణుని, వాని పుత్రులను, బంధువులను సంహరించి, దేవేంద్రుడు నష్టమైన రాజ్యలక్ష్మిని తిరిగి తీసికొనివచ్చినట్లు సీతను తీసికొని వచ్చెదను." అని పలికెను.(20-25)

సుగ్రీవుని వాక్యమును విని సుషేణుడు – "దేవాసురుల మధ్య జరిగిన చాల భయంకరమైన యుద్ధమును గూర్చి నాకు తెలియును. అప్పుడు



బాణప్రయోగమునందు నేర్పు గల దానవులు మాటిమాటికి అంతర్ధానము చెందుచు, అస్త్రములయందు సమర్థులైన దేవతలను కొట్టిరి. ఆ దేవతలలో కొందరు పీడితులైరి. కొందరు మూర్ఛ చెందిరి. కొందరు మరణించిరి. వాళ్ళందరికి బృహస్పతి మంత్రములతో కూడిన విద్యచేత, ఓషధులచేత చికిత్స చేసెను. సంపాతి, పనసుడు మొదలైన వానరులు ఆ ఔషధములను తీసికొని వచ్చుటకై వెంటనే, క్షీరసముద్రమునకు వేగముగా వెళ్ళెదరుగాక. దివ్యమైన సంజీవకరణిని, దేవతలు సృజించిన విశల్యకరణిని, ఇతరములైన పర్వతములందు లభించే ఓషధులను ఆ వానరులు ఎరుగుదురు. అమృతము మథించిన సముద్రశ్రేష్ఠమైన క్షీరసముద్రములో చంద్రము, ద్రోణము అను పర్వతములున్నవి. సంజీవకరణి, విశల్యకరణి అను పరమౌషధులు ఆ పర్వతముల మీద ఉన్నవి. ఆ రెండు పర్వతములను దేవతలు ఆ క్షీరసముద్రమునందు ఉంచినారు. రాజా! వాయుపుత్రుడైన ఈ హనుమంతుని అక్కడికి పంపుము." అని పలికెను.(26-32)

ఇంతలో మెరుపులతో కూడిన మేఘములను, సముద్రములోని జలమును చిమ్మివేయుచు, పర్వతములను కూడ కంపింపచేయుచున్నదా అన్నట్లు తీవ్రమైన వాయువు వీచెను. అన్ని ద్వీపములందు ఉన్న మహావృక్షములు రెక్కలనుండి పుట్టిన పెద్దగాలికి కొమ్మలు విరిగిపోగా లవణసముద్రజలములో పడిపోయినవి. సర్పము లన్నీ భయపడెను. అక్కడ నివసించు సర్పములు, సమస్తమైన జలజంతువులు శీఘ్రముగా లవణసముద్రములో ప్రవేశించెను. పిమ్మట మరుక్షణమునందే, మండుచున్న అగ్నివలె వినతాకుమారుడు, మహాబలశాలీ అయిన గరుత్మంతుడు వానరులకు కనబడెను. బాణములుగా అయి ఆ రామలక్ష్మణులను బంధించి ఉన్న మహాబలము గల నాగము లన్నీ గరుత్మంతుడు వచ్చుట చూచి పారిపోయినవి. పిమ్మట గరుత్మంతుడు ఆ రామలక్ష్మణులను స్పృశించి, అభినందించి, చంద్రునివంటి వారి ముఖములను చేతులతో నిమిరెను. గరుత్మంతుడు స్పృశించగానే రామలక్ష్మణుల గాయములు మానిపోయెను. వెంటనే వారి శరీరములు గూడ మంచి రంగుతో నున్నగా అయినవి. వారి తేజస్సు, వీర్యము, బలము, ఉత్సాహము,

ఇతరమహాగుణములు, సూక్ష్మవిషయజ్ఞానము, బుద్ధి, స్మృతీ, రెట్టింపు అయినవి. (33-40)

మహాతేజఃశాలియైన గరుత్మంతుడు ఇంద్రునితో సమానులైన ఆ రామలక్ష్మణులను లేవదీసి వారిద్దరినీ కౌగిలించుకొనెను. రాముడు సంతోషించి అతనితో- "నీ అనుగ్రహముచేత మేమిద్దరమూ ఇప్పుడు ఇంద్రజిత్తువలన కలిగిన గొప్ప ఆపదను దాటితిమి. పూర్వమువలె బలముకలవారమైతిమి. నిన్ను చూచుటచే నా మనస్సు నా తండ్రియైన దశరథమహారాజును చూచినట్లు, పితామహుడైన అజమహారాజును చూచినట్లు ప్రసన్నమగుచున్నది. నీ రూపము చాల అందముగా ఉన్నది. దివ్యములైన పుష్పమాలలను, చందనాద్యనులేపనములను శరీరమునకు పూసికొను సుగంధ ద్రవ్యములను, మాయని వస్త్రములను ధరించినావు. దివ్యములైన అలంకారములు అలంకరించుకొన్నావు. నీవు ఎవరవు?" అని ప్రశ్నించెను. (41-44)

గొప్ప తేజోబలములు గల పక్షిరాజైన ఆ గరుత్మంతుడు సంతోషించిన మనస్సు గలవాడై, ఆనందముచేత వ్యాకులమైన నేత్రములతో రామునితో ఇట్లనెను- "రామా! నేను నీ ప్రియమిత్రుడను. బైట సంచరించు ప్రాణమువంటివాడను. నాపేరు గరుత్మంతుడు. మీ ఇద్దరికీ సాహాయ్యము చేయుటకై ఇక్కడికి వచ్చినాను. క్రూరకర్మ గల ఇంద్రజిత్తు మాయాబలముచేత చేసిన చాల భయంకరమైన ఈ శరబంధమును గొప్ప పరాక్రమము గల అసురులు గాని, మహాబలవంతులైన వానరులుగాని, దేవేంద్రునితో సహా సురులుగాని, గంధర్వులుగాని విడిపించజాలరు. తీక్ష్ణమైన కోరలుగలవి, విషముచేత తీవ్రములు, కద్రుపుత్రులు అయిన ఈ నాగములు రాక్షసుని మాయాప్రభావముచేత బాణములై నిన్ను ఆక్రమించినవి. ధర్మము తెలిసినవాడా! సత్యమైన పరాక్రమము గలవాడా! రామా! నీ సోదరుడైన లక్ష్మణుడు, నీవు కూడ భాగ్యవంతులు. నేను ఈ వృత్తాంతమును విని మన ఇద్దరి మధ్య ఆ స్నేహమును పాలించుచు, తొందరపడుచు వెంటనే వచ్చినాను. మీరు చాల భయంకరమైన ఈ బాణబంధమునుండి విడిపింపబడినారు. ఎల్లప్పుడు మీరు ఏమరిపాటు లేకుండా ఉండవలెను. యుద్ధములో కపటముగా యుద్ధము చేయుట రాక్షసుల స్వభావము. శూరులు, పరిశుద్ధమైన మనోభావము గలవారు అయిన మీకు ఋజుత్వము(వక్రబుద్ధి లేకపోవుట) బలము. రాక్షసులు ఎల్లప్పుడు వక్రస్వభావము గలవారు అనుటకు ఇంద్రజిత్తు చేసినదే దృష్టాంతము. అందుచే యుద్ధభూమిలో మీరు రాక్షసులను విశ్వసించకూడదు." అని పలికెను. (45-54)

గొప్ప బలము గల ఆ గరుత్మంతుడు రామునితో ఇట్లు పలికి, స్నేహపూర్వకముగా కౌగిలించుకొని వెళ్ళుటకు అనుజ్ఞ వేడుటకు ప్రారంభించెను- “ధర్మము తెలిసినవాడా! శత్రువులను కూడా ప్రేమించువాడా! మిత్రుడవైన రామా! నేను సుఖముగా వెళ్లెదను; అనుజ్ఞ ఇవ్వవలెనని కోరుచున్నాను. నీవు మనకిద్దరికి స్నేహము ఎట్లు ఏర్పడినది అని తెలిసికొనుటకు అభిలాషను చూపవద్దు. యుద్ధమునందు శత్రుసంహారము పూర్తిచేసిన పిదప నీకు తెలియగలదు. నీవు బాణతరంగములచేత లంకలో బాలులు, వృద్ధులు మాత్రమే మిగులునట్లు చేసి, శత్రువైన రావణుని సంహరించి సీతను పొందగలవు.” మంచి రెక్కలుగలవాడు, శీఘ్రగమనము గలవాడు, పరాక్రమవంతుడు అయిన గరుత్మంతుడు రామునితో ఇట్లు పలికి, ఆ వానరుల మధ్య రాముని బాధను తొలగించి, ప్రదక్షిణము చేసి, కౌగిలించుకొని,వాయువువలె ఆకాశములో ప్రవేశించి వెళ్ళిపోయెను.(55-60)

రామలక్ష్మణులు పీడావిముక్తులైనట్లు చూచి, వానరసేనానాయకులు సింహనాదములు చేయుచు, తోకలు ఝాడించిరి. పిమ్మట ఆ వానరులు పూర్వము వలె అరచుచు ఆనందముతో భేరీలను మ్రోగించిరి. మృదంగములను వాయించిరి. శంఖములను పూరించిరి. పర్వతములతో యుద్ధముచేయు మరికొందరు పరాక్రమవంతులైన వానరులు భుజములు చరచుచు, వందలకొలది, వేలకొలది అనేకవిధములైన వృక్షములను పెకలించి, నిలచిరి. వానరులు గొప్ప ధ్వని చేయుచు, రాక్షసులకు భయము కలిగించుచు, యుద్ధము చేయుటకై లంకాద్వారములవద్దకు వెళ్ళిరి. ఆ వానరసేనానాయకుల భయంకరము, వ్యాకులము అయిన ధ్వని గ్రీష్మర్తువు గడచినప్పుడు అర్ధరాత్రియందు ధ్వని చేయుచున్న మేఘముల భయంకర ధ్వని వలె ఉండెను.(61-65)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబదవ సర్గము సమాప్తము.

ఏబది ఒకటవ సర్గము

రాముడు శరబంధమునుండి విముక్తుడైనట్లు తెలిసి రావణుడు చింతాక్రాంతుడై ధూమ్రాక్షుని యుద్ధమునకు పంపుట.

అప్పుడు గర్జించుచున్న ఆ వానరులు చేయు వ్యాకులమైన ధ్వనిని రావణుడు,రాక్షసులూ కూడ వినిరి. రావణుడు మధురముగా గంభీరముగా ఉన్న ధ్వని గల ఆ వానరులు చేయు శబ్దమును విని మంత్రులతో– "వానరు లందరూ సంతోషించుచు, గర్జించుచున్న మేఘముల వలె చేయుచున్న ఆ మహాధ్వని బయలుదేరుటను పట్టి వీళ్లకు గొప్ప సంతోషము కలిగిన ట్లున్నది. ఈ విషయము స్పష్టము. సందేహము లేదు. అధికమైన ధ్వనులచేత లవణసముద్రము కూడా క్షోభించుచున్నది కదా? సోదరులైన ఆ రామలక్ష్మణులు వాడియైన బాణములచేత కట్టబడినారు కదా? ఇప్పుడు బయలుదేరిన ఈ గొప్ప ధ్వని నాకు శంకను కలిగించుచున్నది." అని పలికి సమీపమునందు సంచరించుచున్న రాక్షసులను– "ఈ వానరులందరికీ దుఃఖించవలసిన సమయములో సంతోషించుటకు ఏమి కారణము వచ్చినదో వెంటనే తెలిసికొనుడు." అని ఆజ్ఞాపించెను.(1-7)

రావణుని ఆజ్ఞచే వాళ్ళు తొందరపడుచు ప్రాకారము పైకి ఎక్కి మహాత్ముడైన సుగ్రీవునిచేత పాలింపబడిన వానరసేనను, చాల భయంకరమైన ఆ శరబంధమునుండి విముక్తులై లేచిన మహాభాగ్యవంతులైన రామలక్ష్మణులను చూచిరి. అప్పుడా రాక్షసు లందరూ దిగులుచెంది, ప్రాకారము దిగి, మారిపోయిన ముఖవర్ణములతో రావణుని వద్దకు వచ్చిరి. ఆ రాక్షసులు దీనములైన ముఖములతో ఆ అప్రియమైన విషయమునంతనూ ఉన్నదున్నట్లు రావణునకు– "ఇంద్రజిత్తు యుద్ధములో సోదరులైన ఏ రామలక్ష్మణులను శరబంధముచేత బంధించి భుజములు కదల్పజాలనివారినిగా చేసినాడో ఆ రామలక్ష్మణులు శరబంధమునుండి విముక్తులై యుద్ధరంగమునందు పాశములు ఛేదించుకొన్న ఏనుగుల వలె కనబడుచున్నారు." అని తెలిపిరి. మహాబలవంతుడైన రావణుడు వాళ్ళు చెప్పిన మాటలు విని, చింతతోను, రోషముతోను నిండినవాడయ్యెను. అతని ముఖము రంగు మారిపోయెను.(8-14)

"యుద్ధములో ఇంద్రజిత్తు, బాగా పీడించి, భయంకరములు, వరములు పొందినవి, సర్పములతో సమానములు, వ్యర్థముకానివి, సూర్యతుల్యములు అయిన బాణములతో కట్టివేసిన నా శత్రువులైన రామలక్ష్మణులు ఆ అస్త్రబంధములో చిక్కుకొని కూడ దానినుండి విముక్తు లగుట చూడగా మన ఈ బలమంతా

సంశయస్థితిలో పడినదని ఊహించుచున్నాను. పూర్వము ఏ బాణములు యుద్ధములలో నా శత్రువుల జీవితములను అపహరించినవో అగ్నివంటి ఆ బాణములే ఇప్పుడు వ్యర్థమైపోయినవి కదా!" అని పలికి, రావణుడు చాల కోపముతో పామువలె బుసలు కొట్టుచు, రాక్షసుల మధ్య ధూమ్రాక్షుడను రాక్షసుని- "భయంకరమైన పరాక్రమము గల నీవు పెద్ద సైన్యములతోను, రాక్షసులతోను కూడినవాడవై రాముణ్ణి, వానరులనూ చంపుటకు వెంటనే బయలుదేరుము" అని ఆదేశించెను. (15-19)

బుద్ధిమంతుడైన రావణుని ఆజ్ఞ ప్రకారము ధూమ్రాక్షుడు అక్కడినుండి బయలుదేరి వెంటనే రాజప్రాసాదమునుండి వెడలెను. అతడు ఆ ద్వారము దాటి వెళ్ళి సేనాధ్యక్షునితో, "యుద్ధమునకై వెళ్ళదలచుచున్నాను. వెంటనే సైన్యము సిద్ధము చేయుము. ఆలస్యము చేయకుము." అనెను. వెనుకనే సైన్యము గల సేనాధ్యక్షుడు అతని మాటలు విని, రావణుని ఆజ్ఞ ప్రకారము వెంటనే సైన్యమును ఆయత్తము చేసెను. ఘంటలు కట్టుకొని ధ్వని చేయుచున్న భయంకరమైన రూపము గల బలవంతులైన ఆ రాక్షసులు సంతోషముతో ధూమ్రాక్షుని చుట్టూ చేరిరి. నల్లని మేఘముల వలె ఉన్న భయంకరులైన రాక్షసులు, గర్జించుచు, అనేక విధములైన ఆయుధములు ధరించి, శూలములు, ముద్గరములు, హస్తములయందు ధరించి, గదలు, పట్టిశములు, దండములు, ఇనుపరోకళ్ళు, పరిఘలు, భిందిపాలములు, బల్లెములు, పాశములు, గొడ్డళ్ళు మొదలైనవాటితో బయలుదేరిరి. కవచములు ధరించిన మరికొందరు రాక్షసులు ధ్వజములచేత, బంగారు జాలీలచేత అలంకరింపబడిన, అనేక విధములైన ముఖములు గల గాడిదలు లాగుచున్న రథములు ఎక్కి వెళ్ళిరి. పెద్దపులుల వలె ఎదిరింపశక్యముకాని మరికొందరు రాక్షసశ్రేష్ఠులు వేగము గల గుఱ్ఱములను, మదముచేత తీవ్రముగా ఉన్న ఏనుగులను ఎక్కి బయలుదేరిరి. (20-27)

గాడిదలవంటి అరపుగల ధూమ్రాక్షుడు లేళ్ళ ముఖములు, సింహముఖములూ గల, బంగారముచేత అలంకరింపబడిన గాడిదలు కట్టిన దివ్యమైన రథము నెక్కెను. మహాపరాక్రమము గల ధూమ్రాక్షుడు రాక్షసులతో కూడి నవ్వుచూ, హనుమంతుడు ఏ ద్వారము దగ్గర సేనాపతిగా ఉండెనో ఆ పశ్చిమద్వారమునుండి వెలువడెను. గాడిదలు కట్టిన క్రూరమైన ధ్వని గల రథశ్రేష్ఠమును ఎక్కి వెళ్ళుచున్న చాల క్రూరుడైన, చూచుటకు భయంకరుడుగా ఉన్న ఆ రాక్షసుణ్ణి చూచి ఆకాశములో ఉన్న క్రూరములైన శకునములు అడ్డగించినవి. చాల భయంకరమైన గ్రద్ద రథము

శిఖరముపై వ్రాలెను. రాబందులు కొన్ని చుట్టబెట్టుకొని ధ్వజాగ్రమునందు పడెను. రక్తముతో తడిసిన తెల్లని పెద్ద మొండెము వికృతమైన ధ్వని చేయుచు ధూమ్రాక్షునికి దగ్గరగా నేలమీద పడెను. రక్తవర్షము కురిసెను. భూమి కంపించెను. పిడుగువంటి ధ్వనితో వాయువు ప్రతికూలముగా వీచెను. దిక్కులు చీకటి ఆవరించుటచే ప్రకాశవిహీనముగా ఉండెను. ఆ సమయమునందు కనబడిన, ఘోరములైన, రాక్షసులకు భయంకరములైన ఆ దుఃశకునములను చూచి ధూమ్రాక్షుడు వ్యథ చెందెను. అతని ముందు నడచుచున్న రాక్షసు లందరూ మోహము చెందిరి. చాలా భయంకరుడు, బలశాలి అయిన ఆ ధూమ్రాక్షుడు చాలామంది రాక్షసులతో కూడి యుద్ధోత్సాహముతో బైలుదేరి వచ్చి, సముద్రము వలె ఉన్న, రాముని బాహువులచేత రక్షింపబడుచున్న ఆ వానరసైన్యమును చూచెను. (28-36)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబది ఒకటవ సర్గము సమాప్తము

ఏబది రెండవ సర్గము

హనుమంతుడు ధూమ్రాక్షుని వధించుట.

భయంకర పరాక్రమము గల ధూమ్రాక్షుడు బయలుదేరి వచ్చుచుండుట చూచి, యుద్ధానికై వేచి ఉన్న వానరు లందరూ సంతోషించి ధ్వని చేసిరి. వృక్షములచేత, శూలములచేత, ముద్గరముల చేత పరస్పరము కొట్టుకొనుచున్న ఆ వానరరాక్షసుల మధ్య చాల వ్యాకులమైన యుద్ధము జరిగెను. వానరులను రాక్షసులు అంతటా ఛేదించివేయగా వానరులు రాక్షసులను వృక్షములచేత భూమితో సమముగా చేసివేసిరి. రాక్షసులు కోపించినవారై భయంకరములైన కాలాగ్న్యాదుల వంటి గ్రద్ద రెక్కలు కట్టిన, వంకరలేకుండా పోవు, వాడియైన బాణములచే వానరులను కొట్టిరి. గొప్ప బలము గల వానరులు, తమను రాక్షసులు గదలచేత, పట్టిశములచేత, కూటములచేత, ముద్గరములచేత, పరిఘలచేత, చిత్రములైన త్రిశూలములచేత చీల్చివేయుచుండగా కోపముచేత పెరిగిన ఉత్సాహముతో, ఏ మాత్రము భయపడక గొప్ప పనులు చేసిరి. శరములచేత, శూలములచేత, శరీరములు భేదింపబడుచుండగా ఆ వానరసేనానాయకులు వృక్షములను, శిలలను గ్రహించిరి. భయంకరమైన వేగము గల ఆ వానరులు గర్జించుచు అన్ని ప్రదేశములందు, వీరులైన రాక్షసులను తమ పేర్లు చెప్పుకొనుచు, మథించివేసిరి. వానరులకు రాక్షసులకు మధ్య అనేక విధములైన

శిలలతోను, చాల కొమ్మలు గల వృక్షములతోను, జరిగిన ఆ యుద్ధము ఆశ్చర్యకరముగా ఉండెను. శ్వాసలు బిగించిన వానరులు కొందరు రాక్షసులను మథించిరి. రక్తము భుజించు కొందరు రాక్షసులు నోటినుండి రక్తము కక్కిరి. (1-10)

వానరులు కొందరు రాక్షసులను పార్శ్వములందు చీల్చివేసిరి. కొందరిని వృక్షములతో కొట్టి గుట్టలుగా పడవేసిరి. కొందరిని శిలలతో చూర్ణము చేసిరి. కొందరిని దంతములతో చూర్ణము చేసిరి. ధ్వజములను ఊడబెరికి విరిచివేసిరి. ఖడ్గములు నేలమీద పడగొట్టిరి. రథములను ధ్వంసముచేసిరి. ఇదంతా చూచి కొందరు రాక్షసులు వ్యథ చెందిరి. వానరులు పర్వతశిఖరములను ప్రయోగించగా నలిగిపోయిన పర్వతము వంటి ఏనుగులతోను, గుఱ్ఱములతోను, గుఱ్ఱపురౌతులతోను నేల అంతా చిందరవందరగా ఉండెను. భయంకరమైన పరాక్రమము గల వానరులు వేగముగాను, అడ్డముగాను, పైకి ఎగిరి వాడియైన గోళ్ళతో రాక్షసుల ముఖములను చీల్చివేసిరి. ఆ రాక్షసులు మిక్కిలి దిగులు చెందిన ముఖములతో, జుట్లు విరబోసుకొని, రక్తగంధములచేత మూఢులై నేలమీద పడిరి. భయంకరమైన పరాక్రమము గల కొందరు రాక్షసులు చాలా కోపించి వానరులను, వజ్రాయుధస్పర్శవంటి స్పర్శ గల అరచేతులతో కొట్టుటకై వెళ్ళిరి. వేగముగా మీదికి వచ్చుచున్న ఆ రాక్షసులను అంతకంటే అధికమై వేగము గల వానరులు పిడికిళ్ళచేత, పాదములచేత, దంతములచేత, వృక్షములచేత మర్దించిరి. రాక్షసశ్రేష్ఠుడైన ధూమ్రాక్షుడు సైన్యము పారిపోవుట చూచి, కోపించి, యుద్ధము చేయవచ్చిన వానరులను సంహరించెను. (11-18)

కొందరు వానరులు ప్రాసలచేత కొట్టబడినవారై రక్తము స్రవించుచు మరణించిరి. మరికొందరు ముద్గరముల దెబ్బలకు నేలపై పడిరి. కొందరు పరిఘలచేత మర్దింపబడిరి. కొందరు భిందిపాలములచేత చీల్చివేయబడిరి. కొందరు పట్టిశములచేత మథింపబడి వ్యాకులులై మరణించిరి. కొందరు వానరులు యుద్ధమునందు కోపించిన రాక్షసులచేత చంపబడినవారై రక్తముచేత తడిసిన శరీరములతో నేలమీద పడిపోయిరి. కొందరు తరుమబడి పారిపోయిరి. కొందరు వానరులు ఖండించబడిన హృదయములతో ఒక ప్రక్కకు ఒరిగి పడిపోయిరి. కొందరు త్రిశూలములచేత చీల్చివేయబడగా వాళ్ళప్రేగులు పైకి వచ్చి వేసినవి. చాల భయంకరము, వానరులతోను రాక్షసులతోను సంకులము అయిన ఆ మహాయుద్ధము ఆయుధములచేతను, శిలలచేతను, వృక్షములచేతను వ్యాకులమై ప్రకాశించెను. ఆ యుద్ధమనే సంగీతము(నృత్త-గీత-వాద్యరూపమైనది సంగీతము)

చాలా అందముగా ఉండెను. ధనుస్సుల నారుల ధ్వని అనే తీగల ధ్వనులు దానియందు మధురముగా ఉండెను. ఎక్కిళ్ళు తాళములుగాను, అలసిపోవుటచేత మందముగా వచ్చు మాటలు గీతముగాను ఉండెను. (19-24)

యుద్ధభూమి అగ్రభాగమునందు ధూమ్రాక్షుడు ధనుస్సు చేతిలో ధరించి, నవ్వుచు, బాణవర్షము కురిపించుచు ఆ వానరులు దిక్కులు పట్టి పారిపోవునట్లు చేసెను. ధూమ్రాక్షుడు బాధించుటచే వ్యథ చెంది ఉన్న సైన్యమును చూచి, హనుమంతుడు కోపించి, పెద్ద శిలను గ్రహించి అతని వైపు వెళ్ళెను. తండ్రితో సమానమైన పరాక్రమము గల హనుమంతుడు కోపముచేత రెట్టింపు ఎఱ్ఱనైన నేత్రములుగలవాడై, ఆ శిలను ధూమ్రాక్షుని రథముమీద పడవేసెను. ధూమ్రాక్షుడు వచ్చి మీదపడుచున్న శిలను చూచి, తొందరగా గదను గ్రహించి, వేగముగా రథమునుండి దుమికి నేలపై నిలబడెను. ఆ శిల చక్రములతోను, కాడిదూలముతోను, అగ్రభాగముతోను, ధ్వజముతోను, ధనుస్సులతోను సహా అతని రథమును ముక్కలుచేసి నేలమీద పడెను. హనుమంతుడు అతని రథమును విరుగగొట్టి మానులతోను కొమ్మలతోను కూడిన వృక్షములచేత రాక్షసులను సంహరించెను. కొందరు రాక్షసుల తలలు బ్రద్దలైపోవుటచేత రక్తముతో తడిసిపోయిరి. మరికొందరు వృక్షములచేత కొట్టబడినవారై నేలపై పడిపోయిరి. హనుమంతుడు రాక్షససైన్యమును తరిమివేసి, పర్వతశిఖర మొకటి తీసికొని ధూమ్రాక్షునిమీదికి పరుగెత్తెను. పరాక్రమవంతుడైన ధూమ్రాక్షుడు గదను ఎత్తి గర్జించుచు, తనమీదకి వచ్చుచున్న ఆ హనుమంతుని వైపు శీఘ్రముగా వెళ్ళెను. పిమ్మట అతడు చాల ముండ్లతో నిండిన ఆ గదను కోపించిన ఆ హనుమంతుని శిరస్సుపైకి కోపముతో విసిరెను. భయంకరమైన వేగము గల ఆ గదచేత కొట్టబడినను, వాయువు బలము వంటి బలము గల హనుమంతుడు ఆ దెబ్బను లక్ష్యపెట్టక ఆ పర్వతశిఖరమును ధూమ్రాక్షుని నడినెత్తిపై పడవేసెను. పర్వతశిఖరముచేత కొట్టబడిన ఆ ధూమ్రాక్షుడు అవయవములను అన్నింటిని చాచుకొని దూరముగా విసిరివేయబడిన పర్వతము వలె, వెంటనే నేలమీద పడిపోయెను. ధూమ్రాక్షుడు మరణించుట చూచి, చావగా మిగిలిన రాక్షసులు భయపడి, ఒక్క ప్రక్క వానరులు చంపుచుండగా పారిపోయి లంకలో ప్రవేశించిరి. మహాత్ముడైన హనుమంతుడు శత్రువులను సంహరించి, రక్తపు నదులను ప్రవహింపచేసి, వానరులచేత పూజింపబడుచు, శత్రువులను చంపుటచే కొంచెము శ్రమ చెంది, ఆనందించెను. (25-38)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబది రెండవ సర్గము సమాప్తము.

ఏబది మూడవ సర్గము

రావణుడు వజ్రదంష్ట్రుడను రాక్షసుణ్ణి యుద్ధమునకు పంపుట. అతడు వానరులతో ఘోరయుద్ధము చేయుట.

రాక్షసరాజైన రావణుడు ధూమ్రాక్షుడు చంపబడినట్లు విని, చాలా కోపావేశముతో సర్పము వలె బుసలు కొట్టుచు, దీర్ఘముగాను వేడిగాను నిట్టూర్చి, క్రోధముచేత కలుషము చేయబడినవాడై, క్రూరుడు, మహాబలశాలి అయిన వజ్రదంష్ట్రుడను రాక్షసునితో– "వీరుడా! నీవు వెళ్ళుము. రాక్షసులతో కలిసి బయలుదేరుము. దశరథకుమారుడైన రాముణ్ణి, సుగ్రీవుణ్ణి, వానరులను సంహరించుము." అని ఆజ్ఞాపించెను. మాయావియైన ఆ రాక్షసనాయకుడు అనేక రాక్షసవీరులు వెంట రాగా సైన్యములతో కూడ, ఏనుగులతోను, అశ్వములతోను, గాడిదలతోను, ఒంటెలతోను, పతాకాధ్వజములచేత చిత్రములైన రథములతోను కూడినవాడై చక్కగా అలంకరించుకొని, సావధానచిత్తముతో జాగరూకుడై అతిశీఘ్రముగా బయలుదేరెను. పిమ్మట అతడు విచిత్రములైన బాహుపురులు, కిరీటము అలంకరించుకొని, కవచమును ధరించి, ధనుస్సును చేత బూని బయల్వెడలెను. సేనానాయకుడైన ఆ వజ్రదంష్ట్రుడు పతాకలు అలంకరించినది, పరిశుద్ధమైన బంగారముచేత అలంకరింపబడినది, ప్రకాశించుచున్నది ఐన రథమునకు ప్రదక్షిణము చేసి ఎక్కెను.(1-7)

చాలామంది కాలిబంటులు కూడా కత్తులు, చిత్రములైన తోమరములు, నున్నగా నున్న రోకళ్ళు, భిందిపాలములు, ధనుస్సులు, శక్తులు, పట్టిశములు, ఖడ్గములు, చక్రములు, గదలు, వాడియైన గండ్రగొడ్డళ్ళు, ఇతర ఆయుధములు ధరించి బయలుదేరిరి. విచిత్రములైన వస్త్రములు ధరించి ప్రకాశించుచున్న రాక్షసవీరులు, అత్యధికమైన మదము కలవై కదలుచున్న పర్వతములా అన్నట్లు శౌర్యము గల ఏనుగులును బయలుదేరినవి. తోమరములు, అంకుశములు ధరించిన యోధులు ఎక్కిన ఆ గజములు యుద్ధమునందు నేర్పుగలవి. శూరులైన రాక్షసులు ఎక్కిన ఉత్తమ లక్షణయుక్తములైన మరి కొన్ని గజములు చాలా గొప్ప బలము గలవి. ప్రయాణమై వెళ్ళుచున్న ఆ రాక్షససైన్యము వర్షకాలమందు గర్జించుచున్న మెరుపులతో కూడిన మేఘముల వలె ప్రకాశించెను. ఆ రాక్షసులు వానరసేనానాయకుడైన అంగదుడున్న దక్షిణద్వారమునుండి బైటకు వచ్చెను. ఆ రాక్షసులు బయలుదేరుచున్నపుడు దుఃశకునములు కనబడెను. మేఘములు లేకుండగానే

ఆకాశమునుండి కొరవులు పడినవి. భయంకరములైన నక్కలు అగ్నిజ్వాలలను కక్కుచు అరచినవి. అప్పుడు భయంకరములైన మృగములు రాక్షసుల వినాశమును సూచించుచు అరచినవి. శీఘ్రముగా వచ్చుచున్న యోధులు అక్కడ తొట్రుపడిరి. గొప్ప బలము, తేజస్సు గల వజ్రదంష్ట్రుడు ఈ అపశకునములను చూచినను, ధైర్యము వహించి, యుద్ధము చేయుటకై బయలుదేరెను. (8-16)

శ్రమను జయించిన వానరులు బయల్వెడలి వచ్చుచున్న ఆ రాక్షసులను చూచి చాల పెద్ద ధ్వనులు చేయుచు, ఆ ధ్వనులచే పది దిక్కులు నింపివేసిరి. పిమ్మట క్రూరులు, భయంకరమైన రూపము గలవారు, పరస్పరము చంపగోరుచున్నవారు అయిన ఆ వానరరాక్షసుల మధ్య తుములయుద్ధము జరిగెను. మహోత్సాహముతో యుద్ధమునకు వచ్చిన ఆ వానరులు రాక్షసులు కూడ విరిగిపోయిన దేహములతోను, కంఠములతోను, సమస్తదేహములు రక్తముచేత తడియగా నేలపై పడిరి. యుద్ధములో వెనుకకు మరలని కొందరు శూరులు, చేతులలో పరిఘలు ధరించి, ఒకరినొకరు సమీపించి అనేకవిధములైన ఆయుధములను ప్రయోగించిరి. వృక్షములను, శిలలను, ఆయుధములను ప్రయోగించుటచే భయంకరమైన, గుండెలను అదరగొట్టే గొప్ప ధ్వని వినవచ్చెను. అక్కడ భయంకరమైన రథచక్రాంతముల ధ్వని, ధనుస్సుల ధ్వని, శంఖ-భేరీ-మృదంగముల వ్యాకులధ్వని బయల్వెడలెను. కొందరు రాక్షసులు అస్త్రములను విడచి బాహుయుద్ధము చేసిరి. యుద్ధమునందు మదించి ఉన్న వానరులు కొందరు రాక్షసుల శరీరములను అరచేతులచేత, పాదాలచేత, పిడికిళ్ళచేత, వృక్షములచేత కొట్టి విరుగగొట్టిరి.(17-24)

వజ్రదంష్ట్రుడు బాణములచేత వానరులకు మిక్కిలి భయము కలిగించుచు ప్రళయకాలమునందు యముడు పాశమును హస్తమునందు ధరించి సంచరించినట్లు యుద్ధభూమిలో సంచరించెను. బలవంతులు, అస్త్రము లెరిగినవారు, అనేకవిధములైన ఆయుధములు కలవారు అయిన రాక్షసులు అధికమైన కోపముతో యుద్ధమునందు వానరసైన్యములను చంపిరి. ధైర్యవంతుడైన అంగదుడు రెండు రెట్ల కోపముతో ప్రళయకాలాగ్ని వలె ఆ రాక్షసు లందరినీ చంపెను. పరాక్రమవంతుడైన అతడు క్రోధముచేత ఎఱ్ఱనైన నేత్రములు గలవాడై, సింహము నీచమృగములను చంపినట్లు ఆ రాక్షసగణములన్నింటిని చంపెను. దేవేంద్రుని వంటి పరాక్రమము గల అతడు భయంకరముగా శత్రువినాశము చేసెను. అంగదుని చేత కొట్టబడిన, భయంకర పరాక్రమవంతులైన రాక్షసులు శిరస్సులు బ్రద్దలగుటచే నరికిన చెట్లవలె నేలమీద కూలిరి. అప్పుడు రథములచేత, చిత్రములైన ధ్వజములచేత,

గుల్ఫములచేత, వానరరాక్షసుల శరీరములచేత, రక్తప్రవాహముచేత కప్పబడినదై భూమి భయంకరముగా ఉండెను. ఆ యుద్ధమునందు హారములచేత, బాహుపురులచేత, వస్త్రములచేత ఛత్రములచేత అలంకరించబడిన భూమి శరత్కాలరాత్రి వలె ప్రకాశించెను. అప్పుడా యుద్ధమునందు గొప్పదైన ఆ రాక్షససైన్యమంతా అంగదుని వేగముచేత గాలికి మేఘములు కంపించినట్లు కంపించిపోయెను.(25-32)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబది మూడవ సర్గము సమాప్తము.

ఏబది నాలుగవ సర్గము

అంగదుడు వజ్రదంష్ట్రుణ్ణి సంహరించుట

తన బలము నశించుటను, అంగదుని బలమును చూచి బలశాలియైన వజ్రదంష్ట్రుడు క్రోధావిష్టుడయ్యెను. ఇంద్రుని వజ్రాయుధమువంటి భయంకరమైన ధనుస్సును ఎక్కుపెట్టి వానరసైన్యములపై బాణవర్షములు కురిపించెను. అప్పుడు యుద్ధరంగములో రథములపైన వచ్చిన శూరులైన రాక్షసనాయకులు కూడ అనేకవిధములైన ఆయుధములతో యుద్ధము చేసిరి. శూరులైన వానరశ్రేష్ఠు లందరు అన్ని వైపులా చేరి, హస్తములలో శిలలు ధరించి యుద్ధము చేసిరి. ఆ యుద్ధములో రాక్షసులు వేలకొలది ఆయుధములు వానరనాయకులమీద ప్రయోగించిరి. గొప్పవీరులైన, మదించిన ఏనుగుల వలె ఉన్న వానరులు కూడ పర్వతములను, వృక్షములను, పెద్ద శిలలను రాక్షసులపై పడవేసిరి. శూరులు, యుద్ధములు చేయుచున్నవారు, యుద్ధములలో వెనుకకు మరలనివారు అయిన రాక్షసులు కూడ గొప్ప యుద్ధము చేసిరి. ఆ వానరరాక్షసులలో కొందరి శిరస్సులు విరిగిపోయెను. కొందరి కాళ్ళు చేతులు తెగిపోయెను. కొందరి దేహములు బాణములచేత పీడింపబడుటచే రక్తముతో నిండిపోయెను. ఈ విధముగా నేలమీద పడి ఉన్న వాళ్ళ చుట్టూ రాబందులు, గ్రద్దలు, నక్కలు చేరుచుండెను. పిరికివారికి భయము కలిగించు మొండెములు నేలమీద ఎగిరినవి. వానరులు రాక్షసులు కూడా తెగగొట్టబడిన భుజములలో, హస్తములతో, శరీరములతో అక్కడ నేలమీద పడి ఉండిరి. అప్పుడు వజ్రదంష్ట్రుడు చూచుచుండగానే ఆ రాక్షససైన్యమంతా వానరసైన్యముచేత చంపబడి

భగ్నమయ్యెను. అతడు వానరుల దెబ్బలకు భయపడిపోయిన రాక్షసులను చూచి, రోషముచేత నేత్రములు ఎఱ్ఱపడగా ధనుస్సు చేత ధరించి, వానరసేనను భయపెట్టుచు ప్రవేశించెను.(1-13)

ప్రతాపవంతుడైన వజ్రదంష్ట్రుడు చాలా కోపించి, గ్రద్ద రెక్కలు కట్టిన, ఋజువుగా వెళ్లే బాణాలతో అక్కడ ఏడుగురు, ఎనమండుగురు, తొమ్మండుగురు, ఐదుగురు చొప్పున వానరులను కొట్టి చీల్చి వేసెను. బాణములచేత భేదింపబడిన శరీరములు గల వానరులందరు భయపడి, ప్రజలు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళినట్లు అంగదుని దగ్గరకు పరుగెత్తిరి. అంగదుడు ఓడింపబడిన వానరగణములను చూచి ఆ వజ్రదంష్ట్రుని వైపు కోపముతో చూచెను. అంగదవజ్రదంష్ట్రులిద్దరూ పరస్పరము యుద్ధము చేయుచు సింహము, మదించిన గజమూ వలె చాల కోపముతో సంచరించిరి. పిమ్మట ఆ వజ్రదంష్ట్రుడు మహాబలశాలియైన అంగదుని మర్మప్రదేశములయందు అగ్ని జ్వాలలవంటి లక్ష బాణములతో కొట్టెను. గొప్పబలము, భయంకరమైన పరాక్రమము గల అంగదుడు శరీరమంతా రక్తముచే తడిసిపోగా, వజ్రదంష్ట్రునిమీదికి ఒక వృక్షమును విసరెను. ఆ రాక్షసుడు వచ్చి పడుచున్న ఆ వృక్షమును చూచి ఏ మాత్రము కంగారుపడకుండగా దానిని ఛేదించెను. ఆ విధముగా ఛేదింపబడి ఆ వృక్షము క్రింద పడిపోయెను. అంగదుడు వజ్రదంష్ట్రుని పరాక్రమము చూచి, ఒక పెద్ద పర్వతమును గ్రహించి వానిపై విసరి గట్టిగా ధ్వని చేసెను. వజ్రదంష్ట్రుడు వచ్చి మీదపడుచున్న ఆ పర్వతమును చూచి కంగారు పడనివాడై, గద చేతిలో ధరించి రథమునుండి క్రిందికి దుమికి నేలమీద నిలచెను. రణాగ్రమునందు అంగదుడు విసరిన శిల వెళ్ళి చక్రములతో, కూబరముతో అశ్వములతో సహా ఆ రథమును చూర్ణము చేసెను. పిమ్మట అంగదుడు వృక్షములతో నిండిన మరొక విశాలమైన పర్వతశిఖరము తీసికొని వజ్రదంష్ట్రుని శిరస్సుపై పడవేసెను. వజ్రదంష్ట్రుడు రక్తము కక్కుచు, నిట్టూర్చుచు,స్పృహ కోల్పోయి, కొంచెముసేపు గదను ఆనుకొని నిలబడెను.(14-25)

అతడు మరల సంజ్ఞనంది చాల కోపించినవాడై తన ఎదుట ఉన్న అంగదుణ్ణి, గదతో వక్షఃస్థలము మీద కొట్టెను. మరల వారు గదను విడిచి పిడికిళ్ళతో యుద్ధము చేసిరి. ఆ వానరరాక్షసు లిద్దరూ అక్కడ ఒకరినొకరు కొట్టుకొనిరి. దెబ్బలచేత శ్రమ చెంది రక్తము కారుచున్న వారిద్దరూ, మంచి పరాక్రమము చూపుచు యుద్ధము చేయుచున్న బుధాంగారకగ్రహముల వలె ఉండిరి. మహాతేజఃశాలి అయిన, వానరశ్రేష్ఠుడైన అంగదుడు అనేక పుష్పఫలములతో నిండిన వృక్షమును పెకలించి

నిలబడెను. చిరుగంటలు కట్టిన విశాలమైన అందమైన, ఎద్దుచర్మతో చేయబడిన డాలును, ఒరలో ఉంచి సంరక్షించిన ఖడ్గమును (కూడ) గ్రహించెను. ఆ వానరరాక్షసులిద్దరూ జయించవలె నను కోరికతో గర్జించుచు, చిత్రములైన నడకలు నడుచుచు ఒకరినొకరు కొట్టుకొనిరి. శరీరముల మీద అంతటా గాయములు ఏర్పడుటచేత పుష్పించిన మోదుగచెట్లవలె ఉన్న వీరిద్దరూ యుద్ధము చేయుచూ, అలసి, మోకాళ్ళపై నేలమీద పడిరి. వానరశ్రేష్ఠుడైన అంగదుడు కఱ్ఱతో కొట్టిన పామువలె ప్రజ్వలించుచున్న నేత్రములతో ఒక క్షణములో పైకి లేచెను. గొప్పబలము గల అతడు శుభ్రము చేయుటచే మెరయుచున్న ఖడ్గముచేత ఆ వజ్రదంష్ట్రుని పెద్ద శిరస్సును ఛేదించెను. శరీరమంతా రక్తము చేత తడిసిన ఆ వజ్రదంష్ట్రుని అందమైన శిరస్సు ఖడ్గముచేత ఛేదింపబడి, కండ్లు తిరిగిపోవుచుండగా, రెండు ముక్కలై పడిపోయెను. వజ్రదంష్ట్రుడు మరణించుట చూచి రాక్షసులు భయమోహితులై, వానరులు చంపుచుండగా భయపడినవారై, సిగ్గుతో తలలు వంచి లంకవైపు పరుగెత్తిరి. ఇంద్రుని వంటి ప్రతాపము, గొప్ప బలము గల అంగదుడు ఆ రాక్షసుని చంపి, వానరసైన్యమునందు పూజింపబడినవాడై, దేవతల మధ్య ఉన్న ఇంద్రుడువలె సంతోషించెను. (26-38)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబది నాలుగవ సర్గము సమాప్తము.

ఏబది ఐదవ సర్గము

రావణుని ఆజ్ఞచే అకంపనుడు యుద్ధమునకు బయల్వెడలుట. దుఃశకునములను చూచి అతడు ఖిన్నుడగుట.

వాలి కుమారుడైన అంగదునిచే వజ్రదంష్ట్రుడు చంపబడినాడని తెలిసిన రావణుడు తన దగ్గరనే దోసిలి కట్టి నిలచిఉన్న సేనానాయకునితో– "భయంకరమైన పరాక్రమము గల రాక్షసులు, సమస్తమైన శస్త్రములను అస్త్రములను ప్రయోగించుటలో నేర్పుగల అకంపనుని ముందు ఉంచుకొని వెంటనే బయలుదేరెదరు గాక. చాలా ఉత్తముడైన ఈతడు యుద్ధములో సైనికులందరికీ శిక్షకుడు; రక్షకుడు; నాయకుడు; ఎల్లప్పుడూ నా అభివృద్ధిని కోరువాడు; నిత్యము యుద్ధమును కోరువాడు. ఇతడు రామలక్ష్మణులను, మహాబలశాలియైన సుగ్రీవుని, భయంకరులైన ఇతర వానరులను తప్పక చంపగలడు." అని పలికెను. (1-4)



మహాబలవంతుడు, శీఘ్రపరాక్రమము గలవాడు అయిన అకంపనుడు రావణుని ఆజ్ఞను అనుసరించి సైన్యమును ప్రేరేపించెను. భయంకరమైన నేత్రములు గల, చూచువారికి భయము కలిగించు, ముఖ్యులైన రాక్షసులు అనేకవిధములైన ఆయుధములు ధరించి సేనాధ్యక్షుని ఆజ్ఞ ప్రకారము బయలుదేరిరి. మేఘము వంటి కాంతి, రంగు, గొప్ప ధ్వనీ గల అకంపనుడు పరిశుద్ధమైన బంగారముచేత అలంకరింపబడిన విశాలమైన రథమును అధిష్ఠించి, భయంకరులైన రాక్షసులతో కూడి బయలుదేరెను. మహాయుద్ధములో దేవతలు కూడా ఆ అకంపనుణ్ణి కదల్చజాలరు. అందుచే అతడు ఆ రాక్షసుల మధ్య తేజస్సుతో సూర్యుడువలె ప్రకాశించుచుండెను. అతడు యుద్ధము చేయవలెనను ఉత్సాహముతో తొందరపడుచు పరుగెత్తుచుండగా రథమును లాగుచున్న గుఱ్ఱములు హటాత్తుగా దైన్యమును పొందెను. యుద్ధమును కోరి వెళ్ళుచున్న అతని ఎడమకన్ను అదరెను. ముఖవర్ణము మారిపోయెను. కంఠధ్వని గద్గద మాయెను. సుదినమునందు తీవ్రమైన గాలితో కూడిన దుర్దినము (పూర్తిగా మేఘములచేత కప్పివేయబడిన దుర్దినము) ఏర్పడెను. సమస్తమైన పక్షులు, మృగములు కూడా క్రూరములు భయంకరములూ అయిన కూతలు కూసెను. సింహము మూపురము వంటి బలసిన మూపురము, పెద్దపులితో సమానమైన పరాక్రమము గల ఆ అకంపనుడు ఆ దుఃశకునములను లెక్కచేయక యుద్ధభూమికి వెళ్ళెను. ఆ రాక్షసుడు ఇతరరాక్షసులతో కలిసి వచ్చుచుండగా సముద్రమును క్షోభింపచేయుచున్నదా అన్నట్లు గొప్ప ధ్వని బయలుదేరెను. యుద్ధమునకై వచ్చుచున్న ఆ రాక్షసుల శబ్దము విని వృక్షములను పర్వతములను

ఆయుధములుగా గ్రహించి ఉన్న వానరుల సైన్యము భయపడెను. రామరావణులకోసమై ప్రాణాలను విడచుటకు సిద్ధముగా ఉన్న ఆ వానరరాక్షసుల మధ్య చాల భయంకరమైన యుద్ధము జరిగెను.(5-15)

పరస్పరము చంపుటకు ప్రయత్నించుచున్న ఆ వానరులు, రాక్షసులు అందరూ కూడ గొప్ప బలము కలవారే, శూరులే. అందరూ పర్వతములవంటివారే. ధ్వనిచేయుచు, కోపముతో పరస్పరము గర్జించుచున్న మహాబలవంతులైన ఆ వానరరాక్షసుల ధ్వని యుద్ధరంగమునందు వినవచ్చెను. అరుణుని వంటి రంగు గల భయంకరమైన పరాగము అధికముగా బయలుదేరెను. వానరులచేతను, రాక్షసులచేతను ఎగురగొట్టబడిన ఆ పరాగము పది దిక్కులను కప్పివేసెను. ఎగురవేసిన పట్టుబట్టవలె తెల్లగా ఉన్న ఆ పరాగముచేత కప్పబడి ఆ యుద్ధభూమిలోని వారికి ఒకరికొకరు కనబడుటలేదు. ఆ పరాగము కప్పివేయుటచేత ధ్వజములు గాని, పతాకలు గాని, డాలులు గాని, గుఱ్ఱములు గాని, ఆయుధములు గాని, రథములు గాని కనబడలేదు. యుద్ధములో గర్జించుచు ఎదురెదురుగా పరుగెత్తుచున్న ఆ వీరుల వ్యాకులమైన, చాల పెద్దదైన శబ్దము మాత్రమే వినబడుచుండెను; వాళ్ళ రూపములు కనబడకుండెను. పరాగముచేత చీకటి కమ్మిన ఆ యుద్ధములో మిక్కిలి కోపించిన వానరులు వానరులనే చంపిరి. రాక్షసులు రాక్షసులనే చంపిరి. తమవాళ్ళను పరులను కూడ చంపుచున్న ఆ వానరులు, రాక్షసులు అప్పుడు భూమిని రక్తముచేత తడియునట్లు, బురదతో నిండునట్లు చేసిరి. అప్పుడు రక్తప్రవాహముచేత కప్పబడి పరాగము అణిగిపోయెను. భూమి శరీరములతోను, శవములతోను నిండిపోయెను.(16-24)

రాక్షసులు, వానరులుకూడ పరాక్రమముతో శీఘ్రముగా ఒకరినొకరు వృక్షములు, శక్తులు, గదలు, ప్రాసములు, శిలలు, పరిఘలు, తోమరములు ప్రయోగించి కొట్టుకొనిరి. పర్వతములవంటి ఆకారములు గల భయంకరములైన కర్మలు చేయు వానరులు పరిఘలవంటి బాహువులతో పోరాడుచు, యుద్ధములో రాక్షసులను చంపిరి. ప్రాసలు తోమరములు హస్తములలో ధరించియున్న రాక్షసులు చాల కోపముతో మిక్కిలి తీవ్రములైన ఆయుధములచేత వానరులను కొట్టిరి. రాక్షససేనానాయకుడైన అకంపనుడు చాలా కోపించి, తన పరాక్రమము చూపుట ద్వారా, భయంకరమైన పరాక్రమము గల ఆ రాక్షసు లందరినీ సంతోష పెట్టుచుండెను. వానరులు కూడ పరాక్రమముతో రాక్షసులను ఆక్రమించి, పెద్ద వృక్షములతోను, మహాశిలలతోను రాక్షసులను చీల్చి వేయుచుండిరి. ఇంతలో వానరవీరులైన

కుముదుడు, నలుడు, మైందుడు చాలా కోపించి గొప్ప వేగమును చూపిరి. మహావీరులైన ఆ ముగ్గురు వానరశ్రేష్ఠులు సేనాగ్రభాగమునందు వృక్షములతో రాక్షసులను ఎందరినో సంహరించిరి. అనేక విధములైన ఆయుధములతో రాక్షసులను మిక్కిలి మథించివేసిరి. (25-32)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబది ఐదవ సర్గము సమాప్తము.

ఏబది ఆరవ సర్గము

హనుమంతుడు అకంపనుని చంపుట.

ఆ వానరవీరులు యుద్ధములో చేసిన ఆ గొప్ప కార్యమును చూచి, అకంపనుడు తీవ్రమైన కోపమును ప్రదర్శించెను. అతడు శత్రువులు చేసిన పని చూచి చాలా కోపముతో నిండినవాడై ధనుస్సును కదల్చుచు సారథితో - "సారథీ! బలవంతులైన ఈ వానరులు యుద్ధములో చాలామంది రాక్షసులను చంపివేయుచున్నారు. అందుచే రథమును శీఘ్రముగా అక్కడికే తీసికొని వెళ్ళుము. ఈ వానరులు ఇక్కడ నా ఎదుట, వృక్షములు, పర్వతములు ఆయుధములుగా ధరించి నిలచిఉన్నారు. వీళ్లను చంపవలెనని కోరుచున్నాను. ఎందుచేతననగా వీళ్ళు మన సైన్యమునంతను నశింపచేయుచున్నారు." అనెను. (1-5)

రథికులలో శ్రేష్ఠుడైన అకంపనుడు రథమునకు కట్టిన గుఱ్ఱములను అటువైపు తోలించి, దూరమునుండియే బాణసముదాయములు ప్రయోగించుచు వానరులను ఎదుర్కొనెను. వానరులు యుద్ధములో నిలబడుటకు కూడ సమర్థులు కాలేదు. యుద్ధము చేయుట మాట చెప్పవలెనా! వాళ్లందరూ అకంపనుని బాణాలచేత పరాజితులై పారిపోయిరి. తన వాళ్ళందరూ అకంపనుని బాణాలకు గురియై మృత్యువు వాత పడుచుండుట చూచి మహాబలశాలియైన హనుమంతుడు అక్కడికి వెళ్ళెను. వీరులైన ఆ వానరశ్రేష్ఠులందరూ వానరులలో మహావీరుడైన ఆ హనుమంతుని చూచి, అందరూ కలిసి వచ్చి అతని చుట్టూ చేరిరి. మహాబలశాలియైన అతని అండ దొరకుటచేత తాము కూడ బలవంతులైరి. అకంపనుడు పర్వతమువలె నిలచియున్న హనుమంతునిపై దేవేంద్రుడు వర్షధారలు కురిపించినట్లు బాణములు కురిపించెను. హనుమంతుడు తన శరీరముమీద పడుచున్న బాణాలను లెక్కచేయక

అకంపనుని చంపుటకై మనస్సులో నిశ్చయము చేసికొనెను. అతడు బిగ్గరగా నవ్వి, భూమిని కంపింపచేయునట్లు ఆ రాక్షసుని మీదికి వెళ్లెను.(6-13)

గర్జించుచు తేజస్సుతో ప్రకాశించుచున్న హనుమంతుని రూపము మండుచున్న అగ్ని రూపమువలె ఎదిరింప శక్యము కాకుండెను. హనుమంతుడు తన చేతిలో ఆయుధమేదీ లేదను విషయము గుర్తించి కోపావిష్టుడై, వేగముగా ఒక పర్వతమును పెకలించెను. ఒక హస్తముతో గొప్ప పర్వతము గ్రహించి, బిగ్గరగా సింహనాదము చేయుచూ దానిని త్రిప్పెను. పూర్వము ఇంద్రుడు వజ్రము ధరించి యుద్ధములో నముచి మీదికి వెళ్లినట్లు రాక్షసనాయకుడైన ఆ అకంపనుని మీదికి శీఘ్రముగా వెళ్ళెను. అకంపనుడు పైకి ఎత్తబడిన ఆ పర్వతశిఖరమును చూచి దూరమునుండియే అర్ధచంద్రాకారములైన పెద్ద బాణములతో దానిని చీల్చివేసెను. ఆకాశమునందే రాక్షసుని బాణములచేత చీల్చబడి, చిమ్మబడినట్లు క్రింద పడిపోయిన ఆ పర్వతశిఖరమును చూచి హనుమంతుడు మిక్కిలి కోపించెను. రోషదర్పములతో నిండిన అతడు ఉన్నతమైన మహాపర్వతము వలె ఉన్న మద్దిచెట్టును సమీపించి శీఘ్రముగా దానిని పెకలించెను. పెద్ద మాను గల ఆ మద్దిచెట్టును పెకలించి, దానిని ఉత్సాహముతో గట్టిగా పట్టుకొని నేలమీద నిలబడి త్రిప్పెను. పాదన్యాసములచేత భూమిని బ్రద్దలుకొట్టుచు, మహావేగముతో పరుగెత్తుచు, బలముచేత వృక్షములను విరుగగొట్టెను. అతడు మావటి వాళ్ళతో సహా ఏనుగులను, రథములతో కూడిన రథికులను భయంకరులైన కాలిబంటులను ఇతర రాక్షసులను చంపెను. వృక్షము గ్రహించి ప్రాణములు తీయుచు, కోపించిన యముడు వలె ఉన్న ఆ హనుమంతుని చూచి రాక్షసులు పారిపోయిరి.(14-24)

కోపముతో వచ్చి మీదపడుచు రాక్షసులకు భయము కలిగించుచున్న ఆ హనుమంతుణ్ణి వీరుడైన అకంపనుడు చూచి, క్షోభించినవాడై బిగ్గరగా అరచి, దేహము చీల్చివేయు పద్నాలుగు బాణములచేత మహాపరాక్రమవంతుడైన హనుమంతుణ్ణి చీల్చివేసెను. వాడియైన శక్తి గల నారాచబాణములు ఆ విధముగా శరీరముపై అంతటా గ్రుచ్చుకొనగా వీరుడైన హనుమంతుడు చెట్లు మొలచిన పర్వతము వలె కనబడెను. పుష్పించిన అశోకవృక్షము వలె ధూమము లేని అగ్నివలె ప్రకాశించెను. పిమ్మట గొప్ప వేగమును చూపి, మరియొక వృక్షమును పెకలించి రాక్షసనాయకుడైన అకంపనుని వెంటనే శిరస్సుమీద కొట్టెను. హనుమంతుడు వృక్షముతో కొట్టగా ఆ రాక్షసుడు మరణించి నేలపై కూలెను.(25-30)

ప్రాణాలువిడచి నేలపై పడియున్న రాక్షసనాయకుడైన ఆ అకంపనుని చూచి రాక్షసు లందరూ, భూమి కంపించినప్పుడు వృక్షముల వలె వ్యథ చెందిరి. ఓడిపోయిన రాక్షసు లందరూ ఆయుధములు విడచి భయముతో లంకవైపు పరుగెత్తుచుండగా వానరులు వారిని తరిమివేసిరి. ఓడిపోయి, అహంకారము నశించి, తొందరపడుచు, జుట్టులు ఊడిపోయిన, ఆ రాక్షసులు చెమట కారుచున్న శరీరములతో ఒగర్చుచు పరుగెత్తిరి. ఆ రాక్షసులు, ఏమి చేయవలెనో తోచక, భయముతో మాటిమాటికి వెనుకకు తిరిగి చూచుచు, ఒకరినొకరు త్రోసికొనుచు లంకలో ప్రవేశించిరి.(31-34)

ఆ రాక్షసులు లంకలో ప్రవేశించిన పిమ్మట ఆ వానరులందరూ చేరి హనుమంతుణ్ణి పూజించిరి. మహాబలశాలియైన ఆ హనుమంతుడు కూడ ఆ వానరులందరినీ తగు విధముగా, అనుకూలముగా ఉండు రీతిలో గౌరవించెను. శత్రువుల ప్రకాశమును అణగద్రొక్కిన వానరులు బిగ్గరగా ధ్వని చేయుచు ప్రాణాలతో ఉండగానే ఆ రాక్షసులను నేలమీద ఈడ్చిరి. వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు సేనాగ్రమునందు రాక్షసులను చేరి వారినందరినీ సంహరించి, భయంకరుడు, శత్రు సంహారకుడు, గొప్పబలము కలవాడు అయిన మహాసురుణ్ణి చంపి విష్ణువు వలె వీరశోభతో ప్రకాశించెను. అప్పుడు దేవతాగణములు, స్వయముగా రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు మొదలైన వానరులు, విభీషణుడు హనుమంతుణ్ణి పూజించిరి.(35-39)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబది ఆరవ సర్గము సమాప్తము.

ఏబది ఏడవ సర్గము

రావణుడు సేనాపతియైన ప్రహస్తుని యుద్ధమునకు పంపుట

రావణుడు అకంపనుని వధను గూర్చి విని, కోపించి, కొంచెము దైన్యముతో కూడిన ముఖముతో మంత్రులవైపు చూచెను. అతడు కొంచెము సేపు ఆలోచించి, మంత్రులతో కూడ మంతనము చేసి పిదప పూర్వాహ్ణమునందు సేనావ్యూహములను పర్యవేక్షించుటకై లంకానగరములోనికి వెళ్లి, రాక్షసుల గణములచేత రక్షింపబడుచున్నది, అనేక సేనావ్యూహములతో నిండినది, పతాకల ధ్వజముల

పంక్తులతో కూడినది అయిన నగరమును చూచెను. అతడు వానరులచే ముట్టడించబడిన లంకను చూచి, యుద్ధమునందు నిపుణుడైన ప్రహస్తునితో ఆ సమయమునందు తనకు హితమైన వాక్యము పలుకుచు- "యుద్ధమునందు నేర్పుగల ప్రహస్తుడా! మన పట్టణమును శత్రువులు హఠాత్తుగా ముట్టడించి పీడించుచున్నారు. ఇప్పుడు యుద్ధము తప్ప దీనిని విడిపించు ఉపాయము మరేదీ కనబడుట లేదు. ఈ భారమును వహించు సామర్థ్యము నాకు, కుంభకర్ణునకు, నా సేనాపతివైన నీకు, ఇంద్రజిత్తునకు, లేదా నికుంభునకు మాత్రమే ఉన్నది. అందువలన నీవు శీఘ్రముగా సైన్యమును తీసుకొని, దానికి నాయకుడవై వానరు లందరు ఉన్న యుద్ధభూమికి వెళ్ళి విజయము సాధించుము. నీవు యుద్ధమునకు వెళ్ళవలె నని నిర్ణయించినట్లు తెలియగానే భయపడిపోయిన వానరసేన రాక్షసనాయకులు చేయు ధ్వనిని విని పారిపోవును. వానరులు చపలులు; సరియైన యుద్ధశిక్షణ లేనివారు; చంచలచిత్తులు. వాళ్ళు, సింహగర్జనమును ఏనుగులు సహింపజాలనట్లు నీ ధ్వనిని సహించజాలరు. ప్రహస్తుడా! ఆ సైన్యము పారిపోగానే రామలక్ష్మణులు సహాయరహితులై, వశము తప్పి నీకు వశమైపోగలరు. ఇప్పుడు నీవు యుద్ధానికి వెళ్ళిన పక్షాన నీకు విజయము లభించవచ్చును. లభించకపోవచ్చును. యుద్ధానికి వెళ్ళకపోయినచో మనకు పరాజయము(ఆపద) నిశ్చితము. అందుచేత తప్పకుండగా కలుగు ఆపదకంటె సంశయాస్పదమైన ఆపద మంచిది. అయితే ఈ విషయమున నీ అభిప్రాయము ప్రకారము ఏది అనుకూలమో, ఏది ప్రతికూలమో, ఏది మనకు హితకరమో అలోచించి చెప్పుము." అనెను.(1-11)

సేనానాయకుడైన ప్రహస్తుడు రావణుని మాటలు విని శుక్రుడు బలిచక్రవర్తితో పలికినట్లు, అతనితో- "రాజా! పూర్వము, నేర్పరులైన మంత్రులతో మనము ఆలోచన చేసి ఉన్నాము. ఆలోచించిన పిదప మన మధ్య పరస్పరము వివాదము కూడ జరిగినది. ఆ నాడు ఆలోచన చేసినప్పుడు సీతను ఇచ్చివేయుట శ్రేయస్కర మని నా నిశ్చయమును తెలిపితిని. సీతను ఇవ్వకపోయినచో మనకు యుద్ధము తప్పదను విషయమును కూడ చూచినాము. ఆ యా సమయములలో దానములచేత, సత్కారములచేత, మంచి మాటలచేత ఎల్లప్పుడు అనేకవిధముల నీచేత ఆదరింపబడిన నేను నీకు హితము చేయకుందునా? నా పుత్రులను గాని, భార్యలను గాని, ధనమును గాని, నా ప్రాణములను గాని రక్షించుకొనవలె నను కోరిక నాకు లేదు. నీ నిమిత్తము యుద్ధములో నన్ను నేను హోమము చేయదలచుకున్నాను. చూడుము." అని పలికెను.(12-16)

సేనాపతియైన ప్రహస్తుడు ప్రభువైన రావణునితో ఇట్లు పలికి, ఎదుటనున్న సేనాధ్యక్షులను – "రాక్షసుల పెద్ద సైన్యమును నా వద్దకు తీసికొని రండి. ఈ రోజున నా బాణముల గొప్ప వేగముచేత చంపబడిన వానరుల మాంసమును తిని అడవులలో నివసించు పక్షులు తృప్తి చెందుగాక." అని ఆజ్ఞాపించెను. గొప్ప బలము గల సేనాధ్యక్షులు అతని మాటలు విని రావణుని గృహము వద్ద గొప్ప సైన్యమును సిద్ధము చేసిరి. అత్యల్పమైన కాలములో ఆ లంక ఏనుగులవంటి భయంకరులైన, అనేక ఆయుధములు ధరించిన రాక్షసవీరులతో నిండిపోయెను. కొందరు రాక్షసులు అగ్నిలో హోమములు చేయుచు బ్రాహ్మణులకు నమస్కరించుచుండిరి. అపుడు నేతి వాసనను మోసికొనుచు పరిమళముతో కూడిన వాయువు వీచెను. యుద్ధానికి సిద్ధమైన రాక్షసులు, అప్పుడు, అభిమంత్రించిన అనేక విధములైన మాలలు గ్రహించి సంతోషించుచు ధరించిరి. వాళ్లు ధనుస్సులను, కవచములను ధరించి, రాజైన రావణుని చూచి, వేగముగా ఎగిరి లేచి ప్రహస్తుని చుట్టూ నిలచిరి. పిదప ప్రహస్తుడు రావణుని అనుజ్ఞ పొంది, భయంకరమైన భేరీ మ్రోగించి, ఆయుధములు ధరించి, తన కొరకై సిద్ధము చేయబడిన రథము నెక్కెను. మంచి వేగము గల గుఱ్ఱములు కట్టిన ఆ రథమును సారథి బాగుగా అదుపులో ఉంచుకొనెను. సూర్యచంద్రుల వంటి కాంతి గల ఆ రథము ధ్వని మేఘముల ఉరుముల వలె ఉండెను. చక్కగా రక్షింపబడిన మధ్యభాగము, మంచి చక్రములు గల ఆ రథముపై కట్టిన సర్పచిహ్నాంకితమైన ధ్వజము చూచుటకు భయంకరముగా ఉండెను. బంగారు జాలము కట్టి అలంకరించిన ఆ రథము శోభతో నవ్వుచున్నదా అన్నట్లు ఉండెను. (17-27)

రావణుని చేత ఆజ్ఞాపింపబడిన ఆ ప్రహస్తుడు రథము నెక్కి, పెద్ద సైన్యము వెంట రాగా లంకనుండి బయలుదేరెను. సేనాపతియైన ప్రహస్తుడు బయలుదేరగానే మేఘధ్వని వంటి భేరీల ధ్వని, వాద్యముల ధ్వని, శంఖముల ధ్వని, భూమిని నింపివేయుచున్నట్లు వినబడెను. భయంకరములైన రూపములు, పెద్ద శరీరములు గల రాక్షసులు ఘోరములైన శబ్దములు చేయుచు ప్రహస్తుని ముందు వెళ్ళిరి. నరాంతకుడు, కుంభహనువు, మహానాదుడు, సమున్నతుడు అను ప్రహస్తుని సచివులైన రాక్షసులు అతని నలువైపులా నడచుచు వెళ్ళిరి. వ్యూహముగా ఏర్పరుపబడినది వలె చాల భయంకరమైన ఏనుగుల గుంపువలె ఉన్న గొప్ప సేనతో కూడినవాడై అతడు తూర్పుద్వారమునుండి బయలుదేరెను. ప్రళయకాలమునందు ప్రాణులను నశింపచేయు యమునితో సమానుడైన, కోపించిన ఆ ప్రహస్తుడు

సముద్రముతో సమానమైన సమూహము గల ఆ సైన్యముతో కూడినవాడై బయల్వెడలెను. అతడు ప్రయాణమైనప్పుడు వెడలిన వాద్యాదుల ధ్వనిచేతను, గర్జించుచున్న రాక్షసుల ధ్వనిచేతను లంకలోని ప్రాణులన్నీ వికృతస్వరములతో అరచినవి.(28-34)

మాంసరక్తములను తిను పక్షులు మేఘములు లేని ఆకాశములో ప్రవేశించి, రథమువైపు అపసవ్యముగా పైన తిరిగెను. భయంకరములైన ఆడనక్కలు అగ్నిజ్వాలలను కక్కుచు కూసినవి. అంతరిక్షమునుండి ఉల్క పడెను. వాయువు పరుషముగా వీచెను. గ్రహములు పరస్పరము యుద్ధము చేసి ప్రకాశవిహీనము లయ్యెను. ప్రహస్తుని రథముపైన మేఘములు పరుషమైన ధ్వనులు చేయుచు ఆ రాక్షసుని రథముమీద రక్తమును వర్షించినవి. ముందు నడచుచున్నవాళ్ళను తడిపివేసినవి. గ్రద్ద ధ్వజశిఖరముమీద దక్షిణాభిముఖముగా కూర్చొని, దాని రెండు ప్రక్కలకు తిరిగి కూయుచు, శోభనంతను పోగొట్టెను. సూత వంశములో పుట్టిన, గుఱ్ఱములను తోలే సారథి యుద్ధరంగములో ప్రవేశించుచుండగా అతని చేతిలో నుండి జారి కొరడా అనేకపర్యాయములు క్రిందపడెను. ప్రయాణసమయములో ప్రకాశించే, చాల దుర్లభమైన ఏ శోభ ఉండునో అది ముహూర్తకాలములో నశించినది. సమప్రదేశములో గుఱ్ఱములు తొట్రుపడినవి.(35-41)

గుణములచేత, పౌరుషముచేత ప్రసిద్ధుడైన ఆ ప్రహస్తుడు బయలుదేరి వచ్చుచుండగా వానరసేన అనేకవిధములైన ఆయుధములతో యుద్ధరంగములో ఎదుర్కొనెను. అప్పుడు వానరులు వృక్షములను పీకుచుండగా, పెద్ద శిలలను ఎత్తుచుండగా చాల వ్యాకులమైన ధ్వని ఏర్పడెను. ధ్వనిచేయుచున్న రాక్షసుల సైన్యము, గర్జించుచున్న వానరుల సైన్యము - రెండు సైన్యములు ఉత్సాహముతో ఉండెను. వేగవంతులు, సమర్థులు, ఒకరినొకరు చంపవలెనని కోరుచు ఒకరినొకరు పిలుచుకొనుచున్న, రాక్షసవానరులు చేయు గొప్ప ధ్వని వినవచ్చెను. పిమ్మట ఆ దుర్మతియైన ప్రహస్తుడు విజయముకొరకై సుగ్రీవుని సేనవైపు బయలుదేరి వెళ్ళి, మరణింపనున్నవాడై, మిడత అగ్నిలో ప్రవేశించినట్లు ఆ సైన్యములో అధికమైన వేగముతో ప్రవేశించెను.(42-46)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబది ఏడవ సర్గము సమాప్తము.

ఏబది ఎనిమిదవ సర్గము

నీలుడు ప్రహస్తుని చంపుట.

అప్పుడు శత్రుసంహారకుడైన రాముడు యుద్ధమునకై వెడలివచ్చుచున్న ఆ ప్రహస్తుణ్ణి చూచి, చిరునవ్వు నవ్వుచు, "పెద్ద దేహము గల ఇతడెవడో పెద్ద సైన్యముతో మహావేగముతో వచ్చుచున్నాడు. ఇతడు ఎవడు? వీని బలపౌరుషములు ఎట్టివి? ఓ! మహాబాహువైన విభీషణా! పరాక్రమవంతుడైన ఈ రాక్షసుని గూర్చి నాకు చెప్పుము." అని విభీషణుని అడిగెను. రాముని మాటలు విని విభీషణుడు – "ఇతడు రావణుని సేనాపతియైన ప్రహస్తు డను రాక్షసుడు. లంకలోని మూడు వంతుల సైన్యమునకు నాయకుడు. పరాక్రమవంతుడు, శూరుడు, అస్త్రములు తెలిసినవాడు, బాగా ప్రసిద్ధమైన పరాక్రమము గలవాడు." అని చెప్పెను. (1-4)

పెద్ద దేహము గల, గర్జించుచు రాక్షససేనతో కూడి బయలుదేరి వచ్చుచున్న ఆ ప్రహస్తుణ్ణి చూచి, బలవంతులైన వానరుల ఆ గొప్ప సేన చాల కోపముతో అతనిని ఎదిరించుచు గర్జించెను. జయమును కోరుచు వానరుల వైపు పరుగెత్తి వెళ్ళుచున్న రాక్షసులు ధరించిన ఖడ్గములు, శక్తులు, ఋష్టులు, బాణములు, శూలములు, ముసలములు, గదలు, పరిఘలు, ప్రాసలు, అనేక విధములైన పరశ్వధములు ప్రకాశించుచుండెను. యుద్ధమునకు సన్నద్ధులైన వానరులు పుష్పించిన వృక్షములను, పర్వతములను, పొడుగైన పెద్ద శిలలను గ్రహించిరి. ఒకరి నొకరు సమీపించి శిలావర్షమును, బాణవర్షమును కురిపించుచున్న అనేకులైన ఆ వానరరాక్షసుల మధ్య గొప్ప యుద్ధము జరిగెను. ఆ యుద్ధమునందు చాలమంది రాక్షసులు చాలామంది వానరులను, చాలామంది వానరులు చాలామంది రాక్షసులను చంపివేసిరి. కొందరు వానరులు శూలములచేత పొడవబడిరి. కొందరు గొప్ప ఇతర ఆయుధములచేతను, మరికొందరు పరిఘలచేతను, కొట్టబడిరి. కొందరు గొడ్డళ్ళతో నరకబడిరి. కొందరు ప్రాణములు పోయి నేలమీద పడిపోయిరి. మరికొందరు బాణములను సంధించి ప్రయోగించుటచేత పీడింపబడి, హృదయములు బ్రద్దలై పడిపోయిరి. శూరులైన రాక్షసులు ఖడ్గములతో రెండు ముక్కలుగా చేయగా, ప్రక్కలయందు చీల్చివేయగా, కొందరు వానరులు కొట్టుకొనుచు, నేలమీద పడిపోయిరి. (5-14)

కోపించిన వానరులు వృక్షములతోను, పర్వతశిఖరములతోను అన్ని ప్రదేశములందు రాక్షసులను నేలమీద నలగగొట్టిరి. వజ్రాయుధస్పర్శవంటి స్పర్శగల

అరచేతులతోను, పిడికిళ్ళతోను కొట్టబడినవారై రాక్షసులు ముఖములు, నేత్రములు చీలిపోగా, నోళ్ళనుండి అధికముగా రక్తమును కక్కిరి. కొందరు వానరులు, కొందరు రాక్షసులు దీనముగా అరచుచుండగా, కొందరు సింహనాదములు చేయుచుండగా వ్యాకులమైన ధ్వని కలిగెను. వీరమార్గమును పొందుటకై నిశ్చయించుకొనిన, క్రూరులైన వానరులు, రాక్షసులు కూడ, నేత్రములు త్రిప్పుచు నిర్భయముగా యుద్ధము చేసిరి. ప్రహస్తుని మంత్రులైన నరాంతకుడు, కుంభహనువు, మహానాదుడు, సమున్నతుడు, వీరందరూ వానరులను చంపివేసిరి. శీఘ్రముగా వచ్చి వానరులను చంపుచున్న వాళ్ళలో ఒకడైన నరాంతకుణ్ణి ద్వివిదుడు పర్వతశిఖరముతో చంపివేసెను. దుర్ముఖుడు చాల పెద్దదైన వృక్షమును పెకలించి, హస్తలాఘవము గల సమున్నతు డను రాక్షసుని చంపివేసెను. మహాతేజఃశాలియైన జాంబవంతుడు చాలా కోపించి, పెద్దశిలను గ్రహించి మహానాదుని వక్షఃస్థలముమీద పడవేసెను. పిమ్మట వీర్యవంతుడైన తారుడు యుద్ధమునందు కుంభహనువును సమీపించి పెద్ద వృక్షముచేత అతడు ప్రాణములు విడచునట్లు చేసెను. (15-23)

ప్రహస్తుడు ఆ కార్యమును సహించక రథమునెక్కి, ధనుస్సు ధరించి భయంకరముగా వానరుల సంహారమును చేసెను. అప్పుడు ఆ రెండు సేనల ధ్వని ప్రళయకాలమునందు క్షోభింపచేయబడిన, అపారమైన సముద్రము ధ్వని వలె ఉండెను. యుద్ధమునందు ఓడింపశక్యము కాని ఆ ప్రహస్తుడు ఆ మహాయుద్ధము నందు, చాల కోపించి, గొప్ప బాణసముదాయముచేత వానరులను పీడించెను. భయంకరములైన వానరశరీరములచేతను, రాక్షసశరీరములచేతను కప్పబడిన భూమి పర్వతములు పరచినట్లు ఉండెను. రక్తప్రవాహముతో నిండిన ఆ భూమి వైశాఖమాసమునందు మోదుగపూవులు పరచిన భూమివలె ప్రకాశించెను. ఆ యుద్ధరంగ మనే దాట శక్యముకాని నదిని ఆ వానరులు, రాక్షసులు కూడ, గజయూథమును నడిపించువాళ్ళు పద్మపరాగముచేత కప్పబడిన పద్మసరస్సును దాటినట్లు దాటిరి. ఆ రణభూమినదికి సంబంధించిన వీరసముదాయ మనే తీరములు తెగిపోయెను. ఆయుధము లనే మహావృక్షములు విరిగిపోయెను. అది రక్తప్రవాహ మనే జలప్రవాహముతో యము డను సముద్రమువైపు ప్రవహించుచుండెను. యకృత్తులు, ప్లీహములు అను బురదతోను, ఇటునటు చిమ్మివేయబడిన ప్రేగు లనే నాచుతోను, తెగిపడిన శరీరము లనే చేపలతోను, శరీరావయవము లను పచ్చికబీళ్ళతోను నిండియుండెను. గ్రద్ధ లనే హంసలు, తెల్లడేగ లను సారసపక్షులు దానిని ఆశ్రయించి ఉండెను. కొవ్వు అనే నురుగుతో నిండిన ఆ నదినుండి సుడుల

చప్పుళ్లవంటి చప్పుళ్ళు బయలుదేరుచుండెను. శరదృతువు నందు హంసలతోను, సారసపక్షులతోను నిండిన నది వలె ఉన్న ఆ రణభూమిని పిరికివా ళ్లెవ్వరూ దాటజాలరు. (24-33)

ప్రహస్తుడు రథమునెక్కి, బాణసముదాయములను ప్రయోగించుచు బలముచేత వానరులను చెండాడుచుండగా వానిని నీలుడు చూచెను. ఆకాశమునందు విజృంభించిన వాయువు బలముగా ఉన్న మేఘసముదాయము వైపు వెళ్ళినట్లు, యుద్ధమునందు శీఘ్రముగా వచ్చిన నీలుని చూచి సేనానాయకుడైన ప్రహస్తుడు సూర్యునివంటి వర్ణముగల రథముతో అతనిమీదికే వెళ్లెను. ధనుర్ధరులలో శ్రేష్ఠుడైన సేనాపతియైన ప్రహస్తుడు ఆ మహాయుద్ధమునందు ధనుస్సును లాగి నీలునిపై బాణములను ప్రయోగించెను. కోపించిన సర్పమువలె ఉన్న మహావేగము గల ఆ బాణములు ప్రహస్తుడు ప్రయోగించగా నీలుని చేరి అతని శరీరమును భేదించి నేలమీద పడినవి. అగ్నితో సమానమైన వాడియైన బాణములచేత కొట్టబడిన పరాక్రమశాలి, వానరవీరుడు అయిన నీలుడు ఒక వృక్షమును పెకిలించి ఎదిరించుటకు ఏ మాత్రము శక్యముకాని, మీదికి వచ్చిపడుచున్న ఆ ప్రహస్తుణ్ణి కొట్టెను. ఆ నీలునిచేత కొట్టబడిన రాక్షసశ్రేష్ఠుడైన ప్రహస్తుడు కోపించి, బిగ్గరగా అరచుచు వానరసేనానాయకుడైన అతనిపై బాణవర్షములు కురిపించెను. నీలుడు దురాత్ముడైన ఆ రాక్షసుని బాణసముదాయమును నివారింపజాలక, కండ్లుమూసికొని దానిని స్వీకరించెను. శరత్కాలమునందు శీఘ్రముగా వచ్చిన వర్షమును ఆబోతు కళ్ళుమూసికొని సహించినట్లు, నీలుడు, ప్రహస్తుడు ప్రయోగించిన, సహింపశక్యముకాని బాణవర్షములను కళ్ళుమూసికొని సహించెను. మహాబలముగలవాడు, మహావానరనాయకుడు అయిన నీలుడు ఆ బాణవర్షమునకు కోపించి పెద్ద సాలవృక్షముతో గుఱ్ఱములను చంపెను. పిమ్మట రోషావేశముతో దురాత్ముడైన ఆ ప్రహస్తుని విల్లును బలముతో విరచి మాటిమాటికి అరచెను. నీలుడు ఆ విధముగా ధనుస్సు లేకుండా చేయగా సేనాపతియైన ప్రహస్తుడు భయంకరమైన ముసలమును ధరించి రథమునుండి క్రిందికి దుమికెను. వైరముపూని యుద్ధముచేయుచున్న ఆ సేనాపతులిద్దరూ, రక్తముతో తడసిన శరీరములతో మదము కారుచున్న ఏనుగులవలె ఉండిరి. (34-46)

సింహముతోను, పెద్దపులితోను సమానులైన ఆ వీరు లిద్దరూ చాలా వాడియైన కోరలతో ఒకరినొకరు పొడుచుకొనుచు సింహము పెద్దపులీ వలె ప్రవర్తించుచుండిరి. పూర్వము అనేకయుద్ధములలో విజయమును పొందిన వాళ్ళిద్దరూ

యుద్ధరంగమునుండి ఎన్నడూ వెనుకకు మరలనివారే. అట్టి వీరులు వృత్రాసురదేవేంద్రుల కీర్తివంటి కీర్తిని పొందుటకు కోరుచున్నారా అన్నట్లు యుద్ధము చేసిరి. అప్పుడు ప్రహస్తుడు ప్రయత్నపూర్వకముగా నీలుని లలాటముమీద ముసలముతో కొట్టెను. అతని లలాటమునుండి రక్తము స్రవించెను. నీలుడు రక్తముచేత తడిసిన దేహముగలవాడై కోపించి, ఒక పెద్ద వృక్షమును గ్రహించి, ప్రహస్తుని వక్షఃస్థలము మీద కొట్టెను. ప్రహస్తుడు ఆ దెబ్బను లెక్కచేయక ముసలము తీసికొని తన బలమును చూపుచు బలశాలియైన నీలుని మీదకి పరుగెత్తెను. వానరనాయకుడైన నీలుడు భయంకరమైన వేగము గల ఆ ప్రహస్తుడు తొందరగా తన మీదికి వచ్చుచుండుటను చూచి గొప్ప వేగముతో ఒక పెద్ద శిలను గ్రహించెను. దానిని వెంటనే ప్రహస్తుని తలపై పడవేసెను. నీలుడు ప్రయోగించిన ఆ భయంకరమైన పెద్ద శిల ప్రహస్తుని శిరస్సును ముక్కముక్కలు చేసెను. వెంటనే ఆ ప్రహస్తుడు శోభను, బలమును, ఇంద్రియములను, ప్రాణములను విడచి మొదలు నరికిన చెట్టువలె నేలమీద కూలెను.(47-55)

బ్రద్దలైన ఆ ప్రహస్తుని శిరస్సునుండి చాల రక్తము స్రవించెను. అతని శరీరమునుండి కూడ, పర్వతమునుండి సెలయేరు ప్రవహించినట్లు రక్తము స్రవించెను. నీలుడు ప్రహస్తుణ్ణి చంపిన వెంటనే దుఃఖితులైన రాక్షసుల సైన్యము లంకవైపు వెళ్ళిపోయెను. సేనానాయకుడు చంపబడుటచే ఆ రాక్షసులు, విరిగిపోయిన సేతుబంధము దగ్గర ఉన్న నీరు నిలవజాలనట్లు నిలువలేకపోయిరి. సేనానాయకుడైన అతడు మరణించగానే రాక్షసులు ఏమీ చేయజాలక రావణుని ఇంటికి వెళ్ళి అక్కడ ఏమేమో ఆలోచించుచు మాటలాడజాలకపోయిరి. తీవ్రమైన శోకసముద్రములో పడిన ఆ రాక్షసులు స్పృహ తప్పిపోయి నట్లు అయిరి. మహాబలశాలి, సేనానాయకుడూ అయిన నీలుడు విజయవంతుడై, బాగుగా చేసిన పనికి ప్రశంసింపబడుచు రామలక్ష్మణుల దగ్గరకు వెళ్ళి చాల సంతోషముతో ఉండెను.(56-60)

శ్రీమద్రామాయణమునందలి యుద్ధకాండలోని ఏబది ఎనిమిదవ సర్గము సమాప్తము.

ఏబది తొమ్మిదవ సర్గము

ప్రహస్తుడు మరణించుటచే దుఃఖితుడైన రావణుడు యుద్ధమునకు బయలుదేరుట.

రాక్షససేనానాయకుడైన ప్రహస్తుణ్ణి వానరశ్రేష్ఠుడైన నీలుడు చంపివేయగా రావణసైన్యము పారిపోయెను. ఆ సైనికులు వెళ్ళి సేనాపతిని నీలుడు చంపివేసినట్లుగా రావణునకు తెలుపగా అతడు ఆ మాటలు విని చాల కోపించెను. అతడు యుద్ధములో ప్రహస్తుడు చంపబడినట్లు విని, కోపముతో బాధపడుచు, మనస్సు శోకముతో నిండగా రాక్షససేనానాయకులతో దేవేంద్రుడు దేవసేనానాయకులతో పలికినట్లు ఇట్లు పలికెను– "ఇంద్రుని సైన్యమును కూడ నశింపచేసిన నా సేనాపతిని పరివారముతోను, ఏనుగులతోను సహా చంపివేసిన శత్రువుల విషయమున అనాదరము చూపగూడదు. అందుచేత నేనింక ఏమీ ఆలోచించకుండగా శత్రువులను చంపి విజయము సాధించుటకై స్వయముగా ఆశ్చర్యకరమైన యుద్ధరంగాగ్రభాగమునకు వెళ్లెదను. మండుచున్న అగ్నులచేత వనమును కాల్చివేసినట్లు, ఇప్పుడు, బాణసముదాయములచేత ఆ వానరసైన్యమును, రామలక్ష్మణులను కాల్చివేసెదను."(1-6)

రావణుడు ఇట్లు పలికి అగ్నివంటి ప్రకాశము గల రథము నెక్కెను. దానికి శ్రేష్ఠములైన చాల గుర్రములను కట్టిరి. అది మండుచున్నట్లు ప్రకాశించుచుండెను. రాక్షసు లందరూ శంఖభేరీపణవములను మ్రోగించుచు, జబ్బలు చరచుచు, అరచుచు, సింహనాదములు చేయుచు, ఉత్తమములైన స్తోత్రములు చేయుచుండగా రావణుడు బయలుదేరెను. నల్లని మేఘములవంటి రూపములు గలవారు, అగ్నివలె ప్రకాశించుచున్న నేత్రములు కలవారు అయిన ఆ రాక్షసులతో కూడిన రావణుడు భూతములతో కూడిన దేవతాప్రభువైన రుద్రుడు వలె ప్రకాశించెను. పిమ్మట, గొప్ప తేజస్సుగల రావణుడు వెంటనే లంకనుండి బయల్వెడలి మహాసముద్ర–మేఘముల వలె గర్జించుచు, వృక్షములు పర్వతములు హస్తములందు ధరించి యుద్ధానికి సిద్ధముగా ఉన్న, భయంకరమైన ఆ వానరసైన్యమును చూచెను.(7-10)

సర్పరాజు వలె పొడవైన బలిష్ఠమైన బాహువులు గలవాడు, సేనచేత అనుసరింపబడినవాడు, గొప్ప తేజస్సుతో కూడినవాడు అయిన రాముడు చాల భయంకరమైన ఆ సైన్యమును చూచి శస్త్రధారులలో శ్రేష్ఠుడైన విభీషణుని– "క్షోభింపశక్యము కాని ఈ సైన్యము ఎవనిది? అనేకవిధములైన పతాకలు, ధ్వజములు,

ఛత్రములు ఉన్న ఈ సైన్యములో ప్రాసలు, ఖడ్గములు, శూలములు మొదలైన ఆయుధములు ధరించిన ధైర్యవంతులైన యోధులు కనబడుచున్నారు. దీనిలోని ఏనుగులు మహేంద్రపర్వతము వలె ఉన్నవి." అని ప్రశ్నించెను.(11, 12)

విభీషణుడు రాముని మాటలు విని రాక్షసశ్రేష్ఠుల ఆ ఉత్తమసైన్యమును గూర్చి చెప్పెను- "రాజా! ఏనుగుపై ఎక్కి దాని శిరస్సును (తన శరీరభారముచేత) కదల్చుచు, వచ్చుచున్న, అప్పుడే ఉదయించిన సూర్యునివలె ఎఱ్ఱనైన ముఖము గల ఈ మహాత్ముడు ప్రవీరబాహువు. సింహము ధ్వజమునందున్న రథమెక్కి ఇంద్రధనుస్సు వలె ప్రకాశించుచున్న ధనుస్సును కదల్చుచు, భయంకరములైన, వంకర తిరిగిన కోరలతో ఏనుగువలె ఉన్న ఇతడు ఇంద్రజిత్తు. వరములచే లభించిన గొప్ప పరాక్రమాదులు ఉన్నవాడు. వింధ్యపర్వతముతోను, అస్తాద్రితోను, మహేంద్రపర్వతముతోను సమానుడు, ధనుర్ధరుడు, రథమునందున్నవాడు, అతిరథుడు. మహావీరుడు. చాల పెద్దదైన ధనుస్సును చరచుచున్నవాడు, చాల పెద్దగా పెరిగిన దేహము కలవాడు అయిన ఇతడు అతికాయుడు. అప్పుడే ఉదయించిన సూర్యుని వలె ఎఱ్ఱగా ఉన్న కళ్ళతో, ఘంటాధ్వనులతో ఎక్కువ శబ్దము చేయుచున్న ఏనుగును ఎక్కి క్రూరముగా అరచుచున్న ఈ మహాత్ముడైన వీరుడు మహోదరుడు. విచిత్రమైన బంగారు అలంకారములచేత అలంకరించిన గుఱ్ఱమును ఎక్కి, కిరణములను ప్రసరింపచేయుచున్న ప్రాసమును ధరించి వచ్చుచున్న, సంధ్యాకాలమునందలి మేఘముతోను పర్వతముతోను సమానమైన కాంతి గల ఇతడు పిడుగుతో సమానమైన వేగము గల పిశాచుడు. మెరపువంటి ప్రకాశగల, వజ్రవేగము కింకరుడుగా గల వాడియైన శూలమును ధరించి, చంద్రుడు వలె తెల్లగా ఉన్న వృషభమును ఎక్కి వచ్చుచున్నవాడు కీర్తిమంతుడైన త్రిశిరస్కుడు. మేఘమువంటి రూపము, బలిసి విశాలముగా అందముగా ఉన్న వక్షఃస్థలము గల ఈ కుంభుడు యుద్ధమునందు ఏకాగ్రమైన చిత్తముతో ధనుస్సును కదల్చుచు, చరచుచు వచ్చుచున్నాడు. ఇతని కేతువు మీద సర్పరాజచిహ్నా మున్నది. బంగారముతోను, వజ్రాలతోను కూడిన ప్రజ్వలించుచున్న పొగలు వచ్చుచున్న పరిఘను గ్రహించి వచ్చుచున్నవాడు రాక్షససైన్యమునకు ధ్వజమువంటి, ఆశ్చర్యకరములైన వీరకృత్యములు చేయు నికుంభుడు. ధనుస్సులు, ఖడ్గములు, బాణసముదాయము ఉంచిన, పతాకలచేత అలంకరించిన, అగ్నివలె ప్రజ్వలించుచున్న రూపముగల రథమునెక్కి ప్రకాశించుచున్న ఈ తీవ్రమైన స్వభావము గలవాడు నరాంతకుడు. ఎదిరించి నిలబడువాళ్ళు లేకపోవుటచే ఇతడు

పర్వతశిఖరములతో యుద్ధము చేయుచుందును. అనేకవిధములైన భయంకరరూపములు గల, పెద్దపులులు, ఒంటెలు, ఏనుగులు, లేళ్లు, గుఱ్ఱములు – వీటి ముఖములవంటి ముఖములు గల, తిరిగిపోవుచున్న నేత్రములు గల భూతములతో కూడిన, అతడు దేవతల దర్పమును కూడ తొలిగించిన రావణుడు. సన్నని ఊచలు గల, చంద్రుడు వలె తెల్లగా ఉన్న శ్రేష్ఠమైన ఛత్రము దగ్గర ఇతడు భూతములతో కూడిన రుద్రుడువలె ప్రకాశించుచున్నాడు. యమదేవేంద్రుల దర్పమును పోగొట్టిన ఈ రావణుడు సూర్యుడు వలె ప్రకాశించుచున్నాడు. వింధ్యపర్వతము వంటి భయంకరమైన శరీరము గల ఇతడు కిరీటమును ధరించి ఉన్నాడు. ఇతని ముఖమునందున్న కుండలములు కదలుచున్నవి."(13-25)

శత్రుసంహారకుడైన రాముడు విభీషణునితో – "ఆహా! రాక్షసరాజైన రావణుడు తేజస్సుతో ఎంత గొప్పగా ప్రకాశించుచున్నాడు! కిరణములు వ్యాపించి ఉండుటచేత సూర్యుడు వలె ఈ రావణుడు చూచుటకు శక్యము కాకుండా ఉన్నాడు. చుట్టూ తేజస్సుతో నిండిన ఈతని రూపము స్పష్టముగా కనబడుటలేదు. దేవదానవవీరుల శరీరము కూడ ఈ రావణుని శరీరము ఎట్లు ప్రకాశించుచున్నదో అట్లు ప్రకాశించదు. మహాత్ముడైన ఇతని యోధు లందరూ పర్వతముల వలె ఉన్నారు. అందరూ పర్వతాలతో యుద్ధము చేయగలిగినవారే. అందరూ ప్రకాశించుచున్న అయుధాలు ధరించుచున్నవారే. ప్రకాశించుచున్నవారు, చూచుటకు భయమును కలిగించువారు, క్రూరులు, పెద్ద దేహములు గలవారు అయిన చుట్టూ ఉన్న భూతములతో ఈ రాక్షసరాజు యముడు వలె ప్రకాశించుచున్నాడు. దైవవశముచేత ఈ పాపాత్ముడు ఇప్పుడు నా కంటబడినాడు. ఇపుడు సీతను హరించుట వలన కలిగిన క్రోధమును వీని మీద విడచెదను." అని పలికెను. పరాక్రమవంతుడైన రాముడిట్లు పలికి, ధనుస్సు గ్రహించి, ఉత్తమమైన బాణమును తీసికొని నిలబడెను. లక్ష్మణుడు రాముని వెనుకనే నిలచెను.(26-32)

రాక్షసరాజు బలవంతులైన ఆ రాక్షసులతో – "మీరు ద్వారములవద్దను, మహామార్గములతో ఉన్న గృహాల గోపురములందు ఏ భయము లేక సుఖముగా ఉండుడు. నేను మీ అందరితో కలసి ఇక్కడికి వచ్చినట్లు వానరులు తెలుసుకొని ఈ అవకాశము దొరకుటచే అందరూ కలసి ఎదిరింప శక్యము కాని శూన్యమైన లంకాపురిని క్షోభచెందు నట్లు చేసి హటాత్తుగా పీడించెదరు." అని పలికెను.(33,34)

అట్లు అతడు మంత్రులను పంపివేసి, ఆ రాక్షసులందరు ఆజ్ఞానుసారము

వెళ్ళిన పిమ్మట, గొప్ప చేప సముద్రజలసముదాయమును చీల్చినట్లు వానరసముద్రప్రవాహమును చీల్చివేసెను. ప్రకాశించు ధనుర్బాణములతో యుద్ధములో హటాత్తుగా వచ్చి మీద పడుచున్న, ఆ రావణుని చూచి, సుగ్రీవుడు పెద్ద పర్వతశిఖరమును పెకలించి, అతనిమీదికి పరుగెత్తెను. అనేక వృక్షములు, చరియలు గల ఆ పర్వతశిఖరమును సుగ్రీవుడు రావణుని మీదికి విసరగా అతడు వెంటనే దానిని బంగారు పొన్నులు గల బాణములతో ఛేదించెను. బాగా పెరిగిన ఉత్తమములైన వృక్షములతోను, చరియలతోను నిండిన ఆ శిఖరము చీల్చబడి నేలమీద పడిపోయిన పిమ్మట రావణుడు యమునితో సమానమైన మహాసర్పము వంటి బాణమును సంధించెను. పిడుగుతోను, ఇంద్రుని వజ్రాయుధముతోను సమానమైన వేగముగలది, కణుపులతో కూడిన అగ్నివంటి ప్రకాశముగలది అయిన ఆ బాణమును గ్రహించి, సుగ్రీవుని చంపుటకై ప్రయోగించెను. రావణుని బాహువులచేత విడవబడిన ఆ బాణము ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైన శరీరముతో ప్రకాశించుచున్న సుగ్రీవుని పొంది కుమారస్వామి ప్రయోగించిన ఉగ్రమైన శక్తి క్రౌంచపర్వతమును వలె, వేగముతో అతని శరీరమును భేదించెను. వీరుడైన ఆ సుగ్రీవుడు బాణముచేత పీడితుడై, చిత్తము వికారము చెందగా అరచుచు నేలమీద పడిపోయెను. యుద్ధములో స్పృహ కోల్పోయి నేలమీద పడిపోయిన అతనిని చూచి రాక్షసులు సంతోషించుచు ధ్వనిచేసిరి. (35-41)

పిమ్మట గవాక్షుడు, గవయుడు, సుషేణుడు, ఋషభుడు, జ్యోతిర్ముఖుడు, నలుడు పర్వతములను పెకలించి, పెంచబడిన శరీరములతో ఆ రావణునిమీదికి పరుగెత్తి వెళ్ళిరి. ఆ రాక్షసరాజు వాడియైన అగ్రభాగములు గల బాణములతో ఆ వానరుల ఆయుధములను వ్యర్థమయేటట్లు చేసి బంగారముచేత చిత్రమైన పొన్నులు గల బాణములతో వారి శరీరములు కూడ భేదించెను. భయంకరములైన శరీరములు గల ఆ వానరనాయకులు రావణుని బాణముల దెబ్బలకు బ్రద్దలైన శరీరములతో మూర్ఛచెంది నేలమీద పడిరి. పిమ్మట రావణుడు భయంకరమైన ఆ వానరసైన్యమును బాణసముదాయములతో కప్పివేసెను. రావణుడు బాణములతో కొట్టగా నేలపై పడిపోవుచు, భయ మను శల్యముచేత కొట్టబడి బిగ్గరగా అరచుచున్న ఆ వానరవీరులు రావణుని బాణములచేత పీడితులై రాముని శరణుజొచ్చిరి. (42-45)

అప్పుడు ఉత్తమధనుర్ధారియైన మహాత్ముడైన రాముడు ధనుస్సు ధరించి వెంటనే ముందుకు వచ్చెను. లక్ష్మణుడు రాముని దగ్గరకు వెళ్ళి అంజలి ఘటించి- "ప్రభూ! ఈ దురాత్ముణ్ణి చంపుటకు నీవు సమర్థుడవనుటలో సందేహము లేదు.

ఈతనిని నేను చంపెదను, నాకు అనుజ్ఞ ఇమ్ము." అని ప్రార్థించెను. మహాతేజఃశాలి అయిన రాముడు అతనితో – "లక్ష్మణా! వెళ్ళుము. యుద్ధములో జాగరూకతతో యత్నము చేయుము. రావణుడు గొప్ప శక్తి కలవాడు. యుద్ధమునందు ఆశ్చర్యకరమైన పరాక్రమమును చూపగలవాడు. ఇతడు కోపించినచో మూడు లోకములూ కూడ ఇతని ముందు నిలువజాలవు. సందేహము లేదు. అతనిలో ఉన్న లోపములను వెదకి తెలిసికొనుము; నీలో ఉన్న లోపములను గూడ గ్రహించుము. నేత్రములతోను, ధనుస్సుతోను కూడా నిన్ను నువ్వు రక్షించుకొనుము." అని చెప్పెను. (46–50)

లక్ష్మణుడు రాముని మాటలు విని, రాముని కౌగిలించుకొని, పూజించి, అభివాదనము చేసి యుద్ధమునకు వెళ్ళెను. ఏనుగుతొండమువంటి బాహువులు గల రావణుడు, అప్పుడు, భయంకరమైన ప్రకాశించుచున్న ధనుస్సును ఎత్తి బాణవర్షసముదాయములచేత వానరులను కప్పివేయుచుండెను. వాళ్ళ దేహములు బ్రద్దలైపోయి చెల్లాచెదరుగ పడుచుండెను. అట్టి రావణుని లక్ష్మణుడు చూచెను. (51,52)

గొప్ప తేజస్సు గల, వాయుపుత్రుడైన హనుమంతుడు రావణుని చూచి, అతడు ప్రయోగించుచున్న బాణసముదాయములను అడ్డుకొనుచు అతనిమీదికి శీఘ్రముగా వెళ్ళెను. హనుమంతుడు రావణుని రథము దగ్గరకు వెళ్ళి కుడిచెయ్యి ఎత్తి, అతనిని భయపెట్టుచు– "నీవు దేవ-దానవ-గంధర్వ-యక్ష-రాక్షసులు చంపుటకు శక్యముకాకుండు నట్లు వరము సంపాదించినావు. కాని వానరులనుండి నీకు భయ ముండనే ఉన్నది. పైకి ఎత్తబడిన ఐదు వ్రేళ్ళు గల నా కుడిచెయ్యి చిరకాలమునుండి నీ శరీరములో ఉన్న జీవాత్మను తొలగించగలదు." అనెను. (53–56)

భయంకరమైన పరాక్రమము గల రావణుడు హనుమంతుని మాటలు విని కోపముచేత కళ్ళు ఎఱ్ఱబడగా– "వానరుడా! నిఃసందేహముగా వెంటనే కొట్టుము. స్థిరమైన కీర్తిని పొందుము. నీ పరాక్రమమెంతటిదో తెలిసికొనిన పిమ్మట నిన్ను చంపివేసెదను." అనెను. రావణుని మాటలు విని హనుమంతుడు – "పూర్వము నేను నీ కుమారుడైన అక్షుణ్ణి చంపినాను. ఆ విషయమును గుర్తుకు తెచ్చుకొనుము." అనెను. మహాతేజఃశాలి, పరాక్రమవంతుడు, రాక్షసరాజు అయిన రావణుడు హనుమంతుని మాటలు విని అతనిని అరచేతితో వక్షఃస్థలముమీద కొట్టెను. రావణుని అరచేతి దెబ్బ తగలగానే హనుమంతుడు చాలసార్లు తూలిపోయెను.

తేజఃశాలి, గొప్ప బుద్ధిగలవాడు అయిన హనుమంతుడు ముహూర్తకాలము నిలబడి, నిలదొక్కుకొని ఆ రావణుని అరచేతితోనే కొట్టెను. హనుమంతునిచేత కొట్టబడిన ఆ దశకంఠుడు భూమి కంపించినప్పుడు పర్వతము కంపించినట్లు కంపించెను. యుద్ధములో అరచేతితో కొట్టబడిన ఆ రావణుని చూచి, ఋషులు, వానరులు, సిద్ధులు, దేవతలు, అసురులు ఆశ్చర్యముతో ధ్వనిచేసిరి.(57-63)

పిమ్మట గొప్ప తేజస్సు గల రావణుడు స్పృహ తెచ్చుకొని - "ఓ! వానరుడా! బాగు! బాగు! పరాక్రమముచేత నీవు నాకు తగిన శ్లాఘనీయుడవైన శత్రువుగా ఉన్నావు." అనెను. రావణుని మాటలు విని హనుమంతుడు- "రావణా! ఛీ! నా బలము ఏమి బలము! నీవింకా జీవించియే ఉన్నావు! ఓ! దుర్బుద్ధీ! బడాయి ఎందుకు చెప్పుకొనెదవు! ఇప్పుడు నన్నొక పర్యాయము కొట్టుము. అటు పిమ్మట నా పిడికిలి నిన్ను యమలోకమునకు పంపివేయగలదు." అనెను. హనుమంతుని మాటలు వినగానే రావణుని కోపము ఎక్కువయ్యెను. పరాక్రమవంతుడైన అతడు బాగా ఎఱ్ఱబడిన నేత్రములతో చూచుచు, ప్రయత్నపూర్వకముగా కుడి పిడికిలి ఎత్తి వేగముగా హనుమంతుని వక్షఃస్థలముమీద పడవేసెను (కొట్టెను). విశాలమైన వక్షస్థలముమీద కొట్టబడిన హనుమంతుడు ఎక్కువగా తూలిపోయెను. మహాబలవంతుడైన హనుమంతుడు ఆ విధముగా వ్యాకులుడై ఉండుటచూచి అతిరథుడైన రావణుడు రథముపై నీలునిమీదకు వెళ్ళెను.(64-69)

రాక్షసప్రభువు, ప్రతాపవంతుడు అయిన దశగ్రీవుడు సర్పములతో సమానములు, భయంకరములు, శత్రువుల మర్మస్థానములను భేదించేవీ అయిన బాణాలచేత, వానరసేనానాయకుడైన నీలుణ్ణి మండిపోవుచున్నట్లు చేసెను. బాణసముదాయముచేత పీడింపబడిన వానరసేనాపతి అయిన నీలుడు ఒక చేతితో పర్వతశిఖరమును రావణునిమీదికి విసిరెను. గొప్ప తేజస్సు, గొప్ప మనస్సు గల హనుమంతుడు మూర్ఛనుండి తేరుకొని యుద్ధము చేయగోరుచు ఇటునటు చూచి నీలునితో యుద్ధముచేయుచున్న రాక్షసరాజైన రావణునితో, - "ఇతరునితో యుద్ధము చేయుచున్నవానిమీదకు యుద్ధమునకై వెళ్ళుట యుక్తముకాదు." అనుకొనెను. రావణుడు నీలుడు విసిరిన శిఖరమును చాలవాడియైన అగ్రభాగములు గల ఏడు బాణాలతో కొట్టెను. ఆ శిఖరము ముక్కలై పడిపోయెను. ఆ పర్వతశిఖరము బ్రద్దలైపోవుటచూచి శత్రువీరులను చంపు సేనాపతియైన నీలుడు, కోపముతో ప్రళయకాలాగ్నివలె మండిపడెను. యుద్ధమునందు ఆ నీలుడు మద్దిచెట్లను, శాలవృక్షములను, బాగా పుష్పించిన మామిడిచెట్లను, అనేకవిధములైన

ఇతరవృక్షములను విసరెను. రావణుడు ఆ వృక్షములను ఎదుర్కొని ఛేదించివేసెను. భయంకరమైన బాణవర్షమును నీలునిమీద కురిపించెను. (70-78)

మేఘము వర్షించి నట్లు రావణుడు తన మీదికి శరవర్షము కురిపించగా నీలుడు శరీరమును చిన్నది చేసి అతని ధ్వజము చివర వ్రాలెను. ధ్వజాగ్రముమీద కూర్చున్న నీలుని చూచి రావణుడు కోపముతో మండిపడెను. నీలుడు బిగ్గరగా అరచెను. నీలుడు రావణుని ధ్వజము చివర, ధనుస్సు చివర, కిరీటము పైన వాలుచుండుట చూచి లక్ష్మణుడు, హనుమంతుడు, రాముడు ఆశ్చర్యపడిరి. అప్పుడు మహాతేజఃశాలియైన రావణుడు నీలుని చురుకుదనమును చూచి ఆశ్చర్యపడుచు, ప్రజ్వలించుచున్న, ఆశ్చర్యకరమైన ఆగ్నేయాస్త్రమును గ్రహించెను. యుద్ధములో నీలుని లాఘవముచే కంగారుపడుచున్న రావణుని చూచి సంతోషించుటకు తగిన అవకాశము లభించిన ఆ వానరులు సంతోషించుచు అరచిరి. అప్పుడు వానరుల ధ్వనిచేత తొందరపడుచు కంగారుగా ఉన్న హృదయము గల రావణునకు ఏమి చేయవలెనో తోచలేదు. నిశాచరుడైన రావణుడు ఆగ్నేయాస్త్రముతో కూడిన బాణమును సంధించి ధ్వజాగ్రముపైన ఉన్న నీలుణ్ణి చూచి- "ఓ! వానరుడా! నీవు గొప్ప మాయనూ, చురుకుదనమును చూపుచున్నావు! నీవు అనేక విధములుగా ఆ యా రూపములలో కనబడుచున్నావు! సామర్థ్యమున్నచో ప్రాణాలను రక్షించుకొనుము. నీవు ఎన్ని రూపములు ధరించినా నేను ప్రయోగించిన అస్త్రముతో కూడిన బాణము నీ ప్రాణాలను తీసివేయగలదు." అని పలుకుచు బాణమును ఆగ్నేయాస్త్రముతో సంధించి నీలునిపై ప్రయోగించెను. అస్త్రము సంధించిన బాణముచేత వక్షఃస్థలమునందు కొట్టబడిన నీలుడు అది కాల్చివేయుచుండగా వెంటనే నేలమీద పడిపోయెను. తండ్రియైన అగ్నిదేవుని ప్రభావము తనకుకూడ కొంత ఉండుటవలన, తన సహజమైన తేజస్సుచేతా నీలుడు నేలమీద మోకాళ్ళపైన పడెను. గాని ప్రాణములు విడువలేదు. (79-91)

నీలుడు మూర్ఛచెందుట చూచి రావణుడు యుద్ధమునందు ఆసక్తితో, మేఘధ్వని వంటి ధ్వని గల రథముచేత, లక్ష్మణుడున్న వైపునకు శీఘ్రముగా వెళ్ళెను. అతడు యుద్ధరంగము మధ్య లక్ష్మణుణ్ణి సమీపించి, అతడు ముందుకు వెళ్ళకుండునట్లు, వారించి, ప్రజ్వలించుచు నిలచినవాడై, ధనుస్సును చరిచెను. దైన్య మెరుగని బుద్ధి గల లక్ష్మణుడు గొప్ప ధనుస్సును చరచుచున్న అతనితో- "రాక్షసరాజా! నీవు ఈ వానరులతో యుద్ధముచేయుట కాదు; నాతో యుద్ధము చేయుటకు రమ్ము." అనెను. రాక్షసరాజైన రావణుడు లక్ష్మణుని మాటలను, అత్యధికమైన ధ్వనిగల

భయంకరమైన ధనుష్టంకారమును విని, దగ్గరగా ఉన్న లక్ష్మణుని సమీపించి, కోపముతో- "లక్ష్మణా! విపరీతబుద్ధి గల నీవు మరణించనున్నావు. దైవవశముచేత నా కంటబడినావు. నా బాణముల ప్రహారములకు ఈ క్షణమునందే యమలోకమును పొందగలవు" అనెను. లక్ష్మణుడు, ఎత్తైన తెల్లని దంతాగ్రము గల, గర్జించుచున్న ఆ రావణుని విషయమున ఏ మాత్రము ఆశ్చర్యము చెందనివాడై- "పాపాత్ములలో గొప్పవాడవైన రావణా! వ్యర్థముగా బడాయి చెప్పుకొనుచున్నావు. గొప్ప ప్రభావము గలవారు ఈ విధముగా గర్జించరు. రావణా! నీ వీర్యము, బలము, పరాక్రమము, ప్రతాపము ఎంతటివో నాకు తెలియును. ధనుర్బాణములు ధరించి నేను నిలచి ఉన్నాను; రమ్ము; వ్యర్థముగా బడాయి చెప్పుకొని ఏమి ప్రయోజనము?" అని పలికెను. (92-98)

లక్ష్మణుని మాటలకు కోపించిన రావణుడు మంచి పొన్నులు గల ఏడు బాణములను ప్రయోగించెను. వాటిని లక్ష్మణుడు చిత్రమైన బంగారు పొన్నులు, వాడియైన అగ్రభాగములుగల అంచులు గల బాణములతో ఛేదించెను. ఆ విధముగా లక్ష్మణుడు వెంటనే ఛేదించివేసిన, పడగలు తెగగొట్టిన సర్పముల వలె ఉన్న బాణములను చూడగానే రావణుని క్రోధము అధికమయ్యెను. మరికొన్ని వాడియైన బాణములను ప్రయోగించెను. లక్ష్మణుడు ధనుస్సుచేత ప్రయోగించబడిన తీవ్రమైన క్షుర-అర్ధచంద్ర-కర్ణి- భల్లబాణముల చేత ఆ బాణములను ఛేదించెను. ఏ మాత్రము కలత చెందలేదు. రావణుడు తన బాణసముదాయములు వ్యర్థమైపోవుటచూచి లక్ష్మణుని హస్తలాఘవమునకు ఆశ్చర్యపడెను. మరల వాడియైన బాణములు ప్రయోగించెను. మహేంద్రునితో సమానుడైన లక్ష్మణుడు కూడ వాడియైన అగ్రభాగములు గలవి, పిడుగువలె భయంకరమైన వేగము గలవి, అగ్నివంటి ప్రకాశము గలవి అయిన బాణములను ధనుస్సుపై సంధించి, రావణుని సంహరించుటకై విడచెను. ఆ రాక్షసరాజు ఆ వాడియైన బాణములను ఛేదించి, బ్రహ్మదేవు డిచ్చిన, ప్రళయకాలాగ్నితో సమానమైన బాణముచేత లక్ష్మణుని లలాటముమీద కొట్టెను. లక్ష్మణుడు రావణుని బాణముచేత పీడింపబడినవాడై ధనుస్సును వదులుగా పట్టుకొని కదలిపోయెను. మరల కష్టముమీద సంజ్ఞను పొంది, రావణుని ధనుస్సును ఖండించెను. రావణుని ధనుస్సును ఖండించిన పిమ్మట లక్ష్మణుడు వాడియైన అగ్రభాగములుగల మూడు బాణములచేత అతనిని కొట్టెను. బాణములచేత పీడితుడై రావణుడు చలించిపోయెను. మరల కష్టముమీద స్పృహ చెందెను. (99-106)

ధనుస్సు ఖండింపబడిన పిమ్మట బాణములచేత కొట్టబడిన ఆ రావణుని శరీరము కొవ్వుతో పూయబడి రక్తముచే తడిసెను. సహజముగా ఉగ్రమైన శక్తి గల ఆ రావణుడు బ్రహ్మదేవు డిచ్చిన శక్తిని యుద్ధమునందు, చేతితో గ్రహించెను. ఆ శక్తి పొగతో కూడిన నిప్పువలె ఉండెను. యుద్ధమునందు వానరులకు భయము కలిగించుచుండెను. మండుచున్న అట్టి శక్తిని రావణుడు లక్ష్మణునిమీద ప్రయోగించెను. లక్ష్మణుడు మీదికి వచ్చిపడుచున్న ఆ శక్తిని అస్త్రాలతోను, హోమముచేసిన అగ్నివలె ఉన్న బాణాలతోను కొట్టెను. అయినను ఆ శక్తి లక్ష్మణుని విశాలమైన వక్షఃస్థలములో ప్రవేశించెను.(107-109)

శక్తిశాలియైన ఆ లక్ష్మణుడు శక్తిచేత కొట్టబడినవాడై నేలమీద పడి ప్రజ్వలించెను. రావణుడు శీఘ్రముగా వచ్చి వ్యాకులుడై ఉన్న ఆ లక్ష్మణుణ్ణి, తన బలము నుపయోగించి భుజములతో పట్టుకొనెను. హిమవత్పర్వతమును, మందరపర్వతమును, మేరుపర్వతమును, దేవతలతో సహా మూడు లోకములను రావణుడు భుజముతో ఎత్తవచ్చునేమో గాని లక్ష్మణుని మాత్రము ఎత్తలేకపోయెను. బ్రహ్మ ఇచ్చిన శక్తిచేత వక్షఃస్థలమునందు కొట్టబడినా కూడ లక్ష్మణుడు తాను ఊహించుటకు కూడ శక్యముకాని విష్ణుభాగ మను విషయమును స్మరించుటచే అపాయము లేనివాడై ఉండెను. రావణుడు రాక్షససంహారకుడైన లక్ష్మణుని బాహువులతో గట్టిగా పట్టుకొని అతనిని కదల్చుటకు సమర్థుడు కాలేదు.(110-113)


అప్పుడు హనుమంతుడు రావణుని మీదికి దుమికి, కోపావిష్టుడై, వజ్రమువంటి పిడికిలితో అతనిని వక్షఃస్థలముమీద కొట్టెను. రావణుడు ఆ పిడికిలి దెబ్బకు చలించిపోయి నేలపై మోకాళ్ళమీద పడిపోయెను. అతని ముఖములనుండి, నేత్రములనుండి, చెవులనుండి అధికముగా రక్తము కారెను. అతడు తిరిగిపోయి, నిశ్చేష్టుడై రథమధ్యమునందు కూర్చుండిపోయెను. స్పృహతప్పి మూర్ఛ చెందెను. నిలబడలేకపోయెను. ఆ విధముగా యుద్ధరంగమునందు భయంకరపరాక్రమముగల రావణుడు స్పృహ కోల్పోవుట చూచి ఋషులు, వానరులు, దేవతలు, అసురులు, ఆనందముతో ధ్వనిచేసిరి. పిమ్మట, మహాతేజఃశాలియైన హనుమంతుడు రావణునిచేత పీడింపబడిన ఆ లక్ష్మణుణ్ణి భుజాలతో ఎత్తి రాముని దగ్గరకు తీసుకొని వచ్చెను. లక్ష్మణుణ్ణి శత్రువు లెవ్వరూ కదల్పజాలరు. అయినను, హనుమంతుడు మిత్రు డగుటచేతా, భక్తి ఉన్నవాడగుటచేతా అతనికి తేలిక అయ్యెను. ఆ శక్తి, యుద్ధములో జయించబడిన లక్ష్మణుని విడిచి రావణుని రథమునందు తన స్థానమును చేరెను. గొప్ప తేజస్సు గల రావణుడు కూడ మరల సంజ్ఞ పొంది, ధనస్సును పట్టి వాడియైన

బాణములను గ్రహించెను. శత్రువినాశకుడైన లక్ష్మణుడు ఊహింపశక్యము కాని విష్ణువు అంశయైన తన సహజస్వరూపమును గూర్చి స్మరించుచు తేరుకొనెను. అతని శరీరమునందలి శల్యము లన్నీ తొలగిపోయెను.(114-122)

యుద్ధములో వానరసైన్యమునందలి మహావీరులందరూ పడిపోవుట చూచి రాముడు రావణునివైపు శీఘ్రముగా వెళ్లెను. అంతలో హనుమంతుడు రామునివద్దకు వెళ్ళి - "విష్ణువు గరుత్మంతుణ్ణి ఎక్కి దేవతల శత్రువును సంహరించి నట్లు, నీవు నా వీపుమీద ఎక్కి ఈ రాక్షసుని సంహరింపుము." అని పలికెను. రాముడు హనుమంతుడు పలికిన ఆ వాక్యమును విని హనుమంతుని వీపుపై ఎక్కి యుద్ధములో రథమునందున్న రావణుణ్ణి చూచెను. గొప్ప తేజస్సు గల రాముడు ఆ రావణుని చూచి, కోపముతో ఆయుధమును ఎత్తి, విష్ణువు బలిచక్రవర్తి మీదికి వెళ్ళినట్లు అతని మీదికి శీఘ్రముగా వెళ్ళెను.(123-127)

వజ్రమును నలగగొట్టినప్పుడు కలుగు ధ్వని వలె నిష్ఠురమైన తీవ్రమైన టంకారధ్వనిచేసి, రాముడు గంభీరమైన వాక్కుతో రావణుని గూర్చి- "రావణుడా! నిలువుము, నిలువుము. నాకిట్టి అపకారమును చేసి నీవు ఎక్కడికి వెళ్ళి విడుదలను పొందగలవు? ఇప్పుడు నా ఎదుటకు వచ్చిన నీవు, ఇంద్ర-యమ-సూర్యుల దగ్గరకి గాని, బ్రహ్మ-అగ్ని-శివులదగ్గరకి గాని, పది దిక్కులకు గాని వెళ్ళినను విడువబడవు. ఓ! రావణా! ఏ లక్ష్మణుని నీవిప్పుడు శక్తిచేత కొట్టినావో మూర్ఛపొందిన ఆ లక్ష్మణుడే వెంటనే వచ్చి ఇప్పుడు , ఈ యుద్ధమునందు పుత్రపౌత్రసహితుడవైన నీ పాలిటి మృత్యుదేవత కానున్నాడు. చూచుటకు చాల ఆశ్చర్యకరులుగా ఉండువారు, శ్రేష్ఠములైన ఆయుధములను ధరించినవారు అయిన జనస్థానములో నివసించు పదునాలుగు వేలమంది రాక్షసులను నేను బాణములతో నశింపచేసితిని." అని పలికెను. గొప్ప బలము గల రావణుడు రాముని మాటలు విని, కోపముతో మండిపడుచు, వెనుకటి వైరమును స్మరించుచు, యుద్ధములో రాముని మోయుచున్న హనుమంతుణ్ణి ప్రళయకాలాగ్నిజ్వాలలో సమానములైన ప్రకాశించుచున్న బాణములతో కొట్టెను. యుద్ధములో రావణుడు బాణములచేత ఆ విధముగా కొట్టినను సహజముగా తేజోవంతుడైన హనుమంతుని తేజస్సు ఇంకా అధికమయ్యెను. రాముడు రావణునిచేత గాయపరచబడిన హనుమంతుని చూడగానే చాలకోపము చెందెను.(128-136)

అతడు రావణునికి దగ్గరగా వెళ్ళి, చక్రములతోను, గుఞ్ఞములతోను,



ధ్వజములతోను, ఛత్రముతోను, పెద్ద పతాకలతోను, సారథితోను, అశని–శూల–ఖడ్గములతోను, కూడిన రావణుని రథమును వాడియైన బాణాలతో ఛేదించెను. రాముడు ఆ రావణుని విశాలము, సుందరము అయిన వక్షఃస్థలమును బలపూర్వకముగా, వజ్రముతోను, పిడుగుతోను సమానమైన బాణములచేత భగవంతుడైన ఇంద్రుడు వజ్రముచేత మేరుపర్వతమును కొట్టినట్లు కొట్టెను. ఏ రావణుడు వజ్రాయుధము దెబ్బ తగిలినా, పిడుగులు పడినా కూడ క్షోభ చెందలేదో, చలించను కూడ లేదో అట్టి వీరుడైన రావణుడు రాముని బాణముచేత కొట్టబడినవాడై మిక్కిలి దుఃఖితుడై చలించిపోయెను. ధనుస్సును కూడ జార విడచెను. మహాత్ముడైన రాముడు వ్యాకులత చెందుతూన్న ఆ రావణుని చూచి అర్ధచంద్రబాణము గ్రహించి, వెంటనే దానిచేత వాని సూర్యునివంటి ప్రకాశము గల కిరీటమును ఛేదించెను. యుద్ధరంగములో ఆ రావణుడు విషములేని సర్పమువలె, కిరణములు శాంతించిన సూర్యుడు వలె ఉండెను. ప్రకాశవిహీనుడై, కిరీటసముదాయము ఖండింపబడుటచేత శోభ తొలగి ఉండెను. అట్టి రావణునితో రాముడు– "నీవు భయంకరమైన గొప్ప కర్మచేసినావు. నా మహావీరుల నందరినీ పడగొట్టినావు. అందుచే నీవు అలసి ఉన్నావని నిర్ణయించుకొని నేను నిన్ను బాణములచేత యమలోకమునకు పంపుటలేదు. నీవు యుద్ధములో అలసిపోయినావు; నాకు తెలియును. వెళ్ళుము;

లంకలో ప్రవేశించి, శ్రమ దీర్చుకొని రథమును, ధనుస్సును గ్రహించి బయలుదేరి రమ్ము. అప్పుడు రథమునందున్నవాడవై నా బల మెంతటిదో చూడగలవు." అనెను. (137-143)

రావణుని దర్పము, సంతోషము కూడ అణగిపోయెను. ధనుస్సు ఛేదింపబడెను. గుఱ్ఱములు, సారథి కూడ చంపబడెను. కిరీటములు ఖండింపబడెను. అట్టి స్థితిలో రాముని బాణముచేత పీడితుడైన ఆ రాక్షసరాజు రాముని మాటలు విని వెంటనే లంకలో ప్రవేశించెను. గొప్ప బలము గల, దేవదానవశత్రువైన రావణుడు లంకలో ప్రవేశించిన పిమ్మట రాముడు రణరంగములో పడియున్న వానరుల దేహములనుండి, లక్ష్మణుని దేహమునుండి ములుకులను తొలగింపచేసెను. ఇంద్రుని శత్రువైన ఆ రావణుడు ఓడిపోవుట చూచి సురులు, అసురులు, భూతములు, దిక్కులు, సముద్రము, సమస్తమైన ఉరగులు, భూమియందు జలమునందు నివసించు ప్రాణులు సంతోషించినవి. (144-146)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఏబది తొమ్మిదవ సర్గము సమాప్తము.

అరువదవ సర్గము

రాముని చేతిలో పరాజయము చెంది దుఃఖితుడైన రావణుని ఆజ్ఞచేత కుంభకర్ణుడు నిద్రనుండి లేపబడుట.

అప్పుడా రాక్షసరాజు లంకాపురములో ప్రవేశించిన పిమ్మట కూడ రామబాణముచేత పీడితుడై, గర్వము తొలగి, వ్యథ చెందిన ఇంద్రియములు గలవాడయ్యెను. అతడు సింహముచేత ఏనుగువలె, గరుత్మంతునిచేత సర్పమువలె మహాత్ముడైన రామునిచేత తిరస్కరించబడెను. ఆ రాక్షసరాజు బ్రహ్మదండములవంటి, మెరుపులవలె చలించుచున్న కాంతి గల రాముని బాణాలను స్మరించుచు వ్యథ చెందెను. (1-3)

అతడు దివ్యమైన బంగారు అసనముమీద కూర్చుండి రాక్షసులను చూచుచు- "మహేంద్రునితో సమానుడనైన నన్ను మానవుడు జయించినాడు. నేను చేసిన ఆ గొప్ప తపస్సు అంతా వ్యర్థమై పోయినది కదా! 'నీకు మానవులవలననే భయము కలుగును' అని బ్రహ్మ పలికిన ఆ వాక్యము ఇపుడు నాకు వచ్చిపడినది. అది అట్లే

జరుగుచున్నది. నేను దేవదానవగంధర్వయక్షరాక్షసపన్నగులనుండి మరణము కలుగకుండునట్లు వరము పొందితిని. కాని మనుష్యులనుండి మరణము కలుగకుండునట్లు కోరలేదు. 'దుర్బుద్ధివైన ఓ! రాక్షసాధముడా! నిన్ను, నీ పుత్రులను, అమాత్యులను, సైన్యమును, అశ్వములను, సారథిని యుద్ధములో చంపనున్న పురుషుడు నా వంశములో పుట్టగలడు' అని పూర్వము ఇక్ష్వాకువంశమునందు పుట్టిన అనరణ్యుడు చెప్పియున్నాడు. అందుచే దశరథాత్మజుడైన రాముడు ఆ మానవుడే అని తలచెదను. పూర్వము నేను అవమానించిన వేదవతి నన్ను శపించినది. ఆమెయే మహాభాగ్యవంతురాలైన, జనకుని కుమార్తెయైన సీతగా పుట్టినది. పార్వతి, నందీశ్వరుడు, రంభ, వరుణుని పుత్రిక ఎట్లు శపించినారో ఆ విధముగానే ప్రాప్తించినది. ఋషుల మాటలు అసత్యములు కావుకదా? ఈ శాపములను దృష్టిలో ఉంచుకొని మీరు ప్రయత్నము చేయవలెను. రాక్షసులు కూడ రాజవీథులలోను, గోపురముల శిఖరములయందు నిలచి ఉండవలెను. సాటిలేని గాంభీర్యము గలవాడు, దేవదానవుల దర్పమును అణచినవాడు, బ్రహ్మశాపగ్రస్తుడు అయిన కుంభకర్ణుణ్ణి మేల్కొలుపుడు." అని పలికెను.(4-13)

యుద్ధములో ప్రహస్తుడు చంపబడుటచేతను, తాను ఓడిపోవుటచేతను, మహాబలశాలియైన ఆ రావణుడు భయంకరమైన రాక్షససైన్యమును ఇట్లు ఆజ్ఞాపించెను- "ద్వారముల రక్షణము విషయమున యత్నముతో ఉండవలెను. ప్రాకారము నెక్కి శత్రువులను కనిపెట్టి ఉండవలెను. నిద్రచేత ఆవహించపడిన కుంభకర్ణుణ్ణి మేల్కొల్పవలెను. ఈ కుంభకర్ణుడు కాలవశముచేత స్పృహ కోల్పోయి, శయనించినచో తొమ్మిది, ఏడు, ఎనిమిది మాసములు నిశ్చింతగా, సుఖముగా నిద్రించుచుండును. అతడు మన మందరము మంత్రణము చేసిన పిమ్మట తొమ్మిది రోజుల క్రితము నిద్రపోయినాడు. బలము గల ఆ కుంభకర్ణుణ్ణి శీఘ్రముగా మేల్కొల్పుడు. సమస్తరాక్షసులలో శ్రేష్ఠుడైన గొప్ప బాహువులు గల ఆ కుంభకర్ణుడు యుద్ధమునందు వానరులను, రామలక్ష్మణులను శీఘ్రముగా చంపగలడు. సమస్తరాక్షసులలో ముఖ్యుడు, యుద్ధములో ధ్వజమువంటివాడు అయిన ఈ కుంభకర్ణుడు నీచమైన నిద్రాసుఖమునందు ఆసక్తుడై, ఎల్లప్పుడూ ఒడలు తెలియకుండా నిద్రపోవుచున్నాడు. కుంభకర్ణుణ్ణి నిద్రనుండి లేపినచో, ఈ భయంకరమైన యుద్ధములో రామునిచేతిలో ఓడిపోయిన నా దుఃఖము శాంతించును. దేవేంద్రునితో సమానమైన పరాక్రమము గల ఆ కుంభకర్ణుడు ఇట్టి భయంకరమైన ఆపదలో నాకు సహాయ్యము చేయనప్పుడు వానివలన నాకేమి

ప్రయోజనము?"(14-21)

రాక్షసులు రావణుని మాటలు విని చాల తొందరపడుచు కుంభకర్ణుని గృహమునకు వెళ్ళిరి. పెద్ద ద్వారము గలది, అన్నివైపులా యోజనము వైశాల్యము గలది, పుష్పముల గంధమును వ్యాపింపచేయుచున్నది అయిన సుందరమైన కుంభకర్ణుని నివాసగుహ దగ్గరకు వెళ్ళి కుంభకర్ణుని నిఃశ్వాసములు కదల్చివేయుచుండగా అతికష్టముమీద నిలద్రొక్కుకొని ఆ గుహలోనికి ప్రవేశించిరి. వాళ్లు రత్నములతోను బంగారముతోను నిర్మించిన చపటాతో రమ్యమైన ఆ గుహలో ప్రవేశించి, అక్కడ నిద్రించుచున్న భయంకరమైన పరాక్రమము గల కుంభకర్ణుణ్ణి చూచిరి. అతడు చూచేవారికి వికారముగా కనబడునట్లు నిద్రపోవుచుండెను. పడవేయబడిన పర్వతమువలె ఉండెను. ఈ విధముగా మహానిద్రలో ఉన్న కుంభకర్ణుణ్ణి ఆ రాక్షసులందరూ కలసి ఒక్కుమ్మడిగా మేల్కొలుపుటకు ప్రయత్నించిరి. (22-26)

కుంభకర్ణుని శరీరముపై ఉన్న రోమాలు పైకి నిలబడి ఉండెను. అతడు సర్పమువలె బుసలు కొట్టుచుండెను. శయనించి ఉన్న, భయంకరమైన పరాక్రమము గల అతడు విడచు శ్వాసల వేగమునకు ఆ రాక్షసులు ఎగిరి తిరిగిపోవుచుండిరి. భయంకరములైన ముక్కురంధ్రములతో, పాతాళమువంటి విశాలమైన నోటితో అతడు అన్ని అవయవాలు శయ్యమీద పడవేసి నిద్రించుచుండెను. అతని శరీరమునుండి కొవ్వు వాసన,రక్తము వాసన వచ్చుచుండెను. బంగారు బాహుపురులు అతని శరీరముపై కట్టబడి ఉండెను. కిరీటముచేత సూర్యుడువలె ప్రకాశించుచుండెను. (27-29)

ఆ రాక్షసులు చాలా తృప్తిని కలిగించు మేరుపర్వతము వంటి(చంపిన) ప్రాణుల రాశిని కుంభకర్ణుని ఎదుట ఉంచిరి. లేళ్ళు, దున్నపోతులు, వరాహములు - వీటి ప్రోగులను, విచిత్రమైన అన్నరాశిని, రక్తము నింపిన కుంభములను, అనేకవిధములైన మాంసములను కుంభకర్ణుని ఎదుట ఉంచిరి. చాలా శ్రేష్ఠమైన చందనము అతని శరీరమునకు పూసి శ్రేష్ఠములైన పుష్పమాలలు, మంచి సువాసన గల సుగంధద్రవ్యములు వాసన చూపిరి. ధూపగంధములను ప్రసరింపజేసిరి. అతనిని స్తుతించిరి. మాటిమాటికి మేఘముల వలె గర్జించిరి. చంద్రునివంటి కాంతి గల శంఖములను పూరించిరి. విసుగు చెంది ఒక్కమాటుగా బిగ్గరగా అరచిరి. అతని శరీరముమీద చరచిరి. చేతులు మొదలైన అవయవాలు ఎత్తి పడవేసిరి. అత్యధికమైన ధ్వని చేసిరి. శంఖ-భేరీ-పణవముల ధ్వనిని, జబ్బలు చరచుట, గర్జించుట, సింహనాదము చేయుట-వీటి ధ్వనిని విని, పక్షులు పది



దిక్కులకు పారిపోయి, ఆకాశములోనికి ఎగిరి, వెంటనే నేలమీద పడిపోయినవి.(30-37)

నిద్రించుచున్న ఆ కుంభకర్ణుదు ఇంత అధికమైన ధ్వని చేసినను నిద్రనుండి లేవకపోవుటచే ఆ రాక్షసులందరు అతనిని కొట్టుటకై ముద్గరములను, ముసలములను, గదలను గ్రహించిరి. నేలమీద నిద్రించుచున్న వానిని పర్వతశిఖరములతోను, ముసలములతోను, గదలతోను, ముద్గరములతోను, పిడికిళ్ళతోను వక్షఃస్థలముమీద కొట్టిరి. బలవంతులైనను ఆ రాక్షసులు కుంభకర్ణుని శ్వాసల గాలికి వాని ఎదుట నిలబడజాలకపోయిరి. వాళ్లు గట్టిగా నిలద్రొక్కికొని మృదంగములను, పణవములును, భేరీలను, శంఖములను, కుంభములును మ్రోగించిరి. నల్లని కాటుక ప్రోగువంటి ఆకారము గల అతనిని పదివేలమంది రాక్షసులు ఒక్కమారుగా చుట్టుముట్టి మేల్కొలుపుటకై యత్నించిరి. కాని అతడు మేల్కొనలేదు.(38-42)

ఇంతచేసినా అతనిని మేల్కొలుపజాలకపోవుటచేత వాళ్ళు అంతకంటె అధికము, భయంకరము అయిన ప్రయత్నమును ప్రారంభించిరి. గుఱ్ఱములను, ఒంటెలను, గాడిదలను, ఏనుగులను, కఱ్ఱలతోను, కొరడాలతోను, అంకుశములతోను కొట్టి అతని శరీరముమీద నడిపించిరి. తమ ప్రాణబలము నంతా ఉపయోగించి భేరీశంఖమృదంగములను మ్రోగించిరి. పెద్ద కఱ్ఱలతోను, స్తంభాలతోను, బలమునంతా ఉపయోగించి ఎత్తబడిన ముద్గరములతోను, ముసలములతోను అతని అన్ని అవయవముల మీదా కొట్టిరి. పర్వతములతోను, వనములతోను కూడిన లంకాపట్టణ మంతా ఆ ధ్వనితో మారుమ్రోగుచుండెను.

కాని అతడు మాత్రము మేల్కొనలేదు. పిమ్మట అన్నివైపులా వేయి భేరీలను అమర్చి, పరిశుద్ధమైన బంగారు దండములతో ఒక్కమారు వాటిని మ్రోగించిరి.(43-47)

ఇంతచేసినా కూడ శాపమునకు వశుడై మహానిద్రలో ఉన్న ఆ కుంభకర్ణుడు మేల్కొనకపోవుటచేత భయంకరమైన పరాక్రమము గల ఆ రాక్షసులందరికీ చాల క్రోధము కలిగెను. కొందరు ఆ కుంభకర్ణుని మేల్కొలుపుటకై తమ బలమునంతా చూపిరి. కొందరు భేరీలు మ్రోగించిరి. కొందరు అధికముగా ధ్వని చేసిరి. కొందరు అతని జుట్టు పీకిరి. మరికొందరు చెవులు కొరికిరి. కొందరు వందలకొలది నీళ్ళకుండలను అతని చెవులలో వంచిరి. మహానిద్రకు వశుడై ఉన్న కుంభకర్ణుడు కొంచెము కూడ కదలలేదు. కూటములు, ముద్గరములు చేతులో ధరించి ఉన్న మరికొందరు బలశాలులైన రాక్షసులు అతని శిరస్సుపైన, వక్షఃస్థలముమీద, అవయవములమీద కూటములను ముద్గరములను పడవేసిరి. త్రాళ్ళచేత కట్టబడిన శతఘ్నులతో అన్నివైపులా కొట్టినా కూడ ఆ కుంభకర్ణునికి మెలకువ రాలేదు. (48-53)

పిదప వాళ్లు అతని శరీరము మీద వేయి ఏనుగులను పరుగెత్తించిరి. అప్పుడు కుంభకర్ణునకు కొంచెము మెలకువ వచ్చి స్పర్శమాత్రమే తెలిసెను. అతడు తన మీద పర్వతశిఖరములను, వృక్షములను పడవేయుటవలన తగిలిన ఆ పెద్ద దెబ్బలకు లెక్కచేయక, ఆకలిచేతను, అకాలములో లేపినందుకు భయముచేతను పీడితుడై ఆవులించుచు వెంటనే లేచెను. సర్పదేహముతోను, పర్వతశిఖరములతోను సమానములైన వజ్రాయుధసారమును జయించిన రెండు బాహువులను ఎత్తి, బడబాముఖము వంటి నోరు తెరిచి, వికృతముగా ఆవులించెను. పెద్దగా ఆవులించుచున్న అతని పాతాలమువంటి ముఖము మేరుపర్వత శిఖరాగ్రమునందు ఉదయించిన సూర్యుడువలె కనబడెను. గొప్పబలము గల ఆ రాక్షసుడు ఆవులించుచు లేచెను. ఆ సమయమున అతని శ్వాస కొండగాలివలె వ్యాపించెను. పైకి లేచుచున్న ఆ కుంభకర్ణుని ఆకారము ప్రళయకాలమునందు సకలభూతాలను కాల్చదలచుచున్న యముని అకారమువలె ఉండెను. అగ్నిజ్వాలవలె ఉన్న, మెరుపువంటి కాంతి గల అతని పెద్ద నేత్రములు ప్రజ్వలించుచున్న మహాగ్రహముల వలె కనబడుచుండెను.(54-60)

పిమ్మట అనేకవిధములైన చాలా భక్ష్యపదార్థములను, వరాహములను, దున్నపోతులను చూపగా అతడు వాటిని భక్షించెను. అప్పుడు కుంభకర్ణుడు

ఆకలిదప్పికలతో ఉండుటచే మాంసమును తినెను. రక్తమును, కొవ్వుకుండలను, మద్యములను త్రాగెను. ఇతడు తృప్తిచెందినాడు అని తెలిసికొనిన వెంటనే రాక్షసులు శీఘ్రముగా వచ్చి, తలలు వంచి నమస్కారముచేసి, అతని చుట్టూ నిలిచిరి. నిద్రచేత కుంభకర్ణుని కండ్లు మూతలు పడుచుండెను. కలుషములై ఉండెను. అట్టి కుంభకర్ణుడు నలువైపులా దృష్టిని ప్రసరింపచేసి చూచుచు, ఆ రాక్షసులందరికీ ధైర్యము చెప్పుచు, తనను లేపినందుకు ఆశ్చర్యపడుచు వారిని– "నన్ను మీరు ప్రయత్నపూర్వకముగా ఎందుకు మేల్కొలిపినారు? రాజు క్షేమముగా ఉన్నాడు కద! ఇపుడు భయమేమీ లేదు కద! లేదా శత్రువులవల్ల ఏదో గొప్ప భయము వచ్చి ఉండును. నిశ్చయము. అందుచేతనే మీరు తొందరపడుచు నన్ను నిద్రనుండి లేపినారు. ఇపుడు రాక్షసరాజైన రావణునికి కలిగిన భయమును తొలగించెదను. మహేంద్రుణ్ణి చీల్చివేయవలెనా లేదా అగ్ని చల్లగా ఉండునట్లు చేయవలెనా? ఎంతో పెద్ద కారణమున్ననే కాని రాక్షసరాజు నావంటివానిని నిద్రనుండి లేపడు. అందుచేత నన్ను లేపుటకు కారణమేమో యథార్థముగా చెప్పుడు." అని అడిగెను. (61–69)

చాల ఆతురతతో ఈ విధముగా మాటలాడుచున్న శత్రుసంహారకుడైన కుంభకర్ణునితో రావణుని మంత్రియైన యూపాక్షుడు, అంజలి ఘటించి నమస్కరించి– "రాజా! మాకెన్నడూ దేవతలవలన భయ మేమాత్రమూ లేదు. మనుష్యునివలన కలిగిన గొప్ప భయము మమ్ములను బాధించుచున్నది. మాకు మనుష్యునివలన ఎంత భయము వచ్చిపడినదో అంత భయము దైత్యులనుండి గాని, దానవులనుండి గాని లేదు. పర్వతములవంటి ఆకారములు గల వానరులు ఈ లంకను చుట్టుముట్టి ఉన్నారు. సీతను హరించుటవలన దుఃఖితుడైన రామునినుండి మాకు గొప్ప భయము వచ్చినది. పూర్వము ఒక్క వానరుడు వచ్చి లంకామహానగరమును కాల్చివేసి పరివారముతోను, ఏనుగులతోను సహా అక్షకుమారుణ్ణి చంపివేసినాడు. దేవతలకు కంటకమువంటివాడు, రాక్షసరాజు అయిన సాక్షాత్తు రావణుణ్ణి కూడ సూర్యునివంటి తేజస్సు గల రాముడు యుద్ధములో ఓడించి "వెళ్ళుము" అని పలికి విడచినాడు. మన రాజునకు దేవతలు గాని, దైత్యులు గాని, దానవులు గాని ఎట్టి స్థితిని కలిగింప లేకపోయినారో అట్టి స్థితిని కల్పించి రాముడు అతనిని ప్రాణసంశయస్థితి నుండి విడచినాడు." అని పలికెను. (70–76)

కుంభకర్ణుడు యూపాక్షుని మాటల ద్వారా యుద్ధములో సోదరునికి జరిగిన పరాభవము గూర్చి విని కోపముతో కళ్ళు త్రిప్పుచు యూపాక్షునితో– "యూపాక్షుడా! ఇప్పుడే నేను వానరసైన్యము నంతనూ, రామలక్ష్మణులనూ యుద్ధములో జయించి

పిమ్మట రావణుని చూచెదను. వానరుల రక్తమాంసములచేత రాక్షసులకు తృప్తి కలిగించి రామలక్ష్మణుల రక్తమును నేనే త్రాగెదను." అనెను. గర్వముతో కూడినది, రోషముచేత అధికమైన దోషము కలది అయిన ఆ కుంభకర్ణుని వాక్యమును విని రాక్షసయోధులలో ముఖ్యుడైన మహోదరుడు చేతులు జోడించి నమస్కరించి- "గొప్ప బాహువులు గలవాడా! రావణుడు ఏమి చెప్పునో విని, గుణదోషముల విమర్శచేసి, పిమ్మట యుద్ధములో శత్రువులను జయించుము." అని పలికెను. గొప్ప తేజస్సూ, బలమూ గల కుంభకర్ణుడు మహోదరుని మాటలు విని రాక్షసులతో కలసి బయలుదేరెను. (77-82)

రాక్షసులు భయంకరములైన నేత్రములు, రూపము, పరాక్రమమూ గల నిద్రించుచున్న ఆ కుంభకర్ణుణ్ణి లేపి శీఘ్రముగా రావణుని ఇంటికి వెళ్ళి, ఉత్తమమైన ఆసనముపై కూర్చొని ఉన్న రావణుని దగ్గర చేతులు జోడించి నమస్కరించుచు- "రాక్షసరాజా! నీ సోదరుడైన ఈ కుంభకర్ణుడు నిద్రనుండి లేచినాడు. అతడు 'అక్కడినుండియే యుద్ధమునకు వెళ్ళవలెనా లేక నిన్ను చూచుటకై ఇక్కడికి రావలెనా?' అని అడిగెను." అని చెప్పిరి. రావణుడు సంతోషించి ఆ రాక్షసులతో - "కుంభకర్ణుణ్ణి ఇక్కడనే చూడవలెనని కోరుచున్నాను. న్యాయానుసారముగా అతనిని సత్కరించి తీసికొని రండు". అనెను. ఆ రాక్షసు లందరూ అట్లే చేసెదము అని పలికి, రావణుని ఆజ్ఞ ప్రకారము తిరిగి వచ్చి కుంభకర్ణునితో- "సమస్తరాక్షసులలో శ్రేష్ఠుడైన రాజు నిన్ను చూడవలెనని అనుకొనుచున్నాడు. అందుచేత అచటికి వెళ్ళి నీ సోదరునకు సంతోషము కలిగించుము." అని పలికిరి. (83-88)

కుంభకర్ణుడు అన్నగారి ఆజ్ఞను తెలిసికొని, ""అట్లే చేసెదను" అని పలికి శయనమునుండి లేచెను. కుంభకర్ణుడు సంతోషముతో ముఖప్రక్షాళనము చేసికొని, స్నానము చేసి, బాగా అలంకరించుకొని, దప్పికొన్నవాడై, బలమును వృద్ధి పొందించు పానమును తీసికొని రమ్మని తొందరచేసెను. అప్పుడు రావణాజ్ఞచేత కుంభకర్ణుణ్ణి తీసికొనివెళ్ళుటకై తొందరపడుచున్న రాక్షసులు మద్యమును, అనేకవిధములైన భక్ష్యములను అచటికి తీసికొనివచ్చిరి. సహజముగా మత్తుడైన అతడు రెండువేల ఘటముల మద్యము త్రాగి, ఇంకా కొంచెము మత్తెక్కి, తేజోబలములతో కూడినవాడై బయలుదేరెను. రాక్షససైన్యముతో కలసి సోదరుని ఇంటికి వెళ్ళుచున్న, కోపించిన ఆ కుంభకర్ణుడు ప్రళయకాలమునందు లోకసంహారము చేయునున్న యముడువలె ఉండెను. అతడు పాదన్యాసములచేత భూమిని కంపింపచేసెను. ఆ కుంభకర్ణుడు

తన దేహముచేత రాజమార్గమును, సూర్యుడు కిరణములచేత భూమిని ప్రకాశింపచేయుచున్నట్లు ప్రకాశింపచేయుచు, చుట్టూ దోసిళ్ళ పంక్తులతో కూడినవాడై, దేవేంద్రుడు బ్రహ్మదేవుని గృహమునకు వెళ్ళినట్లు రావణుని గృహమునకు వెళ్ళెను.(89-94)

శత్రువులను నశింపచేయువాడైన, పర్వతశిఖరమువలె ఉన్న, ఊహింపశక్యము కాని ఆ కుంభకర్ణుణ్ణి రాజమార్గములో ఉండగా హటాత్తుగా చూచి, లంకకు వెలుపల ఉన్న ఆ వానరులు, వానరనాయకులూ కూడ భయపడిరి. కొందరు శరణాగతరక్షకుడైన రాముణ్ణి శరణుజొచ్చిరి. కొందరు వ్యథ చెంది పడిపోయిరి. మరికొందరు దిక్కులు పట్టి పారిపోయిరి. కొందరు భయపీడితులై నేలమీద పండుకొనిరి. కిరీటమును ధరించి పర్వతశిఖరమువలె ఉన్న ఆ కుంభకర్ణుడు తన తేజస్సుచేత సూర్యుణ్ణి స్పృశించుచున్నాడా అన్నట్లు ఉండెను. అత్యాశ్చర్యకరముగా పెరిగిపోయిన దేహము గల అతనిని చూడగానే వానరులు భయకంపితులై ఇటు అటు పారిపోయిరి.(95-97)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువదవ సర్గము సమాప్తము.

అరువది ఒకటవ సర్గము

విభీషణుడు కుంభకర్ణుని గూర్చి రామునకు చెప్పుట. రాముని ఆజ్ఞచే వానరులు లంకాద్వారముల వద్ద నిలచుట.

గొప్ప తేజస్సు, పరాక్రమము గల రాముడు ధనుస్సును గ్రహించి, పెద్ద దేహము గల కిరీటము ధరించిన ఆ కుంభకర్ణుణ్ణి చూచెను. పూర్వము ఆకాశమును ఆక్రమించుచున్న సర్వలోకప్రభువైన నారాయణుడు వలె ఉన్న, పర్వతమువంటి ఆకారముతో కనబడుచున్న రాక్షసశ్రేష్ఠుడైన అతనిని చూచి రాముడు సన్నద్ధుడాయెను. నీటితో నిండిన మేఘమువలె ఉన్న ఆ కుంభకర్ణుడు బంగారు బాహుపురులను అలంకారముగా ధరించెను. అతనిని మరల చూచి గొప్పదైన ఆ వానరసేన పారిపోయెను. పారిపోవుచున్న సైన్యమును, శరీరము పెంచుచున్న రాక్షసుణ్ణి చూచి రాముడు ఆశ్చర్యపూర్వకముగా విభీషణుని– "కిరీటము ధరించిన, పచ్చని కళ్ళు గల, పర్వతమువంటి వీరుడు లంకలో మెరుపుతో కూడిన మేఘమువలె కనబడుచున్నాడు. ఇతడు ఎవరు? ఇక్కడ పెద్ద దేహము కల యీతడొక్కడే ఈ

భూమియందు ధ్వజమువలె కనబడుచున్నాడు. ఇతనిని చూచి వానరు లందరూ ఇటూ అటూ పారిపోవుచున్నారు. పెద్దదేహము గల ఇతడెవరు? రాక్షసుడా, అసురుడా? చెప్పుము. నేను యిట్టి భూతమును(ప్రాణిని) పూర్వమెన్నడూ చూచి ఉండలేదు." అని ప్రశ్నించెను.(1-7)

రాముడు ఇట్లు ప్రశ్నించగా మహాబుద్ధిశాలియైన విభీషణుడు- "రామా! ఇతడు విశ్రవసుని కుమారుడైన ప్రతాపవంతుడైన కుంభకర్ణుడు. ఇతడు యుద్ధములో యముణ్ణీ, ఇంద్రుణ్ణీ ఓడించినాడు. ఇతని దేహప్రమాణముతో సమానమైన ప్రమాణము కల మరియొక రాక్షసు డెవ్వడూ లేడు. ఇతడు యుద్ధములో దేవదానవులనూ, యక్ష-నాగ-రాక్షసులనూ, గంధర్వ-విద్యాధర-పన్నగులనూ వేలకొలది ఓడించినాడు. వికృతములైన నేత్రములతో శూలము చేత ధరించిన మహాబలవంతుడైన కుంభకర్ణుణ్ణి చూచి, దేవతలు ఇతడు మృత్యుదేవత యని భ్రాంతిపడి చంపజాలకపోయిరి. ఈ కుంభకర్ణునకు సహజముగానే గొప్ప తేజస్సూ, బలమూ ఉన్నవి. ఇతరరాక్షసుల కైతే బలము వరదానముచేత లభించినది. ఇతడు పుట్టీపుట్టగానే ఆకలితో బాధపడుచూ, ఎన్నో వేల ప్రాణులను భక్షించెను. ఆ ప్రాణులను కుంభకర్ణుడు భక్షించుచుండగా ప్రజలు భయపీడితులై ఇంద్రుని శరణుజొచ్చి, అతనికి ఆ విషయమును తెలిపిరి. వజ్రధారియైన ఇంద్రుడు కోపించి కుంభకర్ణుణ్ణి వజ్రముతో కొట్టెను. ఇంద్రుడు వజ్రముతో కొట్టగా మహాత్ముడైన కుంభకర్ణుడు చలించి కోపముతో బిగ్గరగా అరచెను. ముందుగానే భయపడుచున్న ప్రజలు బిగ్గరగా అరచుచున్న ఆ కుంభకర్ణుని అరపులు విని ఇంకనూ భయపడిరి. అప్పుడు మహేంద్రునిపై కోపముతో గొప్ప బలము కల కుంభకర్ణుడు ఐరావతము దంతమును ఊడబెరికి అతని వక్షస్థలము మీద కొట్టెను.(8-17)

కుంభకర్ణుడు కొట్టుటచే పీడితుడైన దేవేంద్రుడు సంతాపము చెందెను. అది చూడగానే దేవతలూ, బ్రహ్మర్షులూ, దానవులూ దిగులు చెందిరి. దేవేంద్రుడు ప్రజలతో కలసి బ్రహ్మలోకమునకు వెళ్లెను. కుంభకర్ణుడు ప్రజలను భక్షించుచున్నాడనీ, దేవతలను ఎదిరించుచున్నాడనీ, ఆశ్రమములను నశింపచేయుచున్నాడనీ, పరస్త్రీలను హరించుచున్నాడనీ వారు బ్రహ్మదేవునకు కుంభకర్ణుని దుష్టబుద్ధిని గూర్చి తెలిపిరి. 'ఇతడు ప్రతిదినమూ ఈ విధముగా ప్రజలను భక్షించినచో కొంచెము కాలములోనే ఈ లోకము ప్రాణిశూన్యము ఐపోవును.' ఇంద్రుని మాటలు విని బ్రహ్మదేవుడు రాక్షసులను తన దగ్గరకు రప్పించుకొని కుంభకర్ణుణ్ణి చూచెను. కుంభకర్ణుణ్ణి చూడగానే బ్రహ్మదేవుడు కూడ భయపడెను. కొంత సేపటికి తెప్పరిల్లి

అతడు కుంభకర్ణునితో– 'విశ్రవసుడు నిన్ను నిశ్చయముగా లోకనాశముకొరకే సృష్టించినాడు. అందుచే నీవు నేటి నుండి చచ్చినవాడవు వలె పడి ఉందువు.' అని శపించెను.(18-24)

అప్పుడు అతడు బ్రహ్మదేవుని శాపము తగిలి ఆయన సమక్షమునందే క్రింద పడిపోయెను. అది చూచి చాల క్షోభచెందిన మనస్సుతో రావణుడు– 'ఓ! బ్రహ్మదేవుడా! పెరిగిన బంగారు వృక్షమును ఫలములిచ్చే కాలమునందు నరికివేయుచున్నావు. నీ మునిమనుమడైన వీనిని ఇట్లు శపించుట న్యాయము కాదు. నీ మాట వ్యర్థమగుటకు కూడ వీలులేదు. ఇతడు తప్పక నిద్రించవలసినదే. సందేహములేదు. కాని ఇతడు నిద్రించుటకూ, మేల్కొనుటకూ కాలమును నిర్ణయించి చెప్పుము.' అని ప్రార్థించెను. రావణుని మాటలు విని బ్రహ్మదేవుడు– 'ఇతడు ఆరు మాసములు నిద్రించగలడు. ఒక రోజున మేల్కొనగలడు. ఆ ఒక్కరోజున ఈ వీరుడు ఆకలిగొని నోరు తెరుచుకొని భూమి మీద తిరుగుచు విజృంభించిన అగ్నివలె లోకములను భక్షించగలడు.' అని పలికెను.'(25-29)

"ఇప్పుడు కష్టములలో చిక్కుకొని నీ పరాక్రమమునకు భయపడిన రాక్షసరాజైన రావణుడు కుంభకర్ణుణ్ణి నిద్రనుండి లేపించినాడు. భయంకరమైన పరాక్రమము గల అట్టి ఈ వీరుడైన కుంభకర్ణుడు శిబిరమునుండి బయలుదేరినాడు. మిక్కిలి కోపించి ఇతడు వానరులను భక్షించుచు పరుగెత్తి వచ్చుచున్నాడు(రానున్నాడు). ఈ వానరులు కుంభకర్ణుణ్ణి చూడగానే పారిపోవుచున్నారు. యుద్ధములో క్రోధావిష్టుడైన ఇతనిని ఎట్లు నివారించగలరు? ఇది పైకి లేవదీయబడిన ఒక యంత్రము అని వానరులకు చెప్పుట మంచిది. అప్పుడు వానరుల భయము తొలగిపోవును' అని చెప్పెను.(30-33)

వానరులు యుద్ధమునకు సుముఖు లగుటకై విభీషణుడు యుక్తియుక్తముగా పలికిన మాటలు విని, అప్పుడు, రాముడు సేనాపతియైన నీలునితో– "ఓ! నీలుడా! వెళ్ళుము; సైన్యము లన్నింటినీ మోహరించి లంకాద్వారములను వీథులను,(రోడ్లను) వంతెనలను ఆక్రమించి ఉండుము. పర్వతశిఖరములను, వృక్షములను శిలలను ఒకచోట చేర్చుము. వానరు లందరూ ఆయుధములు ధరించి, పర్వతములను చేతులతో గ్రహించి నిలచెదరుగాక." అని పలికెను. వానరసేనానాయకుడైన నీలుడు రాముని ఆజ్ఞప్రకారము వానరసేన తగు రీతిగా ఆ యా స్థానములందుండునట్లు నియమించెను. పర్వతములవంటి శరీరములు గల

గవాక్షుడు, శరభుడు, హనుమంతుడు, అంగదుడు పర్వతశిఖరములు ధరించి ద్వారమువద్దకు వెళ్ళిరి. రాముని వాక్యమును విని భయము లేని ఆ వానరవీరులు వృక్షములచేత శత్రుసైన్యమును పీడించిరి. చేతులలో వృక్షములు, పర్వతములు ఎత్తి నిలచిన ఆ భయంకరమైన వానరసైన్యము, పర్వతమునకు ప్రక్కగా చేరిన పెద్ద మేఘసముదాయము వలె ప్రకాశించెను. (34-40)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువది ఒకటవ సర్గము సమాప్తము.

అరువది రెండవ సర్గము

రామునివలన ఏర్పడిన భయమును గూర్చి చెప్పి రావణుడు శత్రుసేనావినాశనము చేయు మని కుంభకర్ణుని కోరుట.

నిద్రమత్తులో ఉన్న అధికపరాక్రమశాలియైన ఆ కుంభకర్ణుడు శోభాయుక్తమైన రాజమార్గములో ప్రవేశించెను. ఏమాత్రమూ జయింపశక్యము కాని ఆ కుంభకర్ణుడు వేలకొలది రాక్షసులు వెంట రాగా, గృహములనుండి పుష్పవర్షము కురియుచుండగా వెళ్ళెను. అతడు విశాలమూ, రమ్యమూ అయిన రావణుని గృహమును చూచెను. బంగారు కిటికీలతో నిండిన ఆ గృహము సూర్యుడు వలె ప్రకాశించుచుండెను. అతడు, సూర్యుడు మేఘసముదాయములో ప్రవేశించినట్లు రావణుని గృహములో ప్రవేశించి, ఆసనముపై కూర్చొని ఉన్న అన్నగారిని, దేవేంద్రుడు ఆసనముపై కూర్చున్న బ్రహ్మదేవుణ్ణి చూచినట్లు దూరమునుండి చూచెను. ఆ కుంభకర్ణుడు రాక్షసుల సముదాయముతో కలిసి సోదరుని గృహమునకు వెళ్ళుచు పాదన్యాసములచేత భూమిని చలింపచేసెను. అతడు సోదరుని ఇల్లు చేరి, వాకిలిలోనికి ప్రవేశించి, పుష్పకవిమానములో కూర్చొని ఉన్న, దిగులుచెందిన అన్నగారిని చూచెను. (1-6)

రావణుడు వచ్చిన కుంభకర్ణుణ్ణి చూచి, వెంటనే సంతోషముతో లేచి తన దగ్గరకు రప్పించుకొనెను. కుంభకర్ణుడు సోఫామీద కూర్చున్న అన్నగారికి పాదాభివందనము చేసి, "ఏమి చేయవలెను" అని ప్రశ్నించెను. రావణుడు శీఘ్రముగా లేచి అతనిని కౌగిలించుకొనెను. సోదరునిచేత కౌగిలించుకొనబడి తగు విధముగా అభినందింపబడిన కుంభకర్ణుడు మంగళప్రదము, ఉత్తమము, శ్రేష్ఠము అయిన

ఆసనమును స్వీకరించెను. అతడు ఆసనముపై కూర్చుండి, కోపముచేత కళ్ళు ఎఱ్ఱబడగా రావణునితో- "రాజా! నీవు నన్ను ప్రయత్నపూర్వకముగా ఎందుకు మేల్కొలిపితివి? నీకు ఎవనివలన భయము వచ్చినదో, ఎవనిని చంపవలెనో చెప్పుము." అని అడిగెను.(7-11)

క్రోధావిష్టుడైన సోదరుడైన కుంభకర్ణునితో రావణుడు కోపముచేత తిరుగుచున్న నేత్రములతో- "ఓ! మహాబలవంతుడా! నీవు చాలా కాలము క్రితమే నిద్రించితివి. నిద్రించిన నీకు రామునివలన నాకు కలిగిన భయమును గూర్చి తెలియదు. దశరథకుమారుడైన బలశాలియైన ఈ రాముడు సుగ్రీవసహితుడై సముద్రమును దాటి వచ్చి మన కులమును ఛేదించుచున్నాడు. వానరులు సేతువుచేత సుఖముగా వచ్చి లంకలోని వనములను, ఉద్యానములను వానరసముద్రముగా చేసినారు; అయ్యో! చూడుము! వానరులు యుద్ధములో ప్రధానులైన రాక్షసులను చంపివేసినారు. యుద్ధములో వానరులెవ్వరూ ఏ విధముగానూ కూడ నశించుచున్నట్లు కనబడుటలేదు. వానరులు పూర్వము ఎన్నడూ యుద్ధములో ఓడిపోయినట్లు లేదు. గొప్ప బలము కలవాడా! ఇట్టి భయము ప్రాప్తించినది. నీవు ఈ విషయమున రక్షించుము. ఇపుడు వీళ్ళ నందరినీ నశింపచేయుము. అందుకొరకే నిన్ను మేల్కొలిపితిని.(12-18)

ధనాగార మంతా పూర్తిగా శూన్యమైపోయిన నన్ను ఆదుకొనుము. బాలులూ, వృద్ధులూ మాత్రమే మిగిలిన ఈ లంకాపురమును రక్షించుము. గొప్ప బాహువులు గలవాడా! చేయశక్యము కాని ఈ గొప్ప పనిని నీవు నీ సోదరునికొరకై చేయవలెను. శత్రుసంహారకుడవైన ఓ! సోదరా! పూర్వము నే నెవ్వరినీ, ఎన్నడూ ఈ విధముగా కోరియుండలేదు. నాకు నీ విషయమున చాలా స్నేహము, గౌరవభావము కూడ ఉన్నవి. ఓ! రాక్షసశ్రేష్ఠుడా! నీవు అనేక పర్యాయములు దేవాసురయుద్ధములయందు వాళ్ళను ఎదిరించి దేవతలను, అసురులను జయించితివి. భయంకరమైన పరాక్రమముగలవాడా! అందువలన, నీ పరాక్రమమును అంతనూ చూపుము. నీవంటి బలముగలవాడు ఏ ప్రాణులలోను లేడుకదా? యుద్ధమునందు ఆసక్తి కలవాడవు, బంధువులయందు ప్రేమ ఉన్నవాడవు అయిన ఓ! సోదరా! నాకు ప్రియము, హితము అయిన ఈ కార్యమును, నీకు ఎట్లు ప్రియ మగునో ఆ విధముగా చేయుము. విజృంభించిన గొప్ప వాయువు శరత్కాలమేఘమును ఎగురగొట్టినట్లు, నీ తేజస్సుచేత శత్రుసేనను ఎగురగొట్టివేయుము." అని పలికెను.(19-23)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువది రెండవ సర్గము సమాప్తము.

అరువది మూడవ సర్గము

కుంభకర్ణుడు మొదట రావణుని నిందించి, చివరకు తన యుద్ధోత్సాహమును ప్రకటించుట.

రావణుడు దుఃఖముతో పలికిన దీనవాక్కులను విని కుంభకర్ణుడు బిగ్గరగా నవ్వి ఇట్లు పలికెను – "మహారాజా! పూర్వము మంత్రణముచేసినప్పుడు మనము ఏ దోషమును (ఆపదను) ఊహించితిమో అదే ఈనాడు, హితుల మాటలను లక్ష్యముచేయని నీకు సంప్రాప్తించినది. పాపాత్మునకు నరకములో పడుట ఎట్లు సంప్రాప్తించునో అట్లే నీకు పాపకర్మఫలము సంప్రాప్తించినది. ఈ కార్యమును గూర్చి ముందుగా ఆలోచన చేయలేదు. పరాక్రమగర్వముచేత కలుగబోవు ఫలితమును గూర్చి ఆలోచించలేదు. బలమున్నది కదా అని ముందు చేయవలసిన పనులు తరువాత, తరువాత చేయవలసిన పనులు ముందూ చేయువాడు ఏది నీతియో ఏది కాదో తెలిసికొనజాలడు. దేశకాలములు అనుకూలముగా ఉన్నవా లేదా అని చూచుకొనకుండా విపరీతముగా చేయు పనులు అపవిత్రుల చేతిలోని హవిస్సులు వలె చెడిపోవును. ఎవడు మంత్రులతో బాగా ఆలోచించి, మూడు విధములైన కర్మలను ఐదువిధాలైన సాధనాలతో సాధించుకొనునో అతడే మంచి నీతి మార్గమునం దున్నవాడు. మంచి నీతిమార్గమునందున్న రాజు శాస్త్రానుసారము నిర్ణయము చేయును. తన బుద్ధితో ఆలోచించి, మంత్రులతోను, మిత్రులతోను కూడ ఆలోచన చేయును. రాక్షసరాజా! బుద్ధిమంతుడైన పురుషుడు ధర్మార్థకామములను వేరువేరుగా గాని, అన్నింటినీ గాని, ధర్మార్థములు, ధర్మకామములు, అర్థకామములు అను మూడు ద్వంద్వములను గాని కాలానుసారముగా సేవించవలెను. ధర్మార్థకామములలో ఏది ఏ సమయమునందు శ్రేష్ఠమైనదో తెలిసికొనని రాజు గాని, రాజసదృశుడుగాని చేసిన శాస్త్రాభ్యాసము వ్యర్థము. మంత్రులతో కూడా ఆలోచించి దానమును, సామమును, భేదమును తగు సమయమునందు పరాక్రమమును, కర్మారంభోపాయము మొదలైన పంచవిధసాధనముల యోగమును, కాలానుగుణముగా ధర్మార్థకామములను సేవించు బుద్ధిమంతుడు లోకములో ఆపదలు పొందడు.(1-12)

రాజు కార్యముల యథార్థస్వరూపము తెలిసిన బుద్ధిజీవులైన మంత్రులతో కలసి ఎట్లు చేసిన తనకు హితము కలుగునో ఆలోచించుకొని కార్యములు చేయవలెను. పశువులవంటి బుద్ధిగల వారికి ఆలోచనలు చేయునప్పుడు అవకాశ మిచ్చినచో



వాళ్ళు శాస్త్రవిషయములు తెలిసికొనకుండగా ప్రాగల్భ్యమువలన ఏమేమో చెప్పుచుందురు. శాస్త్రజ్ఞానము లేక, అర్థశాస్త్రము ఎరుగక అధికమైన ఐశ్వర్యమును మాత్రము కోరుచుండు అట్టివాళ్ళు చెప్పిన విధముగా చేయకూడదు. ఏ మానవులు హితమువలె కనబడు అహితమును ధార్ష్ట్యమువలన ఉపదేశించుచుందురో వారిని కార్యాలోచనలనుండి దూరముగా ఉంచవలెను. అట్టివాళ్ళు కార్యములను పాడుచేయుదురు. కొందరు మంత్రులు పండితులైన శత్రువులతో కలసి తమ ప్రభువునకు అపకారము చేయుచు అతనిచేత చెడ్డపనులు చేయించుచుందురు. శత్రువులనుండి లంచము మొదలైనవి తీసికొని మారిపోయి, పైకి మిత్రులవలె కనబడు అమిత్రులైన మంత్రులను రాజు మంత్రమును నిర్ణయించు సమయమునందు వారి వ్యవహారమును బట్టి గుర్తించవలెను. చపలచిత్తుడై తొందరపడి పనులు చేయువారిలో ఉండు లోపాలను,(కుమారస్వామి బాణము ప్రయోగించి చేసిన) క్రౌంచపర్వతరంధ్రములో పక్షులు ప్రవేశించి నట్లు, శత్రువులు తమకు అనుకూలముగా ఉండునట్లు చేసికొనుచుందురు. శత్రువు విషయమున అనాదరము చూపుచు తనను రక్షించుకొననివాడు అనర్థములను పొందును. తన స్థానమునుండి దింపివేయబడును. నీకు పూర్వము విభీషణుడు చెప్పినట్లు చేయుము. మనకు అదే హితమైనది. అట్లు కానిచో నీకు ఏది ఇష్టమో అది చేయుము."(13-21)

కుంభకర్ణుని మాటలు విని రావణుడు కోపముతో కనుబొమ్మలు విరచి- "గౌరవింపదగిన పెద్ద ఆచార్యుడు వలె నాకు ఉపదేశించుచున్నా వేమిటి! అనవసరముగా మాటలాడి ఎందుకు శ్రమ పడెదవు? ఈ సమయమున ఏది చేయుట యుక్తమో అది చేయుము. భ్రాంతివలననో, చిత్తమోహమువలననో, బలపరాక్రమములు చూచుకొనో పూర్వము తెలియక చేసినదానిని గూర్చి ఇప్పుడు చర్చించుట అనావశ్యకము. ఈ సమయమునందు ఏది యుక్తమో దానిని గూర్చి ఆలోచించుము. బుద్ధిమంతులు అయిపోయినదానిని గూర్చి ఆలోచించరు. గడిచిపోయినది గడిచిపోయినదే. నీకు నాయందు స్నేహ మున్నచో, నీ కెంతటి పరాక్రమమున్నదో తెలిసికొన్నచో, ఈ నా కార్యము తప్పక చేయదగినది అని నీ మనస్సు అంగీకరించినచో, నా పొరబాటువలన కలిగిన దుఃఖమును నీ

పరాక్రమముచేత సరిచేయుము. పని చెడిపోయిన దీనుణ్ణి ఆదుకొనువాడే స్నేహితుడు. నీతి తప్పిన వానికి సాహాయ్యము చేయుటకు ముందుకు వచ్చువాడే బంధువు." అనెను. (22-27)

కుంభకర్ణుడు ఈ విధముగా పలుకుచున్న రావణుని మాటలు విని, ఇతడు కోపించినాడని తెలిసికొని మెల్లగా, మృదువుగా మాటలాడెను. తన సోదరుడు మనస్సులో చాల క్షోభ చెందుచున్నట్లు గ్రహించి, కుంభకర్ణుడు అతనికి ధైర్యము చెప్పుచు మెల్లగా ఇట్లు పలికెను- "శత్రుసంహారకుడవైన రాజా! సావధానచిత్తుడవై నా మాట వినుము. రాక్షసరాజా! నీవు మనస్సులో బాధపడకుము. రోషమును విడచి స్వస్థుడవు అగుము. నేను జీవించి ఉండగా నీవు మనస్సులో ఇట్లు ఆలోచించకూడదు. ఎవనిమూలమున నీవు దుఃఖించుచున్నావో అతనిని నేను నశింపచేసెదను. నీవు ఎట్టి పరిస్థితులలో ఉన్నను నేను నీకు హితము తప్పక చెప్పవలెను. అందుచేత బంధుత్వమువలన, సోదరప్రేమవలనా నీకు ఇట్లు హితము చెప్పినాను. ఇట్టి సమయమునందు స్నేహవంతుడైన బంధువు యుద్ధములో ఏ విధమైన శత్రుసంహారమును చేయవలెనో ఆ విధమైన శత్రుసంహారమును నేను చేసెదను; చూడుము. ఓ! మహాబాహూ! నేడు యుద్ధమునందు నేను రామలక్ష్మణులను చంపివేయగా వానరసేన అంతా పారిపోవును; చూడుము. నేడు నేను యుద్ధమునుండి తీసికొని రాబోవు రాముని శిరస్సు చూచి సంతోషించుము; సీత దుఃఖించుగాక. బంధువులు మరణించిన లంకలోని రాక్షసు లందరూ ఈనాడు చాల ప్రియమైన రాముని మరణమును చూచెదరుగాక. ఈనాడు యుద్ధమునందు శత్రువును సంహరించి, తమ బంధువులు మరణించుటచేత దుఃఖాక్రాంతులైన రాక్షసుల కన్నీళ్ళు తుడిచెదను. (28-38)

సూర్యునితో కూడిన మేఘమువలె ఉన్న , పర్వతసదృశుడైన వానరరాజైన సుగ్రీవుణ్ణి నేడు యుద్ధములో క్రిందపడవేసెదను, చూడుము. ఓ! దోషరహితుడా! రాముణ్ణి చంపవలె నని నిర్ణయించిన ఈ రాక్షసులూ, నేనూ, ధైర్యము చెప్పుచుండగా ఎందుకు బాధపడుచున్నావు. రాక్షసరాజా! రాముడు నన్ను చంపిన పిమ్మట కదా నిన్ను చంపేది? నాకు నావిషయమున ఏమాత్రము దుఃఖములేదు. నీ ఇష్టానుసారము ఇప్పుడు కూడా నన్ను ఆజ్ఞాపించవచ్చును. యుద్ధమునకు పంపుటకై మరొకని కోసము వెదకవలసిన పనిలేదు. నేను గొప్పబలము గల నీ శత్రువులను నశింపచేసెదను. ఇంద్ర-యములైనా, అగ్ని-వాయువులైనా, కుబేర-వరుణులైనా అందరితోను యుద్ధము చేయగలను. పర్వతమువంటి శరీరము, వాడియైన కోరలు

గల నేను వాడియైన శూలమును ధరించి గర్జించుచుండగా దేవేంద్రుడు కూడ భయపడును. లేదా ఆయుధమును విడచి కూడ బలముచేత నేను శత్రువులను మర్దించుచుండగా, జీవించదలచినవా డెవ్వడూ నా ఎదుట నిలువజాలడు. కోపించిన నేను శక్తి కాని, గద కాని, ఖడ్గము కాని, వాడియైన బాణములు కాని ప్రయోగించకుండగా చేతులతోనే దేవేంద్రుణ్ణి కూడ చంపగలను. ఈనాడు రాముడు నా పిడికిలి దెబ్బ తిని కూడ జీవించినట్లయితే అప్పుడు నా బాణములు అతని రక్తమును త్రాగగలవు.(39-47)

రాజా! నేను ఉండగా చింతతో బాధపడుచున్నా వెందుకు? నేను నీ శత్రువులను నశింపచేయుటకై బయలుదేరుటకు సిద్ధముగా ఉన్నాను. రాముని వలన ఏర్పడిన ఘోరమైన భయమును విడిచిపెట్టుము. రామలక్ష్మణులను, మహాబలవంతుడైన సుగ్రీవుని చంపి, లంక కాల్చిన హనుమంతుణ్ణి యుద్ధములో చంపెదను. మనకు వచ్చిన ఈ యుద్ధములో వానరులను భక్షించెదను. నీకు గొప్ప కీర్తి సంపాదించి పెట్టెదను. రాజా! నీకు ఇంద్రునివలన భయము కలిగినా, సాక్షాత్తు బ్రహ్మదేవునివలన కలిగినా దానిని నేను సూర్యుడు రాత్రికి సంబంధించిన చీకటిని తొలగించినట్లు తొలగించెదను. నేను కోపించినచో దేవతలు కూడ నేలమీద శయనించెదరు. యముణ్ణి శాంతింపచేసెదను. అగ్నిని భక్షించెదను. నక్షత్రాలతో సహా సూర్యుణ్ణి నేలమీద పడగొట్టెదను. ఇంద్రుణ్ణి చంపెదను. సముద్రమును త్రాగివేసెదను. పర్వతములను చూర్ణము చేసెదను. భూమిని చీల్చెదను. అన్ని వైపులా భక్షింపబడుచున్న భూతములు నేడు చాలకాలము నిద్రించిన కుంభకర్ణుని పరాక్రమమును చూచుగాక. నా కీ స్వర్గలోకమంతా కూడ ఆహారమునకు సరిపోదు కదా. రాముణ్ణి చంపి నీకు ఉత్తరోత్తరవృద్ధి గల సుఖమును సంపాదించుటకొరకు వెళ్ళుచున్నాను. రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ, చంపి వానరసైన్యములోని ముఖ్యులను అందరినీ తినివేసెదను. రాజా! నీవు ఇపుడు క్రీడించుము. సేవించుము. దుఃఖమును విడచి చేయవలసిన పనులు చేసికొనుము. ఈనాడు రాముణ్ణి నేను యమలోకమునకు పంపివేసిన పిమ్మట, సీత చాలకాలానికి నీకు వశురాలు అగును."(48-58)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువది మూడవ సర్గము సమాప్తము.

అరువది నాలుగవ సర్గము

మహోదరుడు కుంభకర్ణుని మాట కాదని యుద్ధము చేయకుండగనే ఇష్టమైన విషయమును సాధించుటకు ఉపాయము చెప్పుట.

కుంభకర్ణుడు పలికిన ఆ మాటలు విని మహోదరుడు - "కుంభకర్ణుడా! నీవు సత్కులములో పుట్టినవాడవే అయినను ధార్ష్ట్యముతో సామాన్యజనుల వలెనే ఆలోచించుచున్నావు. గర్వముతో నిండిన నీవు ఎక్కడ ఏమి చేయవలెనో తెలియజాలక ఉన్నావు. ఏది నీతియో, ఏది కాదో రాజుకు తెలియకపోలేదు. కాని నీవు బాల్యముచేత(మూర్ఖత్వముచేత) ధార్ష్ట్యము వహించి ఏదో మాటలాడవలెను కదా అని మాటలాడుచున్నావు. దేశకాలముల విభాగము తెలిసిన రాక్షసరాజు తన స్థానమును, ఇతరుల స్థానమునూ, వృద్ధినీ, హానినీ బాగుగా ఎరిగిఉన్నాడు. వృద్ధుల సేవ చేయని సామాన్య బుద్ధిగలవాడు ఎంత బలవంతుడైనను ఏ పని ఉపక్రమించి కూడ చేయజాలడో అట్టి పనిని ఏ మానవుడు చేయుటకు ప్రయత్నించును? ధర్మార్థకామములకు వేరువేరు ఆశ్రయము లున్నట్లుగా మాటలాడుచున్నావు. కాని వాటి స్వరూపమును స్పష్టముగా తెలిసికొనుటకు తగిన లక్షణము లేదు కదా? సుఖదుఃఖాదిరూపములైన ఫలము లన్నింటికి కర్మయే సాధనము. అయితే పాపకర్మలు కూడ శ్రేయస్సును(మంచి ఫలమును) ఇచ్చుచుందును. ధర్మార్థములకొరకై చేసే కర్మలు, అధర్మ అనర్థములకు సాధనములైన కర్మలూ కూడ శ్రేయస్సునే కలిగించును. కాని అధర్మానర్థముల సాధనములైన కర్మలు ప్రత్యవాయమును కూడ కలిగించును. పురుషులు కామముతో ఇహలోకమునకు పరలోకమునకు ఉపయోగించు కర్మలను చేయుచుందురు. కామమును అవలంబించినవాడు కళ్యాణములైన కర్మఫలములను కూడ పొందును.(విహితకర్మవలననే శుభము కలుగును; నిషిద్ధకర్మవలన అశుభము కలుగును అను నియమము కాదని మహోదరుని అభిప్రాయము) 'ధర్మమునకు శ్రేయస్సే ఫలము, అధర్మమునకు దుఃఖమే ఫలము, కామము దుఃఖహేతువు' అను నియమమేదీ లేదు గాన రాజు తన మనస్సుతో నిర్ణయించుకొని ఈ పనిచేసినాడు. మనము కూడ సమ్మతించినాము. ఇప్పుడు శత్రువు విషయమున సాహసము చేసి ఏ లోపమును తీర్చవలెను?(1-10)

నీవొక్కడవే శత్రువు మీదికి దండెత్తి వెళ్ళు విషయమున నీవు ఏ హేతువును చెప్పినావో దానిలో కూడ యుక్తము కానిది, చెడ్డదీ అయిన అంశమును నీకు చెప్పెదను. పూర్వము జనస్థానమునందు చాలమంది మహాబలవంతులైన రాక్షసులను

చంపిన రాముణ్ణి నీవు ఒక్కడవు ఎట్లు జయించగలవు. జనస్థానములో రామునిచేత ఓడింపబడిన మహాతేజఃశాలులైన రాక్షసులందరూ ఇప్పుడు భయభ్రాంతులై లంకలో నివసించుచున్నారు. వాళ్ళను నీవు చూచుటలేదా! కోపించిన సింహమువంటి ఆ రాముడు నిద్రపోవుచున్న సర్పమువంటివాడు అని తెలిసి ఉండి కూడ నీవు అతనిని మేల్కొలుపుటకు కోరుచున్నావు! రాముడు తేజస్సుతో నిత్యమూ ప్రజ్వలించుచున్న ట్లుండును. కోపము వచ్చినప్పుడు ఎవ్వరిచేతను ఎదిరింపశక్యము కానివాడు. మృత్యుదేవతలవలె సహింపశక్యము కానివాడు. అట్టి రాముణ్ణి ఎవడు సమీపించగలడు? శత్రువును ఎదిరించినచో అంతా సంశయాస్పద మైపోవును. నీవు ఒంటరిగా యుద్ధమునకు వెళ్ళుట నాకు ఏమాత్రము ఇష్టముకాదు. క్షీణించిన బలము గలవాడు ఎవడైనా ప్రాణాలకు తెగించి, సమృద్ధమైన బలముగల శత్రువును, సామాన్యుణ్ణి వలె వశము చేసికొనుటకు ప్రయత్నించునా? కుంభకర్ణుడా! ఏ రామునితో సమానుడైనవాడు మనుష్యులలో లేడో, ఇంద్రసూర్యులతో సమానుడైన అట్టి రామునితో యుద్ధము చేయవలెనని ఎట్లు అనుకొనుచున్నావు?" అని పలికెను.(11-18)

రాక్షసుల మధ్య మహోదరుడు కుంభకర్ణునితో, చాల తొందరపాటుతో, ఇట్లు పలికి, రావణునితో ఇట్లనెను- "రాజా! నీ ఎదురుగా సీతను ఉంచుకొని ఎందుకు ఆలస్యము చేయుచున్నావు? నీవు అనుకున్నచో సీత నీకు తప్పక లొంగిపోగలదు. సీత నీ దగ్గరకు వచ్చు ఉపాయ మొకటి నాకు తోచినది. అది నీ బుద్ధికి కూడ ఇష్టమైనచో వినుము. మహోదరుడు, ద్విజిహ్వుడు, సంహ్రాది, కుంభకర్ణుడు, వితర్దనుడు, ఈ ఐదుగురూ రాముణ్ణి చంపుటకై బయలుదేరి వెళ్ళుచున్నారు అను చాటింపు వేయించుము. పిమ్మట మేము వెళ్ళి ప్రయత్నపూర్వముగా అతనితో యుద్ధము చేసెదము. మేము నీ శత్రువులను జయించగల్గినచో మన కింక ఉపాయములతో పనిలేదు. అట్లుకాక శత్రువు జీవించియే ఉన్నచో యుద్ధము చేసిన మేము మనస్సులో ఆలోచించినట్లు చేసెదము. మేము రామనామముచేత చిహ్నితములైన బాణములచేత ఇతర బాణములచేత, మా శరీరములు చీల్చుకొని, రక్తముచేత తడిసి యుద్ధమునుండి ఇక్కడికి వచ్చెదము. 'మేము రామలక్ష్మణులను భక్షించివేసినాము.' అని పలుకుచు నీ పాదములకు నమస్కారము చేసెదము. అప్పుడు నీవు పారితోషికాదులు ఇచ్చి మా కోరికలను పూరింపుము. రాజా! పిమ్మట 'రాముడు, అతని సోదరుడు, సైన్యము నశింపచేయబడినారు. అని ఏనుగ వీపుపై ఎక్కిన మనిషిచేత పట్టణములో అంతటా చాటింపు వేయించుము.'(19-27)

పిమ్మట నీవు సంతోషించినట్లు అభినయించుచు నీ భృత్యు లందరికీ భోగములను, పరివారములను, కామములను, ధనమును ఇప్పించుము. యోధులకు పుష్పమాలలు, వస్త్రములు, వీరులు దేహమునకు పూసుకొను అనులేపనమూ అధికముగా ఇచ్చి, ఆనందముతో నీవు కూడ మద్యపానము చేయుము. 'మిత్రసమేతుడైన రాముడు రాక్షసులచేత భక్షింపబడినాడు.' అను ఈ ప్రవాదము అంతటా వ్యాపించి ప్రసిద్ధమైన పిమ్మట నీవు లోపల ప్రవేశించి సీతను ఓదార్చి రహస్యమునందు బ్రతిమాలుకొనుము. ధనధాన్యములు, రత్నములు చూపి లోభపెట్టుము. రాజా! భయమునూ శోకమునూ కూడ కలిగించు ఈ కపటోపాయముచేత, నాథుడు నశించిన సీత ఇష్టము లేకున్నను నీకు వశమగును. సుందరుడైన భర్త మరణించినట్లు తెలిసికొనిన ఆ సీత నిరాశురాలై స్త్రీసహజమైన తేలికబుద్ధిచేత నీకు వశురాలు కాగలదు. ఆ సీత పూర్వము సుఖాలతో పెరిగినది. సుఖపడుటకు తగినది. కాని దుఃఖాలతో కృశించిపోయినది. అట్టి ఆమె సుఖమంతా నీమీదనే ఆధారపడి ఉన్నదని గ్రహించి నిన్ను చేరగలదు. నేను బాగా ఆలోచించి ఇట్లు నిర్ణయించినాను. రాముణ్ణి చూడగానే అనర్థము కలుగును. నీవు ఇక్కడ ఉండగానే యుద్ధము చేయకుండగనే గొప్ప సుఖము లభించును. విచారించకుము. రాజా! సైన్యము నశించకుండగా, సంశయమునకు అవకాశము లేకుండగా, యుద్ధము చేయకుండగానే శత్రువులను జయించు రాజునకు చిరకాలము గొప్ప యశస్సు, పుణ్యము, ఐశ్వర్యము, మనస్సుకు ప్రసాదమూ లభించును."(28-36)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువది నాలుగవ సర్గము సమాప్తము.

అరువది ఐదవ సర్గము

కుంభకర్ణుడు యుద్ధమునకు బయలుదేరుట.

కుంభకర్ణుడు మహోదరుని మాటలు విన్న పిమ్మట అతనిని జళిపించి, రాక్షసశ్రేష్ఠుడైన రావణునితో- "నేను దురాత్ముడైన ఆ రాముణ్ణి చంపి ఘోరమైన నీ భయమును తొలగించెదను. వైరము పోయి సుఖముగా ఉండుము. శూరులు నీళ్ళు లేని మేఘముల వలె వ్యర్థముగా గర్జించరు. యుద్ధములో పనిచేసిన పిమ్మట గర్జనమును చేయనున్నాను; చూడుము. శూరులు తమను తాము పొగడుకొనుటకు ఇచ్చగింపరు. పైకి చెప్పకుండగానే చేయ శక్యము కాని కర్మను చేయుదురు.

మహోదరుడా! నీ మాటలు వ్యాకులమైన మనస్సు గల, బుద్ధి లేని, పండితుల మనే అభిమానము గల రాజులకు ఇష్ట మగును. మీరందరూ యుద్ధములో పిరికిపందలు. ఎల్లప్పుడూ ప్రియముగా మాటలాడుచు రాజును అనుసరించుచుందురు. అట్టి మీరందరూ కార్యమును చెడగొట్టినారు. పేరుకు మాత్రమే స్నేహితు లున్న, వాస్తవమున స్నేహితులు ఎవరూ లేని, ఈతడు రాజుగా మాత్రమే మిగిలినట్లు అయినది. నేనిప్పుడు శత్రువులను జయించుటకు ఉద్యుక్తుడనై మీ దుష్టనీతిని సరిదిద్దుటకై యుద్ధమునకు బయలుదేరుచున్నాను." అని పలికెను. (1-8)

బుద్ధిమంతుడైన కుంభకర్ణుని మాటలు విని రాక్షసరాజు నవ్వుచు- "యుద్ధములో సమర్థుడవైన ఓ! తమ్ముడా! ఈ మహోదరుడు రామునికి భయపడుచున్నాడు; సందేహము లేదు. అందుచేతనే యుద్ధానికి ఇష్టపడుటలేదు. కుంభకర్ణుడా! స్నేహముచేతను, బలముచేతను నీతో సమానుడు ఎవ్వడూ నాకు లేడు. శత్రువులను సంహరించి జయము సంపాదించుటకు వెళ్ళుము. నిద్రించుచున్న నిన్ను నేను శత్రుసంహారము చేయుటకై లేపితిని. ఇది రాక్షసులకు చాల ప్రధానమైన సమయము. అందుచేత శూలము ధరించి పాశముచేతిలో ఉన్న యముడు వలె వెళ్ళుము. వానరులను, సూర్యునివంటి తేజస్సు గల ఆ రాజపుత్రులను భక్షించివేయుము. నీ రూపమును చూడగానే వానరులు పారిపోయెదరు. రామలక్ష్మణుల గుండెలు పలిగిపోవును." అనెను. (9-14)

గొప్ప తేజస్సు గల ఆ రావణుడు మహాబలశాలియైన కుంభకర్ణునితో ఇట్లు పలికి తాను మరల పుట్టి నట్లు తలచెను. కుంభకర్ణుని బలపరాక్రమములు తెలిసిన ఆ రావణుడు సంతోషించుచు చంద్రుడు వలె ప్రసన్నుడై ఉండెను. మహాబలశాలియైన కుంభకర్ణుడు తన అన్న ఈ విధముగా పలుకగా సంతోషించి బయలుదేరెను. రాజు మాటలు విని యుద్ధము చేయుటకు ఉద్యుక్తు డయ్యెను. అతడు పూర్తిగా ఇనుముతో తయారుచేయబడిన, ప్రజ్వలించుచున్న, శుద్ధమైన బంగారు అలంకారములు గల వాడియైన శూలమును శీఘ్రముగా గ్రహించెను. చాల పెద్దదైన ఆ శూలము కాంతీ, బరువూ ఇంద్రుని వజ్రము కాంతితోను, బరువుతోను సమముగా ఉండెను. అది అనేకపర్యాయములు దేవ-దానవ-గంధర్వ-యక్ష-పన్నగులను నశింపచేసెను. ఎఱ్ఱని మాలికలతో అలంకరించిన, గొప్ప తేజస్సు గల ఆ శూలమునుండి సహజముగానే మంటలు చెలరేగుచుండెను. అది శత్రువుల రక్తముచేత రంజింపపడి ఉండెను. ఈ సైన్యమంతా ఇక్కడనే ఉండుగాక. నేనొక్కడనే వెళ్ళెదను. కోపించి ఆకలిగొనియున్న నేను ఇప్పుడు ఆ వానరులను భక్షించెదను." అనెను. (15-21)

కుంభకర్ణుని మాటలు విని రావణుడు – “శూలములు, ముద్గరములు ధరించిన సైనికులతో కలిసి వెళ్ళుము. పెద్ద దేహము గలవారును, శూరులు, మంచి ప్రయత్నము చేయువారు అయిన వానరులు ఒంటరిగా ఉన్నవానినైనా, ఏమరిపాటుతో ఉన్నవానినైనా దంతాలచేత కొరికి చంపివేయుదురు. అందువలన సైన్యములతో కలిసి మిక్కిలి జయింపశక్యము కానివాడవై వెళ్ళి రాక్షసులకు అపకారము చేయుచున్న శత్రుపక్షము నంతను నశింపచేయుము. అని పలికెను.(22-24)

పిమ్మట మహాతేజఃశాలియైన రావణుడు ఆసనమునుండి లేచి మధ్య మధ్య మణులు కట్టిన మాలను కుంభకర్ణునకు కట్టెను. బాహుపురులను, ఉంగరములను, శ్రేష్ఠములైన అలంకారములను, చంద్రునివంటి హారమును కట్టెను. అతని అవయవములయందు దివ్యములు, మంచి సువాసన గలవి అయిన పుష్పమాలలను, చెవులకు కుండలములను కట్టించెను. బంగారు అంగదములు, కేయూరములు, వక్షఃస్థలాలంకారము మొదలైన అలంకారములచేత అలంకరించబడి, పెద్ద చెవులు గల ఆ కుంభకర్ణుడు బాగుగా హోమముచేసిన అగ్నివలె ప్రకాశించెను. ప్రకాశించుచున్న నల్లని పెద్ద నడుము త్రాడుతో అతడు అమృతమును పుట్టించు సమయమునందు వాసుకిచేత కట్టబడిన మందరపర్వతమువలె ఉండెను. అతడు బంగారు కవచమును ధరించెను. అది శస్త్రప్రహారముల భారమును సహించేదిగాను, శస్త్రములకు అభేద్యముగాను ఉండెను. మెరుపుల వంటి కాంతితో తన తేజస్సుచేత మండుచున్నదా అన్నట్లు ఉండెను. అట్టి కవచమును ధరించుటచే అతడు చుట్టూ సంధ్యాకాలమేఘములు అలముకొన్న పర్వతరాజువలె ప్రకాశించెను. అన్ని అవయవములకు అన్ని అలంకారములూ అలంకరించుకొని శూలమును హస్తమునందు ధరించిన ఆ కుంభకర్ణుడు మూడు అడుగులు వేయుటకు ఉత్సాహము చూపుచున్న నారాయణుడు వలె ప్రకాశించెను.(25-31)

గొప్ప బలము గల ఆ కుంభకర్ణుడు సోదరుని కౌగలించుకొని, ప్రదక్షిణము చేసి, శిరస్సు వంచి నమస్కరించి బయలుదేరెను. గొప్ప ధ్వనిచేయుచు బయలుదేరి వెళ్ళుచున్న, మహాబలశాలయైన, పెద్ద శరీరము గల కుంభకర్ణుణ్ణి రావణుడు ఆశీర్వదించి పంపెను. గొప్ప బుద్ధి గల రథికులు, రథికులలో శ్రేష్ఠుడైన ఆ కుంభకర్ణుణ్ణి శంఖముల దుందుభుల ధ్వనులతోను, శ్రేష్ఠమైన ఆయుధములు గల సైన్యములతోను, ఏనుగులతోను, గుఱ్ఱములతోను, మేఘములవంటి ధ్వని గల రథములతోను అనుసరించి వెళ్ళిరి. ఆ సైనికులు కుంభకర్ణుణ్ణి అనుసరించి, సర్పములు, ఒంటెలు, గాడిదలు, సింహములు, ఏనుగులు, లేళ్ళు, పక్షులు ఎక్కి

వెళ్ళిరి. దానవులకు, దేవతలకు శత్రువైన ఆ కుంభకర్ణుడు వాడియైన శూలమును హస్తమునందు ధరించి వెళ్ళుచుండగా అతని శిరస్సుపై ఛత్రము పట్టిరి. పుష్పవర్షము కురిపించుచుండిరి. మదముచేత సహజముగానే తీవ్రముగా ఉండు అతడు రక్తగంధములచే మదించి ఉండెను. గొప్పసారమూ, బలమూ గల భయంకరులైన, భయమును కల్గించు నేత్రములు గల చాలమంది రాక్షసులు ఆయుధములు ధరించి కాలినడకతో అతనిని అనుసరించి వెళ్ళిరి. ఎఱ్ఱని కళ్ళు, చాల పెద్దవైన దేహములు గల, నల్లని కాటుక గుట్టలవంటి ఆకారములు గల రాక్షసులు శూలములు, ఖడ్గములు, వాడియైన గండ్రగొడ్డళ్ళు, భిందిపాలములు, పరిఘలు, గదలు, రోకళ్ళు, దూరమునుండి విసరదగిన ఎదిరింపశక్యము కాని పెద్ద తాటిచెట్లు, మానులు గ్రహించి అతనిని అనుసరించి వెళ్ళిరి. కుంభకర్ణుడు చూచుటకు భయంకరము, దారుణమూ అయిన మరొక శరీరమును ధరించి బయలుదేరెను. అతని శరీరము చుట్టుకొలత నూరు ధనుస్సులు (రెండు వందల గజములు), ఎత్తు ఆరు వందల ధనస్సులు ఉండెను. బండి చక్రమువంటి నేత్రములతో భయంకరుడైన అతడు మహాపర్వతము వలె ఉండెను. (32-41)

పెద్దదేహము, విశాలమైన ముఖము గలిగి కాల్చినపర్వతము వలె ఉన్న కుంభకర్ణుడు రాక్షసులను సమీపించి, నవ్వుచు– "కోపించిన నేను ఇప్పుడు, అగ్ని మిడతలనువలె, వానరశ్రేష్ఠుల గుంపులను భాగములుగా చేసి కాల్చివేసెదను. వనములో సంచరించే వానరులు నిజానికి నాకేమీ అపరాధము చేయలేదు. ఆ వానరజాతి మనవంటి వాళ్ళ పురము లోని ఉద్యానములకు అలంకారము. ఈ పట్టణమును ముట్టడించుటకు లక్ష్మణసహితుడైన రాముడే మూలకారణము. అతనిని చంపినచో అందరినీ చంపినట్లే. అందుచేత అతనిని చంపెదను." అనెను. (42-45)

కుంభకర్ణు డిట్లు పలుకుచుండగా రాక్షసులు సముద్రమును కంపింపచేయుచున్నారా అన్నట్లు భయంకరమైన ధ్వని చేసిరి. కుంభకర్ణుడు బయలుదేరుచున్నప్పుడు చాల భయంకరములైన దుఃశకునములు కనబడినవి. ఉల్కలతోను, పిడుగులతోను కూడిన గాడిదరంగు మేఘములు ఏర్పడినవి. సముద్రముతోను, అరణ్యములతోను సహా భూమి కంపించినది. భయంకరములైన రూపములు గల నక్కలు నిప్పుముద్దలతో కూడిన నోళ్ళతో అరచినవి. పక్షులు అపసవ్యముగా మండలాకారమున తిరిగినవి. మార్గమునందు నడచి వెళ్ళుచున్న అతని శూలముమీద గ్రద్ధ వాలెను. అతని ఎడమకన్ను, చెయ్యీ అదరెను. అప్పుడు భయంకరమైన ధ్వనితో మండుచున్న ఉల్క పడెను. సూర్యుడు కాంతివిహీను

డయ్యెను. వాయువు సుఖముగా వీచుటలేదు. కుంభకర్ణుడు మాత్రము రోమాంచజనకములైన కనబడుచున్న ఆ దుఃశకునములను లెక్కచేయక దైవబలముచేత ప్రేరేపింపబడినవాడై బయలుదేరెను.(46-52)

పర్వతముతో సమానుడైన ఆ కుంభకర్ణుడు పాదాలచేతనే ప్రాకారమును దాటి మేఘముల గుంపువలె ఉన్న ఆశ్చర్యకరమైన వానరసేనను చూచెను. పర్వతమువలె ఉన్న ఆ కుంభకర్ణుణ్ణి చూడగానే ఆ వానరులు గాలిచేత ఎగరగొట్టబడిన మేఘముల వలె అన్ని దిక్కులకు పారిపోయిరి. మేఘమువలె నల్లని ఆకారముగల ఆ కుంభకర్ణుడు చెదరగొట్టబడిన మేఘసముదాయమువలె దిక్కులకు పారిపోవుచున్న, చాల భయంకరమైన ఆ వానరసైన్యమును చూచి, మేఘము వలె బిగ్గరగా గర్జించెను. ఆకాశమునందున్న మేఘముల ధ్వని వలె ఉన్న భయంకరమైన అతని ధ్వనిని విని చాలామంది వానరులు మొదళ్ళు నరికిన మద్దిచెట్ల వలె నేలమీద కూలిరి. పెద్ద పరిఘ ధరించి శత్రువినాశము చేయుటకై బయలుదేరిన మహాత్ముడైన ఆ కుంభకర్ణుడు ప్రళయకాలమునందు దండమును కింకరునిగా చేసికొని వచ్చిన యముడువలె కపిసైన్యమునకు భయంకరమైన భయమును కలిగించెను.(53-57)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువది ఐదవ సర్గము సమాప్తము.

అరువది ఆరవ సర్గము

వానరులకు ధైర్యము చెప్పి అంగదుడు యుద్ధమునకై ప్రోత్సహించుట, కుంభకర్ణుడు వానరులను సంహరించుట.

పర్వతశిఖరమువలె పెద్దదైన శరీరము గల మహాబలవంతుడైన ఆ కుంభకర్ణుడు ప్రాకారమును లంఘించి శీఘ్రముగా నగరమునుండి బయలుదేరెను. పిడుగులను జయించుచున్నాడా అన్నట్లు, పర్వతములను ఎగరగొట్టుచున్నాడా అన్నట్లు, గొప్ప ధ్వని గల సముద్రము ప్రతిధ్వనించేటట్లు గర్జించెను. దేవేంద్రునిచేతగాని, యమునిచేత గాని, వరుణునిచేతగాని, చంపశక్యముకాని, భయంకరములైన నేత్రములు గల అతనిని చూచి వానరులు పరుగెత్తిరి. పారిపోవుచున్న నలుడు, నీలుడు, గవాక్షుడు, గొప్పబలము గల కుముదుడు మొదలైన ఆ వానరులను చూచి రాజపుత్రుడైన అంగదుడిట్లు పలికెను- "మీరు మీ

పరాక్రమములను, వంశౌన్నత్యాదులను మరిచి, సామాన్యవానరుల వలె భయపడి ఎక్కడికి వెళ్ళెదరు? ఓ! సౌమ్యులారా! వెనుకకు మరలండి. ప్రాణాలు ఎందుకు రక్షించుకొనెదరు? ఈ రాక్షసుడు యుద్ధము చేయజాలడు. ఇది భయపెట్టుటకై సృష్టించిన పెద్ద బొమ్మ. వానరులారా! రాక్షసులు లేవదీసిన ఈ పెద్ద విభీషికను పరాక్రమముచేత నశింపచేసెదము; మరలండి."(1-7)

ఆ వానరులు అతికష్టముమీద ధైర్యము తెచ్చుకొని, నాలుగు వైపులనుండి వచ్చి ఒక చోట గుమిగూడి, వృక్షములను గ్రహించి యుద్ధరంగమునకు వెళ్ళిరి. మదించిన ఏనుగులు వలె ఉన్న ఆ వానరులు తిరిగి వచ్చి తొందరపడుచు, చాల కోపించి ఆ కుంభకర్ణుణ్ణి కొట్టిరి. ఎత్తైన పర్వతశిఖరములతోను, శిలలతోను, పుష్పించిన అగ్రభాగములు గల వృక్షములతోను కొట్టినా కూడ మహాబలశాలియైన ఆ కుంభకర్ణుడు కదలలేదు. అతని అవయవములమీద పడి అనేకమైన శిలలు ముక్కలైపోయెను. పుష్పించిన అగ్రభాగములు గల వృక్షములు విరిగి నేలమీద పడిపోయెను. కుంభకర్ణుడు కూడ చాల కోపించి, వానరసైన్యములను, విజృంభించిన అగ్ని వనములను వలె, ప్రయత్నపూర్వకముగా నశింపచేసెను. చాలమంది వానరశ్రేష్ఠులు క్రింద పడవేయబడినవారై, రక్తముచేత తడిసి, నేలమీద పడిన ఎఱ్ఱని పుష్పములు గల వృక్షములు వలె పడియుండిరి. కొందరు వానరులు దుమికి పారిపోవుచు వెనకకు చూడలేదు. కొందరు సముద్రములో పడిపోయిరి. కొందరు ఆకాశములోనికి ఎగిరిపోయిరి. ఆ రాక్షసుడు అనాయాసముగా చంపివేయుచుండగా కొందరు వానరులు ఏ మార్గమున సముద్రము దాటినారో ఆ మార్గముననే పారిపోయిరి. భయమువలన రంగుమారిన ముఖములు గల కొందరు వానరులు ఎత్తు ప్రదేశములను, కొందరు పల్లములను ఆశ్రయించగా, కొన్ని భల్లూకములు చెట్లమీదకి ఎక్కెను. కొన్ని పర్వతముమీదికి పారిపోయెను. కొందరు సముద్రములో మునిగిరి. కొందరు గుహలను ఆశ్రయించిరి. కొందరు నేలమీద పడిపోయిరి. కొందరు నిలబడలేకపోయిరి. కొందరు మరణించినట్లు పండుకొనిరి.(8-17)

భయపడి పారిపోవుచున్న ఆ వానరులను చూచి అంగదుడు ఇట్లు పలికెను. "ఓ! వానరులారా! నిలబడండి; వెనుకకు రండి; యుద్ధము చేసెదము. మీరు భయపడి ఓడిపోయి ఈ భూమి అంతా తిరిగినా కూడా మీకు స్థానము దొరకదు. వెనుకకు మరలండి; ప్రాణాలను ఎందుకు రక్షించుకొనెదరు? అడ్డులేని గమనము, పౌరుషము గల వానరులారా! ఆయుధములు విడచి పారిపోయిన మిమ్ములను చూచి మీ భార్యలు పరిహసించెదరు. బాగా జీవించినవారికి అది మరణమే కదా?

మనమందరము అతిప్రాచీనములైన సుదీర్ఘపరంపర గల ఉత్తమకులాలలో పుట్టినాము. సామాన్యవానరులు వలె భయపడి ఎక్కడికి పారిపోయెదరు? మీ పరాక్రమమును విడచి భయముతో పారిపోవుచున్న మీరు గౌరవానర్హులు కదా? యుద్ధానికి వచ్చేటప్పుడు జనాల సమక్షములో మీ తీవ్రత్వమును చూపుచు మీరు చెప్పిన పెద్ద పెద్ద మాటలన్నీ ఎక్కడికి పోయినవి? 'ఛీ' అనిపించుకొని జీవించి ఉండు పిరికిపంద లోకుల నిందలనే వినవలసి ఉండును. అందుచేత సత్పురుషులు అనుసరించిన మార్గమును అనుసరించండి. భయమును విడిచిపెట్టండి. మన ఆయుర్దాయము అల్పమైనచో శత్రువుల చేతిలో చచ్చి నేలమీద పండుకొనెదము; నీచయోధులకు లభించని బ్రహ్మలోకమును చేరుకొనెదము. వానరులారా! యుద్ధములో శత్రువును చంపి కీర్తినైనా పొందెదము. మనమే మరణించినచో వీరస్వర్గమునందు ఐశ్వర్యమును అనుభవించెదము. మండుచున్న అగ్నిని చేరిన మిడత వలె కుంభకర్ణుడు రాముణ్ణి చూచిన పిదప ప్రాణాలతో తిరిగి వెళ్ళడు. యుద్ధము చేయుటకై ఉద్దేశింపబడిన మనము చాలామంది ఒక్కని చేతిలో ఓడిపోయి, పారిపోయి ప్రాణాలను రక్షించుకొన్నట్లయితే మన కీర్తి నాశనము పొందును."(18-29)

అప్పుడు పారిపోవుచున్న ఆ వానరులు, శూరుడైన ఆ అంగదునితో శూరులు నిందించు మాట- "కుంభకర్ణునితో ఘోరమైన యుద్ధము చేసినది చాలును; ఇది నిలచుటకు తగిన సమయము కాదు. మాకు ప్రాణాలే చాల ప్రియమైనవి." అని పలికిరి. ఆ వానరసేనానాయకులందరూ భయమును కలిగించు నేత్రములు గల, భయంకరుడైన, వచ్చుచున్న కుంభకర్ణుణ్ణి చూచి, అంగదునితో ఇంతమాత్రమే పలికి దిక్కులు పట్టి పారిపోయిరి. పారిపోవుచున్న ఆ వీరులైన వానరుల నందరినీ అంగదుడు బ్రతిమాలుకొని ధైర్యము చెప్పి, రాముని మహాపరాక్రమమును వర్ణించుట మొదలైన యుక్తులను చూపి మరల్చెను. బుద్ధిమంతుడైన అంగదునిచేత ప్రోత్సాహితులైన ఆ వానరసేనానాయకు లందరూ అతని ఆజ్ఞకై ఎదురుచూచుచు నిలచిరి. ఋషభ-శరభ-మైంద-ధూమ్ర-నీల- కుముద-సుషేణ-గవాక్ష-రంభ-తార-ద్వివిద-పనస-హనుమంతులు మొదలైన వానరులు తొందరగా కుంభకర్ణాభిముఖులై యుద్ధానికి వెళ్ళిరి.(30-35)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరవది ఆరవ సర్గము సమాప్తము.

అరువది ఏడవ సర్గము

కుంభకర్ణుడు ఘోరయుద్ధము చేసి రామునిచే సంహారింపబడుట.

అప్పుడు అంగదుని మాటలు విని వెనుకకు మరలిన పెద్ద దేహములుగల ఆ వానరులందరూ స్థిరమైన బుద్ధితో యుద్ధమునకై వేచియుండిరి. అత్యధికమైన పరాక్రమము గల ఆ వానరులు బలశాలియైన అంగదునిచేత నిలుపబడిన పరాక్రమము గలవారై, విక్రమమును అవలంబించి, ఉత్సాహము పొంది, మరణించుటకు నిశ్చయించుకొని, వెళ్ళిరి. ప్రాణములకు లెక్కచేయక చాల వ్యాకులమైన యుద్ధము చేసిరి. పిమ్మట పెద్ద శరీరము గల ఆ వానరులు వృక్షములను చాల పెద్దవైన పర్వతశిలలను ఎత్తి శీఘ్రముగా కుంభకర్ణునిమీదికి పరుగెత్తిరి. పెద్ద శరీరముగల పరాక్రమవంతుడైన కుంభకర్ణుడు చాల కోపించి, గదను ఎత్తి శత్రువులను భయపెట్టుచు అన్ని వైపులా వాళ్ళను విసరివేసెను. కుంభకర్ణునిచేత కొట్టబడిన వానరులు ఏడువందలు, ఎనిమిది వందలు, వెయ్యిచొప్పున నేలమీద విసరివేయబడి పడిపోయిరి. కుంభకర్ణుడు చాలా కోపించి, పదహారుగురు, ఎనమండుగురు, పదిమంది, ఇరవైమంది, ముప్పైమంది చొప్పున వానరులను బాహువులతో పట్టి నోటిలో వేసికొని నమలుచు, సర్పములను భక్షించుచున్న గరుత్మంతుడు వలె, యుద్ధరంగములో వేగముగా తిరుగుచుండెను. వానరులు అతికష్టము మీద ధైర్యము తెచ్చుకొని, ఆ యా వైపులనుండి వచ్చి చేరి, వృక్షములు పర్వతములు చేతులలో ధరించి నిలిచిరి. పిమ్మట వానరశ్రేష్ఠుడైన ద్వివిదుడు పర్వతము పెకలించి, ఆకాశమునుండి వ్రేలాడుచున్న మేఘమువలె, పర్వతశిఖరము వంటి కాంతి గల ఆ కుంభకర్ణుని మీదికి పరుగెత్తెను. అతడు పైకి ఎగిరి ఆ పర్వతమును కుంభకర్ణుని మీదికి విసిరెను. అది గొప్ప దేహము గల అతనిని చేరకుండగానే అతని సైన్యముమీద పడెను. ఆ పర్వతము అశ్వములను, గజములను, రథములను మర్దించెను. మరొక పర్వతశిఖరమును ప్రయోగించగా అది కూడా ఇతరరాక్షసులను మర్దించెను. రాక్షసుల ఆ యుద్ధము పర్వతవేగముచేత కొట్టబడినదై, అశ్వములు, సారథులు మరణించగా రక్తముచేత తడిసిపోయెను.(1-12)

భయంకరమైన ధ్వని గల రథికులు ప్రళయకాలమృత్యుదేవతతో సమానములైన బాణములతో గర్జించుచున్న వానరశ్రేష్ఠుల శిరస్సులను ఖండించిరి. మహాత్ములైన వానరులు కూడ పెద్ద వృక్షములు పెకలించి, రథములను, అశ్వములను, ఏనుగులను, ఒంటెలను, రాక్షసులను నశింపచేసిరి. హనుమంతుడు ఆకాశములో ఉండి

పర్వతశిఖరములను, శిలలను, అనేక విధములైన వృక్షములను, కుంభకర్ణుని శిరస్సుపై వర్షించెను. గొప్పబలము గల కుంభకర్ణుడు శూలముతో ఆ పర్వతశిఖరములను బ్రద్దలు కొట్టెను. వృక్షవర్షమును భగ్నము చేసెను. పిమ్మట కుంభకర్ణుడు వాడియైన శూలమును గ్రహించి భయంకరమైన ఆ వానరసైన్యము మీదికి శీఘ్రముగా వెళ్ళెను. హనుమంతుడు పర్వతశిఖరమును గ్రహించి, వానరసైన్యము మీదికి వచ్చుచున్న అతని ఎదుట నిలచెను. హనుమంతుడు కోపించి, ఉత్తమమైన పర్వతము వలె భయంకరమైన దేహముగల కుంభకర్ణుణ్ణి వేగముగా కొట్టగా అతడు కొవ్వుచేత, రక్తముచే తడసిన దేహముతో క్షోభ చెందెను. కుంభకర్ణుడు మెరుపు వంటి ప్రకాశముగల శూలమును, మండుచున్న శిఖరాగ్రము గల పర్వతమువలె గట్టిగా పట్టి, కుమారస్వామి శక్తిచేత క్రౌంచపర్వతమును కొట్టినట్లు హనుమంతుణ్ణి వక్షఃస్థలముమీద కొట్టెను. ఆ మహాయుద్ధమునందు శూలముచేత విశాలమైన వక్షఃస్థలము నందు కొట్టబడినవాడై హనుమంతుడు వ్యాకులత చెంది, ముఖమునుండి రక్తము కక్కుచు ప్రళయకాలమేఘము ఉరుముతో సమానముగా భయంకరమైన ధ్వని చేసెను. రాక్షసు లందరు వ్యథ చెందిన ఆ హనుమంతుని చూడగానే సంతోషముతో కేకలు వేసిరి. వానరులు మాత్రము వ్యథచెంది, భయపీడితులై యుద్ధరంగములో ఆ కుంభకర్ణుని దగ్గరనుండి పారిపోయిరి. (13-21)

బలశాలియైన నీలుడు సైన్యమునకు ధైర్యము చెప్పి నిలబెట్టుచు, కుంభకర్ణునిమీదికి పర్వతశిఖరమును విసరెను. అప్పుడు కుంభకర్ణుడు మీద పడుచున్న ఆ పర్వతశిఖరమును చూచి దానిని పిడికిలితో కొట్టెను. అది పిడికిలి దెబ్బకు బ్రద్దలైపోయి, అగ్నికణములతో, అగ్నిజ్వాలలతో నేలమీద పడిపోయెను. వానరశ్రేష్ఠులైన ఋషభ-శరభ-నీల-గవాక్ష- గంధమాదనులు ఐదుగురూ కుంభకర్ణుని మీదికి వేగముగా వెళ్ళిరి. మహాబలవంతులైన ఆ ఐదుగురు వానరులు, పెద్ద దేహము గల ఆ కుంభకర్ణుణ్ణి యుద్ధమునందు, పర్వతములచేత, వృక్షములచేత, అరచేతులచేత, పాదములచేత, పిడికిళ్ళచేత అన్నివైపులనుండి కొట్టిరి. ఆ దెబ్బలన్నీ కుంభకర్ణునకు స్పర్శమాత్రములుగా అనిపించెను. అతడు ఏమాత్రము వ్యథ చెందలేదు. గొప్ప వేగము గల ఋషభుణ్ణి బాహువులతో కౌగిలించుకొనెను. భయంకరుడు, వానరశ్రేష్ఠుడు అయిన ఋషభుడు కుంభకర్ణుని బాహువులచేత పీడింపబడి ముఖమునందు రక్తము కారుచు నేలమీద పడిపోయెను. అప్పుడా యుద్ధమునందు కోపించిన కుంభకర్ణుడు శరభుణ్ణి పిడికిలిచేతను, నీలుణ్ణి మోకాలిచేతను, గవాక్షుణ్ణి అరచేతిచేతను, గంధమాదనుణ్ణి పాదముచేతను బలముతో కొట్టెను. ఆ వానరులు

కుంభకర్ణుడు కొట్టిన దెబ్బలకు వ్యథ పొందినవారై మోహముచెంది, ఖండించిన కింశుకవృక్షముల వలె నేలపై పడిరి.(22-30)

ఆ వానరనాయకులు నేలపై పడిపోవుటచూచి వేలకొలది వానరులు కుంభకర్ణుని మీదికి పరుగెత్తిరి. బలశాలులైన, పర్వతములవలె ఉన్న ఆ వానరులు అందరూ పర్వతమువంటి అతని మీదికి ఎక్కి, ఎగిరి అతనిని కరిచిరి. ఆ వానరశ్రేష్ఠులు గొప్ప బాహువులు గల ఆ కుంభకర్ణుణ్ణి గోళ్ళచేత, దంతాలచేత, పిడికిళ్ళచేత, బాహువులచేత పీడించిరి. వేలకొలది వానరులు తనపై ఎక్కగా పర్వతమువంటి ఆ రాక్షసశ్రేష్ఠుడు చెట్లతో నిండిన పర్వతమువలె ప్రకాశించెను. మహాబలవంతుడైన ఆ కుంభకర్ణుడు చేతులతో ఆ వానరులనందరినీ పట్టుకొని, కోపించిన గరుత్మంతుడు సర్పములను భక్షించినట్లు భక్షించెను. కుంభకర్ణునిచేత పాతాలమువంటి తన ముఖములో పడవేయబడిన వానరులు ముక్కు రంధ్రములనుండి, చెవులనుండి బైటకు వచ్చివేసిరి. పర్వతముతో సమానుడైన, మిక్కిలి కోపించిన ఆ కుంభకర్ణుడు ఆ వానరులను భక్షించుటకై వాళ్ళను విరిచివేసెను. నేలను మాంసముచేత, రక్తముచేత తడుపుచు, విజృంభించిన ప్రళయకాలాగ్నివలె వానరసైన్యములో సంచరించెను. శూలము హస్తమునందు ధరించిన మహాబలశాలియైన కుంభకర్ణుడు యుద్ధమునందు వజ్రము చేతిలో ధరించిన ఇంద్రుడువలె, పాశము హస్తమునందు ధరించిన యముడువలె ప్రకాశించెను. గ్రీష్మమునందు ఎండిపోయిన అరణ్యములను అగ్ని కాల్చివేసినట్లు ఆ వానరసైన్యములను కుంభకర్ణుడు కాల్చివేసెను. గుంపులన్నీ చంపబడగా, నాయకులు లేని ఆ వానరులు కుంభకర్ణునిచేత చంపబడుచు భయాక్రాంతులై వికృతస్వరములతో అరచిరి. కుంభకర్ణుడు అనేకవిధముల చంపుచుండగా వ్యథ చెందిన వానరులు దుఃఖాక్రాంతములైన మనస్సులతో రాముణ్ణి శరణుజొచ్చిరి.(31-42)

ఆ మహాయుద్ధములో వానరులు భగ్నులైపోవుట చూచి అంగదుడు శీఘ్రముగా కుంభకర్ణునిమీదికి పరుగెత్తెను. పెద్ద పర్వతమును గ్రహించి, మాటిమాటికి గర్జించుచు, కుంభకర్ణుని వెనుక వచ్చిన రాక్షసుల నందరినీ భయపెట్టుచు, ఆ పర్వతశిఖరమును కుంభకర్ణుని శిరస్సుమీద పడవేసెను. పర్వతముచేత శిరస్సుమీద కొట్టబడిన ఇంద్రశత్రువైన ఆ కుంభకర్ణుడు గొప్ప కోపముతో మండిపడుచు వేగముగా, క్రోధావిష్టుడై అంగదుని వైపు పరుగెత్తెను. గొప్పబలము గల కుంభకర్ణుడు బిగ్గరగా గర్జించుచు, వానరుల నందరినీ భయపెట్టుచు, కోపముతో శూలమును అంగదునిమీదకు విసరెను. యుద్ధమార్గమునందు నేర్పరియైన బలశాలియైన



అంగదుడు మీదపడుచున్న ఆ శూలమును చూచి, నేర్పుగా అది మీద పడకుండా తప్పించుకొనెను. అంగదుడు పైకి ఎగిరి అరచేతితో అతని వక్షఃస్థలముమీద బలముగా కొట్టెను. అంగదుడు కోపముతో ఇట్లు కొట్టగా పర్వతమువంటి ఆ కుంభకర్ణుడు మోహము చెందెను. గొప్పబలము గల ఆ కుంభకర్ణుడు స్పృహచెంది, పిడికిలి బిగించి అనాయాసముగా అంగదుని కొట్టెను. అతడు స్పృహ కోల్పోయి పడిపోయెను. (43-50)

వానరశ్రేష్ఠుడైన అంగదుడు స్పృహకోల్పోయి నేలమీద పడిపోయిన పిమ్మట కుంభకర్ణుడు శూలమును గ్రహించి సుగ్రీవు దున్నవైపు పరిగెత్తెను. మహాబలవంతుడైన కుంభకర్ణుడు తనమీదికి వచ్చుచున్నట్లు చూచి వీరుడు, వానరరాజూ అయిన సుగ్రీవుడు పైకి ఎగిరెను. సుగ్రీవుడు పర్వతశిఖరమును పైకిఎత్తి గట్టిగా పట్టుకొని, కుంభకర్ణునివైపు శీఘ్రముగా వెళ్ళెను. కుంభకర్ణుడు వచ్చి మీద పడుచున్న సుగ్రీవుని చూచి సమస్తావయవములు స్పష్టముగా కనబర్చుచు (రొమ్మువిరిచి) అతని ఎదుట నిలచెను. కుంభకర్ణుడు వానరులను భక్షించుటచే వారి రక్తముచేత అతని శరీరమంతా తడిసి ఉండెను. తన ఎదుట నిలచిన అట్టి కుంభకర్ణుడ్జి చూచి సుగ్రీవుడిట్లు పలికెను- "నీవు వీరులను పడగొట్టినావు. చేయశక్యముకాని పని చేసినావు. సైన్యములను కూడా భక్షించినావు. గొప్ప కీర్తిని ఆర్జించినావు. కుంభకర్ణుడా! ఆ వానరసైన్యమును విడిచిపెట్టుము. సామాన్యులతో ఏమి చేసెదవు? నేను పడవేయు ఈ పర్వతమును ఒక్కదానిని(ఈ ఒక్క పర్వతము దెబ్బను) సహించుము." (51-57)

సుగ్రీవుడు పలికిన బలధైర్యములతో కూడిన మాటలు విని రాక్షసశ్రేష్ఠుడైన కుంభకర్ణుడు, "సుగ్రీవుడా! నీవు బ్రహ్మదేవుని పౌత్రుడవు; ఋక్షరజస్సు పుత్రుడవు. ధైర్యపౌరుషసంపన్నుడవు. ఎందుకు గర్జించెదవు?" అనెను. సుగ్రీవుడు కుంభకర్ణుని మాటలు విని, ఆ పర్వతమును గట్టిగాపట్టి, వెంటనే విడచెను. వజ్రాయుధముతోను, పిడుగుతోను సమానమైన ఆ పర్వతముతో కుంభకర్ణుని వక్షఃస్థలమును కొట్టెను. విశాలమైన అతని వక్షఃస్థలము మీద పడి వెంటనే ఆ పర్వత శిఖరము చూర్ణమై పోయెను. అప్పుడు వానరులు దిగులుచెందిరి. రాక్షసులు సంతోషముతో కేకలు వేసిరి. పర్వతశిఖరముచేత కొట్టబడినవాడై కుంభకర్ణుడు కోపముతో ముఖము తెరచి గర్జించెను. మెరపువంటి శూలమును గట్టిగా పట్టి సుగ్రీవుని చంపుటకై దానిని విసిరెను. కుంభకర్ణుడు భుజములతో విసరిన బంగారు మాలలు అలంకరించిన వాడియైన ఆ శూలమును హనుమంతుడు శీఘ్రముగా పైకి ఎగిరి, చేతులతో పట్టి వెంటనే విరచివేసెను. అప్పుడు ఉత్సాహవంతుడైన హనుమంతుడు వేయిపుట్ల ఇనుముతో తయారుచేయబడిన ఆ పెద్ద శూలమును మోకాలుకు ఆన్చి విరచివేసెను. వానరసేన హనుమంతుడు శూలమును విరచుట చూచి సంతోషించుచు, అనేక పర్యాయములు అరచి అన్ని వైపులనుండి శీఘ్రముగా అక్కడికి వచ్చెను. అప్పుడు కుంభకర్ణుడు భయపడి యుద్ధవిముఖుడయ్యెను. వానరులు సంతోషించుచు సింహనాదము చేసిరి. శూలము ఆ విధముగా అగుటను చూచి హనుమంతుణ్ణి పూజించిరి. (58-66)

కుంభకర్ణుడు శూలము ఆ విధముగా విరవబడుటను చూచి, లంకదగ్గరనున్న మలయపర్వతమునుండి శిఖరమును పెకలించి, సుగ్రీవుని సమీపించి దానితో అతనిని కొట్టెను. యుద్ధములో పర్వతశిఖరముచేత కొట్టబడినవాడై సుగ్రీవుడు మూర్ఛితుడై నేలమీద పడిపోయెను. స్పృహ తప్పి నేలమీద పడిపోయిన అతనిని చూచి రాక్షసులు సంతోషించుచు అరచిరి. కుంభకర్ణుడు ఆశ్చర్యకరమైన ఘోరమైన పరాక్రమము గల వానరరాజైన సుగ్రీవుణ్ణి ఆ యుద్ధరంగమునందు పట్టుకొని, చాల తీవ్రమైన గాలి మేఘమును హరించినట్లు హరించెను. మహామేఘమువంటి రూపము గల సుగ్రీవుణ్ణి ఎత్తుకొని యుద్ధరంగము నుండి వెళ్ళుచున్న, మేరుపర్వతతుల్యమైన రూపము గల కుంభకర్ణుడు ఎత్తైన భయంకరమైన శిఖరము గల మేరుపర్వతము వలె ప్రకాశించెను. పిమ్మట వీరుడైన ఆ కుంభకర్ణుడు యుద్ధరంగమునందు రాక్షసులచేత స్తుతింపబడుచు, సుగ్రీవుణ్ణి చూచి ఆశ్చర్యపడుచున్న దేవతలు చేయుచున్న ధ్వనిని వినుచు, ఆ సుగ్రీవుణ్ణి తీసుకొని వెళ్ళెను. అప్పుడు ఇంద్రుని వంటి

పరాక్రమము గల ఆ కుంభకర్ణుడు ఇంద్రునితో సమానుడైన ఆ సుగ్రీవుని తీసికొని పోవుచు, "ఇతనిని చంపివేసినచో రామునితో సహా సైన్యమంతా నశించును." అని భావించెను.(67-72)

వానరసైన్యము ఇటు అటూ పారిపోవుచున్నదనీ, సుగ్రీవుణ్ణి కుంభకర్ణుడు తీసికొనిపోవుచున్నాడనీ చూచిన బుద్ధిమంతుడైన హనుమంతు డిట్లు ఆలోచించెను- "సుగ్రీవుడు ఈ విధముగా పట్టుబడినాడు కదా, ఇప్పుడు నేనేమి చేయవలెను? నేను ఏమి చేసిన న్యాయసమ్మతముగా ఉండునో దానినే నిఃసంశయముగా చేసెదను. పర్వతమంత రూపము ధరించి ఈ కుంభకర్ణుణ్ణి నశింపచేసెదను. గొప్ప బలము గల కుంభకర్ణుణ్ణి నేను పిడికిళ్ళచేత అతని దేహము బ్రద్దలు కొట్టి చంపి సుగ్రీవుణ్ణి విడిపించగా వానరులందరూ సంతోషించెదరుగాక. లేదా, దేవతలు, అసురులు, ఉరుగులు కలసి ఈ సుగ్రీవుణ్ణి పట్టుకొన్నను ఇతడు స్వయముగానే విడిపించుకొనగలడు. యుద్ధమునందు కుంభకర్ణుడు పర్వతముతో దెబ్బకొట్టుటచేత సుగ్రీవునకు స్పృహలేదని అనుకొనుచున్నాను. సుగ్రీవుడు ఈ మహాయుద్ధమునందు ముహూర్తకాలములో సంజ్ఞను పొంది తనకూ వానరులకూ కూడ ఏది హితమో అది చేయగలడు. మహాత్ముడైన ఈ సుగ్రీవుణ్ణి నేను విడిపించినట్లయితే అప్పుడది అతనికి ఏ మాత్రము ప్రీతికరము కాకపోవచ్చును. ఆతనికి శాశ్వతమైన అపకీర్తి కూడ కలుగును. అందువలన ముహూర్తకాలము పాటు రాజు పరాక్రమము చూపుటకై వేచి ఉండెదను. ఈలోగా చెదిరిపోయిన వానరసైన్యమునకు ధైర్యము చెప్పెదను."(73-81)

హనుమంతుడు ఇట్లు ఆలోచించి వానరుల మహాసైన్యమును, మరల ధైర్యము చెప్పి నిలబెట్టెను. ఆ కుంభకర్ణుడు కదలుచున్న ఆ సుగ్రీవుణ్ణి తీసికొని లంకలో ప్రవేశించెను. అప్పుడు విమానములలోను, వీథులలోని ఇండ్లలోను గోపురములోను ఉన్న జనులు శ్రేష్ఠమైన పుష్పములు అతనిపై వర్షించిరి. లాజల వర్షము, సుగంధములు కలిపిన ఉదకము వర్షము మీద పడుటచేతను, రాజవీథి చల్లగా ఉండుటవలనను, మహాబలుడైన ఆ సుగ్రీవునకు మెల్లమెల్లగా స్పృహ వచ్చెను. బలవంతుడైన ఆ కుంభకర్ణుని భుజముల మధ్యనున్న మహాత్ముడైన ఆ సుగ్రీవుడు అతికష్టముమీద సంజ్ఞను పొంది, లంకలోని రాజవీథిని చూచుచు, "ఈ విధముగా పట్టుబడిన నేనిప్పుడు ఏమి చేయవలెను? ఎట్లు చేసిన వానరులకు ఇష్టమగునో, హితముగా ఉండునో అట్లు చేసెదను." అని ఆలోచించెను. సుగ్రీవుడు ఈ విధముగా ఆలోచించి వాడియైన గోళ్ళచేత కుంభకర్ణుని చెవులను, దంతాలచేత ముక్కును,

పాదాలచేత పార్శ్వభాగములను చీల్చివేసెను. సుగ్రీవుడు ఆ విధముగా దంతాలతోను, గోళ్ళతోను చీల్చి చెవులు ముక్కు కొరికివేయగా కుంభకర్ణుడు రక్తముచేత తడిసిన శరీరముతో, కోపావిష్టుడై సుగ్రీవుణ్ణి నేలమీదకు విసిరికొట్టి నలిపివేసెను. భయంకరమైన బలము గల కుంభకర్ణుడు నేలమీద పడవేసి నలిపివేయగా, రాక్షసులు కొట్టుచుండగా ఆ సుగ్రీవుడు బంతివలె ఆకాశములోనికి ఎగిరి మరల రామునివద్ద వ్రాలెను. (82-89)

చెవులు, ముక్కూ పోయిన మహాబలవంతుడైన కుంభకర్ణుడు రక్తప్రవాహములచేత తడిసి, సెలయేళ్ళు ప్రవహించుచున్న పర్వతమువలె ప్రకాశించెను. పెద్ద శరీరము గల ఆ కుంభకర్ణుడు చూచుటకు భయము కలుగునట్లు రక్తముతో తడిసి ఉండెను. కోపముతో రక్తమును కక్కుచుండెను. నల్లని కాటుకగుట్ట వంటి ఆ రాక్షసుడు సంధ్యతో కూడిన మేఘము వలె ప్రకాశించుచుండెను. అతడు యుద్ధరంగాభిముఖుడై యుద్ధముచేయుటకు నిర్ణయించుకొనెను. సుగ్రీవుడు వెళ్ళిపోయిన పిమ్మట కుంభకర్ణుడు క్రోధావిష్టుడై మరల యుద్ధమునకై శీఘ్రముగా వెళ్ళెను. భయంకరుడై అతడు ఆయుధము లేదు కదా అని ఆలోచించి అప్పుడు ఒక ముద్గరమును గ్రహించెను. శీఘ్రముగా పట్టణమునుండి బయల్వెడలి, వృద్ధిచెందిన ప్రళయకాలాగ్ని ప్రజలను వలె, యుద్ధమునందు భయంకరమైన, ఆ వానరసైన్యమును భక్షించెను. ఆకలితో రక్తమాంసములను కోరుచున్న ఆ కుంభకర్ణుడు, భయంకరమైన వానరసైన్యములో ప్రవేశించి యుద్ధరంగమునందు ఎవరెవరో తెలియక రాక్షసులను, వానరులను, పిశాచములను, ఎలుగుబంట్లను కూడా తినివేసెను. ప్రళయకాలమునందు మృత్యువు ప్రజలను హరించినట్లు ప్రధానులైన వానరులను భక్షించెను. కోపించిన ఆ కుంభకర్ణుడు రాక్షసులతో సహా వానరులను ఒకడు, ఇద్దరు, ముగ్గురు చొప్పున ఇంకా చాలమందిని ఒక చేతితో పట్టుకొని నోట్లో వేసుకొనుచుండెను. పర్వతశిఖరములతో వానరులు కొట్టుచుండగా అప్పుడు కొవ్వు, రక్తము కార్చుచు వానరులను భక్షించెను. ఆ విధముగా భక్షించుచున్న వానిని చూచి వానరులు రాముణ్ణి శరణుజొచ్చిరి. మిక్కిలి కోపించిన కుంభకర్ణుడు మాత్రము వానరులను భక్షించుచు సంచరించుచుండెను. వందమందిని, ఏడుగురుని, ఎనమండుగురిని, ఇరవై మందిని ముప్పైమందిని బాహువులతో గట్టిగా పట్టుకొని తినుచు సంచరించుచుండెను. కుంభకర్ణుని శరీర మంతా కొవ్వుతోను, వసతోను, రక్తముతోను కప్పబడి యుండెను. ప్రేగుల మాలలు అతని చెవులకు తగిలి ముడిపడియుండెను. చాలా వాడియైన కోరలతో కూడినవాడై ప్రళయకాలమునందు

విజృంభించిన యముడువలె ఉన్న అతడు శూలములను వర్షించెను. (90–100)

ఆ సమయమునందు శత్రుసైన్యపీడకుడైన లక్ష్మణుడు కోపించి యుద్ధము చేసెను. పరాక్రమవంతుడైన ఆ లక్ష్మణుడు కుంభకర్ణుని శరీరమంతా ఏడు బాణములు లోతుగా దిగునట్లు పాతెను. మరికొన్ని బాణములు గ్రహించి వాటిని కూడ ప్రయోగించెను. ఆ రాక్షసుడు అస్త్రము చేత పీడింపబడి దానిని వ్యర్థము చేసెను. పిమ్మట బలవంతుడైన లక్ష్మణుడు కోపించి ఆతని పరిశుభ్రము, సుందరమూ అయిన బంగారపు కవచమును, వాయువు సంధ్యాకాలమేఘమును కప్పినట్లు శరములచేత కప్పివేసెను. బంగారు అలంకారములు గల బాణముల చేత పీడించబడుచున్న, నల్లని కాటుకరాశివలె ఉన్న ఆ కుంభకర్ణుడు కిరణములు గల సూర్యుడు మేఘములతో ప్రకాశించుచున్నట్లు ప్రకాశించెను. భయంకరుడైన ఆ రాక్షసుడు మేఘధ్వనివంటి ధ్వనితో అనాదరపూర్వకముగా లక్ష్మణునితో– "యుద్ధములో అనాయాసముగా యముణ్ణి కూడా జయించు నన్ను నిర్భయముగా ఎదుర్కొని నీవు నీ వీరత్వమును ప్రదర్శించినావు. మహాయుద్ధములో ఆయుధము ధరించి మృత్యుదేవత వలె ఉన్న నాఎదుట నిలచినవాడు కూడ గౌరవింపదగినవాడు; యుద్ధముచేసిన వానిమాట చెప్పవలెనా? సమస్తదేవతలతో కలసి, ఐరావతము నెక్కి వచ్చిన సమర్థుడైన దేవేంద్రుడు కూడ పూర్వ మెన్నడూ నా ఎదుట నిలబడలేదు. లక్ష్మణా! నీవు ఇప్పుడు బలముచేతను, పరాక్రమముచేతను నాకు సంతోషము కలిగించినావు. నీ అనుమతి తీసుకొని రాముని వద్దకు వెళ్ళవలె నని కోరుచున్నాను. నీవు యుద్ధములో పరాక్రమము, బలము, ఉత్సాహము చూపి నన్ను సంతోషపెట్టినావు. అందుచే రాముణ్ణి మాత్రమే చంపవలె నని కోరుచున్నాను. అతనిని చంపినచో అందరినీ చంపినట్లే అగును. నేను రాముణ్ణి చంపిన పిమ్మట యుద్ధములో మిగిలిన వాళ్ళతో శత్రువులను నశింపచేయు నా సైన్యము యుద్ధము చేయునట్లు చేసెదను" అని పలికెను. (101–112)

ఈ విధముగా ఆ రాక్షసుడు ఆత్మస్తుతిపూర్వకముగా పలికిన మాటలు విని, లక్ష్మణుడు నవ్వుచు, "ఓ! వీరుడా! పౌరుషమును చూపించు సమయమునందు ఇంద్రాదివీరులు కూడ నిన్ను సహింపజాల రని నీవు చెప్పుచున్నావు; అది సత్యమే. నీ పరాక్రమమును ఇప్పుడు చూచినాను. కాని దశరథకుమారుడైన రాము డిదుగో చలించని పర్వతమువలె నిలచి ఉన్నాడు." అని పలికెను. గొప్పబలము గల ఆ నిశాచరుడైన కుంభకర్ణుడు ఈ మాటలు విని, లక్ష్మణుణ్ణి లెక్కచేయక అతనిని దాటి, భూమిని కంపింపచేయుచున్నాడా అన్నట్లు రాముని మీదికే వెళ్ళెను. (113–116)

రాముడు రౌద్రాస్త్రమును ప్రయోగించి కుంభకర్ణుని వక్షఃస్థలమునందు, వాడియైన బాణములను విడచెను. రాముడు కొట్టగా కోపముతో ఆ రామునకు ఎదురుగా పరుగెత్తివచ్చుచున్న ఆ కుంభకర్ణుని ముఖమునుండి అగ్నిపిండములు, అగ్నిజ్వాలలు బయలుదేరినవి. రాముని అస్త్రముచేత కొట్టబడిన ఆ రాక్షసశ్రేష్ఠుడు క్రోధావిష్టుడై భయంకరముగా అరచుచు, వానరులను తరిమివేయుచు రాముని వైపు పరుగెత్తెను. నెమలి ఈకలు కట్టిన ఆ బాణములు కుంభకర్ణుని వక్షఃస్థలములోనికి దిగిపోయినవి. గద అతని చేతినుండి జారిపోయి నేలమీద పడెను. అతని ఆయుధము లన్నీ, నేలమీద చెల్లాచెదరై పడిపోయెను. గొప్ప బలము గల అతడు తన ఆయుధము లన్నీ పోయిన వని గ్రహించి, పిడికిళ్ళతోను, చేతులతోను, గొప్ప యుద్ధము చేసెను. బాణములచేత ఎక్కువగా కొట్టబడిన శరీరము గల, రక్తముచేత తడిసిన ఆ కుంభకర్ణుడు, పర్వతము సెలయేరును వలె, రక్తమును స్రవించెను. తీవ్రమైన కోపముతో ఒళ్ళు తెలియని అతడు రక్తము కార్చుచు వానరులను, రాక్షసులను, భల్లూకములను తినుచు తిరుగుచుండెను. భయంకరములైన బలపరాక్రమములు గల యమతుల్యుడైన ఆ కుంభకర్ణుడు ఒక పర్వతశిఖరమును బిగించి పట్టి రాముని మీదకు విసరెను. రాముడు ధనుస్సు ఎక్కుపెట్టి ఆ పర్వతశిఖరము తనమీదికి రాకుండగానే దానిని ఏడు బాణములతో మధ్యలో ఖండించెను. పిమ్మట ధర్మాత్ముడైన, రాముడు బంగారము చేత చిత్రవర్ణము గల బాణములతో అతడు విసిరిన శిఖరమును ఖండించెను. మేరుశిఖరము వంటి ఆకారము గలిగి కాంతితో ప్రకాశించుచున్నట్లు ఉన్న ఆ శిఖరము క్రింద పడుచు రెండువందల మంది వానరులను పడగొట్టెను. (117-127)

ఆ సమయమునందు కుంభకర్ణుణ్ణి చంపవలెనను నిశ్చయముతో తగిన అనేకములైన ఉపాయములు ఆలోచించుచున్న లక్ష్మణుడు రామునితో- "రాజా! ఇతనికి వానరు లెవరో, రాక్షసు లెవరో తెలియుటలేదు. ఇతడు రక్తగంధముచేత మత్తెక్కి తనవాళ్ళను ఇతరులను కూడా తినివేయుచున్నాడు. వానరశ్రేష్ఠు లందరూ అన్నివైపులనుండి ఈతని దేహముమీదకు ఎక్కెదరుగాక. సేనానాయకులు తమ తమ ప్రధానులను అనుసరించి ఈతని చుట్టూ నిలచి ఉందురుగాక. అట్లు చేసినచో ఈ దుర్మతియైన రాక్షసుడు పెద్ద బరువు చేత పీడితుడై నేలమీద ప్రాకుచు ఇతరవానరులను చంపజాలడు." అని పలికెను. (128-131)

బుద్ధిమంతుడైన లక్ష్మణుని మాటలు విని ఆ వానరులు సంతోషించి కుంభకర్ణుని శరీరముపై ఎక్కిరి. ఆ వానరులు ఎక్కుటచేత కోపించిన కుంభకర్ణుడు పొగరెక్కిన

ఏనుగు మావటివాళ్ళను వలె ఆ వానరులను వేగముగా దులిపివేసెను. వానరు లందరినీ ఆ విధముగా దులిపివేయుట చూచి రాముడు, 'ఈతడు కోపావేశముతో ఉన్నాడు.' అని గ్రహించి, వేగముగా అతనివైపు వెళ్ళెను. క్రోధముతో ఎఱ్ఱనైన నేత్రములు గల వీరుడైన రాముడు నేత్రముతో (చూపుతో) కాల్చివేయుచున్నాడా అన్నట్లు వేగముగా నడచుచు కుంభకర్ణునివలన కలిగిన భయముచేత పీడితులైన వానరనాయకుల నందరినీ సంతోషపెట్టుచు ఆ రాక్షసుని ఎదుర్కొనెను. రాముడు సర్పమువలె ఉన్న, దృఢమైన నారిగల, బంగారముచేత చిత్రవర్ణముగా ఉన్న భయంకరమైన ధనుస్సును గ్రహించి ఉత్తమములైన అంబుల పొదులను బాణములను కట్టుకొని, వానరులకు ధైర్యము చెప్పి శీఘ్రముగా బయలుదేరెను. ఏ మాత్రము జయింపశక్యము కాని వీరుడైన, మహాబలశాలియైన ఆ రాముడు, లక్ష్మణుడు వెంటరాగా, ఆ వానరగణములతో కలిసి బయలుదేరెను.(132-138)

రాముడు కిరీటమును ధరించిన కుంభకర్ణుని చూచెను. శత్రువినాశకుడైన అతని కండ్లు రక్తము కప్పి ఎఱ్ఱగా ఉండెను. ఆ కుంభకర్ణుడు కోపించిన దిగ్గజమువలె అందరినీ తరుముచుండెను. కోపముతో వానరులకై వెదకుచుండెను. అతని చుట్టూ రాక్షసులు ఉండిరి. వింధ్యమందరపర్వతముల వలె ఉన్న ఆ కుంభకర్ణుడు బంగారు బాహుపురులను, అలంకారములను అలంకరించుకొనెను. ముఖమునుండి రక్తము కార్చుచుండెను. పైకి లేచిన వర్షాకాలమేఘమువలె ఉండెను. అతడు రక్తముతో తడిసిన చెలువులను నాలుకతో నాకుచుండెను. వానరసైన్యమును మర్దించుచుండెను. ప్రలయకాలమునందు జగత్సంహారము చేయుచున్న యముడు వలె ఉండెను. (139-142)

పురుషశ్రేష్ఠుడైన రాముడు ప్రజ్వలించుచున్న అగ్నివంటి కాంతి గల రాక్షసశ్రేష్ఠుడైన ఆ కుంభకర్ణుణ్ణి చూచి ధనుస్సును చరచెను. రాముని ధనుష్టంకారధ్వనిని వినగానే కోపించిన రాక్షసశ్రేష్ఠుడైన కుంభకర్ణుడు ఆ ఘోషమును సహించక రాముని మీదికి శీఘ్రముగా వెళ్ళెను. అప్పుడు వచ్చుచున్న ఆ కుంభకర్ణుడు గాలిచే ఎగురగొట్టబడిన మేఘమువలె ఉండెను. అతని బాహువులు ఆదిశేషుని ఉత్తమమైన దేహమువలె ఉండెను. పర్వతమువలె ఉన్న అతనితో యుద్ధరంగమునందు రాముడు, "రాక్షసనాయకా! రమ్ము. మరణించనున్నాను అని విషాదము చెందకుము. నేను ధనస్సు ధరించి నిలచినాను. నేను రాక్షసవంశమును నశింపచేయువాడ నని తెలిసికొనుము. ముహూర్తకాలములో నీవు ప్రాణములు విడువగలవు." అనెను. ఇతడు రాముడు అని తెలిసికొని కుంభకర్ణుడు వికృతధ్వనితో నవ్వి, కోపించినవాడై,

యుద్ధమునందు వానరులను తరిమివేయుచు రామునకు ఎదురుగా వెళ్ళెను. గొప్ప తేజస్సు గల ఆ కుంభకర్ణుడు అందరు వానరుల గుండెలు బ్రద్దలుకొట్టుచున్నాడా అన్నట్లు వికృతముగా, భయంకరముగా, మేఘధ్వనితో సమానముగా అట్టహాసము చేసి రామునితో - "నేను విరాధుడ నని కాని, కబంధుడనని గాని, ఖరుడ నని గాని, వాలినని గాని, మారీచుడనని గాని అనుకొనుకుము. వచ్చినవాడను నేను కుంభకర్ణుడను. పూర్తిగా ఇనుముతో చేసిన భయంకరమైన పెద్దదైన ముద్గరమును చూడుము. దీనితో పూర్వము నేను దేవతలను దానవులను జయించితిని. "ఇతనికి చెవులు, ముక్కు లేవు కదా" అని చిన్నచూపు చూడకుము. చెవులు, ముక్కు పోవుటచేత నాకు ఏమాత్రము బాధ లేదు. దోషరహితుడవైన ఇక్ష్వాకువంశశ్రేష్ఠుడా! నా అవయవములమీద నీ పరాక్రమము చూపుము. నీ పౌరుషపరాక్రములను చూచిన పిమ్మట నిన్ను భక్షించెదను." అని పలికెను. (143-152)

కుంభకర్ణుని మాటలు విని రాముడు పొన్నులు గల బాణములను ప్రయోగించెను. వజ్రాయుధముతో సమానమైన వేగముగల ఆ బాణములతో కొట్టినా కూడ ఆ రాక్షసుడు క్షోభ చెందలేదు. వ్యథ చెందలేదు. ఏ బాణములు సాలవృక్షములను ఛేదించెనో, ఏ బాణములు వానరశ్రేష్ఠుడైన వాలిని చంపెనో, ఆ బాణములు అప్పుడు వజ్రమువంటి కుంభకర్ణుని శరీరమునకు బాధ కల్గించజాలకపోయెను. కుంభకర్ణుడు ఆ బాణములను జలధారలను వలె దేహముతో త్రాగుచు, భయంకరమైన వేగము గల ఆ ముద్గరమును త్రిప్పి రాముని బాణముల వేగమును అడ్డగించెను. రక్తముచేత పూయబడిన, దేవతల గొప్ప సైన్యములకు భయము కలిగించు, భయంకరమైన వేగము గల ముద్గరమును త్రిప్పుచు వానరుల సైన్యమును తరిమివేసెను. రాముడు వాయవ్య మను మహాస్త్రమును సంధించి ఆ రాక్షసునిపై ప్రయోగించెను. దానిచేత ముద్గరముతో కూడిన వాని హస్తమును ఖండించెను. బాహువు ఛేదింపబడగానే ఆ కుంభకర్ణుడు వ్యాకులముగా అరచెను. పర్వతశిఖరముతో సమానమైన అతని బాహువు రాముని బాణముచేత ఛేదింపబడినదై ముద్గరముతో సహా ఆ సుగ్రీవుని సైన్యము మీద పడి ఆ వానరసైన్యమును చంపెను. దేహములు విరిగిపోగా, చావగా మిగిలిన ఆ వానరులు, పీడింపబడిన శరీరములతో దిగులుచెంది ప్రక్కలయందు నిలబడి రామకుంభకర్ణుల ఆ భయంకరమైన యుద్ధమును చూచిరి. అస్త్రముచే బాహువు ఖండింపబడగా, మహాఖడ్గముచేత శరీరము ఖండించి వేసిన మహాపర్వతము వలె ఉన్న ఆ కుంభకర్ణుడు చేతితో వృక్షమును పెకలించి రాముని మీదికి పరుగెత్తెను. రాముడు బంగారముచేత

చిత్రవర్ణమైన బాణముపై ఇంద్రాస్త్రమును సంధించి అతడు పైకి ఎత్తిన, సర్పమువలె ఉన్న బాహువును తాళవృక్షముతో సహా ఖండించెను. కుంభకర్ణుని ఆ పర్వతమువంటి భుజము ఖండింపబడి నేలపై పడెను. ఇటు అటు కొట్టుకొనుచు పర్వతములతోను, వృక్షములతోను, వానరులతోను, రాక్షసులతోను ఢీకొనెను. బాహువులు తెగిపోయిన పిమ్మట శీఘ్రముగా మీదికి వచ్చి పడుచున్న ఆ కుంభకర్ణుణ్ణి చూచి రాముడు వాడియైన రెండు అర్ధచంద్రబాణములతో అతని పాదములను ఛేదించెను. ఆ కుంభకర్ణుని పాదములు దిక్కులను, విదిక్కులను, పర్వతగుహలను, సముద్రమును, లంకను, వానర-రాక్షస సైన్యములను ప్రతిధ్వనింపచేయుచు క్రింద పడినవి. (153-164)

బాహువులు, పాదములు తెగిపోయిన ఆ కుంభకర్ణుడు వడబాగ్ని ముఖమువంటి ముఖమును తెరచి రాహువు ఆకాశమునందు చంద్రుని మీదికి వెళ్ళినట్లు(తొడల సహాయముతో) రామునిమీదకు శీఘ్రముగా వెళ్ళెను. రాముడు వాడియైన కొనలు గల బాణాలతో అతని ముఖమును నింపెను. అతడు బాణాలచేత నింపబడిన ముఖము కలవాడై మాటలాడలేకపోయెను. అతికష్టముమీద అరచెను. మూర్ఛచెందెను. పిమ్మట రాముడు ఇంద్రునికి సంబంధించిన వాడియైన బాణమును గ్రహించెను. అది సూర్యకిరణము వలె ప్రకాశించుచుండెను. బ్రహ్మదండమువలె, మృత్యుదేవతవలె, యముడువలె, భయంకరముగా ఉండెను. శత్రువులకు అమంగళకరమైన ఆ శరము వేగముచేత వాయువుతో సమానమై ఉండెను. వజ్రముతోను బంగారముతోను అందముగా ఉన్న పొన్ను గల ఆ బాణము ప్రజ్వలించుచున్న సూర్యునితోను, అగ్నితోను సమానమైన ప్రకాశముతో మహేంద్రుని వజ్రమువంటి, పిడుగువంటి వేగము కలదై ఉండెను. అట్టి బాణమును రాముడు ఆ రాక్షసునిపై ప్రయోగించెను. ధూమము లేని అగ్నివలె చూచుటకు భయంకరముగా ఉన్న, ఇంద్రుని వజ్రాయుధము వంటి భయంకరమైన శక్తి గల ఆ బాణము రాముని బాహువులచేత విడుబడినదై, తన కాంతిచేత పది దిక్కులను ప్రకాశింపచేయుచు వెళ్ళెను. పూర్వము దేవేంద్రుడు వృత్రుని శిరస్సును ఖండించి నట్లు రాముడు ఆ రాక్షసనాయకుడైన కుంభకర్ణుని పర్వతశిఖరమువంటిది, బాగా గుండ్రముగా తిరిగిన కోరలు గలది, కదలుచున్న అందమైన కుండలములు గలదీ అయిన శిరస్సును ఖండించెను. కుండలములచేత అలంకరించబడిన పెద్దదైన ఆ కుంభకర్ణుని శిరస్సు రాత్రి ఉదయిచిన పునర్వసునక్షత్రము("పునర్వసు"లో రెండు నక్షత్రములుండును) మధ్య నున్న చంద్రుడు వలె ప్రకాశించుచుండెను. పర్వతమువంటి ఆ కుంభకర్ణుని



శిరస్సు రాముని బాణముచేత కొట్టబడినదై, క్రిందపడెను. మార్గము నందలి గృహముల గోపురములను విరుగగొట్టెను. ఉన్నతమైన ఆ ప్రాకారమును కూడా పడగొట్టెను. అప్పుడు పెద్ద దేహము, గొప్ప ప్రకాశము గల రాక్షసుడు సముద్రములో పడి పెద్దవైన మొసళ్ళను, శ్రేష్ఠమైన చేపలను, సర్పములను మర్దించుచు క్రిందికి భూమిదాకా దిగిపోయెను. (165-173)

బ్రాహ్మణులకు, దేవతలకు శత్రువైన, గొప్పబలము గల ఆ కుంభకర్ణుడు యుద్ధమునందు చంపబడగా, భూమి, అన్ని పర్వతములూ కూడా చలించినవి. దేవతలు ఆనందముతో అధికముగా ధ్వనిచేసిరి. అప్పుడు దేవర్షులు, మహర్షులు, పన్నగులు, దేవతలు, ఇతర భూతములు, సుపర్ణులు, గుహ్యకులు, యక్షులు, గంధర్వులు ఆకాశముమీద చేరి రాముని పరాక్రమమునకు మిక్కిలి సంతోషించిరి. కుంభకర్ణుని ఆశ్చర్యకరమైన సంహారముచేత, రావణుని బంధువులు దుఃఖితులై, సింహమును చూచి ఏనుగులు అరచినట్లు రాముణ్ణి చూచి బిగ్గరగా అరచిరి. రాముడు కుంభకర్ణుని సంహరించి, రాహుముఖమునుండి విముక్తుడైన సూర్యుడు చీకటిని తొలగించి ఆకాశమధ్యమునందు ప్రకాశించినట్లు వానరసైన్యము మధ్య ప్రకాశించెను. వానరు లందరు వికసించిన పద్మములతో సమానములైన ముఖములతో సంతోషము పొందిరి. భయంకరమైన బలము గల శత్రువును చంపిన ఎదిరింపశక్యముకాని రాముణ్ణి పూజించిరి. సురసైన్యములను పీడించినవాడు, మహాయుద్ధములలో కూడ ఎన్నడూ జయింపబడనివాడు అయిన కుంభకర్ణుణ్ణి యుద్ధమునందు చంపి, రాముడు, మహాసురుడైన వృత్రుణ్ణి చంపిన దేవేంద్రుడు వలె సంతోషించెను. (లేదా దేవేంద్రుడు వృత్రాసురుణ్ణి చంపినట్లు కుంభకర్ణుణ్ణి చంపి రాముడు సంతోషించెను). (174-179)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువది ఏడవ సర్గము సమాప్తము.

అరవై ఎనిమిదవ సర్గము

కుంభకర్ణవధ విని రావణుడు విలపించుట.

మహాత్ముడైన రాముడు కుంభకర్ణుణ్ణి సంహరించినట్లు చూచి రాక్షసులు ఆ విషయమును రాక్షసరాజైన రావణునకు తెలిపిరి - "రాజా! యమునితో సమానుడైన కుంభకర్ణుడు వానరసేనను తరిమివేసి, కొందరు వానరులను భక్షించి, కాలమునకు కర్మ పరిపక్వమగుటచేత మరణించినాడు. నీ సోదరుడైన కుంభకర్ణుడు ముహూర్తకాలము ప్రతాపము చూపించి, రాముని తేజస్సుచేత శాంతించినాడు. రాముని బాణాలచేత పీడింపబడి చూచుటకు భయంకరముగా ఉండు సముద్రమును సగము ప్రవేశించిన మొండెముచేతను, లంకాద్వారమును ముక్కు చెవులు ఖండించుటచే రక్తము స్రవించుచున్న తలచేతను నిరోధించుచు దావాగ్నికి కాలిన చెట్టువలె వికృతమైన ఆకారముతో ఒక ముద్దవలె అయినాడు". (1-5)

గొప్ప బలము గల కుంభకర్ణుడు యుద్ధమునందు చంపబడినాడని విని రావణుడు దుఃఖసంతప్తుడై మూర్ఛచెంది నేలపై పడిపోయెను. పినతండ్రి మరణించినట్లు విని దేవాంతక - నరాంతకులు, త్రిశిరస్సు, అతికాయుడు దుఃఖముచేత పీడితులై ఏడ్చిరి. రామునిచేత సోదరుడైన కుంభకర్ణుడు చంపబడినట్లు విని అతని సవతితల్లి పుత్రులైన మహోదర - మహాపార్శ్వులు దుఃఖాక్రాంతులైరి. (6-8)

రావణుడు అతికష్టము మీద సంజ్ఞ పొంది, కుంభకర్ణుని వధవలన దీనుడై, వ్యాకులమైన ఇంద్రియములు కలవాడై విలపించెను - "అయ్యో! వీరుడా! శత్రువుల గర్వమును అణచేవాడా! గొప్పబలము గలవాడా! కుంభకర్ణా! నీవు నన్ను విడచి, దైవయోగముచేత, యమలోకమునకు వెళ్ళితివి! గొప్పబలము గలవాడా! నీవు నా మనస్సులోను బంధువుల మనస్సులోను ఉన్న దుఃఖశల్యమును తొలగించకుండగానే శత్రుసైన్యమును పీడించి, నన్ను విడచి ఒంటరిగా ఎక్కడికి పోవుచున్నావు? నేను దేనిని ఆశ్రయించుకొని సురాసురులనుండి భయపడుటలేదో అట్టి నా కుడి భుజము పడిపోయినది. అందుచేత నేను కూడా లేనట్లే. దేవదానవుల గర్వమును హరించినవాడు, ప్రళయకాలాగ్ని వంటివాడు అయిన ఇట్టి వీరుణ్ణి ఈనాడు యుద్ధములో రాముడు ఎట్లు చంపగలిగినాడో కదా! వజ్రప్రహారము కూడ ఎన్నడూ నీకు దుఃఖము కలిగించేదికాదు కదా; అట్టి నీవు రాముని బాణాలచేత పీడితుడవై నేలమీద ఎట్లు శయనించినావు? ఈ దేవతలు, ఋషులు ఆకాశమునందు నిలిచి, యుద్ధములో చంపబడిన నిన్ను చూచి చాల సంతోషించుచు ధ్వని చేయుచున్నారు.

వానరులు తమ లక్ష్యమును సాధించుటచే సంతోషించుచు ఇప్పుడే, ప్రవేశింపశక్యము కాని లంకాద్వారములమీదికి, అన్ని వైపులనుండి ఎక్కగలరు."(9-16)

"నాకు రాజ్యముతో పనిలేదు. సీతవలన ఏమి ప్రయోజనము? కుంభకర్ణుడు లేని నాకు జీవితమునందు కూడా ఆసక్తి లేదు. నా సోదరుణ్ణి చంపిన రాముణ్ణి నేను యుద్ధములో చంపకపోయినచో నాకు మరణమే మంచిది కాని వ్యర్థముగా జీవించి ఉండుట మంచిది కాదు. నా తమ్ముడున్న ప్రదేశమునకు ఇప్పుడే వెళ్ళెదను. సోదరులను విడచి క్షణకాలమైనా జీవించుటకు కోరను. పూర్వము అపకారము చేసి ఉన్న నన్ను చూచి దేవత లందరూ నవ్వగలరు. కుంభకర్ణుడా! నీవు మరణించిన తరువాత నేను ఇంద్రుణ్ణి ఎట్లు జయించగలను? మహాత్ముడైన విభీషణుడు చెప్పిన ఏ మాటలు నేను అజ్ఞానమువలన ఆనాడు వినలేదో అట్టి శుభమైన విభీషణుని మాటలే ఇపుడు నాకు సంప్రాప్తించినవి. కుంభకర్ణప్రహస్తులు దారుణముగా నశించినప్పటినుండీ, విభీషణుడు పలికిన మాటలు నాకు సిగ్గు కలిగించుచున్నవి. ధార్మికుడు శ్రీమంతుడు అయిన విభీషణుణ్ణి నేను అవమానించుటచే ఆ కర్మకు ఫలముగా నాకు ఈశోకము సంప్రాప్తించినది."(17-23)

ఇంద్రుని శత్రువైన తన తమ్ముడు కుంభకర్ణుడు చంపబడినట్లు వినిన రావణుడు వ్యాకులమైన చిత్తముతో అనేక విధములుగా చాల దీనముగా ఇట్లు విలపించి, చాల దుఃఖార్తుడై మూర్ఛిల్లి నేలపై పడెను.(24)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువది ఎనిమిదవ సర్గము సమాప్తము.

అరువది తొమ్మిదవ సర్గము

రావణుని పుత్రులు, బంధువులు యుద్ధానికి వెడలుట. అంగదుడు నరాంతకుని చంపుట.

ఈ విధముగా దుఃఖావేశముతో విలపించుచున్న దురాత్ముడైన రావణుని మాటలు విని త్రిశిరస్సు- "రాజా! గొప్ప పరాక్రమము గల మా తండ్రుల అన్నదమ్ములలో మధ్యముడైన కుంభకర్ణుడు చంపబడినాడను మాట నిజమే. కాని, నీవంటి సత్పురుషులు విలపించరు. ప్రభూ! నీవు మూడు లోకాలూ కూడ జయించుటకు సరిపోవువాడవు. అట్టి నీవు, నిన్ను గూర్చి సామాన్యుడు వలె

ఎందుకు దుఃఖించుచున్నావు? నీకు బ్రహ్మ ఇచ్చిన శక్తి, కవచము, బాణము, ధనుస్సు, వేయి గాడిదలు కట్టిన మేఘధ్వనివంటి ధ్వని గల రథము ఉన్నవి. నీవు అనేక పర్యాయములు ఆయుధములచేత దేవదానవులను ఓడించినావు కదా? నీవు ఇప్పుడు కూడ సర్వాయుధములు ధరించి రాముణ్ణి శిక్షించుము. నీవు అట్లే ఉండుము. నేను బయలుదేరి వెళ్ళి, గరుత్మంతుడు సర్పములను వలె, నీ శత్రువులను, యుద్ధమునందు నిర్మూలించెదను. దేవేంద్రునిచేత శంబరాసురుడు వలె, విష్ణువుచేత నరకుడువలె, నాచేత నేడు యుద్ధమునందు పడగొట్టబడి రాముడు శయనించగలడు" అని పలికెను.(1-7)

రాక్షసరాజైన రావణునకు త్రిశిరస్సు మాటలు వినగానే, కాలప్రభావముచేత, తాను మళ్ళీ పుట్టినాడన్నంత ధైర్యము వచ్చెను. త్రిశిరస్సు మాటలు వినగానే దేవాంతకనరాంతకులకు, తేజశ్శాలియైన అతికాయునకు యుద్ధమునకై ఉత్సాహము కలిగెను. అటుపిమ్మట దేవేంద్రునితో సమానమైన పరాక్రమముగల రావణుని కుమారులు, వీరులగు రాక్షసశ్రేష్ఠులు నేను నేనని గర్జించుచు యుద్ధోత్సాహము కలవారైరి. ఆ రాక్షసులందరూ ఆకాశములో సంచరించగలవారు. అందరూ మాయలో నేర్పుగలవారు. అందరూ దేవతల గర్వము అడచినవారు. అందరూ యుద్ధములో దుర్మదము గలవారు. వాళ్ళు అందరూ గొప్ప బలము కలవారు. అందరూ విస్తృతమైన కీర్తి గలవారు. అందరూ యుద్ధములోనికి వెళ్ళి దేవ-గంధర్వ-కింనర-మహోరగులచేత కూడ ఓడింపబడినట్లు ఎవరూ వినలేదు. ఆ రాక్షసులందరూ అస్త్రములు తెలిసిన వీరులే. అందరూ యుద్ధములో నేర్పు గలవారే. అందరూ శ్రేష్ఠమైన విజ్ఞానము గలవారే. అందరూ వరములు పొందినవారే. సూర్యునివలె కనిపించుచున్న, శత్రుబలైశ్వర్యవినాశకులైన ఆ కుమారులతో ఆ విధముగా కూడి యున్న రావణుడు మహాదానవుల దర్పమును నశింపచేయు దేవతలతో కూడిన దేవేంద్రుడు వలె ప్రకాశించెను.(8-14)

రావణుడు పుత్రులను కౌగిలించుకొని, అలంకారములతో అలంకరించి, ప్రశస్తములైన ఆశీర్వాదములు చేసి యుద్ధమునకు పంపెను. రావణుడు కుమారుల రక్షణముకొరకు తన సోదరులైన యుద్ధోన్మత్త-మత్తులను కూడ యుద్ధానికి పంపెను. పెద్ద దేహములు గల ఆ రాక్షసులు మహాత్ముడైన, రావణునకు ప్రదక్షిణనమస్కారములు చేసి బయలుదేరిరి. గొప్పబలము గల ఆ ఆరుగురు రాక్షసశ్రేష్ఠులు శరీరములకు సమస్త ఓషధులను, సుగంధద్రవ్యములను పూసికొని, యుద్ధానికి బయలుదేరిరి. త్రిశిరస్సు, అతికాయుడు, దేవాంతకనరాంతకులు, మహోదరమహాపార్శ్వులు

కాలముచేత ప్రేరేపింపబడినవారై బయలుదేరిరి. మహోదరుడు ఐరావతకులమునందు పుట్టిన, నల్లని మేఘమువలె ఉన్న సుదర్శన మను ఏనుగును ఎక్కెను. అన్ని ఆయుధములను ధరించి, అంబులపొదులచేత అలంకరించబడిన ఆ మహోదరుడు ఆ ఏనుగును ఎక్కి అస్తాద్రిశిఖరమునందు సూర్యుని వలె ప్రకాశించెను. త్రిశిరస్సు మంచి గుఱ్ఱములు కట్టిన, అన్ని ఆయుధములతో నిండిన శ్రేష్ఠమైన రథమును అధిష్ఠించెను. ధనుర్ధరుడై రథమును ఎక్కి ఉన్న త్రిశిరస్సు మెరుపులతోను, అగ్నిగుండములతోను, జ్వాలలతోను, ఇంద్రధనుస్సుతోను కూడిన మేఘమువలె ప్రకాశించెను. శ్రేష్ఠమైన రథమునందు త్రిశిరస్సు మూడు కిరీటములతో, మూడు బంగారుపర్వతములతో హిమవత్పర్వతము వలె ప్రకాశించెను.(15-24)

తేజఃశాలి, ధనుర్ధారు లందరిలోను శ్రేష్ఠుడూ అయిన అతికాయుడు శ్రేష్ఠమైన రథమును ఎక్కెను. అతికాయుడెక్కిన రథము చక్రములు, ఇరుసు, ఇరుసుపైన ఉండు కఱ్ఱ, కాడికట్టే పొడుగుకఱ్ఱ చక్కగా ఉండెను. మంచి గుఱ్ఱములు కట్టబడెను. అది అంబులపొదులతోను, ధనుస్సులతోను, ప్రాసలతోను, ఖడ్గములతోను, పరిఘలతోను నిండి ఉండెను. విచిత్రవర్ణముగల బంగారుకిరీటము ధరించి అతడు కాంతిమంతమైన మేరుపర్వతమువలె ప్రకాశించెను. రథమునందున్న ఆ రాజకుమారుడు ఇతర రాక్షసశ్రేష్ఠులతో కూడి, దేవతలతో కూడిన దేవేంద్రునివలె ప్రకాశించెను. నరాంతకుడు బంగారు అలంకారములు గల మనోవేగము గల, ఉన్నతమైన, ఉచ్చైఃశ్రవము వంటి శ్వేతాశ్వమును ఎక్కెను. ఉల్కవంటి ప్రాసను ధరించి ఉన్న నరాంతకుడు శక్తిని గ్రహించి నెమలిపై కూర్చున్న తేజఃశాలియైన కుమారస్వామివలె ప్రకాశించెను. దేవాంతకుడు బంగారముచేత అలంకరించబడిన పరిఘను గ్రహించి, సముద్రమథనమునందు బాహువులచేత మందరపర్వతమును ధరించిన విష్ణువు శరీరమును అనుకరించుచు బయలుదేరి వెళ్ళెను. మహాపార్శ్వుడు గద చేత ధరించి యుద్ధంలో కుబేరుని వలె ప్రకాశించెను.(25-32)

ఆ మహాత్ములు, అమరావతినుండి దేవతలవలె బయలుదేరి వెళ్ళిరి. రాక్షసులు ఏనుగులను, గుఱ్ఱములను, మేఘమువంటి ధ్వని గల రథములను ఎక్కి వారి వెనుక శీఘ్రముగా వెళ్ళిరి. సూర్యునివంటి కాంతి గల, కిరీటధారులు, శోభాసంపన్నులు, మహాత్ములు అయిన ఆ రాజకుమారులు ఆకాశమునందు ప్రకాశించుచున్న గ్రహముల వలె ప్రకాశించిరి. వారు ధరించిన, శరత్కాలమేఘములతో సమానమైన మంగళప్రదమైన వస్త్రపంక్తి ఆకాశమునందు హంసల పంక్తివలె ప్రకాశించెను. మనము మరణించనైనా మరణించవలె లేదా శత్రువులను జయించనైనా జయించవలె

అని నిశ్చయించుకుని ఆ వీరులు యుద్ధమును కోరుచు బయలుదేరిరి. బయల్వెడలిన ఆ రాక్షసులు యుద్ధము నిమిత్తము దుర్మదముగలవారై గర్జించిరి, ధ్వనిచేసిరి. బాణాలను గ్రహించి ప్రయోగించిరి. రాక్షసుల అరపులచేతను, జబ్బలు చరుచుటచేతను భూమి అదరిపోయినట్లు అయినది. వాళ్ళ సింహనాదములచేత ఆకాశము బ్రద్దలైనట్లు అయిపోయినది. గొప్పబలము గల ఆ రాక్షసనాయకులు బయల్వెడలి వచ్చి శిలలను ఆయుధముల నెత్తి యుద్ధమునకు సిద్ధముగా ఉన్న వానరసైన్యమును చూచిరి. (33-39)

వానరులు కూడ నల్లమేఘములు వలె ఉన్న ఆ రాక్షససైన్యమును చూచిరి. ఆ సైన్యము ఏనుగులతోను, గుఱ్ఱములతోను, రథములతో కిక్కిరిసి ఉండెను. వందలకొలది గజ్జెలు మ్రోగుచుండెను. గొప్ప ఆయుధములు ఎత్తి వచ్చుచుండెను. (40,41)

వానరులు, వచ్చిన ఆ సైన్యమును చూచి, తాము యుద్ధము చేయుటకు లక్ష్యముగా రాక్షసులు లభించుటచేత పర్వతములను ఎత్తి మాటిమాటికి అరచిరి. ఆ రాక్షసులను చూడగానే కోపముతో ఈ విధముగా వారికి ఎదురుగ నిలచి అరచిరి. భయంకరమైన మహాబలము గల రాక్షసులు వానరనాయకుల అధికమైన ధ్వనిని విని, శత్రువుల ఆ సంతోషమును సహించనివారై ఎక్కువ భయంకరముగా అరచిరి. వానరసేనానాయకులు భయంకరమైన రాక్షససేనలో ప్రవేశించి, పైకి ఎత్తబడిన పర్వతములతో, శిఖరములతో కూడిన పర్వతముల వలె సంచరించిరి. కోపించిన వానరులలో కొందరు ఆకాశములో ప్రవేశించి కొందరు భూమిమీదనే ఉండి, వృక్షములను, శిలలను ఆయుధములుగా గ్రహించి రాక్షససైన్యములలో సంచరించిరి. వానరశ్రేష్ఠులు విశాలములైన మ్రానులు గల వృక్షములతో యుద్ధము చేసిరి. రాక్షసులతోను, వానరులతోను వ్యాకులమైన ఆ యుద్ధము చాల భయంకరముగా ఉండెను. వానరులు బాణసముదాయములచేత నివారింపబడుచున్నను సాటిలేని వృక్షశిలాశైలవర్షము కురిపించిరి. వానరులు రాక్షసులు కూడ సింహనాదములు చేసిరి. వానరులు శిలలతో రాక్షసులను చూర్ణము చేసిరి. కోపించిన వానరులు యుద్ధములో కవచములను, ఆభరణములను ధరించిన రాక్షసులను చంపిరి. కొందరు రథాలలో ఉన్న వారిని, గజములమీద ఉన్నవారిని, గుఱ్ఱములమీద ఉన్నవారిని చంపిరి. శీఘ్రముగా వీరులైన రాక్షసులను కొట్టిరి. ఆ రాక్షసవీరులు పర్వతశిఖరములు మీదపడుటచేతను, వానరుల పిడికిళ్ళదెబ్బలకు కళ్ళు పైకి వచ్చివేయుటచేతను, కంపించిపోయిరి. క్రిందపడిపోయిరి.

అరచిరి.(42-51)

రాక్షసులు కూడ వాడియైన బాణాలతో వానరుల దేహములు చీల్చివేసిరి. శూలములతోను, ముద్గరములతోను, ఖడ్గములతోను, ప్రాసలతోను, శక్తులతోను కొట్టిరి. అక్కడ శత్రువుల రక్తముచేత పూయబడిన శరీరములు గల వానర-రాక్షసులు పరస్పరము జయము కోరుచు ఒకరినొకరు క్రిందపడద్రోసిరి. ముహూర్తకాలములో ఆ రణభూమి వానరులు రాక్షసులు ప్రయోగించిన శైలములచేత ఖడ్గములచేత వ్యాప్తమై రక్తముచేత తడపబడెను. భూమి అంతా ఇటూ అటూ పడవేయబడిన, పర్వతమువంటి ఆకారముగల యుద్ధమదము గల, మరణించిన రాక్షసులతో నిండిఉండెను. వానరులచే శూలములు విరుగగొట్టి క్రిందికి పడగొట్టబడిన, పడగొట్టబడుచున్న రాక్షసులు వాళ్ళను సమీపించి కరచరణాద్యవయవములతో మరల అద్భుతమైన యుద్ధము చేసిరి. ఆ రాక్షసశ్రేష్ఠులు వానరులను వానరులతో ఢీకొట్టించి చంపిరి. వానరులు కూడ రాక్షసులను రాక్షసులచేత ఢీకొట్టించి చంపిరి. అప్పుడు రాక్షసులు వానరులనుండి శిలలను, శైలములను లాగికొని వాళ్ళను చంపిరి. వానరులు కూడా రాక్షసుల ఆయుధములను లాగికొని వాళ్ళను కొట్టిరి. ఆ వానరులు, రాక్షసులు యుద్ధమునందు పర్వతశిఖరములతో ఒకరి దేహములను ఒకరు బ్రద్దలుకొట్టుకొనిరి. వానరులచేత కొట్టబడిన రాక్షసుల కవచములు బ్రద్దలైపోవుటచే వాళ్ళ శరీరములనుండి, చెట్లనుండి జిగురు కారినట్లు రక్తము కారెను. కొందరు వానరులు రథము చేత రథమునూ, ఏనుగుచేత ఏనుగును, గుఱ్ఱముచేత గుఱ్ఱమును ఢీకొట్టించి చంపిరి.(52-61)

రాక్షసులు క్షురప్ర-అర్ధచంద్ర-భల్లబాణములచేత, వాడియైన ఇతరబాణములచేత వానరులు ప్రయోగించిన వృక్షములను, శిలలను ఖండించిరి. యుద్ధమునందు ఆ పర్వతములతోను, ఛేదించబడిన వృక్షములతోను, చంపబడిన వానర-రాక్షసులతోను వ్యాప్తమైన భూమి నడచుటకు శక్యము కాకుండా ఉండెను. వానరులందరూ దైన్యము లేని మనస్సులతో గర్వించి సంతోషముతో కూడిన చేష్టలు చేయుచు యుద్ధరంగములో భయమును విడచి, అనేకవిధములైన ఆయుధములు గల రాక్షసులతో యుద్ధము చేసిరి. ఆ వ్యాకులమైన యుద్ధమునందు వానరులు సంతోషించుచుండుటను, రాక్షసులు నేలపై కూలుటను చూచి మహర్షులు, దేవతాగణములు సంతోషముతో ధ్వనులు చేసిరి.(62-65)

ఇంతలో నరాంతకుడు వాయువుతో సమానమైన వేగము గల గుఱ్ఱము నెక్కి వాడియైన శక్తిని గ్రహించి, భయంకరమైన ఆ వానరసైన్యములో, మీనము

సముద్రములో ప్రవేశించినట్లు ప్రవేశించెను. వీరుడు, ఇంద్రుని శత్రువూ అయిన ఆ నరాంతకుడు ఒక్కడే క్షణకాలములో ప్రకాశించుచున్న ప్రాసతో ఏడువందలమంది వానరులను పొడిచి చంపి, వానరశ్రేష్ఠుల సైన్యమును సంహరించెను. నరాంతకుడు గుఱ్ఱముమీద కూర్చుండి వానరసైన్యములలో తిరుగుచుండగా విద్యాధరులు, మహర్షులు చూచిరి. అతడు సంచరించిన మార్గము మాంసము రక్తము అను బురదతోను, నేలపై పడిన పర్వతము వంటి ఆకారము గల వానరులతోను నిండి ఉండెను. తమ పరాక్రమము చూపవలెనని వానరులు అనుకొనే లోపుగానే నరాంతకుడు వాళ్ళను అతిక్రమించి చీల్చివేయుచుండెను. అగ్ని వనములను కాల్చినట్లు అతడు వానరసైన్యములను ధ్వంసము చేసెను. వానరులు వృక్షాలను, పర్వతాలను పెకలించే లోపుగానే ప్రాసచేత కొట్టబడినవారై, వజ్రముచేత ఛేదించబడిన పర్వతములవలె పడిపోయిరి. నరులను సంహరించువాడు, బలవంతుడు అయిన నరాంతకుడు, ఆ యుద్ధరంగమునందు ప్రాసను ఎత్తి వర్షాకాలవాయువువలె అన్నివైపులా మర్దించుచు అన్ని దిక్కులయందు సంచరించెను. వానరులు మాటలాడుటకు కాని, నిలచుటకు కాని సమర్థులు కాలేదు. కదలుట చెప్పవలెనా? పరాక్రమవంతుడైన ఆ నరాంతకుడు ఎగురుచున్నవానిని, నిలిచినవానిని, వెళుచున్నవానినీ అందరినీ కూడ కొట్టెను.(66-74)

ఒక్క నరాంతకుడే ఎంతోమంది రాక్షసులువలె సూర్యుని వంటి తేజస్సు గల ప్రాసతో చంపివేయగా వానరసైన్యములు నేలమీద పడిపోయినవి. వానరులు వజ్రాయుధము దెబ్బవంటి ఆ ప్రాసప్రహారమును సహించజాలక బిగ్గరగా అరచిరి. క్రిందపడిపోవుచున్న వానరుల రూపములు వజ్రాయుధముచేత శిఖరాగ్రములను భేదించగా పడిపోవుచున్న పర్వతములవలె ప్రకాశించినవి. పూర్వము కుంభకర్ణునిచేత పడగొట్టబడిన మహాత్ములైన వానరశ్రేష్ఠులు కోల్కొని రక్షణార్థమై సుగ్రీవుని దగ్గరకు వెళ్ళిరి. పరిశీలించి చూచిన సుగ్రీవునకు నరాంతకునికి భయపడి ఇటునటు పారిపోవుచున్న వానరసైన్యము కనబడెను. పారిపోవుచున్న సైన్యమును చూచుచున్న ఆ సుగ్రీవునకు ప్రాస ధరించి గుఱ్ఱమునెక్కి వచ్చుచున్న నరాంతకుడు కనబడెను.(75-80)

గొప్పతేజస్సు గల వానరరాజైన సుగ్రీవుడు చూచి, దేవేంద్రునివంటి పరాక్రమము గల వీరుడైన అంగదునితో- "నీవు వెళ్ళుము. గుఱ్ఱము నెక్కి శత్రుసైన్యమును నశింపచేయుచున్న వీరుడైన ఈ రాక్షసుని వెంటనే చంపివేయుము." అనెను. పరాక్రమవంతుడైన అంగదుడు సుగ్రీవుని మాటలు విని మేఘమువంటి

సైన్యమునుండి సూర్యునివలె శీఘ్రముగా ఎగిరివచ్చెను. వానరశ్రేష్ఠుడైన అంగదుడు బాహుపురులను ధరించి, ధాతువులతో కూడిన పర్వతము వలె ఉండెను. ఏ ఆయుధములూ లేక కేవలము గోళ్ళూ, కోరలూ మాత్రమే ఆయుధములుగా ఉన్న గొప్ప తేజస్సు గల అతడు నరాంతకుని వద్దకు వెళ్ళి- "ఆగుము. సామాన్యులైన ఈ వానరులతో నీవేమి చేసెదవు? వజ్రమువంటి స్పర్శగల నీ ప్రాసను ఈ నా వక్షఃస్థలము మీదకు విసురుము." అనెను. అంగదుని మాటలు వినగానే నరాంతకునకు చాల కోపము వచ్చెను. అతడు కోపించి పెదవులు కరచి, సర్పమువలె నిట్టూర్చుచు అంగదుని సమీపించి, ప్రకాశించుచున్న ఆ ప్రాసను గట్టిగా పట్టి, దానిని అంగదుని మీదికి విసరెను. అది వజ్రమువంటి అంగదుని వక్షఃస్థలముమీద పడి ముక్కలై, నేలమీద పడిపోయెను.(81-88)

అప్పుడు అంగదుడు విరిగిపోయిన నరాంతకుని ప్రాసను చూచి, అరచేయి బాగా చాచి గుఱ్ఱము తలమీద కొట్టెను. నరాంతకుని పర్వతము వంటి గుఱ్ఱము అంగదుని అరచేతిదెబ్బచేత తలపగిలి, పాదములు విరిగి, కళ్ళు, కంటి గ్రుడ్లు బ్రద్దలై, నాలుక పైకి వచ్చి క్రింద పడిపోయెను. గుఱ్ఱము చచ్చి నేలమీద పడిపోవుట చూచి నరాంతకుడు క్రోధావిష్టుడయ్యెను. గొప్ప ప్రభావము గల అతడు పిడికిలి ఎత్తి యుద్ధములో ఆ అంగదుని తలమీద కొట్టెను. పిడికిలి దెబ్బకు బ్రద్దలైన శిరస్సు గలవాడై అంగదుడు చాల వేడియైన రక్తమును అధికముగా స్రవించెను. మాటిమాటికి మండిపడెను. మోహము చెంది, మరల స్మృహ వచ్చిన పిమ్మట ఆశ్చర్యపడెను. పిమ్మట, అంగదుడు మృత్యువుతో సమానమైన వేగము గల పర్వతశిఖరమువంటి పిడికిలిని బిగించి నరాంతకుని వక్షఃస్థలముమీద కొట్టెను. ఆ నరాంతకుడు పిడికిలి దెబ్బకు బ్రద్దలై వక్షఃస్థలము అణగిపోగా, జ్వాలలను కక్కుచు, రక్తముచేత పూయబడిన శరీరముతో, వజ్రపాతముచేత విరిగిన పర్వతమువలె నేలమీద పడెను. శ్రేష్ఠమైన పరాక్రమము గల నరాంతకుణ్ణి యుద్ధములో అంగదుడు చంపివేయగానే ఆకాశమునందు దేవతాముఖ్యులు, వానరులూ కూడ గొప్ప ధ్వని చేసిరి. రామునకు సంతోషము కలిగించు, చేయుటకు చాల కష్టమైన అట్టి పరాక్రమమును చూపి అంగదుడు తనపనికి తానే ఆశ్చర్యపడెను. భయంకరమైన కర్మలు చేయు అతడు మరల యుద్ధమునందు ఉత్సాహమును చూపెను.(89-96)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని అరువది తొమ్మిదవ సర్గము సమాప్తము.

డెబ్బదవ సర్గము

హనుమంతుడు దేవాంతకత్రిశిరస్సులను, నీలుడు మహోదరుణ్ణి, ఋషభుడు మహాపార్శ్వుణ్ణి చంపుట.

నరాంతకుడు మరణించుట చూచి రాక్షసశ్రేష్ఠులైన దేవాంతకుడు, త్రిశిరస్సు, పులస్త్యుని కుమారుడైన మహోదరుడు ఏడ్చిరి. మహోదరుడు మేఘమువలె ఉన్న పెద్ద ఏనుగు ఎక్కి మహావేగముగా గొప్ప పరాక్రమము గల అంగదునిమీదికి వెళ్ళెను. సోదరుని మరణమువలన దుఃఖించుచున్న బలవంతుడైన దేవాంతకుడు కూడ భయంకరమైన పరిఘతో అంగదునిమీదకు వెళ్ళెను. వీరుడైన త్రిశిరస్సు కూడ ఉత్తమములైన గుఱ్ఱములు కట్టిన సూర్యునితో సమానమైన రథమునెక్కి అంగదునిమీదకు వెళ్ళెను. దేవతల దర్పమును అణచిన ఆ ముగ్గురు రాక్షసనాయకులు తన మీదికి వచ్చుచుండుట చూచి అంగదుడు పెద్ద కొమ్మలున్న ఒక వృక్షమును పెకలించి, ఆ మహావృక్షమును దేవేంద్రుడు మండుచున్న పిడుగును విసిరినట్లు ఆ దేవాంతకునిమీదికి పడవేసెను. త్రిశిరస్సు సర్పములవంటి బాణాలతో ఆ వృక్షమును ఛేదించెను. అప్పుడు ఆ అంగదుడు వృక్షము ఛేదింపబడినట్లు చూచి పైకి ఎగిరి, వృక్షములను, శిలలను వర్షించెను. త్రిశిరస్సు కోపముతో వాడియైన బాణాలచేత వాటిని ఖండించెను.(1-8)

ఆ వృక్షములను మహోదరుడు పరిఘచేత విరగగొట్టెను. త్రిశిరస్సు బాణాలు ప్రయోగించుచు శీఘ్రముగా ఆ వీరుడైన అంగదుని మీదకు వెళ్ళెను. మహోదరుడు ఏనుగునెక్కి అంగదుని మీదికి వెళ్ళి కోపముతో వజ్రమువంటి తోమరములతో అతని వక్షఃస్థలముమీద కొట్టెను. వేగవంతుడైన దేవాంతకుడు కోపించి, అంగదుని దగ్గరకు వచ్చి, వానిని వెంటనే పరిఘతో కొట్టి దూరముగా వెళ్ళెను. ముగ్గురు రాక్షసవీరులు ఒక్కమారు ఎదిరించినను మహాతేజఃశాలి, ప్రతాపవంతుడు అయిన అంగదుడు ఏమాత్రము జంకలేదు. అతడు మహావేగముగా ఎదురుగా వెళ్ళి దేవాంతకుని ఏనుగును అరచేతితో కొట్టెను. యుద్ధమునందు అతని దెబ్బచేత ఆ గజరాజు నేత్రములు పడిపోయి మరణించినది. అంగదుడు, ఆ ఏనుగుదంతమును ఊడబెరికి, శీఘ్రముగా ఆ దేవాంతకునిమీదికి వెళ్ళి అతనిని కొట్టెను. తేజఃశాలియైన ఆ దేవాంతకుడు గాలికి కదల్పబడిన వృక్షమువలె వ్యాకులుడై లత్తుకరసముతో సమానమైన రంగుగల అధికమైన రక్తమును కార్చెను. అతడు అతికష్టముమీద తెప్పరిల్లి, పరిఘను గట్టిగా పట్టి అంగదుణ్ణి వేగముగా కొట్టెను. పరిఘ దెబ్బ తిన్న

అంగదుడు మోకాళ్ళమీద నేలపై బోర్లపడి మరల పైకి లేచెను. అంగదుడు పైకి ఎగురుచుండగా త్రిశిరస్సు వంకర లేకుండా వెళ్ళు, భయంకరములైన మూడు బాణములతో అతని లలాటముమీద కొట్టెను.(9-19)

ముగ్గురు రాక్షసవీరులు అంగదుణ్ణి చుట్టుముట్టుట చూచి, హనుమంతుడు, నీలుడు అక్కడికి వెళ్ళిరి. అప్పుడు నీలుడు పర్వతశిఖరమును త్రిశిరస్సుపై విసిరివేయగా అతడు దానిని బాణాలతో బ్రద్దలుకొట్టెను. అనేక బాణములచేత బ్రద్దలుకొట్టబడిన ఆ పర్వతశిఖరము, శిలలన్నియు ముక్కలైపోగా, అగ్నికణములతోను, అగ్నిజ్వాలలతోను కూడినదై క్రిందపడెను. బలవంతుడైన దేవాంతకుడు యుద్ధమునందు ఉత్సాహముతో విజృంభించిన హనుమంతుణ్ణి చూచి, పరిఘ చేత ధరించి అతనిమీదికి వేగముగా పరుగెత్తెను. వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు పైకి ఎగిరి, తనమీదకు శీఘ్రముగా వచ్చుచున్న ఆ దేవాంతకుణ్ణి, వజ్రమువంటి పిడికిలితో నెత్తిమీద కొట్టి, ధ్వనిచేత రాక్షసులను కంపింపచేసెను. రాక్షసరాజైన రావణుని కుమారుడైన ఆ దేవాంతకుని తల హనుమంతుని పిడికిలి దెబ్బకు నలిగి ముక్కలైపోయెను. దంతాలు, కళ్ళు బయటపడిపోయెను. నాలుక వ్రేలాడుచుండెను. ఈవిధముగా అతడు ప్రాణాలు విడచి వెంటనే నేలమీద పడెను.(20-26)

రాక్షసయోధులలో ప్రధానుడు, గొప్పబలము గలవాడు, దేవతల శత్రువూ అయిన ఆ దేవాంతకుడు యుద్ధమునందు మరణించిన పిమ్మట త్రిశిరస్సు నీలుని వక్షఃస్థలముమీద వాడియైన అగ్రభాగము గల, భయంకరమైన బాణవర్షము కురిపించెను. కోపించిన మహోదరుడు, సూర్యుడు మందరపర్వతమును ఎక్కినట్లు, పర్వతము వంటి ఏనుగును మరల ఎక్కి, గర్జించుచున్న మేఘము మెరుపులతో కూడిన వర్షమును పర్వతముమీద కురిపించినట్లు బాణముల వర్షమును నీలుని మీద వర్షించెను. బాణసముదాయముల వర్షముచేత వానరసేనాపతియైన నీలుని శరీరము బ్రద్దలైపోయి అతని అవయవములు శిథిలము లయ్యెను. ఈ విధముగా అతనిని, మహాబలవంతుడైన మహోదరుడు కదలకుండా చేసెను. పిమ్మట నీలుడు సంజ్ఞ పొంది, వృక్షసముదాయముతో కూడిన పర్వతమును పెకలించి, చాల ఉగ్రమైన వేగముతో పైకి ఎగిరి, ఆ పర్వతముతో మహోదరుని తలమీద కొట్టెను. పర్వతము మీద పడుటచేత విరిగిపోయిన ఆ మహోదరుడు, ఆ మహాగజముకూడా వానిని పొడవగా, ప్రాణములు విడచి, వజ్రముచేత కొట్టబడిన పర్వతమువలె నేలమీద పడిపోయెను.(27-32)

త్రిశిరస్సు తన పినతండ్రియైన మహోదరుడు మరణించుట చూచి, చాలా కోపించి, ధనుస్సు ధరించి, హనుమంతుణ్ణి వాడియైన బాణాలతో కొట్టెను. హనుమంతుడు కోపించి పర్వతశిఖరమును మీద పడవేయగా బలవంతుడైన త్రిశిరస్సు దానిని వాడియైన బాణాలతో ముక్కలు చేసెను. హనుమంతుడు ఆ శిఖరము వ్యర్థమైపోవుట చూచి, యుద్ధరంగమునందు త్రిశిరస్సుపై వృక్షవర్షమును కురిపించెను. ప్రతాపవంతుడైన త్రిశిరస్సు వచ్చి పడుచున్న ఆ వృక్షముల వర్షమును వాడియైన బాణాలతో ఆకాశమునందే ఖండించి బిగ్గరగా అరచెను. హనుమంతుడు కోపించి త్రిశిరస్సు గుఱ్ఱమును, సింహము ఏనుగును చీల్చివేసినట్లు గోళ్ళతో చీల్చివేసెను. త్రిశిరస్సు, యముడు కాళరాత్రిని స్వీకరించినట్లు శక్తిని గ్రహించి దానిని హనుమంతుని మీద ప్రయోగించెను. హనుమంతుడు ఆకాశమునుండి విసిరినట్లు వచ్చి పడుచున్న అగ్నిపిండమువలె ఉన్న ఆ శక్తి తనమీద పడకుండగానే పట్టుకుని విరిచివేసి గర్జించెను. (33-39)

భయంకరమైన ఆ శక్తిని హనుమంతుడు విరిచివేయుటచూచి వానరులు సంతోషించి మేఘముల వలె గర్జించిరి. పిమ్మట రాక్షసశ్రేష్ఠుడైన త్రిశిరస్సు ఖడ్గమును ఎత్తి దానిని హనుమంతుని వక్షఃస్థలముమీద లోతుగా గ్రుచ్చెను. ఖడ్గప్రహారమును తిన్న పరాక్రమశాలి అయిన హనుమంతుడు ఆ త్రిశిరస్సు వక్షఃస్థలముమీద అరచేతితో కొట్టెను. గొప్ప తేజస్సు గల త్రిశిరస్సు హనుమంతుని అరచేతి దెబ్బ తగులుటచేత స్పృహ తప్పి, చేతిలోని ఆయుధమును జారవిడచి నేలమీద పడిపోయెను. పర్వతమువంటి వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు క్రింద పడిపోవుచున్న అతని ఖడ్గమును తీసికొని ఆ రాక్షసుల నందరినీ భయపెట్టుచు గర్జించెను. ఆ రాక్షసుడు ఆ ధ్వనిని సహించక పైకెగిరి, హనుమంతుణ్ణి పిడికిలిచే కొట్టెను. హనుమంతుడు ఆ పిడికిలి దెబ్బకు చాలా కోపించి త్రిశిరస్సును, కిరీటమునందు పట్టుకొని, కిరీటములతోను, కుండలములతోను కూడిన అతని శిరస్సులను, దేవేంద్రుడు త్వష్ట కుమారుడైన విశ్వరూపుని శిరస్సులను ఖండించినట్లు వాడియైన ఖడ్గముతో ఖండించెను. విశాలమైన ఇంద్రియములు, ప్రజ్వలించుచున్న అగ్నులవంటి నేత్రములు గల, పర్వతములతో సమానములైన ఆ త్రిశిరస్సు తలలు, ఆకాశమార్గమునుండి జారవిడచిన నక్షత్రములవలె నేలమీద పడినవి. (40-48)

దేవేంద్రుని వంటి పరాక్రమము గల హనుమంతుడు దేవతాశత్రువైన ఆ త్రిశిరస్సును చంపగానే వానరులు ఆనందముతో ధ్వనిచేసిరి. భూమి చలించెను. రాక్షసులు నాలుగు మూలలకూ పారిపోయిరి. త్రిశిరస్సును, మహోదరునీ,

ఎదిరింపశక్యముకాని దేవాంతకనరాంతకులనూ వానరవీరు లట్లు చంపివేయుట చూచి, మత్తుడు(మహాపార్శ్వుడు) కోపావిష్టుడయ్యెను. అప్పుడతడు పూర్తిగా ఇనుముతో చేసిన, బంగారు పట్టీలు వేసిన గదను ధరించెను. ఆ గద మీద మాంసరక్తముల నురుగు కప్పి ఉండెను. ప్రకాశించుచున్న చాలా పెద్దదైన దానికి శత్రువుల రక్తముచే అనేకపర్యాయములు తృప్తి కలిగింపబడెను. దాని అగ్రభాగము తేజస్సుతో మండుచుండెను. అది ఎఱ్ఱని పుష్పమాలలచేత అలంకరించబడెను. పూర్వము ఐరావతము, మహాపద్మము,(పుండరీకము) సార్వభౌమము అను దిగ్గజములకు కూడా అది దిగులు కలిగించెను. రాక్షసశ్రేష్ఠుడైన ఆ మత్తుడు కోపించి, గదను ధరించి, ప్రజ్వలించుచున్న ప్రళయకాలాగ్నివలె వానరులమీదికి వేగముగా వెళ్ళెను.(49-54)

అప్పుడు, ఋషభుడను వానరనాయకుడు ఎగిరివచ్చి రావణుని తమ్ముడైన ఆ మత్తానీకుని(మహాపార్శ్వుని) ఎదుట నిలచెను. అతడు తన ఎదుట నిలచిన, పర్వతము వంటి ఆ ఋషభుణ్ణి చూచి, కోపించి, వజ్రముతో సమానమైన గదతో అతని వక్షఃస్థలముమీద కొట్టెను. అతడు ఆ గదతో కొట్టగా వానరశ్రేష్ఠుడైన ఋషభుని వక్షఃస్థలము బ్రద్దలయ్యెను. అపుడాతడు చలించిపోయి అధికముగా రక్తమును స్రవించెను. వానరనాయకుడైన ఆ ఋషభుడు చాల సేపటికి స్పృహ పొంది, కోపముతో పెదవులు అదరగా, మహాపార్శ్వుణ్ణి చూచెను. పర్వతము వంటి ఆకారము గల, వానరవీరులలో ముఖ్యుడైన ఆ వేగవంతుడైన ఋషభుడు వేగముతో ఆ రాక్షసుని సమీపించి, పిడికిలి బిగించి, వాని వక్షఃస్థలముమీద కొట్టెను. మహాపార్శ్వుడు రక్తముతో తడసిన దేహముకలవాడై, మొదలు నరకిన చెట్టువలె వెంటనే నేలమీద పడి మూర్ఛిల్లెను. ఋషభుడు యమదండమువంటి భయంకరమైన ఆ గదను వెంటనే తీసికొని గర్జించెను. మహాపార్శ్వుడు ముహూర్తకాలము మరణించినట్లు పడిఉండెను. అతడు వెంటనే స్పృహ రాగా లేచి ఋషభుణ్ణి కొట్టెను. ఋషభుడు మూర్ఛ చెంది క్షణకాలము పాటు నేలమీద పడెను. మరల సంజ్ఞ వచ్చిన పిమ్మట పైకి లేచి మహాపర్వతశిఖరమువంటి ఆ గదను గ్రహించి అతనిని కొట్టెను. భయంకరమైన ఆ గద, భయంకరుడు, దేవ-యజ్ఞ-బ్రాహ్మణుల శత్రువు అయిన ఆ మహాపార్శ్వుని దేహమును సమీపించి అతని వక్షఃస్థలమును బ్రద్దలుకొట్టెను. అప్పుడు అతడు పర్వతము గైరికాదిధాతువుల ద్రవమును కార్చినట్లు, అధికముగా, రక్తమును కార్చెను. ఋషభుడు అతని గద పడిన వైపు శీఘ్రముగా పరుగెత్తి వెళ్ళి, భయంకరమైన ఆ గదను గ్రహించి, మాటిమాటికి దానిని నేలపై

కొట్టి ఊపుచు, దానితో ఆ మహాపార్శ్వుణ్ణి కొట్టెను. తన గదచేతనే కొట్టబడి బ్రద్దలైన దంతములు, నేత్రములు గల ఆ మహాపార్శ్వుడు వజ్రముచేత కొట్టబడిన పర్వతము వలె పడిపోయెను.(55-65)

ఆ రాక్షసుడు నేత్రములు బ్రద్దలైపోయి, బలము ఉడిగి, ఆయుర్దాయము చెల్లి, నేలమీద పడిపోయిన వెంటనే ఆ రాక్షససైన్యము పారిపోయెను. రావణుని సోదరుడైన మహాపార్శ్వుడు మరణించగానే సముద్రము వలె విశాలమైన ఆ రాక్షససైన్యము, ఆయుధములను విడచి, కేవలము ప్రాణాలను రక్షించుకొనుటకై, గట్టు తెగిన సముద్రము వలె పారిపోయెను.(66, 67)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బదవ సర్గము సమాప్తము.

డెబ్బది ఒకటవ సర్గము

అతికాయుడు ఘోరయుద్ధము చేయుట; లక్ష్మణుడు వానిని సంహరించుట.

గొప్ప తేజస్సు కలవాడు, బ్రహ్మనుండి వరములను పొందినవాడు, పర్వతమువంటి దేహము గలవాడు, యుద్ధములో దేవదానవుల దర్పమును తొలగించినవాడు అయిన అతికాయుడు, తుముల (వ్యాకులమైన) ధ్వని చేయుచు రోమాంచమును కలిగించు తన సైన్యము వ్యథ చెందుటను, ఇంద్రుని వంటి పరాక్రమము గల తన సోదరులు మరణించుటను చూచి, తన పినతండ్రులు, రాక్షసశ్రేష్ఠులు, సోదరులు అయిన యుద్ధోన్మత్త-మత్తులు (మహోదర మహాపార్శ్వులు) కూడ మరణించినట్లు చూచి చాల కోపించెను. ఇంద్రుని శత్రువైన ఆ అతికాయుడు వేయిమంది సూర్యుల సముదాయము వలె ప్రకాశించుచున్న రథమును ఎక్కి వానరులమీదికి శీఘ్రముగా వెళ్ళెను. కిరీటమును, మెరచుయున్న కుండలములను ధరించి ఉన్న అతడు ధనస్సును చరచి, తన పేరు వినిపించి, బిగ్గరగా అరచెను. అతడు సింహనాదముచేత, తన పేరు వినిపించుటచేత, భయంకరమైన టంకారధ్వనిచేత వానరులకు భయమును కలిగించెను. ఆ వానరులందరు అతని పెద్ద దేహమును చూడగానే కుంభకర్ణుడు మరల లేచినాడని తలచి, భయాక్రాంతులై ఒకరినొకరు ఆశ్రయించిరి. త్రివిక్రమావతారసమయమునందు విష్ణువు రూపమువలె ఉన్న అతని రూపము చూచి ఆ వానరయోధులు భయపడి ఆ యా దిక్కులకు పరుగెత్తిరి.(1-8)

అప్పుడు, ధనుర్ధరుడై రథముమీద ఉన్న పర్వతము వంటి దేహముగల, కాలమేఘమువలె గర్జించుచున్న ఆ అతికాయుణ్ణి రాముడు దూరమునుండి చూచెను. రాముడు పెద్ద దేహము గల ఆ అతికాయుణ్ణి చూచి, చాలా అశ్చర్యపడుచు, వానరులకు ధైర్యము చెప్పి, విభీషణుని- "ధనుస్సు ధరించి, వెయ్యి గుఱ్ఱములు కట్టిన విశాలమైన రథమునందు ఉన్న, పచ్చని కళ్ళు, పర్వతమువంటి దేహము గల ఇతడు ఎవడు? ఇతడు తన చుట్టూ ఉన్న కాంతిగల వాడియైన శూలములతోనూ, చాలా వాడియైన ప్రాసలతోనూ, తోమరములతోనూ, చుట్టూ భూతములు ఉన్న మహేశ్వరుని వలె ప్రకాశించుచున్నాడు. రథమునందు మృత్యుదేవత జివ్హాల వంటి ప్రకాశ గల శక్తులు ఇతనిచుట్టూ ఉండుటచే ఇతడు చుట్టూ మెరుపులు ఉన్న మేఘమువలె ప్రకాశించుచున్నాడు. సిద్ధముగా ఉంచబడిన, బంగారము పూసిన పై భాగములు గల ధనుస్సులు ఇతని శ్రేష్ఠమైన రథమును, ఇంద్రధనుస్సు ఆకాశమునువలె అన్ని వైపులా ప్రకాశింపజేయుచున్నవి. రథికులలో శ్రేష్ఠుడైన రాక్షసవీరుడు యుద్ధభూమిని ప్రకాశింపచేయుచు, సూర్యునివంటి కాంతి గల రథముపై వచ్చుచున్నాడు. రాహుచిహ్నమును ధ్వజాగ్రమునందు నిలిపిన ఇతడు సూర్యకిరణములవంటి కాంతులు గల బాణములతో పది దిక్కులను ప్రకాశింపచేయుచున్నాడు."(9-17)

"ఈతని బంగారు పైభాగము గల అలంకరింపబడిన, మేఘము వలె ధ్వని చేయుచున్న, మూడు వంపులున్న ధనుస్సు ఇంద్రధనుస్సు వలె ప్రకాశించుచున్నది. ధ్వజముతోనూ, పతాకలతోనూ అలంకరింపబడి, మంచి క్రింది దూలము గల, ఉరుముల వంటి ధ్వని గల ఈతని పెద్ద రథమునందు నలుగురు సారథు లున్నారు. ఈతని రథమునందు ఇరవై, పది, ఎనిమిది అంబులపొదులూ, భయంకరములైన ధనుస్సులూ, బంగారు రంగు గల నారులూ ఉన్నవి. ఈతని రథముమీద పార్శ్వములందు ప్రకాశించుచున్న రెండు ఖడ్గములు తళతళలాడుచున్నవి. పూర్తిగా పది హస్తముల పొడవు గల ఈ ఖడ్గములు నాలుగు హస్తముల పొడవున్న పిడులచేత బిగించబడినవి. మెడలో ఎఱ్ఱని త్రాడు ధరించి, పెద్ద పర్వతమువలె ఉన్న, నల్లని దేహము గల యముని వంటి విశాలమైన ముఖము గల ఈ ధీరుడు మేఘము మీద నున్న సూర్యుడు వలె ఉన్నాడు. బంగారు బాహుపురులు కట్టిన భుజములతో ఇతడు పర్వతరాజైన హిమవంతుడు ఉన్నతమైన శిఖరములతో శోభించుచున్నట్లు శోభించుచున్నాడు. ఈతని భయంకరమైన ముఖము రెండు కుండలములతో పునర్వసు నక్షత్రముల మధ్య నున్న పూర్ణచంద్రబింబమువలె ప్రకాశించుచున్నది.

విభీషణా! ఈ రాక్షసోత్తముడు ఎవడో నాకు చెప్పుము. ఇతన్ని చూచి వానరులందరూ భయపీడితులై దిక్కులు పట్టి పారిపోవుచున్నారు." అని ప్రశ్నించెను.(18-25)

రాముడు ఇట్లు ప్రశ్నించగా, విభీషణుడు- "పది కంఠములూ, గొప్పతేజస్సు గల రాజైన రావణుడు కుబేరుని తమ్ముడు. మహోత్సాహము గల అతడు చేయు పనులు భయంకరముగా ఉండును. అతడు రాక్షసుల ప్రభువు కదా! ఆ రావణునకు పరాక్రమవంతుడైన ఒక కుమారు దున్నాడు. అతడు యుద్ధములో రావణునితో సమానుడు. పెద్దలను సేవించువాడు. వినిన విషయములను(లేదా వేదములను) ధరించువాడు. అస్త్రవేత్త. అందరిలోనూ శ్రేష్ఠుడు. అతడు గుఱ్ఱములను, ఏనుగులను ఎక్కుటయందు, ఖడ్గమును, ధనుస్సును ఉపయోగించుటయందూ, సైన్యమును నడుపుటయందూ, సామ, దాన, భేదోపాయములందూ, నీతియందూ, ఆలోచనయందూ, సమర్థుడుగా గౌరవింపబడినవాడు. ఇతడు ధాన్యమాలిని పుత్రుడైన అతికాయుడు. ఈతని బాహువును ఆశ్రయించుకొని లంక నిర్భయముగా ఉన్నది. తపస్సు చేత మనస్సు పవిత్రము చేసికొనిన ఇతడు బ్రహ్మను సంతోషింపజేసి అస్త్రములను పొంది, శత్రువులను ఓడించినాడు. బ్రహ్మదేవుడు ఇతనికి సురాసురుల చేతులలో చావు లేకపోవుటనూ, దివ్యమైన ఈ కవచమునూ, సూర్యుడువలె ప్రకాశించుచున్న ఈ రథమునూ ఇచ్చెను. ఇతడు అనేక పర్యాయములు దేవతలనూ, దానవులనూ ఓడించి, యక్షులను నశింపజేసి రాక్షసులను రక్షించినాడు. యుద్ధములో బాణములచేత బుద్ధిమంతుడైన ఇంద్రుని వజ్రాయుధమును కదలకుండ చేసిన ఇతడు అతికాయుడు. వరుణుని పాశమును కూడా వ్యర్థమగునట్లు చేసినాడు. బలవంతుడూ, రాక్షసులలో శ్రేష్ఠుడూ, బుద్ధిమంతుడూ అయిన ఈ రావణపుత్రుడు దేవదానవుల దర్పమును అణచినాడు. పురుషోత్తముడవైన రామా! అందువలన ఈతని విషయమున శీఘ్రముగా ప్రయత్నమును చేయుము. అట్లు కాకపోయినచో ఇతడు బాణములచేత వానరసైన్యములను నశింపచేయగలడు.'' అని చెప్పెను.(26-36)

మహాబలశాలియైన అతికాయుడు వానరసైన్యములో ప్రవేశించి ధనుస్సు చరచుచు మాటిమాటికి అరచెను. భయంకరమైన దేహముగల, రథము నధిష్ఠించి ఉన్న, రథికులలో శ్రేష్ఠుడైన అతనిని చూచి ప్రధానులైన మహాత్ములైన వానరులు ఎదిరించిరి. కుముదుడు, ద్వివిదుడు, మైందుడు, నీలుడు, శరభుడు, వృక్షములను పర్వతశిఖరములను గ్రహించి ఒక్క మారుగా అతనిని ఎదిరించుటకై శీఘ్రముగా వెళ్ళిరి. గొప్ప తేజస్సు కలవాడు, అస్త్రములు తెలిసిన వారిలో శ్రేష్ఠుడూ అయిన

అతికాయుడు వాళ్ళు ప్రయోగించిన వృక్షములను, పర్వతశిఖరములను బంగారముచేత అలంకరించబడిన బాణాలతో నరికివేసెను. యుద్ధమునందు తన ఎదుట ఉన్న ఆ వానరులను అందరినీ పూర్తిగా ఇనుముతో చేసిన బాణాలతో కొట్టెను. వాని బాణవర్షముచేత పీడితులై, శరీరములు బ్రద్దలైపోగా ఓడిపోయిన ఆ వానరులు ఏమీ చేయజాలక పోయిరి. యౌవనముచేత గర్వించి ఉన్న ఆ రాక్షసుడు, కోపించిన సింహము లేళ్ళ గుంపును వలె ఆ వానరవీరుల సైన్యమును భయపెట్టెను.(37-43)

ఆ రాక్షసవీరుడు వానరసైన్యములో యుద్ధముచేయని వానిని ఎవ్వనిని కొట్టలేదు. ధనుస్సు, అంబులపొది ధరించి ఉన్న అతడు శీఘ్రముగా రాముని సమీపమునకు వెళ్ళి గర్వమును ప్రకటించు మాటలు ఇట్లు పలికెను- "నేను ధనుర్బాణములను ధరించి ఈ రథముమీద ఉన్నాను. సామాన్యునితో ఎవ్వనితోనూ యుద్ధము చేయను. ఎవనికైన శక్తీ, ఉత్సాహమూ ఉన్నచో అతడు శీఘ్రముగా ఇప్పుడే ఇక్కడికి వచ్చి నాతో యుద్ధము చేయవచ్చును." శత్రుసంహారకుడైన లక్ష్మణునకు అతని మాటలు వినగానే కోపము కలిగెను. అతడు ఆ మాటలు సహించక శీఘ్రముగా ముందుకు వచ్చి, చిరునవ్వు నవ్వి ధనుస్సు పట్టి అంబులపొదినుండి బాణమును పైకి తీసి, అతికాయుని ఎదుట ఆ గొప్ప ధనుస్సును చరచెను. లక్ష్మణుడు చేసిన ఆ టంకారధ్వని భూమినంతను, ఆకాశమును, సముద్రమును, దిక్కులను నింపుచు, భయంకరమై రాక్షసులకు భయము కలిగించెను. గొప్ప తేజస్సూ, బలమూ గల అతికాయుడు లక్ష్మణుడు చేసిన భయంకరమైన ధనుష్టంకారమును విని ఆశ్చర్యము చెందెను.(44-49)

యుద్ధానికై తన ఎదుట నిలచిన లక్ష్మణుని చూచి, అతికాయుడు కోపించి వాడియైన బాణమును తీసి- "లక్ష్మణా! నీవు చిన్నవాడవు; పరాక్రమములయందు నేర్పు లేనివాడవు; యమునివంటి నాతో యుద్ధము ఎందుకు చేసెదవు? వెళ్ళుము. నా చేతులతో విడచిన బాణముల వేగమును హిమవత్పర్వతము గాని, ఆకాశము గాని, భూమి గాని సహింపజాలవు కదా! సుఖముగా అణగిఉన్న ప్రళయకాలాగ్నిని రగుల్కొలుపవలె నని కోరుచున్నావు. ధనుస్సును అక్కడ విడచి వెనుకకు వెళ్ళుము. నన్ను ఎదిరించి ప్రాణాలు కోల్పోకుము. అట్లుకాక మొండితనము వహించి వెనుకకు వెళ్ళుటకు ఇష్టపడనిచో నిలబడుము. ప్రాణాలు విడచి యమలోకమునకు వెళ్లగలవు. శత్రువుల గర్వమును అణచేవీ, పరమేశ్వరుని ఆయుధములతో సమానములూ, శుద్ధమైన బంగారముచేత అలంకరింపబడినవీ అయిన వాడియైన నా బాణములు

చూడుము. సర్పమువంటి ఈ బాణము, కోపించిన సింహము ఏనుగురక్తము త్రాగినట్లు నీ రక్తమును త్రాగగలదు." అని పలికి కోపావిష్టుడై ధనుస్సుపై బాణము సంధించెను. (50-56)

యుద్ధరంగములో రోషముతోను, గర్వముతోను నిండిన అతికాయుని మాటలు విని లక్ష్మణుడు కోపించెను. గొప్పబలము, ఉత్తమమైన మనస్సు, అధికమైన శోభా గల ఆ లక్ష్మణుడు- "ఓ! దురాత్ముడా! మాటలు చెప్పినంతమాత్రమున నీవు గొప్పవాడవు కాజాలవు. బడాయి చెప్పుకొనినంతమాత్రాన ఎవరూ ఉత్తమపురుషులు కారు. ఇదిగో ధనుర్బాణములు ధరించి నిలచి ఉన్నాను; నామీద నీ బలము చూపుము. పనిచేసి నీ గొప్పతనమును చూపించుము. బడాయి చెప్పుకొనకుము. పౌరుష మున్నవానినే శూరుడని అందురు. నీవు ధనుర్ధరుడవై అన్ని ఆయుధములతో రథముమీద ఉన్నావు. బాణాలచేత గాని, అస్త్రాలచేత గాని పరాక్రమమును చూపుము. అటుపిమ్మట నేను, వాడియైన బాణాలతో గాలి, తగిన కాలమునందు పక్వమైన తాడిపండును తొడిమినుండి పడగొట్టినట్లు నీ తల పడగొట్టెదను. ఇప్పుడు, శుద్ధమైన బంగారము అలంకారముగా గల నా బాణములు నీ శరీరమునుండి, బాణముల ములుకుల మధ్యనుండి పైకి వచ్చుచున్న రక్తమును త్రాగగలవు. ఇతడు చిన్నవాడే కదా అని నన్ను తేలికగా చూడకుము. నేను బాలుడనైనా, వృద్ధుడనైనా యుద్ధములో నీ పాలిట మృత్యుదేవతను. బాలుడైనా విష్ణువు మూడు అడుగులచేత మూడులోకాలను ఆక్రమించినాడు కదా." అని పలికెను. (57-63)

హేతుబద్ధమూ, ఉత్తమమైన అర్థము కలదీ అయిన లక్ష్మణుని మాట విని అతికాయుడు చాల కోపించి ఉత్తమమైన బాణమును గ్రహించెను. అప్పుడు మహాత్ములైన విద్యాధరులు, భూతములు, దేవతలు, దైత్యులు, మహర్షులు, యక్షులు వచ్చి ఆ యుద్ధమును చూచిరి. అతికాయుడు కోపముతో బాణమును ధనుస్సుమీద సంధించి, ఆకాశమును(దూరమును) కుదించుచున్నాడా అన్నట్లు(వేగముగా) దానిని లక్ష్మణుని మీదికి ప్రయోగించెను. శత్రువీరసంహారకుడైన లక్ష్మణుడు వచ్చి మీద పడుచున్న, సర్పము వలె ఉన్న ఆ వాడియైన బాణమును అర్ధచంద్రబాణముచేత ఛేదించెను. ఆ విధముగా ఖండింపబడిన, దేహము తెగిన సర్పమువలె పడిపోయిన, ఆ బాణమును చూచి అతికాయుడు చాలా కోపించి ఐదు బాణములను సంధించి లక్ష్మణుని మీద ప్రయోగించెను. లక్ష్మణుడు ఆ బాణములు తనమీదకు రాకపూర్వమే వాటిని వాడియైన బాణాలచేత ఛేదించెను. శత్రువీరులను సంహరించు లక్ష్మణుడు వాడియైన బాణాలచేత ఆ బాణాలను ఛేదించి, తేజస్సుతో మండుచున్నదా అన్నట్లున్న

వాడియైన బాణమును గ్రహించెను. లక్ష్మణుడు ఆ బాణమును గ్రహించి, శ్రేష్ఠమైన ధనుస్సుమీద సంధించి, వేగముగా లాగి, విడచి, ఆ రాక్షసశ్రేష్ఠుని లలాటముమీద కొట్టెను. భయంకరుడైన ఆ రాక్షసుని లలాటముమీద లోతుగా దిగిపోయిన బాణము రక్తముతో తడిసి, పర్వతముమీద ఉన్న సర్పరాజు వలె కనబడెను. లక్ష్మణుని బాణముచేత పీడింపబడిన రాక్షసుడు రుద్రుని బాణముచేత కొట్టబడిన త్రిపురనగరగోపురము వలె కంపించెను. (64-74)

మహాబలశాలియైన ఆ రాక్షసుడు నిలద్రొక్కుకొని, తానేమి చేయవలెనో విమర్శించుకొని "బాగు బాగు! బాణమును ఇట్లు ప్రయోగించిన నీవు నాకు శ్లాఘించదగిన శత్రువుగా ఉన్నావు." అని పలికి, ముఖము తెరచి, బాహువులు వంచి, రథము పైభాగము పట్టుకొని నిలచి, రథముచేత ఇటు అటు సంచరించెను. ఆ రాక్షసశ్రేష్ఠుడు ఒకటి, మూడు, ఐదు, ఏడు ఈవిధముగా బాణములను పైకి తీసి, సంధించి, లాగి, విడచెను. ఆ రాక్షసవీరుని ధనుస్సునుండి బయల్వెడలిన, బంగారు పొన్నులు గల, మృత్యుదేవతతో సమానములైన, సూర్యునివంటి కాంతి గల ఆ బాణములు ఆకాశమును మండుచున్నట్లు చేసినవి. ఆ బాణసముదాయములను లక్ష్మణుడు ఏమాత్రము కంగారుపడక అనేక బాణములచేత ఛేదించెను. ఇంద్రుని శత్రువైన అతికాయుడు ఆ బాణములన్నీ యుద్ధములో ఛేదించబడుట చూచి, కోపించి, ఒక వాడియైన బాణము తీసెను. గొప్ప తేజస్సు గల అతడు ఆ బాణమును సంధించి, వెంటనే ప్రయోగించి, తన ఎదుటనున్న లక్ష్మణుని వక్షఃస్థలము మీద కొట్టెను. అతికాయుడు తన వక్షస్థలముమీద బాణముచేత కొట్టగా లక్ష్మణుని శరీరమునుండి, మదించిన గజమునుండి మదోదకమువలె, అధికముగా రక్తము స్రవించెను. (75-82)

లక్ష్మణుడు వెంటనే తన శరీరమునుండి ఆ బాణమును తొలగించుకొని, వాడియైన బాణము తీసి దానిపై ఆగ్నేయాస్త్రమును సంధించగా మహాత్ముడైన లక్ష్మణుడు, ఆ బాణము, ధనుస్సూ కూడా ప్రజ్వలించెను. అతికాయుడు సౌరాస్త్రమును గ్రహించి, దానిని సర్పమువలె ఉన్న బంగారు పొన్ను గల బాణముమీద సంధించెను. లక్ష్మణుడు ప్రజ్వలించుచున్న భయంకరమైన ఆ అస్త్రమును సంధించిన ఆ బాణమును, యముడు యమదండమును ప్రయోగించినట్లు అతికాయుని మీద ప్రయోగించెను. ఆగ్నేయాస్త్రముతో కూడిన ఆ బాణమును చూచి అతికాయుడు సూర్యాస్త్రముతో కూర్చబడిన భయంకరమైన బాణమును ప్రయోగించెను. తేజస్సుతో ప్రజ్వలించుచున్న అగ్రభాగములు గల ఆ రెండు బాణములు, కోపించిన సర్పముల వలె ఆకాశమునందు

ఒకదానినొకటి కొట్టుకొని ఒకదానినొకటి కాల్చివేసి నేలమీద పడిపోయినవి. భస్మమై, కాంతివిహీనములైపోయిన ఆ శ్రేష్ఠములైన బాణములు ప్రకాశహీనము లయ్యెను. మండిపోవుచున్న ఆ బాణములు రెండూ నేలమీద పడి ప్రకాశము లేకుండా అయినవి.(83-90)

అతికాయుడు కోపించి త్వాష్ట్రాస్త్రము సంధించిన ఒక ఐషీకబాణమును ప్రయోగించగా, పరాక్రమవంతుడైన లక్ష్మణుడు ఐంద్రాస్త్రముతో ఆ త్వాష్ట్రాస్త్రమును ఛేదించెను. ఆ ఐషీకాస్త్రము భగ్నమగుటచూచి, అతికాయుడు చాలా కోపించి బాణమునందు యామ్యాస్త్రమును కూర్చెను. పిమ్మట అతికాయుడు ఆ అస్త్రమును లక్ష్మణునిమీద ప్రయోగించెను. లక్ష్మణుడు దానిని వాయవ్యాస్త్రముతో కొట్టివేసెను. పిమ్మట కోపించిన లక్ష్మణుడు ఆ అతికాయుని మీద మేఘము జలధారలు కురిపించినట్లు బాణధారలు కురిపించెను. ఆ బాణములు అతికాయుణ్ణి సమీపించి అతని వజ్రాలంకృతమైన కవచముమీద పడి, చివరనున్న ములుకులు విరిగిపోగా నేలమీద పడిపోయినవి. శత్రువీరసంహారకుడు, మహాకీర్తిశాలి అయిన లక్ష్మణుడు ఆ బాణములు వ్యర్థమైపోవుట చూచి మరల వెయ్యి బాణములు వర్షించెను. మహాబలశాలియైన అతికాయునిపై ఆ బాణముల సముదాయము వర్షముగా పడుచున్నను వాని కవచము ఛేదించశక్యముకాని దగుటచే అతడు వ్యథ చెందలేదు. అతడు లక్ష్మణునిపై సర్పమువంటి ఒక బాణమును ప్రయోగించెను. శత్రుపీడకుడైన లక్ష్మణుడు ఆ బాణము మర్మప్రదేశమునందు తగులుటచేత ముహూర్తకాలము పాటు సంజ్ఞ కోల్పోయెను. అతడు, కొంతసేపటికి సంజ్ఞ పొంది, బాణములు వర్షించి, ధ్వజమును పడగొట్టి, నాలుగు బాణములచేత గుఱ్ఱములను, సారథిని చంపివేసెను.(91-100)

లక్ష్మణుడు ఏమాత్రము కంగారుపడక, సరిగా గురిచూచి, ఆ రాక్షసుని చంపుటకై బాణములను ప్రయోగించెను; కాని యుద్ధమునందు ఆ అతికాయునకు ఏమాత్రము బాధ కలిగించజాలకపోయెను. అప్పుడు వాయుదేవుడు అతని వద్దకువచ్చి- "ఇతడు బ్రహ్మవలన వరములు పొందినాడు. ఛేదింపశక్యము కాని కవచముచేత కప్పబడి ఉన్నాడు. వీనిని బ్రహ్మాస్త్రముచేత ఛేదించుము. మరొక విధముగా ఇతనిని చంపుటకు శక్యముకాదు. కవచమును ధరించిన బలశాలియైన ఇతనిని ఇతర అస్త్రములచే చంపశక్యము కాదు." అని చెప్పెను. పిమ్మట ఇంద్రునివంటి పరాక్రమము గల లక్ష్మణుడు వాయువు మాటలు విని, వెంటనే ఆ బ్రహ్మాస్త్రమును కూర్చి భయంకరమైన వేగము గల బాణమున సంధించెను. లక్ష్మణుడు

వాడియైన అగ్రభాగము గల ఆ శ్రేష్ఠమైన బాణముమీద శ్రేష్ఠమైన ఆ బ్రహ్మాస్త్రమును కూర్చుచున్నప్పుడు దిక్కులు, చంద్రుడు, సూర్యుడు, మహాగ్రహములు, ఆకాశము భయపడినవి. భూమి ధ్వని చేసినది. అతడు బ్రహ్మాస్త్రముతో ధనుస్సుపై కూర్చి, వజ్రాయుధము వంటి ఆ బాణమును అతికాయునిపై ప్రయోగించెను. లక్ష్మణుడు ప్రయోగించిన ఆ బాణము వృద్ధిపొందిన వేగముతో వాయువేగముతో వచ్చుచుండెను. దాని పొన్నుకు మంచి రెక్కలు కట్టబడి యుండెను. ఆ (పొన్ను) ఉత్తమమైన వజ్రములచేత చిత్రవర్ణమై ఉండెను. అట్టి బాణమును అతికాయుడు చూచెను.(101-107)

అతికాయుడు ఆ బాణమును చూచి అనేకములైన వాడియైన బాణములతో వెంటనే దానిని కొట్టెను. గరుత్మంతునివంటి వేగముగల ఆ బాణము గొప్ప వేగముతో అతని దగ్గరకు వెళ్ళెను. అతికాయుడు తనమీదకు వచ్చిన, ప్రజ్వలించుచున్న, యమునితోను, మృత్యుదేవతతోను, సమానమైన ఆ బాణమును చూచి, చేష్టలలో ఏమాత్రము కంగారులేనివాడై, దానిని శక్తితోను, ఋష్టితోను, గదతోను, కుఠారముతోను, శూలములతోను, బాణాలతోను కొట్టెను. అగ్నివలె మండుచున్న ఆ బాణము ఆశ్చర్యకరమైన రూపము గల ఆ ఆయుధముల నన్నింటినీ వ్యర్థములుగా చేసి ఆ అతికాయుని కిరీటాలంకృతమైన శిరస్సును గ్రహించి హరించెను. కిరీటముతో, శిరస్సును రక్షించు కవచముతో, కూడిన ఆ శిరస్సు లక్ష్మణుని బాణముచేత ఛేదింపబడినదై హిమవత్పర్వతశిఖరమువలె వెంటనే నేలమీద పడిపోయెను. వస్త్రములు, అలంకారములు దూరదూరముగా పడిపోగా నేలమీద వ్రాలిన ఆ అతికాయుణ్ణి చూచి మరణించగా మిగిలిన రాక్షసులందరూ వ్యథ చెందిరి. యుద్ధమునందు అలిసిపోయి దిగులు చెందిన ముఖములతో దీనులైన ఆ రాక్షసులు చాలామంది వెంటనే విపరీతస్వరములతో కూడిన ధ్వనిని చేసిరి. తమ నాయకుడు మరణించగానే ఆ రాక్షసులు భయపడి యుద్ధమునందు కోరిక లేనివారై, నగరమునకు అభిముఖముగా ఆ నగరము నలువైపులా పరుగెత్తుచు వెళ్ళిరి. భయంకరమైన బలముగల, ఎదిరింప శక్యముకాని శత్రువును చంపిన పిమ్మట వానరులందరు సంతోషించుచు, వికసించిన పద్మములవంటి ముఖములతో, కోరిన జయమును సంపాదించిన లక్ష్మణుణ్ణి పూజించిరి. అప్పుడు లక్ష్మణుడు గొప్పబలము గల, మేఘము వంటి అతికాయుణ్ణి సంహరించి, సంతోషించుచు, వానరు లందరూ పూజించుచుండగా, శీఘ్రముగా రామునివద్దకు వెళ్ళెను.(108-116)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది ఒకటవ సర్గము సమాప్తము.

డెబ్బది రెండవ సర్గము

రావణుడు చింతాక్రాంతుడై "సావధానచిత్తులై నగరమును రక్షింపుడు" అని రాక్షసులను ఆదేశించుట.

మహాత్ముడైన లక్ష్మణుని చేతిలో అతికాయుడు మరణించినట్లు విని రావణుడు భయము చెంది ఇట్లు పలికెను. "రామునిచేత ధూమ్రాక్షుడు, చాల కోపము గలవాడు, ఆయుధధారులందరిలోను శ్రేష్ఠుడు అయిన అకంపనుడు, ప్రహస్తుడు, కుంభకర్ణుడు చంపబడినారు. వీళ్ళందరూ మహాబలవంతులైన వీరులైన రాక్షసులు; యుద్ధమునందు ఆసక్తికలవారు; పరసైన్యమును జయించినవారు; ఎన్నడూ పరులచేత జయింపబడనివారు; వీళ్ళు సైన్యములతో సహా చంపబడినారు. పెద్ద శరీరములు కలవారు, అనేకవిధములైన ఆయుధములయందు ప్రవీణులు,శూరులు అయిన మహాత్ములైన ఇతరరాక్షసులు కూడ చంపబడినారు. ప్రసిద్ధమైన బలపరాక్రమములు గల నా కుమారుడైన ఇంద్రజిత్తు, ఆనాడు, సోదరులైన ఆ రామలక్ష్మణులను వరముచేత పొందబడిన భయంకరములైన బాణాలతో బంధించినాడు. భయంకరమైన ఆ శరబంధమునుండి అందరు దేవతలు గాని, గొప్ప బలముగల అసురులు గాని, యక్షగంధర్వపన్నగులు గాని విడిపించజాలరు. అట్టి ఆ శరబంధమునుండి సోదరులైన రామలక్ష్మణులు ప్రభావముచేత విడిపించుకొన్నారో, మాయచేత విడిపించుకొన్నారో, మోహింపచేసి విడిపించుకొన్నారో నాకు తెలియుటలేదు." (1-7)

"నా ఆజ్ఞ ప్రకారము యుద్ధానికి వెళ్ళిన శూరులైన రాక్షసయోధు లందరినీ గొప్ప బలము గల వానరులు చంపివేసినారు. ఇప్పుడు యుద్ధములో రామలక్ష్మణులను, వారి సైన్యమును సుగ్రీవవిభీషణులను చంపగలిగినవాడు ఎవ్వడూ నాకు కనబడుటలేదు. రాముని పరాక్రమముచేత రాక్షసులు నశించినారు. ఆహో! రాముడు ఎంత బలశాలి! అతని అస్త్రబలము ఎంత గొప్పది! గుల్మములలోని సైనికులందరు ఈ లంకానగరమును, సీత రక్షింపబడుచున్న అశోకవనమును అంతటా కూడా ఏమరిపాటు లేకుండా రక్షించుచుండవలెను. గుల్మములు ఎక్కడెక్కడ ఉన్నవో అక్కడ ఎవరు పురమునుండి బైటకు వెళ్ళుచున్నారో, లోనికి ప్రవేశించుచున్నారో మనకు అన్ని వేళలా పూర్తిగా తెలియవలెను. ఓ! రాక్షసులారా! మీరు మీ సైన్యములతో అన్నివైపులా నిలచి ఉండి వానరుల సంచారమును ఆలోచనను కనిపెట్టుచు ఉండవలెను. సాయంకాలమునందు గాని, అర్ధరాత్రియందు గాని, ప్రాతఃకాలమునందు గాని, అన్నివేళలా అప్రమత్తులై ఉండవలెను. వానరుల

విషయమున ఎన్నడూ అనాదరము చూపకూడదు. శత్రువుల సైన్యము యుద్ధానికి ఉద్యమించుచున్నదో, దండెత్తి వచ్చుచున్నదో, నిలచి ఉన్నదో చూచుచుండవలెను." అని పలికెను.(8-15)

మహాబలశాలులైన ఆ రాక్షసులందరూ రావణుని మాటలు విని అతని ఆజ్ఞ ప్రకారము చేసిరి. రాక్షసరాజైన రావణుడు ఆ రాక్షసులను ఆ విధముగా ఆజ్ఞాపించి, దుఃఖ మనే శల్యముతో బాధపడుచు, దీనుడై తన గృహములో ప్రవేశించి కోపాగ్నితో మండిపడుచు, ఆ పుత్రవ్యసనమును గూర్చియే ఆలోచించుచు మాటిమాటికి నిట్టూర్చెను.(16-18)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది రెండవ సర్గము సమాప్తము.

డెబ్బది మూడవ సర్గము

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే రామలక్ష్మణులను వానరసైన్యమును మూర్ఛ చెందించుట.

అప్పుడు చావగా మిగిలిన రాక్షసులందరూ తొందరగా వెళ్ళి దేవాంతకుడు, త్రిశిరస్సు, అతికాయుడు మొదలైన రాక్షసవీరులందరూ మరణించినట్లు రావణునకు తెలిపిరి. రావణుడు వాళ్ళ మరణమును గూర్చి విని, అధికముగా కన్నీరు కార్చుచు, ఘోరమైన ఆ పుత్రవినాశమును, సోదరుల మరణమును గూర్చి ఆలోచించుచు చాలసేపు మౌనముగా ఉండిపోయెను.(1,2)

దీనుడై శోకసముద్రములో తేలుచున్న రావణుని జూచి, రథికులలో శ్రేష్ఠుడైన ఇంద్రజిత్తు– "రాక్షసప్రభువైన ఓ! తండ్రీ! ఈ ఇంద్రజిత్తు జీవించి ఉండగా నీవు ఇట్లు దుఃఖించుట తగదు. యుద్ధములో ఇంద్రజిత్తు బాణముల దెబ్బ తిన్నవా డెవ్వడూ ప్రాణాలను రక్షించుకొనజాలడు. ఈనాడు రామలక్ష్మణుల శరీరములను బాణములచేత భేదించి ఇటు అటు పడవేసెదను. వాళ్ళ అవయవములన్నీ వాడియైన బాణములచే గ్రుచ్చబడి ఉండును. ఈ విధముగా వాళ్ళిద్దరూ ఆయుస్సు కోల్పోయి నేలమీద శయనించి ఉండగా చూడగలవు. ఇంద్రజిత్తు చేయు సునిశ్చితము, పౌరుషదైవబలములతో కూడినది అయిన ఈ ప్రతిజ్ఞను వినుము. ఇప్పుడే రామలక్ష్మణులను వ్యర్థములు కాని బాణాలతో నింపెదను. ఇంద్ర-యమ-విష్ణు-రుద్ర-సాధ్యులు, అగ్ని-సూర్య-చంద్రులు ఇంత అని చెప్ప శక్యముకాని నా

పరాక్రమమును, బలిచక్రవర్తి యజ్ఞశాలలో భయంకరమైన విష్ణుపరాక్రమమును చూచినట్లు ఇప్పుడే చూడగలరు." అని పలికి, ఉత్సాహముతో కూడిన మనస్సుకలవాడై, రాక్షసరాజు అనుమతి గ్రహించి వాయువుతో సమానమైన వేగము గల, శ్రేష్ఠములైన గాడిదలు కట్టిన సూర్యరథమువంటి రథమునెక్కి వెంటనే యుద్ధము జరుగుచున్న ప్రదేశమునకు వెళ్ళెను. (3-9)

యుద్ధమునకై ప్రయాణమై వెళ్ళుచున్న అతని వెనుక మహాబలశాలులు, భయంకరమైన పరాక్రమము గలవారు అయిన అనేక రాక్షసులు ఉత్సాహముతో వెళ్ళిరి. వారు శ్రేష్ఠములైన ధనుస్సులను, ప్రాస-ముద్గర-ఖడ్గములను, గండ్రగొడ్డళ్లను, గదలను, భుశుండి-ముద్గర- యష్టి-శతఘ్ని-పరిఘలను ధరించిరి. వారిలో కొందరు ఏనుగులపై ఎక్కి కొందరు గుఱ్ఱముల నెక్కి వెళ్ళిరి. కొందరు వ్యాఘ్రములను, పర్వతాకారములైన తేళ్ళను, పిల్లులను, గాడిదలను, ఒంటెలను, సర్పములను, అడవిపందులను, క్రూరమృగములను, సింహములను, నక్కలను ఎక్కి వెళ్ళిరి. (10-13)

పరాక్రమవంతుడైన ఆ ఇంద్రజిత్తు గంభీరమైన శంఖధ్వనులతోను, భేరీల ధ్వనులతోను వేగముగా యుద్ధమునకు వెళ్ళెను. శత్రుసంహారకుడైన అతడు శంఖమువలె చంద్రుడువలె ఉన్న ఛత్రముతో, పూర్ణచంద్రునితో ఆకాశమువలె ప్రకాశించెను. అప్పుడు సకలధనుర్ధారులలో శ్రేష్ఠుడైన బంగారు అలంకారములు ధరించిన ఆ వీరుడైన ఇంద్రజిత్తును అందమైన బంగారపు చామరముతో వీచిరి. రాక్షసరాజైన శ్రీమంతుడైన ఆ రావణుడు గొప్ప సైన్యముతో బయలుదేరుచున్న ఆ కుమారుణ్ణి చూచి- "కుమారా! నిన్ను ఎదిరించగల రథికుడు లేడు; నీవు దేవేంద్రుణ్ణి జయించినవాడవు. మానవుడు, ఎదిరింపశక్యమైనవాడూ అయిన రాముణ్ణి జయించగల వని వేరే చెప్పవలెనా!" అని పలికెను. ఇంద్రజిత్తు రాక్షసరాజు మాటలు విని అతని గొప్ప ఆశీర్వాదములను గ్రహించెను. అప్పుడు సూర్యునివంటి తేజస్సు గల, ఎదిరించగల పరాక్రమవంతులు లేని ఆ ఇంద్రజిత్తుతో లంకాపట్టణము, ప్రకాశించుచున్న సూర్యునితో ఆకాశము వలె ప్రకాశించెను. (14-19)

గొప్పతేజస్సుగలవాడు, శత్రువినాశకుడు అయిన అతడు యుద్ధభూమిని చేరి రాక్షసులను తన రథము చుట్టూ నిలబెట్టెను. పిమ్మట అగ్నితో సమానమైన కాంతి గల ఆ రాక్షసశ్రేష్ఠుడు శ్రేష్ఠములైన మంత్రములు పఠించుచు అగ్నిలో యథాశాస్త్రముగా సంస్కరించిన హవిస్సును, పేలాలను, పుష్పమాలలను,

సుగంధద్రవ్యములను హోమము చేసెను. అతడు అభిచారక్రియలో విధింపబడిన సామాగ్రిని ఉపయోగించెను. ఆయుధములను, రెల్లుగడ్డిని బర్హిస్సుగాను, విభీతకవృక్షము కట్టెలను సమిధలను, ఇనుప స్రువమును ఉపయోగించెను. ఎఱ్ఱని వస్త్రములు ధరించెను. అగ్నిచుట్టూ రెల్లుగడ్డీ, తోమరములూ పరిచి జీవించియున్న నల్లని మేక కంఠమును గ్రహించెను. ఒకేమారు భగ్గుమని మండిన ధూమము లేని పెద్దజ్వాల గల అగ్నియందు విజయసూచకములైన చిహ్నములు కనబడినవి.(20-25)

కరిగించిన బంగారము వంటి కాంతి గల అగ్ని స్వయముగా పైకి లేచి ప్రదక్షిణముగా తిరుగుచున్న జ్వాలలు కలదై ఆ హవిస్సును స్వీకరించెను. అస్త్రములయందు నేర్పుగల అతడు బ్రహ్మాస్త్రము ఆవాహనము చేసి అక్కడ ధనుస్సునూ, తన రథమునూ అన్నింటినీ కూడ దానితో అభిమంత్రించెను. అతడు అగ్నిలో హోమము చేసి బ్రహ్మాస్త్రమును ఆహ్వానించుచున్నప్పుడు సూర్య-గ్రహ-చంద్ర-నక్షత్రములతో కూడిన ఆకాశము చలించెను. అగ్నివలె ప్రకాశించుచున్న తేజస్సూ, మహేంద్రునితో సమానమైన ప్రభావమూ, ఊహించ శక్యముకాని పరాక్రమమూ కల ఆ ఇంద్రజిత్తు అగ్నిలో హోమము చేసి ధనుర్బాణ-ఖడ్గ- రథ-అశ్వ-సారథులతో సహా ఆకాశములో అంతర్ధానము చెందెను.(26-29)

పిమ్మట గుఱ్ఱములతోనూ రథములతోనూ నిండి, పతాకలచేత, ధ్వజములచేత శోభింపచేయబడిన రాక్షససైన్యము యుద్ధము చేయవలె నను కోరికతో గర్జించుచూ బయలుదేరెను. యుద్ధములో ఆ రాక్షసులు వివిధ ఆకారములూ, తీవ్రమైన వేగమూ కల అలంకరింపబడిన అనేకమైన బాణములతోనూ, తోమరములతోనూ, అంకుశములతోనూ వానరులను చంపిరి. చాలా కోపముతోనున్న ఇంద్రజిత్తు ఆ రాక్షసులను చూచి, "మీరందరూ వానరులను చంపుటకై ఉత్సాహవంతులై యుద్ధము చేయుడు." అని పలికెను. పిమ్మట ఆ రాక్షసులందరూ జయమును కోరుచూ, గర్జించుచూ వానరుల మీద భయంకరముగా బాణవర్షములు వర్షించిరి. రాక్షసులతో కూడిన ఇంద్రజిత్తు నాలీక-నారాచ బాణములచేతనూ, గదలచేతనూ, ముసలములచేతనూ వానరులను ఖండించెను.(30-34)

వృక్షములు ఆయుధములుగా ధరించిన వానరులు యుద్ధములో ఆ విధముగా కొట్టబడుచూ వెంటనే ఇంద్రజిత్తుపై పర్వతములనూ వృక్షములను వర్షించిరి. అప్పుడు అతడు కోపించి, వానరుల శరీరములను నశింపచేసెను. రాక్షసులకు

సంతోషము కల్గించుచూ ఒక్కొక్క బాణముచేత తొమ్మండుగురూ, ఐదుగురూ, ఏడుగురూ చొప్పున వానరులను బ్రద్దలుకొట్టెను. జయింప శక్యముకాని ఆ వీరుడు బంగారముచేత అలంకరింపబడిన సూర్యునితో సమానమైన బాణములచేత యుద్ధమునందు వానరులను మథించెను. శరములచేత పీడింపబడి బ్రద్దలైన శరీరములు గల ఆ వానరులు దేవతలచేత అసురులు వలె చెడగొట్టబడిన సంకల్పము కలవారై పడిపోయిరి. ఆ వానరశ్రేష్ఠులు బాణములనే కిరణములతో సూర్యుడు వలె తపింపచేయుచున్న ఆ ఇంద్రజిత్తు మీదికి కోపముతో శీఘ్రముగా వెళ్ళిరి. ఆ వానరులందరు బ్రద్దలు కొట్టబడిన దేహాలతో స్పృహ తప్పి, వ్యథ చెంది, రక్తముతో తడిసినవారై పారిపోయిరి. కొందరు వానరులు, శిలలు ఆయుధములుగా ధరించి, యుద్ధములో గర్జించుచు, వెనుకకు మరలక రామునికొరకై పరాక్రమమును చూపి ప్రాణములు విడచిరి. ఆ వానరులు యుద్ధములో నిలచి ఇంద్రజిత్తు మీద వృక్షములు, పర్వతశిఖరములు, శిలలు కురిపించిరి. (35-43)

ఇంద్రజిత్తు ప్రాణములను హరించు గొప్పదైన ఆ వృక్షముల, శిలల వర్షమును తొలగించెను. పిమ్మట అతడు సర్పములతో సమానములైన, అగ్నివంటి బాణములచేత, యుద్ధములో వానరుల సైన్యములను భేదించెను. వాడియైన పద్దెనిమిది బాణములచేత గంధమాదనుణ్ణి కొట్టి, దూరముగా ఉన్న నలుణ్ణి తొమ్మిది బాణములతో కొట్టెను. మర్మస్థానములను చీల్చివేయు ఏడు బాణాలచేత మైందుణ్ణి, ఐదు బాణములచేత గజుణ్ణి కొట్టెను. జాంబవంతుణ్ణి పది బాణాలచేత, నీలుణ్ణి ముప్పై బాణాలచేత కొట్టెను. భయంకరములు, తీక్ష్ణములు అయిన, వరముచే పొందబడిన బాణాలచేత సుగ్రీవుణ్ణి, ఋషభుణ్ణి, అంగదుణ్ణి ప్రాణసంచారము లేనివారినిగా చేసెను. అతడు విజృంభించిన ప్రళయకాలాగ్నివలె అనేక బాణములచేత ఇతరులైన వానరముఖ్యులను కూడ పీడించెను. బాగుగా ప్రయోగింపబడి శీఘ్రముగా వెళ్ళు సూర్యునివంటి బాణాలతో, ఆ మహాయుద్ధమునందు, వానరసైన్యములను మథించివేసెను. బాణసముదాయముచేత పీడింపబడి రక్తముతో తడిసిన వ్యాకులమైన ఆ వానరసేనను ఉత్సాహవంతుడైన ఆ ఇంద్రజిత్తు గొప్ప సంతోషముతో చూచుచు, మరల భయంకరమైన బాణవర్షము, ఆయుధముల వర్షమును వర్షించి అన్నివైపులా ఆ వానరసైన్యమును మర్దించెను. పిదప తన సైన్యమును విడచి వెళ్ళి, ఆ మహాయుద్ధమునందు, ఇతరుల కెవ్వరికీ కనబడనివాడై, వానరసైన్యముల మీద భయంకరమైన బాణసముదాయమును, నల్లని మేఘము ఉదకమును వర్షించినట్లు వర్షించెను. (44-54)

ఆ యుద్ధములో పర్వతములవంటి వానరులు మాయాప్రయోగముచేత ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణములచేత శిథిలమైన దేహములతో వికృతముగా అరచుచు, ఇంద్రుని వజ్రాయుధముచేత కొట్టబడిన పర్వతము వలె నేలపై పడిపోయిరి. వానరులకు తమ సైన్యముమీద పడుచున్న వాడియైన అగ్రభాగములు గల బాణములు మాత్రమే కనబడెను. మాయాప్రభావముచేత దాగిఉన్న ఆ ఇంద్రజిత్తు మాత్రము కనబడలేదు. ఆ ఇంద్రజిత్తు వాడియైన అగ్రభాగములు గల సూర్యునివంటి కాంతిగల వందలకొలది బాణములచేత అన్ని దిక్కులను కప్పివేసి వానరులను చీల్చివేసెను. వృద్ధి చెంది మండుచున్న అగ్నితో సమానమైన కాంతిగల, అగ్నికణములతో కూడిన ప్రకాశించుచున్న అగ్నిగల శూలములను, ఖడ్గములను, గండ్రగొడ్డళ్ళను ఆ వానరసైన్యముమీద తీవ్రముగా వర్షించెను. అగ్నితో సమానములైన వాడియైన ఇంద్రజిత్తు బాణములచేత కొట్టబడిన ఆ వానరనాయకులు రక్తము స్రవించుటచే వికసించిన మోదుగచెట్లు వలె ఉండిరి. ఇంద్రజిత్తు అస్త్రములచేత చీల్చివేయబడిన ఆ వానరవీరులు ఒకరిదగ్గరకు ఒకరు చేరుచు, వికృతస్వరములతో అరచుచు, నేలపై ఒరిగిరి. పైకి ఆకాశముపైపు చూచిన కొందరు వానరులు బాణములచేత నేత్రములమీద కొట్టబడి, ఒకరినొకరు కౌగిలించుకొని నేలపై పడిపోయిరి.(55-61)

రాక్షసులలో ఉత్తముడైన ఆ ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రము అభిమంత్రించిన ప్రాసలచేత, శూలములచేత, వాడియైన బాణాలచేత హనుమత్-సుగ్రీవ-అంగద-గంధమాదనులను, జాంబవంతుని, సుషేణ-వేగదర్శులను, మైంద - ద్వివిద - నీల - గవాక్ష - గవయ - కేసరి - హరిలోమ - విద్యుద్దంష్ట్రులను, సూర్యానన - జ్యోతిముఖ - దధిముఖులను, పావకాక్ష - నల - కుముదులను ఆ వానరనాయకుల నందరినీ కొట్టెను. ఆ ఇంద్రజిత్తు వానరసేనాప్రముఖులను గదలచేత, బంగారువర్ణము గల బాణములచేత భేదించి, రామలక్ష్మణులపై సూర్యకిరణములతో సమానములైన బాణవర్షములను వర్షించెను.(62-66)

చాల అశ్చర్యకరమైన శోభగల ఆ రాముడు బాణవర్షము వర్షింపబడుచున్నను దానిని జలధారావర్షము వలె లెక్కచేయక, నలుమూలలా చూచుచు లక్ష్మణునితో ఇట్లు పలికెను- "లక్ష్మణా! రాక్షసనాయకుడైన ఈ ఇంద్రజిత్తు మహాస్త్రబలముచేత వానరసైన్యమును పడగొట్టి వాడియైన బాణాలతో, ఎడతెరిపిలేకుండా, మనలను బాధించుచున్నాడు. మహాత్ముడైన ఈ ఇంద్రజిత్తు బ్రహ్మనుండి వరమును పొందియున్నాడు. సావధానచిత్తుడై తన భయంకరమైన శరీరమును కనబడకుండ చేసికొని ఉన్నాడు. యుద్ధములో కనబడకుండా ఉండి అస్త్రములను ప్రయోగించుచున్న

ఇతనిని ఇప్పుడు ఎట్లు చంపవలెనో కదా! ఈ అస్త్రమునకు అధిదేవత, ఈ అస్త్రమునకు మూలకారణమూ అయిన పూజ్యుడైన బ్రహ్మదేవుని ప్రభావము ఊహింప శక్యముకానిది అని అనుకొనుచున్నాను. ఓ! ధీమంతుడా! నాతోపాటు నీవుకూడా ఇప్పుడు ఇక్కడ ఈ బాణపాతమును కలత చెందని మనస్సుతో సహించుము. ప్రస్తుతము అందరికంటె అధికుడుగా ఉన్న ఈ రాక్షసనాయకుడు బాణవర్షసముదాయములచేత కప్పివేయుగాక. ప్రధానులైన శూరులందరూ పడిపోవుటచేత ఈ వానరసైన్యమంతా శోభావిహీనముగా ఉన్నది. మనమిద్దరము యుద్ధమునుండి విరమించి, సంతోషముకాని, రోషముకాని చూపకుండగా, సంజ్ఞ కోల్పోయి క్రింద పడిపోవుట చూచి, ఇతడు యుద్ధప్రారంభమున లభించిన ఈ విజయలక్ష్మిని పొంది తప్పక లంకలోనికి వెళ్ళిపోవును. మనమిప్పుడు సంజ్ఞ కోల్పోయి పడిఉన్నట్లు పడిఉందాము. తరువాత చూచుకొనవచ్చును."(67-72)

పిమ్మట ఆ రామలక్ష్మణులు అక్కడ, ఇంద్రజిత్తు ప్రయోగించిన అస్త్రముల సముదాయములచేత హింసింపబడిరి. ఇంద్రజిత్తు కూడ వారి నా విధముగా హింసించి సంతోషముతో ధ్వనిచేసెను. అప్పుడా ఇంద్రజిత్తు యుద్ధమునందు వానరసైన్యములను నశింపచేసి, రామలక్ష్మణులను పడగొట్టి, రాక్షసులచేత స్తుతింపబడుచు వెంటనే లంకానగరము చేరి సంతోషముతో తండ్రికి జరిగిన దంతా తెలిపెను.(73-75)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది మూడవ సర్గము సమాప్తము.

డెబ్బది నాలుగవ సర్గము

హనుమంతుడు హిమాలయమునుండి దివ్యౌషధులున్న పర్వతమును తీసికొనివచ్చుట; రామలక్ష్మణులు సమస్తవానరులు స్వాస్థ్యము చెందుట.

యుద్ధరంగమునందు ఆ రామలక్ష్మణులిద్దరూ పీడింపబడిరి. వానరసేనానాయకులు, సైన్యము కూడ మూర్ఛచెందెను. సుగ్రీవ-నీల-అంగద-జాంబవంతులకు ఏమి చేయవలెనో తెలియలేదు. పిదప బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన విభీషణుడు దిగులు చెంది ఉన్న సైన్యము నంతనూ చూచి వానరరాజైన సుగ్రీవుని సైన్యములోని వీరులను మంచి మాటలతో ఓదార్చుచు- "రామలక్ష్మణు లిద్దరూ

బ్రహ్మదేవుని వాక్యము మన్నించుచు ఇంద్రజిత్తు బాణములచేత పీడింపబడినవారై, వశము తప్పి మూర్ఛిల్లినారు. అందువలన మీరు భయపడకుడు. ఇది దిగులు చెందవలసిన సమయము కాదు. వ్యర్థముకాని శక్తి గల ఈ గొప్పదైన బ్రహ్మాస్త్రమును బ్రహ్మదేవుడు ఇంద్రజిత్తుకు ఇచ్చియున్నాడు. దానిని మన్నించి రామలక్ష్మణులు యుద్ధములో మూర్ఛచెంది ఉన్నారు. ఇక్కడ దుఃఖించవలసిన పని ఏమున్నది?" అని ధైర్యము చెప్పెను.(1-4)

అప్పుడు బుద్ధిశాలి, వాయుపుత్రుడు అయిన హనుమంతుడు బ్రహ్మాస్త్రమును గౌరవించుటకై కొంచెము సేపు బంధములో ఉండి, దానిని విడిపించుకొని, విభీషణుని మాటలు విని- "బలశాలులైన వానరుల ఈ సైన్యము బ్రహ్మాస్త్రముచేత కొట్టబడి ఉన్నది. ఇపుడు వీరిలో ఎవరెవరు ప్రాణాలతో ఉన్నారో వాళ్ళ నందరినీ ఓదార్చెదము." అని పలికెను. వీరులైన ఆ హనుమద్విభీషణులిద్దరూ, అప్పుడు, ఆ రాత్రివేళ కాగడాలు చేత ధరించి యుద్ధభూమిలో సంచరించిరి.(5-7)

వానరుల తోకలు, చేతులు, తొడలు, పాదాలు, వ్రేళ్ళు, శిరస్సులు తెగిపడి ఉండెను. అవయవములనుండి రక్తము కారుచుండెను. కొందరు మూత్రము విడచుచుండిరి. ఆ విధముగా అంతటా పడియున్న, పర్వతములవంటి ఆకారములు గల వానరులచేత ఆ భూమి అంతా కప్పివేయబడియుండెను. అక్కడ ప్రకాశించుచున్న అనేకములైన ఆయుధములు కూడ పడియుండెను. అట్టి యుద్ధభూమిని ఆ హనుమద్విభీషణులు చూచిరి. విభీషణహనుమంతులు యుద్ధభూమిలో కొట్టబడి యున్న సుగ్రీవ-అంగద-నీల-శరభ-గంధమాదన-గవాక్షులను, సుషేణ-వేగదర్శులను, మైంద-నల-జ్యోతిముఖ-ద్వివిదులను చూచిరి. బ్రహ్మనుండి వరమును పొందిన ఆ ఇంద్రజిత్తు పగటి చివరి ఐదవభాగములో వేగవంతులైన అరవైఏడుకోట్ల వానరులను కొట్టెను.(8-12)

విభీషణునితో కూడిన హనుమంతుడు బాణములచేత పీడింపబడియున్న, సముద్రజలసంఘాతము వంటి ఆ వానరసైన్యమును చూచుచు, జాంబవంతునికొరకై వెదకెను. వయోవృద్ధుడైన బ్రహ్మపుత్రుడైన జాంబవంతుడు వార్ధక్యముచే సహజముగానే దుర్బలుడుగా ఉండెను. ఆ వీరుడు వందలకొలది బాణములు గ్రుచ్చుకొనుటచే శాంతించుచున్న అగ్నివలె ఉండెను. అట్టి జాంబవంతుడు కనబడగానే విభీషణుడు అతనివద్దకు వెళ్ళి- "ఆర్యా! వాడియైన బాణములచేత నీ ప్రాణములు నశింపచేయబడలేదు కద!" అని అడిగెను. భల్లూకములలో శ్రేష్ఠుడైన

జాంబవంతుడు విభీషణుని మాటలు విని, మాటలు అతికష్టముమీద ఉచ్చరించుచు- (13-16)

"గొప్ప పరాక్రమము గల ఓ విభీషణా! నిన్ను నీ కంఠస్వరముచేత గుర్తు పట్టుచున్నాను. నా శరీరము వాడియైన బాణములచేత కొట్టబడియుండుటచేత నిన్ను కంటితో చూడలేకున్నాను. విభీషణా! అంజనావాయుదేవుల ఉత్తమపుత్రుడైన, వానరశ్రేష్ఠుడు, హనుమంతుడు ఏ మూలనైనా ప్రాణాలతో ఉన్నాడా?" అని ప్రశ్నించెను. జాంబవంతుని మాటలు విని విభీషణుడు - "రామలక్ష్మణుల విషయ మడుగకుండగా హనుమంతుణ్ణి గూర్చి అడుగుచున్నావేమి? ఓ! పూజ్యుడా! నీవు హనుమంతుని విషయమునందు ఎంత అధికమైన స్నేహము చూపుచున్నావో అంత స్నేహమును రాజైన సుగ్రీవుని విషయమునందు గాని, అంగదుని విషయమునందుగాని, రాముని విషయమునందు గాని చూపుటలేదు!" అనెను. (17-20)

విభీషణుని మాటలు విని జాంబవంతుడు - "విభీషణా! నేను హనుమంతునిగూర్చియే ఎందుకు అడుగుచున్నానో వినుము. వీరుడైన హనుమంతుడు జీవించి ఉన్నట్లయితే సైన్యము చంపబడినను చంపబడనట్లే. ఇతడు మరణించినచో మనమందరము జీవించి ఉన్నను మరణించినట్లే. నాయనా! వాయువుతో సమానుడు, పరాక్రమవంతుడు అగ్నితుల్యుడు అయిన హనుమంతుడు జీవించి ఉన్నట్లయితే మనకు జీవితమును గూర్చి ఆశ ఉండును." అనెను. పిమ్మట వాయుపుత్రుడైన హనుమంతుడు వృద్ధుడైన జాంబవంతుని సమీపించి వినయపూర్వకముగా అతని పాదములకు నమస్కరించెను. (21-24)

అప్పుడు వ్యాకులత చెందిన ఇంద్రియములు గల ఆ జాంబవంతుడు హనుమంతుని మాట వినబడగానే మళ్ళీ జన్మ ఎత్తినట్లు భావించుచు- హనుమంతునితో - "ఓ! వానరశ్రేష్ఠుడా! రమ్ము; వానరులను రక్షించుము. ఈ వానరులకు నీవే పరాక్రమముచేత తగిన స్నేహితుడవు; మరెవ్వరూ లేరు. ఇది నీ పరాక్రమము చూపుటకు తగిన కాలము. ఇతరులెవ్వరూ నాకు కనబడుటలేదు. ఈ భల్లూక-వానరవీరుల సైన్యములకు సంతోషము కలిగించుము. పీడితులై ఉన్న ఈ రామలక్ష్మణుల శల్యములను కూడా తొలగింపుము. ఓ! హనుమంతుడా! సముద్రముపైన దీర్ఘమైన మార్గమునందు ప్రయాణము చేసి నీవు పర్వతములలో శ్రేష్ఠమైన హిమవత్పర్వతమునకు వెళ్ళవలెను. చాల భయంకరము, సువర్ణమయమూ

అయిన ఋషభమను పర్వతశ్రేష్ఠము, కైలాసశిఖరము నీకు అక్కడ కనబడును. ఆ రెండు శిఖరముల మధ్య నీకు, ప్రజ్వలించుచున్న, సాటిలేని కాంతిగల సమస్తమైన ఓషధులతో నిండిన ఓషధిపర్వతము కనబడును. ఓ! వానరశ్రేష్ఠుడా! దాని శిరస్సుపై మొలచిన నాలుగు ప్రకాశించు ఓషధులు ఉండును. పది దిక్కులను ప్రకాశింపచేయుచుండు ఆ ఓషధులను చూడగలవు. నీకక్కడ మృతసంజీవని, విశల్యకరణి, సువర్ణకరణి, సంధానకరణి అను మహౌషధులు కనబడగలవు. హనుమంతుడా! ఆ ఓషధులను అన్నింటినీ శీఘ్రముగా తీసికొనిరమ్ము. ఓ! వాయుకుమారా! వానరులందరికీ ప్రాణములు పోసి ఓదార్చుము.'' అని పలికెను.(25-34)

వాయుకుమారుడైన హనుమంతుడు జాంబవంతుని మాటలు విని సముద్రము వాయువేగముచేత నింపబడినట్లు అధికమైన బలముచేత పూరింపబడెను. పర్వతము చివర నిలచి, దానిని పీడించుచున్న వీరుడైన హనుమంతుడు రెండవ పర్వతము వలె కనబడుచుండెను. అతని పాదములచే అణగద్రొక్కబడిన ఆ పర్వతము మిక్కిలి పీడింపబడినదై నిలద్రొక్కుకొనజాలక క్రిందికి అణగిపోయెను. హనుమంతుడు పీడించుటచే ఆ పర్వతమునుండి వృక్షములు, అతని వేగమువలన నేలపై పడి మండిపోయినవి. శిఖరములు విరిగిపోయినవి. ఆ విధముగా పీడింపబడి, చెట్లు రాళ్ళు విరిగిపడిపోయిన ఆ శ్రేష్ఠమైన పర్వతము తిరిగిపోవుచుండగా వానరులు నిలబడజాలకపోయిరి. ఆ రాత్రి లంకలో పెద్ద ద్వారములన్నీ తిరిగిపోయెను. గృహములు, గోపురములు విరిగిపోయెను. భయముచేత ఆకులమై ఆ నగరము నృత్యము చేయుచున్నదా అన్నట్లుండెను. పర్వతము వంటి హనుమంతుడు పర్వతమును పీడించి, సముద్రముతో కూడిన భూమిని కూడా క్షోభింపచేసెను.(35-41)

అతడు త్రికూటపర్వతమునుండి మేరు-మందర పర్వతములతో సమానమైన మలయపర్వతముపైకి ఎక్కెను. ఆ పర్వతము అనేకజలపాతములతో వ్యాకులమై అనేకవిధములైన వృక్షములతోను, లతలతోను వ్యాప్తమై ఉండెను. వికసించుచున్న పద్మములతోను, కలవలతోను నిండియుండెను. అరవై యోజనముల ఎత్తైన ఆ పర్వతముమీద దేవతలు, గంధర్వులు, విద్యాధరులు, మునులు, అప్సరసలు నివసించుచుందురు. అనేకమైన గుహలతో ప్రకాశించు చున్న ఆ పర్వతము అనేకవిధములైన మృగముల గుంపులతో నిండియుండెను. వాయుకుమారుడైన హనుమంతుడు అక్కడ ఉన్న యక్ష-గంధర్వ- కింనరులకు భయము పుట్టించుచు మేఘమువలె శరీరము పెంచెను. పాదాలతో పర్వతమును గట్టిగా నొక్కిపట్టి,

బడబాముఖము వంటి భయంకరమైన ముఖమును తెరచి, రాక్షసులను భయపెట్టుచు బిగ్గరగా గర్జించెను. బిగ్గరగా గర్జించుచున్న అతని ధ్వనిని విని లంకలో ఉన్న రాక్షసవీరులు ఎక్కడా కూడ కదలలేకపోయిరి. భయంకరమైన పరాక్రమము గల, శత్రుసంహారకుడైన హనుమంతుడు సముద్రమునకు నమస్కరించి, రామునికొరకై గొప్ప పనిచేయుటకు ఇచ్ఛయించెను. (42-48)

అతడు మహాసర్పమువలె ఉన్న తోకను పైకెత్తి, నడుము వంచి, చెవులు మణుచుకొని బడబాముఖము వంటి ముఖమును తెరచి, తీవ్రమైన వేగముతో ఆకాశమునందు ఎగురుచు తన వేగముచేత వృక్షముల సముదాయములను, శైలములను, శిలలను, సామాన్యవానరులను లాగికొనిపోయెను. బాహువులనుండి తొడలనుండి బయలుదేరిన వేగముచేత ఎగురగొట్టబడిన ఆ వృక్షాదులు వేగము తగ్గగా నీటిలో పడిపోయినవి. గరుత్మంతుని వంటి పరాక్రమము గల ఆతడు సర్పశరీరముల వంటి బాహువులను చాపి, దిక్కులను లాగుచున్నాడా అన్నట్లు ఎగిరి పర్వతములలో శ్రేష్ఠమైన హిమవత్పర్వతమునకు వెళ్ళెను. అతడు తిరుగుచున్న తరంగపంక్తులతో నిండిన ఉదకముచేత అన్ని జంతువులను త్రిప్పివేయుచున్న సముద్రమును చూచుచు విష్ణుహస్తాగ్రముచేత విడువబడిన చక్రమువలె శీఘ్రముగా వెళ్ళెను. (49-52)

తండ్రితో సమానమైన పరాక్రమము గల ఆ హనుమంతుడు పర్వతములను, పక్షుల సముదాయములను, సరస్సులను, పెద్ద చెరువులను, నదులను, చెరువులను, శ్రేష్ఠములైన పురములను, జనసముదాయములను చూచుచు, ఏమాత్రము శ్రమ ఎరుగనివాడై సూర్యమార్గమును అనుసరించి శీఘ్రముగా వెళ్ళెను. వాయుదేవుడువలె, మహావేగముతో, దిక్కులను ధ్వనిచేత ప్రతిధ్వనింపచేయుచు వెళ్లెను. భయంకరమైన పరాక్రమము గల వానరులలో గొప్పవాడైన ఆ హనుమంతుడు జాంబవంతుని మాటలు స్మరించుచు శీఘ్రముగా వెళ్ళి హిమవత్పర్వతమును చూచెను. ఆ పర్వతోత్తమమైన హిమవత్పర్వతమునందు అనేకవిధములైన జలపాతములు, గుహలు, జలప్రవాహములు ఉండెను. అది ఎత్తైన మేఘాల గుంపులువంటి, చూచుటకు అందముగా ఉన్న శిఖరములతో ప్రకాశించుచుండెను. ఆ మహాపర్వతమును సమీపించి అక్కడ ఉత్తమములైన దేవతాసంఘములు, ఋషిసంఘములు నివసించు పవిత్రములైన గొప్ప ఆశ్రమములను చూచెను. (53-58)

అక్కడ బ్రహ్మదేవుని గృహమును, కైలాసమును, ఇంద్రుని గృహమును, రుద్రుడు విలాసార్థమై బాణములు విడచు స్థలమును, హయగ్రీవుని ఆరాధించు స్థానమును, రుద్రుడు బ్రహ్మదేవుని శిరస్సు ఖండించి పడగొట్టిన స్థానమును, సూర్యుని కింకరులను చూచెను. బ్రహ్మదేవుడు ఇంద్రునకు వజ్రాయుధమిచ్చిన స్థానమును, సూర్యునివంటి కాంతి గల కుబేరుని గృహమును, ఛాయాదేవికి ప్రీతి కలిగించుటకు విశ్వకర్మ సూర్యునికాంతి తగ్గించుటకై శాణముపై ఎక్కించుటకు సూర్యుణ్ణి బంధించిన స్థానమును, బ్రహ్మ కూర్చుండు స్థానమును, శంకరుని ధనుస్సు ఉండు స్థానమును, పాతాళప్రవేశద్వారమును చూచెను. భయంకరమైన కైలాసపర్వతమును, హిమవచ్ఛిలలను, ఋషభపర్వతమును, శ్రేష్ఠమైన మేరుపర్వతమును, ప్రజ్వలించుచున్న సమస్త ఓషధులచేత ప్రకాశింపచేయబడిన ఓషధిపర్వతమును చూచెను.(59-61)

అగ్నిరాశివలె ప్రజ్వలించుచున్న ఆ ఓషధిపర్వతమును చూచి ఆశ్చర్యపడి, దానిమీదకు దిగి అక్కడ ఓషధులను వెదకెను. వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు వేలకొలది యోజనములు దాటివెళ్ళి, దివ్యములైన ఓషధులున్న ఆ పర్వతముమీద వెదకెను. ఆ పర్వతశ్రేష్ఠముపైన ఉన్న మహౌషధులన్నీ తమకొరకై ఎవరో వచ్చుచున్నాడని తెలిసికొని, అప్పుడు అదృశ్యములు అయిపోయినవి. మహాత్ముడైన హనుమంతునకు ఆ ఓషధులు కనబడకపోవుటతోడనే కోపము వచ్చెను. అతడు కోపముతో గట్టిగా అరచెను. అతడు సహించనివాడై, అగ్నివలె ఎఱ్ఱగా ఉన్న నేత్రములతో ఆ పర్వతముతో– "ఓ! పర్వతమా! రాముని విషయమున జాలి చూపకుండుటయే నీ నిశ్చయ మని అర్థమగుచున్నది. సరే! ఇప్పుడు నా బాహుబలముచేత తిరస్కరింపబడినవాడవై, హింసింపబడనున్నావు. చూచుకొనుము!" అని పలుకుచు, చెట్లతోను, ఏనుగులతోను, బంగారముతోను, వేలకొలది ధాతువులతోను నిండి యున్న, విడిపోయిన అగ్రములు గల, ప్రజ్వలించు చరియలు గల ఆ పర్వతమును గ్రహించి వెంటనే వేగముగా పైకి ఎగిరెను.(62-67)

హనుమంతుడు అపర్వతశిఖరమును పెకిలించి, సురనాయకులతో, అసురనాయకులతో సహా లోకములను భయపెట్టి, అనేకులైన అకాశసంచారిభూతములచేత స్తుతింపబడుచు, గరుత్మంతునివంటి భయంకరమైన వేగముతో వెళ్ళెను. సూర్యునివంటి కాంతిగల ఆ శిఖరమును గ్రహించి సూర్యమార్గములో(ఆకాశములో) ఎగురుచున్న సూర్యునివంటి కాంతి గల ఆ హనుమంతుడు, సూర్యుని దగ్గర రెండవ సూర్యుడు వలె ప్రకాశించెను. పర్వతమువంటి

ఆ హనుమంతుడు ఆ పర్వతముతో, ఆకాశమునందు ప్రయోగించిన, వేయి అంచులు గల, అగ్నితో కూడిన చక్రముతో విష్ణువువలె మిక్కిలి ప్రకాశించెను. (68-70)

అప్పుడు వానరులు హనుమంతుణ్ణి చూచి ధ్వనిచేసిరి. హనుమంతుడు కూడ వాళ్ళను చూడగానే ధ్వనిచేసెను. వాళ్ళు చేసిన ఆ అత్యధికమైన ధ్వని విని లంకలో ఉన్నవాళ్లందరు చాల భయంకరముగా అరచిరి. పిమ్మట మహాత్ముడైన ఆ హనుమంతుడు ఆ ఉత్తమమైన పర్వతము మీద వానరసైన్యమధ్యమునందు దిగి అక్కడ ఉన్న పెద్దలైన వానరులకు శిరస్సు వంచి నమస్కారముచేసి విభీషణుణ్ణి కౌగిలించుకొనెను. అప్పుడు మహౌషధుల వాసనను ఆఘ్రాణించగానే రామలక్ష్మణు లిద్దరి శల్యములూ తొలగిపోయినవి. ఇతరులైన వానరనాయకులు కూడ లేచిరి. మరణించిన వానరు లందరూ కూడ శ్రేష్ఠములైన ఆ ఓషధుల వాసన తగలగానే క్షణకాలములో, నిద్రించినవారు తెల్లవారుజామున మేల్కొన్నట్లు లేచిరి. (71-75)

లంకలో వానరరాక్షసుల మధ్య యుద్ధము ప్రారంభమైనది మొదలు, రాక్షసులు చావలేదు అని గొప్పలు చెప్పుకొనుటకూ, రావణుని ఆజ్ఞప్రకారమూ కూడ, ఆ యుద్ధములో వానరులచే చంపబడిన రాక్షసుల నందరినీ, చచ్చినవాళ్ళను చచ్చినవెంటనే, సముద్రములో పడవేయుచుండెడివారు. పిమ్మట తీవ్రమైన వేగము గల వాయుపుత్రుడైన హనుమంతుడు ఆ ఓషధీపర్వతమును హిమాలయ పర్వతమువద్దకు తీసికొనిపోయి అక్కడ చేర్చి మరల రాముని సన్నిధియందు నిలచెను. (76,77)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది నాలుగవ సర్గము సమాప్తము

డెబ్బది ఐదవ సర్గము

వానరులు లంకను కాల్చుట; రాక్షసులకు వానరులకు మధ్య ఘోరయుద్ధము జరుగుట.

పిమ్మట మహాతేజఃశాలియైన వానరరాజైన సుగ్రీవుడు, చేయవలసిన విషయమును తెలుపుచు హనుమంతునితో- "కుంభకర్ణుడు, నలుగురు పుత్రులు చంపబడినారు గాన, ఇప్పుడు రావణుడు నగరమునుండి బైటకు వచ్చి మనకు యుద్ధభోజనమును ఇవ్వజాలడు. గొప్పబలము గల వానరశ్రేష్ఠులైన, సింహములతో

సమానులైన వానరు లందరూ ఉల్కలను చేతపట్టుకొని రావణుని నివాసమును కాల్చివేయుటకై లంకలోనికి శీఘ్రముగా వెళ్లెదరుగాక." అని పలికెను.(1-3)

పిమ్మట సూర్యాస్తమయానంతరము, భయంకరమైన ఆ సాయంకాలసమయమునందు వానరశ్రేష్ఠులు అగ్నిజ్వాలలను పట్టుకొని లంక వైపు వెళ్ళిరి. వానరులు ఉల్కలు చేతులలో గ్రహించి నలువైపులనుండి ఆక్రమించగా, రక్షణస్థానములలో ఉన్న వికృతనేత్రములు గల రాక్షసులు వెంటనే పారిపోయిరి. ఆ వానరులు సంతోషించుచు పురద్వారములయందు, ప్రాకారములపైన ఉండు రక్షాగృహములయందు, వీథులయందు, అనేకములైన సందులలోను అగ్నిని విడచిరి. అప్పుడు అగ్ని ఆ రాక్షసుల వేలకొలది గృహములను కాల్చివేసెను. పర్వతములవంటి ప్రాసాదములు నేలపై కూలిపోయెను. అక్కడ అగురువు, శ్రేష్ఠమైన చందనము, నున్నని ముత్యములు, మణులు, వజ్రములు, పగడములు కాల్చివేయబడెను. తెల్లని పట్టు వస్త్రములు, పట్టుపురుగులనుండి తీసిన పట్టుతో నేసిన అందమైన వస్త్రములు, గొఱ్ఱె ఉన్నితో నేసిన వస్త్రములు, ఇతరమృగముల రోమములతో నేసిన వస్త్రములు, బంగారు అలంకారములు, ఆయుధములు కాల్చివేయబడెను. అనేక ఆకారములలో ఉండు గుఱ్ఱముల అలంకారములు ఇతరసామాగ్రి, ఏనుగుల కంఠాభరణములు, నడుముకు కట్టు బంధనములు, శుభ్రముగా ఉంచబడిన రథాలంకారములు కాల్చివేయబడినవి. యోధుల కవచములు, గజాశ్వముల కవచములు, డాళ్ళు, ఖడ్గములు, ధనుస్సులు, అల్లెత్రాళ్ళు, బాణాలు, తోమరములు, అంకుశములు, శక్తులు దహింపబడెను. అగ్ని ఉన్నివస్త్రములను, చామరాదులను, వ్యాఘ్రచర్మలను, అనేకపక్షులను, ముత్యములతోను, మణులతోను విచిత్రములైన ప్రాసాదములను, అనేక విధములైన అస్త్రసముదాయములను అంతటా కాల్చివేసెను.(4-13)

విచిత్రములైన అనేకవిధములైన గృహములను, గృహమునందు అత్యాసక్తి గల అందరి రాక్షసుల నివాసములను కాల్చివేసెను. అగ్ని లంకలో నివసించు వందలకొలది, వేలకొలది రాక్షసులను కాల్చివేయుచు ఇంకను అధికముగా మండెను. ఆ రాక్షసులలో కొందరు బంగారముచేత విచిత్రములైన కవచములను ధరించిరి. కొందరు మాలలు, అలంకారములు మంచి వస్త్రములు ధరించిరి. కొందరు మద్యపానముచేత చంచలమైన కళ్ళతో మదముచేత తూలుచు నడచుచుండిరి. కొందరు కాంతల వస్త్రములను లాగుచుండిరి. కొందరు శత్రువులమీద కోపముతో గదా-శూల-ఖడ్గములు హస్తములలో ధరించి ఉండిరి. కొందరు తినుచూ త్రాగుచూ ఉండిరి. కొందరు ప్రియురాళ్లతో కూడ అమూల్యములైన శయనముల మీద

శయనించి ఉండిరి. కొంతమంది భయపడి పుత్రభార్యాదులను వెంటబెట్టుకొని పారిపోవుచుండిరి.(14-18)

అక్కడ సూర్యుణ్ణి స్పృశించుచున్నవా అన్నట్లు ఉన్న పర్వతము వంటి ధనసమృద్ధములైన గృహములను అగ్ని దహించివేసెను. చాల అందమైన ఆ గృహములు ఎన్నో వాకిళ్ళతో చాల గంభీరములుగా ఉండెను. బంగారముతో కొన్ని పూర్ణచంద్రాకారములోను, కొన్ని అర్ధచంద్రాకారములోను నిర్మింపబడెను. అందమైన పై అంతస్తులు గల ఆ గృహములకు అన్ని వైపులా విచిత్రములైన కిటికీలు అమర్చబడెను. మణులతోను, పగడములతోను విచిత్రములైన ఆ గృహములు శయనములతో, ఆసనములతో నిండియుండెను. క్రౌంచపక్షుల కూతలతోను, నెమళ్ళ కేకాధ్వనులతోను, వీణావాదనములతోను, అలంకారముల ధ్వనులతోను అవి ప్రతిధ్వనించుచుండెను.(19-21)

అగ్ని చుట్టుముట్టిన ముఖద్వారములు, వర్షాకాలప్రారంభమునందు మెరుపులతో వ్యాప్తములైన మేఘసముదాయముల వలె ఉండెను. చుట్టూ అగ్ని ఉన్న భవనములు దావాగ్నిచేత ప్రజ్వలించుచున్న మహాపర్వతశిఖరములవలె ప్రకాశించినవి. విమానాలలో (గృహాలలో) నిద్రించుచున్న ఉత్తమస్త్రీలు సమస్త అవయవములందున్న అలంకారములు జారిపోవుచుండగా అయ్యో! అయ్యో! అని బిగ్గరగా ఏడ్చిరి. అగ్నిచేత వ్యాప్తములైన భవనములు ఇంద్రుని వజ్రాయుధముచేత ఛేదింపబడిన మహాపర్వతశిఖరముల వలె పడిపోయినవి. అన్నివైపులా కాల్చివేయబడుచున్న ఆ గృహములు, దూరమునుండి, దహింపబడుచున్న హిమవత్పర్వతశిఖరములవలె ప్రకాశించినవి. కాలిపోవుచు, అగ్నిజ్వాలలతో నిండిన మేడల అగ్రభాగములతో రాత్రియందు ఆ లంక పుష్పించిన మోదుగచెట్లతో నిండినట్లు ఉండెను. (22-27)

ఏనుగులు, గుఱ్ఱములు కాలిపోకుండా పారిపోవుటకై వాటిని గజాధ్యక్షులు, అశ్వాధ్యక్షులు బంధనములనుండి విడిచివేయగా ఆ లంకానగరము ప్రళయకాలమునందు ఇటూ అటూ కొట్టుకొనుచున్న జలజంతువులు గల సముద్రమువలె ఉండెను. ఒకచోట, బంధనమునుండి విడిచిపెట్టబడిన గుఱ్ఱమును చూచి భయపడి, ఏనుగు పారిపోవుచున్నది. మరొకచోట భయపడిన ఏనుగును చూచి గుఱ్ఱము భయపడి వెనుకకు పారిపోవుచున్నది.(28, 29)

లంక దహించబడుచున్నప్పుడు ఆ మంటల కాంతి నీటిలో ప్రతిబింబించుటచేత

మహాసముద్రము ఎఱ్ఱని ఉదకము గల సముద్రము వలె ప్రకాశించెను. వానరులచేత కాల్చివేయబడిన ఆ లంక, ముహూర్తకాలములో, ప్రపంచము నశించు మహాప్రళయ సమయమునందు మండిపోవుచున్న భూమి వలె అయిపోయెను. ధూమముచేత కప్పివేయబడి అగ్నికి కాలిపోవుచున్న స్త్రీలు చేసిన ఆర్తధ్వని నూరు యోజనముల దూరము వినబడెను. శరీరములు కాలిపోయి బైటకు పారిపోవుచున్న కొందరు రాక్షసులను వానరులు యుద్ధము చేయుటకై ఎదుర్కొనుచుండిరి. వానరుల అరపులు, రాక్షసులు చేయుధ్వనీ పది దిక్కులను, సముద్రమును, భూమినీ ప్రతిధ్వనింపచేసినవి. (30-34)

మహాత్ములైన ఆ రామలక్ష్మణులిద్దరూ శల్యములు తొలగిపోయిన పిమ్మట ఏమాత్రము కంగారుపడక శ్రేష్ఠములైన ధనుస్సులను ధరించిరి. పిమ్మట రాముడు రాక్షసులకు భయము కలిగించు వ్యాకులమైన ధ్వనిని చేయుచు ఉత్తమమైన ధనుస్సును చరచెను. గొప్పదైన ఆ ధనుస్సును చరచుచున్న రాముడు వేదోక్తలక్షణములు గల ధనుస్సును చరచుచున్న కోపించిన రుద్రుడువలె ఉండెను. రాముడు చేయుచున్న ధనుష్టంకారధ్వని- వానరుల సింహనాదములను, రాక్షసులు చేయు ధ్వనులను మించి వినబడెను. వానరులు చేయు మహాధ్వని, రాక్షసుల ధ్వని, రాముని టంకారధ్వని ఈ మూడు ధ్వనులూ పది దిక్కులలో వ్యాపించినవి. (35-39)

కైలాసపర్వతశిఖరమువంటి ఆ లంకానగరగోపురము రాముని ధనుస్సునుండి వెలువడిన బాణాలకు ముక్కముక్కలై నేలమీద పడిపోయెను. రాముని బాణాలు వచ్చి విమానాలలోను, గృహాలలోను పడుచుండుట చూడగానే రాక్షసుల యుద్ధసంనాహమంతా వ్యాకులమై పోయెను. యుద్ధసంనాహము చేయుచు, సింహనాదములు చేయుచున్న ఆ రాక్షసనాయకులకు ఆ రాత్రి ప్రళయకాలరాత్రి వలె ఉండెను. అప్పుడు వానరప్రభువైన సుగ్రీవుడు వానరనాయకులను "వానరులారా! మీకు దగ్గర నున్న ద్వారము వద్దకు వెళ్ళి అక్కడ యుద్ధము చేయుడు. ఆ యా స్థానాలలో ఉండి కూడ యుద్ధముచేయక, రాజాజ్ఞ మన్నింపనివానిని వెంటనే మీదపడి చంపి వేయవలెను." అని ఆజ్ఞాపించెను. (40-44)

మండుచున్న కాగడాలను చేతులతో ధరించి ద్వారమువద్ద ఉన్న ఆ వానరులను చూడగానే రావణునకు క్రోధావేశము కలిగెను. అతడు ఒడలు విరుచుకొనగానే పదిదిక్కులూ వ్యాకులము లయ్యెను. అతని అవయవములలో రుద్రుని కోపము ఆవేశించి నట్లు ఉండెను. మిక్కిలి కోపించిన ఆ రావణుడు కుంభుడు, నికుంభుడూ

అను కుంభకర్ణపుత్రుల నిద్దరినీ, చాలమంది రాక్షసులను కూడ యుద్ధరంగమునకు పంపెను. (45-47)

రావణుని ఆజ్ఞచేత యూపాక్షుడు, శోణితాక్షుడు, ప్రజంఘుడు, కంపనుడు కూడ కుంభకర్ణుని పుత్రులతో కలిసి బయలుదేరిరి. అతడు మహాబలవంతులైన ఆ రాక్షసులనందరినీ – "రాక్షసులారా! సింహనాదములు చేయుచు ఇప్పుడే బయలుదేరి వెళ్ళుడు." అని ఆజ్ఞాపించెను. (48, 49)

రావణునిచేత ప్రేరేపింపబడిన వీరులైన రాక్షసులు ప్రకాశించుచున్న ఆయుధములు ధరించి, మాటిమాటికి గర్జించుచు బయలుదేరిరి. తమ అలంకారముల కాంతులచేత, తమ సహజకాంతులచేత, రాక్షసులూ, అగ్నులతో కూడిన వానరులూ ఆకాశమును, రెండుసైన్యముల మధ్యనున్న అవకాశమును, ప్రకాశముకలదానినిని చేసిరి. అక్కడ చంద్రుని కాంతి, నక్షత్రముల కాంతి, రెండు సైన్యముల అలంకారముల కాంతి ప్రజ్వలించుచు ఆకాశమును ప్రకాశింపచేసెను. చంద్రుని కాంతి, భూషణముల కాంతి, ప్రజ్వలించుచున్న గ్రహముల కాంతి వానరరాక్షససైన్యములను అన్నివైపులా ప్రకాశింపచేసెను. అక్కడ సగము కాలిపోయిన ఇండ్ల కాంతులతో కలిసిన జలముతో కదలుచున్న తరంగములు గల సముద్రము అధికముగా ప్రకాశించెను. (50-54)

ఆ రాక్షససైన్యము పతాకలతోను, ధ్వజములతోను అలంకృతమై భయంకరములైన అశ్వములతోను, రథములతోను, ఏనుగులతోను, అనేకవిధముల పదాతిదళముతోను వ్యాకులముగా ఉండెను. ఉత్తమములైన చిన్న ఖడ్గములు, గండ్రగొడ్డళ్ళు, శూలములు, గదలు, పెద్ద ఖడ్గములు, ప్రాసలు, తోమరములు, ధనుస్సులు ప్రకాశించుచుండెను. భయంకరమైన పరాక్రమము, పౌరుషము గల రాక్షసులతో నిండియుండెను. ప్రాసలు ప్రజ్వలించుచుండెను. వందలకొలది చిరుగంటల ధ్వని వినబడుచుండెను. రాక్షసులు తమ భుజములను బంగారు అలంకారముల సముదాయములతో అలంకరించుకొని యుండిరి. ఆ సైన్యమునందు వాయువు సుగంధద్రవ్యముల గంధముతోను, పుష్పమాలల సువాసనతోను, అధికమైన మద్యగంధముతోను నిండియుండెను. కొందరు రాక్షసులు గండ్రగొడ్డళ్ళు త్రిప్పుచుండిరి. కొందరు మహాశస్త్రములను కదల్చుచుండిరి. కొందరు ధనుస్సులపై బాణములు సంధించుచుండిరి. ఈ విధముగా ఆ రాక్షససైన్యము చాల భయంకరముగా కనబడెను. (55-58)

భయంకరము, శూరులతో నిండినది, మహామేఘము వలె ధ్వనిచేయుచున్నది, ఎదిరింపశక్యముకానిదీ అయిన ఆ రాక్షస సైన్యము వచ్చుట చూచి వానరసైన్యము చలించెను. బిగ్గరగా ధ్వనిచేసెను. గొప్పదైన ఆ రాక్షససేన శీఘ్రముగా దుముకుచు మిడతలు అగ్నివైపు వెళ్ళినట్లు శత్రుసైన్యమువైపు వెళ్ళెను. భుజముల స్పర్శచే శుభ్రముగా చేయబడి ప్రకాశించుచున్న పరిఘలు, వజ్రాయుధములూ గల ఆ రాక్షససైన్యము ఇంకను ఎక్కువగా ప్రకాశించెను. అప్పుడు యుద్ధము చేయగోరుచున్న ఆ వానరులు ఉన్మత్తులు వలె ఎగిరి, రాక్షసులను వృక్షములతోను, పర్వతములతోను, పిడికిళ్ళతోను కొట్టిరి. భయంకరమైన పరాక్రమము గల రాక్షసులు కూడా వచ్చుచున్న ఆ వానరుల శిరస్సులను వాడియైన బాణాలచేత వెంటనే ఖండించిరి.(59-63)

అక్కడ సంచరించుచున్న కొందరు రాక్షసుల చెవులను వానరులు దంతాలతో కొరికివేసిరి. కొందరి శిరస్సులను పిడికిళ్ళతో పగులగొట్టిరి. కొందరి శరీరములను రాళ్ళదెబ్బలతో పగులగొట్టిరి. అట్లే ఘోరములైన రూపములు గల కొందరు రాక్షసులు ఆ యుద్ధరంగమునందు అంతటా, ఆ వానరులలో ప్రధానులైన వారిని వాడియైన ఖడ్గాలతో కొట్టిరి. ఒకడు ఒకనిని చంపుచుండగా మరియొకడు వానిని చంపెను. పడద్రోయుచున్న వానిని మరొకడు పడద్రోసెను. నిందించుచున్న వానిని మరొకడు నిందించెను. కరచుచున్నవానిని మరొకడు కరచెను. 'కొట్టుము' అని ఒకడు, 'ఇదిగో కొట్టుచున్నాను' అని మరొకడు 'కొట్టుచున్నాడు' అని ఒకడూ, 'ఎందుకు శ్రమపడెదవు' అని ఒకడు, 'నిలువుము' అని మరొకడు ఈవిధముగా అక్కడ ఆ యోధులు ఒకరితో ఒకరు అనుకొనుచు యుద్ధము చేసిరి.(64-67)

ఆ వానరులకు రాక్షసులకు మధ్య జరిగిన చాల భయంకరమైన ఆ యుద్ధములో గురితప్పునట్లు చేయుటచేత శస్త్రములు వ్యర్థములుగా చేయబడినవి. కవచములు ఊడిపోయినవి. ఆయుధములు జారిపోయినవి. పెద్దప్రాసలు ఎత్తబడినవి. యష్టులు, శూలములు, ఖడ్గములు అధికముగా ప్రయోగింపబడినవి. ఆ యుద్ధమునందు రాక్షసులు వానరులను పదిమంది చొప్పున, ఏడుగురేసి చొప్పున చంపగా వానరులు కూడ రాక్షసులను పదిమందిచొప్పున ఏడుగురేసి చొప్పున పడగొట్టిరి. వానరులు కేశములు, వస్త్రములు, ఊడిపోవుచున్న కవచములు, ధ్వజములు పడిపోవుచున్న ఆ రాక్షససైన్యమును పట్టి చుట్టుముట్టిరి.(68-71)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది ఐదవ సర్గము సమాప్తము.

డెబ్బది ఆరవ సర్గము

అంగదుడు కంపన-ప్రజంఘులను, ద్వివిదుడు శోణితాక్షుని, మైందుడు యూపాక్షుని, సుగ్రీవుడు కుంభుని చంపుట.

వీరజనులు నశించే భయంకరమైన యుద్ధము ప్రారంభమయిన వెంటనే అంగదుడు వీరుడైన కంపనునితో యుద్ధమునకై తలపడెను. కంపనుడు అంగదుణ్ణి యుద్ధానికి పిలిచి, కోపముతో అతనిని ముందుగా, వేగముగా గదతో కొట్టెను. అంగదుడు గట్టి దెబ్బ తగిలి కదలిపోయెను. తేజఃశాలియైన అంగదుడు సంజ్ఞ పొంది వానిపై పర్వతశిఖరమును విసరెను. ఆ దెబ్బచేత పీడింపబడి కంపనుడు నేలపై కూలెను.(1-3)

కంపనుడు యుద్ధములో మరణించుట చూచి శోణితాక్షుడు రథమెక్కి భయములేనివాడై, శీఘ్రముగా అంగదునిమీదికి వెళ్ళెను. అప్పుడతడు వేగము చూపుచు శరీరమును చీల్చివేయు వాడియైన, కాలాగ్ని ఆకారము వంటి ఆకారము గల బాణములచేత అంగదుణ్ణి కొట్టెను. క్షురములు, క్షురప్రములు, నారాచములు, వత్సదంతములు, శిలీముఖములు, కర్ణులు, శల్యములు, విపాఠములు అను బాణములను, వాడియైన అనేక ఇతర బాణములను ప్రయోగించెను. వాలిపుత్రుడు, ప్రతాపవంతుడు, బలవంతుడు అయిన అంగదుడు ఈ విధముగా శరీరమునందంతటా దెబ్బలు తగలగా వాని భయంకరమైన ధనుస్సును, రథమును, బాణాలను బలముచేత నశింపచేసెను. పిమ్మట శోణితాక్షుడు కోపించి, మరేమీ ఆలోచించక శీఘ్రముగా కత్తీ, డాలూ, తీసికొని వేగముగా పైకి ఎగిరెను. బలశాలియైన అంగదుడు అంతకంటె వేగముగా పైకి ఎగిరి, వానిని పట్టుకొని తన చేతితో అతని ఖడ్గమును లాగికొని సింహనాదము చేసెను. పిమ్మట వానరశ్రేష్ఠుడైన అంగదుడు ఆ రాక్షసుని ఫలకము వంటి భుజము మీద ఖడ్గముతో లోతుగా నాటి జందెము పెట్టున అతనిని చీల్చెను.(4-10)

అంగదుడు ఆ ఖడ్గమును తీసికొని మాటిమాటికి గర్జించుచు ఆ యుద్ధరంగమునందు మిగిలిన శత్రువులున్న వైపు శీఘ్రముగా వెళ్ళెను. పిమ్మట వీరుడూ బలవంతుడూ అయిన యూపాక్షుడు కోపించి, జంఘునితో కలిసి రథముమీద, మహాబలశాలియైన అంగదుని ఎదిరించుటకై వెళ్లెను. వీరుడైన ఆ శోణితాక్షుడు మూర్ఛనుండి తేరుకొని, ఇనుపగద గ్రహించి ఆ అంగదునిమీదకే శీఘ్రముగా

వెళ్లెను. మహావీరుడు, బలవంతుడు అయిన ప్రజంఘుడు కోపించి, గద ధరించి, గొప్పబలము గల అంగదునిమీదికి వెళ్లెను. ఆ శోణితాక్ష-ప్రజంఘుల మధ్య నున్న ఆ అంగదుడు విశాఖానక్షత్రముల మధ్య ఉన్న పూర్ణచంద్రుడువలె ప్రకాశించెను.(11-15)

మైందద్వివిదులు అంగదుని రక్షించుచు, అతని దగ్గరనే ఉండి తమకు యుద్ధానికి తగిన వారికొరకు చూచుచుండిరి. పెద్ద శరీరములు, గొప్ప బలముగల రాక్షసులు ఖడ్గములను, బాణములను, గదలను ధరించి, సన్నద్ధులై కోపముతో వానరులను ఎదిరించిరి. ఆ ముగ్గురు రాక్షసవీరులతో తలబడిన ఆ ముగ్గురు వానరవీరులకు రోమాంచమును కలిగించు భయంకరమైన యుద్ధము జరిగెను. యుద్ధములో ఆ వానరులు వృక్షములను గ్రహించి వాటిని విసరగా మహాబలవంతుడైన ప్రజంఘుడు వాటిని ఖడ్గముతో ఛేదించెను. వానరులు రథములమీదికి గుఱ్ఱములమీదికి వృక్షములను, పర్వతములను విసరగా మహాబలశాలియైన యూపాక్షుడు వాటిని బాణసముదాయములచేత ఛేదించెను. ద్వివిదమైందులు పెకలించి విడచిన వృక్షములను పరాక్రమవంతుడు, ప్రతాపవంతుడూ అయన శోణితాక్షుడు గదచేత మధ్యయందే విరచివేసెను.(16-21)

ప్రజంఘుడు శత్రువుల మర్మస్థానములను చీల్చివేసే పెద్ద ఖడ్గమును ఎత్తి అంగదునిమీదకు వేగముగా వెళ్ళెను. అప్పుడు అందరినీ మించిన బలము గల ఆ అంగదుడు దగ్గరగా వచ్చిన ఆ ప్రజంఘుణ్ణి మద్దిచెట్టుతో కొట్టెను. అంగదుడు కత్తి పట్టిన ప్రజంఘుని చేతిని పిడికిలితో కొట్టగా ఆ దెబ్బకు ఖడ్గము నేలమీద పడెను. ముసలము వంటి ఆ ఖడ్గము నేలమీద పడిపోవుట చూచి గొప్ప బలము గల ఆ ప్రజంఘుడు వజ్రాయుధము వంటి పిడికిలిని బిగించి, వానరశ్రేష్ఠుడైన ఆ అంగదుని లలాటముమీద కొట్టగా అతడు క్షణకాలము చలించిపోయెను. అంగదుడు సంజ్ఞ పొంది పిడికిలితో కొట్టి ప్రజంఘుని తలను దేహమునుండి క్రిందికి పడగొట్టెను.(22-27)

యుద్ధములో పినతండ్రి మరణించుటచే కండ్లలో కన్నీళ్ళు నిండిన యూపాక్షుడు బాణములు అయిపోవుటచే ఖడ్గమును గ్రహించి వెంటనే రథమునుండి దిగెను. మీదికి పరుగెత్తి వచ్చుచున్న ఆ యూపాక్షుణ్ణి చూచి బలవంతుడైన ద్వివిదుడు తొందరపడుచు వానిని వక్షఃస్థలముమీద కొట్టి కోపముతో అతనిని బలాత్కారముగా పట్టుకొనెను. మహాబలవంతుడైన తన సోదరుణ్ణి ద్వివిదుడు పట్టుకొనుటచూచి

శోణితాక్షుడు ఆ ద్వివిదుణ్ణి వక్షఃస్థలముమీద కొట్టెను. శోణితాక్షుడు ఆ విధముగా కొట్టగా ద్వివిదుడు తూలిపోయెను. మరల అతడు గదను ఎత్తగా దానిని లాగికొనెను. ఇంతలో పరాక్రమశాలియైన మైందుడు ద్వివిదుని దగ్గరకు వచ్చి అరచేతితో యూపాక్షుణ్ణి వక్షఃస్థలముమీద కొట్టెను. వేగవంతులైన ఆ శోణితాక్షయూపాక్షులు యుద్ధమునందు ఆ మైందద్వివిదులతో చాల తీవ్రమైన లాగుటను, చీల్చుటను చేసిరి. పరాక్రమవంతుడైన ద్వివిదుడు శోణితాక్షుని ముఖమును గోళ్ళతో చీల్చి అతనిని నేలమీద పడవేసి నలగగొట్టెను. మైందుడు కోపముతో యూపాక్షుణ్ణి బాహువులతో పట్టి గట్టిగా నొక్కివేయగా అతడు చచ్చి నేలమీద పడిపోయెను. (28-35)

అప్పుడు మహావీరులు చచ్చి నేలమీద పడిపోవుటచే వ్యథ చెందిన రాక్షససేన కుంభకర్ణుని కుమారుడు కుంభుడున్న వైపు వెళ్ళెను. కుంభుడు తన వైపు శీఘ్రముగా వచ్చుచున్న ఆ సైన్యమునకు ధైర్యము చెప్పి వానరులచేత చంపబడిన మహావీరులు గల ఆ రాక్షససైన్యమును చూచి యుద్ధమునందు ఇతరులెవ్వరూ చేయజాలని గొప్ప పనిచేసెను. ధనుర్ధరులలో శ్రేష్ఠుడైన ఆ కుంభుడు ధనుస్సు గ్రహించి, చాల సావధానచిత్తుడై దేహములను చీల్చివేయు, సర్పముల వంటి బాణములను విడచెను. బాణము సంధించిన అతని ఉత్తమమైన ధనుస్సు, మెరుపు కాంతితోను, వక్రము కాని ధనుస్సు కాంతితోను కూడిన రెండవ ఇంద్రధనుస్సువలె ప్రకాశించెను. అప్పుడు అతడు బంగారు పొన్ను గల, రెక్కలు కట్టిన బాణములను చెవివరకు లాగి విడచి ద్వివిదుణ్ణి కొట్టెను. హఠాత్తుగా ఆ బాణము దెబ్బతినిన ఆ వానరశ్రేష్ఠుడు అడుగులు తడబడగా కదలిపోయి, వ్యాకులుడై త్రికూటపర్వతము వలె పడిపోయెను. ఆ మహాయుద్ధమునందు పడిపోయిన తన సోదరుణ్ణి చూచి మైందుడు పెద్ద శిలను తీసికొని వేగముగా ఆ రాక్షసుణ్ణి ఎదిరించుటకై వెళ్ళెను. గొప్పబలము గల ఆ మైందుడు ఆ శిలను రాక్షసులపై ప్రయోగించగా అతడు దానిని మెరయుచున్న ఐదు బాణాలచేత ముక్కలు చేసెను. మహాతేజఃశాలియైన కుంభుడు మంచి అగ్రభాగము గల సర్పము వంటి మరియొక బాణమును సంధించి మైందుని వక్షఃస్థలము మీద కొట్టెను. కుంభుని బాణము దెబ్బ మర్మస్థానమునందు తగులుటచేత వానరసేనానాయకుడైన ఆ మైందుడు మూర్ఛచెంది నేలమీద పడిపోయెను. (36-46)

మహాబలశాలులైన తన మేనమామలిద్దరూ పడిపోవుటచూచి అంగదుడు ధనుస్సు పట్టి ఉన్న కుంభుని ఎదిరించుటకై శీఘ్రముగా వెళ్ళెను. కుంభుడు ఐదు ఇనుప బాణాలతోను, వాడియైన మరి మూడు బాణాలతోను, తనమీదకి వచ్చి

పడుచున్న అంగదుణ్ణి ఏనుగును తోమరములతో కొట్టినట్లు కొట్టెను. పరాక్రమవంతుడైన ఆ కుంభుడు, మొనబోని అంచులు గల, వాడియైన , బంగారు అలంకారములు గల అనేకమైన ఇనుప బాణములచేత అంగదుణ్ణి కొట్టెను. ఆ విధముగా శరీరమునందు కొట్టబడిన వాలిపుత్రుడైన అంగదుడు ఏమాత్రము చలించక ఆ కుంభుని శిరస్సుమీద శిలలను, వృక్షములను వర్షించెను. కుంభుడు అంగదుడు ప్రయోగించిన వృక్షములను, ఛేదించి శిలలను బ్రద్దలు కొట్టెను. కుంభుడు తన మీదకు వచ్చుచున్న అంగదుణ్ణి చూచి కొరవులతో ఏనుగును కొట్టినట్లు రెండు బాణములతో అతని కనుబొమ్మలమీద కొట్టెను.(47-52)

రక్తము కారుటచేత అంగదుని కళ్ళు కప్పబడిపోయెను. అతడు ఒక చేతితో రక్తముచేత తడసిన నేత్రములు మూసికొని, మరియొక చేతితో దగ్గరనే ఉన్న సాలవృక్షమును పట్టుకొనెను. ఆ మహాయుద్ధమునందు అంగదుడు మ్రానుతో కూడిన ఆ వృక్షమును వక్షఃస్థలముమీద అదిమిపట్టి, చేతిలోనికి తీసికొని, కొంచెము వంగి దానిని నేలనుండి పెకలించెను. ఆ రాక్షసులందరూ చూచుచుండగా అంగదుడు ఇంద్రకేతువుతో సమానమైన మందరపర్వతమువంటి వృక్షమును, కుంభునిపై విసరెను. కుంభుడు ఆ వృక్షమును శరీరము బ్రద్దలు కొట్టు వాడియైన ఏడు బాణముల చేత నరికివేసెను. (చాలకాలమునుండి యుద్ధము చేయుటచే) అంగదుడు మిక్కిలి అలసిపోయి మూర్ఛిల్లి పడిపోయెను.(53-56)

అంగదుడు ఆ విధముగ పడి క్షీణించిన సముద్రమువలె ఉండగా వానరనాయకులు చూచి రామునకు తెలిపిరి. రాముడు ఆ మహాయుద్ధములో అంగదుడు మూర్ఛిల్లినట్లు విని జాంబవంతుడు మొదలైన వానరశ్రేష్ఠులను ఆజ్ఞాపించెను. ఆ వానరశ్రేష్ఠులు రాముని ఆజ్ఞ విని కోపావిష్టులై ధనుస్సు ధరించి యున్న కుంభుని మీదికి శీఘ్రముగా వెళ్ళిరి. అప్పుడు వానరశ్రేష్ఠులు అంగదుణ్ణి రక్షించుటకై వృక్షములూ, శిలలూ చేతులలో ధరించి కోపముతో ఎఱ్ఱబడిన నేత్రములతో శీఘ్రముగా వెళ్ళిరి. జాంబవంతుడూ, సుషేణుడూ, వేగదర్శి కోపించినవారై వీరుడైన ఆ కుంభుని ఎదిరించుటకై శీఘ్రముగా వెళ్ళిరి. గొప్పబలము గల ఆ వానరనాయకులు తనమీదికి వచ్చుచుండగా చూచి, కుంభుడు వారిని చెరువును వృక్షములచేత కప్పినట్లు బాణసముదాయముచేత కప్పివేసెను. ఆ వానరనాయకులు ఆ కుంభుని బాణముల మార్గమును పొంది, మహాసముద్రము తీరమునువలె దానిని దాటజాలలేకపోయిరి.(57-63)

వానరరాజైన సుగ్రీవుడు బాణవర్షముచేత ఆ వానరులందరూ పీడింపబడుటచూచి తన సోదరుని కుమారుడైన అంగదుణ్ణి వెనుక ఉంచి, సింహము పర్వతము చరియమీద సంచరించుచున్న ఏనుగుమీదకు వేగముగా వెళ్ళినట్లు యుద్ధమునందు ఆ కుంభుని మీదకు వెళ్ళెను. సుగ్రీవుడు మద్దిచెట్టు మొదలైన అనేకమైన మహావృక్షములనూ, ఇంకా అనేకవిధములైన వృక్షములనూ పెకలించి కుంభుని మీదకు విసరెను. ఆకాశమును కప్పుచున్న ఎదరింపశక్యము కాని ఆ వృక్షవర్షమును కుంభుడు వాడియైన బాణములచేత ఛేదించెను. లక్ష్యమును కొట్టుటలో నేర్పుగల భయంకరుడయిన ఆ కుంభుడు వాడియైన బాణములతో కొట్టిన ఆ వృక్షములు భయంకరమైన శతఘ్నులు వలె(శల్యములు గుచ్చిన ఇనుప ఆయుధములు వలె) ప్రకాశించినవి. సుగ్రీవుడు ఆ వృక్షవర్షమును కుంభుడు ఛేదించగా చూచి వ్యథ చెందలేదు. అతడు కొట్టుచున్నను సుగ్రీవుడా బాణములను సహించుచు ఇంద్రధనుస్సువంటి ఆ కుంభుని ధనుస్సును హఠాత్తుగా లాగికొని, విరిచివేసెను. (64-70)

సుగ్రీవుడిట్లు ఆ విధముగా ఎగిరి, చేయుటకు శక్యముకాని ఆ పనిని శీఘ్రముగా చేసి, దంతములు విరిగిన ఏనుగువలె ఉన్న ఆ కుంభునితో కోపావిష్టుడై- "ఓ కుంభుడా! నీ పరాక్రమమూ బాణవేగమూ కూడ చాల ఆశ్చర్యకరమైనవి. రాక్షసపక్షపాతమునందూ, ప్రభావమునందూ నీవూ, రావణుడు కూడ సమానులు. ప్రహ్లాద-బలి-ఇంద్ర-కుబేర- వరుణులతో సమానుడవైన ఓ! కుంభుడా! నీవొక్కడవే మహాబలవంతుడైన నీ తండ్రిని పోలి పుట్టినావు. శూలము హస్తమునందు ధరించి శత్రుసంహారము చేయు మహాబాహువైన నిన్నొక్కనినే జితేంద్రియుణ్ణి మనోవ్యథలు బాధింపజాలనట్లు దేవతలు బాధింపజాలరు. ఓ! గొప్పబుద్ధికలవాడా! నీ పరాక్రమము చూపుము. నేను చేయు పనులను కూడా చూడుము. నీ పెద్దతండ్రియైన రావణుడు వరమును పొంది యుండుటచేత దేవదానవులను ఎదిరించగల్గుచున్నాడు. కాని నీ తండ్రి కుంభకర్ణుడైతే సహజమైన పరాక్రమముచేతనే సురాసురులను ఎదిరించగల్గినాడు. నీవు ధనుర్యుద్ధమునందు, ఇంద్రజిత్తుతోనూ, ప్రతాపమునందు రావణునితోను సమానుడవు. అందుచేతనే నీవు ఇప్పుడు రాక్షసులందరిలోనూ బలపరాక్రమములచేత శ్రేష్ఠుడవు. ఇప్పుడు యుద్ధరంగములో నాతో నీకు జరుగబోవు గొప్ప సంఘర్షమును ఇంద్రునకూ శంబరాసురునకూ మధ్య జరిగిన సంఘర్షమును వలె సకలప్రాణులూ చూచుగాక. నీవు సాటిలేని పని చేసినావు. అస్త్రనైపుణ్యము చూపినావు. భయంకరమైన పరాక్రమము కల వానరవీరులను పడగొట్టినావు. నీవు

యుద్ధము చేసి అలసి ఉండుటచేత జనులు నిందింతురేమో అని భయపడి నేను నిన్ను చంపలేదు. కొంచెముసేపు విశ్రాంతి తీసికొనిన పిమ్మట నా బలమెట్టిదో చూడుము." అని పలికెను.(71-80)

కుంభు డీవిధముగా అవమానకరమైన సుగ్రీవవాక్యముచేత గౌరవింపబడెను. అప్పుడు అతని తేజస్సు, ఆజ్యముచేత హోమము చేసిన అగ్ని తేజస్సు వలె వృద్ధి పొందెను. పిమ్మట కుంభుడు సుగ్రీవుణ్ణి బాహువులతో అదిమిపట్టెను. అప్పుడు ఆ ఇద్దరూ వృద్ధిపొందిన మదముగల ఏనుగులు వలె మాటిమాటికి నిట్టూర్చుచు, ఒకరి దేహమునకు ఒకరు మెలివేయుచు, పరస్పరము ఒరయుచు, అలసటవలన ముఖములనుండి ధూమముతో కూడిన జ్వాలలను విడచుచు యుద్ధము చేసిరి. వాళ్ళ పాదాల రాపిడికి నేల అరిగిపోయెను. తరంగములు తిరిగిపోగా సముద్రము క్షోభచెందెను. పిమ్మట సుగ్రీవుడు కుంభుణ్ణి పైకి ఎత్తి సముద్రము అడుగువరకు వెళ్ళిపోవునట్లు వేగముగా లవణసముద్రములో పడవేసెను. అప్పుడు కుంభుడు పడుటచేత సముద్రము వింధ్యమందరపర్వతము లంత ఎత్తు లేచి అన్నివైపులా వ్యాపించెను. పిమ్మట కుంభుడు పైకి లేచి, సుగ్రీవుణ్ణి సమీపించి, కోపముతో వజ్రమువంటి పిడికిలితో అతని వక్షఃస్థలముమీద కొట్టెను. సుగ్రీవుని కవచము బ్రద్దలైపోయెను. రక్తము స్రవించెను. మహావేగము గల ఆ పిడికిలి సుగ్రీవుని అస్థిపంజరమునందు ఎదురుదెబ్బ తగిలి వ్యర్థమయ్యెను. అప్పుడు ఆ దెబ్బకొట్టిన వేగముచేత, మేరుపర్వతము వజ్రాయుధముతో కొట్టగా బయలుదేరిన అగ్నిజ్వాలవలె, గొప్ప తేజస్సు ప్రజ్వలించెను.(81-89)

అక్కడ కుంభుడు ఆ విధముగా కొట్టగా, మహాబలవంతుడు, వానరశ్రేష్ఠుడూ అయిన సుగ్రీవుడు వజ్రాయుధమువంటి పిడికిలి బిగించెను.(90)

పరాక్రమవంతుడైన అతడు వేయి కిరణములతో వికసించిన సూర్యమండలమువంటి కాంతిగల పిడికిలిని కుంభుని వక్షఃస్థలముమీద పడవేసెను. ఆ కుంభుడు ఆ దెబ్బకు చాలా వ్యాకులత చెంది, మిక్కిలి పీడింపబడినవాడై, జ్వాల శాంతించిన అగ్నివలె నేలమీద పడిపోయెను. సుగ్రీవుడు అట్లు పిడికిలితో కొట్టగా ఆ రాక్షసుడు, ప్రకాశించుచున్న కిరణములు గల కుజుడు, దైవవశముచేత ఆకాశమునుండి పడిపోయినట్లు నేలపై పడెను. పిడికిలి దెబ్బకు వక్షఃస్థలము బ్రద్దలై క్రింద పడిపోవుచున్న కుంభుని రూపము రుద్రునిచేత కొట్టబడిన సూర్యుని రూపము వలె ప్రకాశించెను.

భయంకరమైన పరాక్రమము గల, వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు యుద్ధమునందు ఆ కుంభుణ్ణి చంపగానే పర్వతములతోను, వనములతోను కూడిన భూమి అదిరిపోయెను. రాక్షసులను చాల భయము ఆవహించెను.(91-95)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది ఆరవ సర్గము సమాప్తము.

డెబ్బది ఏడవ సర్గము

హనుమంతుడు నికుంభుణ్ణి చంపుట.

నికుంభుడు తన సోదరుణ్ణి సుగ్రీవుడు చంపుట చూచి, కోపముతో కాల్చివేయుచున్నాడా అన్నట్లు సుగ్రీవుణ్ణి చూచెను. పిమ్మట ధీరుడైన ఆ నికుంభుడు మహేంద్రపర్వతశిఖరమువంటి పరిఘను గ్రహించెను. మంగళప్రదమైన ఆ పరిఘకు పుష్పమాలలు కట్టబడియుండెను. చందనకుంకుమాదులతో ఐదువ్రేళ్ళ ముద్ర లుంచబడెను. యమదండమువలె భయంకరమైన ఆ పరిఘ చుట్టూ బంగారు పట్టాలు బిగింపబడెను. అది వజ్రములతోను, పగడములతోను అలంకరింపబడెను. అది రాక్షసుల భయమును తొలగించునదిగా ఉండెను. గొప్పతేజస్సు, భయంకరమైన పరాక్రమము గల ఆ నికుంభుడు ఇంద్రధ్వజమువలె ఉన్న పరిఘను గట్టిగా పట్టి, నోరు తెరచి బిగ్గరగా గర్జించెను. వక్షఃస్థలమునందు పతకము, భుజములయందు బాహుపురులు, చిత్రములైన కుండలములు, వివిధవర్ణములు గల పుష్పమాలలు, ఇతరాలంకారములు ధరించిన ఆ నికుంభుడు ఇంద్రధనుస్సుతోను, మెరపులతోను, ఉరుములతోను కూడిన మేఘమువలె ఉండెను.(1-6)

అతని పరిఘాగ్రముచేత ఏడు వాయువుల గ్రంథులు బ్రద్దలైపోయెను. ఘోషముతో కూడిన అతడు(లేదా ఆ పరిఘ) ధూమములేని అగ్నివలె ప్రజ్వలించెను. నికుంభుని పరిఘ గాలికి అలకాపట్టణముతోను, ఉత్తమములైన గంధర్వనగరములతోను, తారాగ్రహ నక్షత్రములతోను, చంద్రునితోను, మహాగ్రహములతోను సహా ఆకాశమంతా తిరిగి పోవుచున్నట్లు ఉండెను. పరిఘ కాంతితోను, ఆభరణముల కాంతితోను, క్రోధమనే కట్టెలు గల నికుంభు డనే అగ్ని విజృంభించిన ప్రళయకాలాగ్నివలె ఎదిరింప శక్యము కానిది అయ్యెను. రాక్షసులూ, వానరులూ కూడ భయపడి కదలుటకు కూడా సమర్థులు కాలేదు. బలశాలియైన

హనుమంతుడైతే, వక్షఃస్థలమును తెరచి వాని ఎదుట నిలబడెను.(7-10)

పరిఘులవంటి బాహువులు గల బలశాలియైన ఆ నింకుభుడు సూర్యునివంటి కాంతి గల ఆ పరిఘను బలశాలియైన హనుమంతుని వక్షఃస్థలముమీద పడవేసెను. స్థిరము, విశాలము అయిన అతని వక్షఃస్థలము మీద పడిన ఆ పరిఘ ముక్కచెక్కలై, ఆకాశమునందు అనేక ఉల్కల వలె చిమ్మబడిపోయెను. ఆ పరిఘచేత కొట్టబడిన హనుమంతుడు ఆ దెబ్బకు, భూమి కంపించినప్పుడు పర్వతము చలించినట్లు చలించెను. వానిచేత ఆ విధముగా కొట్టబడిన వానరశ్రేష్ఠుడు, మహాబలశాలీ అయిన హనుమంతుడు పిడికిలిని బిగించెను. గొప్పతేజస్సు, బలము, వేగము, వాయువుతో సమానమైన పరాక్రమము గల హనుమంతుడు ఆ పిడికిలి ఎత్తి వేగముగా నికుంభుణ్ణి వక్షఃస్థలముమీద కొట్టెను. ఆ పిడికిలి దెబ్బచేత అక్కడ ఆ నింకుభుని కవచము బ్రద్దలైపోయెను. రక్తము స్రవించెను. ఆ రక్తస్రావము మేఘమునందు మెరుపు పుట్టినట్లుండెను.(11-16)

ఆ దెబ్బకు నికుంభుడు చలించిపోయెను. కొంత సేపటికి స్వస్థుడై మహాబలశాలియైన హనుమంతుణ్ణి పట్టుకొనెను. మహాబలశాలియైన హనుమంతుణ్ణి నికుంభుడు పట్టి ఎత్తుటను చూచి రాక్షసులు ఆనందముతో భయంకరముగా అరచిరి. ఆ రాక్షసుడు ఆ విధముగా తనను పైకెత్తి తీసికొనిపోవుచున్నను హనుమంతుడు అతనిని వజ్రమువంటి పిడికిలితో కొట్టి వాని పట్టునుండి విడిపించుకొని, నేలమీద దిగి, వానిని పీడించెను. ప్రయత్నపూర్వకముగా ఆ నికుంభుణ్ణి క్రిందికి పడద్రోసి వానిని నలిపివేసెను. పిదప వేగవంతుడైన ఆ హనుమంతుడు పైకి ఎగిరి వేగముగా అతని వక్షఃస్థలముమీద పడెను. వాని కంఠమును రెండు చేతులతో పట్టి మెలిత్రిప్పి, అతడు భయంకరముగా అరచుచుండగా వాని పెద్ద శిరస్సును ఊడలాగెను.(17-22)

బిగ్గరగా అరచుచున్న ఆ నికుంభుణ్ణి హనుమంతుడు చంపివేసిన పిమ్మట మిక్కిలి కోపావిష్టులైన రామ-మకరాక్షుల మధ్య చాల భయంకరమైన యుద్ధము జరిగెను. నికుంభుని ప్రాణాలు పోయిన వెంటనే వానరులు సంతోషించుచు దిక్కులు మారుమ్రోగునట్లు గర్జించిరి. భూమి చలించినట్లయ్యెను. ఆకాశము క్రింద పడిపోయినట్లయ్యెను. రాక్షససైన్యమును భయము ఆవహించెను.(23,24)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది ఏడవ సర్గము సమాప్తము.

డెబ్బది ఎనిమిదవ సర్గము

రావణుని ఆజ్ఞచేత మకరాక్షుడు యుద్ధానికై బయల్వెడలుట.

నికుంభుడు, కుంభుడు చంపబడినారని విని రావణుడు చాలా కోపముతో అగ్నివలె మండిపడెను. రావణుడు క్రోధశోకములు రెండింటితో నిండినవాడై ఖరపుత్రుడైన మకరాక్షుణ్ణి– "పుత్రా! నేను ఆజ్ఞాపించుచున్నాను. నీవు సైన్యమును తీసికొని వెళ్ళుము. ఆ రామలక్ష్మణులను, వానరులను చంపుము" అని ప్రేరేపించెను. గొప్ప శూరుడను అహంకారము గల, ఖరుని పుత్రుడైన ఆ మకరాక్షుడు రావణుని మాటలు విని, సంతోషించుచు, 'తప్పక అట్లు చేసెదను' అని పలికి రావణునికి ప్రదక్షిణపూర్వకముగా అభివాదము చేసి, రావణాజ్ఞచేత ఇంటినుండి బయలుదేరి దగ్గరనున్న సేనానాయకుని– "నా రథమును, సైన్యమును తొందరగా రప్పించుము." అని ఆదేశించగా అతని మాట విని సేనానాయకుడైన రాక్షసుడు రథమును, సైన్యమును అతని సమీపమునకు తీసికొనివచ్చెను. (1–7)

మకరాక్షుడు రథమునకు ప్రదక్షిణము చేసి ఎక్కి సారథిని సంబోధించి "రథమును శీఘ్రముగా నడుపుము." అని ఆజ్ఞాపించెను. పిమ్మట ఆ రాక్షసులందరితో – "రాక్షసులారా! మీరందరు నా సమక్షమున యుద్ధము చేయుడు. యుద్ధమునందు ఆ రామలక్ష్మణులను ఇద్దరినీ చంపవలెనని రాక్షసరాజు, మహాత్ముడు అయిన రావణుడు నాకు ఆజ్ఞ ఇచ్చినాడు. రాక్షసులారా! నేడు రామలక్ష్మణులను, సుగ్రీవుణ్ణి, ఇతర వానరులను శ్రేష్ఠములైన బాణాలచేత చంపివేయగలను. ఇప్పుడు ఇక్కడికి వచ్చిన వానరసైన్యమును, అగ్ని ఎండిన కట్టెలను దహించినట్లు శూలపాతములచేత కాల్చివేయగలను." అని పలికెను. మకరాక్షుని మాటలు విని ఆ బలశాలులైన రాక్షసులందరూ అనేకవిధములైన ఆయుధములు ధరించి సావధానచిత్తులై ఉండిరి. (8–13)

క్రూరులైన ఆ రాక్షసులు కోరలతోను, పచ్చని కళ్లతోను, ఊడిపోయిన జుట్టు ముడులతోను భయంకరులుగా ఉండిరి. స్వేచ్ఛానుసారము రూపము ధరించగలిగిన పెద్ద శరీరములు గల ఆ రాక్షసులు, పెద్ద శరీరము గల ఆ మకరాక్షుని చుట్టూ చేరి సంతోషముతో ఆకాశము చలించిపోవునట్లు వాద్యములు మ్రోగించిరి. అక్కడ మ్రోగించిన వేలకొలది శంఖముల, భేరుల ధ్వని, సింహనాదముల ధ్వని, జబ్బలు చరిచిన ధ్వని అంతటా చాల అధికముగా వ్యాపించెను. అప్పుడు ఆ సారథి చేతినుండి కొరడా జారిపోయెను. దైవవశముచేత ఆ రాక్షసుని ధ్వజము హటాత్తుగా

క్రింద పడిపోయెను. అతని రథానికి కట్టిన గుఱ్ఱములు నడిచే శక్తిలేక తొట్రుపడుచున్న పాదాలతో నడచుచు, కన్నీళ్ళు కార్చుచు దీనములై వెళ్ళినవి. భయంకరుడూ దుర్బుద్ధీ అయిన ఆ మకరాక్షుడు బయలుదేరు సమయమునందు పరాగము తీవ్రముగాను భయంకరముగాను ఉన్న గాలి వీచెను. గొప్ప పరాక్రమము గల ఆ రాక్షసు లందరూ ఆ శకునములను చూచి కూడ లెక్కచేయక ఆ రామలక్ష్మణులున్న ప్రదేశమునకు వెళ్ళిరి. ఆ రాక్షసుల శరీరవర్ణము మేఘవర్ణము వలె, గజమహిషముల శరీరవర్ణమువలె ఉండెను. వాళ్ళ శరీరములు అనేక పర్యాయములు యుద్ధములలో గదలచేతను, ఖడ్గములచేతను భేదించబడెను. అట్టి రాక్షసులు నేను ముందు, నేను ముందు అనుచు యుద్ధభూమిలో తిరిగిరి. (14-21)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది ఎనిమిదవ సర్గము సమాప్తము.

డెబ్బది తొమ్మిదవ సర్గము

రాముడు మకరాక్షుణ్ణి చంపుట.

వానరశ్రేష్ఠు లందరూ బయలుదేరి వచ్చిన మకరాక్షుణ్ణి చూచి, యుద్ధముచేయవలె నను కోరికతో ఎగిరివచ్చి నిలిచి ఉండిరి. పిమ్మట వానరులకు రాక్షసులతో దేవతలకు, దానవులతో జరిగినట్లు, రోమాంచమును కలిగించు చాల గొప్ప యుద్ధము జరిగెను. వానరులు, రాక్షసులూ కూడ వృక్షములను శూలములను విసరుచు, గదలను పరిఘలను ప్రయోగించుచు ఒకరి నొకరు మర్దించిరి. ఆ రాక్షసులు శక్తి-ఖడ్గ-గదా-కుంతములను, తోమరములను, పట్టిశములను, భిందిపాలములను, బాణములను, పాశ-ముద్గర- దండములను, ప్రేలెడు ధ్వనులను పుట్టించు యంత్రములను, ఇతర ఆయుధములను ప్రయోగించి వానరశ్రేష్ఠులను అంతటా హింసించిరి. మకరాక్షుడు బాణసముదాయములను ప్రయోగించి పీడింపగా ఆ వానరులందరూ భ్రాంతి చెందిన మనస్సులతో, భయపీడితులై పారిపోయిరి. పారిపోవుచున్న ఆ వానరులను చూచి సింహములవలె గర్వించిన ఆ రాక్షసులు జయముతో ప్రకాశించుచు ధ్వనులు చేసిరి. వానరులు నలమూలలకు పారిపోవుచుండగా రాముడు బాణవర్షము కురిపించి రాక్షసులను ముందుకు రాకుండా అడ్డగించెను. (1-8)

రాము డా విధముగ రాక్షసులను అడ్డుకొనుట చూచి మకరాక్షుడు కోపముతో

మండిపడుచు- "రామా! నిలబడుము. మన కిద్దరికీ మధ్య ద్వంద్వయుద్ధము జరుగగలదు. ధనుస్సునుండి విడువబడిన బాణములచేత నీ ప్రాణాలను తొలగింపజేయగలను. నీవు ఆనాడు దండకారణ్యములో నా తండ్రిని చంపినావు. అందుచే అట్టి రాక్షససంహారకర్మ చేయుటకై నిలిచియున్న నిన్ను ఎదుట చూడగానే నా కోపము ఎక్కువగుచున్నది. దురాత్ముడవైన రామా! ఆ కాలమునందు నీవు ఆ మహావనమునందు నా కంటబడలేదే అని నా అవయవములు మండిపోవుచున్నవి. దైవవశముచేత నీవు ఇక్కడ నా కంట బడినావు. ఆకలిగొన్న సింహము మృగమును వెదకుచున్నట్లు నేను వెదకుచుంటిని. ఇపుడు నా బాణవేగముచేత యమలోకమునకు వెళ్ళి పూర్వము నీవు చంపిన శూరులతో కూడా అక్కడ నివసించగలవు. రామా! ఈ విషయమునందు చాలా చెప్పి ఏమి ప్రయోజనము? నా మాట వినుము. సమస్తలోకములూ కూడ యుద్ధభూమియందు నిన్ను, నన్నూ చూచెదరు గాక. మనమిద్దరమూ యుద్ధరంగములో అస్త్రములచేతగాని, బాహువులచేత గాని, లేదా నీవు దేనితో అభ్యసించినావో దానిచేత గాని యుద్ధము చేయుదము." అని పలికెను. (9-16)

దశరథనందనుడైన రాముడు మకరాక్షుని మాటలు విని, ఇంకా ఏమేమో మాటలాడుచున్న వానితో, నవ్వుచూ- "రాక్షసుడా! శూరులకు తగని మాటలు పలుకుచు ఎందుకు వ్యర్థముగా బడాయి చెప్పుకొనెదవు? యుద్ధరంగమునందు యుద్ధము చేయకుండగా నీవు మాటల బలముచేత జయించజాలవు. నేను దండకారణ్యములో పదునాలుగువేల మంది రాక్షసులను, నీ తండ్రిని, త్రిశిరస్సును, దూషణుణ్ణి చంపి ఉన్నాను. పాపాత్ముడా! ఇప్పుడు వాడియైన ముక్కులు, గోళ్ళు గల గ్రద్దలు, నక్కలు, కాకులు బాగా మాంసమును తినగలవు." అనెను. (17-20)

మకరాక్షుడు రాముని మాటలు విని, ఆతనిపై బాణసముదాయమును విడచెను. రాముడు ఆ బాణములను బాణవర్షముచేత అనేకవిధములుగా ఛేదించెను. బంగారు పొన్నులు గల ఆ బాణములు ఛేదించబడినవై వేల కొలది ముక్కలుగా అయి నేలమీద పడినవి. అక్కడ ఒండొరులను ఎదిరించిన రామమకరాక్షుల మధ్య గొప్ప బలప్రయోగముతో యుద్ధము జరిగెను. అప్పుడు ఆ యుద్ధభూమియందు ధనుస్సునుండి బయలుదేరిన, అరచేతితో నారిని ఒరయుటచే కలిగిన అత్యధికమైన శబ్దము ఆకాశమునందు రెండు మేఘముల శబ్దము వలె వినబడెను. ఆశ్చర్యకరమైన ఆ యుద్ధమును చూడవలెనను కోరికతో దేవతలు, దానవులు , గంధర్వులు, కింనరులు, మహోరగులు అందరూ ఆకాశమును చేరిరి. ఒకరి అవయవములమీద

ఒకరు కొట్టుట, బలమూ కూడా రెట్టింపు పెరిగెను. వారిద్దరూ యుద్ధభూమియందు ఒకరు చేసిన దానికి మరొకరు ప్రతిక్రియ చేయుచు యుద్ధము చేసిరి. రాముడు ప్రయోగించిన బాణములను రాక్షసుడు ఛేదించెను. రాక్షసుడు ప్రయోగించిన బాణములను రాముడు బాణాలతో ముక్కలుముక్కలుగా ఛేదించెను.(21-27)

సమస్తమైన దిక్కులు, విదిక్కులు కూడా బాణసముదాయములచేత వ్యాప్తములైనవి. భూమి కూడా అంతటా కప్పబడినదై ప్రకాశించలేదు. మహాబాహువైన రాముడు యుద్ధమునందు కోపించి ఆ రాక్షసుని ధనుస్సు ఛేదించి పిమ్మట ఎనిమిది నారాచబాణాలచేత సారథిని కొట్టెను. బాణాలచేత రథమును బ్రద్దలుకొట్టి, గుఱ్ఱములను చంపి నేలమీద పడవేసెను. ఆ మకరాక్షుడు రథము లేనివాడై నేలమీద నిలచి, సకలప్రాణులకు భయము కలిగించు ప్రళయకాలాగ్నితో సమానమైన కాంతి గల శూలమును చేతిలో గ్రహించెను. పొంద శక్యము కాని ఆ గొప్ప శూలమును రుద్రుడు అతని కిచ్చి ఉండెను. ఆకాశమునందు మిక్కిలి ప్రకాశించుచున్న భయంకరమైన ఆ శూలము జగత్తును సంహరించే మరొక క్రొత్త అస్త్రమువలె ఉండెను. పూర్వము దానిని చూచి దేవతలందరూ భయపీడితులై, దిక్కులు పట్టి పారిపోయిరి. ఆ రాక్షసుడు మండుచున్న ఆ గొప్ప శూలమును త్రిప్పి కోపముతో, మహాత్ముడైన ఆ రాముని మీదకు ప్రయోగించెను. మీదకు వచ్చుచున్న ఆ మండుచున్న శూలమును రాముడు నాలుగు బాణాలచేత ఆకాశమునందే ఛేదించెను. రాముని బాణములచేత కొట్టబడిన, ముక్కముక్కలైపోయిన దివ్యమైన, బంగారముచేత అలంకరింపబడిన ఆ శూలము పెద్ద ఉల్కవలె(ఆకాశమునుంచి పడు అగ్నిపిండమువలె) నేలమీద విడివిడిగా పడిపోయెను. రాముడు ఆ శూలమును ఛేదించుట చూచి సకలప్రాణులు, దేవతలు "బాగు బాగు" అని పలికిరి.(28-36)

శూలము ఛేదించబడినట్లు చూచి మకరాక్షుడు పిడికిలి ఎత్తి "నిలువుము, నిలువుము" అని అనుచు రామునిమీదకు వచ్చెను. రాముడు మీదికి వచ్చుచున్న వానిని చూచి నవ్వుచు ధనుస్సుమీద ఆగ్నేయాస్త్రమును సంధించెను. ఆ అస్త్రమును ప్రయోగించగా ఆ రాక్షసుడు, హృదయము తెగిపోయి, మరణించి పడిపోయెను. మకరాక్షుడు పడగొట్టబడుట చూచి రాక్షసులందరూ రాముని బాణములకు భయపడి లంకలోనికి పారిపోయిరి. అప్పుడు రామబాణవేగము చేత చంపబడిన ఆ మకరాక్షుడు వజ్రముచేత కొట్టబడిన పర్వతము పడియున్నట్లు పడిఉండుట చూచి దేవతలు సంతోషించిరి.(37-41)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని డెబ్బది తొమ్మిదవ సర్గము సమాప్తము.

ఎనుబదవ సర్గము

ఇంద్రజిత్తు ఘోరయుద్ధము చేయుట. వానిని చంపే విషయమున రామలక్ష్మణులు మాటలాడుకొనుట.

మకరాక్షుడు చంపబడినట్లు విని రావణుడు కోపావేశముతో దంతములను కటకటలాడించుచు అప్పుడు అక్కడ ఏమి చేయవలెను అని ఆలోచించుచు చాలా కోపించినవాడై కుమారుడైన ఇంద్రజిత్తును యుద్ధమునకు వెళ్ళుమని ఆజ్ఞాపించుచు, "ఓ! వీరుడా! నీవు కనబడుచూ గాని, కనబడకుండా గాని మహాపరాక్రమవంతులైన సోదరులైన రామలక్ష్మణులను చంపుము. నీవు అన్ని విధముల బలముచే గొప్పవాడవు. నీవు యుద్ధములో సాటి లేని పనులు చేయు ఇంద్రుణ్ణి జయించియున్నావు. అట్టి నీవు యుద్ధములో ఆ మానవు లిద్దరినీ చూచి వధింపజాలవా?" అనెను. (1-4)

ఆ ఇంద్రజిత్తు రావణుని మాటలు విని తండ్రియైన అతని వచనమును స్వీకరించి, యజ్ఞభూమియందు యథాశాస్త్రముగా అగ్నిలో హోమము చేసెను. ఇంద్రజిత్తు హోమము చేయసంకల్పించగానే రాక్షసస్త్రీలు తొందరపడుచూ (ఋత్విక్కులకొరకై) ఎర్రని తలపాగలను తీసికొని అతడున్న చోటికి వచ్చిరి. ఆ హోమమునందు రెల్లుగడ్డి పరకలు వేదికచుట్టూ పరిచే తృణములుగాను, విభీతకదారుఖండములు సమిధలుగానూ ఉపయోగింపబడెను. (ఋత్విక్కులకు) ఎర్రని వస్త్రములూ, ఇనుపస్రువమూ ఉపయోగింపబడెను. అగ్నిచుట్టూ రెల్లుగడ్డీ, తోమరములూ పరచి ప్రాణాలతో ఉన్న, పూర్తిగా నల్లనైన మేక కంఠము పట్టి దానిని బలి ఇచ్చెను. ఒక్కమారు హోమము చేయుటచే వృద్ధిపొందిన అగ్ని ధూమము లేక గొప్ప జ్వాలతో ప్రజ్వలించుచుండగా, విజయసూచకములైన కొన్ని చిహ్నములు కనబడినవి. ప్రదక్షిణముగా సుడులు తిరుగుచున్న జ్వాలలతో, కరిగించిన బంగారమువంటి రంగుగల అగ్ని స్వయముగా పైకి లేచి ఆ హవిస్సును స్వీకరించెను. (5-10)

అగ్నిలో హోమము చేసి, (అభిచారక్రియకు సంబంధించిన) దేవదానవరాక్షసులకు తృప్తి కలిగించి, ఇంద్రజిత్తు, ఇతరులకు కనబడని, అందమైన, శ్రేష్ఠమైన రథమును ఎక్కెను. ప్రకాశించుచున్న ఉత్తమమైన ఆ రథమును నాలుగు గుఱ్ఱములు లాగుచుండెను. వాడియైన బాణములు, గొప్ప ధనుస్సులూ దానిపై ఎక్కించబడెను. బంగారపు ఆచ్ఛాదన కలిగి, మిక్కిలి ప్రకాశించుచున్న ఆ రథము మృగములచేతనూ, చంద్రాకార-అర్ధచంద్రాకార రచనలచేతనూ అలంకరింపబడెను.

మండుచున్న అగ్నితో సమానమైన ఇంద్రజిత్తు రథముపై నున్న ధ్వజము పెద్ద బంగారము వలయముచేత, వైదూర్యమణులచేత అలంకరింపబడి ఉండెను. సూర్యునివంటి ఆ బ్రహ్మాస్త్రముచే రక్షింపబడుచున్న మహాబలశాలియైన ఇంద్రజిత్తు ఎదిరింప శక్యముకానివాడు అయ్యెను.(11-15)

అతడు రాక్షసదేవతాకములైన(లేదా రాక్షసులకు మాత్రమే తెలిసిన) మంత్రములచేత అగ్నిలో హోమము చేసి అంతర్ధానము చెంది నగరమునుండి బయలుదేరి ఇట్లు పలికెను- "అసత్యముగా వనవాసము చేయుచున్న ఆ రామలక్ష్మణులను నేడు యుద్ధమునందు చంపి నా తండ్రియైన రావణునకు యుద్ధమునందు సంపాదించిన జయమును ఇచ్చెదను. నేడు భూమిమీద వానరులు లేకుండగా చేసి, రామలక్ష్మణులను చంపి గొప్ప సంతోషమును కలిగించెదను." ఇట్లు పలికి అతడు అంతర్ధానము చెందెను. వాడియైన ధనుస్సులచేత, నారాచబాణములచేత యుద్ధములో భయంకరుడైన ఇంద్రజిత్తు రావణుడు ప్రేరేపించగా కోపముతో శీఘ్రముగా వచ్చెను. ఇంద్రజిత్తు బాణములను వర్షించుచున్న ఇద్దరు వీరులను చూచెను. గొప్ప పరాక్రమము గల ఆ ఇద్దరూ వానరుల మధ్య మూడు తలల సర్పముల వలె ఉండిరి. వీళ్ళే ఆ రామలక్ష్మణులు అని గుర్తించి ధనుస్సునకు నారి బిగించి వర్షించుచున్న మేఘమువలె వారిని బాణధారలతో కప్పివేసెను. రథమునెక్కిన ఆ ఇంద్రజిత్తు ఆకాశములో ఉండి ఎవ్వరికిని కనబడనివాడై వాడియైన బాణములతో రామలక్ష్మణులను కొట్టెను.(16-22)

ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణముల వేగముచేత పీడించబడిన రామలక్ష్మణులు ధనుస్సులపై బాణములు సంధించి దివ్యాస్త్రములను ప్రయోగించిరి. రామలక్ష్మణులు బాణసముదాయముచేత ఆకాశమును కప్పివేయుచున్ననూ, సూర్యునితో సమానమైన అస్త్రముచేతగానీ, బాణముల చేతగానీ అతనిని స్పృశింపజాలకపోయిరి. ఆ ఇంద్రజిత్తు పొగచీకటి కల్పించి, ఆకాశమును కప్పివేసెను. దిక్కులను కూడా పొగమంచువంటి చీకటితో కనబడకుండా చేసెను. అతడు సంచరించుచుండగా ధనుష్టంకారధ్వని గాని, చక్రాంతముల ధ్వని గాని, డెక్కల చప్పుడు గాని వినబడలేదు. అతని రూపము కనబడలేదు. అతడు కండ్లు కనిపించని దట్టమైన చీకటిలో నారాచబాణముల వర్షమును ఆశ్చర్యకరమైన శిలావర్షమును వలె వర్షించెను. కోపించిన ఆ ఇంద్రజిత్తు యుద్ధములో వరము పొంది సూర్యునివలె ప్రకాశించుచున్న బాణములతో రాముణ్ణి అన్ని అవయవములయందు అధికముగా కొట్టెను. జలధారలచేత పర్వతములవలె నారాచబాణములచేత కొట్టబడుచున్న నరశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులు బంగారు పొన్నులు గల వాడియైన బాణములను

ప్రయోగించిరి. గ్రద్దరెక్కలు కట్టిన ఆ బాణములు ఆకాశమునందు ఇంద్రజిత్తును చేరి, వాని శరీరమును ఛేదించి, రక్తముతో తడిసి, నేలమీద పడినవి.(23-30)

ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణముల సముదాయముచేత మిక్కిలి ప్రకాశించుచున్న ఆ రామలక్ష్మణులు తమపై పడుచున్న ఆ బాణములను అనేక భల్లబాణములచేత ఛేదించిరి. వాడియైన బాణములు ఎటువైపునుండి వచ్చుచున్నట్లు కనబడెనో అటు ఉత్తమాస్త్రములను ప్రయోగించుచుండిరి. అతిరథుడైన ఇంద్రజిత్తు రథముచేత అన్ని దిక్కులలోనూ శీఘ్రముగా సంచరించుచు, అస్త్రలాఘవమును చూపుచూ, వాడియైన బాణములతో ఆ రామలక్ష్మణులను కొట్టెను. వీరులైన ఆ రామలక్ష్మణులు బంగారు పొన్నులు గల బాణములతో ఇంద్రజిత్తు ఎడతెరిపి లేకుండా కొట్టుటచే పుష్పించిన కింశుకవృక్షముల వలె అయిరి. మేఘములు దట్టముగా కప్పినపుడు సూర్యుని గమనాదులను వలె అతని వేగగమనమును గాని, రూపమును గాని, ధనుస్సును గాని, బాణములను గాని, ఇతరమైన దేనినీ ఎవ్వరునూ తెలిసికొనజాలకపోయిరి. వానిచే కొట్టబడిన వానరులు చంపబడిరి. ప్రాణములు కోల్పోయి ఆ వానరులు వందలకొలదీ నేలమీద పడిపోయిరి.(31-36)

అప్పుడు లక్ష్మణుడు కోపించి, "సర్వరాక్షసులనూ సంహరించుటకై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెదను." అని సోదరునితో పలికెను. అప్పుడు రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను- "ఒక్క రాక్షసుని మూలాన లోకములో నున్న రాక్షసుల నందరినీ నీవు చంపకూడదు. నీవు యుద్ధముచేయనివానినిగాని, దాగి ఉన్నవానిని గాని, నమస్కరించుచున్నవానిని గాని, శరణుజొచ్చినవానిని గాని, పారిపోవుచున్న వానిని గాని, మదముతో ఉన్నవానినిగాని చంపకూడదు. లక్ష్మణా! మనము ఈ ఇంద్రజిత్తునే చంపుటకు ప్రయత్నించెదము. సర్పమువంటి మహావేగము గల అస్త్రములను ప్రయోగించెదము. మాయావీ, నీచుడూ, కనబడని రథము కలవాడూ ఐన ఈ రాక్షసుడు కనబడినట్లైతే వానరనాయకులే బలముచేత వానిని చంపివేయగలరు. ఇతడు భూమిలో ప్రవేశించినా, స్వర్గలోకమునకు వెళ్ళినా, పాతాళములో ప్రవేశించినా, ఆకాశములోనికి ఎగిరిపోయినా, ఏ విధముగా దాగి ఉన్నా కూడా నా అస్త్రముచేత కాల్చబడినవాడై ప్రాణములు విడచి నేలమీద పడగలడు." మహాత్ముడైన ఆ రాముడు ఈ విధముగా గొప్ప అర్థము గల వాక్యము పలికి, భయంకరుడూ, క్రూరకర్మలు చేయువాడూ అయిన ఈ ఇంద్రజిత్తును శీఘ్రముగా చంపుటకై వానరనాయకులతో కలసి ఉపాయమును ఆలోచించుచుండెను.(37-43)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబదవ సర్గము సమాప్తము.

ఎనుబది ఒకటవ సర్గము

ఇంద్రజిత్తు మాయాసీతను వధించుట.

ఇంద్రజిత్తు మహాత్ముడైన రాముని అభిప్రాయమును గ్రహించి యుద్ధభూమినుండి మరలి పట్టణములో ప్రవేశించెను. అతడు మహాబలవంతులైన కుంభకర్ణాదుల వధను స్మరించుచు క్రోధముతో ఎఱ్ఱనైన నేత్రములతో, రాక్షసులతో కూడి పశ్చిమద్వారమునుండి బయల్వెడలెను. వీరులైన ఆ రామలక్ష్మణు లిద్దరూ యుద్ధముచేయుటకు సంనద్ధులై ఉన్నారని తెలిసికొని అప్పుడు మాయను ప్రయోగించెను. అప్పుడు ఇంద్రజిత్తు మాయాసీతను రథముమీద ఉంచుకొని గొప్ప సైన్యమును చుట్టూ నిలిపి ఆమెను చంపవలె నని నిశ్చయించుకొనెను. దుర్బుద్ధి గల ఆ ఇంద్రజిత్తు అందరినీ మోసము చేయవలెనను కోరికతో (మాయా) సీతను చంపుటకు నిశ్చయించుకొని వానరు లున్న వైపు వెళ్ళెను.(1-6)

బయలుదేరి వచ్చుచున్న అతనిని చూచి వానరులందరూ యుద్ధము చేయుటకు శిలలను హస్తములందు ధరించి కోపముతో పైకి ఎగిరిరి. వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ఎదిరింప శక్యముకాని, చాల పెద్దదైన పర్వతశిఖరమును గ్రహించి ఆ వానరుల ముందు వెళ్ళెను. అతడు ఇంద్రజిత్తు రథమునందు రాముని భార్య, స్త్రీలలో ఉత్తమురాలు అయిన సీతను చూచెను. ఆనందము నశించిన ఆమె ఒకే జడను ధరించెను. ఉపవాసములచేత ఎండిపోయిన ముఖముతో దీనురాలైన ఆమె నలిగిపోయిన ఒక వస్త్రము ధరించెను. ఆమె అవయవము లన్నీ స్నానాదిసంస్కారములు లేక పరాగముచేతను, మురికిచేతను కప్పబడి ఉండెను. ఆమెను ముహూర్తకాలము చూడగానే హనుమంతుడు ఆమె సీత అని గుర్తుపట్టి విషాదము చెందెను. అతడు ఆమెను కొంచెము కాలముక్రితమే చూచి ఉండెను కదా? ఆ సీత ఆనందములేనిదై రథము మీద ఇంద్రజిత్తు పార్శ్వమునందు చాల దయనీయమైన స్థితిలో ఉండెను. దీనురాలైన ఆమెను చూచి, హనుమంతుడు "ఇత డిప్పుడు ఏమి చేయదలచినాడో!" అని ఆలోచించుచు, ఆ వానరశ్రేష్ఠులకు కూడా తెలిపి వారితో కలసి శీఘ్రముగా ఆ ఇంద్రజిత్తు ఉన్న వైపు వెళ్ళెను.(7-13)

ఇంద్రజిత్తు ఆ వానరసైన్యమును చూచి క్రోధావేశముతో కత్తిని ఒరనుండి తీసి సీతను తలపట్టి లాగెను. ఆ రాక్షసుడు వానరులందరూ చూచుచుండగా, మాయచేత రథమునందు సృష్టించబడిన, "రామా! రామా!" అని ఏడ్చుచున్న ఆ స్త్రీని కొట్టెను. సీత జుట్టు ఇంద్రజిత్తు పట్టుకొనుట చూచి, హనుమంతుడు దీనుడై

దుఃఖముతో కన్నీళ్ళు కార్చెను.(14-16)

రాముని ప్రియభార్యయైన, అందమైన సకలావయవములు గల ఆ సీతను చూచి హనుమంతుడు కోపము చెంది ఇంద్రజిత్తుతో పరుషముగా ఇట్లు పలికెను - "ఓ! దుర్మార్గుడా! బ్రహ్మర్షుల కులమందు పుట్టి రాక్షసజన్మ పొందిన నీవు నీ వినాశముకొరకే ఈమె కేశపాశమును స్పృశించితివి. క్రూరుడా! అనార్యుడా! చెడ్డ నడవడిక గలవాడా! నీచుడా! పాపమైన పరాక్రమము గలవాడా! జాలిలేనివాడా! పాపప్రవృత్తి గల నీవు, ఛీ! ఎంత చెడ్డపడి చేసితివి! అనార్యుడవైన నీవు ఇట్టి పనిచేసితివి కదా! నీకు జాలిలేదా! ఓ! దయావిహీనుడా! ఈ సీత గృహమునుండి, రాజ్యమునుండి, రామునినుండి దూరమైపోయినది. ఈమెను కొట్టుచున్నావే; ఈమె నీకు ఏమి అపరాధము చేసినది? సీతను చంపిన పిమ్మట నీవింక చాలకాలము జీవించవు. వధకు తగినవాడా! అట్టిపని చేయుటచేతనే నీవు నాచేత చిక్కినావు. లోకులచేత చంపదగినవాడా! నీ విపుడు ప్రాణాలు విడిచి, పరలోకమునకు వెళ్ళి, పద్నాలుగు లోకములలో ఏవి నింద్యములో, స్త్రీని చంపినవారికి ఏ లోకములు లభించునో వాటికి వెళ్ళగలవు."(17-22)

హనుమంతుడు ఇట్లు పలుకుచు, ఆయుధములు ధరించిన వానరులతో కూడినవాడై చాల కోపముతో ఇంద్రజిత్తు మీదకి శీఘ్రముగా వెళ్ళెను. వానరుల గొప్ప పరాక్రమము గల ఆ సైన్యమును భయంకరమైన కోపము గల రాక్షసుల సైన్యము నివారించెను. ఇంద్రజిత్తు ఆ వానరసైన్యమును అనేకబాణములచేత క్షోభింపచేసి వానరశ్రేష్ఠుడైన హనుమంతునకు ఇట్లు బదులు చెప్పెను. "ఏ సీతకోసమై నీవు, సుగ్రీవుడు, రాముడు ఇక్కడికి వచ్చినారో ఆ సీతను ఇపుడు నీవు చూచుచుండగానే చంపెదను. ఓ! వానరుడా! ఈమెను చంపిన పిమ్మట రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, నిన్ను, సుగ్రీవుణ్ణి, చెడ్డవాడైన ఆ విభీషణుణ్ణి చంపగలను. వానరుడా! "స్త్రీలను చంపకూడదు" అని నీవన్నదానికి సమాధానము వినుము. శత్రువులకు పీడ కలిగించే పని తప్పక చేయవలసినదే."(23-28)

ఇంద్రజిత్తు ఇట్లు పలికి మాయానిర్మితయై ఏడ్చుచున్న ఆ సీతను, వాడియైన అంచుగల ఖడ్గముచేత స్వయముగా కొట్టెను(ఛేదించెను). దీనురాలైన ఆ సీత ఆత డా విధముగా జందెముపెట్టున చీల్చివేయగా నేలమీద పడిపోయినది. ఆమెను చంపిన పిమ్మట ఇంద్రజిత్తు హనుమంతునితో - "రాముని భార్యను నేను శస్త్రముతో చంపివేసినాను; చూడుము. ఈ సీత మరణించినది; మీ శ్రమ అంతా వ్యర్థమైనది!"

అనెను. ఇంద్రజిత్తు ఖడ్గముచేత స్వయముగా ఆమెను చంపిన పిమ్మట సంతోషించుచు, రథముపై కూర్చుండి బిగ్గరగా అరచెను. రాక్షససైన్యమధ్యమునందు ఉండి బాగా నోరుతెరచి అరుచుచున్న ఆ ఇంద్రజిత్తు చేయు శబ్దమును చుట్టు ప్రక్కల ఉన్న వానరులు వినిరి. దుర్బుద్ధియైన ఆ ఇంద్రజిత్తు సీతను ఆ విధముగా చంపి సంతోషించెను. చాలా సంతోషించుచున్న అతనిని చూచి వానరులు మిక్కిలి విషాదము చెంది వెంటనే పారిపోయిరి. (29-35)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది ఒకటవ సర్గము సమాప్తము.

ఎనుబది రెండవ సర్గము

సీత వధను హనుమంతుడు రామునకు తెలుపుట. ఇంద్రజిత్తు యజ్ఞమునకై నికుంభిలకు వెళ్ళుట.

దేవేంద్రుని వజ్రాయుధము ధ్వనివంటి ధ్వని గల భయంకరమైన ఆ అరుపు విని వానరులు ఇటు అటు చూచుచు అన్ని దిక్కులకు పారిపోయిరి. ఆ వానరులందరూ భయపడి, దీనులై, వాడిపోయిన ముఖాలతో వేరువేరుగా పారిపోవుచుండగా వాయుపుత్రుడైన హనుమంతుడు- "ఓ! వానరులారా! యుద్ధోత్సాహము విడచి దిగులు చెందిన ముఖాలతో ఎందుకు పారిపోవుచున్నారు? మీ శూరత్వము ఎక్కడికి పోయినది? యుద్ధములో ముందు ఉన్న నా వెనుకనే మీరు రండు. ఉత్తమ వంశసంజాతులైన శూరులు వెనుకకు మరలిపోగూడదు కదా?" అని పలికెను. ఆ వానరులు హనుమంతుని మాటలు విని మనస్సులలో ఉత్సాహము చెంది కోపముతో పర్వతశిఖరములను, వృక్షములను గ్రహించిరి. వానరశ్రేష్ఠులు గర్జించుచు రాక్షసులమీదికి శీఘ్రముగా వెళ్ళిరి. ఆ మహాయుద్ధమునందు హనుమంతుని చుట్టూ చేరి అతని వెనుకనే వెళ్ళిరి. (1-6)

వానరనాయకులందరు అన్ని వైపులా తనను అనుసరించి రాగా, హనుమంతుడు జ్వాలలతో గూడిన అగ్నివలె శత్రుసైన్యమును దహించివేసెను. వానరసైన్యముతో కూడిన ఆ హనుమంతుడు ప్రళయకాలమునందు సంహారము చేయు యముడు వలె రాక్షససంహారము చేసెను. గొప్ప శోకముతోను, రోషావేశముతోను ఉన్న వానరనాయకుడైన ఆ హనుమంతుడు ఇంద్రజిత్తు

రథముమీద పెద్ద శిలను పడవేసెను. మీద పడుచున్న ఆ శిలను చూడగానే సారథి, చెప్పినట్లు చేయు గుఱ్ఱములు కట్టిన రథమును దూరముగా తప్పించి వేసెను. వ్యర్థముగా ప్రయోగించబడిన ఆ శిల సారథితో రథమునందున్న ఇంద్రజిత్తును చేరకుండగానే నేలను బ్రద్దలుకొట్టుకొని క్రిందికి దిగిపోయెను. శిల క్రింద పడి రాక్షసులు నలిగిపోయిరి. ఈ విధముగా శిల పడుటచే రాక్షససేన వ్యథ చెందెను. పెద్ద దేహములు గల వందలకొలది ఆ వానరులు వృక్షములను , పర్వతశిఖరములను గ్రహించి, గర్జించుచు ఆ ఇంద్రజిత్తు మీదికి వెళ్ళిరి.(7-13)

భయంకరమైన పరాక్రమము గల వానరులు యుద్ధమునందు వృక్షములను, శిఖరములను ఇంద్రజిత్తుపై విసరిరి. గొప్ప వృక్షవర్షమును, శిలావర్షమును కురిపించుచు శత్రువులను చంపిరి. అనేకవిధములయిన స్వరములతో గర్జించిరి. భయంకరములైన రూపములు గల రాక్షసులు చాల భయంకరులైన వానరులచేత బలపూర్వకముగా వృక్షముల చేత కొట్టబడినవారై, యుద్ధభూమి మీద పడి కొట్టుకొనిరి. ఇంద్రజిత్తు తన సైన్యమును వానరులు పీడించుట చూచి, కోపించినవాడై ఆయుధములు ధరించి శత్రువులకు అభిముఖుడై వెళ్ళెను. దృఢమైన పరాక్రమము గల ఆ ఇంద్రజిత్తు తన సైన్యముతో కలసి బాణములను విడచుచు చాలమంది వానరశ్రేష్ఠులను చంపివేసెను. ఇంద్రజిత్తు సైనికులు కూడ, యుద్ధమునందు, వానరులను శూల-వజ్ర-ఖడ్గ-పట్టిశ-కూట-ముద్గరములచేత చంపిరి. మహాబలశాలియైన హనుమంతుడు మంచి మ్రానులు కొమ్మలూ ఉన్న చెట్లచేతనూ, శిలల చేతను భయంకరమైన కర్మగల రాక్షసులను చంపెను.(14-19)

శత్రుసైన్యమును వెనుకకు పోవునట్లు చేసి హనుమంతుడు వానరులతో - "వెనుకకు మరలుడు; మనము ఈ రాక్షససైన్యమును ఓడించి ప్రయోజన మేమీ లేదు. రామునకు ప్రియము చేయవలె నను కోరికతో ప్రాణాలకు తెగించి పనిచేయుచు ఏ సీతకోసమై యుద్ధము చేయుచున్నామో ఆ సీత చంపబడినది. ఈ విషయము రామునకు, సుగ్రీవునకు తెలిపి వారు ఏ ప్రతిక్రియ చేయుదురో దానిని మనము చేసెదము." అనెను. వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ఆ వానరులందరితో ఇట్లు పలికి, యుద్ధమునుండి వారించి, సైన్యసమేతుడై, భయము చెందక, మెల్లమెల్లగా వెనుకకు మరలెను.(20-23)

హనుమంతుడు రాముడున్న వైపు వెళ్ళుచున్నట్లు చూచి దుర్బుద్ధియైన ఇంద్రజిత్తు హోమము చేయుటకు నికుంభిల అను దేవాలయమునకు వెళ్లెను. ఇంద్రజిత్తు

నికుంభిలలో కూర్చొని అగ్నిలో హోమము చేసెను. యజ్ఞభూమికి వెళ్ళిన ఆ రాక్షసుడు హోమము చేయుచుండగా, అగ్ని మాంసమును, రక్తమును కబళించుచు ప్రజ్వలించెను. రక్తహోమముచేత తృప్తి పొందింపబడి పైకిలేచిన, జ్వాలలు ముడిపడి ఉన్న చాల తీవ్రమైన అగ్ని సంధ్యాసమయమునందలి సూర్యుడు వలె కనబడెను. (24-27)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది రెండవ సర్గము సమాప్తము.

ఎనుబది మూడవ సర్గము

సీతావృత్తాంతము విని రాముడు మూర్ఛపోవుట. లక్ష్మణుడు రాముణ్ణి ఓదార్చుట.

రాముడు రాక్షసవానరుల ఆ అధికమైన యుద్ధధ్వనిని విని జాంబవంతునితో- "సౌమ్యుడా! భయంకరమైన గొప్ప ఆయుధధ్వని వినబడుచున్నది; దీనిని బట్టి హనుమంతుడు చేయశక్యముకాని పని ఏదో చేసియుండును. సందేహము లేదు. భల్లూకరాజా! అందువలన నీవు నీ సైన్యముతో కలసివెళ్ళి యుద్ధము చేయుచున్న హనుమంతునకు శీఘ్రముగా సాహాయ్యము చేయుము." అని చెప్పెను. జాంబవంతుడు "అట్లే చేసెదను" అని పలికి తన సైన్యముతో కూడి, హనుమంతుడున్న పశ్చిమద్వారము వైపు వెళ్ళెను. అతడు యుద్ధము చేసి నిట్టూర్చుచున్న వానరులతో కలసి వచ్చుచున్న హనుమంతుణ్ణి చూచెను. యుద్ధానికై బయలుదేరి వచ్చుచున్న భయంకరమైన నీలమేఘముల వంటి ఆ భల్లూకసైన్యమును హనుమంతుడు మార్గమధ్యమునందు చూచి, దానిని వెనుకకు మరల్చి తాను మరలి వచ్చెను. (1-6)

గొప్పకీర్తి గల ఆ హనుమంతుడు సైన్యముతో కూడ శీఘ్రముగా రాముని దగ్గరకు చేరి దుఃఖించుచు అతనితో- "యుద్ధరంగములో యుద్ధముచేయుచున్న మేమందరము చూచుచుండగానే మా ఎదుట, రావణుని కుమారుడైన ఇంద్రజిత్తు, ఏడ్చుచున్న సీతను చంపినాడు. ఓ! శత్రుసంహారకుడా! ఆ సీతను చూడగానే నా మనస్సు చెదరిపోయి, నేను దిగులు చెందితిని. నీ కీ విషయమును తెలుపుటకు వచ్చినాను." అని చెప్పెను. (7-9)

అప్పుడు రాముడు హనుమంతుని మాటలు విని శోకాక్రాంతుడై మొదలు

నరికిన చెట్టువలె నేలమీద పడపోయెను. దేవపురుషునితో సమానుడైన రాముడు నేలమీద పడిపోవుట చూచి వానరశ్రేష్ఠు లందరూ అన్ని వైపులనుండి ఎగిరివచ్చి ఆ రాముణ్ణి సమీపించిరి. హఠాత్తుగా పైకి లేచిన దహించివేయుచున్న అగ్నివలె సమీపించ శక్యము కాని ఆ రామునిపై పద్మముల, కలువల సువాసనలతో నిండిన ఉదకము చల్లిరి. పిమ్మట దుఃఖించుచున్న లక్ష్మణుడు అస్వస్థుడుగా ఉన్న రాముణ్ణి బాహువులతో కౌగిలించుకొని మంచి హేతువులతోను, అర్థములతోను కూడిన వాక్యము పలికెను-(10-13)

"ఆర్యా! ఉత్తమమార్గమునందున్న జితేంద్రియుడవైన నిన్ను ధర్మము ఆపదనుండి రక్షింపజాలకున్నది. అందుచే ఈ ధర్మము నిష్ప్రయోజనము. స్థావరములు జంగమములు అయిన ప్రాణులు కనబడినట్లు ధర్మాధర్మము లనేవి కనబడుటలేదు. అందుచేత ధర్మ మనేది లేదని నా అభిప్రాయము. స్థావరములైన వృక్షశిలాదులు ఏవిధముగా ప్రత్యక్షముగా కనబడుచున్నవో, జంగమములైన నరమృగాదులు ఏవిధముగా ప్రత్యక్షముగా కనబడుచున్నవో, ధర్మాధర్మము లను పదార్థములు ఆ విధముగా ప్రత్యక్షముగా కనబడుటలేదు. అట్లు కనబడినచో నీవంటివానికి ఆపదలు వచ్చిఉండెడివి కావు. అధర్మ మనేది ఉన్నట్లయితే రావణుడు నరకమును పొంది ఉండేవాడు. ధర్మమును అనుసరించి నీవు ఈ విధముగా కష్టములు పొందెడివాడవు కావు. ఆ రావణునికి ఆపదలు రాకపోవుటచేతను, నీకు ఆపదలు వచ్చుచుండుటచేతను అధర్మము ధర్మఫలమును(మంచిఫలమును), ధర్మము అధర్మఫలమును(చెడ్డఫలమును) ఇచ్చుచున్నట్లు నాకు తోచుచున్నది. ధర్మముచేత ధర్మఫలమును పొందు నని, అధర్మముచేత అధర్మఫలమును పొందు నని నియమ మేది? అధర్మము చేయువారు అధర్మఫలమునే పొందే పక్షమున జనులు అధర్మమునందు ఆసక్తి చూపుచు ధర్మమును విడచి ఉండేవారు కారు. ధర్మమును ఆచరించువారికి ధర్మముచేత ధర్మఫలమే లభించి ఉండెడిది. అధర్మమునే చేయువారి సంపదలు అభివృద్ధి చెందుచుండుటచేతను, ధర్మప్రవృత్తి గలవారు ఆపదలలో చిక్కుకొనుచుండుటచేతను ఈ ధర్మాధర్మాలు నిష్ఫలములు.(14-21)

అధర్మము పాపాత్ములను చంపివేయును అని చెప్పుచుందురు. అది కుదరదు. చేసిన నాల్గవ క్షణమున నశించిపోవు అధర్మమే నశించిపోయినప్పుడు ఇంక అది ఎవరిని చంపగలదు? ధర్మము విషయముకూడా ఇంతే. క్రియ అగుటచేత జరిగిన నాల్గవ క్షణమునందే ధర్మము నశించిపోవును. అట్లు నశించిన ధర్మము మంచి ఫలితమును ఏమి ఇవ్వగలదు? అందుచేత ధర్మాధర్మములు అనునవియే లేవు.(22)

లేదా విధియే, అనగా ధర్మాధర్మఫలముల నిచ్చు పరమేశ్వరుడే అధర్మకర్తను చంపినను లేదా ఇతడు ఇతరుని చంపినను ఆ పాపకర్మవలన కలుగు దుష్ఫలము ఆ పరమేశ్వరునకే చెందును కాని కర్తకు కాదు. (అనగా ధర్మ మనగా సత్కర్మచేత సంతోషించు ఈశ్వరుడు. అధర్మమనగా అసత్కర్మచేత ప్రీతి లేని ఈశ్వరుడు అని అన్నను ఆ ఈశ్వరుడే చేయించినవాడగుటచే కూడ వాటిఫలము ప్రేరకుడైన ఈశ్వరునకు చెందవలెను కాని ప్రేరేపింపబడిన కర్తకు చెందకూడదు. స్వర్గాదిఫలములను ఉద్దేశించి కొన్ని కర్మలను విధించినట్లే శత్రువినాశాదులను ఉద్దేశించి వేదములో కొన్ని శ్యేనయాగాదులు విధింపబడినవి. ఇంద్రజిత్తు చేసిన నికుంభిలాహోమము కూడ శాస్త్రవిహితమే. అయినను పరపీడాకరమగుటచేత ఇవి పాపకృత్యములుగా(అధర్మముగా) పరిగణింపబడుచున్నవి. ఈ అధర్మకార్యములు ధర్మాత్ములకు బాధకలిగించుట ద్వారా ధర్మమును పీడించుచున్నవి. అట్లే ధర్మము ప్రబలమైనపుడు ఈ అధర్మమును అణగద్రొక్కవచ్చును. కాని ఈ అణగద్రొక్కబడే అధర్మము కూడా వేదవిహితమే. అందుచేత వేదవిహితమైన ధర్మమును పీడించు అధర్మమువలన ఎట్లు పాపము వచ్చునో, అట్లే వేదవిహితమైన(శ్యేనయాగాది) అధర్మమును పీడించు ధర్మమువలన కూడ పాపము రావలెను కదా? ఈ దృష్టితో లక్ష్మణుడు అనుచున్న మాటలివి.) (23)

శత్రుసంహారకుడవైన ఓ రామా! ధర్మమునకు ప్రతిఘాతము ఎట్లు జరుగునో తెలియదు. ఇది కనబడనిది. అందుచేత లేనిదానివంటిదే. అట్టి ధర్మముచేత శ్రేయస్సును పొందుట ఎట్లు? అట్టి ధర్మము శత్రువును ఎట్లు తెలిసికొనగలదు? వానిని ఎట్లు పీడింపగలదు? ఓ శత్రుసంహారకుడా! పాపకర్మను ఎదుర్కొనే ఉపాయము కనబడనిచో ధర్మము అధర్మమును ఎట్లు ఎదిరించి నశింపచేయగల్గును? సత్పురుషులలో శ్రేష్ఠుడవైన రామా! ధర్మమనేది నిజముగా ఉన్నచో నీకు ఏమీ చెడుగు జరిగి యుండకూడదు. కాని నీకు ఇట్టి కష్టము సంప్రాప్తించినది. అందుచేత ధర్మమనేది ఉన్నదని చెప్పుట కుదరదు. లేదా ధర్మము దుర్బలమై, పిరికిదై, బలానికి లొంగిపోయినట్లయితే, అలాంటి దుర్బలమైన, మర్యాదను పాటించని, ధర్మమును పరిత్యజించుటయే మంచి దని నా అభిప్రాయము. కార్యసాధనము విషయమునందు ధర్మము అప్రధానమై బలానికి లొంగిపోయే పక్షమున నువ్వు ధర్మమును విడచి, ఇంతవరకు ధర్మమును ఆశ్రయించి నట్లు బలమును ఆశ్రయించుము. (24-27)

ఓ! శత్రుసంహారకుడా! సత్యము పలుకుట ధర్మమైన పక్షమున, మొదట నీకు రాజ్య మిచ్చెదనని పలికి ఇవ్వక అసత్యమాడిన, నీమీద కరుణ లేని మన తండ్రిని

నీవు ఎందుచేత బంధింపలేదు?(28)

వజ్రధారియైన ఇంద్రుడు విశ్వరూపుడనే మునిని చంపి యజ్ఞము చేసినాడు కదా! ధర్మమే కర్తవ్యమైనచో అతడు యజ్ఞము మాత్రమే చేసి ఉండేవాడు గాని మునిని చంపుట అను అధర్మమును చేసి ఉండెడివాడు కాదు. అధర్మమే కర్తవ్యమైనచో మునిసంహారమే చేసి ఉండునే గాని యజ్ఞమును చేసి ఉండేవాడు కాదు. కాని రెండూ చేసినాడు. దీనిని పట్టి క్షత్రియులు కాలానుసారము రెండూ చేయుచుండవలెనని తెలినది. రామా! ధర్మమును ఆచరించినా, అధర్మమును ఆచరించినా వినాశము కలుగుచునే ఉన్నది. అందుచేతనే మానవుడు తన ఇచ్ఛను అనుసరించి ఈ రెండింటినీ ఆచరించుచుండును. దయనీయస్థితిలో ఉన్న రామా! ఇష్టము ప్రకారము కాలమును పట్టి ధర్మాధర్మాలను అనుసరించుట యుక్త మనియే నా అభిప్రాయము కూడ. ఆనాడు రాజ్యమును విడనాడి నీవు ధర్మమునకు మూలమైన అర్థమును ఛేదించినావు.(29-31)

ఆ యా ఉపాయములవలన లభించి క్రమముగా వృద్ధిపొందిన ధనమువలననే, పర్వతములనుండి నదులు ప్రవహించినట్లు అన్ని పనులూ సిద్ధించును కదా? ధనవిహీనుడైన అల్పబుద్ధి గల పురుషుని పను లన్నీ, గ్రీష్మర్తువులో చిన్న నదులు ఎండిపోయినట్లు భగ్నములై పోవును. సుఖములలో పెరిగిన అట్టి పురుషుడు ధనమును పరిత్యజించి, మరల సుఖములు పొందవలెనను కోరికతో చౌర్యాదిపాపకృత్యములు చేయును. అది అనేకదోషములకు దారి తీయును. ఎవనివద్ద ధనముండునో వానికే మిత్రు లుందురు. ఎవనివద్ద ధన ముండునో వానిదగ్గరకే బంధువులు చేరుదురు. ఈ లోకములో ధనమున్నవాడే పురుషుడు; ధనమున్నవాడే పండితుడుగా పరిగణింపబడును. ధనమున్నవాడే పరాక్రమవంతుడు. ధనమున్నవాడే బుద్ధిమంతుడు. ధనమున్నవాడే మహాభాగ్యశాలి. ధనమున్నవాడే గొప్ప గుణములు గలవాడు.(32-36)

ఓ! ధీరుడా! నీవు రాజ్యమును విడువవలె నను నిర్ణయము తీసికొని అట్లు చేసితివి. అందుచేతనే నేనిప్పుడు ధనమును విడచుటవలన కలుగు దోషములను చెప్పవలసి వచ్చినది. ధనమున్నవానికే ధర్మము, కామము, అర్థము కూడ సిద్ధించును. వానికి అంతా అనుకూలముగా జరిగిపోవును. ధనము లేనివాడు ధనముకోసమై ఎంత ప్రయత్నించినా అది లభించదు. అసలు కొంత ధనమున్నవాడే దానిని ఇంకా సంపాదించుకొనగలుగును. రాజా! ధనమున్నవానికి, హర్షము, కామము, దర్పము,

ధర్మము, క్రోధము, శమము, ఇంద్రియనిగ్రహము మొదలైన గుణములలో ఏవి ఉన్నా కూడా శోభించును. ఏ ధనము లభించుచున్నను దానిని గ్రహించక ధర్మమే ఆచరించువారికి ఈ లోకముతో ఎట్టి ప్రయోజనమూ ఉండదో, అట్టి ధనము, పూర్తిగా మేఘావృతమైన దివసమునందు గ్రహములు కనబడనట్లు నీయందు కనబడుటలేదు. వీరుడా! నీవు తండ్రి ఆజ్ఞను అనుసరించి వనమునకు వెళ్ళుటచే, ప్రాణములకంటె ఎక్కువ ప్రియురాలైన నీ భార్యను రాక్షసుడు హరించినాడు. (37-41)

ఇంద్రజిత్తు నీకు కలిగించిన ఆ అధికమైన దుఃఖమును ఇప్పుడు నా పరాక్రమముచేత తొలగించెదను. అందువలన, ఓ! రామా! లెమ్ము. నరశ్రేష్ఠుడా! లెమ్ము. మహాత్ముడవు, సుశిక్షితమైన బుద్ధిగలవాడవు అయిన నిన్ను గూర్చి నీవే ఎందుకు తెలుసుకొనకున్నావు? ఎట్టి దోషములూ లేని రామా! సీతామరణమును చూచుటచే కోపించిన నేను నీకు ప్రియము చేయుటకై ఉద్యుక్తుడనై రథములతో, ఏనుగులతో, గుఱ్ఱములతో, రావణునితో సహా లంకాపట్టణమును నా బాణములు ప్రయోగించి కూల్చివేసెదను."(42-44)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది మూడవ సర్గము సమాప్తము.

ఎనుబది నాలుగవ సర్గము

ఇదంతయు ఇంద్రజిత్తు మాయ అని, విభీషణుడు చెప్పి లక్ష్మణుణ్ణి నికుంభిలకు పంపుమనుట.

సోదరునియందు ప్రేమగల లక్ష్మణుడు ఈ విధముగా రాముణ్ణి ఓదార్చుచుండగా విభీషణుడు సేనాసమూహములను ఆ యా స్థానములందు నిలిపి అచటికి వచ్చెను. అనేకవిధములైన ఆయుధములు ధరించిన, నల్లని కాటుక వంటి ఆకారములు గల, గుంపుల నాయకులైన ఏనుగుల వలె ఉన్న, నలుగురు వీరులతో కలిసి వచ్చిన ఆ విభీషణుడు, శోకాక్రాంతుడైన మహాత్ముడైన రాముణ్ణి సమీపించి, కన్నీటితో నిండిన నేత్రములు గల వానరులను కూడ చూచెను. మూర్ఛచెంది లక్ష్మణుని ఒడిలో పండుకొని యున్న, ఇక్ష్వాకువంశానందకరుడైన, మహాత్ముడైన రాముణ్ణి కూడ విభీషణుడు చూచెను. సిగ్గుపడుచు, శోకపీడితుడై ఉన్న రాముణ్ణి

చూచి, విభీషణుడు మనస్సులో దుఃఖముతో దీనుడై 'ఇది ఏమి?' అని ప్రశ్నించెను.(1-5)

విభీషణుని ముఖమును, సుగ్రీవుణ్ణి, ఆ వానరులను చూచి లక్ష్మణుడు కన్నీరు కార్చుచు మందమైన అర్థము గల ఈ వాక్యమును పలికెను- "సౌమ్యుడా! సీతను ఇంద్రజిత్తు చంపివేసినాడని హనుమంతుడు చెప్పగా వినిన వెంటనే రాముడు మూర్ఛచెందినాడు."(6,7)

ఈ విధముగా చెప్పుచున్న లక్ష్మణుణ్ణి మధ్యలోనే ఆపి విభీషణుడు, స్పృహ తప్పి ఉన్న రామునితో మంచి అర్థము గల వాక్యమును ఇట్లు పలికెను- "మహారాజా! మిక్కిలి దుఃఖించుచున్న హనుమంతుడు నీకు చెప్పినది, సముద్రము ఎండిపోయెనని చెప్పుట ఎట్లు అసంభావ్యమో అట్లు అసంభావ్యమని నేను తలచెదను. ఓ! మహాబాహూ! సీత విషయములో దురాత్ముడైన రావణుని అభిప్రాయ మెట్టిదో నాకు తెలియును. అతడు ఆమెను చంపడు. సీతను విడిచిపెట్టుము అని నేను ఎన్నో పర్యాయములు, అతనికి హితము చేయవలె నను బుద్ధితో ప్రార్థించినను ఆ మాట చేయలేదు. సామముచేతగాని, దానముచేతగాని, భేదముచేతగాని ఆమెను చూచుటకు ఎవ్వరికీ శక్యముకాదు. మరి ఇతర ఉపాయముచేత దేని చేతనూ కూడ శక్యముకాదు. యుద్ధముచేత శక్యము కాదని చెప్పవలెనా? ఆ ఇంద్రజిత్తు వానరులను మోహింపజేసి వెళ్ళిపోయినాడు. ఓ! మహాబాహూ! ఆ సీత మాయాసీత అను విషయమును తెలిసికొనుము. ఈ ఇంద్రజిత్తు నికుంభిల యను దేవాలయమునకు వెళ్ళి హోమము చేయును. ఆ హోమము చేసి వచ్చినచో అతనిని దేవేంద్రునితో కూడిన దేవతలు కూడా యుద్ధములో ఓడింపజాలరు. వానరుల పరాక్రమప్రదర్శనమునకు విఘ్నము చేయవలెనను తలంపుతో అతడు మోసము చేయుటకై ఈ మాయను ప్రయోగించినాడు; సత్యము."(8-15)

"ఆ హోమము పూర్తి అయ్యేలోగా సైన్యముతో అక్కడికి వెళ్ళెదము. నరులలో శ్రేష్ఠుడవైన రామా! నీకు కలిగిన అసత్యమైన(కారణము లేని) ఈ దుఃఖమును విడువుము. శోకార్తుడవైన నిన్ను చూచి సైన్యమంతా దిగులుచెందుచున్నది. నీవు అధికమైన ధైర్యముతో స్వస్థచిత్తుడవై ఇక్కడనే ఉండుము. సైన్యమును తీసికొని వెళ్ళుచున్న మా వెంట లక్ష్మణుని పంపుము. నరశ్రేష్ఠుడైన ఈ లక్ష్మణుడు వాడియైన బాణములు ప్రయోగించి, ఆ ఇంద్రజిత్తు హోమముచేయుట మానివేయునట్లు చేయగలడు. అప్పుడు వానిని చంపుటకు శక్యమగును. తీక్ష్ణములు, పక్షుల రెక్కల

వేగము గలవి అయిన పదునైన ఈ లక్ష్మణబాణములు, క్రూరమైన పక్షుల వలె, ఆ ఇంద్రజిత్తు రక్తమును త్రాగగలవు. మహాబాహూ! అందువలన, ఇంద్రజిత్తును చంపుటకై దేవేంద్రుడు వజ్రమును ప్రయోగించినట్లు శుభలక్షణములు గల లక్ష్మణుని పంపుము. నరులలో శ్రేష్ఠుడవైన రామా! ఇప్పుడింక శత్రువును వధించుటయందు ఆలస్యముచేయుట యుక్తము కాదు గాన దేవశత్రువులను చంపుటకు దేవేంద్రుడు ఆజ్ఞ ఇచ్చినట్లు, శత్రువును వధించుటకు ఆజ్ఞ ఇమ్ము. ఇంద్రజిత్తు హోమమును పూర్తిచేసినచో అతడు యుద్ధములో సురాసురులకు కూడ కనబడడు. అతడు ఆ కర్మ పూర్తిచేసి యుద్ధము చేయవలెనను కోరికతో వచ్చినచో దేవతలుకూడ గొప్ప ప్రాణసంశయములో పడుదురు."(16-23)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది నాలుగవ సర్గము సమాప్తము.

ఎనుబది ఐదవ సర్గము

రాముడు ఇంద్రజిత్తును చంపుటకై లక్ష్మణుని నికుంభిల దగ్గరకు పంపుట.

శ్లో కపీడితుడైన రాముడు విభీషణుని మాటలు విన్నను అతడేమి చెప్పుచుండెనో స్పష్టముగా అర్థము చేసికొనజాలకపోయెను. పిమ్మట అతడు ధైర్యము తెచ్చుకుని, తన సమీపమునందు కూర్చుని ఉన్న విభీషణునితో వానరుల సమక్షమునందు- "రాక్షసాధిపతివైన విభీషణా! నీవు చెప్పిన మాటలు మరల వినవలెనని కోరుచున్నాను. నీవు ఏమి చెప్పదలచుచున్నావో మరల చెప్పుము." అనెను. రాముడు దైన్యముతో పలికిన మాటలు విని విభీషణుడు మరల ప్రయత్నపూర్వకముగా ఈ మాటలు పలికెను- "వీరుడా! గుల్మము లను సేనాభాగములను ఆ యా స్థానములందు నిలుపుమని నీవు ఆజ్ఞాపించితివి కదా? నీవు చెప్పిన వెంటనే అది అంతయు అట్లు చేసితిని. సైన్యవిభాగములను అన్నింటిని అంతటా వేరువేరుగా, వాటి నాయకులను కూడా నియమానుసారము వేరువేరుగా నిలిపినాను. మహాప్రభూ! నేను మరొక విషయము విజ్ఞాపన చేయవలసి ఉన్నది. దానిని వినుము. నీవు నిష్కారణముగా దుఃఖించుచున్నావు. నీ దుఃఖమును చూచి మా మనస్సులు బాధపడుచున్నవి. రాజా! ఈ శోకమును, సత్యమైన కారణము లేని ఈ దుఃఖమును విడిచిపెట్టుము. శత్రువుల ఆనందమును వృద్ధి పొందించు ఈ

చింతను విడువుము. ఓ! వీరుడా! నీవు రాక్షసులను సంహరించవలె నన్నచో, సీతను పొందవలె నన్నచో పౌరుషము చూపవలెను. సంతోషముగా ఉండవలెను. (1-9)

రామా! నేను హితమైన వాక్యమును చెప్పెదను, వినుము. నికుంభిల చేరి ఉన్న ఇంద్రజిత్తును యుద్ధమునందు సర్పవిషమువంటి బాణములను మండలాకారమైన ధనుస్సుచేత ప్రయోగించి చంపుటకై ఈ లక్ష్మణుడు పెద్ద సైన్యముతో కలసి వెంటనే వెళ్ళవలెను. వీరుడైన ఆ ఇంద్రజిత్తు తపస్సు చేసి, బ్రహ్మ వరముల నిచ్చుటవలన బ్రహ్మశిరస్సు అను అస్త్రమును, ఇష్టానుసారము నడచు గుఱ్ఱములను సంపాదించినాడు. అట్టి ఇంద్రజిత్తు సైన్యముతో కూడి నికుంభిల చేరినాడట. అక్కడ అతడు హోమకర్మ పూర్తిచేసికొని లేచినచో మన మందరమూ మరణించినట్లే అని తెలిసికొనుము. "ఓ! ఇంద్రజిత్తూ! నీవు నికుంభిల చేరక ముందుగాని, చేరి అగ్నిలో హోమము చేయుటకు ముందుగాని ఏ శత్రువు ఆయుధము ధరించి నిన్ను వధించునో అతడే నీకు మారకుడు." అని బ్రహ్మదేవుడు ఈతనికి వరము నిచ్చినాడు. ఓ! మహాబాహూ! వీని వధోపాయము ఇదే. మహాబలశాలియైన రామా! ఇంద్రజిత్తును చంపుటకు ఆజ్ఞ ఇమ్ము. అతడు చంపబడిన పిమ్మట స్నేహితుల గణములతో కూడిన రావణుడు మరణించినట్లే అని గ్రహించుము."(10-16)

విభీషణుని మాటలు విని రాముడిట్లు పలికెను. "ఓ! విభీషణా! భయంకరుడైన ఆ ఇంద్రజిత్తు మాయలను నేను ఎరుగుదును. ఆ ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రము తెలిసినవాడు. బుద్ధిమంతుడు. చాలా మాయలు గలవాడు. గొప్ప బలము కలవాడు. యుద్ధమునందు వరుణునితో కూడిన దేవతలను కూడ సంజ్ఞ లేనివాళ్ళుగా చేయగలడు. అతడు రథమునెక్కి ఆకాశమునందు సంచరించుచుండగా, మేఘములు కప్పివేసి ఉన్నప్పుడు సూర్యుని గమనము ఎట్లు తెలియదో అట్లే అతని గమనము తెలియదు."(17-19)

రాముడు దురాత్ముడైన శత్రువునకున్న మాయాబలమును తెలిసికొని కీర్తిమంతుడైన లక్ష్మణునితో- లక్ష్మణా! సుగ్రీవుని సకలసైన్యముతోను, హనుమంతుడు మొదలైన సేనానాయకులతోను, సైన్యసమేతుడైన, భల్లూకప్రభువైన జాంబవంతునితోను కలసి వెళ్ళి మాయాబలము గల ఆ ఇంద్రజిత్తును సంహరించుము. ఇంద్రజిత్తు దగ్గర ఉన్న మాయలన్నీ తెలిసిన ఈ విభీషణుడు, అతని అనుచరులూ కూడా నీ వెనుకనే అక్కడికి వచ్చెదరు." అని పలికెను. (20-23)

రాముని మాటలు విని ఆశ్చర్యకరమైన పరాక్రమము గల విభీషణసహితుడైన లక్ష్మణుడు శ్రేష్ఠమైన ధనుస్సును గ్రహించెను. లక్ష్మణుడు సంతోషించుచు, యుద్ధసంనద్ధుడై, కవచము తొడుగుకొని, ఎడమచేతిలో ధనుస్సు ధరించి, ఖడ్గము, బాణములు తీసికొని రామునకు పాదములు స్పృశించి నమస్కరించి– "ఈనాడు నా ధనుస్సునుండి విడువబడిన బాణములు ఇంద్రజిత్తును భేదించి, హంసలు పద్మసరస్సుకు వలె లంకవైపు వెళ్ళగలవు. గొప్ప ధనుస్సు నారినుండి బయలుదేరిన నా బాణములు, ఇప్పుడే, క్రూరుడైన ఆ ఇంద్రజిత్తు శరీరమును బ్రద్దలుకొట్టి వానిని ఎగురకొట్టివేయగలవు." అని పలికెను. (24-27)

తేజఃశాలియైన ఆ లక్ష్మణుడు అన్నగారి సమక్షమున ఇట్లు పలికి ఇంద్రజిత్తును చంపవలెనను నిశ్చయముతో శీఘ్రముగా వెళ్లెను. అన్నగారి పాదములకు నమస్కరించి, ప్రదక్షిణము చేసి, ఇంద్రజిత్తుచేత పాలించబడుచున్న నికుంభిల అను దేవాలయము వైపునకు అన్నగారి ఆశీర్వాదమును పొంది, విభీషణసహితుడై శీఘ్రముగా వెళ్లెను. అప్పుడు ఎన్నో వేలమంది వానరులతో కూడిన హనుమంతుడు, తన అనుచరులతో కూడిన విభీషణుడు లక్ష్మణుని అనుసరించి వెళ్ళిరి. వేగముగా వచ్చి చుట్టూ చేరిన గొప్ప వానరసైన్యముతో కూడిన ఆ లక్ష్మణుడు జాంబవంతుని సైన్యము కూడ మార్గములో నిలచియుండుట చూచెను. అతడు చాల దూరము వెళ్ళి, వ్యూహముగా ఏర్పడియున్న రావణుని సైన్యమును దూరమునుండి చూచెను. శత్రుసంహారకుడైన ఆ లక్ష్మణుడు ధనుర్ధరుడై ఆ ప్రదేశమును చేరి, మాయాసంబంధము గల ఆ ఇంద్రజిత్తును బ్రహ్మదేవుడు చెప్పిన విధానము ప్రకారము హోమము జరుగుటకు పూర్వము చంపుటకై నిలచెను. ప్రతాపవంతుడైన అతడు విభీషణునితోను, వీరుడైన అంగదునితోను, హనుమంతునితోను కూడి నిలచెను. అక్కడనున్న శత్రుసైన్యము అనేకవిధములుగా ఉండెను. నిర్మలమైన ఆయుధములతో మెరయుచుండెను. అనేక ధ్వజములతోను, రథములతోను నిండి ఉండుటచేత ప్రవేశించుటకు శక్యము కాకుండా ఉన్న ఆ సైన్యము సాటిలేని వేగముతో చాల భయంకరముగా ఉండెను. అట్టి, చీకటి వలె ఉన్న శత్రుసైన్యములోనికి లక్ష్మణుడు ప్రవేశించెను. (28-36)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది ఐదవ సర్గము సమాప్తము.

ఎనుబది ఆరవ సర్గము

హనుమంతుడు రాక్షససైన్యమును సంహరించుట. లక్ష్మణుడు ఇంద్రజిత్తును చూచుట.

పిమ్మట, విభీషణుడు అట్టి పరిస్థితియందు శత్రువులకు హితము కానిది, తమ కార్యమును సాధించునది అయిన వాక్యమును పలికెను– "మేఘముల వలె నల్లనైన ఆ కనబడుచున్న రాక్షససైన్యమును, శిలలు ఆయుధములుగా ధరించిన వానరులు, తమతో యుద్ధముచేయునట్లు చేయవలెను. లక్ష్మణా! ఈ సైన్యమును భేదించుటకు ప్రయత్నించవలెను. సైన్యము చీల్చివేయబడినచో ఇంద్రజిత్తు కూడా కనబడును. హోమము పూర్తి అవకుండగానే నీవు ఇంద్రుని వజ్రాయుధముతో సమానములైన బాణాలు శత్రువులపై చిమ్ముచు శీఘ్రముగా ముందుకు నడువుము. ఓ! వీరుడా! ఈ ఇంద్రజిత్తు దురాత్ముడు; మాయలు ప్రయోగించువాడు; అధర్మమును ఆచరించువాడు; క్రూరములైన పనులు చేయువాడు; అన్ని లోకములకు భయము కలిగించువాడు. అట్టి వీనిని చంపుము."(1-5)

లక్ష్మణుడు విభీషణుని మాటలు విని ఇంద్రజిత్తును ఉద్దేశించి బాణవర్షములు వర్షించెను. మహావృక్షములతో యుద్ధము చేయు భల్లూకములు, వానరులు, ఒక్కుమ్మడిగా, అక్కడ నిలిచి ఉన్న ఆ రాక్షససైన్యముమీదికి పరుగెత్తిరి. రాక్షసులు కూడా వాడియైన బాణములు, ఖడ్గములు, శక్తులు, తోమరములు ధరించి, యుద్ధమునందు వానరులను చంపుటకై ఎదురుగా నిలచిరి. అనేకవిధములైన ఆకారములు గల ఆయుధములు, వాడియైన బాణాలు, వృక్షాలు, భయంకరములైన ఎగురవేయబడిన శిఖరములు ఆకాశమును కప్పివేసెను. వానరులకు రాక్షసులకు మధ్య వ్యాకులమైన యుద్ధము జరిగెను. అప్పుడు బయలుదేరిన శబ్దము లంకానగరమంతా వ్యాపించెను. వికృతములైన ముఖములు, బాహువులు గల ఆ రాక్షసులు వానరులపై ఆయుధములు ప్రయోగించి చాల భయము కలిగించిరి. వానరులు కూడ యుద్ధమునందు వృక్షములను పర్వతశిఖరములను ప్రయోగించి ఆ రాక్షసులనందరినీ కొట్టి చంపిరి. పెద్ద దేహములు, గొప్ప బలము గల భల్లూకనాయకులతోను, వానరనాయకులతోను యుద్ధముచేయుచున్న రాక్షసులకు చాలా భయము కలిగెను.(6-13)

శత్రువులచేత పీడింపబడిన తన సైన్యము దిగులుచెంది ఉన్నదని విని,

ఇంద్రజిత్తు హోమము చేయకుండగానే లేచిపోయెను. అతడు కోపించి, వృక్షముల చీకటినుండి బైటకు వచ్చి, ముందుగానే గుఱ్ఱములు కట్టి ఉన్న బాగుగా కూర్చిన, సిద్ధముగా ఉన్న రథము నెక్కెను. నల్లని కాటుకప్రోగువలె ఉన్న ఆ ఇంద్రజిత్తు భయంకరములైన ధనుర్బాణములు ధరించి ఉండెను. ముఖము, కళ్ళు ఎఱ్ఱబారెను. అతడు సంహారము చేయు మృత్యుదేవతవలె భయంకరుడుగా ఉండెను. రథముపై ఉన్న ఆ ఇంద్రజిత్తును చూడగానే భయంకరమైన వేగము గల ఆ రాక్షససైన్యము లక్ష్మణునితో యుద్ధము చేయుటకై వెనుకకు మరలెను. ఆ సమయమునందు పర్వతము వంటి శత్రుసంహారకుడైన హనుమంతుడు ఎదిరింపశక్యము కాని మహావృక్షమును ఎత్తి ప్రళయకాలాగ్ని వలె రాక్షససైన్యమును నశింపచేసెను. అనేకవృక్షములను ప్రయోగించి ఆ హనుమంతుడు సైన్యమును సంజ్ఞ లేనిదానినిగా చేసెను. సైన్యమును నశింపచేయుచున్న హనుమంతుణ్ణి చూడగానే వేలకొలది రాక్షసులు అతనిపై ఆయుధములను ప్రయోగించిరి. (14-20)

వాడియైన శూలములు ధరించినవాళ్ళు శూలములతోను, ఖడ్గములు చేతులలో ఉన్నవాళ్ళు ఖడ్గాలతోను, శక్తులు చేతులలో ఉన్నవాళ్ళు శక్తులతోను, పట్టిశములు ఆయుధముగా గలవాళ్ళు పట్టిశములతోను హనుమంతుణ్ణి కొట్టిరి. ఇతర రాక్షసులు కూడా పర్వతమువలె ఉన్న ఆ హనుమంతుణ్ణి చుట్టూ చేరి పరిఘలతోను, గదలతోను, చూచుటకు అందముగ ఉన్న కుంతములతోను, వందలకొలది శతఘ్నులతోను, ఇనుప ముద్గరములతోను, ఘోరములైన గండ్రగొడ్డళ్ళతోను, భిందిపాలములతోను, వజ్రముల వంటి పిడికిళ్ళతోను, పిడుగులవంటి అరచేతి చరుపులతోను కొట్టిరి. హనుమంతుడు కూడా చాల కోపించి ఎందరో రాక్షసులను చంపివేసెను. పర్వతమువంటి ఆకారము గల వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ఏ మాత్రము భయమనేది లేక శత్రువులను చంపివేయుచుండెను. అట్టి హనుమంతుణ్ణి ఇంద్రజిత్తు చూచెను. (21-25)

"ఆ వానరు దున్నచోటికి రథము తీసికొని వెళ్ళుము. ఇతనిని ఉపేక్షించినచో మన రాక్షసులనందరినీ నశింపచేయును." అని అతడు సారథితో చెప్పగా సారథి అతని మాటలు విని, రథమును హనుమంతుడున్న చోటికి తీసికొని వెళ్ళెను. ఇంద్రజిత్తు హనుమంతునికి దగ్గరగా వెళ్ళి అతని శిరస్సుపై బాణములు, ఖడ్గములు, పట్టిశములు, చిన్న కత్తులు, గండ్రగొడ్డళ్ళు కురిపించెను. హనుమంతుడు భయంకరములైన ఆ ఆయుధములను గ్రహించి గొప్ప కోపావేశముతో - "దుష్టబుద్ధివైన ఓ! ఇంద్రజిత్తూ! శూరుడవైతే యుద్ధము చేయుము. హనుమంతుని దగ్గరకు వచ్చిన



తరువాత ఇంక ప్రాణాలతో వెనుకకు వెళ్ళవు. ఓ! దుర్బుద్ధీ! నీవు నాతో ద్వంద్వయుద్ధము చేయకలిగినచో బాహుయుద్ధము చేసి నా వేగమును తట్టుకొనుము. అప్పుడు నీవు రాక్షసులలో శ్రేష్ఠుడవుగా పరిగణింపబడగలవు." అని పలికెను.(26-31)

అప్పుడు విభీషణుడు - "ధనుస్సు ఎత్తి వచ్చుచున్న ఈ ఇంద్రజిత్తు హనుమంతుణ్ణి చంపుటకు ఉద్యమించుచున్నాడు." అని లక్ష్మణునితో చెప్పెను. "ఇంద్రుణ్ణి జయించిన ఈ ఇంద్రజిత్తు రథము నెక్కి వచ్చి హనుమంతుణ్ణి చంపవలెనని చూచుచున్నాడు. లక్ష్మణా! సాటిలేని ఆకారము గలవి, శత్రువులను నివారించునవి, జీవితమును అంతమొందించునవి, ఘోరములు అయిన శరములచేత ఇంద్రజిత్తును చంపుము." అనెను. అప్పుడు శత్రుభయంకరుడైన విభీషణుని మాటలు విని మహాత్ముడైన లక్ష్మణుడు పర్వతముతో సమానుడైన, ఇంద్రజిత్తును చూచెను.(32-35)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది ఆరవ సర్గము సమాప్తము.

ఎనుబది ఏడవ సర్గము

ఇంద్రజిద్విభీషణులు పరస్పరము కోపముతో మాటలాడుకొనుట.

విభీషణుడు లక్ష్మణునితో ఇట్లు పలికి, ధనుస్సు ధరించి ఉన్న అతనిని తోడ్కొని, సంతోషించుచు తొందరపడుచు వెళ్ళెను. విభీషణుడు అక్కడినుండి కొంచెము దూరము వెళ్ళి పెద్ద వనములో ప్రవేశించి అక్కడ ఆ కర్మను(హోమమును), నల్లని మేఘమువలె ఉన్న, చూచుటకు భయంకరమైన మఱ్ఱిచెట్టును లక్ష్మణునికి చూపెను. "బలవంతుడైన ఇంద్రజిత్తు ఇక్కడనే భూతములకు బలి సమర్పించి పిమ్మట యుద్ధానికి బయలుదేరుచుండును. అటుపిమ్మట ఈ రాక్షసుడు ఏ ప్రాణికీ కనబడడు. శత్రువులను యుద్ధములో సంహరించుచుండును; శ్రేష్ఠములైన బాణములచేత బంధించుచుండును. అతడు మఱ్ఱిచెట్టును ప్రవేశించకుండగానే వానిని రథముతోను, అశ్వములతోను, సారథితోను సహా ప్రజ్వలించుచున్న శరములచేత చంపివేయుము." అని చెప్పెను. లక్ష్మణుడు అట్లే అని పలికి, చిత్రమైన ధనుస్సును చరచుచు అక్కడ నిలచెను. ఇంద్రజిత్తు అగ్నివంటి వర్ణము గల రథముమీద కనబడెను. గొప్ప తేజస్సు గల లక్ష్మణుడు ఎన్నడూ పరాజయ మెరుగని ఇంద్రజిత్తుతో– "నిన్ను యుద్ధానికి పిలచుచున్నాను, నాకు బాగుగా యుద్ధము ఇమ్ము." అని పలికెను. (1-9)

లక్ష్మణు డిట్లు పలుకగా, గొప్ప తేజస్సు, పౌరుషము గల ఇంద్రజిత్తు అక్కడనే ఉన్న విభీషణుని చూచి పరుషమైన వాక్యములతో– "ఓ! రాక్షసుడా! నీవు ఇక్కడ పుట్టి పెరిగినావు. నా తండ్రికి సాక్షాత్తు సోదరుడవు. నాకు పినతండ్రివి. అట్టి నీవు నీ పుత్రునకే ఎట్లు ద్రోహము చేయుచున్నావు? ఓ! దుర్మతీ! ధర్మమును దూషించువాడా! నీవు జ్ఞాతుల మను విషయమును గాని, స్నేహమును గాని, జాతిని గాని, సోదరత్వమును కాని, ధర్మమును కాని లెక్కచేయక ప్రవర్తించుచున్నావు. ఓ! దుర్బుద్ధీ! స్వజనమును విడచి పరులకు భృత్యుడవైన నిన్ను చూచి జాలిపడవలెను! సత్పురుషులు నిన్ను నిందింతురు. నీ బుద్ధి అల్పమైనది. అందుచేతనే ఇంత గొప్ప తారతమ్యమును నీవు తెలుసుకొనుటలేదు. స్వజనులతో కలిసి నివాస మెక్కడ, నీచులైన పరులను ఆశ్రయించుట ఎక్కడ! శత్రువులు గుణవంతులే కావచ్చును, తనవాళ్ళు గుణరహితులే కావచ్చును. గుణములు లేకపోయినను స్వజనమే మేలు. పరుడు ఎప్పటికీ పరుడే కదా? తన పక్షమును విడచి పరుల పక్షములో చేరినవానిని, వాని స్వపక్షమువారు నశించిన పిమ్మట, ఆ పరపక్షమువారు చంపివేయుదురు.

రావణుని తమ్ముడవైన ఓ! రాక్షసుడా! నీవు లక్ష్మణుని ఇక్కడికి తీసికొని వచ్చుట అనే జాలిలేని పని చేసినావు. ఇట్టి పౌరుషము జ్ఞాతివైన నీవే చేయగలవు!" అని నిందించెను. (10-17)

సోదరుని కుమారుడైన ఇంద్రజిత్తు పలికిన పలుకులు విని విభీషణుడు - "ఓ! రాక్షసుడా! నా స్వభావము ఎట్టిదో తెలియనివాడవు వలె గర్వము చూపుచున్నావు? చెడ్డవాడవైన ఓ! ఇంద్రజిత్తూ! పినతండ్రిననే గౌరవముచేతనైనా పరుషత్వమును విడిచిపెట్టుము. నేను క్రూరకర్మలు చేయు రాక్షసుల కులమునందు పుట్టినాను. అయినను మానవులకు ఏది ఉత్తమగుణమో అట్టి రాక్షసప్రకృతివిరుద్ధమైన శీలమే నా శీలము. నాకు దారుణకృత్యములు ఇష్టములు కావు; అధర్మము ఇష్టము కాదు. ఎంత విషమమైన స్వభావ మున్నను సోదరుణ్ణి సోదరుడు పరిత్యజించునా? (నీతండ్రి అట్లు నన్ను విడచినాడు.) ధర్మభ్రష్టమైన శీలముతో పాపనిశ్చయము గల పురుషుణ్ణి, చేతిలో ఉన్న పామును విడిచిపెట్టినట్లు, విడచినవాడు సుఖము పొందును. పరుల ధనమును హరించుటయందు ఆసక్తుడై, పరభార్యలను స్పృశించు దురాత్ముణ్ణి, మండిపోవుచున్న ఇంటిని వలె, విడిచివేయవలెనని పెద్దలు చెప్పుదురు." (18-22)

పరధనమును హరించుట, పరభార్యలను స్పృశించుట, మంచి హృదయముగలవారిని ఎక్కువ శంకించుట ఈ మూడు దోషములు వినాశమును కలిగించును. మహర్షులను క్రూరముగా చంపివేయుట, దేవతలందరితోను విరోధమూ, అహంకారము, రోషము, శత్రుత్వము, ప్రతికూలత్వము అను జీవితమును, ఐశ్వర్యమును నశింపచేయు ఈ దోషములు నా సోదరుని గుణాలను, మేఘములు పర్వతాలను కప్పివేసినట్లు కప్పివేసినవి. ఈ దోషములుండుటచే నీ తండ్రియైన నా సోదరుణ్ణి నేను విడిచిపెట్టితిని. ఇటుపైన ఈ లంకానగరముగాని. నీవు గాని, నీతండ్రిగాని ఉండరు. ఓ! రాక్షసుడా! నీవు ఎక్కువ గర్వము కలవాడవు; మూర్ఖుడవు; వినయము లేనివాడవు. యమపాశముచేత బంధింపబడిన అట్టి నీవు నన్ను గూర్చి నీ ఇష్టము వచ్చినట్లు మాట్లాడవచ్చును. ఓ! రాక్షసాధమా! నీవు నన్ను పరుషము లాడినందుకు ఇప్పుడు ఇక్కడ నీకు ఆపద వచ్చినది. నీవు మర్రిచెట్టులో ప్రవేశించజాలవు. లక్ష్మణుణ్ణి ఎదిరించి నీవు జీవించజాలవు. నరులలో శ్రేష్ఠుడైన లక్ష్మణునితో యుద్ధము చేయుము. నీవు చంపబడి యమలోకములో దేవతలు చెప్పిన పనులు చేయగలవు. అధికమైన నీ బలము చూపి, సమస్త ఆయుధములనూ, బాణములనూ వ్యయము చేయుము. లక్ష్మణుని బాణముల బారినపడి సేనాసహితుడవైన నీవు ప్రాణములతో తిరిగి వెళ్ళవు." అనెను. (23-30)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది ఏడవ సర్గము సమాప్తము.

ఎనుబది ఎనిమిదవ సర్గము

లక్ష్మణేంద్రజిత్తులు ఘోరముగా యుద్ధము చేయుట.

ఇంద్రజిత్తు విభీషణుని మాటలు విని క్రోధావేశముతో అతనిని పరుషవాక్యములతో నిందించెను. వేగముగా ముందుకు వచ్చెను. ప్రళయ కాలమునందలి యమునితో సమానుడైన ఆ ఇంద్రజిత్తు నల్లని గుర్రములు కట్టిన, బాగుగా అలంకరించిన రథము మీద ఉండి, ఆయుధములనూ, ఖడ్గమునూ పైకి ఎత్తెను. పెద్దదీ, విశాలమైనదీ, వేగము కలదీ, దృఢమైనదీ, భయంకరమూ ఐన ధనుస్సును సరిచేసికొనుచు, శత్రువులను పీడించు బాణములను గ్రహించెను. గొప్ప ధనుస్సు ధరించి, రథముపై కూర్చున్న, బాగుగా అలంకరించుకొని ఉన్న శత్రుసంహారకుడూ, బలశాలీ అయిన ఇంద్రజిత్తు, అలంకరించబడిన (స్వాభావిక శోభతో కూడిన) లక్ష్మణుని చూచెను.(1-4)

హనుమంతుని వీపుపై కూర్చున్న లక్ష్మణుడు ఉదయపర్వతముమీద ఉన్న సూర్యుడు వలె ప్రకాశించుచుండెను. అట్టి లక్ష్మణునితోనూ, విభీషణునితోనూ, వానరనాయకులతోనూ ఇంద్రజిత్తు చాల తొందరపడుచు – "ఇప్పుడు నా పరాక్రమము చూడుడు. ఆకాశమునుండి పడుచున్న జలధారావర్షము వలె యుద్ధమునందు నా ధనస్సునుండి వెలువడుచున్న ఎదిరింప శక్యముకాని బాణవర్షమును మీరు ధరించగలరు(ఎదుర్కొనగలరు). నా గొప్ప ధనుస్సునుండి బయలుదేరిన నా బాణములు మీ శరీరములను దూదికుప్పను అగ్ని కాల్చివేయునట్లు కాల్చివేయును. మిమ్ములనందరినీ వాడియైన బాణములచేతా, శూలములచేతా, శక్తులచేతా, ఋష్టులచేతా, తోమరములచేతా చీల్చివేసి యమలోకమునకు పంపెదను. నేను మేఘము వలె గర్జించుచూ, రణరంగమునందు హస్తలాఘవముతో బాణవర్షములు వర్షించుచుండగా నా ఎదుట ఎవడు నిలబడగలడు? పూర్వము ఆనాడు రాత్రియుద్ధమునందు సుగ్రీవాదులతో కూడిన మీ ఇద్దరినీ వజ్రమువంటి, పిడుగులవంటి బాణములచేత సంజ్ఞలేనివారినిగా చేసి నేలపై పడగొట్టితిని. నీకు ఆ విషయము జ్ఞాపకము లేదా? కోపించి, సర్పమువలె ఉన్న నాతో యుద్ధముచేయుటకు వచ్చిన నీవు తప్పక యమలోకమునకు వెళ్లినట్లే అని తలచుచున్నాను." అని పలికెను.(5-11)

లక్ష్మణుడు ఇంద్రజిత్తు చేసిన గర్జనలు విని భయపడక, కోపించి అతనితో– "ఓ! రాక్షసుడా! నీవు పొందజాలని కార్యముల అంతమును గూర్చి మాటలు

మాత్రము చెప్పుచున్నావు. చేయవలసిన పనుల అంతమును పొందగలిగినవాడే బుద్ధిమంతుడు. ఓ! దుర్మతీ! చెడు కార్యములు చేయు(కార్యాసమర్థుడవైన) నీవు ఎవ్వరూ చేయజాలని విషయమును గూర్చి మాటలలో చెప్పి కృతార్థుడనైతిని అని అనుకొనుచున్నావు. ఆనాడు యుద్ధమునందు నీవు అంతర్ధానము చెంది అనుసరించిన మార్గము దొంగలు అనుసరించే మార్గము . అది వీరులు అనుసరించే మార్గము కాదు. ఓ! రాక్షసుడా! నేను నీ బాణమార్గములో నిలిచి ఉన్నాను కదా! అందుచేత నీ తేజస్సు ఏదో ఇప్పుడు చూపుము. మాటలలో గొప్పలు చెప్పుకొనుట ఎందుకు?" అనెను.(12-16)

ఇంద్రజిత్తు ఆ మాటలు విని, భయంకరమైన ధనుస్సును గ్రహించి వాడియైన బాణములను ప్రయోగించెను. ఇంద్రజిత్తు విడచిన గొప్ప వేగము గల సర్పవిషముతో సమానములైన బాణములు లక్ష్మణుని చేరి నిట్టూర్చుచున్న సర్పములు వలె పడినవి. వేగముగల, ఆ ఇంద్రజిత్తు మహావేగముగల బాణములతో, లక్ష్మణుని యుద్ధమునందు కొట్టెను. శరీరముపై చాల బాణములు తగిలి రక్తముతో నిండియున్న శ్రీమంతుడైన ఆ లక్ష్మణుడు ధూమములేని అగ్నివలె ప్రకాశించెను.(17-20)

ఇంద్రజిత్తు తాను చేసిన పని చూచుకొని ముందుకు ఎదురుగా వెళ్ళి బిగ్గరగా గర్జించుచు- "లక్ష్మణా! రెక్కలు కట్టినవి, అనేకములైన అంచులు గలవి, జీవితమును అంతమొందించునవి అయిన బాణములు నా ధనుస్సునుండి బయల్వెడలి ఇప్పుడు నీ ప్రాణములను తీసివేయగలవు. లక్ష్మణా! ఇప్పుడు నాచేత చంపబడి పడియున్న నీపై నక్కలు, డేగలు, గ్రద్దలు గుంపులుగా వచ్చి పడుగాక. చాల దుష్టబుద్ధియైన రాముడు, నీచక్షత్రియుడవు, ఎల్లప్పుడు చెడ్డవాడవు, భక్తుడవు, సోదరుడవు అయిన నిన్ను ఇప్పుడే చంపివేయగా చూడగలడు.(21-24)

లక్ష్మణా! ఇప్పుడు నేను చంపివేయగా నీవు కవచము జారిపోయి, ధనుస్సు క్రిందపడిపోయి, తల తెగి పడి ఉండెదవు. అట్టి నిన్ను రాముడు చూడగలడు." అని పలికెను. ఈ విధముగా పరుషముగా మాటలాడుచున్న, కోపావిష్టుడైన ఇంద్రజిత్తుతో అర్థము ఎరిగిన లక్ష్మణుడు హేతుసహితమైన వాక్యమును ఇట్లు పలికెను- "చెడ్డబుద్ధికలవాడా! మాటలలో బలము చూపుట మానుము. ఓ! రాక్షసుడా! నీవు క్రూరకర్మలు చేయువాడవు. ఇంక ఈ మాటలు మాటలాడెద వెందుకు? పనిచేసి సాధించుము. రాక్షసుడా! పనిలో చూపకుండగా ఎందుకు గొప్పలు చెప్పెదవు? నీ గొప్ప మాటలమీద నాకు నమ్మకము కలుగునట్లు పనిచేసి చూపుము. పురుషులలో

అధముడా! నేను కొంచెము కూడా పరుషవాక్యము పలకక, ఏమీ నిందించక, బడాయి చెప్పుకొనక నిన్ను చంపెదను; చూడుము."(25-29)

ఇట్లు పలికి, లక్ష్మణుడు ఐదు నారాచబాణములను చెవివరకు లాగి గొప్ప వేగముతో ఇంద్రజిత్తు వక్షఃస్థలముమీద కొట్టెను. మంచి రెక్కలచేత వేగము గలవిగా చేయబడిన, ప్రజ్వలించుచున్న సర్పములవలె ఉన్న బాణములు ఆ రాక్షసుని వక్షఃస్థలముమీద సూర్యుని కిరణములవలె ప్రకాశించినవి. లక్ష్మణుడు బాణములచేత కొట్టగా కోపించిన ఇంద్రజిత్తు మూడు బాణములు బాగుగా ప్రయోగించి లక్ష్మణుని కొట్టెను. యుద్ధమునందు ఒకరిపై ఒకరు జయము సంపాదింపవలె నని కోరుచున్న నరులలో శ్రేష్ఠుడైన లక్ష్మణునకూ, రాక్షసులలో శ్రేష్ఠుడైన ఇంద్రజిత్తుకూ మధ్య చాల భయంకరమూ, వ్యాకులమూ అయిన పోరాటము జరిగెను. ఇద్దరూ బలము కలవారే. ఇద్దరూ పరాక్రమముతో ప్రకాశించువారే. ఇద్దరూ జయించుటకు చాల కష్టమైనవారే. ఇద్దరూ సాటిలేని బలమూ, తేజస్సూ కలవారే. యుద్ధమునందు ఎదిరింపశక్యముకాని ఆ వీరులిద్దరూ ఆకాశమునందు ఉన్న రెండు గ్రహములవలె, ఇంద్రవృత్రాసురుల వలె, భయములేనివారై యుద్ధము చేసిరి. ఎదురెదురుగా నిలిచి ఉన్న ఆ మహాత్ములు అనేకమైన బాణములను విడచుచూ, సింహములు వలె యుద్ధము చేసిరి. నరులలో ముఖ్యుడైన లక్ష్మణుడూ, రాక్షసులలో ముఖ్యుడైన ఇంద్రజిత్తూ ఉత్సాహవంతులై యుద్ధము చేసిరి.(30-37)

శత్రుసంహారకుడైన లక్ష్మణుడు బాణములు సంధించి, పగబట్టిన సర్పమువలె బుసలు కొట్టుచు, ఇంద్రజిత్తుపై ప్రయోగించెను. ఇంద్రజిత్తు లక్ష్మణుని ధనుష్టంకారధ్వనిని విని, పాలిపోయిన ముఖముతో లక్ష్మణుని వైపు చూచెను. విభీషణుడు దిగులు చెందిన ముఖముతో నున్న ఇంద్రజిత్తును చూచి యుద్ధాసక్తుడైన లక్ష్మణునితో- "ఓ! మహాబాహూ! ఈ ఇంద్రజిత్తులో కనబడు లక్షణములను బట్టి ఇతడు దుర్బలుడై పోయినాడు; సంశయము లేదు. నీవు తొందరపడుము." అని పలికెను. అప్పుడు లక్ష్మణుడు సర్పమువంటి వాడియైన బాణములను సంధించి విషముచేత తీవ్రములయిన సర్పములను వలె ఇంద్రజిత్తుపై ప్రయోగించెను. లక్ష్మణుడు ఇంద్రుని వజ్రమువంటి బాణములతో కొట్టగా ఇంద్రజిత్తు ఇంద్రియములన్నీ క్షోభ చెందుటచే ముహూర్తకాలము స్పృహ తప్పి ఉండిపోయెను. ముహూర్తకాలములో సంజ్ఞను పొంది, తిరిగి వచ్చిన ఇంద్రియములు గల ఆ ఇంద్రజిత్తు యుద్ధములో స్థిరముగా నిలిచి ఉన్న వీరుడైన లక్ష్మణుణ్ణి చూచెను.(38-44)

రోషముచేత ఎఱ్ఱనైన నేత్రములతో అతడు లక్ష్మణునివైపు వెళ్ళి అతనితో మరల పరుషవాక్యము పలికెను– “మొదటి యుద్ధదినమునందు చూపిన నా పరాక్రమము నీకు జ్ఞాపకములేదా? ఆనాడు నీ సోదరునితో పాటు బంధింపబడి నేలమీద దొర్లితివి! మొదట జరిగిన ఆ మహాయుద్ధములో పరివారసహితులైన మీ ఇద్దరినీ ఇంద్రుని వజ్రముతో సమానములైన బాణములచేత సంజ్ఞ లేకుండ చేసి నేలమీద పడగొట్టితిని కదా? నీవు నన్ను ఎదిరించవలె నని కోరుచున్నావనగా నీకు ఆ విషయము జ్ఞాపకము లేకపోవలె, లేదా స్పష్టముగా యమలోకముకు వెళ్ళవలెనని నీవు కోరుకొనుచుండవలె అని అనుకొనుచున్నాను. మొదటి యుద్ధములో నీవు నా పరాక్రమమును చూచి ఉండనిచో ఇప్పుడు నీకు చూపెదను. సిద్ధముగా నిలచి ఉండుము.” ఇట్లు పలికి ఏడు బాణములతో లక్ష్మణుణ్ణి కొట్టెను. వాడియైన అంచులు గల పది బాణాలచేత హనుమంతుణ్ణి కొట్టెను.(45-50)

పిమ్మట పరాక్రమవంతుడైన ఇంద్రజిత్తు కోపముతో రెట్టింపు తొందరపడుచు బాగుగా ప్రయోగించిన నూరు బాణాలతో విభీషణుణ్ణి కొట్టెను. అప్పుడు రాముని తమ్ముడు, నరశ్రేష్ఠుడు అయిన లక్ష్మణుడు యుద్ధములో ఇంద్రజిత్తు చేసిన ఆ పని చూచి, లెక్కచేయక, నవ్వుచు, “ఇది గొప్పపని ఏమీ కాదు” అని పలుకుచు, భయముచెందనివాడై, క్రోధముతో భయంకరములైన బాణములు తీసి అతనిపై ప్రయోగించెను. “ఓ! రాక్షసుడా! యుద్ధానికి వచ్చిన శూరులు ఈ విధముగా కొట్టరు. ఈ నీ బాణములు తేలికగాను, తక్కువ బలము కలవిగాను, సుఖకరముగాను ఉన్నవి కదా. యుద్ధములో జయము కావలె నని కోరుకునే శూరులు ఈ విధముగా కొట్టరు.” ధనుర్ధరుడైన లక్ష్మణుడు ఈ విధముగా పలుకుచు అతనిపై బాణములు కురిపించెను. లక్ష్మణుని బాణములచేత ముక్కలు చేయబడి బంగారము వికారమైన ఇంద్రజిత్తు కవచము, ఆకాశమునుండి నక్షత్రసముదాయమువలె, రథమధ్యమునందు పడిపోయెను. నారాచబాణములచేత కవచము బ్రద్దలైపోవుటచే గాయములు తగిలిన వీరుడైన ఇంద్రజిత్తు ప్రాతఃకాలమునందు సూర్యుడువలె ఉండెను. (51-57)

అటుపిమ్మట భయంకరమైన పరాక్రమము గల వీరుడైన ఇంద్రజిత్తు కోపించినవాడై యుద్ధమునందు వేయి బాణములచేత లక్ష్మణుణ్ణి కొట్టెను. లక్ష్మణుని గొప్పదైన, దివ్యమైన కవచము బ్రద్దలైపోయెను. వాళ్ళిద్దరూ ఒకరు చేసిన దానికి మరొకరు ప్రతిక్రియ చేయుచు, ఒకరిమీదికి ఒకరు వెళ్ళి పోరాడుచుండిరి. వారిద్దరూ మిక్కిలి నిట్టూర్పుచు యుద్ధము చేసిరి. ఆ తుములయుద్ధములో వారి శరీరములు పూర్తిగా బాణముల దెబ్బలకు తూట్లు పడి అంతటా రక్తముచేత తడిసి ఉండెను.

మహాత్ములు, యుద్ధములో నేర్పుకలవారు అయిన ఆ వీరులు వాడియైన బాణములచేత, చాల కోపముతో, ఒకరినొకరు చెక్కివేసిరి. భయంకరమైన పరాక్రమము గల వారిద్దరు ఎవరికి వారు తాము జయించవలె నని ప్రయత్నించుచుండిరి. ఆ విధముగా బాణసముదాయములచేత వ్యాప్తులై, ఛేదించబడిన కవచములు, ధ్వజము గల వారిద్దరూ వేడియైన రక్తమును స్రవించుచు, జలమును స్రవించు ప్రస్రవణపర్వతమువలె(లేదా సెలయేళ్ళవలె) ఉండిరి. భయంకరమైన ధ్వని గల ఘోరమైన బాణవర్షమును విడచుచు, ధారావర్షము కురియుచున్న ఆకాశమునందున్న నల్లని ప్రళయకాలమేఘములవలె ఉన్న వారు ఆ విధముగా యుద్ధము చేయుచుండగా చాల సమయము గడచిపోయెను. కాని వాళ్ళిద్దరూ కూడ యుద్ధమునందు వైముఖ్యమును గాని, అలసట గాని పొందలేదు.(58-64)

అస్త్రవేత్తలలో శ్రేష్ఠులైన వారిద్దరూ మాటిమాటికి అస్త్రములను ప్రయోగించుచు, ఆకాశముమీద అనేక ఆకారములు గల బాణములను పంజరమువలె అల్లిరి. ఆ లక్ష్మణేంద్రజిత్తులిద్దరు పొరపాటు పడకుండగా, తేలికగా, చిత్రముగా, బాగుగా బాణములను ప్రయోగించుచు వ్యాకులముగాను, ఘోరముగాను యుద్ధము చేసిరి. ఆ ఇద్దరివల్ల జనించిన వ్యాకులమైన ధ్వని వేరువేరుగా వినబడెను. అది దారుణమైన ఉరుమువలె కంపమును పుట్టించెను. యుద్ధమునందు ఆసక్తులైన వారి ఇద్దరి ధ్వని, ఆకాశమునందు ఉరుముచున్న, చాల భయంకరములైన మేఘముల ధ్వని వలె ఉండెను. కీర్తిమంతులు, జయము సంపాదింపవలెనను పట్టుదల గలవారు, మహాబలవంతులు అయిన వారిద్దరూ బంగారుపొన్నులు గల నారాచములచేత గాయములు ఏర్పడగా రక్తమును స్రవించిరి. యుద్ధమునందు వారి దేహములమీద పడిన, బంగారు పొన్నులు గల ఆ బాణములు రక్తముచేత పూయబడినవై బైటకు వచ్చి నేలలో ప్రవేశించినవి. వారిద్దరూ ప్రయోగించిన కొన్ని బాణములు ఆకాశమునందు వాడియైన ఆయుధములతో ఢీకొని వాటిని వేలకొలది ముక్కలుగా విరచివేసెను. యుద్ధమునందు ప్రోగుపడిన వారి బాణముల సముదాయము యజ్ఞమునందు రెండు అగ్నులవలన ఏర్పడిన కుశసముదాయమువలె ఉండెను. యజ్ఞములో అగ్నుల ప్రక్క దర్భలు ప్రోగులుగా పడిఉన్నట్లు వారి బాణములు ప్రోగులుగా పడియుండెను. గాయములతో ఆ మహాత్ముల దేహములు బాగా పుష్పించి ఆకులు లేని మోదుగచెట్టు, బూరుగుచెట్టు వలె ప్రకాశించెను.(65-73)

ఇంద్రజిత్తు, లక్ష్మణుడూ కూడా ఒకరినొకరు జయించవలె నను కోరికతో మాటిమాటికి వ్యాకులమైన, భయంకరమైన యుద్ధము చేసిరి. యుద్ధమునందు

లక్ష్మణుడు ఇంద్రజిత్తును, ఇంద్రజిత్తు లక్ష్మణునీ, ఈ విధముగా ఇద్దరూ పరస్పరమూ కొట్టుకొనుచు, అలసట చెందలేదు. గొప్ప పరాక్రమము, వేగము గల ఆ లక్ష్మణేంద్రజిత్తులు దేహములలో లోతుగా దిగి నిలిచి ఉన్న బాణములతో మొక్కలు మొలచిన పర్వతముల వలె ప్రకాశించిరి. రక్తముచేత తడిసి, బాణములచేత కప్పబడిన వారి అన్ని అవయవములు మండుచున్న అగ్నులవలె ప్రకాశించినవి. భయంకరమైన ధ్వని గల ఘోరమైన బాణవర్షమును విడచుచు, ధారావర్షమును కురియుచున్న ఆకాశమునందున్న నల్లని ప్రళయకాలమేఘములవలె ఉన్న వారు ఆ విధముగా యుద్ధము చేయుచుండగా చాల సమయము గడచిపోయెను. కాని వాళ్ళిద్దరూ కూడ యుద్ధమునందు వైముఖ్యమును గాని, అలసట గాని పొందలేదు.(74-78)

అప్పుడు మహాత్ముడైన విభీషణుడు, యుద్ధరంగమునందు పరాజయము ఎరుగని లక్ష్మణుని యుద్ధపరిశ్రమను తొలగించుటకై, అతనికి ప్రియమును, హితమును చేకూర్చుచు, యుద్ధరంగమును చేరి ఉండెను.(79)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది ఎనిమిదవ సర్గము సమాప్తము.

ఎనుబది తొమ్మిదవ సర్గము

విభీషణుడు రాక్షసులను వధించుట. ఇంద్రజిత్తు సారథిని లక్ష్మణుడు, రథాశ్వములను వానరులు చంపివేయుట.

ఏకాగ్రచిత్తులైన ఆ లక్ష్మణ ఇంద్రజిత్తులు మదించిన ఏనుగులవలె ఒకరిపై ఒకరు జయమును కోరుచు యుద్ధము చేయుచుండగా చూచి శ్రేష్ఠమైన ధనుస్సును ధరించిన, బలవంతుడూ, శూరుడూ అయిన విభీషణుడు ఆ యుద్ధమును ఇంకనూ చూడవలెనను కోరికతో రణరంగాగ్రభాగమున నిలబడెను. అతడట్లు నిలిచి గొప్ప ధనుస్సును చరచి, వాడియైన కొనలు గల శ్రేష్ఠములైన బాణములను రాక్షసులపై ప్రయోగించెను. కలిసి పడుచున్న అగ్నిస్పర్శవంటి స్పర్శగల ఆ బాణములు, వజ్రములు మహాపర్వతములను చీల్చినట్లు రాక్షసులను చీల్చివేసినవి. విభీషణుని అనుచరులైన ఆ రాక్షసశ్రేష్ఠులు కూడా యుద్ధమునందు శూలములచేత, ఖడ్గములచేత, పట్టిశములచేత వీరులైన రాక్షసులను ఛేదించిరి. అప్పుడు తన అమాత్యులైన ఆ

రాక్షసులతో కూడిన విభీషణుడు ధైర్యము గల ఏనుగు గున్నల మధ్యనున్న ఏనుగువలె ప్రకాశించెను. (1-6)

తగిన కాలము నెరిగిన రాక్షసశ్రేష్ఠుడైన విభీషణుడు అది తగిన సమయమని గుర్తించి రాక్షసులను చంపుటయందు ఆసక్తి కల ఆ వానరులను ప్రోత్సహించుచూ ఇట్లు పలికెను- "ఓ! వానరనాయకులారా! ఇక రావణునకు ఇత డొక్కడే గతి. అతని బలములో మిగిలినది ఇతడే. ఎందుకు ఊరక నిలబడెదరు? ఈ రణాగ్రమునందు పాపాత్ముడైన ఈ రాక్షసుడ్ని చంపివేసినచో రావణుడు తప్ప మిగిలిన సైన్యమంతా చంపబడినట్లే. ప్రహస్తుడూ, వీరుడైన నికుంభుడూ, మహాబలశాలియైన కుంభకర్ణుడూ, కుంభుడూ, ధూమ్రాక్షుడూ, జంబుమాలి, మహామాలి, తీవ్రమైన వేగము గల అశనిప్రభుడు, సుప్తఘ్నుడూ, యజ్ఞకోపుడూ, వజ్రదంష్ట్రుడూ, సంహ్రాది, శత్రుసంహారకుడైన వికటుడూ, తపనుడూ, మందుడూ, ప్రఘాస-ప్రఘస- ప్రజంఘ-జంఘులూ, ఎదిరింపశక్యము కాని అగ్నికేతువూ, పరాక్రమవంతుడైన రశ్మికేతువూ, విద్యుజ్జిహ్వ-ద్విజిహ్వ-సూర్యశత్రు-అకంపన-సుపార్శ్వ-చక్రమాలి-కంపనులూ, బలశాలులైన దేవాంతక-నరాంతకులు చంపబడినారు. మీరు గొప్ప బలము గల ఇంతమంది రాక్షసవీరులను చంపివేసినారు. బాహువులతో సముద్రము దాటినారు. చిన్న గోష్పదమును దాటివేయుడు. ఓ! వానరులారా! మీరు ఇక్కడ జయించవలసినది ఇంతమాత్రమే మిగిలినది. బలముచేత గర్వించి వచ్చిన రాక్షసులనందరినీ చంపివేసినారు. తండ్రియైన నేను పుత్రుణ్ణి చంపుట యుక్తము కాదు. అయిననూ జాలి విడచి రాముని నిమిత్తమై నా సోదరుని కుమారుణ్ణి చంపెదను. నేను ఇతనిని చంపవలెనని అనుకొనుచున్నాను. నా నేత్రమును కన్నీరు కప్పివేయుచున్నది. వీనిని మహాబాహువైన లక్ష్మణుడే శాంతింపచేయగలడు. వానరులారా! మీరందరూ కలసి ఈతని సమీపమునందున్న అనుచరులను చంపివేయుడు." (7-18)

విభీషణుడిట్లు ప్రేరేపించగా వానరులు సంతోషించుచూ తోకలు గట్టిగా విదిపిరి. పిమ్మట ఆ వానరశ్రేష్ఠులు మాటి మాటికి సింహనాదము చేయుచు, మేఘములను చూచిన నెమళ్ళవలె అనేకవిధములైన ధ్వనులను చేసిరి. తన సైన్యమునకు చెందిన అందరితోనూ కూడిన జాంబవంతుడూ, ఆ వానరులూ రాక్షసులను శిలలతోను, గోళ్ళతోనూ, దంతములతోను పీడించిరి. గొప్పబలము కల ఆ రాక్షసులు భయము విడచి, అనేక విధములైన ఆయుధములు ధరించి, తమను కొట్టుచున్న ఆ జాంబవంతుని చుట్టుముట్టిరి. యుద్ధమునందు రాక్షససేనను

చంపుచున్న ఆ జాంబవంతుణ్ణి బాణముతోను, వాడియైన గండ్రగొడ్డళ్ళతోను, పట్టిశములతోనూ, కత్రలతోనూ, తోమరములతోనూ కొట్టిరి. ఆ వానరులకూ రాక్షసులకూ కోపించిన దేవాసురులకు వలె వ్యాకులమూ, భయంకరమూ, గొప్ప ధ్వని కలదీ అయిన యుద్ధము జరిగెను.(19-24)

ధైర్యవంతుడైన ఆ హనుమంతుడు కూడా కోపించి, లక్ష్మణుణ్ణి తన వీపునుండి క్రిందకు దింపి, పర్వతమునుండి పెద్ద శిలను పెకలించి, వేలకొలది రాక్షసుల సంహారము చేసెను. బలవంతుడూ, శత్రువీరులను సంహరించువాడు అయిన ఇంద్రజిత్తు పినతండ్రితో వ్యాకులమైన యుద్ధము చేసి మరల లక్ష్మణుని మీదికి శీఘ్రముగా వెళ్ళెను.(25-27)

యుద్ధమునందు తీవ్రముగా యుద్ధము చేయుచున్న వీరులైన ఆ లక్ష్మణేంద్రజిత్తులు బాణసముదాయములను వర్షించుచు పరస్పరము కొట్టుకొనిరి. మహాబలవంతులూ, వేగవంతులూ అయిన ఆ లక్ష్మణేంద్రజిత్తులు గ్రీష్మాంతమునందు మేఘములచేత సూర్యచంద్రులు వలె, బాణసముదాయముచేత అంతర్ధానము చెందిరి. యుద్ధము చేయుచున్న వారిద్దరూ చూపుచున్న హస్తలాఘవమువలన ధనుస్సును గ్రహించుట గాని, బాణములు తీయుటగాని, సంధించుటగాని, విడుచుటగాని, లాగుటకాని, ధనుస్సు, నారి, బాణములు మొదలైనవాటి విభాగముగాని, పిడికిలి పట్టుటగాని, లక్ష్యమును చేరుట గాని కనబడలేదు. ధనుర్వేగముచేత ప్రయోగింపబడిన బాణసముదాయములు అన్ని వైపులా ఆకాశమును ఆక్రమించుటచే రూపములు ప్రకాశించలేదు. ఒకమారు లక్ష్మణుడు ఇంద్రజిత్తును ఆక్రమించి, మరొకమారు ఇంద్రజిత్తు లక్ష్మణుని ఆక్రమించి, ఈ విధముగా వారిద్దరూ యుద్ధము చేయుచుండగా జయపరాజయముల విషయమున భయంకరమైన అవ్యవస్థ ఏర్పడుచుండెను. వారిద్దరూ విడచిన వాడియైన బాణములచేత అవకాశము లేనిదిగా చేయబడిన ఆకాశము చీకటిచేత ఆవరింపబడెను. వాళ్ళిద్దరూ ప్రయోగించిన వాడియైన అనేకబాణములు వందలకొలది పడుటచేత దిక్కులు, విదిక్కులు బాణములచేత వ్యాప్తములైనవి. అంతటా చీకటి ఆవరించెను. చాల భయము కలిగెను. సూర్యుడు అస్తమించిన పిమ్మట చీకటి వ్యాపించగా, రక్తప్రవాహనదులు వేలకొలది బయలుదేరెను. క్రూరములైన మాంసము తిను జంతువులు భయంకరముగా అరచినవి. అప్పుడు వాయువు వీచలేదు. అగ్ని మండలేదు.(28-37)

"లోకములకు క్షేమమగుగాక" అని మహర్షులు పలికిరి. గంధర్వులు,

చారణులు, ఏమగునో అని భయపడుచు చూచుటకై వచ్చిరి. లక్ష్మణుడు నాలుగు బాణములు ప్రయోగించి, ఆ రాక్షసశ్రేష్ఠుని, బంగారు అలంకారములు గల నల్లని నాలుగు గుఱ్ఱములను కొట్టెను. తన హస్తలాఘవము చూపుచు, బంగారముతో పచ్చగానున్న, వాడియైన, పూర్తిగా బాగా లాగబడిన, మంచి రెక్కలు గల, మంచి కాంతి గల, మహేంద్రుని వజ్రముతో సమానమైన, అరచేతి చప్పుడును అనుసరించి ధ్వనిచేయుచున్న మరియొక భల్ల మను పిడుగువంటి బాణమును ప్రయోగించి సంచరించబోవుచున్న సారథి శిరస్సును దేహమునుండి వేరుచేసెను. సారథి చనిపోయిన పిమ్మట మహాతేజఃశాలియైన ఇంద్రజిత్తు స్వయముగానే సారథ్యము చేసికొనుచు ధనుస్సును కూడ ఉపయోగించెను. ఆ యుద్ధమునందు అతని సామర్థ్యము చూచువారికి ఆశ్చర్యకరముగా ఉండెను. అతడు గుఱ్ఱములను తోలుటలో వ్యగ్రుడై ఉండగా లక్ష్మణుడు అతనిని వాడియైన బాణాలతో కొట్టెను. పిమ్మట అతడు ధనుస్సును ఉపయోగించుటకు ప్రయత్నించుచుండగా గుఱ్ఱములమీద బాణములను విడచెను. చాల శీఘ్రముగా పనులు చేయు లక్ష్మణుడు యుద్ధమునందు నిర్భయముగా సంచరించుచున్న ఆ ఇంద్రజిత్తును ఆ అవకాశమునందు బాణసముదాయములచేత కొట్టెను.(38-45)

యుద్ధములో సారథి మరణించుట చూడగానే ఇంద్రజిత్తు దిగులుచెంది, యుద్ధమునందు ఉత్సాహము కోల్పోయెను. ఇంద్రజిత్తు ముఖము దిగులుచెందుట చూచి వానరనాయకులు చాలా సంతోషించుచు లక్ష్మణుణ్ణి పూజించిరి.

పిమ్మట ప్రమాథి, రభసుడు, శరభుడు, గంధమాదనుడు అను నలుగురు వానరనాయకులు ఓర్పులేనివారై వేగమును ప్రదర్శించిరి. గొప్పబలము, భయంకరమైన పరాక్రమముగల ఆ నలుగురు వానరులు శీఘ్రముగా ఎగిరి అతని అశ్వశ్రేష్ఠముల మీద వాలిరి. పర్వతమువంటి ఆ వానరులు మీదికెక్కి కూర్చుండగానే ఆ గుఱ్ఱముల నోళ్ళనుండి ఎఱ్ఱని రక్తము స్రవించెను. ఆ గుఱ్ఱములు నలిగిపోయి, విరిగిపోయి, ప్రాణములు కోల్పోయి నేలపై పడినవి. ఆ వానరులు గుఱ్ఱములను చంపి, మహారథమును కూడ విరుగగొట్టి మరల వేగముగా ఎగిరి వెళ్ళి లక్ష్మణుని పార్శ్వమునందు నిలచిరి.(46-52)

సారథి మరణించిన ఇంద్రజిత్తు గుఱ్ఱములు కూడ చంపబడగానే ఆ రథమునుండి క్రిందకు దుమికి బాణములు వర్షించుచు లక్ష్మణుని మీదికి శీఘ్రముగా వెళ్ళెను. పిమ్మట మహేంద్రునితో సమానుడైన ఆ లక్ష్మణుడు ఉత్తమాశ్వములు

చంపబడుటచేత కాలినడకన వచ్చుచున్న, యుద్ధమునందు వాడియైన శరములను విడచుచున్న ఆ ఇంద్రజిత్తును, అప్పుడు బాణముల సముదాయములచేత నివారించెను.(53, 54)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని ఎనుబది తొమ్మిదవ సర్గము సమాప్తము.

తొంబదవ సర్గము

ఇంద్రజిల్లక్ష్మణులు ఘోరముగా పోరాడుట; లక్ష్మణుడు ఇంద్రజిత్తును వధించుట.

అశ్వములు చంపబడుటచే నేలమీద నిలిచి ఉన్న మహాతేజఃశాలియైన ఇంద్రజిత్తు మిక్కిలి కోపించి తేజస్సుతో ప్రకాశించెను. ధనుర్ధరులై బాణములచేత ఒకరినొకరు చంపవలెనను తీవ్రమైన ఇచ్ఛగల ఆ లక్ష్మణేంద్రజిత్తులు వనములో విజయము నిమిత్తము బైటకు వచ్చి పోరాడుచున్న గజశ్రేష్ఠముల వలె ఉండిరి. ఆ యా వైపులనుండి వచ్చుచు పరస్పరము చంపుకొనుచున్న వానరులు, రాక్షసులూ కూడా యుద్ధములో తమ ప్రభువును విడువలేదు. ఇంద్రజిత్తు ఆ రాక్షసులకు అందరికీ సంతోషము కలిగించుచు, వాళ్ళను చూచి సంతోషముతో- "ఓ! రాక్షసోత్తములారా! దిక్కులలో అంతటా అధికమైన చీకటి ఆవరించి ఉన్నది. తమవా రెవరో ఇతరు లెవరో తెలియుటలేదు. మీరు వానరులను మోసగించుటకై ధైర్యముగా యుద్ధము చేయుచుండుడు. నేను రథమునెక్కి యుద్ధమునకు వచ్చెదను. నేను నగరములో ప్రవేశించినప్పుడు దురాత్ములైన ఈ వానరులు(నాతో) యుద్ధముచేయకుండా ఉండేటట్లు చేయుడు." అని పలికి, వానరులను వంచించి, రథముకొరకై లంకాపురములో ప్రవేశించెను.(1-8)

గొప్ప తేజస్సు గల, యుద్ధములలో జయించు ఇంద్రజిత్తు అందమైనది, బంగారముచేత అలంకరించబడినది, ప్రాస-ఖడ్గ-బాణములతో కూడినది, ఉత్తమములైన గుఱ్ఱములు కట్టినది, గుఱ్ఱముల స్వభావము తెలిసినవాడు, హితమైన ఉపదేశము ఇచ్చువాడు అయిన సారథిచేత అధిష్ఠించబడినదీ అయిన రథమును అలంకరింపచేసి దానిని ఎక్కెను. వీరుడైన ఆ ఇంద్రజిత్తు ముఖ్యములైన రాక్షసగణములు వెంటరాగా,దైవ ప్రేరితుడై నగరమునుండి బయలుదేరి, వేగము

గల అశ్వముల సహాయముతో లక్ష్మణ విభీషణులను ఎదిరించుటకై వెళ్ళెను. అప్పుడు రథముమీద ఉన్న ఆ ఇంద్రజిత్తును చూచి లక్ష్మణుడు గొప్ప పరాక్రమము గల వానరులు, విభీషణుడు బుద్ధిమంతుడైన అతని చురుకుదనమునకు చాల ఆశ్చర్యపడిరి. ఇంద్రజిత్తు యుద్ధమునందు, కోపావేశములతో బాణ సముదాయములను ప్రయోగించి వందలకొలది, వేలకొలది వానరులను పడగొట్టెను. కోపముతో ధనుస్సును మండలాకారముగా చేసి గొప్ప లాఘవముతో వానరులను చంపెను. ఆ వానరులు నారాచబాణములచేత చంపివేయబడుచు, ప్రజలు బ్రహ్మదేవుని శరణుజొచ్చినట్లు లక్ష్మణుని శరణుజొచ్చిరి.(9-16)

అప్పుడు లక్ష్మణుడు యుద్ధమునందు కోపముతో మండిపడుచు, తన హస్తలాఘవమును చూపుచు అతని ధనుస్సును ఛేదించెను. అతడు తొందరపడుచు మరియొక ధనుస్సు తీసుకొని దానిని సిద్ధము చేసెను. లక్ష్మణుడు మూడు బాణాలతో దానిని కూడ ఛేదించెను. ధనుస్సును ఛేదించిన పిమ్మట లక్ష్మణుడు ఆ ఇంద్రజిత్తును సర్పవిషము వంటి ఐదు బాణాలతో వక్షస్థలమునందు కొట్టెను. గొప్ప ధనుస్సునుండి బయలుదేరిన ఆ బాణములు అతని శరీరమును భేదించి ఎఱ్ఱని మహాసర్పములవలె నేలమీద పడినవి. ధనుస్సు ఛేదింపబడి, ముఖమునుండి రక్తము కక్కుచున్న ఆ ఇంద్రజిత్తు మంచి నారి గల, చాల ధృఢమైన మరొక ధనుస్సును గ్రహించెను. అతడు చాల లాఘవము చూపుచు దేవేంద్రుడు వర్షము కురిపించినట్లు లక్ష్మణునిపై బాణవర్షము కురిపించెను. శత్రుసంహారకుడైన లక్ష్మణుడు ఏ మాత్రము కంగారు పడనివాడై, ఇంద్రజిత్తు ప్రయోగించిన, ఎదిరింపశక్యముకాని ఆ బాణవర్షమును నివారించి తన పరాక్రమమును ఇంద్రజిత్తుకు చూపెను. అది చాల ఆశ్చర్యకరముగా ఉండెను.(17-24)

పిమ్మట చాల కోపించి, ఆయుధప్రయోగములో తనకున్న లాఘవమును చూపుచు, రాక్షసు లందరినీ మూడేసి బాణాలచేత కొట్టెను. ఇంద్రజిత్తును కూడ బాణసముదాయములచేత కొట్టెను. బలవంతుడు, శత్రుసంహారకుడూ అయిన లక్ష్మణునిచేత గట్టిగా కొట్టబడిన ఆ ఇంద్రజిత్తు అతనిపై వాడియైన అనేక బాణములను ప్రయోగించెను. లక్ష్మణుడు ఆ బాణములు తనమీదికి రాకుండగానే వాడియైన బాణాలచేత ఛేదించి వంగిన కణుపులు ఉన్న భల్లబాణముచేత రథికుడైన ఆ ఇంద్రజిత్తు సారథి తలను ఖండించెను. ఆ గుఱ్ఱములు సారథి లేకపోయినను, ఏమాత్రము కంగారుపడక మండలాకారముగా సంచరించుచు రథమును లాగినవి. అది ఆశ్చర్యకరముగా ఉండెను. ధృఢమైన పరాక్రమము గల లక్ష్మణుడు కోపము

చెంది, ఇంద్రజిత్తు గుఱ్ఱములను భయపెట్టుటకై వాటిని బాణములతో కొట్టెను. ఇంద్రజిత్తు యుద్ధములో లక్ష్మణుడు చేసిన ఆ పనిని సహించక కోపముతో ఉన్న అతనిని పది బాణములతో కొట్టెను. ఇంద్రజిత్తు ప్రయోగించిన, వజ్రముతోను, సర్పవిషముతోను సమానములైన బాణములు లక్ష్మణుని బంగారు కాంతిగల కవచమును స్పృశించి విరిగి పడిపోయినవి. రావణపుత్రుడైన ఇంద్రజిత్తు లక్ష్మణుని కవచము ఛేదింపశక్యముకానిది అని తెలిసికొని, చాలా కోపించి, అస్త్రప్రయోగములో తన చురుకుతనమును చూపుచు, మంచి పొన్నులు ఉన్న మూడు బాణాలతో లక్ష్మణుని లలాటముమీద కొట్టెను. (25-34)

యుద్ధప్రియుడైన లక్ష్మణుడు లలాటమునందు నాటుకొని ఉన్న ఆ బాణములతో మూడు శిఖరములున్న పర్వతమువలె యుద్ధరంగములో ప్రకాశించెను. ఆ రాక్షసునిచేత ఆ విధముగా బాణములతో పీడింపబడిన లక్ష్మణుడు వెంటనే ధనుస్సును లాగి ఐదు బాణములతో అందమైన కుండలములు గల ఆ ఇంద్రజిత్తు ముఖముమీద కొట్టెను. వీరులు, గొప్ప బలము, ధనుస్సులూ కలవారూ, భయంకరమైన పరాక్రమము కలవారు అయిన ఆ లక్ష్మణేంద్రజిత్తులు వాడియైన బాణాలతో ఒకరినొకరు కొట్టిరి. అప్పుడు యుద్ధమునందు రక్తముచేత పూయబడిన శరీరములు గల ఆ లక్ష్మణేంద్రజిత్తులు ఇద్దరూ పుష్పించిన మోదుగచెట్లవలె ఉండిరి. జయము సంపాదించవలె నను నిశ్చయముతో ధనుర్ధరులైన వారిద్దరూ ఒకరిని ఒకరు సమీపించి ఘోరములైన బాణములచేత అన్ని అవయవములందు కొట్టుకొనిరి. అప్పుడు యుద్ధకోపముతో కూడిన ఇంద్రజిత్తు విభీషణుణ్ణి, మూడు బాణాలచేత ముఖముమీద కొట్టెను. రాక్షసనాయకుడైన విభీషణుణ్ణి మూడు బాణాలతో కొట్టి, వానరనాయకు లందరినీ ఒక్కొక్క బాణముచేత కొట్టెను. గొప్ప తేజస్సు గల ఆ విభీషణుడు దురాత్ముడైన ఆ ఇంద్రజిత్తుమీద చాలా కోపించి వాని గుఱ్ఱములను గదతో చంపివేసెను. ముందుగానే సారథిలేని మహాతేజఃశాలియైన ఇంద్రజిత్తు చంపబడిన గుఱ్ఱములు గల రథమునుండి క్రిందికి దుమికి పినతండ్రిపై శక్తిని ప్రయోగించెను. లక్ష్మణుడు వచ్చుచున్న ఆ శక్తిని చూచి వాడియైన బాణములచేత దానిని ఛేదించి పది ముక్కలుగా నేలమీద పడగొట్టెను. (35-44)

దృఢమైన శరీరము గల విభీషణుడు అశ్వములను కోల్పోయిన ఆ ఇంద్రజిత్తుపై కోపముతో, అతని వక్షఃస్థలముమీద వజ్రముతో సమానమైన స్పర్శగల ఐదు బాణములను విడచెను. ఆ బాణములు వాని శరీరమును ఛేదించి రక్తముచేత పూయబడినవై ఎఱ్ఱని మహాసర్పమువలె అయినవి. ఇంద్రజిత్తు పినతండ్రిమీద


కోపించి, రాక్షసుల మధ్యలో ఉండి, యముడిచ్చిన, గొప్పబలము గల ఉత్తమమైన బాణమును గ్రహించెను. గొప్ప తేజస్సు భయంకరమైన పరాక్రమము గల లక్ష్మణుడు అతడు సంధించిన మహాబాణమును చూచి మరొక బాణమును తీసెను. ఆ బాణమును కుబేరుడు స్వయముగా స్వప్నములో లక్ష్మణునకు ఇచ్చియుండెను. దీనిని ఇంద్రునితో కూడిన సురాసురులు కూడా జయించజాలరు, సహించజాలరు. పరిఘలవంటి బాహువులచేత బలముగా లాగబడిన ఆ లక్ష్మణేంద్రజిత్తుల శ్రేష్ఠములైన ధనుస్సులు క్రౌంచపక్షులవలె చప్పుడు చేసినవి. వీరులైన ఆ లక్ష్మణేంద్రజిత్తులు ధనుస్సుమీద సంధించి లాగిన శ్రేష్ఠములైన ఆ బాణములు శోభతో ప్రజ్వరిల్లినవి. ధనుస్సుల నుండి బైటకు వచ్చి ఆ బాణములు ఆకాశమును ప్రకాశింపజేయుచు ముఖముతో ముఖమును కొట్టి, కాంతిమంతములై సంఘర్షణ పొందినవి. భయంకరమైన రూపముగల ఆ బాణముల సంఘర్షణవలన ధూమము, అగ్నికణములు బయలుదేరెను. దానివలన పుట్టిన అగ్ని భయంకరముగా ఉండెను. మహాగ్రహములవలె ఉన్న ఆ బాణములు యుద్ధములో ఒకదానితో ఒకటి ఢీకొని నూరు ముక్కలై నేలమీద పడిపోయినవి.(45-54)

అప్పుడు ఆ లక్ష్మణేంద్రజిత్తులిద్దరూ రణాగ్రమునందు తమ బాణములు దెబ్బతిని పడిపోవుట చూచి సిగ్గుచెందిరి. వారికి కోపావేశము కూడా కలిగెను. లక్ష్మణుడు తొందరపడుచు వారుణాస్త్రమును ప్రయోగించగా యుద్ధమునందు స్థిరుడైన ఇంద్రజిత్తుకూడా యుద్ధమునందు, రౌద్రాస్త్రమును ప్రయోగించెను. ఆ రౌద్రాస్త్రము చాలా ఆశ్చర్యకరమైన వారుణాస్త్రమును కొట్టివేసెను. పిమ్మట ఇంద్రజిత్తు కోపించిన వాడై లోకము నంతనూ నశింపచేయుచున్నాడా అన్నట్లు, ప్రజ్వలించుచున్న ఆగ్నేయాస్త్రమును ప్రయోగించెను. వీరుడైన లక్ష్మణుడు సూర్యాస్త్రముచేత ఆ ఆగ్నేయాస్త్రమును నివారించెను. ఆ అస్త్రము నివారింపబడుట చూచి ఇంద్రజిత్తు క్రోధావిష్టుడై శత్రువినాశకమైన వాడియైన అసురబాణమును సంధించెను. ఆ ధనుస్సునుండి ప్రకాశించుచున్న కూటములు, ముద్గరములు, శూలములు, భుశుండులు, గదలు, ఖడ్గములు, గండ్రగొడ్డళ్ళు బయలుదేరినవి. కాంతిమంతుడైన లక్ష్మణుడు యుద్ధమునందు చాల భయంకరము, సకలభూతములచేత నివారింప శక్యముకానిది, సకల శస్త్రములను చీల్చివేయునది అయిన ఆ ఘోరమైన అసురాస్త్రమును చూచి దానిని మాహేశ్వరాస్త్రముచేత నివారించెను. వాళ్ళిద్దరికీ ఆశ్చర్యకరమైన, రోమాంచమును కలిగించు యుద్ధము జరిగెను. ఆకాశమునందు సంచరించు భూతములు లక్ష్మణుని చుట్టూ నిలచెను. భయంకరమైన ధ్వనితో

నిండిన, భయంకరమైన ఆ వానరరాక్షసుల మధ్య జరుగుచున్న యుద్ధమునందు ఆశ్చర్యపడుచున్న ప్రాణులచేత ఆవరింపబడినదై ఆకాశము ప్రకాశించెను. దేవేంద్రుణ్ణి ముందు ఉంచుకొని నిలచి ఉన్న ఋషులు, పితృదేవతలు, దేవతలు, గంధర్వులు, ఉరగులు, యుద్ధములో లక్ష్మణుణ్ణి రక్షించిరి.(55-65)

లక్ష్మణుడు అగ్నిస్పర్శవంటి స్పర్శ గలది, ఇంద్రజిత్తును చీల్చివేయునది అయిన మరియొక శ్రేష్ఠమైన బాణమును సంధించెను. వీరుడైన లక్ష్మణుడు సంధించిన ఆ బాణము మంచి రెక్కతో, అనువృత్తమైన ఆకారముతో, అందమైన కణుపులతో చక్కగా ఉండెను. బంగారముచేత అలంకరించబడెను. అది శత్రువులను చంపివేయ సమర్థము. నివారింప శక్యముకానిది. సహింపశక్యము కానిది. రాక్షసులకు భయము కలిగించునది. సర్పవిషముతో సమానమైన ఆ బాణము దేవతలచేత పూజింపబడినది. పూర్వము దేవాసురయుద్ధమునందు గొప్ప తేజస్సుగలవాడు, సమర్థుడు, పరాక్రమవంతుడు, ఆకుపచ్చని గుఱ్ఱము కలవాడు అయిన దేవేంద్రుడు ఈ బాణముచేతనే దానవులను జయించెను. లక్ష్మణుడు యుద్ధములలో ఎన్నడూ ఓటమిలేని ఐంద్రాస్త్రమును, శ్రేష్ఠమైన బాణమును, శ్రేష్ఠమైన ధనుస్సునందు సంధించి లాగుచు, తన కార్యమును సాధించు ఈ వాక్యమును పలికెను- "ఓ! బాణమా! రాముడు ధర్మాత్ముడైతే, సత్యసంధుడైతే, పౌరుషములో ఎదిరించగలవాడు ఎవడూ లేనివాడైతే ఈ ఇంద్రజిత్తును చంపుము." వీరుడైన లక్ష్మణుడిట్లు జపించుచు వంకర లేకుండా (ఋజువుగా) వెళ్ళు ఆ బాణమును చెవివరకు లాగి, యుద్ధమునందు, ఇంద్రజిత్తుపై ప్రయోగించెను. శత్రువీరసంహారకుడైన లక్ష్మణుడు అట్లు ఐంద్రాస్త్రమును ప్రయోగించి, శిరఃకవచముతో కూడిన, శోభాయుక్తమైన, ప్రకాశించుచున్న కుండలములు గల శిరస్సును ఇంద్రజిత్తు శరీరమునుండి ఖండించి నేలమీద పడవేసెను.(66-74)

మూపునుండి వేరుచేయబడిన పెద్దదైన ఆ ఇంద్రజిత్తు శిరస్సు రక్తముచేత తడపబడినదై నేలమీద సువర్ణమయము వలె కనబడెను. కవచమును, శిరోరక్షకమగు ఆచ్ఛాదనమును ధరించిన ఆ ఇంద్రజిత్తు చంపబడినవాడై, ధనుస్సు దూరముగా పడిపోగా నేలపై కూలెను. అప్పుడు ఆ వానరులందరు,విభీషణుడూ కూడా అతడు చంపబడుటచే, వృత్రాసురుడు చంపబడినప్పుడు దేవతలవలె సంతోషించుచు ఆనందముతో అరచిరి. పిమ్మట ఆకాశముపై ఉన్న మహాత్ములైన ఋషులు, గంధర్వులు, అప్సరసలు ఇతరభూతములు జయధ్వానములను చేసిరి.(75-78)



అతడు పడిపోవుట చూచి ఆ రాక్షససేన జయముతో ప్రకాశించుచున్న వానరులచేత కొట్టబడుచున్నదై దిక్కులకు పోయెను. వానరులు చంపివేయుచుండగా ఆ రాక్షసులు ఆయుధములు విడచి, సంజ్ఞలేనివారై, పరుగెత్తుచు లంకవైపు వెళ్ళిపోయిరి. భయపడిన ఆ రాక్షసులందరు వందలకొలది కలసి ఆయుధములను, పట్టిశములను, ఖడ్గములను, గండ్రగొడ్డళ్ళను విడచి దిక్కులు పట్టి పారిపోయిరి. వానరులచేత పీడింపబడి కొందరు భయపడినవారై లంకలో ప్రవేశించిరి. కొందరు సముద్రములో పడిపోయిరి. కొందరు పర్వతమును ఆశ్రయించిరి. ఇంద్రజిత్తు చంపబడి యుద్ధభూమిలో పడిఉండుట చూడగానే వేలకొలది రాక్షసులలో ఒక్కడు కూడ కనబడకుండ పోయెను. సూర్యుడు అస్తమించగానే కిరణాలు నిలవనట్లు ఇంద్రజిత్తు మరణించగా ఆ రాక్షసులు దిక్కులుపట్టి పారిపోయిరి. (79-84)

ప్రాణములు పోయి, అవయవములు జారవిడచి పడియున్న ఆ మహాబాహువైన ఇంద్రజిత్తు కిరణములు శాంతించిన సూర్యుడువలె, ఆరిపోయిన అగ్నివలె ఉండెను. ఇంద్రజిత్తు మరణించగానే అప్పుడు లోకమంతా, శత్రువు నశించుటచే చాలవరకు పీడతొలగిపోయి సంతోషించినది. పాపాత్ముడైన ఆ రాక్షసుడు మరణించుటచే సకలమహర్షులు, దేవేంద్రుడు సంతోషించిరి. ఆకాశమునందు దేవతల దుందుభిధ్వని, నాట్యముచేయుచున్న అప్సరసల నాట్యధ్వని, మహాత్ములైన గంధర్వుల గీతధ్వని వినబడెను. క్రూరమైన కర్మలు గల ఆ రాక్షసుడు చంపబడగానే దేవతలు స్తుతించుచు పుష్పవర్షములు కురిపించిరి. అది ఆశ్చర్యకరముగా ఉండెను. సకలలోకములకు భయమును కలిగించిన ఆ ఇంద్రజిత్తు పడిపోయిన వెంటనే ఉదకములు, ఆకాశము కూడా నిర్మలములయ్యెను. దేవతలు, దానవులు సంతోషించి అక్కడికి వచ్చిరి. సంతోషించిన దేవగంధర్వదానవులు కలిసి

"బ్రాహ్మణులు ఎట్టి భయము ఆపదలు లేనివారై సంచరించెదరుగాక." అని పలికిరి.(85-91)

ఎదిరించు బలము లేని ఆ రాక్షసశ్రేష్ఠుడు యుద్ధములో చంపబడుట చూచి వానరసేనానాయకులు సంతోషించి లక్ష్మణుణ్ణి అభినందించిరి. విభీషణుడు, హనుమంతుడు, భల్లూకప్రభువైన జాంబవంతుడు లక్ష్మణుణ్ణి జయము పొందినందుకు అభినందించుచు స్తుతించిరి. తమ లక్ష్యమును సాధించిన వానరులు సింహనాదములు చేయుచు, ఎగురుచు, గర్జించుచు లక్ష్మణుని చుట్టూ చేరి నిలచిరి. అప్పుడు వానరులు తోకలు గట్టిగా కదుపుచు, జబ్బలు చరచుచు "లక్ష్మణుడు జయించుచున్నాడు" అను వాక్యమును పలికిరి. వానరులు సంతోషించిన మనస్సుగలవారై పరస్పరము కౌగిలించుకొని వివిధ గుణములు గల లక్ష్మణునకు సంబంధించిన ఉత్తమకథలను చెప్పుకొనిరి. దేవతలు ఇంద్రజిత్తు చంపబడినాడని విని, తమ ప్రియమిత్రుడైన లక్ష్మణుడు చేసిన, ఎవరూ యుద్ధములో చేయజాలని ఆ పని చూచి, మనస్సులో గొప్ప ఆనందము పొందిరి.(92-97)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబదవ సర్గము సమాప్తము.

తొంబది ఒకటవ సర్గము

లక్ష్మణవిభీషణాదులు రామునివద్దకు వచ్చి ఇంద్రజిద్వధవృత్తాంతము తెలుపుట.

రక్తముచేత తడసిన శరీరము గల శుభలక్షణవంతుడైన లక్ష్మణుడు యుద్ధమునందు ఇంద్రజిత్తును సంహరించి సంతోషము పొందెను. పరాక్రమవంతుడు, మహాతేజఃశాలీ అయిన లక్ష్మణుడు జాంబవంతునకు, హనుమంతునకు ఆ వానరులందరికీ నమస్కరించి, విభీషణ-హనుమంతులను ఊతకై అనుకుని రామసుగ్రీవు లున్న చోటికి వచ్చి రాముణ్ణి సమీపించి అభివాదనము చేసి దేవేంద్రుని సమీపమునందు ఉపేంద్రుడు వలె సోదరుని సమీపమునందు నిలచెను. వీరుడైన లక్ష్మణుడు మహాత్ముడైన రాముణ్ణి సమీపించి, అలసి ఉండుటచే అస్పష్టమైన వాక్కుతో, గొణుగుచున్నట్లు ఘోరమైన ఇంద్రజిత్సంహారమును గూర్చి చెప్పెను. విభీషణుడు సంతోషించుచు, "మహాత్ముడైన లక్ష్మణునిచేత ఇంద్రజిత్తు శిరస్సు ఛేదించబడినది." అని రామునకు తెలిపెను. లక్ష్మణుడు వినయముచేత

అస్పష్టముగా చెప్పిన విషయమును విభీషణుడు స్పష్టముగా చెప్పెను.(1-6)

లక్ష్మణుడు ఇంద్రజిత్తును వధించినట్లు విని రాముడు చాలా సంతోషించి- "లక్ష్మణా! బాగున్నది; సంతోషించినాను. సులభముగా చేయశక్యము కాని పని చేసినావు. ఇంద్రజిత్తు మరణించినాడు గాన ఇక మనకు జయము లభించినదని నిశ్చయించుకొనుము." అని పలికెను. పరాక్రమవంతుడైన రాముడు కీర్తిని వృద్ధిపొందించు లక్ష్మణుణ్ణి శిరస్సుపై మూర్కొని, అతడు సిగ్గుపడుచున్నను స్నేహపూర్వకముగా బలాత్కారముగా, తన తొడపై కూర్చుండపెట్టుకొనెను. గాఢముగా కౌగిలించుకొని, స్నేహపూర్వకముగా మాటిమాటికి అతనినే చూచెను.(7-10)

శత్రువుచే హింసింపబడిన ఆ లక్ష్మణుడు శల్యములచేత పీడింపబడి నిట్టూర్చుచుండెను. నొప్పులచేత బాధపడుచూ, తీవ్రముగా వగర్చుచుండెను. అట్టి లక్ష్మణుణ్ణి, పురుషశ్రేష్ఠుడైన రాముడు శిరస్సుపై మూర్కొని మాటిమాటికీ అతని శరీరమును తడవుచూ ఓదార్చి తొందరపడుచు "వీరుడైన లక్ష్మణా! ఎవ్వరూ చేయజాలని పని చేయగలిగిన నీవు చాలా మంగళకరమైన పనిచేసినావు. ఇప్పుడు పుత్రుడు చంపబడుటచేత యుద్ధములో రావణుడు చంపబడినట్లే అని తలచుచున్నాను. దురాత్ముడైన శత్రువు ఈనాడు చంపబడుటచే నేను విజయవంతుడను అయినాను. నీవు యుద్ధములో క్రూరుడైన రావణుని కుడిభుజమును అదృష్టవశముచే నరికివేసినావు. ఆ రావణునకు ఇంద్రజిత్తే ప్రధానమైన ఆశ్రయము కదా! విభీషణుడూ, హనుమంతుడూ కూడ యుద్ధములో గొప్ప పనిచేసినారు. వీరుడైన ఆ ఇంద్రజిత్తును మూడు అహోరాత్రములు పోరాడి, ఎట్లో చంపివేసినావు. ఇప్పుడు నాకు శత్రువులు లేకుండా చేసినావు. ఎందుచేతననగా కుమారుడు చంపబడినట్లు విని రావణుడు పెద్ద సైన్యముతో బయలుదేరి రాగలడు. పుత్రవధచేత పీడితుడై బయలుదేరి వచ్చుచున్న జయించశక్యము కాని ఆ రావణుణ్ణి గొప్ప బలముచేత అడ్డగించి చంపివేసెదను. లక్ష్మణా! నా సంరక్షకుడవైన నీవు యుద్ధములో ఆ ఇంద్రజిత్తును చంపివేసినావు. అందుచే నాకు సీతగాని, ఈ భూమండలముకాని పొందశక్యము కానిది కాదు." అని అతనిని అభినందించెను.(11-18)

రాముడు లక్ష్మణుణ్ణి ఈ విధముగా ఓదార్చి, కౌగిలించుకొని, సంతోషించుచు, సుషేణుణ్ణి పిలిచి- "గొప్ప బుద్ధిమంతుడు, మిత్రులయందు ప్రేమకలవాడు అయిన ఈ లక్ష్మణుడు శరీరమంతా శల్యములతో నిండి ఉన్నాడు. ఇతడు పూర్తిగా స్వస్థుడగునట్లు చికిత్స చేయుము. వెంటనే లక్ష్మణునికీ, విభీషణునికీ కూడ శల్యములన్నీ తొలగించుము. భల్లూకసైన్యములకూ, వానరసైన్యములకూ చెందిన వృక్షములతో

యుద్ధము చేయు శూరులలో ఎవరు యుద్ధము చేసినారో, శల్యములు గుచ్చుకొని ఉన్నారో, గాయపడి ఉన్నారో వారందరికీ కూడా ప్రయత్నపూర్వకముగా చికిత్స చేసి, వారిని సుఖవంతులను చేయుము." అని ఆజ్ఞాపించెను.(19-22)

మహాత్ముడూ, వానరసేనానాయకుడూ ఐన ఆ సుషేణుడు రాముని ఆజ్ఞప్రకారము లక్ష్మణునకు నాసిక ద్వారా ఉత్తమమైన ఔషధమును ఇచ్చెను. ఆ ఔషధమును వాసన చూడగానే లక్ష్మణుని శరీరములోని శల్యము లన్నీ తొలగిపోయెను. బాధ తగ్గెను. గాయములు మానిపోయెను. అప్పుడు రాముని ఆజ్ఞచేత అతడు విభీషణుడు మొదలైన స్నేహితులకూ, సమస్తవానరనాయకులకూ చికిత్స చేసెను. పిమ్మట లక్ష్మణుడు శల్యములు తొలగిపోయి, అలసట తగ్గి, బాధ ఉపశమించుటచే క్షణకాలములో స్వాస్థ్యమును పొంది సంతోషముతో ఉండెను. అప్పుడు రోగము లేకుండగా లేచిన లక్ష్మణుణ్ణి చూచి రాముడు, సుగ్రీవుడు, విభీషణుడు, పరాక్రమవంతుడైన జాంబవంతుడు అందరు సైనికులూ కూడా చాలసేపు సంతోషపడిరి. రాముడు, లక్ష్మణుడు చేసిన చాల కష్టమైన ఆ పనిని కొనియాడెను. యుద్ధరంగములో ఇంద్రజిత్తు చంపబడినాడని విని సుగ్రీవుడు సంతోషించెను. (23-28)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది ఒకటవ సర్గము సమాప్తము.

తొంబది రెండవ సర్గము

రావణుడు శోకించుట, సుపార్శ్వుడు ఓదార్చుటచే అతడు సీతను చంపుటనుండి విరమించుట.

పిమ్మట రావణుని మంత్రులు ఇంద్రజిత్తు వధను విని, ఆ విషయమును ధ్రువీకరించుకొని తొందరపడుచు రావణునకు- "మహారాజా! విభీషణుని సాహాయ్యముతో లక్ష్మణుడు, యుద్ధములో మేమందరము చూచుచుండగానే మహాతేజఃశాలియైన నీ పుత్రుణ్ణి చంపివేసినాడు. యుద్ధములలో పరాజయము చెందనివాడు, దేవేంద్రుని జయించినవాడు, అయిన శూరుడైన నీ పుత్రుడు శూరుడైన లక్ష్మణునితో యుద్ధమునకు తలబడి, బాణములచేత లక్ష్మణునికి పీడ కలిగించి ఉత్తమలోకములకు వెళ్ళిపోయినాడు." అని తెలిపిరి. యుద్ధములో తన పుత్రుడైన

ఇంద్రజిత్తు చంపబడినాడను ఘోరము, దారుణము, భయంకరము అయిన ఆ వార్త విని అతడు దీర్ఘమైన మూర్ఛ పొందెను.(1-4)

రాక్షసరాజైన ఆ రావణునకు చాలా సేపటికి సంజ్ఞ వచ్చెను. అతని ఇంద్రియములు పనిచేయకుండెను. అతడు పుత్రశోకముచేత వ్యాకులుడై- "అయ్యో! రాక్షససైన్యముఖ్యుడా! నా పుత్రుడా! మహాబలము కలవాడా! ఇంద్రుణ్ణి కూడా జయించిన నీవు ఈనాడు లక్ష్మణుని చేతిలో ఎట్లు ఓడిపోయినావు? కోపము వచ్చినచో నీవు బాణాలచేత కాలపురుషుణ్ణి, యముణ్ణి, మందరపర్వతశిఖరములనూ కూడా భేదించగలవాడవుకదా! యుద్ధములో లక్ష్మణుణ్ణి భేదించుటను గూర్చి చెప్పవలెనా. ఓ! మహాబాహూ! నీకు కూడ మరణము కల్పించిన ఆ యముడు చాల బలవంతు డని నా కిప్పుడు అతనిపై గౌరవము పెరుగుచున్నది. సమస్తదేవతలలో కూడ గొప్ప యోధులకు ఇదే మార్గము. ప్రభువుకొరకై ప్రాణములను విడుచువారు స్వర్గమును పొందును. ఇంద్రజిత్తు మరణించుటను చూచి సమస్త దేవతాగణములు, లోకపాలకులు, మహర్షులు ఇటుపై భయము లేనివారై సుఖముగా నిద్రించగలరు. ఈనాడు ఒక ఇంద్రజిత్తు లేకపోవుటచేత అడవులతో కూడిన ఈ సమస్త భూమి, మూడులోకాలూ కూడ నాకు శూన్యములుగా కనబడుచున్నవి. ఇప్పుడు, పర్వతగుహాలో ఆడ ఏనుగుల ధ్వనిని వలె అంతఃపురములో రాక్షసయువతుల విలాపమును వినగలను. ఓ! శత్రుసంహారకా! యౌవరాజ్యమును, లంకను, రాక్షసులను, తల్లిని, నన్ను, భార్యలను, మమ్ములనందరినీ విడిచి ఎక్కడికి వెళ్లినావు? వీరుడా! నేను మరణించిన పిదప నా ప్రేతకార్యములు నీవు చేయవలెను కదా! నీవు అందుకు విరుద్ధముగా చేసినావు కదా? సుగ్రీవుడు, రామలక్ష్మణులూ ఇంకా జీవించియే ఉండగా, నీవు నా బాధలను తొలగించకుండగానే మమ్ములను విడచి ఎక్కడికి వెళ్ళినావు?" అని విలపించెను.(5-15)

ఈ విధముగా ఆర్తుడై విలపించుచున్న రాక్షసరాజైన ఆ రావణుణ్ణి పుత్రవ్యసనముచేత చాల కోపము ఆవహించెను. సహజముగానే కోపస్వభావము గల అతనిని పుత్రశోకమువలన కలిగిన మనోవ్యథ, ప్రకాశించుచున్న సూర్యుణ్ణి గ్రీష్మమునందు కిరణములవలె, ఇంకను అధికముగా మండిపడు నట్లు చేసినది. లలాటమునందు కలిసిన భ్రుకుటులతో అతడు ప్రళయకాలమునందు మొసళ్ళతో కూడిన తరంగములతో నిండిన సముద్రమువలె ప్రకాశించెను. అతడు కోపముతో ఆవులించగా అతని ముఖమునుండి వృత్రాసురుని ముఖమునుండి వలె స్పష్టముగా మండుచు, ధూమముతో కూడిన అగ్ని బయలుదేరెను. పుత్రుని వధచేత దుఃఖితుడైన

శూరుడైన ఆ రావణుడు క్రోధమునకు వశుడై బుద్ధితో ఆలోచించి సీతను వధించవలెనని నిర్ణయించుకొనెను. స్వభావముచేతనే ఎఱ్ఱగా నున్న, కోపాగ్నిచేత కూడా ఇంకనూ ఎఱ్ఱగా అయిన, చాలా భయంకరములైన అతని నేత్రములు ప్రజ్వలించినవి. సహజముగా భయంకరమై, క్రోధాగ్నితో నిండిన అతని శరీరము కోపించిన రుద్రుని శరీరము వలె సమీపింప శక్యము కానిదయ్యెను. మండుచున్న కాగడాలనుండి మంటతో కూడిన తైలబిందువులు రాలినట్లు కోపించిన అతని నేత్రములనుండి కన్నీటి చుక్కలు రాలినవి. అతడు పండ్లు పటపటా కొరకగా ఆ ధ్వని దానవులు లాగుచున్న పెద్ద యంత్రము ధ్వనివలె వినబడెను. అతడు ప్రళయకాలాగ్నివలె కోపించి ఏ యే దిక్కు చూచెనో ఆ యా దిక్కునందున్న రాక్షసులు అణిగిమణిగి ఉండిపోయిరి. జంగమ స్థావరరూపమైన జగత్తును తినివేయ సంకల్పించిన కోపించిన మృత్యుదేవత వలె ఉన్న ఆ రావణుడు అన్ని దిక్కులవైపు చూచుచుండగా అందరూ రాక్షసులూ కూడా అతనిని సమీపించుటకు భయపడిరి. (16-26)

పిదప రాక్షసరాజైన రావణుడు భయపడియున్న ఆ రాక్షసులను మరల యుద్ధమునందు స్థిరముగా నిలుపవలె నను కోరికతో ఆ రాక్షసుల మధ్య- "నేను వేలకొలది సంవత్సరములు తపస్సుచేసి ఒక్కొక్క తపస్సు ముగిసినప్పుడెల్లా బ్రహ్మదేవుణ్ణి సంతోషపెట్టితిని. ఆ తపస్సు ఫలమీయుటకు ఉపక్రమించుటచేతను, బ్రహ్మదేవుని అనుగ్రహముచేతను నాకు ఎన్నడూ అసురులనుండి గాని, దేవతలనుండి గాని, భయము లేదు. నాకు బ్రహ్మదేవు డిచ్చిన సూర్యునివంటి కాంతి గల కవచమును, దేవతలతోను అసురులతోను జరిగిన యుద్ధములలో వజ్రాయుధముగాని, పిడికిళ్ళుగాని బ్రద్దలుకొట్టలేదు. ఇప్పుడీయుద్ధములో ఆ కవచము ధరించి రథముమీద ఉన్న నన్ను సాక్షాత్తు దేవేంద్రుడైనను ఎవడు ఎదిరించగలడు? పూర్వము దేవాసురయుద్ధములలో సంతోషించిన బ్రహ్మదేవుడు బాణసహితమైన గొప్ప ధనుస్సును నాకిచ్చినాడు కదా; ఇప్పుడు భయంకరమైన ఆ ధనస్సును మహాయుద్ధములో రామలక్ష్మణులను చంపుటకై ఉపయోగించవలెను. దానిని మంగళవాద్యములతో పైకి తీయుడు." అని పలికెను. (27-33)

పుత్రుని వధచేత దుఃఖితుడైన క్రూరుడైన ఆ రావణుడు క్రోధావిష్టుడై, బుద్ధితో ఆలోచించి సీతను చంపవలెనని నిశ్చయించుకొనెను. ఎఱ్ఱని కళ్ళు గల, చాల భయంకరుడు, చూడ ఘోరముగా ఉన్నవాడు, దీనుడు అయిన ఆ రావణుడు దీనమైన కంఠస్వరము గల ఆ రాక్షసుల నందరినీ కలియచూచి- "నా కుమారుడు

వానరులను వంచించుటకై మాయచే దేనినో చంపి ఇది సీత అని అక్కడ చూపినాడు. నాకిష్టమైన అట్టి ఈ పని నేనిపుడు చేసెదను. దుష్టక్షత్రియుడైన రామునిపై ప్రేమగల సీతను చంపివేసెదను." అని మంత్రులతో పలికి అతడు వెంటనే ఖడ్గము గ్రహించెను. పుత్రశోకముచేత చాల వ్యాకులమైన చిత్తముతో కోపావిష్టుడైన ఆ రావణుడు మంచి గుణములు గల నిర్మలమైన ఆకాశము వంటి కాంతి గల ఖడ్గమును తీసికొని వెంటనే సీత ఉన్న ప్రదేశమునకు సభనుండి మహావేగముతో బయలుదేరెను. (34-40)

వెళ్ళుచున్న అతనిని చూచి అతని అనుచరులు సింహనాదము చేసినట్లు అరచిరి. కోపించిన అతనిని చూచి పరస్పరము కౌగిలించుకొని- "ఇప్పుడు ఇతనిని చూడగానే సోదరులైన ఆ రామలక్ష్మణు లిద్దరూ వ్యథ చెందగలరు. కోపించిన ఇతడు నలుగురు లోకపాలులను భయపెట్టినాడు కదా. యుద్ధములలో ఎంతోమంది ఇతరశత్రువులు కూడ వధింపబడినారు. ఈ రావణుడు మూడు లోకాలలో ఉన్న శ్రేష్ఠవస్తువులను తీసికొని వచ్చి అనుభవించుచున్నాడు. పరాక్రమములోను, బలములోను, ఈతనిని పోలినవాడు ఈ భూమిలో లేడు." అనుకొనుచుండిరి. ఆ రాక్షసు లిట్లు అనుకొనుచుండగా రావణుడు క్రోధావేశముతో అశోకవనములో ఉన్న సీత దగ్గరకు చాల తొందరగా వెళ్ళెను. మిక్కిలి కోపించిన ఆ రావణుడు హితమును కోరు స్నేహితులు వారించుచున్నను, కోపించిన అంగారకగ్రహము ఆకాశమునందు రోహిణిని గూర్చి వెళ్ళినట్లుగా శీఘ్రముగా వెళ్ళెను. (41-45)

రాక్షసస్త్రీలచేత రక్షింపబడుచున్న దోషశూన్యురాలైన సీత ఉత్తమమైన ఖడ్గము చేత ధరించి వచ్చుచున్న ఆ రాక్షసుఢ్ణి చూచెను. మిత్రులు అనేకవిధాల నివారించుచున్నను మరలక ఖడ్గము ధరించి వచ్చుచున్న అతనిని చూచి సీత వ్యథ చెందెను. (46,47)

సీత దుఃఖముతో విలపించుచు ఇట్లు అనుకొనెను. - "దుష్టబుద్ధియైన ఈ రావణుడు కోపముతో నావైపు వచ్చుచున్నాడు. దీనిని పట్టి సనాథురాలనైన నన్ను అనాథురాలిని వలె చంపనున్నా డని తోచుచున్నది. భర్తను అనుసరించుటయే నియమముగా పాటించుచున్న నన్ను ఇతడు "నా భార్యవు అగుము" అని అనేకపర్యాయములు ప్రార్థించినాడు. నేను దృఢముగా ప్రత్యాఖ్యానము చేసినాను. నేను తనను చేరకపోవుటచే నిరాశ చెంది కోపావిష్టుడై నన్ను చంపుటకై ఉద్యమించుచున్నాడు. నిశ్చయము. లేదా నేడు యుద్ధములో ఇతడు నామూలాన

నరశ్రేష్ఠులు, సోదరులు అయిన ఆ రామలక్ష్మణులను చంపివేసి ఉండును. ఎందుచేత ననగా చాలామంది రాక్షసులు సంతోషించి, తమకు జరిగిన ప్రియమును గూర్చి అరచుచు భయంకరముగా గొప్ప ధ్వని చేయగా నేను ఇక్కడ విన్నాను. అయ్యో! ఆ రాజపుత్రులకు నావలన వినాశము కలిగినది కదా! ఛీ! లేదా, పాపనిశ్చయము కల క్రూరుడైన ఈ రాక్షసుడు రామలక్ష్మణులను వధింపక, పుత్రశోకముచేత నన్నే వధించుటకు వచ్చుచుండును." అల్పబుద్ధినైన నేను హనుమంతుని మాట వినలేదు. రాముడు బలము చూపి నన్ను జయించుకొనకపోయినను నేను ఆనాడు హనుమంతుని వీపుమీద ఎక్కి వెళ్ళినచో భర్త సమీపము చేరిన నేను నేడు ఈ విధముగా దుఃఖించేదానను కాను. యుద్ధములో తన పుత్రుడు మరణించినాడని వినగానే ఒకే పుత్రుడు గల కౌసల్య గుండె బ్రద్దలైపోవు నని అనుకొనెదను. ఆమె ఏడ్చుచు మహాత్ముడైన రాముని జన్మ, బాల్యము, యౌవనము, అతడు చేసిన ధర్మకృత్యములు, రూపము – వీటిని గూర్చి స్మరించగలదు. పుత్రుడు మరణించుటచే నిరాశురాలై ఆమె శ్రాద్ధమును ఇచ్చి, స్మృతి తప్పినదై, అగ్నిలోనైనా ప్రవేశించును లేదా జలములో దుముకును. గూనుది, పాపనిశ్చయము గలది అయిన మంథర ఛీ! ఎంత చెడ్డది! ఆమె మూలముననే కదా కౌసల్యకు ఇంత శోకము కలుగనున్నది."(48-60)

ఆ విధముగా విలపించుచు దీనురాలైన ఆ సీత చంద్రుడు లేని సమయమునందు అంగారక గ్రహమునకు వశమైన రోహిణి వలె ఉండెను. ఇంతలో ఆ రావణుని అమాత్యుడు, మంచి శీలముగలవాడు, శుద్ధమైన నడవడిక గలవాడు, మేధావి అయిన సుపార్శ్వుడు అట్టి సీతను చూచి, ఏమీ మాటలాడవద్దని ఇతరులైన సచివులు నివారించుచున్నను, రాక్షసప్రభువైన రావణునితో– "రావణా! నీవు సాక్షాత్తు కుబేరుని తమ్ముడవు. అట్టి నీవు క్రోధముచేత ధర్మమును విడచి సీతను చంపవలె నని ఎట్లు కోరుచున్నావు? వీరుడైన రాక్షసరాజా! వేదవిద్యాభ్యాసము నిమిత్తము గ్రహింపబడిన బ్రహ్మచర్యాశ్రమము ముగించుకొని అగ్నిహోత్రము మొదలైన గృహస్థధర్మములను శ్రద్ధగా ఆచరించుచున్న నీవు స్త్రీని చంపవలె నని ఎందుకు కోరుచున్నావు? రాజా! సౌందర్యవంతురాలైన సీతను ఏమీ చేయకుము. మాతో కలసి నీ కోపమును యుద్ధములో ఆ రాముని పైననే చూపుము. ఈనాడే కృష్ణపక్షచతుర్దశి. నేడు యుద్ధసన్నాహము ప్రారంభించి సేనాసమేతుడవై రేపు అమావాస్యనాడు విజయముకొరకు బయలుదేరుము. శూరుడవు, బుద్ధిమంతుడవు, రథికుడవు, ఖడ్గధారివి అయిన నీవు శ్రేష్ఠమైన రథము నెక్కి వెళ్ళి, దశరథపుత్రుడైన రాముణ్ణి

చంపి సీతను పొందగలవు." అని బోధించెను.(61-67)

దురాత్ముడైన రావణుడు స్నేహితుడు చెప్పిన ధర్మసంమతములైన ఆ మాటలు అంగీకరించి ఇంటికి వెళ్ళెను. పిమ్మట వీర్యవంతుడైన ఆ రావణుడు స్నేహితులతో కూడి అక్కడనుండి మరల సభకు వెళ్ళెను.(68)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది రెండవ సర్గము సమాప్తము.

తొంబది మూడవ సర్గము

రాముడు రాక్షససేనను సంహరించుట.

చాల దుఃఖితుడై దీనుడై ఉన్న ఆ రాజు సభలో ప్రవేశించి కోపించిన సింహమువలె నిట్టూర్చుచు సింహాసనము మీద కూర్చుండెను. పుత్రశోకముచేత కృశింపచేయబడిన గొప్ప బలము గల ఆ రావణుడు అంజలి ఘటించి సేనానాయకులతో, "మీరందరూ సమస్తమైన గజసేనతోను, అశ్వసేనతోను కూడినవారై, రథముల సముదాయములచేత, కాలిబంట్లచేత ప్రకాశింపచేయబడినవారై బయలుదేరి వెళ్ళుడు. యుద్ధములో మీరు ఒక్క రాముణ్ణి మాత్రమే చుట్టుముట్టి వర్షాకాలములో మేఘములు వలె, బాణవర్షములను వర్షించుచు అతనిని చంపుడు. మహాయుద్ధములో వాడియైన బాణాలచేత మీరు అతని శరీరమును బ్రద్దలుకొట్టిన పిమ్మట రేపు నేను అందరూ చూచుచుండగా అతనిని చంపివేసెదను." అని పలికెను.(1-5)

రాక్షసులు రావణుని ఈ మాటలు విని, శీఘ్రముగా నడచు రథములతోను, అనేక విధములైన సైన్యములతోను కలిసి బయలుదేరి వెళ్ళి, అంతమొందించు పరిఘలను, పట్టిశములను, బాణములను, ఖడ్గములను, గండ్రగొడ్డళ్ళను వానరులమీదికి విసరిరి. వానరులు కూడ రాక్షసులమీదికి వృక్షములను, పర్వతములను విసరిరి. సూర్యోదయసమయము మొదలు రాక్షసులకు వానరులకు మధ్య భయంకరమైన, వ్యాకులమైన యుద్ధము జరిగెను. వానరులు, రాక్షసులూ పరస్పరము చిత్రములైన గదలతోను, ప్రాసలతోను, ఖడ్గములతోను, గండ్రగొడ్డళ్ళతోను కొట్టుకొనిరి. యుద్ధము ఈ విధముగా ప్రారంభము కాగా ఆశ్చర్యకరమైన చాలా అధికమైన పరాగము వానరుల రక్తస్రావములచేత

శాంతించినది. ఏనుగులు, రథములు ఒడ్డులుగా గలవి, గుఱ్ఱములు మత్స్యములుగా గలవి, ధ్వజములే వృక్షములుగా గలవి అయిన రక్తనదులు ప్రవహించినవి. వాటిలో శరీరము లను తెప్పలు కొట్టుకొనిపోవుచుండెను.(6-11)

అప్పుడు ఆ వానరులందరు రక్తముతో తడిసి పోయిరి. వానరనాయకులు ఎగిరి ఎగిరి, ధ్వజములను , కవచములను, రథములను, అశ్వములను, అనేకవిధములైన ఆయుధములను విరచిరి. వాడియైన దంతాలతోను, గోళ్ళతోను, రాక్షసుల కేశములను, చెవులను, నుదుళ్ళను, ముక్కులను ఖండించివేసిరి. ఫలములతో నిండిన చెట్టుమీదికి పక్షులు వెళ్ళినట్లు ఒక్కొక్క రాక్షసుని మీదికి నూరుగురు చొప్పున వానరశ్రేష్ఠులు పరుగెత్తివెళ్ళిరి. అప్పుడు పర్వతముల వంటి ఆ రాక్షసులు భయంకరములైన వానరులను పెద్ద గదలతోను, ప్రాసలతోను, ఖడ్గములతోను, గండ్రగొడ్డళ్ళతోను కొట్టిరి. రాక్షసులు చంపివేయుచుండగా వానరుల ఆ మహాసేన శరణాగతరక్షకుడైన రాముణ్ణి శరణుజొచ్చినది.(12-17)

గొప్ప తేజస్సు పరాక్రమము గల రాముడు ధనుస్సు గ్రహించి, రాక్షససైన్యములో ప్రవేశించి బాణవర్షమును కురిపించెను. బాణాగ్నిచేత కాల్చివేయుచున్న ఆ రాముణ్ణి భయంకరులైన ఆ రాక్షసులు, ఆకాశమునందు మేఘములు సూర్యుణ్ణి సమీపించజాలనట్లు సమీపింపజాలకపోయిరి. యుద్ధములో వాళ్లు, రాముడు చేసిన, ఇతరు లెవ్వరూ చేయజాలని, భయంకరములైన పనులను మాత్రమే చూడగల్గిరి. చేయబడుచున్నవాటిని, చేయుచున్న రాముణ్ణి మాత్రము చూడజాలకపోయిరి. మహాసైన్యము నూపివేయుచు, మహారథములను ఎగురగొట్టివేయుచున్న ఆ రాముణ్ణి, వనములో ఉన్న వాయువులను వలె ఆ రాక్షసులు చూడజాలకపోయిరి. రాముడు బాణములచేత ఛేదించి, బ్రద్దలుకొట్టి, కాల్చివేసి, ముక్కలు చేసి, ఆయుధములచేత పీడించిన సైన్యమును మాత్రమే వారు చూచుచుండిరి గాని రాముణ్ణి చూడజాలకపోయిరి. ఆ రాక్షసులు తమ శరీరములపై కొట్టుచున్న రాముణ్ణి, ప్రజలు(మానవులు) ఇంద్రియముల ద్వారా భోగ్యవస్తువులను అనుభవించుచున్న జీవాత్మను చూడజాలనట్లుగా చూడలేకపోయిరి.(18-23)

"ఇడిగో రాముడు, ఇక్కడ గజసేనను చంపుచున్నాడు; ఇడిగో మహారథసైన్యములను చంపుచున్నాడు; ఇడిగో అశ్వసైన్యాలను, కాలిబంట్లను చంపుచున్నాడు." అని అనుచు రాక్షసులు భయభ్రాంతులై యుద్ధములో రాముని పోలిక ఉన్నవాళ్ళనే చూచుచు, రాముని సాదృశ్యముండుటచే, అనగా తమ

ఎదుటనున్నవాడు రాముడుగానే కనబడుటచేత, ఒకరినొకరు కోపముతో కొట్టుకొనిరి. మహాత్ముడైన రాముడు గాంధర్వాస్త్రముచేత మోహింపచేయుటచే ఆ రాక్షసులు ఒకమూల తమను కాల్చివేయుచున్నను ఆ రాముణ్ణి కనుగొనలేకపోయిరి. ఆ రాక్షసులకు వేలకొలది రాములు కనబడుచుండిరి. మరుక్షణములో ఒకే రాముడు కనబడుచుండెను. మహాత్ముడైన రాముని ధనుస్సుయొక్క అలాతచక్రము వంటి తిరుగుచున్న బంగారు అగ్రభాగమే కనబడుచుండెను గాని రాముడు కనబడుటలేదు. (చివర



నిప్పు ఉన్న కర్రను వేగముగా గుండ్రముగా త్రిప్పినప్పుడు ఎదురుగా నిలచి చూచువారికి అది గుండ్రని అగ్ని వలె కనబడును. అలాతచక్రమనగా అదే). యుద్ధమునందు మృత్యుచక్రము వలె రాక్షసులను చంపుచున్న రాముడనే చక్రమును ప్రజలు చూచిరి. ఆ రామచక్రమునకు రాముని శరీరమే మధ్యభాగము. ధనుస్సును గట్టిగా లాగుటచే అది రాముని నడుముచుట్టూ తిరిగి మండలముగా ఏర్పడగా దాని మధ్యనున్న రాముని దేహము చక్రనాభి(మధ్యభాగము) వలె ఉండెను. అతని బలమే జ్వాలలు. శరములే దాని ఆకులు. ధనుస్సే చక్రాంతము. నారివలన, తలమువలన కలిగిన ధ్వనియే దాని ఘోషము. తేజస్సు, బుద్ధి అనునవే దాని కాంతి. దివ్యములైన అస్త్రముల గుణములు దాని చివరి భాగములు. అట్టి రామచక్రము ఆ సైన్యమునందు అంతటా తిరిగి రాక్షసులను కాల్చివేసెను. (24-30)

ఒక్క రాముడు ఒక జాము(మూడు గంటలు) కాలములో, ఇష్టానుసారము రూపములు ధరించగలిగిన రాక్షసులకు సంబంధించిన వాయువేగముగల పదివేల రథాలను, మంచి బలముగల పద్దెనిమిదివేల ఏనుగులను, రౌతులతో సహా పద్నాలుగు వేల గుఱ్ఱములను, రెండు లక్షలమంది కాలిబంట్లను అగ్నిశిఖలవంటి బాణములచేత సంహరించెను. గుఱ్ఱములు చంపబడినవి. రథములు ధ్వస్తమైనవి. ధ్వజములు విరుగగొట్టబడినవి. ఇంక చంపగా మిగిలిన రాక్షసులు లంకానగరము వైపు

పరుగెత్తిరి. చంపబడిన ఏనుగులతోను, కాలిబంట్లతోను, గుఱ్ఱములతోను, వ్యాప్తమై రణభూమి కోపించిన మహాత్ముడైన రుద్రుడు విహరించిన ప్రదేశము వలె అయెను. అప్పుడు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు రాముడు చేసిన ఆ పనిని "బాగు బాగు" అని కొనియాడిరి. మహాత్ముడైన రాముడు దగ్గరనే ఉన్న సుగ్రీవునితోను, విభీషణునితోను, హనుమంతునితోను, జాంబవంతునితోను, వానరశ్రేష్ఠులైన మైందద్వివిదులతోను - "ఇట్టి దివ్యమైన అస్త్రప్రయోగశక్తి నాకూ, ఈశ్వరునికి మాత్రమే ఉన్నది." అనెను. ఇంద్రునితో సమానుడు, మహాత్ముడు, అస్త్రములందుగాని, శస్త్రములందుగాని అలసట లేనివాడు రావణ సైన్యమును చంపివేసిన వాడు అయిన ఆ రాముణ్ణి దేవతాగణములన్నీ సంతోషముతో స్తుతించెను. (31-39)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది మూడవ సర్గము సమాప్తము.

తొంబది నాలుగవ సర్గము

రాక్షసస్త్రీలు విలపించుట.

అలసట చెందకుండా పనులు చేయు రాముడు, రావణుడు పంపిన వేలకొలది ఏనుగులను, వేలకొలది గుఱ్ఱములను, ఆ ఏనుగుల మీద గుఱ్ఱాల మీదా ఉన్న యోధులను, ధ్వజములు గల, అగ్నితుల్యమైన వర్ణములు గల, వేలకొలది రథములను, గదలతోను, పరిఘలతోను, యుద్ధముచేయువారు, బంగారు ధ్వజములచేత చిత్రవర్ణము గలవారు, శూరులు, స్వేచ్ఛానుసారము రూపములు ధరించగలవారు అయిన వేలకొలది రాక్షసులను శుద్ధమైన బంగారముచే అలంకరించబడిన, ప్రజ్వలించుచున్న బాణాలచేత సంహరించెను. చంపగా మిగిలిన రాక్షసులు రాక్షసవధను చూచి, విని, భయపడినవారై, తమ భార్యాదులను చేరి దీనులై, చింతాక్రాంతులై ఏడ్చిరి. భర్తలు మరణించినవారు, పుత్రులు పోయినవారు, బంధువులను కోల్పోయినవారు అయిన రాక్షసస్త్రీలు అందరూ ఒకచోట కలసి దుఃఖార్తలై విలపించిరి. (1-5)

"వికృతమైన రూపము, లోతైన పొట్టగల ఆ ముసలి శూర్పణఖ మన్మథునితో సమానమైన రూపముగల రాముని దగ్గరకు వనములో ఎట్లు వెళ్ళినదో! అందరిచేత నిందింపదగిన, కురూపిణియైన ఆ శూర్పణఖ సుకుమారుడు, మహాబలశాలి,

సకలప్రాణుల హితమునందు ఆసక్తి కలవాడు అయిన ఆ రాముణ్ణి చూచి ఎట్లు కామవంతురాలైనదో! ఏ మంచిగుణాలు లేని చెడ్డ ముఖము గల ఆ రాక్షసి సద్గుణవంతుడు, గొప్ప తేజస్సు గలవాడు, అందమైన ముఖము గలవాడు అయిన రాముణ్ణి ఎట్లు కోరినదో కదా! ఒడలు నిండా ముడతలతో, తెల్లని జుట్టుతో చెడ్డ ఆకారము గల ఆ శూర్పణఖ మన అందరి దురదృష్టముచేతనూ, రాక్షసులు, ఖరదూషణులు మరణించుటకూ ఆ విధముగా చేయకూడని, హాస్యాస్పదమైన, సర్వలోకనింద్యమైన రామధర్షణము చేసినది.(6-10)

రావణుడు ఆ శూర్పణఖమూలాన ఇంత గొప్పవైరము పెట్టుకొన్నాడు. అతడు తన చావుకొరకే సీతను తెచ్చినాడు. రావణుడు జనకాత్మజయైన సీతను పొందజాలడు కాని బలవంతుడైన రామునితో, లేనిపోని వైరము పెట్టుకొన్నాడు. సీతను కోరుటచే ఒక్క రామునిచేత చంపబడిన విరాధుణ్ణి చూచినచో ఆ నిదర్శనము చాలదా? జనస్థానములో రాముడు అగ్నిజ్వాలల వంటి బాణాలతో, భయంకరమైన పనులుచేయు పదునాలుగువేలమంది రాక్షసులను చంపివేసినాడు. యుద్ధములో ఖరుడు, దూషణుడు త్రిశిరస్సు, సూర్యునివంటి బాణాలచేత చంపబడినారు. ఆ నిదర్శనమే చాలును. యోజనప్రమాణములైన బాహువులు గలవాడు, రక్తము ఆహారముగా గలవాడు అయిన, క్రోధముతో అరచుచున్న కబంధుడు చంపబడినాడు. ఈ నిదర్శనము చాలును. మహాబలశాలీ, ఇంద్రుని కుమారుడూ, మేఘమువంటి పెద్ద శరీరముగలవాడు అయిన వాలిని రాముడు చంపినాడు. ఆ నిదర్శనమే చాలును. మనోరథము భగ్నము కాగా దీనుడై ఋష్యమూకపర్వతముమీద నివసించుచున్న సుగ్రీవునకు రాజ్యము ఇవ్వబడినది. ఈ నిదర్శనము చాలును.(11-18)

విభీషణుడు చెప్పిన మాట ధర్మార్థసహితము. రాక్షసు లందరికీ హితము. కాని అజ్ఞానముచేత రావణుడు దానిని వినుటలేదు. రావణుడు విభీషణుడు చెప్పిన మాట విన్నచో ఈ లంక దుఃఖపీడితమై, శ్మశానమువలె ఉండెడిది కాదు. గొప్ప బలము గల కుంభకర్ణుణ్ణి రాముడు చంపివేసినట్లు, ఎదిరింపశక్యముకాని అతికాయుణ్ణి, ప్రియపుత్రుడైన ఇంద్రజిత్తునూ లక్ష్మణుడు చంపివేసినట్లు విని కూడా రావణుడు తెలిసికొనజాలకున్నాడు!(19-21)

యుద్ధములో నా పుత్రుడు చనిపోయినాడు; నాసోదరుడు చనిపోయినాడు; నాభర్త చనిపోయినాడు." అని అనుచు రాక్షసస్త్రీల ఏడ్పు ప్రతి ఇంటిలోనూ వినబడుచుండెను. "శూరుడైన రాముడు యుద్ధములో వందలకొలది, వేలకొలది,

రథాలను(రథికులను), గుఱ్ఱములను , ఏనుగులను, చంపినాడు. కాలిబంటులను కూడా చంపినాడు. రుద్రుడో, విష్ణువో, నూరు యజ్ఞములు చేసిన దేవేంద్రుడో, లేదా సాక్షాత్తు యముడో రాముని రూపముతో వచ్చి మనలను చంపుచున్నాడు. రాముడు మహావీరుల నందరినీ చంపివేయుటచేత మనము జీవితమునందు ఆశలేని వాళ్ళమై, భయమునకు అంతము కానక, అనాథలమై విలపించుచున్నాము. బ్రహ్మదేవునివలన గొప్ప వరములు పొందిన శూరుడైన రావణుడు రామునివలన కలిగిన చాల ఘోరమైన ఈ భయమును తెలిసికొనుటలేదు. రామునితో యుద్ధానికి తలపడిన ఆ రావణుణ్ణి దేవతలుగాని, గంధర్వులు గాని, పిశాచులు గాని, రాక్షసులు గాని రక్షింపజాలరు. రావణుడు ఆ యా వీరులు యుద్ధానికి బయలుదేరినప్పుడు ఆ ప్రతీయుద్ధమునందూ అపశకునములు కనబడుచున్నవి. అవి రాముడు రావణుణ్ణి వధించగలడని చెప్పుచున్నవి కదా?(22-28)

తపస్సుకు సంతోషించిన బ్రహ్మదేవుడు రావణునకు దేవదానవరాక్షసులనుండి అభయము ఇచ్చినాడు. కాని ఇతడు మనుష్యులనుండి అభయమును కోరలేదు. రాక్షసులకు రావణునకూ కూడా ప్రాణాంతకమైన ఆ మనుష్యునివలన కలిగే భయమే ఇప్పుడు వచ్చినది. సందేహము లేదు. వరములు పొందుటచేత అధికబలవంతుడైన రావణుడు పీడించగా దేవతలు అధికములైన తపస్సుల చేత బ్రహ్మదేవుణ్ణి సంతోషపెట్టిరి. మహాత్ముడైన బ్రహ్మదేవుడు సంతోషించి దేవతల హితముకొరకై వారందరితో– "నేడు మొదలు సమస్తమైన దానవులూ, రాక్షసులూ కూడ ఎల్లపుడు భయపడుచూ, మూడు లోకములలో సర్వదా తిరుగుచుందురు. ఇంద్రుడు మొదలైన దేవతలందరూ కలసి వృషభధ్వజుడు, త్రిపురసంహారకుడు అయిన పరమేశ్వరుణ్ణి అనుగ్రహింపచేసికొనినారు. ఈశ్వరుడు ప్రసన్నుడై దేవతలతో – "మీ హితముకొరకై, రాక్షసుల వినాశమునకు హేతువైన ఒక స్త్రీ(సీత) పుట్టగలదు." అన్నాడు. దేవతలు ప్రయోగించిన రాక్షససంహారకురాలైన ఈ సీత, పూర్వము ఆకలి దానవులను భక్షించివేసినట్లు రావణునితో సహా మనలనందరినీ భక్షించివేయగలదు.(29-36)

వినయము లేనివాడు, దుర్మతీ అయిన రావణుని చెడు నడవడికకు ఫలితముగా శోకమును కలిగించు ఈ ఘోరమైన వినాశనము ప్రాప్తించినది. ప్రళయకాలమునందు మృత్యువువలె రాముడు మనలను ఆక్రమించి ఉన్నాడు. ఇప్పుడు మనకీ లోకములో రక్షణము ఇచ్చువా డెవ్వడూ కనబడుటలేదు. అరణ్యములో దావాగ్ని చుట్టుముట్టిన ఆడ ఏనుగులకు వలె, గొప్ప ఆపదలో ఉన్న మనకు రక్షణము ఇచ్చువాడు ఎవడూ

లేదు. మహాత్ముడైన విభీషణుడు ఎవనివలన ఇట్టి భయము కలిగినదో అతనినే శరణుజొచ్చి సమయానుకూలముగా ప్రవర్తించినాడు." రాక్షసస్త్రీలు అందరూ పరస్పరము బాహువులతో కౌగిలించుకొని, దుఃఖితలై మిక్కిలి భయముచేత పీడింపబడినవారై, ఈవిధముగా, బిగ్గరగా ఏడ్చిరి.(37-41)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది నాలుగవ సర్గము సమాప్తము.

తొంబది ఐదవ సర్గము

రావణుడు తన అమాత్యులతో యుద్ధరంగమును చేరి పరాక్రమమును చూపుట.

రావణుడు లంకలోని ప్రతిగృహములోను దుఃఖించుచున్న రాక్షసస్త్రీల దీనమైన శబ్దమును, ఏడ్పును వినెను. క్షణకాలము ఆలోచించి, దీర్ఘముగా నిట్టూర్పు విడిచి, చాల కోపావిష్టుడై చూచువారికి భయము కలిగించుచుండెను. అతడు దంతాలతో పెదవులు కొరుకుచుండెను. అతని నేత్రములు క్రోధముచేత ఎఱ్ఱబడెను. విజృంభించిన ప్రళయకాలాగ్నివలె రాక్షసులకు కూడా చూడ శక్యము కానివాడై ఉండెను. కోపముచేత మాటలు తడబడుచున్న ఆ రావణుడు నేత్రముతో కాల్చివేయుచున్నాడా అన్నట్లు చూచుచు, సమీపమునందున్న మహోదర-మహాపార్శ్వ-విరూపాక్షులతో- "వెంటనే బయలుదేరవలెను అని నా ఆజ్ఞగా సైన్యములతో చెప్పుడు." అని పలికెను. ఆ రాక్షసులు రావణుని మాటలు విని భయపడుచు, రాజాజ్ఞానుసారము, సావధానచిత్తులైన ఆ రాక్షసులను ప్రేరేపించిరి. చూచుటకు భయంకరులుగా ఉండు ఆ రాక్షసులందరూ "అట్లే వెళ్ళెదము" అని పలికి స్వస్త్యయనము చేసికొని యుద్ధాభిముఖులై వెళ్ళిరి. మహారథులైన ఆ రాక్షసులందరూ న్యాయానుసారము రావణుని పూజించి, ప్రభువునకు విజయమును కోరుచు, దోసిళ్ళు కట్టి నిలచిరి.(1-8)

పిమ్మట క్రోధముతో నిండిన రావణుడు నవ్వుచు ఆ రాక్షసులతోను, మహోదరమహాపార్శ్వవిరూపాక్షులతోను- "నేడు ధనుస్సునుండి విడచిన, ప్రళయకాలసూర్యునితో సమానములైన బాణాలతో రామలక్ష్మణులను యమలోకమునకు పంపెదను. ఇప్పుడు శత్రువులను చంపి నేను ఖరుడు, కుంభకర్ణుడు, ప్రహస్తుడు, ఇంద్రజిత్తు చంపబడినందుకు ప్రతిక్రియ చేసెదను. నా

బాణము లనే మేఘములు కప్పివేయుటచేత ఆకాశముకాని, దిక్కులు కాని, ద్యులోకముకాని, సాగరములు గాని స్పష్టముగా కనిపించవు. ఇప్పుడు ధనుస్సుచేత, రెక్కలు గల బాణములచేత వేరువేరుగా ఉన్న వానరనాయకుల గుంపులను చంపివేసెదను. వాయువేగము గల రథమునెక్కి ధనుస్సు అనే సముద్రమునుండి పుట్టిన బాణతరంగాలచేత ఈనాడు వానరసైన్యమును నశింపచేసెదను. ఇప్పుడు పద్మముల కింజల్కముల వంటి కాంతి గల వానరుల వికసించిన పద్మములవంటి ముఖములు గల, గుంపులనే చెరువులను నేను ఏనుగువలె కలిచివేసెదను. నేడు యుద్ధములో వానరసేనానాయకులు బాణములతో కూడిన ముఖాలను, కాడలతో ఉన్న పద్మాలను వలె పరచి భూమిని అలంకరించగలరు. నేను యుద్ధమునందు ఒక్కొక్క బాణముతో, గుంపులతో తీవ్రముగా ఉన్న, వృక్షాలతో యుద్ధము చేయు వానరులను వందేసి మందిని బ్రద్దలుకొట్టెదను. నేడు శత్రువును చంపి, సోదరులను కుమారులను కోల్పోయిన రాక్షసుల కన్నీళ్లు తుడిచెదను. యుద్ధములో వానరులను నా బాణములచేత చీల్చివేసి, చంపి, వారి దేహములను పరచుటచేత భూమి పై భాగము కనబడకుండ చేసెదను. నా బాణములచేత చంపబడిన శత్రువుల మాంసములచేత ఈనాడు కాకులకు, గ్రద్దలకు, మాంసమును తిను ఇతర జంతువులకు తృప్తి కలిగించెదను. శీఘ్రముగా నా రథము ఏర్పాటు చేయుడు. వెంటనే నా ధనుస్సు తీసికొని రండు. మిగిలిన రాక్షసులందరూ నాతో యుద్ధానికి బయలుదేరుడు." అని పలికెను.(9-21)

రావణుని మాటలు విని మహాపార్శ్వుడు అక్కడ ఉన్న సేనానాయకులను - "సైన్యమును శీఘ్రముగా సిద్ధముచేయుడు." అని ఆజ్ఞాపించెను. శీఘ్రపరాక్రమవంతులైన సేనానాయకులు తొందరపడుచు, ప్రతి ఇంటికీ వెళ్ళి రాక్షసులను యుద్ధానికి ప్రేరేపించుచు లంకాపట్టణమంతా తిరిగిరి. పిమ్మట చూచుటకు భయంకరులుగా ఉన్న, భయంకరములైన ముఖములు గల రాక్షసులు, గర్జించుచు, కత్తులు, పట్టిశములు, శూలములు, గదలు, ముసలములు నాగళ్ళు, వాడియైన అంచులు గల శక్తులు, పెద్ద కూటములు, ముద్గరములు, కఱ్ఱలు, అనేకవిధములైన చక్రములు, వాడియైన గండ్రగొడ్డళ్ళు, భిందిపాలములు, శతఘ్నులు, మొదలైన అనేక విధములైన శ్రేష్ఠములైన ఆయుధములు హస్తములతో ధరించి ముహూర్తకాలములో బయలుదేరిరి.(22-26)

పిమ్మట సేనానాయకుడు తొందరపడుచు రావణాజ్ఞ ప్రకారము సారథితో కూడిన ఎనిమిది గుఱ్ఱములు కట్టిన, శీఘ్రముగా నడచు రథమును తెచ్చెను.

అప్పుడు భయంకరుడైన రావణుడు తన తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ రథమును ఎక్కి, చాలామంది రాక్షసులతో కూడి బలాధిక్యముచేత భూమిని చీల్చివేయుచున్నాడా అన్నట్లు వెంటనే బయలుదేరెను. మృదంగ-పటహ-శంఖధ్వనులతోను, రాక్షసుల కలకలములతోను కలిసిన గొప్ప వాద్యధ్వని ఆ యా ప్రాంతములనుండి బయలుదేరెను. "సీతను అపహరించినవాడు, చెడ్డ చరిత్ర కలవాడు, బ్రాహ్మణులను చంపినవాడు, దేవతల శత్రువూ అయిన రావణుడు, ఛత్రచామరములు ధరించి రామునితో యుద్ధముచేయుటకు వచ్చినాడు." అని కోలాహలధ్వని వినబడెను. ఆ పెద్ద ధ్వనికి భూమి కదలిపోయెను. వానరులు హటాత్తుగా ఆ శబ్దము వినగానే భయపడి పారిపోయిరి.(27-32)

మహాతేజఃశాలియైన రావణుడు, మంత్రులతో కూడినవాడై విజయమును ఉద్దేశించి, జయమునకు (జయస్థానమైన యుద్ధమునకు) వచ్చెను. రావణుని ఆజ్ఞచేత మహాపార్శ్వమహోదరులు, ఎదిరింపశక్యముకాని విరూపాక్షుడు రథములను ఎక్కిరి. ఆ రాక్షసులు ఉత్సాహముతో ధ్వనిచేయుచు, భూమిని బ్రద్దలుకొట్టుచున్నారా అన్నట్లు భయంకరముగా అరచుచు, జయాభిలాషతో బయలుదేరిరి. రావణుడు రాక్షససైన్యములతో కూడి, ధనుస్సును సిద్ధముగా ఉంచుకొని బయలుదేరెను. రావణుడు రథమునెక్కి తొందరగా గుఱ్ఱములు తోలించి, రామలక్ష్మణులున్న ద్వారమునుండి బయలుదేరెను.(33-37)

అప్పుడు సూర్యుని కాంతి తగ్గెను. దిక్కులు చీకటిచేత ఆవరించబడెను. భయంకరములైన పక్షులు అరచెను. భూమి అదిరెను. మేఘములు రక్తమును కురిసెను. గుఱ్ఱములు తొట్రుపడినవి. ధ్వజము చివర గ్రద్ధ వ్రాలెను. అమంగళకరములైన నక్కలు కూసినవి. రావణుని ఎడమ కన్ను అదిరెను. ఎడమచెయ్యి కదలెను. ముఖము పాలిపోయెను. కంఠస్వరము కొంచెము తగ్గెను. రావణుడు యుద్ధానికై బయలుదేరి వెళ్ళుచున్న సమయమునందు అతనికి యుద్ధమునందు వినాశమును సూచించు శకునములు కనబడెను. ఆకాశమునుండి పిడుగువంటి ధ్వని గల ఉల్క పడెను. అమంగళకరములైన గ్రద్దలు కాకులతో కలిసి అరచినవి.(38-42)

రావణుడు కనబడుచున్న ఆ అపశకునములను మోహముచేత లెక్కచేయక, కాలముచేత ప్రేరితుడై చావుకొరకే బయలుదేరి వెళ్లెను. రాక్షసుల రథధ్వని వినగానే వానరుల సేన కూడా యుద్ధానికి సంనద్ధమాయెను. కోపముతో ఒకరినొకరు

పిలుచుకొనుచున్న, జయాభిలాషులైన ఆ వానరరాక్షసుల మధ్య తుములమైన యుద్ధము జరిగెను. కోపించిన రావణుడు బంగారు అలంకారములు గల బాణాలను ప్రయోగించి, వానరసైన్యముల అత్యధికమైన హింస చేసెను. బాణములచేత కొందరి శిరస్సులు ఛేదించెను. కొందరి హృదయములు బ్రద్దలుకొట్టెను. కొందరి చెవులు తెగగొట్టెను. రావణుడు కొందరు వానరులను ఉచ్ఛ్వాసము లేకుండా చంపివేసెను. కొందరిని పార్శ్వములందు చీల్చివేసెను. కొందరి శిరస్సులు బ్రద్దలు కొట్టెను. కొందరిని నేత్రహీనులను చేసెను. రావణుడు క్రోధముచేత తిరిగిపోవుచున్న నేత్రములతో యుద్ధములో రథముమీద ఏ యే వైపులకు వెళ్ళెనో ఆ యా వైపులందున్న వానరసేనానాయకులు వాని ముందు నిలువజాలకపోయిరి. (43-49)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది ఐదవ సర్గము సమాప్తము.

తొంబది ఆరవ సర్గము

సుగ్రీవుడు రాక్షససేనను సంహరించి విరూపాక్షుణ్ణి వధించుట.

రావణుడు ఆ విధముగా బాణములచేత ఛేదించిన ఆ వానరుల అవయవములచేత అక్కడ భూమి కప్పివేయబడెను. వానరులు రావణునినుండి వచ్చుచున్న సహింపశక్యముకాని ఆ బాణపాతములను, అగ్నిని మిడతలువలె, సహింపజాలకపోయిరి. వాడియైన బాణాలచేత పీడింపబడుచున్న ఆ వానరులు, అగ్నిజ్వాలలచే చుట్టుముట్టి దహింపబడుచున్న ఏనుగులు వలె అరుచుచు పారిపోయిరి. రావణుడు బాణములచేత వానరుల సైన్యములను వాయువు మహామేఘములను వలె ఎగురగొట్టు చుండెను. రావణుడు అనేకవానరులను సంహరించి పిమ్మట రణరంగమునందు శీఘ్రముగా రాముని వైపు వెళ్ళెను. (1-5)

యుద్ధములో పరాజితులై పారిపోవుచున్న ఆ వానరులను చూచి సుగ్రీవుడు తానున్న గుల్మములను(సేనావిభాగమును) రక్షించుటకై సుషేణుణ్ణి అక్కడ నిలిపి శీఘ్రముగా యుద్ధము చేయుటకు నిర్ణయించుకొనెను. అతడు వృక్షమును ఆయుధముగా ధరించి శత్రువులకు ఎదురుగా బయలుదేరెను. ఆ వానరనాయకు లందరూ కూడా పెద్ద పర్వతములను అనేకవిధములైన వృక్షములను ధరించి ఆ సుగ్రీవుని ప్రక్కలయందును, వెనుక భాగమునందును అనుసరించి వెళ్ళిరి. సుగ్రీవుడు

పెద్ద స్వరముతో, యుద్ధమునందు గర్జించుచు అనేకరాక్షసులను కుమ్మివేయుచు రాక్షసశ్రేష్ఠులను మథించివేసెను. పెద్ద శరీరము గల సుగ్రీవుడు ప్రళయకాలమునందు వాయువు పెరిగిన చెట్లను పడగొట్టినట్లు రాక్షసులను పడగొట్టెను. మేఘము అరణ్యములో ఉన్న పక్షులమీద వడగళ్ళు కురిపించినట్లు రాక్షససైన్యములపై శిలావర్షమును కురిపించెను. సుగ్రీవుడు చేసిన ఆ శిలావర్షముచేత రాక్షసులు తలలు ఊడిపోయి ఇటుఅటు చిమ్మివేసిన పర్వతముల వలె పడిపోయిరి.(6-12)

సుగ్రీవునిచేత ఓడింపబడి అరచుచు నేలపై పడిపోవుచున్న రాక్షసులు అన్నివైపులా తగ్గిపోవుచుండగా, ఎదిరింప శక్యముకాని విరూపాక్షుడు ధనుస్సు ధరించి తనపేరు చెప్పుచు, రథమునుండి క్రిందికి దుమికి ఏనుగుమూపుపై ఎక్కెను. విరూపాక్షుడు ఏనుగును ఎక్కి భయంకరముగా ధ్వనిచేయుచు వానరులమీదికి శీఘ్రముగా వెళ్ళెను. అతడు సేనాగ్రమునందుండి సుగ్రీవునిమీద భయంకరములైన బాణాలను ప్రయోగించెను. దిగులు చెందిన రాక్షసులకు ఉత్సాహము కల్పించి వాళ్ళు నిలద్రొక్కుకొనునట్లు చేసెను. ఆ రాక్షసుడు వాడియైన బాణములతో కొట్టగా సుగ్రీవుడు అరచెను. చాల కోపించి అతనిని చంపవలెనని నిశ్చయించుకొనెను. పిమ్మట శూరుడైన ఆ సుగ్రీవుడు చెట్టును ఎత్తి ఎగిరి వెళ్ళి వాని మహాగజమును ముఖమునందు కొట్టెను. సుగ్రీవుని చేతిలో దెబ్బ తిన్న ఆ మహాగజము ధనుస్సంత దూరము(రెండు గజముల దూరము) తూలి క్రిందపడి అరచెను.(13-19)

పరాక్రమవంతుడైన ఆ రాక్షసుడు చంపబడిన ఆ ఏనుగునుండి దిగి, అభిముఖుడై, శత్రువైన ఆ సుగ్రీవునకు ఎదురుగా వెళ్ళి ఎద్దు చర్మతో చేసిన డాలును ఖడ్గమును గ్రహించి, చురుకుగా పరాక్రమము చూపుచు, నిలచి ఉన్న సుగ్రీవుణ్ణి భయపెట్టుచున్నాడా అన్నట్లు అతని మీదికి వెళ్లెను. సుగ్రీవుడు ఆ విరూపాక్షునిపై కోపించి, మేఘమువంటి విశాలమైన శిలను గ్రహించి అతనిమీదికి విసిరెను. అప్పుడు, మంచి పరాక్రమము గల ఆ రాక్షసశ్రేష్ఠుడు మీదికి వచ్చుచున్న ఆ శిలను చూచి, ప్రక్కకు తొలగి, ఖడ్గముతో సుగ్రీవుని కొట్టెను. బలవంతుడైన ఆ రాక్షసుడు ఖడ్గప్రహారము చేయగా సుగ్రీవుడు ముహూర్తకాలముపాటు, భూమి మీద సంజ్ఞలేనివాడు వలె అయ్యెను. అప్పుడా సుగ్రీవుడు హటాత్తుగా, మహాయుద్ధమునందు పైకి ఎగిరి, పిడికిలి బిగించి వేగముగా ఆ రాక్షసుని వక్షఃస్థలముమీద కొట్టెను. ఆ పిడికిలి దెబ్బ తిని కోపించిన, విరూపాక్షుడు సేనాగ్రభాగమునందు ఆ ఖడ్గముతో కొట్టి సుగ్రీవుని కవచమును పడగొట్టెను. ఆ దెబ్బ తిన్న సుగ్రీవుడు పాదాలు తొట్రుపడి పడిపోయెను. సుగ్రీవుడు క్రిందపడిలేచి భయంకరధ్వని చేయుచు,

పిడుగువంటి అరచేతి దెబ్బను అతనిపై ప్రయోగించెను. ఆ రాక్షసుడు సుగ్రీవుడు చేసిన ఆ అరచేతి దెబ్బను నేర్పుతో తప్పించుకొని అతని వక్షఃస్థలముమీద పిడికిలితో కొట్టెను. వానరరాజైన సుగ్రీవుడు తన దెబ్బను ఆ రాక్షసుడు తప్పించుకొనుట చూచి చాల కోపించెను. (20-29)

సుగ్రీవుడు, ఆ విరూపాక్షుడు కొంచెము అసావధానముగా ఉన్న అవకాశము చూచి అతని కణతమీద మరొక పెద్ద అరచేతి దెబ్బ కొట్టెను. విరూపాక్షుడు మహేంద్రుని వజ్రాయుధము వంటి ఆ అరచేతి దెబ్బ తిని, జలపాతమార్గమునుండి జలమువలె నాసికారంధ్రములనుండి రక్తము కార్చుచు, రక్తముచేత తడిసి నేలపై పడెను. అక్కడ ఉన్న వాళ్ళందరూ, కోపముచేత తిరిగిపోయిన నేత్రముతో నురుగు కక్కుచు, రక్తములో మునిగి, ఎక్కువ వికృతములైన నేత్రములు కలవాడుగా అయిన ఆ విరూపాక్షుణ్ణి చూచిరి. ఆ విరూపాక్షుడు కాళ్ళూచేతులూ కొట్టుకొనుచు ప్రక్కలకు ఒత్తిగిలుచు, జాలి గొల్పునట్లు అరచుచు రక్తముతో తడిసి ఉండెను. అట్టివానిని వానరులు చూచిరి. (30-34)

బలము గలవి, భయంకరములూ అయిన ఆ వానరరాక్షస సేనాసముద్రములు యుద్ధములో ఆ విధముగ కలిసి సేతువును తెగగొట్టిన రెండు మహాసముద్రముల వలె ధ్వని చేసినవి. మహాబలుడైన ఆ విరూపాక్షుడు సుగ్రీవునిచేత చంపబడుట చూచిన ఆ వానరరాక్షససైన్యము విజృంభించి ప్రవహించుచున్న గంగానది వలె ఉండెను. (35, 36)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది ఆరవ సర్గము సమాప్తము.

తొంబది ఏడవ సర్గము

సుగ్రీవుడు మహోదరుని వధించుట.

ఆ మహాయుద్ధమునందు సైన్యములు రెండూ పరస్పరము చంపుకొనుచు, తీవ్రగ్రీష్మమునందు రెండు సరస్సుల వలె శీఘ్రముగా, బాగా క్షీణించిపోయినవి. రాక్షసప్రభువైన రావణుడు తన సైన్యము చంపబడుటచేతను, విరూపాక్షుని వధచేతను, రెట్టింపు కోపమును పొందెను. యుద్ధములో వానరులచేత చంపబడి క్షీణించిన తన సైన్యమును, దైవవైపరీత్యమును చూచి రావణునకు వ్యథ కలిగెను. దగ్గరనే ఉన్న, శత్రుసంహారకుడైన మహోదరునితో - "ఓ! మహాబాహూ! ఇప్పుడు నా జయాశ

అంతా నీమీద ఉన్నది. వీరుడా! శత్రుసైన్యమును చంపుము. ఇప్పుడు నీ పరాక్రమమును చూపుము. ఇది ప్రభువు పెట్టిన అన్నానికి ఋణము తీర్చుకొను సమయము. బాగుగా యుద్ధము చేయుము." అని పలికెను. (1-5)

రావణుని మాటలు విని రాక్షసనాయకుడైన మహోదరుడు "అట్లే చేసెదను" అని పలికి, మిడత అగ్నిలో ప్రవేశించినట్లు ఆ శత్రుసైన్యములో ప్రవేశించెను. మహాబలశాలీ, తేజోవంతుడూ అయిన అతడు ప్రభువు మాటలచేతను, తన పరాక్రమముచేతను ప్రేరితుడై వానరసంహారము చేసెను. గొప్ప బలము గల వానరులు కూడా విశాలములైన శిలలు ధరించి, భయంకరమైన శత్రుసైన్యములో ప్రవేశించి ఆ రాక్షసులనందరినీ చంపిరి. ఆ మహాయుద్ధములో మహోదరుడు కోపించి, బంగారు అలంకారములు గల బాణాలచేత వానరుల చేతులు, పాదాలు, తొడలు ఛేదించెను. అప్పుడు రాక్షసులచేత మిక్కిలి పీడింపబడిన వానరులలో కొందరు పదిదిక్కులకు పారిపోయిరి. మరికొందరు సుగ్రీవుణ్ణి ఆశ్రయించిరి. (6-10)

సుగ్రీవుడు యుద్ధమునందు ఓడిపోయిన వానరమహాసైన్యమును చూచి దగ్గర నున్న మహోదరుని మీదికి శీఘ్రముగా వెళ్ళెను. గొప్ప తేజస్సు గల సుగ్రీవుడు విశాలము, భయంకరము, పర్వతసమానము అయిన శిలను గ్రహించి ఆ రాక్షసుణ్ణి చంపుటకై విసరెను. మహోదరుడు హటాత్తుగా వచ్చి మీదపడుచున్న ఎదిరింప శక్యముకాని ఆ శిలను చూచి, భయపడక దానిని బాణాలతో ఛేదించెను. ఆ రాక్షసుని చేత వేయిముక్కలుగా ఛేదింపబడిన ఆ శిల వ్యాకులమైన గ్రద్దల గుంపువలె నేలపై పడెను. ఆ శిలను బ్రద్దలుకొట్టినట్లు చూచిన సుగ్రీవుడు క్రోధావిష్టుడై సాలవృక్షమును పెరికి ప్రయోగించగా మహోదరుడు దానిని చాల ముక్కలుగా ఖండించెను. (11-15)

శత్రుసేనాసంహారకుడైన ఆ మహోదరుడు బాణాలతో ఆ సుగ్రీవుణ్ణి చీల్చివేసెను. అప్పుడు కోపించిన సుగ్రీవుడు క్రిందపడి ఉన్న ఒక పరిఘను చూచెను. అతడు ప్రకాశించుచున్న ఆ పరిఘను నేలపై వేసి కొట్టుచు, ఆ రాక్షసునికి చూపి వాని గుఱ్ఱములను దానితో చంపివేసెను. వీరుడైన మహోదరుడు గుఱ్ఱములు చంపబడిన ఆ మహారథమునుండి క్రిందికి దుమికి కోపముతో గదను గ్రహించెను. వృషభముల వలె ఉన్న వీరులైన వారిద్దరూ గర్జించుచు గదను, పరిఘను హస్తములలో ధరించి, మెరుపులతో కూడిన మేఘమువలె యుద్ధానికి తలపడిరి. మహోదరుడు సుగ్రీవునిపై కోపించి ప్రజ్వలించుచున్న, సూర్యునివంటి కాంతి గల ఆ గదను అతనిపైకి

విసిరెను. ఆ మహాయుద్ధమునందు వచ్చి మీద పడుచున్న, చాల భయంకరమైన గదను చూచి మహాబలవంతుడూ, వానరరాజూ అయిన సుగ్రీవుడు కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో దానిని పరిఘతో కొట్టెను. కాని ఆ పరిఘ గదచేత విరుగగొట్టబడి నేలమీద పడిపోయెను. పిమ్మట తేజఃశాలియైన సుగ్రీవుడు అంతటా బంగారముచేత అలంకరింపబడిన, భయంకరమైన ఇనుపరోకలిని నేలమీదనుండి గ్రహించెను. సుగ్రీవుడు దానిని ఎత్తి విసరెను. మహోదరుడు కూడా మరొక గదను విసరెను. ఆ రెండూ ఒకదానికి ఒకటి తగిలినవై నేలమీద పడినవి.(16-24)

ఆయుధములు విరిగిపోయిన పిమ్మట తేజోబలము గల, ప్రజ్వలించుచున్న అగ్నులవలె ఉన్న వారిద్దరూ ముష్టియుద్ధమునకు తలబడిరి. వాళ్ళిద్దరూ మాటిమాటికి అరచుచు పరస్పరము కొట్టుకొనిరి. అరచేతులతో ఒకరినొకరు కొట్టుకొని నేలమీద పడిరి. వీరులైన వాళ్ళిద్దరూ పరాజయము చెందక శీఘ్రముగా లేచి కొట్టుకొనిరి. భుజములచేత ఒకరినొకరు గెంటికొనిరి. శత్రుసంహారకులైన ఆ వీరులిద్దరూ బాహుయుద్ధముచేసి అలసిపోయిరి. అప్పుడు మహావేగము గల మహోదరుడు దగ్గరనే పడి ఉన్న కత్తిని, డాలును తీసికొనెను. అధికవేగవంతుడు, వానరశ్రేష్ఠుడు అయిన సుగ్రీవుడు కూడా పడియున్న మహాఖడ్గమును, డాలును గ్రహించెను. రోషముతో నిండిన శరీరములు గలవారు, యుద్ధమునందు ఆయుధప్రయోగము చేయు నేర్పుగలవారు అయిన వాళ్ళిద్దరూ యుద్ధమునందు ఉత్సాహవంతులై, ఖడ్గములెత్తి గర్జించుచు ఒకరిపై ఒకరు దుమికిరి. జయము సంపాదించవలెనను నిశ్చయము గల వారిద్దరూ పరస్పరము కోపించి అతిశీఘ్రముగా ప్రదక్షిణమండల భ్రమణములు చేసిరి. శూరుడు, తన పరాక్రమమును గూర్చి శ్లాఘించుకొనువాడు, దుష్టబుద్ధీ అయిన మహోదరుడు మహావేగముతో ఖడ్గమును(సుగ్రీవుని చేతిలోని) డాలుమీద నాటెను. డాలుపైన తగుల్కొన్న ఖడ్గమును లాగికొనుచుండగా శిరస్త్రాణముతో కూడిన, కుండలాలంకృతమైన అతని శిరస్సును సుగ్రీవుడు ఖడ్గముతో ఖండించెను.(25-33)

మహోదరుడు శిరస్సు ఖండింపబడి నేలమీద పడిపోయిన వెంటనే అది చూచి రావణుని సైన్యము అక్కడ కనబడకుండా పారిపోయెను. సుగ్రీవుడు అతనిని చంపి సంతోషించి వానరులతో కూడి విజయధ్వానములు చేసెను. రావణునకు కోపము, రామునకు సంతోషము కలిగెను. ఆ రాక్షసు లందరూ దైన్యముతో కూడిన మనస్సులతో పాలిపోయిన ముఖాలతో భయాక్రాంతచిత్తులై అక్కడినుండి పారిపోయిరి.(34-36)

పర్వతభాగమును ఒకదానిని పడగొట్టినట్లు ఆ మహోదరుని నేలమీద పడగొట్టి ఎదిరింపశక్యముకాని సుగ్రీవుడు సూర్యుడు తన తేజస్సుతో ప్రకాశించినట్లు జయలక్ష్మితో ప్రకాశించెను. అప్పుడు యుద్ధరంగమునందు విజయమును పొందిన ఆ సుగ్రీవుని దేవతలు, సిద్ధులు, యక్షులు, భూమిమీద నివసించు వారందరు సంతోషముతో చూచిరి. (37, 38)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది ఏడవ సర్గము సమాప్తము.

తొంబది ఎనిమిదవ సర్గము

అంగదుడు మహాపార్శ్వుణ్ణి చంపుట.

మహోదరుడు సుగ్రీవునిచేత చంపబడుట చూచి మహాబలశాలియైన మహాపార్శ్వుడు కోపముతో నేత్రములు ఎఱ్ఱబడగా, బాణాలచేత అంగదుని భయంకరమైన సైన్యమును క్షోభింపచేసెను. ఆ రాక్షసుడు ముఖ్యులైన వానరుల శిరస్సులను, వాయువు తొడిమనుండి ఫలములను వలె, శరీరములనుండి పడగొట్టెను. బాగుగా విజృంభించి బాణాలచేత కొందరు వానరుల బాహువులను ఛేదించెను. కొందరి పార్శ్వభాగములను చెక్కివేసెను. మహాపార్శ్వుని బాణవేగముచే పీడింపబడిన ఆ వానరులందరూ దుఃఖముచేత యుద్ధవిముఖులై చైతన్యము లేనివారు అయిరి. (1-4)

అంగదుడు సైన్యము రాక్షసునిచేత పీడింపబడి దిగులుచెంది ఉన్నట్లు విని మహావేగవంతుడై, పర్వకాలములయందు సముద్రమువలె గొప్ప వేగమును చేసెను. అంగదుడు సూర్యకిరణములతో సమానమైన కాంతి గల ఇనుప పరిఘను గ్రహించి, యుద్ధమునందు ఆ మహాపార్శ్వునిపై పడవేసెను. ఆ దెబ్బకు చైతన్యము కోల్పోయిన మహాపార్శ్వుడు మూర్ఛచెంది సారథితో సహా ఆ రథమునుండి క్రింద పడెను. (5-7)

తేజఃశాలి, గొప్ప పరాక్రమము గలవాడు, అయిన నల్లని కాటుకప్రోగువంటి జాంబవంతుడు మేఘమువలె ఉన్న తన గుంపునుండి ఎగిరి బైటకు వచ్చి, క్రోధముతో పర్వత శిఖరమువంటి విశాలమైన శిలను గ్రహించి, బలముచేత, అతని గుఱ్ఱములను చంపి ఆ రథమును కూడా విరుగగొట్టెను. మహాపార్శ్వుడు ముహూర్తకాలములో మూర్ఛనుండి తేరుకుని, అనేకబాణములతో మరల అంగదుని కొట్టెను. భల్లూకరాజైన

జాంబవంతుణ్ణి మూడు బాణాలచేత వక్షఃస్థలముమీద కొట్టి గవాక్షుణ్ణి కూడ అనేకబాణములతో కొట్టెను. శరములచేత పీడింపబడిన గవాక్షుణ్ణి, జాంబవంతుణ్ణి చూచి అంగదుడు కోపావేశముతో, భయంకరమైన పరిఘను గ్రహించెను. వాలిపుత్రుడైన అంగదుడు సూర్యకిరణములవంటి కాంతిగల ఆ ఇనుప పరిఘను రెండు చేతులతో పట్టి, వేగముగా త్రిప్పి, కోపముతో నిండిన నేత్రములు కలవాడై, దూరముగా ఉన్న ఆ మహాపార్శ్వుని చంపుటకై విసరెను. బలవంతుడైన అంగదుడు విసిరిన ఆ పరిఘ ఆ రాక్షసుని హస్తమునందున్న శరముతో కూడిన ధనుస్సును, శిరస్త్రాణమును పడగొట్టెను. అంగదుడు వేగముగా అతనిని సమీపించి, కోపముతో కుండలాలంకృతమైన కణతమీద అరచేతితో కొట్టెను.(8-16)

గొప్పవేగము, గొప్ప కాంతిగల మహాపార్శ్వుడు కోపించి ఒక చేతితో చాల పెద్దదైన గండ్రగొడ్డలి తీసికొని, చాలా కోపించి, తైలము పట్టించి శుద్ధము చేయబడి, నిర్మలమైన, ఇనుపవికారమైన, ఆ గండ్రగొడ్డలిని అంగదుని మీదికి విసరెను. రోషముతో కూడిన ఆ అంగదుడు తన ఎడమ భుజముమీదికి గురిచేసి ఆ రాక్షసుడు విసిరిన ఆ గండ్రగొడ్డలిని తప్పించుకొనెను. తండ్రితో సమానమైన పరాక్రమము గల వీరుడైన అంగదుడు చాల కోపించి తన వజ్రమువంటి పిడికిలిని గట్టిగా బిగించెను. మర్మస్థానముల నెరిగిన అంగదుడు ఆ రాక్షసుని స్తనము దగ్గర హృదయమువైపు ఇంద్రుని వజ్రము వంటి స్పర్శగల పిడికిలిని పడవేసెను. ఆ పిడికిలి దెబ్బకు ఆ రాక్షసుని గుండె పలిగిపోయెను. అతడు చచ్చి నేలమీద పడెను.(17-22)

అతడు చచ్చి భూమి మీద పడిపోగానే ఆ సైన్యము క్షోభ చెందెను. రావణునకు యుద్ధములో గొప్ప కోపము కలిగెను. అప్పుడు సంతోషించిన వానరులు సింహనాదమును చేసిరి. మహేంద్రునితో కూడిన దేవతలు చేసిన మహానాదము వలె ఉన్న ఆ సింహనాదము శబ్దము బురుజులతోను, గోపురములతోను కూడిన లంకను బ్రద్దలుకొట్టుచున్నట్లు ఉండెను. ఇంద్రశత్రువైన రావణుడు యుద్ధభూమియందు వానరులు, దేవతలు చేయుచున్న గొప్ప ధ్వనిని విని కోపముతో మరల యుద్ధానికి సంనద్ధుడై నిలచెను.(23-26)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది ఎనిమిదవ సర్గము సమాప్తము.

తొంబది తొమ్మిదవ సర్గము

రామరావణుల యుద్ధము.

మహోదరమహాపార్శ్వులు, మహాబలశాలియైన విరూపాక్షుడు మరణించుట చూచిన రావణునకు ఆ మహాయుద్ధమునందు గొప్ప క్రోధావేశము కలిగెను. అతడు సారథిని ప్రేరేపించి ఇట్లు పలికెను– "రామలక్ష్మణులను సంహరించి, అమాత్యులు మరణించుటచేతను లంకానగరము ముట్టడించబడుటచేతను కలిగిన దుఃఖమును తొలగించెదను. సుగ్రీవ–జాంబవత్–కుముద–నల–ద్వివిద–మైంద–అంగద–గంధమాదన–హనుమత్– సుషేణాది సర్వవానరు లనే శాఖలు గల సీత అనే పుష్పఫలముల నిచ్చు రాము డనే వృక్షమును రణములో ఛేదించెదను."(1–5)

మహారథుడైన ఆ రావణుడు రథఘోషముచేత పది దిక్కులను ధ్వనింపచేయుచు శీఘ్రముగా రామునికి అభిముఖముగా వెళ్ళెను. ఆ శబ్దముచేత నింపబడి నదీ–పర్వత–వనములతో కూడిన భూమి అంతా అదిరిపోయెను. సింహములు, లేళ్ళు, పక్షులు భయపడినవి. రావణుడు చాల భయంకరము, క్రూరము అయిన తామసాస్త్రమును ప్రయోగించగా అది వానరుల నందరినీ కాల్చివేసెను. వారందరు పడిపోయిరి. బ్రహ్మదేవుడు స్వయముగా నిర్మించిన ఆ అస్త్రమును సహించజాలక పరాజితులై ఆ వానరులు పారిపోవునపుడు భూమినుండి పరాగము ఎగసెను.(6–9)

రావణుని శ్రేష్ఠములైన బాణాలచేత భగ్నములైన వందలకొలదిగా ఉన్న ఆ అనేకులను చూచి రాముడు యుద్ధసన్నద్ధుడై నిలచెను. రావణుడు వానరసేనను పారద్రోలి, పిమ్మట ఉపేంద్రునితో కూడిన దేవేంద్రునివలె సోదరుడైన లక్ష్మణునితో కలసి ఉన్న, ఎవ్వరిచేతా ఓడింపబడని రాముణ్ణి చూచెను. పద్మపత్రములవలె విశాలములైన నేత్రములు గల దీర్ఘబాహువు, శత్రుసంహారకుడూ అయిన ఆ రాముడు ధనుస్సుమీద ఆనుకొని నిలచి, ఆకాశమును ఒరయుచున్నాడా అన్నట్లు కనబడుచుండెను. పిమ్మట గొప్ప తేజస్సూ, బలమూ కల లక్ష్మణసమేతుడైన రాముడు యుద్ధములో ఓడిపోయిన వానరులను, తనమీదికి వచ్చుచున్న రావణునీ చూచి సంతోషముతో, ధనుస్సును మధ్యభాగమునందు పట్టుకొని, భూమిని బ్రద్దలుకొట్టుచున్నాడా అన్నట్లు గొప్ప వేగము, మహాధ్వనీ గల ఉత్తమమైన ధనుస్సును చరచుటకు ప్రారంభించెను. రాముని ధనుష్టంకారధ్వనిచేతను, రావణుని బాణధ్వనిచేతను, వందలకొలది రాక్షసులు క్రింద పడిపోయిరి. రామలక్ష్మణుల బాణమార్గమునందున్న రావణుడు చంద్రసూర్యుల సమీపమునందున్న రాహువువలె

ప్రకాశించెను. (10-17)

ముందుగా తాను వాడియైన బాణములతో వానితో యుద్ధము చేయవలె నను కోరికతో లక్ష్మణుడు ధనుస్సు వంచి అగ్నిశిఖలవంటి శరములను విడచెను. గొప్ప తేజస్సు గల రావణుడు ధనుర్ధారియైన లక్ష్మణుడు ప్రయోగించిన వెంటనే ఆ బాణములను బాణములచేత ఆకాశమునందే నివారించెను. రావణుడు హస్తలాఘవమును చూపుచు లక్ష్మణుని ఒక బాణమును ఒక బాణముచేతను, మూడు బాణములను మూడింటిచేతను, పది బాణములను పదింటిచేతను ఛేదించెను. యుద్ధములు జయించు రావణుడు లక్ష్మణుణ్ణి దాటి వెళ్ళి యుద్ధమునందు పర్వతమువలె అకంప్యుడై నిలచియున్న రాముణ్ణి సమీపించెను. రాక్షసప్రభువైన ఆ రావణుడు రాముణ్ణి సమీపించి, క్రోధముచేత ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై బాణవర్షములు కురిపించెను. రాముడు రావణుని ధనుస్సునుండి వెడలి వచ్చుచున్న బాణధారలను చూడగానే శీఘ్రముగా భల్లబాణములను గ్రహించి కోపించిన సర్పమువలె ఉన్న, ప్రకాశించుచున్న, చాల భయంకరములైన ఆ బాణసముదాయములను వాడియైన భల్లబాణములచేత ఛేదించెను. (18-24)

రాముడు రావణునిమీదా, రావణుడు రామునిమీదా పరస్పరము వాడియైన బాణముల వర్షము వర్షించిరి. బాణముల వేగముచేత ఒకరికొకరు దూరమగుచు, పరస్పరము పరాజితులు కాని ఆ రామరావణులు చిత్రముగా, కుడి ఎడమ వైపు మండలభ్రమణములు (గుండ్రముగా తిరుగుచు యుద్ధముచేయుట) చేసిరి. భయంకరులు, యమునితోను మృత్యుదేవతతోను సమానులు అయిన వారిద్దరూ ఒక్కసారిగా బాణములను విడుచుచు యుద్ధము చేయుచుండగా ప్రాణులు భయపడినవి. అప్పుడు ఆకాశము, గ్రీష్మాంతమునందు మెరుపుల పంక్తులతో వ్యాకులములైన మేఘములచేత వలె, అనేకవిధములైన బాణములచేత దట్టముగా వ్యాప్తమాయెను. గొప్ప వేగము, బాగా వాడియైన అగ్రభాగములూ కలవి, గ్రద్దల రెక్కలు కట్టి మంచి వేగము కలుగునట్లు చేయబడినవి అయిన బాణముల వర్షములచేత ఆకాశము కిటికీలతో నింపబడినట్లు అయ్యెను. వారు ముందుగా ఆకాశమును శరములచేత అంధకారమయముగా చేసిరి. సూర్యాస్తమయము తరువాత కూడా పైకి లేచిన మేఘములు వలె అంధకారము చేసిరి. పరస్పరము చంపుగొనగోరుచున్న వారిద్దరికీ, వృత్రాసురదేవేంద్రులకు వలె దగ్గరకు వెళ్ళుటకు గాని, ఊహించుటకు కాని శక్యము కాని గొప్ప యుద్ధము జరిగెను. ఇద్దరూ గొప్ప ధనుస్సులు కలవారే. ఇద్దరూ యుద్ధమునందు నేర్పుగలవారే. ఇద్దరూ అస్త్రవేత్తలలో ప్రధానులే. అట్టి

వారిద్దరూ యుద్ధములో సంచరించిరి. వారిద్దరూ ఏ యే వైపునకు వెళ్ళిరో ఆ వైపునకు, రెండు సముద్రములందు వాయువుచేత ఎగురగొట్టబడిన తరంగముల వలె బాణతరంగములు వెళ్ళినవి.(25-33)

పిమ్మట హస్తనైపుణ్యము గల, లోకములను ఏడ్పించిన రావణుడు రాముని లలాటముమీద వరుసగా కొన్ని నారాచబాణములను నాటెను. భయంకరమై ధనుస్సునుండి వెలువడిన, నల్లకలువల దళముల వంటి కాంతిగల ఆ నారాచబాణమాలను రాముడు శిరస్సుతో ధరించెను. ఏమాత్రము వ్యథ చెందలేదు. పిమ్మట గొప్ప తేజస్సు, పరాక్రమమూ గల రాముడు కోపించి, మంత్రములను జపించుచు, రౌద్రాస్త్రమును ఉచ్చరించుచు మరల బాణములు గ్రహించి ధనుస్సు వంచి వాటిని ప్రయోగించెను. రావణుని మహామేఘమువంటి అభేద్యమైన కవచముమీద పడిన బాణములు అతనికి వ్యథను కలిగించలేదు. పిమ్మట సమస్తమైన అస్త్రములందు నేర్పుగల రాముడు ఆ రావణుణ్ణి గొప్ప అస్త్రములచేత లలాటమునందు మరల కొట్టెను. రాముడు ప్రయోగించిన బాణములు ఐదు శిరస్సులు గల సర్పములు వలె రావణుని బాణముల రూపములను భేదించి రావణుని చేత త్రిప్పి కొట్టబడినవై, చప్పుడు చేయుచు, భూమిలో ప్రవేశించినవి.(34-39)

రావణుడు రాముని అస్త్రమును కొట్టివేసి క్రోధావేశముతో మరియొక ఆసురాస్త్రమును ప్రయోగించెను. నోరు తెరచుకొని ఉన్న సింహములు, పెద్దపులులు, కంకములు, కాకులు, గ్రద్దలు, డేగలు, నక్కలు, తోడేళ్ళు - ఈ జంతువుల ముఖములు గల బాణములను భయంకరములైన ఐదు ముఖాల సర్పాల రూపములో ఉన్న వాడియైన బాణములను ప్రయోగించెను. మహాతేజఃశాలీ, మాయావీ అయిన ఆ రావణుడు, కోపించిన సర్పమువలె బుసలు కొట్టుచు, గాడిదల ముఖములు, వరాహముల ముఖములు, కుక్కల ముఖములు, కోళ్ళ ముఖములు, మకర-సర్పముల ముఖములు గల బాణములను, ఇంకా మరికొన్ని వాడియైన బాణములను రామునిమీద ప్రయోగించెను. ఆ ఆసురాస్త్రముచేత ఆక్రమింపబడి గొప్ప ఉత్సాహముగల అగ్నితో సమానుడైన రాముడు పావకాస్త్రమును ప్రయోగించెను. అక్కడ రాముడు అనేకవిధములైన బాణములు ప్రయోగించెను. అగ్నితో మండుచున్న ముఖములు గలవి, సూర్యునివంటి ముఖములు గలవి, చంద్ర-అర్ధచంద్రాకారములైన ముఖములు గలవి, పెద్ద ఉల్కవంటి ముఖములున్నవి, మెరపునాలుకల వంటివి అయిన బాణములను ప్రయోగించెను. భయంకరములైన రావణుని బాణములు రాముని అస్త్రముచేత కొట్టబడినవై ఆకాశమునందే నశించి వేలకొలది ముక్కలుగా

అయిపోయినవి. రాముడు ఆ అస్త్రమును భగ్నము చేయుట చూచి, స్వేచ్ఛారూపధారణసమర్థులైన వీరులైన సుగ్రీవాది వానరులందరు రాముని చుట్టూ చేరి సంతోషముతో అరచిరి.(40-50)

మహాత్ముడైన రాముడు రావణునిచే ప్రయోగించబడిన అస్త్రమును బలప్రయోగముచేత శాంతింపచేసి సంతోషించెను. వానరులు సంతోషించి బిగ్గరగా ధ్వని చేసిరి.(51)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని తొంబది తొమ్మిదవ సర్గము సమాప్తము.

నూరవ సర్గము

రావణుని శక్త్యాయుధముచే లక్ష్మణుడు మూర్ఛపోవుట. రావణుడు యుద్ధమునందు పారిపోవుట.


ఆ అస్త్రము భగ్నము చేయబడగా రాక్షసరాజైన రావణుడు రెట్టింపు కోపముతో – మయుడు నిర్మించిన, క్రూరము, భయంకరమూ అయిన మరొక అస్త్రమును రామునిపై ప్రయోగించుటకు ఉపక్రమించెను. అప్పుడు ధనుస్సునుండి వజ్రమువంటి సారముగల ప్రకాశించుచున్న శూలములు, గదలు, ముసలములు అన్నివైపులా బయలుదేరినవి. ప్రళయకాలమునందు వాయువులు బయలుదేరినట్లు అనేకవిధములైన, తీక్ష్ణమైన ముద్గరములు, కూటములు, పాశములు, ప్రజ్వలించుచున్న వజ్రాయుధములు బయలుదేరెను. శ్రీమంతుడు ఉత్తమాస్త్రములు తెలిసినవారిలో శ్రేష్ఠుడు, మహాకాంతిమంతుడూ అయిన రాముడు ఆ అస్త్రమును గాంధర్వమనే గొప్ప అస్త్రముచేత కొట్టివేసెను.(1-5)

మహాత్ముడైన రామునిచేత ఆ అస్త్రము కొట్టివేయబడగా రావణుడు, క్రోధముచేత నేత్రములు ఎఱ్ఱబడగా సౌరాస్త్రమును ప్రయోగించెను. ఆ రావణుని ధనుస్సునుండి ప్రకాశించుచున్న పెద్ద పెద్ద చక్రములు బయలుదేరెను. అన్నివైపులనుండి వచ్చి పడుచున్న ఆ చక్రములచేత, ప్రకాశించుచున్న చంద్రసూర్యగ్రహములచేత వలె, ఆకాశము, దిక్కులు ప్రకాశించినవి. సేనాగ్రభాగమునందు రాముడు ఆ చక్రములను రావణుని ఆయుధములను బాణములచేత ఖండించెను. రావణుడు ఆ అస్త్రము కొట్టబడినట్లు చూచి పది బాణములతో రాముణ్ణి అన్ని మర్మస్థానములందు కొట్టెను.

ఆ పది బాణములతో కొట్టినను గొప్ప తేజస్సుగల ఆ రాముడు చలించలేదు. రాముడు చాలా కోపించి అనేకబాణములచేత రావణుణ్ణి అన్ని అవయవములయందు కొట్టెను.(6-12)

ఇంతలో బలశాలి, రాముని తమ్ముడూ, శత్రుసంహారకుడు అయిన లక్ష్మణుడు కోపించి ఏడు బాణములు గ్రహించెను. గొప్పకాంతి గల లక్ష్మణుడు మహావేగము గల ఆ బాణాలతో రావణుని మనుష్యశిరస్సు చిహ్నముగా గల ధ్వజమును ముక్కముక్కలుగా ఛేదించి వేసెను. ఒక బాణముతో ఆ రావణుని సారథియొక్క ప్రకాశించుచున్న కుండలములుగల శిరస్సును హరించెను. ఐదు వాడియైన బాణాలతో ఆ రావణుని ఏనుగు తొండమువలె ఉన్న ధనుస్సును ఛేదించెను. విభీషణుడు ఎగిరి వెళ్ళి ఆ రావణుని నల్లని మేఘముల వలె ఉన్న పర్వతముల వలె పెద్దవైన ఉత్తమాశ్వములను గదతో చంపెను. రావణుడు చంపబడిన గుఱ్ఱములు గల ఆ మహారథమునుండి క్రిందికి వేగముగా దుమికి సోదరునిపై తీవ్రమైన కోపమును చూపుచు, మండుచున్న వజ్రాయుధము వలె ఉన్న శక్తిని విభీషణునిపై ప్రయోగించెను. లక్ష్మణుడు ఆ శక్తి విభీషణుణ్ణి చేరకముందే మూడు బాణాలతో ఛేదించెను. అప్పుడు ఆ మహాయుద్ధములో వానరుల హర్షధ్వని బయలుదేరెను. బంగారు మాలలు గల ఆ శక్తి మూడు ముక్కలుగా ఛేదింపబడి, అగ్నికణములు చిమ్ముచు, ఆకాశము నుండి పడిన పెద్ద ఉల్కవలె పడెను.(13-21)

పిమ్మట రావణుడు మిక్కిలి గౌరవింపదగిన మరొక పెద్ద శక్తిని గ్రహించెను. యముడు కూడ ఎదిరించుటకు శక్యము కాని ఆ శక్తి తన తేజస్సుతో ప్రకాశించుచుండెను. మండుచున్న పిడుగు వంటి కాంతి గల ఆ శక్తి గొప్ప తేజస్సుతో మండుచుండెను. బలవంతుడు, దురాత్ముడూ అయిన రావణుడు దానిలో వేగము కలిగించెను. ఇంతలో వీరుడైన లక్ష్మణుడు ప్రాణసంశయమును పొందిన విభీషణుని శీఘ్రముగా వెళ్ళి ఆదుకొనెను. వీరుడైన లక్ష్మణుడు ఆ విభీషణుణ్ణి విడిపించుటకు ధనుస్సువంచి శక్తి హస్తమునందున్న ఆ రావణునిపై బాణవర్షము కురిపించెను. లక్ష్మణుడు విడచిన బాణసముదాయముచేత కప్పివేయబడిన ఆ రావణుడు విభీషణుని విషయమున తన పరాక్రమము విముఖము కాగా, అతనిని చంపు సంకల్పమును విడచెను. రావణుడు తన సోదరుడైన విభీషణుణ్ణి లక్ష్మణుడు శక్తిప్రహారమునుండి తప్పించుట చూచి, లక్ష్మణునకు ఎదురుగా నిలచి– "బలముచేత శ్లాఘించుకొనుచున్న లక్ష్మణా! నీవు ఈ విధముగా విభీషణుణ్ణి విడిపించినావు గాన ఈ శక్తి విభీషణుణ్ణి విడచి నీమీద ప్రయోగింపబడుచున్నది. శత్రురక్తముచేత



పూయబడిన గుర్తులు గల ఈ శక్తి పరిఘలవంటి నా బాహువులచేత ప్రయోగింపబడి, నీ హృదయమును భేదించి, నీ ప్రాణాలు గ్రహించి వెళ్ళగలదు." అని పలికెను. (22-29)

గొప్ప ధ్వని చేయుచున్న ఆ శక్తికి ఎనిమిది ఘంటలు కట్టబడి ఉండెను. మయుడు మాయచేత నిర్మించిన ఆ శక్తి తన తేజస్సుతో మండుచున్నట్లు ఉండెను. ఎన్నడూ వ్యర్థముకాని, శత్రువులను చంపే ఆ శక్తిని రావణుడు కోపావిష్టుడై, పై విధముగా పలుకుచు, లక్ష్మణునిమీద ప్రయోగించి బిగ్గరగా అరచెను. భయంకరమైన వేగము గల రావణుడు ప్రయోగించిన, వజ్రాయుధముతోను, పిడుగుతోను సమానమైన ధ్వని గల ఆ శక్తి, యుద్ధాగ్రమునందు వేగముగా లక్ష్మణుని మీద పడెను. వచ్చి పడుచున్న శక్తిని గూర్చి రాముడు-"లక్ష్మణునకు క్షేమమగుగాక, నీవు వ్యర్థము అయ్యెదవుగాక; నీ ప్రయత్నము విఫల మగుగాక." అని పలికెను. యుద్ధములో రావణుడు ప్రయోగించిన సర్పమువంటి ఆ శక్తి వెంటనే, భయపడని లక్ష్మణుని వక్షఃస్థలములో దిగిపోయెను. ప్రజ్వలించుచున్న, వాసుకి నాలుక వలె ఉన్న, గొప్ప కాంతి గల ఆ శక్తి గొప్ప వేగముతో లక్ష్మణుడి విశాలవక్షఃస్థలముమీద పడెను. అప్పుడు రావణుని వేగముచేత చాల లోతుగా దిగిపోయిన ఆ శక్తిచేత వక్షఃస్థలము భేదింపబడగా లక్ష్మణుడు నేలపై పడెను. (30-36)

దగ్గరనే ఉన్న మహాతేజఃశాలియైన రాముడు అట్టి అవస్థలో ఉన్న లక్ష్మణుణ్ణి చూచి సోదరస్నేహమువలన దుఃఖాక్రాంతు డయ్యెను. రాముడు కన్నీటితో నిండిన నేత్రములతో క్షణకాలము ఆలోచించి ప్రళయకాలాగ్నివలె చాల క్రోధావేశము చెందెను. ఇది దుఃఖించుటకు సమయముకాదు అని ఆలోచించి, రాముడు, రావణుని చంపవలె నని దృఢముగా సంకల్పించి గొప్పదైన పూర్తి ప్రయత్నముతో

చాల వ్యాకులమైన యుద్ధమును చేసెను. మహాయుద్ధములో శక్తిచేత పడగొట్టబడి, రక్తముచేత తడిసి సర్పములతో కూడిన పర్వతమువలె ఉన్న లక్ష్మణుణ్ణి రాముడు చూచెను. బలవంతుడైన రావణుడు ప్రయోగించిన ఆ శక్తిని పైకి లాగివేయుటకు ప్రయత్నించినను ఆ వానరశ్రేష్ఠులు, రాక్షసరాజైన రావణుడు బాణసముదాయములచేత పీడించుటచే లాగజాలకపోయిరి. ఆ శక్తి లక్ష్మణుని వక్షఃస్థలమును భేదించి నేలను స్పృశించెను. బలవంతుడైన రాముడు కోపించి యుద్ధములో ఆ భయంకరమైన శక్తిని రెండు చేతులతో పట్టి పైకి లాగి విరచివేసెను. రాముడు ఆ శక్తిని పైకి లాగుచుండగా బలశాలియైన రావణుడు అతని అన్ని అవయవములయందు, మర్మస్థానములను భేదించు శరములను ప్రయోగించెను. (37-44)

రాముడు ఆ బాణాలను లెక్కచేయక, లక్ష్మణుణ్ణి కౌగిలించుకొని, హనుమంతుని తోను, వానరరాజైన సుగ్రీవునితోను- "వానరవీరులారా! మీరు ఈ లక్ష్మణుని చుట్టూ నిలచి ఉండుడు. ఇప్పుడు పాపాత్ముడు, పాపనిశ్చయము కలవాడు అయిన రావణుని చంపు సమయము వచ్చినది. గ్రీష్మాంతమునందు చాతకపక్షికి అది కోరుకొనే మేఘదర్శనము అయినట్లు నేను చిరకాలమునుండి కోరుచున్న పరాక్రమప్రదర్శనకాలము వచ్చినది. వానరులారా! ఈ ముహూర్తమునందు మీ ఎదుట సత్యముగా ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను. మీరు అచిరకాలములో ఈ జగత్తునందు రావణుడో లేదా రాముడో లేకపోవుట చూడగలరు. నాకు రాజ్యనాశము, వనవాసము, దండకావనములో తిరుగుట, రాక్షసులు సీతను అవమానించుట ఇవన్నీ కలిగినవి. చాలా ఘోరమైన దుఃఖమును పొందినాను. నరకమువంటి క్లేశమును అనుభవించినాను. ఇప్పుడు నేను యుద్ధములో రావణుణ్ణి సంహరించి దీనినంతనూ విడిచి పెట్టెదను. ఎవని నిమిత్తమై నేను ఈ వానరసైన్యమును తీసికొనివచ్చినానో, వాలిని యుద్ధములో చంపి సుగ్రీవుణ్ణి రాజ్యమునందు అభిషిక్తుని చేసినానో, ఎవని నిమిత్తమై సాగరముపై సేతువు కట్టి సముద్రము దాటినానో అట్టి పాపాత్ముడు ఇప్పుడు నాకంట బడినాడు. నా కంటబడిన ఈ రావణుడు చూపులో విషము ఉండే సర్పము దృష్టిలో పడినవారు వలె, గరుత్మంతుని దృష్టిలో పడిన సర్పమువలె ఇంక జీవించజాలడు. వానరవీరులారా! మీరు స్వస్థచిత్తులై పర్వతశిఖరములమీద కూర్చుండి నేను-రావణుడు చేయు యుద్ధమును చూడండి. ఈనాడు నేను చేయు యుద్ధమునందు రాముని రామత్వమును-రాముడెట్టివాడు అను విషయమును గంధర్వ-దేవ-ఋషి-చారణాదులతో సహా మూడులోకాలవారూ

చూచెదరుగాక. ఈ భూమి నిలచి ఉన్నంతవరకు స్థావరజంగమములతోను, దేవతలతోను సహా ఈ లోకములు దేనిని గూర్చి చెప్పుకొందురో, ఈ లోకములో అందరూ కలసి యుద్ధము ఎట్లు జరిగినదో అని దేనిని గూర్చి చెప్పుకొందురో అట్టి పనిని నేడు చేసెదను" అని పలికెను.(45-57)

రాము డిట్లు పలికి, యుద్ధమునందు సావధానచిత్తుడై శుద్ధమైన బంగారముచేత అలంకరింపబడిన వాడియైన బాణాలచేత రావణుణ్ణి కొట్టెను. పిమ్మట రావణుడు ప్రకాశించుచున్న నారాచబాణములను, మేఘము జలధారలు కురిపించునట్లు, రామునిమీద కురిపించెను. రామరావణులు ప్రయోగించిన ఆ బాణాలు, ఈ బాణాలూ పరస్పరము కొట్టుకొనుచుండగా అధికమైన ధ్వని కలిగెను. రామరావణుల బాణములు విరిగిపోయి చెల్లాచెదరై ప్రకాశించుచున్న అగ్రభాగములతో ఆకాశమునుండి నేలమీద పడిపోయినవి. వాళ్ల ధనుస్సుల నారియొక్క ధ్వని, తలము (చేతికి కట్టిన చర్మ) యొక్క గొప్ప ధ్వని సకల ప్రాణులకు భయమును కలిగించుచు, చూచువారికి ఆశ్చర్యకరముగా ఉండెను. ప్రకాశించుచున్న ధనుస్సు గల మహాత్ముడైన రాముడు బాణసముదాయవర్షములను కురిపించగా, రావణుడు తనవాళ్ళతో కలిసి, భయమువలన, గాలిచే కొట్టబడిన మేఘమువలె, పారిపోయెను.(58-63)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూరవ సర్గము సమాప్తము.

నూట ఒకటవ సర్గము

రాముడు విలపించుట, హనుమంతుడు తెచ్చిన ఓషధిచే లక్ష్మణుడు మూర్ఛనుండి తేరుకొనుట.

యుద్ధమునందు శూరుడైన లక్ష్మణుణ్ణి అధికబలవంతుడైన రావణుడు శక్తిచేత పడగొట్టగా రక్తప్రవాహముచేత తడిసిన ఆ లక్ష్మణుని చూచి రాముడు దురాత్ముడైన రావణునితో తీవ్రముగా యుద్ధముచేసి, బాణములను ప్రయోగించుచునే సుషేణునితో- "రావణుని పరాక్రమముచేత నేలమీద పడిపోయిన వీరుడైన ఈ లక్ష్మణుడు నా శోకమును వృద్ధి పొందించుచు, సర్పమువలె నేలమీద పడి కొట్టుకొనుచున్నాడు. నాకు ప్రాణాలతో సమానముగా ఇష్టుడైన ఇతడు రక్తముతో తడిసి ఉండగా చూచుచు, మనస్సు వ్యాకులముగా ఉన్న నాకు యుద్ధము చేయుశక్తి

ఎక్కడిది? యుద్ధములలో శ్లాఘాపాత్రుడు, శుభలక్షణములు గలవాడు అయిన అట్టి ఈ నా సోదరుడు మరణించినచో నాకు ప్రాణము లెందుకు, సుఖమెందుకు? నా పరాక్రమము సిగ్గుపడుచున్నట్లున్నది. చేతిలోనుండి ధనుస్సు జారిపోవుచున్నట్లున్నది. బాణములు దుర్బల మగుచున్నవి. చూపు కన్నీటికి లొంగిపోవుచున్నది. స్వప్నములో నడచేవారి అవయవములు సరిగా పనిచేయనట్లు నా అవయవములు దుర్బలము లగుచున్నవి. నాకు చింత చాల తీవ్రముగా ఉన్నది. మరణించవలెనను కోరిక గూడ కలుగుచున్నది. నాసోదరుడు దురాత్ముడైన రావణునిచేత కొట్టబడి దుఃఖార్తుడై మూలుగుచున్నాడు. ఎక్కువగా మర్మస్థానమునందు కొట్టబడినాడు." అని పలికి, బైట సంచరించు ప్రియప్రాణమైన సోదరుణ్ణి చూచి రాముడు గొప్ప దుఃఖముతో కూడి ధ్యానశోకములకు అధీనుడాయెను.(1-9)

సోదరుడైన లక్ష్మణుడు కొట్టబడి రణభూమియందలి పరాగములో పడియుండుట చూచి రాముడు చాలా దుఃఖించుచు, వ్యాకులములైన ఇంద్రియములతో విలపించెను - "శూరుడా! నాకు విజయము లభించినను సంతోషమును కలిగించజాలదు. కంటికి కనబడని చంద్రుడు ఏమి సంతోషమును కలిగించును? నాకు యుద్ధ మెందుకు? ఈ ప్రాణము లెందుకు? లక్ష్మణుడు చంపబడి రణభూమియందు శయనించునప్పుడు ఇంక యుద్ధమువలన ఏమి ప్రయోజనము? మహాకాంతిమంతుడైన ఈ లక్ష్మణుడు వనమునకు వెళ్ళునప్పుడు నా వెనుకనే వచ్చినట్లే నేను కూడా ఈతని వెనుక యమలోకమునకు వెళ్లెదను. బంధుజనులయందు ప్రేమగలవాడు, ఎల్లప్పుడు నన్ను అనుసరించుటయే నియమముగా గలవాడూ అయిన ఈ లక్ష్మణునకు కపటయుద్ధముచేయు శత్రువులు ఇట్టి అవస్థ కలిగించినారు. ప్రతీదేశములోను భార్యలు దొరుకుదురు. ప్రతీదేశములోను బంధువులు దొరుకుదురు. కాని సమానోదరుడైన భ్రాత లభించు దేశమేదీ కనబడదు."(10-15)


రాముడీ విధముగా దుఃఖముచేత వ్యాకులములైన ఇంద్రియములతో ఇటూ అటూ తిరిగిపోవుచు మాటిమాటికి దీనముగా నిట్టూర్చుచు విలపించుచుండెను - "ఎదిరింపశక్యము కాని వీరుడైన లక్ష్మణుడు లేకుండగా నాకు రాజ్యము ఎందుకు? పుత్రునియందు ప్రేమగల తల్లియైన సుమిత్రకు నేను ఏమి చెప్పగలను? సుమిత్ర చేయు నిందను ఎట్లు సహించగలను? తల్లులైన కౌసల్యతోను, కైకేయితోను ఏమి చెప్పుదును? లక్ష్మణునితో కలిసి వనమునకు వెళ్ళిన నీవు అతడు లేకుండా ఎట్లు వచ్చినావు? అని ప్రశ్నించు భరతునికీ మహాబలవంతుడైన, శత్రుఘ్నునికీ ఏమి చెప్పగలను? బంధువులచేత నిందలు పడుటకంటే ఇక్కడనే మరణించుట మేలు.

ధర్మాత్ముడైన నా సోదరుడు ఈ విధముగా చంపబడి నాయెదుట పడి ఉండుటకు నేను పూర్వజన్మలో ఏమి పాపము చేసితినో కదా. అయ్యో! మానవులలో శ్రేష్ఠుడవు, శూరులలో గొప్పవాడవు, సమర్థుడవూ అయిన ఓ! సోదరుడా! నన్ను విడచి నీవు ఒంటరిగా పరలోకమునకు ఎందుకు వెళ్లుచున్నావు? సోదరుడా! విలపించుచున్న నాతో ఎందుకు మాటలాడవు? లెమ్ము; చూడుము; ఎందుకు శయనించి ఉన్నావు? దీనుడనైన నన్ను కళ్ళు విప్పి చూడుము. ఓ! మహాబాహూ! నేను పర్వతాలమీదా, అరణ్యాలలోను శోకార్తుడనై ఏమరిపాటు చెంది, దిగులు చెంది ఉన్నప్పుడు నీవు ఓదార్చేవాడవు కదా?"(16-23)

శోకముచేత ఇంద్రియములు వ్యాకులములు కాగా ఇట్లు పలుకుచున్న రాముణ్ణి ఓదార్చుచు, సుషేణుడు ఉత్తమమైన వాక్యమును ఇట్లు పలికెను- "నరశ్రేష్ఠుడవైన రామా! వ్యాకులత్వమును కలిగించు ఈ బుద్ధిని, సేనాగ్రమునందలి బాణముల వంటి, శోకహేతువైన చింతను విడువుము. లక్ష్మీవర్ధకుడైన లక్ష్మణుడు మరణము పొందలేదు. ఎందుచేతననగా ఈతని ముఖములో వికారము లేదు. శరీరమునందు నలుపు కూడా రాలేదు. ఈతని ముఖము మంచి కాంతితో చాల ప్రసన్నముగా ఉన్నది. అరచేతులు పద్మముల రేకులవలె ఉన్నవి. నేత్రములు కూడ చాలా ప్రసన్నములుగా ఉన్నవి. రాజా! మరణించినవారి రూపము ఈ విధముగా ఉండదు. ఇతడు ప్రాణములతో ఉన్నాడు. దిగులు చెందకుము. అవయవములను నేలమీద జారవిడచి నిద్రపోవుచున్న ఈతని హృదయము శ్వాసతో కూడినదై మాటిమాటికి కదలుచున్నది. అట్టి హృదయమే ఇతడు మరణించలేదని చెప్పుచున్నది."(24-29)

గొప్పబుద్ధి గల సుషేణుడు రామునితో ఇట్లు పలికి సమీపమునందే ఉన్న మహావానరుడైన హనుమంతునితో- "సౌమ్యుడవైన ఓ వీరుడా! పూర్వము నీకు జాంబవంతుడు చెప్పిన ఔషధిపర్వత మను పర్వతమునకు శీఘ్రముగా వెళ్ళి, దాని దక్షిణశిఖరమునందు మొలచిన విశల్యకరణి, సంజీవకరణి, సంధాని అను మహౌషధులను లక్ష్మణుణ్ణి జీవింపచేయుటకు ఇక్కడికి తీసికొని రమ్ము." అని చెప్పెను.(30-33)

శ్రీమంతుడైన హనుమంతుడు ఆ మాట విని, ఔషధిపర్వతమునకు వెళ్ళి అక్కడ ఆ గొప్ప ఓషధులను గుర్తుపట్టజాలక చింతించెను. అమితమైన తేజస్సుగల ఆ హనుమంతునకు "ఆ పర్వతశిఖరమునే తీసికొని వెళ్ళెదను" అను ఆలోచన



కలిగెను. "సుఖకరమైన ఆ ఓషధి ఈ శిఖరమునందే మొలచి ఉండునని ఊహించుచున్నాను. సుషేణుడు అట్లే చెప్పినాడు కదా? నేను విశల్యకరణి గ్రహించకుండా వెళ్ళినచో కాలము గడిచిపోయి అలస్యమగుటచేత గొప్ప దోషము కలుగును. అది దుఃఖానికి దారి తీయును." గొప్పబలము గల వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ఈ విధముగా ఆలోచించి, శీఘ్రముగా వెళ్ళి, ఆ పర్వతమును సమీపించి, దాని శిఖరమును హస్తములతో పట్టుకొని, మూడుసార్లు ఊపి, పుష్పించిన అనేక విధములైన వృక్షములు గల దానిని పెకలించి, పైకి ఎత్తెను. హనుమంతుడు నీటితో నిండిన నీలమేఘమువలె ఉన్న ఆ పర్వతశిఖరమును గ్రహించి ఆకాశమార్గమునందు ఎగిరి మహావేగముతో తిరిగి వచ్చి పర్వతశిఖరమును క్రింద దింపి కొంచెము విశ్రమించి, సుషేణునితో– "ఓ! వానరశ్రేష్ఠుడా! నేను ఆ ఓషధులను గుర్తించజాలక ఆ పర్వతశిఖరమునంతను తీసికొని వచ్చినాను." అని చెప్పెను. (34–42)

వానరశ్రేష్ఠుడైన సుషేణుడు హనుమంతుని మాటలు విని అతనిని ప్రశంసించి, ఓషధులను లాగి పైకి తీసెను. దేవతలు కూడా చేయశక్యముకాని హనుమంతుడు చేసిన ఆ పనిని చూచి ఆ వానరశ్రేష్ఠులందరూ ఆశ్చర్యపడిరి. పిమ్మట, వానరశ్రేష్ఠుడు మహాకాంతిమంతుడు అయిన సుషేణుడు ఆ ఓషధిని నలగగొట్టి లక్ష్మణునకు ముక్కుద్వారా ఇచ్చెను. శరీరమునందు శల్యములున్న, శత్రువీరసంహారకుడైన లక్ష్మణుడు దానిని వాసన చూడగానే శల్యము లన్నీ తొలగిపోగా బాధలేనివాడై

వెంటనే నేలమీదనుండి లేచెను. వానరులు నేలపైనుండి లేచిన లక్ష్మణుణ్ణి చూచి చాల సంతోషించుచు "బాగు బాగు" అని అతనిని అభినందించిరి. శత్రువీరసంహారకుడైన రాముడు "రమ్ము, రమ్ము" అని లక్ష్మణునితో అనుచు అతనిని, కన్నీళ్ళతో వ్యాకులములైన నేత్రములతో, స్నేహముచేత గాఢముగా కౌగిలించుకొని,(43-48)

"వీరుడా! మరణమునుండి తిరిగివచ్చిన నిన్ను అదృష్టవశముచేత చూచుచున్నాను." అని పలికెను. "నీవు మరణించిన పిదప నాకు జీవితముచేత గాని, సీతచేత గాని, విజయముచేత గాని ఏమి ప్రయోజనము? వీటి అన్నింటివలన నాకేమి ప్రయోజనము? చెప్పుము." అనెను. మహాత్ముడైన రాము డిట్లు పలుకుచుండగా అలసి ఉన్న లక్ష్మణుడు శిథిలమైన వాక్కుతో - "సత్యమైన పరాక్రమము గల అన్నా! పూర్వము రావణసంహారము చేసెదనని ప్రతిజ్ఞచేసి, ఇప్పుడు ఎవ్వడో సామాన్యమానవుడు వలె నీవు ఇట్లు పలుకుట యుక్తము కాదు. సత్యము పలుకువారు ప్రతిజ్ఞ వ్యర్థము చేయరు కదా? ప్రతిజ్ఞను పాలించుటయే మహత్త్వమునకు లక్షణముకదా? నా నిమిత్తముగా నీవు నిరాశుడవు అగుట యుక్తము కాదు. ఇప్పుడు రావణుని వధించుటచే ప్రతిజ్ఞను పాలించుము. నీ బాణమార్గమును పొందిన శత్రువు, గర్జించుచున్న, తీక్ష్ణములైన కోరలు గల సింహము బారి పడిన మహాగజమువలె ప్రాణములతో తిరిగి వెళ్ళడు కదా? సూర్యుడు తన పని పూర్తిచేసికొని అస్తాద్రిని చేరేలోగా ఈ దురాత్ముడు శీఘ్రముగా చంపబడవలె నని నేను కోరుచున్నాను. పూజ్యుడవైన వీరుడా! నీకు యుద్ధములో రావణుణ్ణి చంపవలెనను కోరిక ఉన్నచో, నీ ప్రతిజ్ఞను నిలబెట్టుకొనవలెనను కోరిక ఉన్నచో, సీతను పొందవలెనను అభిలాష ఉన్నచో శీఘ్రముగా ఇప్పుడు నేను చెప్పినట్లు చేయుము." అని పలికెను. (49-57)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఒకటవ సర్గము సమాప్తము.

నూట రెండవ సర్గము

ఇంద్రుడు పంపిన రథమునెక్కి రాముడు రావణునితో యుద్ధము చేయుట.

శత్రువీరసంహారకుడు, పరాక్రమవంతుడూ అయిన రాముడు లక్ష్మణుడు పలికిన మాటలు విని, ధనుస్సును గ్రహించి బాణములు సంధించెను. సేనాముఖమునందు రాముడు రావణుణ్ణి ఉద్దేశించి భయంకరములైన బాణాలను విడచెను. పిమ్మట రాక్షసరాజైన రావణుడు మరొక రథమును అధిష్ఠించి, రాహువు సూర్యుని మీదకు వెళ్ళినట్లు రామునిమీదకు శీఘ్రముగా వెళ్ళెను. రథముమీద నున్న రావణుడు వజ్రాయుధము వంటి బాణములతో, మేఘము జలధారలతో పర్వతమును కొట్టినట్లు రాముణ్ణి కొట్టెను. రాముడు సావధానచిత్తుడై, యుద్ధమునందు, మండుచున్న అగ్నితో సమానములైన, బంగారముచేత అలంకరింపబడిన బాణములను రావణుని మీద వర్షించెను. రాముడు నేలమీదా, రావణుడు రథముమీదా ఉండి యుద్ధముచేయుట సరిగా లేదని దేవ-గంధర్వ-కింనరులు అనుకొనిరి. అప్పుడు దేవతాప్రభువు, శ్రీమంతుడు అయిన ఇంద్రుడు వాళ్ళ అమృతమువంటి మాటలు విని మాతలిని పిలిచి- "నీవు శీఘ్రముగా నా రథమును తీసికొని భూమి మీద ఉన్న రామునివద్దకు వెళ్ళుము. భూమికి వెళ్ళిన నీవు, రాముణ్ణి పిలచి(రామునకు ఈవిషయము చెప్పి) గొప్ప దేవతాహితమైన కార్యము చేయుము." అని ఆజ్ఞాపించెను. (1-7)

దేవసారథియైన మాతలి దేవేంద్రుని మాటలు విని అతనికి శిరస్సు వంచి నమస్కరించి- "దేవేంద్రా! నేను శ్రేష్ఠమైన రథమును ఆకుపచ్చని రంగుగల గుఱ్ఱములను కట్టుకొని శీఘ్రముగా వెళ్ళి సారథ్యము చేసెదను." అని పలికి- దేవేంద్రుని రథమునెక్కి, స్వర్గమునుండి దిగివచ్చి రాముని దగ్గరకు వెళ్ళెను. ఆ రథము చక్రములు బంగారముచేత చిత్రవర్ణములై ఉండెను. అది వందలకొలది చిరుగంటలచేత అలంకరింపబడి ఉండెను. లేత సూర్యుడు వలె ఉన్న దాని నిలువుదూలము వైదూర్యమణులచేత అలంకరింపబడెను. దానికి బంగారు శిరోభూషణములతోను, తెల్లని చామరములతోను, బంగారు జరీతోను అలంకరించిన, సూర్యునితో సమానములైన, ఆకుపచ్చ రంగు ఉత్తమాశ్వములు కట్టబడెను. దాని ధ్వజము వెదురు ఆకారము గల బంగారు దండముపై ఎగురుచుండెను. (8-13)

ఇంద్రుని సారథియైన మాతలి కొరడాతో రథమునందే ఉండి నమస్కరించుచు

రామునితో- "గొప్పబలము గలవాడవు, శోభాయుక్తుడవు, శత్రుసంహారకుడవు అయిన ఓ! రామా! ఈ రథమును నీ విజయముకొరకు దేవేంద్రుడు నీకు పంపినాడు. ఇంద్రుని ఈ గొప్ప ధనుస్సు, అగ్నితో సమానమైన కవచము, సూర్యునివంటి బాణములు, నిర్మలము, మంగళప్రదము అయిన శక్తి కూడ పంపినాడు. వీరుడవైన రాజా! నేను సారథిగా ఉన్న, ఈ రథమునెక్కి, మహేంద్రుడు దానవులను సంహరించినట్లు రావణుణ్ణి సంహరింపుము." అని పలికెను. రాముడు ఆ రథమునకు ప్రదక్షిణము చేసి నమస్కరించి లోకములను శోభతో ప్రకాశింపచేయుచు ఎక్కెను. రామునకు, రావణునకు వ్యాకులము రోమాంచము పుట్టించునదీ అయిన మహాయుద్ధము జరిగెను. గొప్ప అస్త్రములను ఎరిగిన రాముడు, రావణుడు ప్రయోగించిన గాంధర్వాస్త్రమును గాంధర్వాస్త్రముచేతను, దైవాస్త్రమును దైవాస్త్రముచేతను కొట్టివేసెను.(14-20)

రావణుడు చాలా కోపించి మరల చాల ఘోరమైన రాక్షసాస్త్రమును ప్రయోగించెను. రావణుని ధనుస్సు నుండి బయలుదేరిన, బంగారముచేత అలంకరింపబడిన ఆ బాణములు గొప్ప విషము గల సర్పములుగా అయి రాముని మీదకి వచ్చినవి. మండుచున్న ముఖములు గల భయంకరములైన ఆ సర్పములు ముఖములతో నిప్పులు కక్కుచు, నోళ్ళు తెరచుకొని రాముని మీదకు వెళ్ళినవి. వాసుకి సర్పమువంటి తీవ్రమైన స్పర్శగల, ప్రకాశించుచున్న పడగలు గల మహావిషములైన ఆ సర్పములు సమస్తమైన దిక్కులను విదిక్కులను కప్పివేసెను. యుద్ధములో వచ్చి మీదపడుచున్న ఆ సర్పములను చూచి రాముడు ఘోరము, భయంకరమూ అయిన గారుత్మతాస్త్రమును ప్రయోగించెను. రాముని ధనుస్సునుండి విడువబడిన, బంగారు పొన్నులు గల అగ్నివలె ప్రకాశించుచున్న ఆ బాణములు సర్పములకు శత్రువులైన బంగారు గరుత్మంతులుగా అయి సంచరించెను. స్వేచ్ఛారూపము గల గరుత్మత్పక్షుల ఆకారములతో ఉన్న ఆ రాముని బాణములు, గొప్ప వేగముగల, సర్పరూపములైన ఆ బాణముల నన్నింటిని కొట్టివేసెను.(21-27)

ఆ అస్త్రము కొట్టివేయబడుటచే కోపించిన రాక్షసరాజైన రావణుడు, రామునిపై ఘోరమైన బాణవర్షమును కురిపించెను. పిమ్మట వేయి బాణాలచేత, రాముణ్ణి పీడించి, బాణసముదాయముచే మాతలిని కొట్టెను. ఒక బాణముతో గురిచూచి కొట్టి ధ్వజమును ఛేదించెను. ఆ బంగారు ధ్వజమును రథశిఖరమునుండి రథము పైభాగమున పడగొట్టి బాణసముదాయముచేత ఇంద్రుని అశ్వములను కొట్టెను. ఆ విధముగా పీడింపబడిన రాముణ్ణి చూచి దేవ-గంధర్వ-చారణులు, దానవులు,

సిద్ధులు, మహర్షులు దిగులుచెందిరి. రావణు డనే రాహువు రాముడనే చంద్రుణ్ణి మ్రింగివేయుట చూచి వానరనాయకులు విభీషణుడూ కూడ వ్యథ చెందిరి. బుధుడు ప్రజలకు అశుభమును సూచించుచు, ప్రజాపతి దేవతగా గల నక్షత్రమైన, చంద్రునకు ప్రియురాలైన రోహిణిని ఆక్రమించుకొని ఉండెను. అప్పుడు ధూమముతో కూడి ఎగురుచున్న తరంగములతో మండుచున్నదా అన్నట్లున్న సముద్రము ప్రకోపించి, సూర్యుణ్ణి స్పృశించుచున్నదా అన్నట్లు పైకి లేచెను. కిరణములు కాంతివిహీనములుకాగా నల్లగా అయిన పరుషముగా ఉన్న సూర్యమండలము దగ్గర మొండెము, తోకచుక్క కనబడెను. ఇక్ష్వాకువంశీయుల నక్షత్రము, ఇంద్రాగ్నులు దేవతలుగా గలదీ అయిన విశాఖను ఆకాశమునందు అంగారకుడు ఆక్రమించుకొని ఉండెను. ధనుస్సు ధరించి పది ముఖములతో, ఇరవై చేతులతో నిలచి ఉన్న ఆ రావణుడు మైనాకపర్వతమువలె కనబడుచుండెను.(28-37)

రాక్షసుడైన రావణుడు యుద్ధాగ్రమునందు ఈ విధముగా ఆక్రమించి కొట్టుచుండగా రాముడు బాణాలను సంధించజాలకపోయెను. అపుడు రాముడు కోపించి, కనుబొమ్మలు విరిచి, కొంచెము ఎఱ్ఱగానున్న నేత్రములు గలవాడై చూపుతో కాల్చివేయుచున్నాడా అన్నట్లు చాల కోపము చెందెను. కోపించిన బుద్ధిమంతుడైన రాముని ముఖము చూచి సకల ప్రాణులు భయముచెందినవి. భూమి కూడా కంపించెను. సింహములతోను, పెద్దపులులతోను కూడిన పర్వతము చలించెను. దానిమీద నున్న చెట్లు ఇటు అటు ఊగిపోయెను. నదుల ప్రభువైన సముద్రము క్షోభించెను. గాడిదరంగుతో కటువైన ఉరుములు గల పరుషములైన మేఘములు రాబోవు ఉపద్రవమును సూచించుచు, ధ్వని చేయుచు, ఆకాశములో అంతటా ఎగిరినవి. చాల కోపించిన రాముణ్ణీ, దారుణములైన దుఃశకునములను చూచి ప్రాణులన్నీ భయపడినవి. రావణునకు కూడా భయము కలిగెను. అప్పుడు భయంకరములైన అనేకవిధములైన ఆయుధములతో యుద్ధము చేయుచున్న ఆ ఇద్దరు శూరుల, ప్రళయముతో సమానమైన యుద్ధమును, విమానములలో ఉన్న దేవతలు, గంధర్వులు, మహోరథులు, ఋషులు, దానవులు, దైత్యులు ఆకాశముమీద సంచరించుచున్న గరుత్మంతులు చూచిరి.(38-45)

ఆ మహాయుద్ధమును చూచుచున్న సురులూ, అసురులూ అందరూ ఒకరితో ఒకరు కలహించుకొనుచు, సంతోషించుచు ఆసక్తితో ఉండిరి. అక్కడ చేరిన అసురులు "నీవు జయించుము" అని రావణునితోను, దేవతలు, "నీవు జయించుము" అని రామునితోను మాటిమాటికి పలికిరి. ఇంతలో దురాత్ముడైన ఆ రావణుడు

కోపముతో, రాముష్టి కొట్టుటకై గొప్ప ఆయుధమును స్పృశించుచు వజ్రమువంటి సారము, గొప్ప ధ్వనీ గల సర్వశత్రువినాశకమైన శూలమును గ్రహించెను. అది పర్వతశిఖరములువలె ఉన్న అగ్రభాగములతో చూచుటకు, చిత్తమునకు భయము కలిగించుచుండెను. ధూమముతో కూడిన తీక్ష్ణాగ్రములు గల ఆ శూలము ప్రళయకాలమునందలి అగ్నిరాశివలె చాల భయంకరమై సమీపింపశక్యముకానిదిగా ఉండెను. యముడు కూడా ఎదిరించజాలని ఆ శూలము సకలప్రాణులకు భయంకరమై ఉండెను. అది చీల్చుటకు బ్రద్దలుకొట్టుటకు సమర్థమై మండుచున్నదా అన్నట్లుండెను. పరాక్రమవంతుడైన ఆ రావణుడు మిక్కిలి కోపించి, ఆ శూలమును మధ్యభాగమునందు పట్టుకొనెను. పెద్ద శరీరము గల అతడు కోపమువలన ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై తన సైన్యమునకు సంతోషము కలిగించుచు, యుద్ధమునందు, భయంకరముగా అరచెను. అప్పుడు రావణుడు చేసిన దారుణమైన శబ్దము భూమిని, ఆకాశమును, దిక్కులను, విదిక్కులను కంపింపచేసెను. ఆ దురాత్ముని ధ్వనిచేత సకలభూతములు భయపడినవి. సముద్రము కూడ క్షోభించెను. (46-55)

రావణుడు ఆ పెద్ద శూలమును గ్రహించి చాల బిగ్గరగా అరచి రామునితో- "ఓ రామా! కోపముతో నేను ఎత్తి ప్రయోగించిన, వజ్రమువంటి శక్తి గల ఈ శూలము నీ ప్రాణములను, నీ సోదరుని ప్రాణములను తప్పక హరించగలదు. రణమునందు శ్లాఘకు పాత్రుడనైన నేను ఇప్పుడు బలముచేత నిన్ను చంపి, నిన్ను యుద్ధరంగమునందు నీచేత చంపబడిన రాక్షసులతో సమానునిగా చేసెదను. రామా! నిలబడుము. నిన్ను ఈ శూలముచేత చంపెదను." అని పలుకుచు శూలమును విసరెను. మెరుపుల పంక్తులు చుట్టూ ఉన్న, ఎనిమిది ఘంటలు గల, గొప్ప ధ్వనిచేయుచున్న ఆ శూలము రావణుని హస్తమునుండి విడవబడి ఆకాశమునందు ప్రకాశించెను. రఘువంశసంజాతుడు, పరాక్రమవంతుడూ అయిన రాముడు చూచుటకు భయంకరముగా ఉన్న, మండుచున్న ఆ శూలమును చూచి, ధనుస్సు వంచి బాణములను విడచెను. రాముడు వచ్చి మీద పడుచున్న ఆ శూలమును పైకి లేచుచున్న ప్రళయకాలాగ్నిని దేవేంద్రుడు జలధారలచేత వలె, బాణసముదాయముచేత నివారించెను. రావణుని ఆ మహాశూలము రాముని ధనుస్సునుండి బయలుదేరిన ఆ బాణములను అగ్ని మిడతలను కాల్చివేసినట్లు కాల్చివేసెను. ఆకాశముమీద ఉండగానే శూలస్పర్శచేత చూర్ణితములై భస్మమైపోయిన ఆ బాణములను చూచి రాముడు కోపించెను. రాముడు చాలా కోపించి, మాతలి తీసికొనివచ్చిన, దేవేంద్రుని

గౌరవమునకు పాత్రమైన ఆ శక్తిని గ్రహించెను. బలవంతుడైన రాముడు పైకి ఎత్తిన ఆ శక్తి ఘంటల ధ్వని చేయుచు ప్రళయకాలమునందు పడుచున్న కాంతిమంతమైన ఉల్కవలె ఆకాశమునందు మంటలు పుట్టించెను. రాముడు విసరిన ఆ శక్తి ఆ రావణుని శూలముమీద పడెను. ఆ మహాశూలము శక్తిచేత విరగగొట్టబడినదై కాంతిహీనమై నేలమీద పడెను.(56-67)

పిమ్మట రాముడు తీక్షణములు, గొప్ప వేగముగలవి, తిన్నగా వెళ్ళునవి అయిన బాణాలచేత రావణుని మహావేగము గల గుఱ్ఱములను కొట్టెను. వాడియైన బాణాలచేత రావణుని వక్షఃస్థలమును భేదించెను. మూడు బాణాలచేత, ప్రయత్నపూర్వకముగా అతని లలాటముమీద కొట్టెను. బాణములచేత అవయవములన్నీ భేదింపబడగా దేహమునుండి రక్తము కారుచున్న ఆ రావణుడు వృక్షముల మధ్యనున్న వికసించిన అశోకవృక్షమువలె ఉండెను. రాముని బాణములచేత ఎక్కువగా కొట్టబడి రక్తముతో తడసిన శరీరము గల రావణుడు రాక్షససమూహము మధ్య ఎక్కువ అలసట చెంది చాల కోపించెను.(68-71)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట రెండవ సర్గము సమాప్తము.

నూట మూడవ సర్గము

రాముడు రావణుని అధిక్షేపించుట. అలసిపోయిన రావణుని సారథి దూరముగా తీసుకొనిపోవుట.

కోపించిన రామునిచేత ఆ విధముగా పీడించబడిన, రణమునందు శ్లాఘించుకొను ఆ రావణుడు చాల కోపమును పొందెను. పరాక్రమవంతుడూ, వీరుడూ అయిన ఆ రావణుడు కోపమువలన ప్రజ్వలించుచున్న నేత్రములు కలవాడై రామునిపై కోపించి, ఆకాశమునుండి మేఘము చెరువును వలె వేలకొలది బాణధారలచేత రాముణ్ణి నింపివేసి పీడించెను. యుద్ధములో ధనుస్సునుండి విడువబడిన బాణసముదాయముచేత నింపబడిన రాముడు, కంపింపచేయ శక్యముకాని మహాపర్వతమువలె కంపింపలేదు. పరాక్రమశాలియైన రాముడు యుద్ధములో నిలచి, బాణసముదాయములను బాణములచేత నివారించుచు, సూర్యకిరణములను వలె స్వీకరించెను.(1-5)

పిమ్మట హస్తలాఘవము గల రావణుడు కోపించి మహాత్ముడైన రాముని

వక్షఃస్థలముమీద వేలకొలది బాణములను ప్రయోగించెను. యుద్ధమునందు రక్తముతో తడిసిన రాముడు అరణ్యములో పుష్పించిన పెద్దదైన కింశుకవృక్షమువలె కనబడెను. బాణముల దెబ్బ తినుటచే తొందరపడుచు రాముడు ప్రళయకాలాగ్నితో సమానమైన తేజస్సు గల బాణములను గ్రహించెను. చాల కోపావేశములో ఉన్న ఆ రామరావణులిద్దరూ అప్పుడు ఆ యుద్ధమునుండి బాణములచేత ఏర్పడిన అంధకారములో ఒకరికొకరు కనబడలేదు.(6-9)

పిమ్మట వీరుడైన రాముడు, క్రోధముతో నవ్వి రావణునితో ఇట్లు పరుషముగా పలికెను- "ఓ రాక్షసాధమా! అసహాయురాలైన నా భార్యను నీవు నాకు తెలియకుండగా, జనస్థానమునుండి తీసుకొనివచ్చినావు. అందుచేత నీవు పరాక్రమవంతుడవు కావు. నేను దగ్గర లేని సీత మహావనములో ఉంటూండగా ఆ దీనురాలిని హరించి "నేను మహాశూరుడను" అని అనుకొనుచున్నావు. రక్షకులు లేని స్త్రీల విషయమున శూరుడా! పరభార్యాస్పర్శ చేయువాడా! నీచపురుషులు చేయు పని చేసి "నేను శూరుడను" అని అనుకొనుచున్నావు. కట్టుబాట్లు చెడగొట్టినవాడా! సిగ్గులేనివాడా! సచ్చరిత్రను అనుసరించనివాడా! గర్వముచేత మృత్యువును దగ్గరకు పిలుచుకొన్న నీవు "నేను శూరుడను" అని అనుకొనుచున్నావు. కుబేరుని సోదరుడవు, శూరుడవు, సైన్యములు ఉన్నవాడవు అయిన నీవు శ్లాఘింపదగిన, యశస్సును కలిగించే గొప్ప పని చేసినావు! గర్వముచేత చేసిన, నింద్యమూ, అహితమూ అయిన ఆ కర్మకు చాల గొప్ప ఫలమును నేడు, ఇప్పుడే పొందుము. దుర్మతీ! "నేను శూరుడను" అని నిన్ను గూర్చి నీవు అనుకొనుచున్నావు. దొంగవలె సీతను అపహరించిన నీకు ఏమాత్రము సిగ్గే లేదు. నీవు నేను దగ్గర ఉండగా బలము చూపి సీతను అవమానించి ఉన్నచో అప్పుడు నా బాణములచేత చంపబడినవాడవై నీ సోదరుడైన ఖరుణ్ణి చూచి ఉండెడి వాడవు. ఓ! మందబుద్ధిగలవాడా! దైవవశముచే నీవు నాకంట పడినావు; ఇప్పుడు నిన్ను వాడియైన బాణాలచేత యమలోకమునకు పంపెదను. ఇప్పుడు నేను బాణములచేత ఛేదించగా యుద్ధభూమి పరాగములలో పడియున్న ప్రకాశించుచున్న కుండలములు గల నీ శిరస్సును మాంసము తిను మృగములు లాగుగాక. రావణా! నేలమీద పడగొట్టబడిన నీ వక్షఃస్థలముమీద వాలి గ్రద్దలు బాణాల ములుకుల సందులనుండి కారిన రక్తమును ఆసక్తితో త్రాగుగాక. నేడు నా బాణములచేత బ్రద్దలుకొట్టబడి, ప్రాణములు పోయి క్రిందపడి ఉన్న నీ ప్రేగులను పక్షులు, గరుడపక్షులు సర్పములను లాగినట్లు లాగుగాక."(10-22)

వీరుడు, శత్రుసంహారకుడూ అయిన రాముడు ఇట్లు పలుకుచూ

సమీపమునందున్న రావణునిపై బాణవర్షములు కురిపించెను. యుద్ధములో శత్రువును చంపవలె నని నిశ్చయించుకొన్న రాముని పరాక్రమము, బలము, ఉత్సాహము, అస్త్రబలమూ కూడ రెండు రెట్లు అయ్యెను. ప్రసిద్ధమైన బుద్ధి గల ఆ రామునకు అన్ని అస్త్రములు స్ఫురించెను. మహాతేజఃశాలియైన అతని హస్తలాఘవము ఉత్సాహముచేత చాల అధికమయ్యెను. రాక్షససంహారకుడైన ఆ రాముడు తనలో కనబడుచున్న ఈ శుభచిహ్నములను గుర్తించి రావణుణ్ణి ఇంకా అధికముగా పీడించెను. వానరుల రాళ్ళచేతను రాముని బాణవర్షముచేతనూ కొట్టబడిన రావణుని హృదయము తిరిగిపోయినట్లు అయ్యెను. ఆ సమయమునందు అతడు శస్త్రప్రయోగము ఆరంభించలేదు. ధనుస్సును లాగలేదు. ఆ రాముని పరాక్రమమునకు ప్రతిక్రియ చేయలేదు. అతని అంతరాత్మ వ్యాకులమై ఉండెను. అతనికి మృత్యుకాలము ఆసన్నమగుటచే అతడు శీఘ్రముగా ఉపయోగించిన బాణములు, అనేకవిధములైన ఆయుధములు యుద్ధకార్యమును సాధింపజాలకపోయినవి.(23-29)

రావణుని రథమును నడుపుచున్న సారథి, అతడు అట్టి పరిస్థితిలో ఉండుట చూచి, కంగారుపడక అతని రథమును మెల్లగా యుద్ధభూమినుండి దూరముగా తీసికొని పోయెను. అప్పుడు సారథి తన ప్రభువు పరాక్రమము ఉడిగి ఓడిపోయినట్లు చూచి, భయపడి, భయంకరము, మేఘధ్వని వంటి ధ్వని కలదీ అయిన రథమును వెంటనే మరల్చి యుద్ధభూమి విడచి వెళ్ళిపోయెను.(.30,31)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట మూడవ సర్గము సమాప్తము.

నూట నాలుగవ సర్గము

రావణుడు నిందించగా, సారథి కారణము తెలిపి రథమును మరల యుద్ధభూమికి తీసికొని వెళ్ళుట.

దైవబలముచేత ప్రేరేపింపబడిన ఆ రావణుడు అజ్ఞానమువలన కోపించి, కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో సారథిని– "ఓ! చెడ్డబుద్ధికలవాడా! అసమర్థుడైన, పౌరుషము లేని పరాక్రమహీనుణ్ణివలె, భయస్వభావము గల, బలములేని సామాన్యవ్యక్తినివలె, తేజస్సులేనివానినివలె, మాయాశక్తులన్నీ కోల్పోయినవానినివలె, అస్త్రములచేత విడువబడినవానిని వలె నన్ను అవమానముచేసి నీ ఆలోచన ప్రకారము

ప్రవర్తించుచున్నావేమి? శత్రువుల సమక్షమునందు నాకు అవమానము కలుగునట్లుగా, నా అభిప్రాయమును తెలిసికొనకుండా నీవు నా రథమును ఎందుకు దూరముగా తీసికొనివచ్చినావు? అనార్యుడా! నీవీనాడు నేను చిరకాలమునుండి సంపాదించిన కీర్తిని, పరాక్రమమును, తేజస్సును, నమ్మకమును(మహాశూరు డని నాపై ఇతరుల కున్న నమ్మకమును) నశింపచేసినావు. ప్రసిద్ధమైన పరాక్రమము గలవాడు, పరాక్రమములచేత సంతోష పెట్టదగినవాడూ అయిన శత్రువు చూచుచుండగా నీవు యుద్ధమునందు అత్యాసక్తి గల నన్ను నీచపురుషుణ్ణిగా చేసివేసినావు! ఓ! దుర్మతీ! నీవు ఈ రథమును తెలివితక్కువతనమున ఇట్లు తీసికొనిరాకున్నచో - నీకు శత్రువు లంచ మిచ్చి యుండును అని నా ఊహ; సత్యము! నీవు చేసిన ఈ పని శత్రువులు చేయదగినదే కాని హితమును కోరు మిత్రుడు చేయదగినది కాదు. నీవు నాదగ్గర చాల కాలము నివసించిన విషయము జ్ఞాపకమున్నచో నేను నీకు చేసిన ఉపకారాదులు జ్ఞాపకమున్నచో నా శత్రువు దూరముగా వెళ్ళిపోక మునుపే రథమును శీఘ్రముగా మరల్చుము." అని నిందించెను. (1-9)

బుద్ధివిహీనుడైన రావణుడు పలికిన ఆ పరుషవాక్యములు విని హితబుద్ధియైన సారథి అతనిని బ్రతిమాలుకొనుచు- "మహారాజా! నేను భయపడలేదు; నా ఆలోచన చెడలేదు. శత్రువులచే లంచము మొదలైనవి ఇచ్చి వశము చేసుకొనబడలేదు. పొరబడలేదు. స్నేహవిహీనుడను కాలేదు. నీవు చేసిన సత్కారము మరువలేదు. మీ మంచిని కోరిన, నీ కీర్తిని రక్షించుచున్న, స్నేహముచేత ప్రసన్నమైన మనస్సు గల నేను నీకు ప్రియము కాకున్నను ఈ పని నీకు హితము (శ్రేయస్కరము) అను కారణముచేత చేసితిని. మహారాజా! నీ ప్రియహితములను కోరు నన్ను ఈ విషయమునందు నీవు ఎవడో లఘుబుద్ధిగల అనార్యుడు వలె దోషము చేసినట్లు భావించకుము. ఉన్నతప్రదేశమునందు నదిని వలె యుద్ధరంగమునుండి నేను రథమును ఏ కారణమువలన మరల్చితినో చెప్పెదను, వినుము. ఎక్కువగా యుద్ధముచేసి ఉండుటచే నీవు శ్రమచెందినట్లు తెలిసికొన్నాను. పరాక్రమము చూపు విషయము సుముఖత్వముగాని, శత్రువుకంటె ఆధిక్యము గాని నీలో నాకు కనబడలేదు. రథమునకు కట్టిన గుఱ్ఱములు రథమును లాగుటచేత అలసి కదలలేకుండా అయినవి. వర్షముచేత కొట్టబడిన గోవులవలె, వేడిచేత అలసినవై దీనములుగా ఉన్నవి. మనకు కనబడుచున్న నిమిత్తములు(శకునములు) చాలవరకు పరీక్షించగా మనకు ప్రతికూలముగానే ఉన్నట్లు నాకు కనబడినవి. (10-17)

మహాబలవంతుడా! సారథిగా ఉన్నవాడు దేశకాలాలను, రథికుని లక్షణాలను, ముఖవికారములను, దైన్యమును, ఉత్సాహమును, అలసటను చూచుచుండవలెను. సారథి నేలమీద ఎత్తు పల్లములు, సమప్రదేశములు, సమముగా లేని ప్రదేశములు, యుద్ధసమయము – వీటి నన్నింటిని తెలిసికొనవలెను. శత్రువులో ఉన్న లోపములను కూడ గుర్తించుచుండవలెను. రథమునందున్న రథసంరక్షకుడైన సారథికి దగ్గరగా వెళ్ళుట, దూరముగా వెళ్ళుట, నిలుచుట, దూరముగా తొలగుట – ఇవన్నీ తెలియవలెను. భయంకరమైన అలసటను తప్పించుటకు, నీకూ రథాశ్వములకూ విశ్రాంతికొరకూ నేను ఈ పనిని యుక్తముగానే చేసితిని. ఓ! వీరుడా! ఓ! ప్రభూ! నేను ఈ రథము కేవలము నా ఇష్టము ప్రకారము తొలగించలేదు. నేను చేసిన ఈ పని ప్రభుభక్తిచేతనే చేయబడినది. శత్రుసంహారకుడవైన వీరుడా! ఆజ్ఞాపించుము. నీవు ఎట్లు చేయమని చెప్పెదవో అట్లే, నీ ఋణమును తీర్చుకొనవలెను అను ఆలోచనతో చేసెదను." అని పలికెను.(18-23)

ఆ సారథి పలికిన మాటలకు సంతోషించిన రావణుడు అతనిని అనేకవిధముల ప్రశంసించి, యుద్ధమునందు ఆసక్తి కలవాడై– "సారథీ! రథమును రామునకు ఎదురుగా తీసికొని వెళ్ళుము. రావణుడు యుద్ధములో శత్రువులను చంపకుండగా వెనుకకు తిరిగి వెళ్ళడు." అని పలికెను. రాక్షసప్రభువైన రావణుడు ఇట్లు పలికి, సంతోషించినవాడై అతనికి ఒక అందమైన శ్రేష్ఠమైన హస్తాభరణమును బహూకరించెను. ఆ సారథి రావణుని మాటలు విని వెనుకకు మరలెను. రావణుని వాక్యముచేత ప్రేరితుడై ఆ సారథి శీఘ్రముగా గుఱ్ఱములను తోలెను. పిమ్మట క్షణకాలములో ఆ రావణుని రథము రాముని రథము ఎదుట ఉండెను.(24-27)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట నాలుగవ సర్గము సమాప్తము.

నూట ఐదవ సర్గము

అగస్త్యుడు వచ్చి జయము కొరకై రామునకు ఆదిత్యహృదయస్తోత్రమును ఉపదేశించుట.

భగవంతుడైన అగస్త్యమహర్షి యుద్ధము చూచుటకై దేవతలతో కలసివచ్చెను. అప్పుడు, యుద్ధముచేసి అలసి, యుద్ధమునకై వచ్చి, ఎదుట ఉన్న రావణుని చూచి యుద్ధరంగములో చింతాక్రాంతుడై ఉన్న రాముని దగ్గరకు వెళ్ళి అతడు ఇట్లు పలికెను- "నాయనా! ఓ! రామా! రామా! నిత్యమైన ఒక రహస్యస్తోత్రమును వినుము. దీనిచేత యుద్ధములో సర్వశత్రువులను జయించగలవు. పుణ్యప్రదమైన ఆదిత్యహృదయస్తోత్రమును నిత్యము జపించవలెను. ఇది సకలశత్రువులను నశింపజేయును. జయము నిచ్చును. అక్షయమైన ఫలమును ఇచ్చును. చాల పవిత్రమైనది. మంగళప్రదములైన అన్ని స్తోత్రాలలోను ఇది మంగళప్రదము. సకలపాపములను తొలగించును. చింతను, శోకమును శాంతింపజేయును. ఆయుస్సును వృద్ధిపొందించు ఉత్తమసాధనము. సూర్యుడు ప్రశస్తములైన కిరణములు గలవాడు. ఉదయపర్వతమునందు ఉదయించువాడు. లోకులను తమ తమ పనులలో ప్రవర్తింపచేయువాడు. దేవతలచేత అసురులచేత కూడ నమస్కరింపబడినవాడు. తన తేజస్సుచే ఇతర తేజస్సులను కప్పివేయువాడు. కాంతిని ఇచ్చువాడు. సర్వలోకములను నియమించువాడు. అట్టి సూర్యుణ్ణి ఆరాధింపుము. (1-6)


ఇతడు సర్వదేవతాస్వరూపుడు; గొప్ప తేజస్సుకలవాడు. కిరణములచేత లోకులను రక్షించువాడు. ఈ సూర్యుడు కిరణములచేత దేవగణములను, అసురగణములను, జనులను రక్షించుచున్నాడు. ఈ సూర్యుడే బ్రహ్మదేవుడు; విష్ణుడు; స్కందుడు; నవప్రజాపతులు; కుబేరుడు; కాలపురుషుడు; యముడు; సోముడు; వరుణుడు. పితృదేవతలు, వసువులు, సాధ్యులు, అశ్వినీదేవతలు, మరుత్తులు, మనువు, వాయువు, అగ్ని, ప్రజలు, ప్రాణవాయువు – ఇవన్నీ సూర్యుడే. ఇతడు ఋతువులను నిర్మించును. కాంతిని ఇచ్చును. అదితికుమారుడు. జగత్తు సృష్టించినవాడు. జనులను తమ తమ పనులలో ప్రేరేపించువాడు. ఆకాశమునందు సంచరించువాడు. జగత్తును వర్షాదులచేత పోషించువాడు. కిరణములు గలవాడు. బంగారు రంగు గలవాడు. ప్రకాశించువాడు, బంగారు తేజస్సుగలవాడు, పగలు కల్పించువాడు. సూర్యుని అశ్వములు ఆకుపచ్చనివి. వేయి కిరణములు గలవాడు, ఏడు గుఱ్ఱములు, కిరణములు గలవాడు. చీకటిని నశింపచేయువాడు. సుఖమును

ఇచ్చువాడు. ప్రాణులను సంహరించువాడు. బ్రహ్మాండమును ప్రళయానంతరము మరల సృజించువాడు. అంశువులు (కిరణములు) గలవాడు. సూర్యుడు బ్రహ్మవిష్ణురుద్రరూపుడు, చల్లనివాడు, తపింపచేయువాడు, పగటిని కల్పించువాడు. స్తుతింపబడువాడు, అగ్ని గర్భమునందుగలవాడు, అదితి పుత్రుడు, శాంతించువాడు, శిశిరమును నశింపచేయువాడు. (7-12)



సూర్యుడు ఆకాశమునకు ప్రభువు. రాహువును భేదించువాడు. ఋగ్యజుఃసామ వేదముల పారమును పొందినవాడు. అధికమైన వర్షమిచ్చువాడు. ఉదకమునకు మిత్రుడు. ఆకాశమున శీఘ్రముగా సంచరించువాడు. సూర్యుడు ఎండ ఇచ్చువాడు. మండలము గలవాడు. శత్రుసంహారకుడు, ఉదయసమయమున ఎఱ్ఱగా నుండువాడు. అందరికీ తాపము కలిగించువాడు. పండితుడు. ప్రపంచవ్యవహారము నడుపువాడు. గొప్ప తేజస్సు గలవాడు. అందరియందు ప్రేమగలవాడు. అందరి సంసారానికీ కారణభూతుడు. సూర్యుడు, అశ్విన్యాది నక్షత్రములకు, చంద్రాది గ్రహములకు తారలకు అధిపతి. జగత్తుకు స్థాపకుడు. అగ్న్యాదితేజస్సుల మధ్య అధికతేజస్సు గలవాడు. అట్టి సూర్యునకు నమస్కారము. ఓ! ద్వాదశస్వరూపములు గలవాడా! నీకు నమస్కారము. పూర్వ(తూర్పు) పర్వతరూపునకు నమస్కారము. పశ్చిమపర్వతరూపునకు నమస్కారము. జ్యోతిర్గణముల అధిపతికి నమస్కారము. దినాధిపతికి నమస్కారము. ఉపాసకులకు విజయమును, ఉన్నతిని, క్షేమమును (మంగళమును) ఇచ్చువాడు, ఆకుపచ్చని గుఱ్ఱములు గలవాడు అయిన సూర్యునకు నమస్కారము, నమస్కారము. వేయి కిరణములు కలవాడా! నమస్కారము నమస్కారము. ఆదిత్యునకు నమస్కారము. (13-17)

ఉగ్రునకు నమస్కారము. వీరునకు నమస్కారము. శీఘ్రముగా వెళ్ళువానికి నమస్కారము. నమస్కారము. పద్మములను వికసింపచేయువానికి నమస్కారము. తీక్ష్ణమైన నీకు నమస్కారము. బ్రహ్మ-విష్ణు-శివాత్మకునకు, సూర్యునకు,



ఆదిత్యరూపమైన తేజస్సు కలవానికి, కాంతి గలవానికి, సర్వసంహారముచేయువానికి, రౌద్రరూపముగలవానికి నమస్కారము. చీకటిని, మంచును, శత్రువులను, కృతఘ్నులను నశింపచేయువానికి, అపరిచ్ఛిన్నమైన స్వరూపము కలవానికి, ప్రకాశించుచున్నవానికి, జ్యోతిస్సుల అధిపతికి నమస్కారము. కాల్చిన బంగారమువంటి కాంతి కలవానికి, హరికి, విశ్వస్రష్టకు, తమోవినాశకునకు, ప్రకాశస్వరూపునకు, లోకసాక్షికి నమస్కారము.(18-21)

ప్రభువైన ఇతడే జగత్తును ప్రళయకాలమునందు నశింపజేయును, దానినే సృష్టించును. ఇతడు కిరణములచేత శుష్కింపచేయును; తపింపచేయును; వర్షించును. అన్ని ప్రాణులూ నిద్రించుచుండగా ఇతడు వాటిలో అంతరాత్మ రూపమున ఉండి మేల్కొని ఉండును. ఇతడే అగ్నిహోత్రము, అగ్నిహోత్రము చేయువారికి ఫలము నిచ్చువాడు. దేవతలు, క్రతువులు, క్రతువుల ఫలమూ కూడా సూర్యుడే. లోకములో ఉన్న సమస్తకృత్యముల (యజ్ఞయాగాదుల) విషయమున మిక్కిలి సమర్థుడు ఇతడే. రామా! ఆపదలలోను, దుర్గమప్రదేశములలోను, భయసమయములలోను ఈ ఆదిత్యుణ్ణి కీర్తించు ఏమానవుడూ నశించడు. జగత్తుకు ప్రభువైన ఈ దేవదేవుణ్ణి ఏకాగ్రచిత్తముతో పూజించుము. ఈ ఆదిత్యహృదయమును మూడు పర్యాయములు జపించినచో యుద్ధములలో జయము పొందగలవు. ఓ! మహాబాహూ! నీవు ఈ క్షణమునందే రావణుణ్ణి చంపగలవు." అగస్త్యుడీ విధముగా పలికి వచ్చిన విధముగానే వెళ్ళిపోయెను.(22-27)

గొప్ప తేజస్సు గల రాముడు అప్పుడు అది విని శోకమును విడిచిపెట్టెను. చాలా సంతోషించి, నిశ్చలమైన మనస్సుతో ఆ మంత్రమును ధరించెను. పరాక్రమవంతుడైన రాముడు మూడు పర్యాయములు ఆచమనముచేసి పవిత్రుడై సూర్యుణ్ణి చూచి, ఆదిత్యహృదయమును జపించి, గొప్ప సంతోషమును పొందెను. ధనుస్సు గ్రహించి రావణుని చూచి సంతోషించిన మనస్సుతో యుద్ధమునకై వచ్చెను. సర్వప్రయత్నములచేత అతనిని చంపుటకు నిశ్చయించుకొనెను.(28-30)

అప్పుడు సంతోషించిన సూర్యుడు రోమాంచము కలిగిన శరీరముతో దేవగణము మధ్య నిలచి, రాముణ్ణి చూచి, రావణుడు మరణించనున్నాడని తెలిసికొని

(లేదా రావణుడు మరణించు నట్లు అనుగ్రహించి) "తొందరపడుము" అని పలికెను. (31)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఐదవ సర్గము సమాప్తము.

నూట ఆరవ సర్గము

రావణుని పరాజయమును, రాముని విజయమును సూచించు శకునములు కనబడుట.

ఆ సారథి సంతోషించి ఎగురవేయబడిన పతాకలతో గంధర్వనగరము వలె ఉన్న, శత్రుసైన్యమును ఎదిరించు ఆ రావణుని రథమును తోలుకొనివచ్చెను. దానికి వేగము మొదలైన అన్ని మంచి గుణములు గల, బంగారు మాలలు అలంకరించిన గుఱ్ఱములు కట్టబడెను. యుద్ధమునకు కావలసిన ఉపకరణము లన్నీ దానిపై అమర్చబడెను. అది భూమిని ధ్వనింపచేయుచుండెను. అది శత్రుసైన్యములను నశింపచేసి స్వసైన్యములకు ఆనందము కలిగించెను. గొప్పధ్వని చేయుచు శీఘ్రముగా వచ్చుచున్న ఆ రావణుని రథమును రాముడు చూచెను. దానిపై పెద్ద ధ్వజము ఎగురుచుండెను. దానికి నల్లని గుఱ్ఱములు కట్టబడి ఉండెను. దాని కాంతి భయంకరముగా ఉండెను. సూర్యునివంటి కాంతితో అది ఆకాశమునందు ప్రకాశించుచున్న విమానమువలె ఉండెను. మెరుపుల వంటి పతాకలతో నిండి ఇంద్రధనుస్సు వంటి కాంతితో కనబడుచుండెను. (1-6)

బాణధారలు విడచుచున్న ఆ రథము జలధారలు విడచుచున్న మేఘమువలె ఉండెను. దాని ధ్వని వజ్రముచేత కొట్టగా బ్రద్దలగుచున్న పర్వతము వలె ఉండెను. అట్టి మేఘము వలె ఉన్న శత్రురథము వచ్చుచుండగా చూచి, రాముడు ధనుస్సును బాలచంద్రాకారములో వంకరగా వంగునట్లు చరచుచు ఇంద్రుని సారథియైన మాతలితో– "మాతలీ! తొందరగా వచ్చుచున్న ఈ శత్రురథమును చూడుము. ఇతడు మరల మహావేగముతో ప్రదక్షిణముగా వచ్చుచున్నాడు. దీనిని పట్టి తాను చచ్చుటకే వచ్చుచున్నాడని తోచుచున్నది. అందుచేత పొరపాటు చెందక ఈ శత్రువు రథమునకు ఎదురుగా వెళ్ళుము. పైకి లేచిన మేఘమును వాయువు ధ్వంసము చేసినట్లు వీనిని నశింపచేయ గోరుచున్నాను. గుఱ్ఱముల కళ్లెములను బాగుగా పట్టి

రథమును అదుపులో ఉంచుకొని శీఘ్రముగా తీసికొని వెళ్ళుము. భయపడక, తొందరపడక హృదయమునందు, చూపులలోను తొందరబాటు లేక నడుపుము. దేవేంద్రుని రథానికి అలవాటు పడిన నీకు వాస్తవములో ఏమీ చెప్పవలసిన పనిలేదు. నేను ఏకాగ్రచిత్తముతో యుద్ధము చేయదలచుచున్నాను. అందుచేత నీకు జ్ఞాపకముచేయుచున్నాను. కాని బోధించుటలేదు." అనెను.(7-13)

ఉత్తముడైన దేవతాసారథియైన మాతలి రాముని ఆ మాటలకు సంతోషించి రథమును నడిపెను. అతడు రావణుని రథమును ప్రదక్షిణముగా ఉండునట్లు చేయుచు, చక్రములవలన రేగిన పరాగముచేత రావణుని కప్పుచు రథమును నడిపెను. కోపించిన రావణుడు ఎఱ్ఱని కళ్ళు పెద్దవిచేసి రథమునకు ఎదురుగా ఉన్న రాముణ్ణి బాణాలచేత కంపింపచేసెను. రావణుడు అట్లు ఎదిరించుటచేత కోపింపచేయబడిన రాముడు రోషముతో ధైర్యమును, అనగా యుద్ధమునకు సంబంధించిన తీవ్రత్వమును పొందుచు, యుద్ధమునందు మహావేగము గల ఇంద్రుని ధనుస్సును గ్రహించెను. సూర్యకిరణములవంటి కాంతి గల బాణములను కూడ గ్రహించెను. పరస్పరసంహారమును కోరుచున్న వారిద్దరికీ మధ్య పరస్పరము ఎదురెదురుగా ఉన్న గర్వించిన సింహముల మధ్యవలె గొప్ప యుద్ధము జరిగెను.(14-18)

పిమ్మట దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు రావణుని వినాశనమును కోరుచు ఆ ఇద్దరు రథికులు యుద్ధమును చూచుటకై వచ్చిరి. అపుడు రావణుని వినాశమును సూచించుచు దారుణములు, రోమాంచము కలిగించునవి అయిన ఉత్పాతములు బయలుదేరినవి. పర్జన్యదేవుడు రావణుని రథము మీద రక్తము కురిపించెను. తీవ్రమైన గాలులు మండలాకారముగా తిరుగుచు ప్రదక్షిణముగా వీచినవి. ఒక పెద్ద గ్రద్దలగుంపు ఆకాశముమీద తిరుగుచు ఈ రావణుని రథము ఏ యే వైపులకు తిరుగుచుండునో ఆ వైపులకే ఎగురుచుండెను. లంకమీద జపాపుష్పమువంటి సంధ్య ఆవరించెను. అందుచే ఆ ప్రాంతమునందలి భూమి, పగలు కూడ మండిపోవుచున్నట్లు ఎఱ్ఱగా కనబడెను. అప్పుడు ఉరుములతో కూడిన పెద్ద ఉల్కలు పెద్ద ధ్వనితో పడినవి. రావణునకు చెడ్డవైన అవి రాక్షసులకు విషాదమును కలిగించినవి. రావణుడు ఉన్నచోట భూమి అదిరెను. యుద్ధము చేయుచున్న రాక్షసుల బాహువులను ఎవరో పట్టుకొన్నట్లు ఆయెను. రావణుని ఎదుట ఎఱ్ఱగాను, పచ్చగాను, తెల్లగాను, నీలవర్ణముతోను, ఉన్న సూర్యకిరణములు ప్రసరించి పర్వతముయొక్క ధాతువుల వలె కనబడుచుండెను.(19-26)

గ్రద్దలు వెనుకనే రాగా ఆడనక్కలు రావణుని ముఖమువైపు చూచుచు, నోళ్ళనుండి అగ్నిని కక్కుచు, తొందరగా అమంగళకరముగా అరచినవి. వాయువు యుద్ధభూమిలో పరాగము ఎగురగొట్టుచు, ఆ రావణుని కళ్ళు కప్పివేయుచు ప్రతికూలముగా వీచెను. మేఘములు లేకుండగానే ఆ రావణుని సైన్యమునందు అంతటా ఘోరమైన సహింపశక్యముకాని ధ్వనితో పిడుగులు పడినవి. సమస్తమైన దిక్కులూ, విదిక్కులూ చీకటిచేత కప్పబడెను. ఆకాశము పెద్ద పరాగముచేత కప్పబడి చూచుటకు కష్టముగా ఉండెను. దారుణములైన వందలకొలది గోరింకలు దారుణముగా అరచుచు, భీకరముగా పోరాడుచు అతని రథమువైపు ఎగిరినవి. అతని గుఱ్ఱములు జఘనములనుండి అగ్నికణములను, నేత్రములనుండి కన్నీళ్ళను, ఈ విధముగా అగ్నిని, నీటిని కూడ సమముగా నిరంతరమూ విడచినవి. భయము కలిగించే, దారుణములైన ఈ విధములైన అనేక అపశకునములు రావణుని వినాశమును సూచించుచు కనబడినవి.(27-33)

ఇట్లే సౌమ్యములు, మంగళప్రదములు అయిన శకునములు రాముని జయమును సూచించుచు అన్ని వైపులా కనబడినవి. రాముడు తన జయమును సూచించు సౌమ్యములైన శకునములను చూచి, చాల సంతోషించి రావణుడు చచ్చినట్లే అని తలచెను. అప్పుడు శకునముల విషయములో మంచి జ్ఞానము గల రాముడు యుద్ధరంగమునందు తనలో కనబడిన శకునములకు సంతోషించెను. సుఖము పొందెను. యుద్ధమునందు అధికపరాక్రమము చూపెను.(34-36)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఆరవ సర్గము సమాప్తము.

నూట ఏడవ సర్గము

రామరావణులు భయంకరముగా పోరాడుట.

పిమ్మట రామరావణుల మధ్య సకలలోకములకు భయమును కలిగించు రెండు రథములకు సంబంధించిన(ఇద్దరు రథికుల) చాల క్రూరమైన గొప్ప యుద్ధము జరిగెను. రాక్షససైన్యము, వానరసైన్యమూ కూడ ఆయుధములు ధరించి ఆశ్చర్యముతో నిశ్చేష్టమై నిలచి ఉండెను. బలశాలులైన ఆ నర రాక్షసులిద్దరూ యుద్ధమునకు దిగుటచూచి అక్కడనున్న రాక్షసవానరు లందరూ ఆ యుద్ధము చూచుటకు

ఆకర్షింపబడిన హృదయము గలవారై మిక్కిలి ఆశ్చర్యము చెందిరి. ఆ సైనికులందరు హస్తములలో అనేకవిధములైన ఆయుధములు ధరించి చూచుచు నిలబడిపోయిరి. ఒకరిమీదకి ఒకరు యుద్ధానికి వెళ్ళలేదు. రావణుణ్ణి చూచుచున్న రాక్షససైన్యము, రాముణ్ణి చూచుచున్న వానరసైన్యము ఆశ్చర్యము చెందిన కళ్ళతో చిత్తరువులో ఉన్నట్లు ఉండిపోయెను. ఆ రామరావణులు అక్కడ కనబడిన శకునములను చూచి, మనస్సులలో స్థిరమైన కోపముతో, భయపడకుండ యుద్ధము చేసిరి. ఆ సమయమున నాకు జయము లభించి తీరునని రాముడు, నేనెట్టైన మరణించవలసినదే అని రావణుడు నిశ్చయించుకొని యుద్ధములో తమ బలమునంతా చూపిరి. (1-7)

పిమ్మట పరాక్రమవంతుడైన రావణుడు కోపముతో బాణములు సంధించి రాముని రథముల మీద నున్న ధ్వజముమీద ప్రయోగించెను. ఆ బాణములు దేవేంద్రుని ధ్వజమును చేరకుండగానే రథశక్తిని స్పృశించి నేలమీద పడిపోయినవి. పిమ్మట పరాక్రమవంతుడైన రాముడు కూడ కోపించి, ధనుస్సు లాగి, అతడు చేసినదానికి ప్రతిక్రియ చేయవలె నని మనసా సంకల్పించెను. రాముడు మహాసర్పమువలె సహింప శక్యము గాని, తన తేజస్సుతో ప్రజ్వలించుచున్నదా అన్నట్లున్న వాడియైన బాణమును రావణుని ధ్వజముపై విడచెను. రాముడు ఆ ధ్వజమును గురి చూచి బాణమును విడువగా ఆ బాణము రావణుని ధ్వజమును ఛేదించి నేలమీద పడెను. రావణుని రథముపైనున్న ఆ ధ్వజము ఛేదింపబడి క్రిందపడెను. మహాబలశాలియైన ఆ రావణుడు ధ్వజము ఛేదింపబడుట చూచి, అమర్షముతో నవ్వుచున్నాడా అన్నట్లు కనబడెను. కోపముతో మండిపడుచు ఆ రోషావేశముతో బాణవర్షమును కురిపించెను. (8-14)

రావణుడు ప్రజ్వలించుచున్న బాణాలతో రాముని గుఱ్ఱములను కొట్టెను. దేవలోకమునకు సంబంధించిన ఆ గుఱ్ఱములు అక్కడ తొట్రుపాటు చెందలేదు. భయము కూడ చెందలేదు. తామరతూడులతో కొట్టినట్లు నిర్భయములై ఉండెను. ఆ గుఱ్ఱములు ఏమాత్రము బెదరకపోవుట చూచిన రావణునకు కోపము అధికమయ్యెను. అతడు మరల బాణవర్షము కురిపించెను. గదలను, పరిఘలను, చక్రములను, ముసలములను, పర్వతశిఖరములను, వృక్షములను, శూలములను, గండ్రగొడ్డళ్ళను వర్షించెను. హృదయమునందుగాని, ఉద్యమమునందు గాని అలసట చెందక మాయాకల్పితమైన ఈ ఆయుధవర్షమును వేలకొలది బాణాలను ప్రయోగించెను. ఆ యుద్ధమునందు వ్యాకులము, భయమును పుట్టించునది, భయంకరము, భయంకరమైన ప్రతిధ్వని కలదీ అయిన శస్త్రముల గొప్ప వర్షము

కురిసెను. అతడు రాముని రథమును విడిచిపెట్టి చుట్టూ ఉన్న వానరసైన్యముమీద బాణములు ప్రయోగించుచు ఆకాశమును అవకాశములేకుండా చేసెను. (15-20)

రావణుడు ప్రాణములమీద ఆశ వదలి ఆయుధములను ప్రయోగించెను. రాముడు ఆ విధముగా యుద్ధములో విజృంభించి యుద్ధమునందు అత్యాసక్తితో ఉన్న రావణుణ్ణి చూచి నవ్వుచున్నవాడు వలె అనాయాసముగా వాడియైన బాణాలు సంధించి వందలకొలది, వేలకొలది బాణాలను ప్రయోగించెను. రావణుడు ఆ బాణములు చూచి తన బాణములచేత ఆకాశమును అవకాశము లేని దానినిగా చేసెను. అప్పుడు వారిద్దరూ ప్రయోగించిన ప్రకాశించుచున్న బాణవర్షముచేత, ఆకాశము బాణాలచేత కట్టబడిన కాంతి గల రెండవ ఆకాశము వలె ప్రకాశించుచుండెను. ఆ రామరావణులు యుద్ధములో ఆ విధముగా బాణాలను ప్రయోగించుచుండగా లక్ష్యములేనిది కాని, లక్ష్యమును భేదించనిది కాని, వ్యర్థమైనది కాని ఒక్క బాణము కూడా లేకుండెను. అవి పరస్పరము కొట్టుకొని క్రింద పడిపోయినవి. వారిద్దరూ ఎడమచేతితోను, కుడిచేతితోను అవిచ్ఛిన్నముగా బాణములు వదలుచు యుద్ధముచేసిరి. భయంకరములైన బాణములచేత ఆకాశమును ఊపిరిసలపకుండా చేసిరి. (21-26)

రావణుని గుఱ్ఱములను రాముడు కొట్టెను. రాముని గుఱ్ఱములను రావణుడు కొట్టెను. ఈ విధముగా వారిద్దరూ ఒకరు చేసినదానిని మరొకరు అనుకరించి చేయుచు, చాల కోపముతో గొప్ప యుద్ధము చేసిరి. ముహూర్తకాలము వ్యాకులము, రోమాంచకరము అయిన యుద్ధము జరిగెను. మహాబలవంతులైన ఆ రామరావణులు యుద్ధరంగమునందు వాడియైన బాణాలతో బాగుగా యుద్ధము చేయుచుండిరి. ధ్వజము పడిపోవుటచేత రావణునకు అప్పుడు రామునిపై చాల కోపము కలిగెను. యుద్ధరంగములో ఆ విధముగా యుద్ధము చేయుచున్న ఆ రామరావణులను సకల భూతములు, ఆశ్చర్యము చెందిన మనస్సుతో చూచిరి. వారి శ్రేష్ఠములైన రథములు పరస్పరము పీడించుకొనుచు, మహాకోపముతో ఒకదానికి ఎదురుగా ఒకటి వెళ్ళినవి. ఆ రథములు ఒకదానినొకటి నశింపజేయుటకై ప్రయత్నించుచు సారథుల సామర్థ్యముచేత ఏర్పడిన మండలగతులను, ఋజుగతులను, దూరము వెళ్ళి వచ్చుచుండుటను, బహువిధములైన ఇతరగతులను చూపుచు భయంకరములుగా ఉండెను. (27-32)

రాముడు రావణుణ్ణీ, రావణుడు రాముణ్ణీ పీడించుచు ఒకరి గతిని మరొకరు

అడ్డుకొనుటకై గతివేగమును చూపుచుండిరి. బాణసముదాయములు చిమ్ముచున్న వారి రథశ్రేష్ఠములు జలధారలు వర్షించుచున్న మేఘముల వలె యుద్ధభూమిలో సంచరించినవి. ఆ రథములు యుద్ధములో అనేకవిధములైన గతులు చూపి మరల ఒకదానికొకటి ఎదురుగా నిలచినవి. అప్పుడు రథములు నిలచినప్పుడు వాటి కాడి కాడితోను, గుఱ్ఱాల ముఖాలు ముఖాలతోను, పతాకలు పతాకలతోను కలిసినవి. అప్పుడు రాముడు ధనుస్సునుండి నాలుగు వాడియైన బాణాలు ప్రయోగించి రావణుని ప్రకాశించుచున్న నాలుగు గుఱ్ఱములు వెనుకకు మరలునట్లు చేసెను. గుఱ్ఱములు వెనుకకుపోవునట్లు చేయుటచేత కోపించిన ఆ రావణుడు రామునిపై వాడియైన బాణాలు ప్రయోగించెను. బలవంతుడైన రావణుడు అంతగా బాణాలతో కొట్టినా కూడ రాముడు ఏ మాత్రము వికారము పొందలేదు; వ్యథ చెందలేదు. రావణుడు మరల మాతలిపై పిడుగుపాటు వంటి ధ్వని గల బాణములను ప్రయోగించెను. మాతలి శరీరముమీద పడిన మహావేగము గల బాణములు కొంచెమైనను సంమోహామును గాని, వ్యథను కాని కలిగించలేదు. రావణుడు మాతలిని పీడించుటచే కలిగినంతగా రామునకు తనను పీడించుటచేత కూడ కోపము కలుగలేదు. అతడు బాణసముదాయమును ప్రయోగించి శత్రువును విముఖుణ్ణిగా చేసెను. వీరుడైన రాముడు శత్రువు రథముపై ఇరవై, ముప్పై, అరవై, వంద, వెయ్యి - ఈవిధముగా బాణములను విడచెను. (33-43)

అప్పుడు రాక్షసరాజైన రావణుడు కూడ కోపించి రామునిపై గదలను, ముసలములను వర్షించి పీడించెను. మరల వారిద్దరూ ప్రారంభించిన యుద్ధము వ్యాకులముగాను రోమాంచజనకముగాను ఉండెను. గదల, ముసలముల, పరిఘల ధ్వనులచేతను, బాణముల పొన్నుల గాలులచేతను, ఏడు సముద్రములు క్షోభింపబడెను. సాగరములు క్షోభచెందగా వాటి క్రిందనున్న పాతాళములో నివసించు దానవులందరు, వేలకొలది పన్నగులు వ్యథ చెందిరి. పర్వతములతో, వనములతో, అరణ్యములతో సహా సమస్తభూమి కంపించెను. సూర్యుని కాంతి తగ్గెను. గాలి వీచుట మానివేసెను. దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు, కింకరులు, మహోరగులు వీరందరూ చింతాక్రాంతులైరి. అప్పుడు దేవతలు, ఋషిగణములు- "గోవులకు బ్రాహ్మణులకు స్వస్తి అగుగాక! లోకములు నశించకుండా స్థిరముగా ఉండుగాక! రాముడు యుద్ధములో రాక్షసరాజైన రావణుణ్ణి జయించుగాక." అని మెల్లగా చెప్పుకొనుచు ఘోరము, రోమాంచజనకము అయిన ఆ రామరావణుల యుద్ధమును చూచిరి. (44-51)

గంధర్వుల సంఘములు, అప్సరసల సంఘములు సాటిలేని ఆ యుద్ధము చూచి "ఆకాశమునకు ఆకాశమే సాటి; సముద్రమునకు సముద్రమే సాటి; రామరావణుల యుద్ధమునకు రామరావణుల యద్ధమే సాటి" అని ఒకరితో ఒకరు అనుకొనుచు ఆ రామరావణయుద్ధమును చూచిరి.(52,53)

పిమ్మట, గొప్ప బాహువులుగలవాడు, రఘువంశరాజుల కీర్తిని వృద్ధి పొందించువాడూ అయిన రాముడు కోపించి, సర్పమువంటి బాణమును ధనుస్సుమీద సంధించి, శోభాయుక్తము, ప్రకాశించుచున్న కుండలములు గలదీ అయిన రావణుని శిరస్సును ఛేదించెను. అప్పుడు నేలమీద పడిన ఆ శిరస్సును మూడు లోకములు చూచెను. ఆ శిరస్సు వంటిదే మరియొక శిరస్సు రావణునికి మొలచెను. హస్తలాఘవముతో శీఘ్రముగా పనులు చేయు రాముడు దానిని కూడ ఛేదించెను. యుద్ధమునందు రావణుని ఆ రెండవ శిరస్సు కూడ బాణముచేత ఛేదింపబడెను. ఛేదింపబడిన వెంటనే అది మరల కనబడెను. రాముడు వజ్రాయుధము వంటి బాణములచేత దానిని కూడ ఛేదించెను. ఈ విధముగా సమానమైన కాంతి గల నూరు శిరస్సులను ఖండించెను.(54-58)

ఇన్నిమార్లు ఛేదించినను రావణుడు ప్రాణములు విడచి అంతమొందుట కనబడలేదు. అప్పుడు, సకలాస్త్రములు ఎరిగినవాడు, వీరుడు, కౌసల్యానందవర్ధనుడు, అనేక బాణములు గలవాడు అయిన రాముడు- "ఏ బాణముచేత మారీచుడు చంపబడినాడో, వేటిచేత ఖరదూషణులు, క్రౌంచవనములో కబంధుడు, దండకవనములో విరాధుడు చంపబడినారో, ఏబాణములచేత సాలవృక్షములు, పర్వతమూ ఛేదింపబడినవో, వేటిచే వాలి చంపబడెనో, సముద్రము క్షోభింపచేయబడెనో, యుద్ధములో నాకు విశ్వాసస్థానములైన అట్టి ఈ బాణములు రావణుని విషయమున అల్పవీర్యములగుటకు కారణము ఏమై ఉండును!" అని ఆలోచించుచు, ఏమరిపాటు లేనివాడై, రావణుని వక్షఃస్థలము మీద బాణవర్షములు కురిపించెను.(59-62)

వీరుడైన రాముడు శత్రువు రథముపై ఇరవై, ముప్పై, అరవై, వంద, వెయ్యి - ఈవిధముగా బాణములను విడచెను. వ్యాకులము, రోమాంచకరమూ అయిన ఆ మహాయుద్ధము ఆకాశమునందు, నేలమీద, పర్వతములమీద జరిగెను. దేవ-దానవ-యక్ష-పిశాచ-ఉరగ-రాక్షసులు చూచుచుండగా ఆ మహాయుద్ధము ఏడు రోజులు జరిగెను. ఆ రామరావణయుద్ధమునకు రాత్రిగాని, పగలుగాని, ఒక

ముహూర్తముగాని, ఒక్క క్షణము గాని విరామము లేకుండెను. రామరావణుల మధ్య జరుగుచున్న ఆ యుద్ధములో రాముడింకా జయించకుండుట జూచి మహాత్ముడైన మాతలి యుద్ధాసక్తుడైన రామునితో శీఘ్రముగా ఇట్లు పలికెను.(63-67)


శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఏడవ సర్గము సమాప్తము.

నూటఎనిమిదవ సర్గము

రాముడు రావణుని సంహరించుట.

అప్పుడు మాతలి రామునకు జ్ఞాపకము చేయుచు- "ఓ! వీరుడా! ఏమీ తెలియనివాడవు వలె ఎందుకు ఈతనితో ఇంతసేపు యుద్ధము చేయుచున్నావు? ఓ! సర్వసమర్థుడా! ఈతనిని చంపుటకు బ్రహ్మాస్త్రమును ప్రయోగించుము. దేవతలు చెప్పిన వీని వినాశకాలము ఇప్పుడు వచ్చి ఉన్నది." అని పలికెను. మాతలి వాక్యముచేత స్మరింపచేయబడిన, పరాక్రమశాలియైన రాముడు, బ్రహ్మచేత ఇవ్వబడిన, యుద్ధములో తిరుగు లేని ఏ బాణమును పూర్వము భగవంతుడైన అగస్త్యుడు తనకిచ్చెనో అట్టి, బుసలు కొట్టుచున్న పాముపలె ఉన్న ప్రకాశించుచున్న బాణమును తీసెను.(1-4)

పూర్వము గొప్ప తేజస్సు గల బ్రహ్మదేవుడు దానిని ఇంద్రుని కొరకై నిర్మించి మూడు లోకములను జయించుటకై అతనికి ఇచ్చెను. దాని వేగసాధనములైన రెక్కలయందు వాయువు, ములికియందు అగ్నిసూర్యులు, బరువునందు మేరుమందర పర్వతములు అధిష్ఠానదేవతలుగా ఉందురు. దాని శరీరము బ్రహ్మమయము. దాని శరీరము మంటలతో నిండి ఉండెను. బంగారముచేత అలంకరించిన దాని పొన్ను చక్కగా ఉండెను. అది సకల భూతములలోని తేజస్సును తీసి దానితో నిర్మింపబడెను. సూర్యునివంటి కాంతితో ఉండెను. సర్పమువంటి ఆ బాణము ధూమముతో కూడిన ప్రళయకాలాగ్నివలె ప్రజ్వలించుచుండెను. అది నరుల, గజముల, అశ్వముల సముదాయములను బ్రద్దలుకొట్టినది. శీఘ్రముగా పనిచేయును. ఆ బాణము ఎన్నో ద్వారములను, కోట గడియలను, పర్వతములను బ్రద్దలుకొట్టెను. దాని శరీరము అనేకవిధములైన రక్తముచేత, కొవ్వుచేత పూయబడి చాల భయంకరముగా



ఉండెను. ఆ బాణము వజ్రమువంటి సారము గలది. గొప్ప ధ్వని చేయునది, అనేక యుద్ధములలో శత్రుసైన్యాదులను చీల్చివేసినది. అందరినీ భయపెట్టునది. బుసలు కొట్టుచున్న పాము వలె భయంకరముగా ఉన్నది. ఆ బాణము నిత్యమూ యుద్ధములో డేగలకు, గ్రద్దలకు, నక్కల గుంపులకు రాక్షసులకు ఆహారము నిచ్చుచుండును. యముని వంటి రూపముతో భయంకరముగా ఉండును. ఆ బాణము వానరనాయకులకు ఆనందము కలిగించునది. రాక్షసులను నశింపచేయునది. గరుత్మంతుని విచిత్రవర్ణములు గల అనేకవిధములైన రెక్కలు కట్టి మంచి వేగము ఉండునట్లు చేయబడినది. ఆ బాణము మూడు లోకములలోను ఉత్తమమైనది. ఇక్ష్వాకువంశీయుల భయమును నశింపచేయునది. శత్రువుల కీర్తిని హరించునది. తనకు సంతోషము కలిగించునది. మహాబలశాలియైన రాముడు ఆ మహాబాణమును వేదోక్తప్రకారము అభిమంత్రించి ధనుస్సుమీద సంధించెను.(5-14)

రాముడు శ్రేష్ఠమైన ఆ బాణములను సంధించునప్పుడు సకలభూతములు భయపడినవి. భూమి కంపించెను. కోపించిన ఆ రాముడు ధనుస్సును బాగా లాగి సావధానచిత్తుడై మర్మస్థానమును చీల్చివేయు ఆ బాణమును రావణునిపై ప్రయోగించెను. ఇంద్రుని బాహువుచేత ప్రయోగింపబడిన వజ్రాయుధమువలె ఎదిరింప శక్యముకానిదీ, యముడువలె నివారింపశక్యము కానిదీ అయిన ఆ బాణము రావణుని వక్షఃస్థలముమీద పడెను. శరీరమును అంతమొందించు మహావేగముగల ఆబాణము ఆ విధముగా విడవబడినదై దురాత్ముడైన రావణుని

హృదయమును బ్రద్దలు కొట్టెను. శరీరమును అంతమొందించు ఆ బాణము వేగముగా వెళ్ళి రావణుని ప్రాణములను హరించి, రక్తముచేత పూయబడినదై నేలలో ప్రవేశించెను. ఆ బాణము రావణుణ్ణి సంహరించి, రక్తముచేత తడిసి, తాను చేయవలసిన పని చేసిన పిమ్మట చడీచప్పుడూ లేకుండా తానుండు అంబులపొదిలోనికి మరల ప్రవేశించెను. (15-20)

ఆ విధముగా చంపబడి జీవితమును కోల్పోవుచున్న రావణుని హస్తమునుండి బాణములతో కూడిన ధనుస్సు క్రిందపడెను. ప్రాణములు పోయెను. భయంకరమైన వేగము, గొప్పతేజస్సు గల ఆ రావణుడు ప్రాణములు విడచి, వజ్రాయుధముచేత కొట్టబడిన వృత్రాసురుడు వలె రథము పైనుండి నేలమీద పడెను. (21, 22)

నేలమీద పడిపోయిన రావణుణ్ణి చూచి చంపగా మిగిలిన రాక్షసులందరూ ప్రభువు మరణించుటచేత భయాక్రాంతులై అన్నివైపులకు పారిపోయిరి. వృక్షములతో యుద్ధముచేయు వానరులు పారిపోవుచున్న ఆ రాక్షసులను అన్నివైపులనుండి ఎదిరించిరి. రావణుని వధను చూచి వానరులందరు విజయముచేత ప్రకాశించిరి. ఆనందించిరి. వానరులచేత పీడింపబడిన ఆ రాక్షసులు పారిపోయి తమకు ఆశ్రయము నిచ్చు రావణుడు చంపబడుటచే దీనములైన, కన్నీళ్ళు కార్చుచున్న ముఖములతో, భయాక్రాంతులై లంకకు పరుగెత్తిరి. విజయముతో ప్రకాశించుచున్న వానరులు సంతోషించుచు రాముని విజయమును, రాముడు రావణుని సంహరించుటను గూర్చి చెప్పుకొనుచు హర్షధ్వానములు చేసిరి. (23-26)

అప్పుడు దేవదుందుభి మధురముగా మ్రోగెను. అక్కడ దివ్యమైన సుగంధమును వహించుచు వాయువు సుఖకరముగా వీచెను. ఇతరులకు ఎవరికీ లభించని మనోహరమైన పుష్పవర్షము రాముని రథముమీద పుష్పములు వెదజల్లుచు, ఆకాశమునుండి నేలమీద పడెను. రాముణ్ణి స్తుతించు మహాత్ములైన దేవతలు పలికిన "బాగు బాగు" అను శ్రేష్ఠమైన వాక్కు ఆకాశమునుండి వినబడెను. క్రూరుడు, సర్వలోకభయంకరుడూ అయిన ఆ రావణుడు చంపబడగానే దేవతలు, చారణులు గొప్ప సంతోషము పొందిరి. రావణుణ్ణి చంపి సంతోషించుచున్న రాముడు రావణసంహారముచేత సుగ్రీవాంగదవిభీషణుల కోరికను తీర్చెను. (27-31)

అప్పుడు దేవతలందరు మనఃశాంతి పొందిరి. దిక్కులు ప్రసన్నములైనవి. ఆకాశము నిర్మలమయ్యెను. భూమి కంపించలేదు. వాయువు సుఖకరముగా వీచెను. సూర్యుని కాంతి స్థిరముగా ఉండెను. సుగ్రీవవిభీషణాంగదులు, లక్ష్మణుడు,

ఇతరమిత్రులు యుద్ధములో రాముని విజయము చేత సంతోషించి, అతనిని సమీపించి, మనోహరుడైన ఆ రాముణ్ణి యథావిధిగా పూజించిరి; కొనియాడిరి. రఘువంశరాజులకు ఆనందకరుడైన ఆ రాముడు శత్రువును చంపి, ప్రతిజ్ఞను నిలుపుకొని, యుద్ధరంగములో తన మిత్రాదులతోను సైన్యముతోను కూడినవాడై, దేవతాగణములతో కూడిన ఇంద్రుడు వలె ప్రకాశించెను.(32-34)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఎనిమిదవ సర్గము సమాప్తము.

నూట తొమ్మిదవ సర్గము

విభీషణుడు విలపించుట. రావణునకు అంత్యసంస్కారముచేయు మని రాముడు అతనిని ఆదేశించుట.

యుద్ధమునందు జయింపబడి, మృతుడై, శయనించియున్న సోదరుణ్ణి చూచి, శోకవేగముతో కూడిన మనస్సు కలవాడై విభీషణుడు విలపించెను– "వీరుడా! పరాక్రమించువాడా! సమర్థుడా! నీతిని ఎరిగినవాడా! అమూల్యమైన శయనములు కలవాడా! నీవు చంపబడి నేలమీద పడియున్నావేమి? బాహుపురులచేత అలంకరింపబడిన, కదలని భుజాలను నేలమీద పడవేసి, సూర్యునివంటి కాంతి గల కిరీటము తిరిగిపోగా ఎందుకు పడి ఉన్నావు! నేను నీకు పూర్వమే ఏది చెప్పి ఉన్నానో, కామమోహములతో నిండిన మనస్సుతో ఉన్న నీకు ఏది ఇష్టము కాలేదో అదే వచ్చినది. ప్రహస్తుడు కాని, ఇంద్రజిత్తుగాని, ఇతరులు గాని, కుంభకర్ణుడు గాని, అతిరథుడు గాని, అతికాయుడుగాని, నరాంతకుడుగాని, స్వయముగా కాని దేనిని అంగీకరించలేదో దాని ఫలిత మిదిగో! వచ్చినది.(1-5)

శస్త్రధారులలో శ్రేష్ఠుడైన ఈ వీరుడు నేలమీద పడిపోవుటచే మంచి నీతుల మర్యాద పోయినది. ధర్మముయొక్క శరీరము పోయినది. ఒక్కచోట ప్రోగు చేయబడిన బలము పోయినది. మంచి స్తుతుల గతి పోయినది. సూర్యుడు నేలమీద పడిపోయినాడు. చంద్రుడు చీకట్లో మునిగినాడు. అగ్నిజ్వాలలు శాంతించినవి. ఉత్సాహము ఉద్యమము లేనిదైనది. రాక్షసశ్రేష్ఠుడైన ఈ రావణుడు రణరంగములో నిద్రించునట్లు పడియుండగా ఇప్పుడు ఈ లోకములో మిగిలినది ఏమున్నది? ధైర్యమనే చిగురు, సహనశక్తి అనే శ్రేష్ఠమైన పుష్పము, తపస్సనే బలము, శౌర్యమనే

దృఢమైన మొదలూ గల రాక్షసరాజనే వృక్షమును, యుద్ధములో రాముడనే వాయువు పడగొట్టెను. తేజస్సు అనే దంతాలు, కులవంశము లనే వెన్నెముక, కోపము ప్రసాదము అనే శరీరము వెనుకభాగము తొండమూ గల రావణుడనే మదగజము రాముడనే సింహము శరీరమును ఆక్రమింపగా నేలపై నిద్రించినది. పరాక్రమము, ఉత్సాహము అనే విజృంభించిన జ్వాలలు కలది, నిట్టూర్పులనే ధూమము కలది, తన బలమనే ప్రతాపముకలది, యుద్ధమునందు ప్రతాపముకలది అయిన రావణు డనే అగ్నిని రాము డనే మేఘము ఆర్పివేసినది. రాక్షసులనే తోక, మూపు, కొమ్ములు గలది, శత్రువులను ఓడించునది, ఉత్సాహమునందు మదగజము వంటిది, చాపల్యమనే చెవులూ నేత్రములూ గలది అయిన రావణుడనే వృషభము రాముడనే వ్యాఘ్రముచేత చంపబడి నశించినది."(6-12)

శోకముతో కూడి ఈ విధముగా పలుకుచున్న విభీషణునితో రాముడు యుక్తియుక్తము స్పష్టమైన కార్యనిశ్చయము కలదీ అయిన వాక్యమును ఇట్లు పలికెను- "విభీషణా! ఇతడు పిరికిపందవలె ఏమీ చేయక మరణించలేదు. యుద్ధములో తీవ్రమైన పరాక్రమముగల ఇతడు అత్యున్నతమైన గొప్ప ఉత్సాహమును చూపి నిర్భయుడై ప్రాణాలు విడచినాడు. వృద్ధిని కోరుచు క్షత్రియధర్మమును అవలంబించి రణభూమియందు పడిపోయి మరణించినవారిని గూర్చి ఈ విధముగా దుఃఖించగూడదు. ఏ బుద్ధిమంతుడు యుద్ధములో ఇంద్రునితో కూడిన మూడు లోకాలను భయపెట్టినాడో అట్టివాడు మరణించగా అది విచారించుటకు తగిన సమయము కాదు. యుద్ధములో తప్పక విజయమే లభించు ననునది పూర్వము ఎన్నడూ జరగలేదు. వీరుడైనవాడు యుద్ధములో శత్రువులచేత చంపబడనైన చంపబడును లేదా శత్రువులను చంపును. యుద్ధములో మరణించిన శూరుణ్ణి గూర్చి విచారించకూడదు అనునది క్షత్రియులకు సంమతమైన, పూర్వులు అంగీకరించిన పద్ధతి. అందుచేత పూర్వుల ఈ నిశ్చయమును చూచి, తత్త్వము తెలిసికొని, శోకములేనివాడవై ఇప్పుడు తరువాత చేయవలసిన కార్య మేమో ఆలోచించుము."(13-19)

శోకతప్తుడైన విభీషణుడు ఈ విధముగా పలికిన పరాక్రమశాలియైన ఆ రామునితో తరువాత చేయదగిన, తన సోదరునకు హితమైన కార్యమును గూర్చి ఇట్లు పలికెను- "యుద్ధములలో సమస్తదేవతలచేతను, దేవేంద్రునిచేతను కూడ ఏ రావణుడు పూర్వ మెన్నడూ ఓడింపబడలేదో అట్టి ఇతడు నిన్ను ఎదిరించి, తీరము వరకు వచ్చిన సముద్రము భగ్నమైనట్లు యుద్ధములో ఓడిపోయినాడు. ఇతడు

యాచకులకు దానములు చేసినాడు. భోగాలు అనుభవించినాడు. భృత్యులను బాగుగా పోషించినాడు. మిత్రులకు ధనములు ఇచ్చినాడు. శత్రువుల విషయమున వైరము చూపినాడు. ఇతడు ఆహితాగ్ని. గొప్ప తపస్సు గలవాడు. పూర్తిగా వేదాధ్యయనము చేసినవాడు. వైదికకర్మలు చేసిన వారిలో ప్రధానుడు. మరణించిన ఈతనికి చేయవలసిన సంస్కారమును నీ అనుమతితో చేయవలెనని కోరుచున్నాను."(20-23)

విభీషణుడు జాలిగొల్పు మాటలతో ఈ విధముగా ప్రార్థింపగా రాముడు, "రావణునకు స్వర్గహేతువైన అంత్యసంస్కారము చేయుము." అని ఆజ్ఞాపించుచు, "వైరములు మరణముతో సమసిపోవును. మేము అనుకొన్నపని పూర్తియైనది. ఇతనికి అంత్యసంస్కారము చేయుము. ఇతడు నీకెట్లో నాకు కూడ ఇప్పుడు అట్లే(సోదరుడువంటి వాడు)." అనెను.(24,25)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట తొమ్మిదవ సర్గము సమాప్తము.

నూట పదవ సర్గము

రావణుని స్త్రీలు విలపించుట.

మహాత్ముడైన రామునిచేత రావణుడు చంపబడినట్లు చూచి రాక్షసస్త్రీలు శోకముతో బాధపడుచు శీఘ్రముగా అంతఃపురమునుండి బైటకు వచ్చిరి. ఎంత నివారించినను నేలమీద పరాగములో దొర్లుచు, విరబోసికొనిన జుట్టుతో, దూడలు మరణించిన ఆవులవలె శోకముతో పీడితలై బైటకు వచ్చిరి. రాక్షసులతో కూడా ఉత్తరద్వారమునుండి బైటకు వచ్చి, చంపబడిన భర్తను వెదకికొనుచు, ఘోరమైన యుద్ధరంగమును ప్రవేశించి, "అయ్యో! ఆర్యపుత్రుడా! అయ్యో! నాథా!" అని విలపించుచు మొండెములతో వ్యాప్తమై, రక్తపు బురదతో నిండిన నేలమీద అన్ని వైపులనుండి వచ్చిపడిరి. భర్తృశోకముచేత పీడింపబడిన ఆ స్త్రీలు కన్నీళ్ళతో నిండిన నేత్రములతో, గుంపు నాయకుడు చంపబడినప్పుడు అరచు ఆడఏనుగులు వలె ఏడ్చిరి.(1-5)

పెద్ద శరీరము, గొప్ప పరాక్రమము, కాంతి గల ఆ రావణుడు చంపబడి నల్లని కాటుకరాశివలె నేలమీద పడి ఉండెను. అట్టి అతనిని ఆ స్త్రీలు చూచిరి.

వాళ్లు యుద్ధభూమిలో పరాగములో పడియున్న భర్తను హటాత్తుగా చూచి తెగగొట్టిన లతలు వలె అతని అన్ని అవయవములమీద పడిరి. ఒక స్త్రీ ప్రేమతో అతనిని కౌగిలించుకొని ఏడ్చెను. ఒక స్త్రీ అతని పాదములను, మరొక స్త్రీ కంఠమును గ్రహించి ఏడ్చెను. ఒక స్త్రీ భుజములు పైకెత్తి బాగా నేలమీద దొర్లెను. ఒక స్త్రీ మరణించిన అతని ముఖమును చూచి మూర్ఛచెందెను. ఒక స్త్రీ అతని శిరస్సు తన ఒడిలో ఉంచుకొని, అతని ముఖమును చూచుచు, మంచు బిందువులచేత పద్మమును తడిపినట్లు ఆ ముఖమును కన్నీళ్లచేత తడుపుచు ఏడ్చెను.(6-10)

ఆ స్త్రీలు నేలపై పడగొట్టబడిన భర్తయైన రావణుణ్ణి చూచి దుఃఖముతో ఈ విధముగా అనేక రీతులలో ఏడ్చిరి. శోకావేశముతో ఏమేమో అనుచు మరల విలపించిరి - "ఎవ్వడు దేవేంద్రుణ్ణి, యముణ్ణి భయపెట్టినాడో, ఎవ్వడు కుబేరునకు పుష్పకము లేకుండా చేసినాడో, ఎవ్వడు గంధర్వులకు, ఋషులకు, మహాత్ములైన దేవతలకు యుద్ధములో భయము కలిగించినాడో అట్టి రావణుడు యుద్ధములో చంపబడి శయనించి ఉన్నాడు. ఏ రావణుడు అసురులనుండి గాని, దేవతలనుండి గాని, సర్పములనుండి గాని భయము ఎరుగడో అట్టి ఈ రావణునికి మానవునివలన ఈ భయము కలిగినది! దేవతలచేత, దానవులచేత, రాక్షసులచేత, చంపశక్యముకానివాడు పాదచారియైన మానవునిచేత యుద్ధమునందు చంపబడి శయనించి ఉన్నాడు. దేవతలు గాని, యక్షులుగాని, అసురులుగాని చంపుటకు శక్యముకానివానిని, బలము లేని ఒక సామాన్యవ్యక్తిని వలె మానవమాత్రుడు చంపివేసినాడు."(11-16)

ఈ విధముగా పలుకుచు, ఇంకను దుఃఖముచేత పీడింపబడినవారై మాటిమాటికి విలపించిరి - "ఎల్లప్పుడు హితమునే పలుకు మిత్రుల మాటలు వినక నీవు చావుకొరకే సీతను తీసికొనివచ్చినావు. రాక్షసులను చంపినావు. నీకు, మాకు కూడా సమముగా కీడు తెచ్చిపెట్టినావు. నీ ప్రియసోదరుడైన విభీషణుడు నీ హితమే చెప్పుచున్నను చావునే కోరియున్న నీవు అజ్ఞానముచేత అహంకారముతో అతనిని దూషించినావు. నీవు మిథిలారాజకుమారియైన సీతను రామునకు తిరిగి ఇచ్చివేసి ఉన్నచో మనకు మూలమునే నశింపచేయు ఘోరమైన ఈ గొప్ప ఆపద వచ్చి ఉండెడిది కాదు. నీవు సీతను తిరిగి ఇచ్చినచో నీ సోదరుడైన విభీషణుని కోరిక తీరి ఉండెడిది. రాముడు మిత్రుడై ఉండెడివాడు. మాకు వైధవ్యము వచ్చి ఉండెడిది కాదు. నీ శత్రువుల(దేవాదుల)కోరిక తీరి ఉండెడిది కాదు. క్రూరుడవై బలాత్కారముగా సీతను బంధించిన నీవు రాక్షసులను, మమ్ములను, తననూ, ఈ త్రయమునూ

కూడా ఒక్కమారుగా నశింపచేసినావు."(17-22)

"లేదా, రాక్షసశ్రేష్ఠుడా! నీ స్వేచ్ఛాచరణమే వాస్తవమున కారణము కాదు. ప్రతీ పనిని దైవమే చేయించును. దైవముచేత కొట్టబడినదై సర్వమూ నశించును. ఓ! మహాబాహూ! యుద్ధములో వానరులు, రాక్షసులు, నీవు నశించుట అనేది దైవయోగమువల్లనే వచ్చినది. ఫలము నిచ్చుటకు సిద్ధమైన దైవగతి ధనముచేతగాని, కామముచేతగాని, పరాక్రమముచేతగాని ఆజ్ఞచేత గాని మరల్చుటకు శక్యము కాదు."(23-25)

ఆ రాక్షసరాజైన రావణుని స్త్రీలు దుఃఖముతో బాధపడుచు కన్నీళ్ళచేత వ్యాకులములైన నేత్రములు గలవారై, ఆడ గోరెంకలవలె ఇట్లు దీనముగా ఏడ్చిరి.(26)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పదవ సర్గము సమాప్తము.

నూట పదకొండవ సర్గము

మండోదరి విలపించుట, విభీషణుడు రావణునకు అంత్యసంస్కారములు చేయుట.

అప్పుడు ఆ రాక్షసస్త్రీలు విలపించుచుండగా రావణుని ప్రియురాలు, జ్యేష్ఠభార్య అయిన మండోదరి దీనురాలై భర్తను చూచెను. ఊహింపశక్యము కాని కర్మలు చేయగల రామునిచేత చంపబడిన భర్తయైన రావణుణ్ణి చూచి ఆ మండోదరి దీనురాలై విలపించెను– "ఓ! గొప్ప బాహువులు గలవాడా! ఓ! కుబేరుని తమ్ముడా! కోపించిన నీ ఎదుట నిలబడుటకు దేవేంద్రుడు కూడ భయపడును కదా! నీకు భయపడి మహర్షులు, కీర్తిమంతులైన గంధర్వులు, చారణులూ కూడా దిక్కులు పట్టి పారిపోయినారు కదా! రాక్షసాధిపతివైన ఓ! రాజా! అట్టి నీవు మానవమాత్రుడైన రామునిచేత యుద్ధమునందు జయింపబడి సిగ్గుచెందుటలేదా? ఇది ఏమిటి? మూడు లోకములను ఆక్రమించి ఐశ్వర్యపరాక్రమములతో ప్రకాశించుచు ఎదిరింపశక్యము కాకుండా ఉన్న నిన్ను అడవిలో తిరుగు మానవుడు ఎట్లు చంపినాడు? మనుష్యులు ప్రవేశింప శక్యము కాని ప్రదేశములో సంచరించుచున్న, స్వేచ్ఛారూపములను ధరింప సమర్థుడవైన నీవు యుద్ధములో రామునిచేతిలో మరణించుట యుక్తముగా లేదు. సేనాముఖమునందు రాముడు ఈ పని

చేయగలిగినాడని, సమస్తమైన యుద్ధసామాగ్రితో పరిపూర్ణుడవైన నిన్ను అతడు ఎదిరించినాడని నేను నమ్మలేకున్నాను.(1-8)

జనస్థానములో అనేకరాక్షసులతో కూడిన, నీ సోదరుడైన ఖరుడు చంపబడినా దనగా అలా చంపిన రాముడు మానవమాత్రుడు కాజాలడు. దేవతలకు కూడా ప్రవేశింప శక్యము కాని లంకాపురములో హనుమంతుడు పరాక్రమముచేత ప్రవేశించిన నాడే మేము చాలా వ్యథ చెందినాము. భయంకరులైన వానరులు మహాసముద్రముమీద ఏనాడు సేతువు కట్టినారో ఆనాడే రాముడు మానవమాత్రుడు కాడని నేను మనస్సులో శంకించితిని. లేదా నిన్ను చంపుటకై ఎవరూ ఊహించని మాయను కల్పించి యముడే స్వయముగా రాముని రూపములో వచ్చి ఉండును. ఓ మహాబలశాలీ! లేదా దేవేంద్రుడు నిన్ను ఎదిరించి ఉండును. కాని యుద్ధములో నిన్ను చూచుటకు కూడ దేవేంద్రునకు శక్తి ఎక్కడిది?(9-13)

ఈ రాముడు నిశ్చితముగా, మహాయోగి, నిత్యుడు, ఆది-మధ్య-అంతములు లేనివాడు, బ్రహ్మాదిమహాపురుషు లందరికంటె గొప్పవాడు, అజ్ఞానాతీతుడు, పోషకుడు, శంఖచక్రగదలను ధరించినవాడు, శ్రీవత్సమను పుట్టుమచ్చ వక్షఃస్థలమం దున్నవాడు, నిత్యము లక్ష్మీసమేతుడు, జయింప శక్యముకానివాడు, శాశ్వతుడు, స్థిరుడు అయిన పరమాత్మయే. సకలలోకములకు ప్రభువు, శ్రీమంతుడు, గొప్ప కాంతి గలవాడు అయిన విష్ణువు, లోకముల హితముకోరి, వానరరూపములు ధరించిన దేవతలతో కూడినవాడై, రాక్షసపరివారసహితుడవైన నిన్ను చంపినాడు. పూర్వము నీవు ఇంద్రియములు జయించి గొప్ప తపస్సుచేసి మూడులోకాలను జయించినావు. ఆ వైరమును స్మరించుచున్నవా అన్నట్లు ఇప్పుడు ఆ ఇంద్రియములే నిన్ను జయించినవి. జనస్థానములో అనేకరాక్షసులతో కూడిన, నీ సోదరుడైన ఖరుడు చంపబడినా దనగా అలా చంపిన రాముడు మానవమాత్రుడు కాజాలడు. దేవతలకు కూడా ప్రవేశింప శక్యము కాని లంకాపురములో హనుమంతుడు పరాక్రమముచేత ప్రవేశించిననాడే మేము చాలా వ్యథ చెందినాము. "రామునితో మైత్రి చేసికొనుము" అని నేను చెప్పగా విననందుకే ఈ ఫలితము వచ్చినది. రాక్షసశ్రేష్ఠుడా! ఐశ్వర్యము, నీ దేహము, బంధుజనము నశించుటకే నీకు హటాత్తుగా సీతయందు కోరిక పుట్టినది. ఓ! దుర్బుద్ధికలవాడా! అరుంధతికంటె, రోహిణీకంటె కూడా ఉత్తమురాలైన గౌరవింపదగిన సీతను అవమానించి నీవు చెడ్డ పని చేసితివి కదా?(14-23)

తనకూ, తనవారికీ కూడ కీడు తెచ్చిపెట్టిన నా ప్రభూ! సీత భూమికి కూడ భూమి(గొప్ప ఓర్పు కలది). లక్ష్మికి లక్ష్మి. భర్తయందు అనురాగము గలది. ఎట్టి

దోషములూ లేని సకలావయవములు గలది. మంగళప్రదురాలు. జనశూన్యమైన అరణ్యములో నివసించుచున్న దీనురాలైన అట్టి సీతను కపటముగా తెచ్చితివి. ఆమె సంగమమును గూర్చిన నీ అభిలాష వ్యర్థమైనది. నీవు నిజముగా ఆ పతివ్రత తపస్సుచేతనే కాల్చబడితివి.(24,25)

సీతను అవమానించినప్పుడే నీవు కాల్చబడకుండుటకు కారణ మేమనగా ఆ పాపమునకు ఫలమీయవలసిన ఇంద్రుడు, అగ్ని మొదలైన దేవతలు నీకు భయపడిరి. పాపకర్మ చేసినవాడు దాని ఘోరమైన ఫలమును, కాలము వచ్చినప్పుడు తప్పక అనుభవించును. సందేహము లేదు. పుణ్యము చేసినవాడు మంచి ఫలమును పొందును. పాపము చేసినవాడు చెడ్డఫలమును పొందును. విభీషణునకు మంచి ఫలము లభించినది. నీకు ఇట్టి చెడ్డ ఫలము లభించినది.(26-28)

సీతకంటే అధికసౌందర్యము గల స్త్రీలు ఎందరో నీకున్నారు. కాని నీవు మన్మథవశుడవై అజ్ఞానమువలన ఆ విషయమును తెలిసికొనలేదు. కులముచేత గాని, రూపముచేత గాని, విద్యాదులయందు నేర్పుచేత గాని, సీత నాకంటె గొప్పది గాని, సమానురాలు కాని కాదు. కాని అజ్ఞానమువలన నీవు ఈ విషయమును తెలిసికొనలేదు.(29, 30)

ఎన్నడూ, ఏ ప్రాణికీ కూడ ఏదో ఒక నిమిత్తము లేకుండా మరణము రాదు. నీకీ మరణము సీత అను నిమిత్తము చేత వచ్చినది. సీత అనే నిమిత్తమువలన కలిగే మృత్యువును దూరమునుండి తెచ్చుకొన్నావు. సీత ఇటుపై శోకరహితురాలై రామునితో కలిసి విహరించగలదు.(31, 32)

ఓ! వీరుడా! ఏ నేను చిత్రములైన పుష్పమాలలను వస్త్రములనూ ధరించి, నీతో కలిసి, తగిన విమానముపై ఎక్కి కైలాసమందు, మందరమునందు, మేరుపర్వతమునందు, చైత్రరథ మను ఉద్యానమునందు, సమస్త దేవవనములందు విహరించుచు, అనేకవిధములైన ఆ యా దేశములను చూచుచు సాటిలేని శోభతో సంచరించుచుండెడిదాననో అట్టి నేను నీవు మరణించుటవలన ఆ కామభోగములకు దూరము చేయబడితిని. అదే నేను మరొకదానను వలె అయిపోయినాను. ఛీ! రాజుల సంపదలు ఎంత చంచలమైనవి!(33-35)

అయ్యో! ఓ! రాజా! ఓ! ప్రభూ! మంచి కనుబొమ్మలు, మంచి చర్మము, ఎత్తైన ముక్కు గల సుకుమారమైన నీ ముఖము కాంతిచేత చంద్రునితోను, శోభచేత పద్మముతోను, తేజస్సుచేత సూర్యునితోను సమానముగా ఉండెడిది. ఎఱ్ఱని నోరు,

ప్రకాశించు కుండలములు గల ఆ ముఖము కిరీటాగ్రభాగముతో మెరయుచు అందముగా ఉండెడిది. అనేక పుష్పమాలలు ధరించిన ఆ ముఖము మద్యపానశాలలో మత్తుచే వ్యాకులములైన చంచలములైన నేత్రములతో అందమైన చిరునవ్వుతో, మధురసంభాషణలతో ప్రకాశించుచుండెడిది. ఆ ముఖమే ఇప్పుడు రాముని బాణాలచేత ఛేదింపబడి, రక్తస్రావములచేత ఎఱ్ఱనై, కొవ్వు మెదడు చిమ్మివేయబడగా రథపరాగముచేత సౌకుమార్యవిహీనమై ప్రకాశించుటలేదు.(36-39)

అయ్యో! నాకు వైధవ్యము నిచ్చే చివరిదశ సంప్రాప్తించినది. తెలివి తక్కువదాననైన నేను దీనిని కూర్చి ఎన్నడూ ఊహించి కూడా ఉండలేదు. నాతండ్రి దానవరాజు; భర్త రాక్షసప్రభువు; కుమారుడు దేవేంద్రుణ్ణి జయించినవాడు; అని నాకు గర్వముండెడిది. నా సంరక్షకు లందరూ గర్వించిన శత్రువులను నశింపచేయువారు, శూరులు, ప్రసిద్ధమైన బలము, పౌరుషము కలవారు, ఎవరినుండీ భయములేనివారు అని దృఢమైన అభిప్రాయము ఉండెడిది. ఓ! రాక్షసశ్రేష్ఠులారా! అట్టి ప్రభావము గల మీకు మానవుని నుండి ఇలాంటి భయము, తెలియకుండా ఎట్లు వచ్చినది?(40-43)

రాజా! నున్నగా నున్న ఇంద్రనీలమణుల వలె నీలవర్ణము గలది, ఉత్తమ శైలమువంటిది, గొప్పదీ, కేయూరములతోను, వైడూర్యవికారములైన అంగదములతోను, ముత్యాల హారములతోను, పుష్పమాలలతోను ప్రకాశించునదీ, అయిన ఏ నీ శరీరము మెరుపులతో మేఘమువలె అలంకారముల కాంతులతో ప్రకాశించుచుండెడిదో అదే శరీరము ఇప్పుడు ఏదుపంది ముళ్ళవంటి, అవకాశము లేకుండగా మర్మస్థానములలో గుచ్చబడిన, ఇంకను తగుల్కొని ఉన్న బాణాలచేత తెగగొట్టబడిన ప్రేగులుగలదై కౌగిలించుకొనుటకు శక్యము కాకుండా ఉన్నది. దీని స్పర్శ ఇంక లభించదు. నల్లనై, రక్తముతో ఎఱ్ఱనై నేలమీద పడియున్న ఈ శరీరము వజ్రముచేత నేలమీద పడగొట్టబడిన పర్వతమువలె ఉన్నది.(44-48)

అయ్యో! ఇదంతా స్వప్నమా లేక నిజమేనా? నీవు రామునిచేత ఎట్లు చంపబడినావు? మృత్యువుకు కూడ మృత్యువైన నీవు ఎట్లు మృత్యువునకు లొంగిపోయినావు? నా భర్త మూడు లోకము లోని ఐశ్వర్యమును అనుభవించినవాడు. మూడు లోకాలకు చాల భయము కలిగించినవాడు. లోకపాలకులను జయించినవాడు. కైలాసము నెత్తి శంకరుణ్ణి కదిపేసినవాడు. నా భర్త గర్వించినవాళ్ళను నిగ్రహించువాడు. పరాక్రమమును ప్రకటించి లోకములను క్షోభపెట్టినవాడు. ధ్వనులచేత భూతములను ఏడ్పించినవాడు. నా భర్త శత్రుసంనిధిలో

గర్వోక్తులు పలుకువాడు. తనవారిని తన భృత్యులను రక్షించువాడు. భయంకరమైన పనులు చేయువారిని చంపువాడు. నాభర్త వేలకొలది దానవవీరులను, యక్షులను సంహరించినవాడు. యుద్ధములో నివాతకవచు లను రాక్షసులను చేరదీయు చుండెడివాడు. నా భర్త అనేకయజ్ఞములను పాడుచేసినవాడు. స్వజనమును రక్షించువాడు. ధర్మవ్యవస్థను చెడగొట్టినవాడు. యుద్ధములో మాయను సృష్టించెడివాడు. నా భర్త ఆ యా దేశములనుండి దేవ-అసుర-మానవ కన్యలను తీసికొనివచ్చినవాడు. శత్రువుల స్త్రీలకు శోకము కలిగించువాడు. స్వజనమునకు నాయకుడు. నా భర్త లంకాద్వీపమునకు రక్షకుడు. భయంకరములైన కర్మలు చేయువాడు. మాకు అన్ని భోగములను ఇచ్చువాడు. రథికులలో శ్రేష్ఠుడు. ఇట్టి భర్తను రాముడు పడగొట్టివేయగా చూచి, చంపబడిన భర్త గల నేను ఇంకను దేహమును ధరించి ఉన్నాననగా నేను చాల మొండిదానను.(49-57)

రాక్షసరాజా! అమూల్యములైన శయనములమీద శయనించిన నీవు ఇక్కడ నేలమీద పరాగముచేత కప్పబడి ఎందుకు నిద్రించుచున్నావు? నీ కుమారుడైన ఇంద్రజిత్తు యుద్ధములో లక్ష్మణునిచేత చంపబడినప్పుడు నాకు పెద్ద దెబ్బ తగిలినది. ఇప్పుడైతే పూర్తిగా పడిపోయితిని. బంధుజనులుగాని, నాథుడవైన నీవుగాని లేక కామభోగములు లేని నేను అనేక సంవత్సరములు దుఃఖించుచుండవలెను. రాజా! వెళ్ళుటకు శక్యముకాని దీర్ఘమైన మార్గములో ప్రయాణమైనావు. దుఃఖముచేత పీడితురాలనైన నన్ను కూడా తీసికొనివెళ్ళుము. నీవు లేకుండా ఉండజాలను. నీవు దీనురాలనైన నన్ను ఇక్కడనే విడచి ఎందుకు వెళ్ళిపోదలచుచున్నావు? దీనురాలను విలపించుచున్నదానను, మందబుద్ధిగలదానను అయిన నాతో ఎందుకు మాటలాడవు?(58-62)

ప్రభూ! నేను మేలిముసుగు లేకుండా పాదచారిణిని అయి నగరద్వారమునుండి బైటకు వచ్చి ఇక్కడ ఉన్నానని చూచి నీకు కోపము రాలేదుకద? భార్యలయందు ప్రేమగలవాడా! నీ భార్యలందరు లజ్జ అనే మేలిముసుగు జారవిడచి బైటకు వచ్చినారు, చూడుము. వాళ్ళను చూచి కోపించవేమి? నీకు క్రీడయందు సహాయులుగా ఉన్న స్త్రీలందరు నాథుడు లేక ఏడ్చుచున్నారు. వాళ్ళను ఎందుచేత ఓదార్చవు? వీళ్ళపైన నీకు అభిమానములేదా? రాజా! పతివ్రతలు, ధర్మనిరతలు, పెద్దల సేవయందు ఆసక్తి గలవారు అయిన ఏ అనేక కులస్త్రీలను నీవు భర్తలు లేనివారిగా చేసినావో, దుఃఖముచే తపింపబడిన వాళ్ళు శపించుటచే నీ విట్లు ఓడిపోయినావు. నీవు భర్తృవియోగము కలిగించిన స్త్రీలు ఇచ్చిన శాపమే ఇప్పుడు తగిలినది. రాజా!

'నేలమీద పడిన పతివ్రతల కన్నీళ్ళు ఊరకపోవు' అను ఈ లోకులు చెప్పు మాట బహుశా నీ విషయమున సత్యమే అయినది.(63-68)

రాజా! తేజస్సు చేత మూడు లోకములను ఆక్రమించి శూరుడనని అనుకొనే నీవు నీచమైన ఈ స్త్రీచౌర్యమును ఎట్లు చేసినావు? నీవు మృగమనే మిషచేత రాముణ్ణి ఆశ్రమమునుండి దూరము చేసి ఆతని భార్యను తీసికొనివచ్చితివే - అది నీ పిరికితనము లక్షణము. నీవు ఎన్నడును యుద్ధములో భయపడినట్లు నాకు జ్ఞాపకము లేదు. దురదృష్టవశముచేత చేసిన ఆ సీతాపహారము నీ పాపము పండుటకు లక్షణము.(69-71)

గడిచిన విషయములను, రాబోవు విషయములను ఎరిగినవాడు, వర్తమాన కార్యములందు నేర్పుగలవాడు, సత్యవాక్యము కలవాడు అయిన నా మరిది విభీషణుడు తీసుకొనిరాబడిన సీతను చూచి, ఆలోచించి, దీర్ఘముగా నిట్టూర్చి చెప్పినట్లుగా కామక్రోధములవలన కలిగిన నీ స్త్రీప్రసంగవ్యసనముచేత ఈ రాక్షసనాయకుల వినాశము వచ్చిపడినది. మూలమునే హరించిన ఈ గొప్ప అనర్థము నీ వలననే జరిగినది. నీవు ఈ రాక్షసకులము నంతనూ రక్షకుడు లేనిదానినిగా చేసినావు. ప్రసిద్ధములైన బలపౌరుషములు గల నిన్ను గూర్చి నేను విచారించకూడదు. కాని స్త్రీస్వభావము ననుసరించి నా బుద్ధి దైన్యమును పొందుచున్నది. నీ పుణ్యపాపములను తీసికొని నీ దారిన నీవు వెళ్ళిపోయినావు. నీ మరణముచేత దుఃఖితురాలనైన నన్ను గూర్చియే నేను విచారించుచున్నాను.(72-77)

దశాననా! నీవు నీ హితమును కోరు మిత్రుల వచనమును గాని, సోదరులు చెప్పిన హితవచనములు గాని ఏమాత్రము వినలేదు. విభీషణుడు మంచి హేతువులు అర్థమూ గల, శాస్త్రసంమతమైన, శ్రేయస్కరమైన, క్రూరము కాని, యుక్తియుక్తమైన కార్యమును బోధించగా నీవు అది చేయలేదు. పరాక్రమముచేత మదించిన నీవు మారీచకుంభకర్ణుల మాట, నా మాట, నా తండ్రిమాట కూడ వినలేదు. ఇది దాని ఫలమే.(79,80)

నల్లని మేఘమువంటివాడా! పీతవస్త్రము ధరించినవాడా! సుందరములైన బాహుపురులు గలవాడా! నీ అవయవములను నేలపై పడవేసి రక్తముచేత తడిసి ఎందుకు ఇట్లు పండుకొని ఉన్నావు? నీవు నిద్రపోవుచున్నవాడవు వలె శోకపీడితురాలనైన నాకు ఎందుకు బదులు చెప్పవు? గొప్ప పరాక్రమము గలవాడు, యుద్ధములో వెనుకకు తిరగనివాడు అయిన మాల్యవంతుని దౌహిత్రుడా! నాకు

బదులు చెప్పవేమి? క్రొత్తగా ఇంత పరాభవము జరిగిన పిమ్మట కూడ ఎందుకు శయనించి ఉన్నావు? లెమ్ము, లెమ్ము. ఇంతకాలము భయపడుచు భయపడుచు లంకలో ప్రవేశించిన సూర్యకిరణములు ఇప్పుడు నిర్భయముగా ప్రవేశించుచున్నవి. సూర్యునివంటి తేజస్సు గల దేనితో నీవు శత్రువులను నశింపచేసెడివాడవో, అట్టి ఎల్లప్పుడూ పూజింపబడినది, యుద్ధములలో చాలామందిని సంహరించేదీ, బంగారముచేత అలంకరింపబడినదీ అయిన, దేవేంద్రుని వజ్రాయుధమువంటి నీ ఈ పరిఘ బాణాలచేత వేయి ముక్కలుగా బ్రద్దలు కొట్టబడినదై పడియున్నది. (81-85)

ఈ యుద్ధభూమిని ప్రియురాలిని వలె కౌగిలించుకొని ఎందుకు పందుకొని ఉన్నావు? అప్రియురాలిని వలె నన్ను పలుకరించుటకు ఎందుకు ఇచ్ఛయించుటలేదు? ఛీ! ఈ నా హృదయము ఎంత చెడ్డది! నీవు మరణించిన పిమ్మట కూడ దుఃఖపీడితమై వేయి ముక్కలుగా బ్రద్దలగుటలేదు."(86, 87)

మండోదరి ఈ విధముగా విలపించుచు, కన్నీటిచేత చూపు వ్యాకులము కాగా, స్నేహముచేత దుర్బలమైన హృదయముతో అప్పుడు మూర్ఛచెందెను. దుఃఖపీడితురాలై కృశించి రావణుని వక్షఃస్థలము మీద వ్రాలిన ఆ మండోదరి సంధ్యారాగముచేత ఎఱ్ఱనైన మేఘముమీద ప్రకాశించు మెరుపు వలె ఉండెను. (88,89)

సవతులు అట్టి స్థితిలో ఉన్న ఆ మండోదరిని లేవదీసి, చాల పీడింపబడినవారై, ఏడ్చుచు, మిక్కిలి ఏడ్చుచున్న ఆమెను - "దేవీ! లోకముల స్థితి అస్థిరమైన దను విషయము నీకు తెలియదా? దశలు మారినప్పుడు రాజుల వైభవములు చంచలములు కదా?" అనుచు ఓదార్చిరి. వాళ్ళు ఇట్లు పలుకుచుండగా ఆమె కన్నీళ్లతో నిర్మలమైన ముఖమును, స్తనములను తడుపుచు బిగ్గరగా ఏడ్చెను. ఇంతలో రాముడు విభీషణునితో - "నీ సోదరునకు సంస్కారము చేయుము. ఈ స్త్రీల నందరినీ ఓదార్చుము." అని పలికెను. పిమ్మట బుద్ధిమంతుడు, ధర్మములు తెలిసినవాడు అయిన విభీషణుడు బుద్ధిచేత విమర్శించి ధర్మార్థములతో కూడినది, హితమూ అయిన వాక్యము నిట్లు పలికెను- "ధర్మమును వ్రతములను త్యజించినవాడు, క్రూరుడు, నరహింసకుడు, అసత్యస్వభావుడు, పరభార్యలను స్పృశించువాడు అయిన వీని సంస్కారముచేయుటకు నేను తగను. అందరికీ అపకారము చేయుటయందు ఆసక్తి గల ఈ రావణుడు పెద్దవాడనే గౌరవమువలన పూజ్యుడే అయినను పూజకు తగడు; ఇతడు నాకు సోదరరూపములో ఉన్న శత్రువు. రామా! నేను సంస్కారము చేయనిచో

భూలోకములోని మానవులందరూ నన్ను క్రూరు డని నిందించెదరు. కాని వీని చెడ్డగుణములను గూర్చి విని మంచి పని చేసినా డని మరల అందురు."(90-98)

ఆ మాటలు విని ధర్మమును పోషించువారిలో శ్రేష్ఠుడూ, మాటలలో నేర్పరీ అయిన రాముడు చాల సంతోషించి విభీషణునితో ఇట్లు పలికెను - "విభీషణా! నేను కూడ నీకు ప్రియమైన పనిని చేయవలసి ఉన్నది. ఎందుచేత ననగా నీ ప్రభావముచేతనే నేను జయించకలిగితిని. నేను నీకు తప్పక తగిన విషయము చెప్పవలెను. ఈ రావణుడు అధర్మముగా ప్రవర్తించినవాడు, అసత్యశీలుడు కావచ్చును. కాని ఇతడు తేజఃశాలి, బలవంతుడు, ఎల్లప్పుడు యుద్ధములలో శూరుడు. మహాత్ముడు, బలవంతుడు, లోకములను ఏడ్పించినవాడు అయిన ఈ రావణుణ్ణి దేవేంద్రుడు మొదలైన వీరులు కూడా ఓడించజాలకపోయిరని వినుచున్నాము. వైరములు మరణముతో సమసిపోవును. మేము అనుకొన్న పని పూర్తియైనది. ఇతనికి అంత్యసంస్కారము చేయుము. ఇతడు నీకెట్లో నాకు కూడ ఇప్పుడు అట్లే(సోదరుడువంటి వాడు). ధర్మానుసారముగా రావణునకు నీనుండి యథాశాస్త్రముగా సంస్కారము పొందుటకు అర్హత ఉన్నది. నీకు కూడ కీర్తి లభించును."(99-104)

విభీషణుడు రాముని మాటలు విని తొందరపడుచు, మరణించిన సోదరుడైన రావణునకు అంత్యసంస్కారము చేయుటకు ప్రారంభించెను. రాక్షసప్రభువైన ఆ విభీషణుడు లంకానగరములో ప్రవేశించి శీఘ్రముగా రావణుని అగ్నిహోత్రమును తెప్పించెను. బండ్లను, కట్టెసామానులను, అగ్నులను, ఋత్విక్కులను, చందనకాష్ఠములను, ఇతరములైన కట్టెలను, పరిమళించు అగరువులను, గంధద్రవ్యములను, బాగా పరిమళించు వస్తువులను, మణులను, ముత్యములను, పగడములను తెప్పించెను. అతడు రాక్షసులతో కలసి శీఘ్రముగా వచ్చి మాల్యవంతునితో కూడ క్రియలు చేసెను.(105-109)

కన్నీళ్లతో నిండిన ముఖములతో బ్రాహ్మణులందరూ, పట్టువస్త్రములు ధరించిన, అనేకవిధములైన వాద్యధ్వనులచేతను, స్తోత్రపాఠకులచేతను అభినందింపబడుచున్న, రాక్షస ప్రభువైన ఆ రావణుణ్ణి సుందరమైన బంగరు పల్లకీ ఎక్కించి చిత్రవర్ణములైన పతాకలతోను, పుష్పములతోను విచిత్రవర్ణముగల ఆ పల్లకీని ఎత్తి, విభీషణుడు ముందు నడచుచుండగా కట్టెలను తీసికొని దక్షిణాభిముఖులై శ్మశానమువైపు వెళ్లిరి. అప్పుడు అధ్వర్యుడు ప్రజ్వలింపచేయగా అగ్నులు మండినవి.

కుండలలో ఉంచబడిన ఆ అగ్నులన్నీ ఆ రావణునికి ముందు వెళ్ళినవి. అంతఃపురస్త్రీలందరు ఏడ్చుచు, నడక అలవాటు లేకపోవుటచేత గంతులు వేయుచున్నట్లు నడచుచు, తొందరగా అన్నివైపులనుండి అతని వెనుక వెళ్ళిరి.(110-114)

చాల దుఃఖించుచున్న వాళ్ళు రావణుణ్ణి ఒక పవిత్రస్థానమునందు ఉంచి, మంచిగంధపు కఱ్ఱలతో పద్మకముచేతను, వట్టివేళ్లచేతను కప్పబడిన ఉన్నిబట్ట పైన పరచిన చితను వేదోక్తరీతితో ఏర్పరిచిరి. ఆ రావణుని అంత్యక్రియలు వేదోక్తవిధానమున జరుపబడినవి. పెరుగు కలిపిన నేతితో నింపిన స్రువమును అతని భుజమువైపు పడవేసిరి. బండిని పాదాల దగ్గర, రోలును తొడల దగ్గర ఉంచిరి. కఱ్ఱగిన్నెలు, అరణి, ఉత్తరారణి, రోకలి ఇతర వస్తువులు శాస్త్రోక్తస్థానములలో ఉంచి చిత చుట్టూ తిరిగిరి. రాక్షసులు అక్కడ శాస్త్రోక్తమైన, మహర్షులచేత విధింపబడిన, విధానముచేత పవిత్రమైన పశువును(మేకను) చంపి, దాని వపను(మేక కడుపులో వుండే ఉల్లిపొర వంటి కాగితము వంటి పదార్థము) ఆ రాక్షసరాజు ముఖముపై ఉంచిరి.(115-121)

విభీషణునితో కూడిన, దీనములైన మనస్సుగల ఆ రాక్షసులు రావణుణ్ణి గంధములచేత, పుష్పమాలలచేత, అనేక విధములైన వస్త్రములచేత అలంకరించి కన్నీళ్ళతో నిండిన ముఖములతో అతనిపై పేలాలు చల్లిరి. విభీషణుడు యథాశాస్త్రముగా రావణుని చితికి నిప్పు ముట్టించి, స్నానము చేసి, తడిబట్టతో ఉండగానే దర్భలు, ఉదకము కలిపిన తిలలను అతనికి యథావిధిగా సమర్పించి, జలతర్పణముకూడ చేసి, తలవంచి అతనికి యథావిధిగా నమస్కరించి, పిదప ఆ స్త్రీలను మాటిమాటికి ఓదార్చి ఇంటికి వెళ్ళుడని బ్రతిమాలుకొనెను. అప్పు డా స్త్రీలందరూ నగరములో ప్రవేశించిరి.(122-126)

ఆ స్త్రీలు పట్టణములో ప్రవేశించిన పిమ్మట రాక్షసప్రభువైన విభీషణుడు, రాముని దగ్గరకు వచ్చి వినయముతో నిలబడెను. సైన్యముతోను, లక్ష్మణసుగ్రీవులతోను కూడిన రాముడు శత్రువును చంపి, వృత్రాసురుణ్ణి చంపిన ఇంద్రుడువలె సంతోషించెను. శత్రుసంహారకుడైన ఆ రాముడు బాణములను, ధనుస్సును, దేవేంద్రు డిచ్చిన ఆ గొప్ప కవచమును విడచి, శత్రుసంహారము అయిపోవుటచేత కోపమును విడచి, చాలా సౌమ్యత్వమును పొందెను.(127-129)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూటపదకొండవ సర్గము సమాప్తము.

నూటపన్నెండవ సర్గము

విభీషణుని రాజ్యాభిషేకము. రాముడు హనుమంతునిద్వారా సీతకు సందేశము పంపుట.

దేవ-గంధర్వ-దానవులు రావణసంహారము చూచి ఆ యా వృత్తాంతములను గూర్చి ముచ్చటించుకొనుచు తమ తమ విమానములమీద వెళ్ళిపోయిరి. మహాభాగ్యవంతులైన ఆ దేవగంధర్వాదులు ఘోరమైన రావణవధ, రాముని పరాక్రమము, వానరులు చేసిన మంచి యుద్ధము, సుగ్రీవుని ఆలోచనాశక్తి, సుమిత్రాపుత్రుడైన లక్ష్మణుని భ్రాతృస్నేహము, పరాక్రమము, సీత పాతివ్రత్యము, హనుమంతుని పరాక్రమము మొదలైన విషయములు చెప్పుకొనుచు సంతోషముతో వచ్చినట్లుగానే తిరిగి వెళ్ళిపోయిరి.(1-3)

రాముడు ఇంద్రుడు పంపిన, అగ్నివంటి కాంతి గల ఆ దివ్యరథమును గూర్చి అనుజ్ఞ ఇచ్చి మాతలిని గౌరవించెను. మాతలి రాముని అనుజ్ఞ పొంది ఆ దివ్యమైన రథమునెక్కి స్వర్గమునకు ఎగిరి వెళ్ళెను.(4, 5)

మాతలి రథసహితుడై స్వర్గములోనికి వెళ్ళిన పిమ్మట రథికులలో శ్రేష్ఠుడైన రాముడు చాలా సంతోషించి సుగ్రీవుని కౌగిలించుకొనెను. లక్ష్మణునిచేత నమస్కరింపబడినవాడై, వానరసముదాయములచేత పూజింపబడుచు సేనానివాసమునకు వచ్చెను. పిమ్మట రాముడు తన సమీపమునందున్న, లక్ష్మణునితో- "సౌమ్యుడా! మనయందు స్నేహమున్నవాడు, భక్తుడు, ఉపకారము చేసి ఉన్నవాడూ అయిన ఈ విభీషణుణ్ణి లంకారాజ్యమునకు అభిషిక్తుని చేయుము. రావణుని తమ్ముడైన ఈ విభీషణుని లంకారాజ్యమునందు అభిషిక్తుడై ఉండగా చూడవలెనని నాకు పెద్ద కోరికగా ఉన్నది." అని పలికెను.(6-10)

మహాత్ముడైన రాముని మాటలు విని లక్ష్మణుడు అట్లే చేసెదను అని పలికి, చాలా సంతోషించుచు, బంగారు ఘటమును తీసికొనెను. లక్ష్మణుడు అప్పుడు ఆ ఘటమును వానరనాయకుల చేతికి ఇచ్చి "సముద్రజలము తీసికొని రండు" అని మనోవేగము గల ఆ వానరులను ఆజ్ఞాపించెను. మనోవేగము వంటి వేగము గల వానరశ్రేష్ఠులు అతిశీఘ్రముగా వెళ్ళి సముద్రమునుండి జలము తీసికొని వచ్చిరి. అప్పుడు మిత్రగణముతో కూడిన లక్ష్మణుడు, ఒక ఘటమును గ్రహించి, విభీషణుణ్ణి సింహాసనముమీద కూర్చుండబెట్టి, వేదోక్తవిధిప్రకారము, అతనిని,



రామాజ్ఞానుసారము, రాక్షసు లందరూ చూచుచుండగా లంకకు రాజునుగా ఆ ఘటోదకముతో అభిషేకించెను. అక్కడ నున్న వానరులు, రాక్షసులందరూ కూడ అభిషేకము చేసిరి. వారందరూ చాల సంతోషించుచు రాముణ్ణి స్తుతించిరి. రాక్షసప్రభువైన విభీషణుడు లంకలో అభిషిక్తు డగుట చూచి అతనితో కూడ ఉండు నలుగురు మంత్రులు, అతనియందు భక్తిగల రాక్షసులూ సంతోషించిరి. రామలక్ష్మణులు చాల సంతోషించిరి. రాము డిచ్చిన ఆ గొప్ప రాజ్యమును పొంది విభీషణుడు చాల సంతోషించెను. (11-18)

పిమ్మట విభీషణుడు ప్రజలతో మంచి మాటలు చెప్పి వారికి సంతోషము కలిగించి రాముని వద్దకు వచ్చెను. పౌరులైన రాక్షసులు సంతోషించి అతనికొరకై పెరుగు, అక్షతలు, మధురఖాద్యములు, పేలాలు, పుష్పములు మొదలైన మంగళద్రవ్యములు తీసుకొని వచ్చిరి. (19-21)

ఎదిరింపశక్యము కానివాడు, పరాక్రమవంతుడు అయిన ఆ విభీషణుడు వాటిని గ్రహించి, మంగళకరమైన ఆ సమస్తద్రవ్యములను రామునకు లక్ష్మణునకు సమర్పించెను. రాముడు కార్యముచేసి, ప్రయోజనమును సాధించిన ఆ విభీషణుణ్ణి చూచి అతనికి ప్రియము చేకూర్చవలె నను కోరికతో మాత్రమే దానినంతనూ గ్రహించెను. పిమ్మట రాముడు పర్వతముతో సమానుడు, వీరుడు అయిన అంజలి ఘటించి వినయముతో నిలచి ఉన్న హనుమంతునితో ఇట్లు పలికెను. (22, 23)

"ఓ! సౌమ్యుడా! మహారాజైన ఈ విభీషణుని అనుమతి పొంది లంకానగరములో ప్రవేశించి, సీతకు మా క్షేమము తెలుపుము. మాటలలో మంచి నేర్పుగల ఓ హనుమంతుడా! నేను, లక్ష్మణుడు, సుగ్రీవుడు కుశలముగా ఉన్నట్లు, రావణుడు యుద్ధములో చంపబడినట్లు సీతకు చెప్పుము. సీతకు ఈ ప్రియవృత్తాంతము తెలిపి ఆమె చెప్పు సందేశమును తీసికొని రమ్ము." అని పలికెను.(24-26)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పన్నెండవ సర్గము సమాప్తము.

నూట పదమూడవ సర్గము

హనుమంతుడు సీతతో మాటలాడి తిరిగివచ్చి రామునకు ఆమె సందేశమును తెలుపుట.

ఈ విధముగా రామునిచేత ఆజ్ఞాపించబడినవాడై వాయుపుత్రుడైన హనుమంతుడు రాక్షసులచేత పూజింపబడుచు లంకాపురమును ప్రవేశించెను. సీతకు తెలిసిన ఆ హనుమంతుడు లంకానగరములో ప్రవేశించి, విభీషణుని అనుమతి కోరి, అతనిచే అనుమతింపబడినవాడై, న్యాయానుసారముగా ఉద్యానవనములో ప్రవేశించి ఒక చెట్టు క్రింద ఉన్న సీతను చూచెను. ఆమె స్నానాదిసంస్కారములు లేక భయపడుచున్న రోహిణి వలె ఆనందశూన్యురాలై ఉండెను. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలు ఉండిరి. అతడు అట్టి సీతను సమీపించి, నమస్కరించి వినయవంతుడై, వంగి మౌనముగా నిలబడెను.(1-4)

అప్పుడు సీత అక్కడకు వచ్చిన మహాబలవంతుడైన హనుమంతుణ్ణి చూచి కూడ మౌనముగా ఉండిపోయెను. మరల చూచి అతనిని గుర్తించి అప్పుడు సంతోషించెను. వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ప్రసన్నముగా ఉన్న సీత ముఖమును చూచి రాముని సందేశమును పూర్తిగా చెప్పుటకు ప్రారంభించెను- "దేవీ! సుగ్రీవలక్ష్మణులతోను, విభీషణునితోను, వానరసైన్యములతోను కూడిన రాముడు క్షేమముగా ఉన్నాడు. దేవీ! శత్రుసంహారకుడైన రాముడు శత్రువును సంహరించి, కార్యసిద్ధిని పొందినాడు. నీకు క్షేమము తెలుపుచున్నాడు. వానరులతో కూడిన రామలక్ష్మణులు విభీషణుని సాహాయ్యముచేత పరాక్రమవంతుడైన రావణుని సంహరించినారు. ఓ! దేవీ! నీకు ప్రియమైన విషయము చెప్పి నీ కింకను సంతోషము

కలిగించుచున్నాను. ధర్మముల నెరిగిన ఓ! సీతా! నీ ప్రభావముచేత రాముడు యుద్ధములో గొప్ప విజయము పొందినాడు. నీవు దుఃఖము విడచి స్వస్థురాలవు అగుము. శత్రువైన రావణుడు చంపబడినాడు. లంక వశము చేసికొనబడినది. "నిన్ను సంపాదించవలె నను దృఢనిశ్చయముతో నిద్రకూడ పొందక నేను మహాసముద్రములో సేతువును నిర్మించి ఈ ప్రతిజ్ఞను దాటినాను." అని రాముడు చెప్పుచున్నాడు. నీవు రావణుని గృహములో ఉన్నందుకు భయపడకుము. ఎందుచేతననగా ఈ లంకారాజ్యము విభీషణుని అధీనములో ఉంచబడినది. అందువల్ల నీవు విశ్వాసముతో ఊరడిల్లుము. నీవు ఇప్పుడు స్వగృహములోనే ఉన్నావు. ఈ విభీషణుడు కూడ సంతోషముతో నీ దర్శనము చేయవలెనని కోరుచు వచ్చుచున్నాడు."(5-13)

చంద్రుని వంటి ముఖముగల సీత ఆ మాటలు విని, ఆనందాతిశయముచేత ఏమీ చేయజాలని స్థితిలో ఉండి మాటలాడజాలకపోయెను. సమాధానము చెప్పని సీతతో అప్పుడు హనుమంతుడు - "ఓ! దేవీ! ఏమి ఆలోచించుచున్నావు? నాతో మాటలాడవేమి?" అని ప్రశ్నించెను.(14, 15)

ధర్మమార్గమునందు స్థిరురాలైన సీత హనుమంతుని మాటలు విని సంతోషించుచు బాష్పముచేత గద్గదమైన స్వరముతో- 'నాభర్తకు లభించిన విజయమును గూర్చిన ప్రియమైన వార్త వినగానే సంతోషావేశముతో ఒక క్షణకాలముపాటు మాట రానిదానను అయితిని. హనుమంతుడా! నాకు ప్రియవార్తను చెప్పిన నీకు ఇచ్చుటకు తగిన ప్రియమైనది ఎంత ఆలోచించినను నాకు కనబడుటలేదు. నీవు చెప్పిన ప్రియవార్తకు తగిన ఏ వస్తువును నీ కిచ్చినచో నా మనస్సుకు సంతృప్తి కలుగునో అట్టి తగిన వస్తువేదీ నాకు ఈ భూమిమీద కనబడుటలేదు. వెండిగాని, బంగారముగాని, వివిధరత్నములు గాని, త్రిలోకసామ్రాజ్యముగాని నీ మాటలకు సరికావు." అనెను.(16-20)

హనుమంతుడు సీత మాటలు విని అంజలి ఘటించి ఆమె ఎదుట నిలచి సంతోషముతో- "భర్తయొక్క ప్రియహితములను కోరుదానవు, భర్త విజయమును కాంక్షించుదానవు అయిన ఎట్టి దోషములు లేని ఓ! దేవీ! స్నేహపూర్ణమైన ఇట్టి మాటలు పలుకుటకు నీవే తగినదానవు. ఓ! సౌమ్యురాలా! నీవు పలికిన సారగర్భితము, స్నేహభరితమూ అయిన ఈ మాట వివిధరత్నసముదాయములకంటెను దేవరాజ్యముకంటెను కూడ గొప్పది. రాముడు శత్రువులను సంహరించి,

విజయవంతుడై, స్వస్థుడై ఉండగా చూచుచున్నాను. అందుచేత నాకు దేవరాజ్యము మొదలైన గుణములు లభించిన వనే అర్థము." అని పలికెను.(21-24)

సీత ఆ హనుమంతుని మాటలు విని అతనితో మిక్కిలి శుభమైన వాక్యము పలికెను- "అధికముగా మంచి లక్షణములతో కూడినది, మాధుర్యగుణము అలంకారముగ గలదీ అయిన వచనమును ఎనిమిది అంగములు గల బుద్ధితో యుక్తమగునట్లుగా పలుకుటకు నీవే తగినవాడవు. నీవు ప్రశంసాపాత్రుడవైన వాయుదేవుని పుత్రుడవు. గొప్ప ధార్మికుడవు. బలము, శౌర్యము, శాస్త్రజ్ఞానము, బుద్ధిబలము, పరాక్రమము, ఉత్తమమైన నేర్పు, తేజస్సు, ఓర్పు, ధైర్యము, స్థైర్యము, వినయము - ఈ గుణములు, ఇంకను ఎన్నో ఉత్తమగుణములు నీయందు ఉన్నవి. సందేహము లేదు."(25-28)

హనుమంతుడు అంజలి ఘటించి సీత ఎదుట నిలచి, కంగారు పడక, వినయవంతుడై మరల సీతతో- "వీళ్ళందరూ పూర్వము నిన్ను భయపెట్టిన రాక్షసస్త్రీలే కదా? నీవు అనుమతించినట్లయితే వీళ్ళనందరినీ చంపవలె నని కోరుచున్నాను. దేవీ! ఘోరమైన రూపము ప్రవర్తనా గలవారు, క్రూరురాండ్రు, మిక్కిలి క్రూరములైన నేత్రములు గలవారు, వికృతములైన ముఖములు గలవారు అయిన రాక్షసస్త్రీలు, దుఃఖించుచు ఈ అశోకవనములో ఉన్న, పతియే దేవతగా గల నిన్ను రావణుని ఆజ్ఞచేత మాటిమాటికి పరుషవాక్యములతో పీడించుచుండగా నేను ఇక్కడ విని ఉన్నాను. వికారముగా ఉన్నవారు, వికృతములైన ఆకారములు గలవారు, క్రూరురాండ్రు, మిక్కిలి క్రూరములైన జుట్లు, చూపులు గలవారు, చాల దారుణస్వభావముగలవారు, దారుణమైనమాటలు మాటలాడువారు అయిన ఈ రాక్షసస్త్రీలను అనేకవిధములైన దెబ్బలచేత చంపెదను; నాకు అనుమతి ఇమ్ము. నీకు అపకారముచేసిన ఈ రాక్షసస్త్రీలను, పిడికిళ్ళతోను, అరచేతులతోను, విశాలములైన బాహువులతోను, పిక్కలతోను, మోకాళ్ళతోను కొట్టి, దంతములతో కరిచి, ముక్కులు, చెవులు కొరికి, జుట్లు పీకి, ముఖాలు ఎండిపోవునట్లు చేసి, చీల్చి, ఎగిరి ఎగిరి మీదపడి కొట్టి, ఎముకలు, మెడలు, భుజములు, పార్శ్వములు విరిగిపోయిన దేహాలు క్రిందపడవేసి చంపవలెనని కోరుచున్నాను. కీర్తిగలదానా! పూర్వము నిన్ను భయపెట్టిన, భయంకర రూపములు గల ఈ స్త్రీలను ఈ విధముగా అనేకములైన దెబ్బలు కొట్టి చంపెదను." అనెను.(29-38)

దీనులయందు జాలిగల, దయామయురాలైన సీత హనుమంతుని మాటలు

విని, ఆలోచించి, విమర్శించి– "వానరోత్తమా! ఈ రాక్షసస్త్రీలు రాజసేవ చేయువారగుటచేత అస్వతంత్రలు. పరుల ఆజ్ఞ ప్రకారము పనిచేయువారు. వాళ్లకు లొంగి ఉండువాళ్ళు. అట్టి దాసీల విషయమున ఎవడైనా కోపించునా? నా భాగ్యము ప్రతికూలముగా ఉండుటచేతను, నేను పూర్వము చేసిన పాపముచేతను, నేను ఇదంతా అనుభవించవలసి వచ్చినది. ప్రతివారూ తాము చేసిన కర్మఫలమునే అనుభవింతురు కదా? ఓ! మహాబాహూ! ఇట్లు పలుకకుము. ఇది గొప్ప దైవనిర్ణయము. దశాసంబంధమును పట్టి నాకు ఇట్టి దుఃఖమును పొందవలెనని నిశ్చయింపబడినది. దైవవశముచేత ఆనాడు దుర్బలురాలనైన నేను ఇక్కడ రావణుని దాసీలు పెట్టిన బాధలు క్షమించుచున్నాను. హనుమంతుడా! ఈ రాక్షసస్త్రీలు రావణునిచేత ఆజ్ఞాపింపబడిన వారై నన్ను భయపెట్టిరి. కాని ఇతడు చంపబడిన పిమ్మట ఇటుపైన వీళ్ళు అట్లు చేయరు. వ్యాఘ్రముతో భల్లూకము చెప్పిన ఒక ప్రాచీనము, ధర్మసంమతము అయిన శ్లోక మున్నది. దానిని వినుము. పరుల విషయములో పాపకర్మ అచరించువానికి కూడ ఉత్తముడు పాపమును (ప్రత్యపకారమును) చెయ్యడు. అపకారముచేసిన వానికి కూడ ప్రత్యపకారము చేయగూడదు అను నియమమును రక్షించవలెను. సత్పురుషులకు మంచి చరిత్రయే అలంకారము. సత్పురుషుడు పాపాత్ముల విషయములలో నైనా, పుణ్యాత్ముల విషయములోనైనా, చంపదగినవారి విషయములో నైనా దయ చూపవలెను. లోకములో ఏదో ఒక అపరాధము చేయనివాడు ఎవడూ ఉండడు కదా! లోకాలను హింసించుటయే విహారముగా గలిగి, క్రూరులై, పాపకర్ములు గలవారై, పాపములను చేయుచున్నవారికి కూడ చెడును చేయగూడదు." అని పలికెను.(39–47)

మాటలలో నేర్పరియైన హనుమంతుడు సీత మాటలు విని, పిమ్మట దోషరహితురాలైన సీతతో, "ఓ! దేవీ! సద్గుణవంతురాలవైన నీవు రామునకు తగిన ధర్మపత్నివి. నేను తీసికొని వచ్చిన సందేశమునకు బదులుగా సందేశము ఇమ్ము. రాముడున్నచోటికి వెళ్ళెదను." అనెను. హనుమంతుని మాటలు విని జనకుని కుమార్తె అయిన సీత – "హనుమంతుడా! నేను నా భర్తను చూడవలెనని కోరుచున్నాను." అని చెప్పెను.(48–50)

హనుమంతుడు సీత పలికిన మాట విని, ఆమెకు సంతోషము కలిగించుచు– "స్థిరులైన మిత్రులు గలవాడు, శత్రువులను సంహరించినవాడు, పూర్ణచంద్రుని వంటి ముఖము కలవాడు అయిన లక్ష్మణసహితుడైన రాముణ్ణి శచీదేవి దేవేంద్రుని చూచినట్లు ఇప్పుడే చూడగలవు." అని మహాతేజఃశాలియైన హనుమంతుడు సాక్షాత్తు

లక్ష్మివలె ప్రకాశించుచున్న ఆ సీతతో పలికి రాముడున్నచోటికి వచ్చి సీత చెప్పిన ప్రత్యుత్తరమును రామునకు క్రమానుసారముగా చెప్పెను.(51-54)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పదమూడవ సర్గము సమాప్తము.

నూట పదునాల్గవ సర్గము

రాముని ఆజ్ఞచేత విభీషణుడు సీతను రాముని వద్దకు రప్పించుట; సీత రాముణ్ణి చూచుట.

హనుమంతుడు సకల ధనుర్ధారులలో శ్రేష్ఠుడైన రామునకు నమస్కరించి, "ఏ సీతకొరకై ఈ పనులన్నీ ప్రారంభించి చేసినామో, ఏ సీత ఈ పనులకు ఫలమో, అట్టి దుఃఖసంతప్తురాలైన సీతాదేవిని నీవు చూడవలెను. శోకాక్రాంతురాలైన ఆ సీత నీ విజయవార్త వినగానే ఆనందబాష్పములతో నిండిన నేత్రములుగలదై, నిన్ను చూడవలెనని కోరుచున్నది. వెనుకటి నమ్మకముచేత నాయందు విశ్వాసము గల ఆమె 'కార్యమును సాధించిన లక్ష్మణసహితుడైన భర్తను చూడవలెనని కోరుచున్నాను.' అని నాతో పలికినది" అని చెప్పెను.(1-4)

హనుమంతుని మాటలు విని ధర్మాత్ములలో శ్రేష్ఠుడైన రాముడు కొంచెము కన్నీళ్ళతో వ్యాకులుడై వెంటనే కొంతసేపు ఆలోచించెను. దీర్ఘముగాను, వేడిగాను నిట్టూర్చి, నేలవైపు చూచుచు, దగ్గరనే ఉన్న విభీషణుని- "శిరఃస్నానముచేసి, శ్రేష్ఠమైన మైపూత పూసికొని, దివ్యములైన ఆభరణములు అలంకరించుకొన్న సీతను వెంటనే ఇక్కడికి తీసికొని రమ్ము." అని ఆదేశించెను.(5-7)

రాముని మాటలు విని విభీషణుడు తొందరపడుచు అంతఃపురములో ప్రవేశించి, తన స్త్రీలద్వారా సీతకు ఈ విషయము చెప్పించెను. పిమ్మట శ్రీమంతుడు, రాక్షసప్రభువైన విభీషణుడు సీతను చూచి, వినయవంతుడై, శిరస్సుపై దోసిలికట్టి "ఓ! సీతా! దివ్యమైన అంగరాగము పూసికొని, దివ్యములైన ఆభరణములు అలంకరించుకొని వాహనమును ఎక్కుము. నీ భర్త నిన్ను చూడవలెనని కోరుచున్నాడు. నీకు క్షేమమగుగాక." అని ఆమెతో పలికెను. సీత విభీషణుని మాటలు విని అతనితో- "రాక్షసరాజా! స్నానము చేయకుండగానే నా భర్తను చూడవలెనని కోరుచున్నాను." అనెను. ఆమె మాటలు విని విభీషణుడు తిరిగి -

"నీ భర్తయైన రాముడు చెప్పినట్లు చేయుట మంచిది." అని చెప్పెను. (8-12)

భర్తయే దేవతగా గల, ఉత్తమస్వభావ వంతురాలైన సీత విభీషణుని మాటలు విని, భర్తయందు భక్తితో "అట్లే చేసెదను" అని పలికెను. పిమ్మట విభీషణుడు, తగు శరీరసంస్కారాదులు చేసికొని శిరఃస్నానము చేసిన అమూల్యమైన అభరణములు, శ్రేష్ఠములైన వస్త్రములు ధరించిన సీతను శ్రేష్ఠములైన వస్త్రములచేత కప్పబడిన, ప్రకాశించుచున్న, అనేక రాక్షసులు రక్షించుచున్న పల్లకీ ఎక్కించి తీసికొని వచ్చెను. సీత వచ్చినట్లు తెలిసికూడ ఏదో ఆలోచించుచున్న మహాత్ముడైన ఆ రాముని దగ్గరకు వెళ్ళి, విభీషణుడు నమస్కరించుచు, సీత వచ్చినది అని సంతోషపూర్వకముగా తెలిపెను. రాక్షసుని ఇంట్లో చాల కాలము నివసించిన ఆ సీత వచ్చినదని వినగానే రామునకు సంతోషము, దైన్యము, కోపమూ ఈ మూడు కూడ కలిగెను. (13-17)

పిమ్మట రాముడు సంతోషములేనివాడై, విమర్శపూర్వకముగా ఆలోచించుచు, ప్రక్కనున్న విభీషణుని చూచి, "నిత్యమూ నా విజయము కోరు, సౌమ్యుడవైన ఓ విభీషణా! సీత శీఘ్రముగా నా దగ్గరకు వచ్చుగాక." అనెను. (18, 19)

ధర్మములు తెలిసిన విభీషణుడు రాముడు పలికిన ఆ మాటలు విని శీఘ్రముగా జనులను దూరముగా తొలగింపజేసెను. ఎల్లప్పుడూ బెత్తములు పట్టుకొని ఉండుటచేత బిరుసెక్కిన హస్తములు గల, పొడవైన చొక్కాలు తలపాగలు ధరించిన కంచుకులు అక్కడనున్న యోధులను "దూరముగా తొలగుడు" అని చెప్పుచు అంతటా సంచరించిరి. అన్ని వైపులనుండి తొలగింపబడుచున్న, భల్లూకములు, వానరులు, రాక్షసులు సమీపప్రదేశమునుండి దూరమునకు ఎగిరి వెళ్ళిపోయిరి. వాళ్ళు ఆ విధముగా తొలగింపబడుచున్నప్పుడు, వాయువుచేత ఎగరగొట్టబడుచున్న సముద్రము ధ్వనివంటి గొప్ప ధ్వని బయల్వెడలెను. అప్పుడు ఆ విధముగా తొలగింపబడుచున్న ఆ వానరాదులు నేలమీద త్రొక్కిసలాటలో చిక్కుకొని ఉండగా చూచి రాముడు వాళ్ళపై ఉన్న ప్రేమచేతను, దానిని సహించకపోవుటచేతను, ఆ నివారణమును నివారించెను. (20-24)

రాముడు కోపించి, చూపులతో కాల్చివేయుచున్నాడా అన్నట్లు విభీషణునితో- "నా మాట కాదని వీళ్లనందరినీ ఎందుకు బాధపెట్టుచున్నావు? ఈ ప్రయత్నము ఆపివేయుము. వీళ్ళందరూ నావాళ్ళు. స్త్రీకి ఇల్లుగాని, వస్త్రములుగాని, ప్రాకారములు గాని, తెరలుగాని, ఈవిధములైన రాజసత్కారములు గాని ఆవరణము కాదు. మంచి నడవడికయే ఆవరణము. ఇష్టజనవియోగము మొదలైన వ్యసనములందు

గాని, రాజ్యక్షోభాదులందు గాని, యుద్ధములందు గాని, స్వయంవరమునందు గాని, యజ్ఞమునందు గాని, వివాహమునందు గాని స్త్రీలు ఇతరుల కంటబడుటలో దోషము లేదు. ఆమె ఆపదలలో ఉన్నది. గొప్ప కష్టపరిస్థితులలో ఉన్నది. అందుచేత ఆమెను అందరూ చూచినా దోషములేదు. విశేషించి నాదగ్గర ఉన్నప్పుడు అసలే లేదు. అందువలన ఈమె పల్లకీ విడచి కాలినడకనే నా దగ్గరకు వచ్చుగాక. ఈ వానరు లందరూ నా దగ్గరనుండగా ఈమెను చూచెదరుగాక." అని పలికెను. (25-30)

రాముని మాటలు విని, విభీషణుడు ఆలోచించుచు సీతను సవినయముగా రాముని దగ్గరకు తీసికొని వచ్చెను. అప్పుడు లక్ష్మణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు రాముని మాటలు విని చాల వ్యథ చెందిరి. భార్యయందు ఔదాసీన్యమును సూచించు ఇతని భయంకరములైన ముఖవికారాదులచేత ఈతనికి భార్యయందు ప్రీతి లేదా అను సంశయము వారికి కలిగెను. సీతయైతే సిగ్గుచేత తన అవయవాలలో అణగిపోవుచు, విభీషణుడు వెంట రాగా, భర్తను సమీపించెను. మిక్కిలి సౌమ్యమైన ముఖముగల పతివ్రతయైన ఆ సీత సుందరమైన భర్త ముఖమును ఆశ్చర్యముతోను, ఆనందాతిశయముతోను, స్నేహముతోను, కళ్ళు పైకెత్తి చూచెను. నిర్మలమైన చంద్రబింబమువంటి ముఖము గల ఆ సీత అప్పుడు చాలకాలము చూడబడని, ఉదయించిన చంద్రునివంటి పరిపూర్ణకాంతి గల భర్త ముఖము చూచి మనస్సులోని ఖేదమును విడచెను. (31-36)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పదునాల్గవ సర్గము సమాప్తము.

నూట పదిహేనవ సర్గము

సీత చరిత్రను శంకించిన రాముడు "నీ వెక్కడికైన వెళ్ళవచ్చును" అని ఆమెతో అనుట.

రాముడు వినయముతో వంగి తన ప్రక్క నిలచిన సీతను చూచి తన మనస్సులోని భావము చెప్పుటకు ప్రారంభించెను- "ఓ! మంగళప్రదురాలా! యుద్ధరంగమునందు శత్రువును వధించి నిన్ను జయించుకొన్నాను. పురుషప్రయత్నమువలన చేయదగినదానిని చేసినాను. కోపమునకు అంతమును

పొందితిని. అవమానమును తుడిచివేసితిని. నేను అవమానమును శత్రువునూ కూడ ఒక్క మారుగా తొలగించితిని. ఇప్పుడు నా పౌరుషము అందరిచేతను చూడబడినది. ఇప్పుడు నా శ్రమ సఫలమైనది. ఇప్పుడు నా ప్రతిజ్ఞ తీర్చుకొంటిని. ఇప్పుడు నాపై నేను స్వాతంత్ర్యము పొందగలిగితిని. నేను నీ దగ్గరలేని సమయమున చపలచిత్తుడైన రాక్షసుడు నిన్ను అపహరించినాడు. దైవకృతమైన ఈ దోషమును మానవుడనైన నేను మానవయత్నముచే సరిచేసితిని. జరిగిన అవమానమును ఎవడు తేజస్సుచేత తుడిచివేయడో అట్టి అల్పచిత్తునకు ఎంతగొప్ప పౌరుషమున్నను ఏమి ప్రయోజనము? సముద్రమును దాటుట, లంకను మర్దించుట అను హనుమంతుడు చేసిన శ్లాఘించదగిన పని ఇప్పుడు సఫలమైనది. యుద్ధములో పరాక్రమము చూపుచు హితమగు ఆలోచనలు చేయు సైన్యసహితుడైన సుగ్రీవుని పరిశ్రమ ఇప్పుడు సఫలమైనది. చెడ్డగుణములు గల సోదరుణ్ణి విడచి స్వయముగా నన్ను చేరిన విభీషణుని పరిశ్రమ కూడ ఇప్పుడు సఫలమైనది."(1-9)

సీత ఇట్లు పలుకుచున్న రాముని మాటలు విని ఆడలేడి వలె వికసించిన నేత్రములు గలదై కన్నీళ్ళు రాల్చెను. తన హృదయమునకు ప్రియురాలైన, సమీపమునందే నిలచియున్న సీతను చూచుచున్న ఆ రాజైన రాముని హృదయము జనాపవాదభయముచేత రెండు విధములుగా ఉండెను.(10, 11)

నల్లకలువరేకుల వంటి నేత్రములు, నల్లని వక్రములైన కేశములు, శ్రేష్ఠమైన కటిప్రదేశము గల సీతతో, వానరులయొక్క రాక్షసులయొక్క మధ్యయందు రాము డిట్లు పలికెను– "గౌరవమును కోరిన నేను రావణుని సంహరించి, అవమానమును తొలగించకొనకోరు మానవుడు ఏమి చేయునో అది చేసితిని. తపస్సుచేత పరిశుద్ధము చేసికొనబడిన మనస్సుగల అగస్త్యుడు ఇల్వలాదులు ఆక్రమించి ఉండుటచేత లోకులకు సంచరింప శక్యముకాని దక్షిణదిక్కును జయించినట్లు నేను నిన్ను శత్రువునుండి జయించితిని. ఏ యుద్ధపరిశ్రమ నేను స్నేహితుల పరాక్రమముచేత దాటగలిగితినో అట్టి ఈ యుద్ధపరిశ్రమను నేను నీ కొరకై చేయలేదను విషయమును గ్రహింపుము. నా చరిత్రను రక్షించుకొనుటకు, అన్నివైపులనుండి లోకాపవాదము రాకుండ చేసికొనుటకూ, ప్రసిద్ధమైన నా వంశము కళంకమును తుడిచివేయుటకు నేను ఈ పరిశ్రమ చేసితిని. నీకు క్షేమమగుగాక.(12-16)

చరిత్రవిషయమున సందేహింప దగిన నీవు నా ఎదుట నిలచి, కంటి జబ్బుతో బాధపడుచున్నవానికి దీపము వలె, నాకు చాల భరింపశక్యము కానిదానవుగా ఉన్నావు. ఓ! సీతా! అందుచేత ఇప్పుడు నీకు అనుజ్ఞ ఇచ్చుచున్నాను; ఈ పది

దిక్కులలో నీ కిష్టమువచ్చిన దిక్కునకు వెళ్ళవచ్చును. ఓ! మంగళప్రదురాలా! నాకు నీతో పనిలేదు. సత్కులమందు పుట్టిన తేజఃశాలియైన ఏ పురుషుడైన పరగృహములో ఉన్న స్త్రీని అత్యాసక్తితో కూడిన మనస్సుతో మరల తీసికొనునా? రావణుని ఒడిలో నలిగినదానవు, దుష్టమైన చూపులతో అతనిచేత చూడబడినదానవు అయిన నిన్ను, గొప్ప కులములో పుట్టినా నని చెప్పుకొనుచు నే నెట్లు మరల గ్రహించగలను! నేను నా కులము గౌరవము కాపాడుటకే నిన్ను జయించితిని. కీర్తిని మరల సంపాదించితిని. నీయందు నాకు ఆసక్తిలేదు. అందుచేత ఇక్కడినుండి నీకిష్టము వచ్చిన చోటికి వెళ్ళవచ్చును. ఓ! మంగళప్రదురాలా! అందుచే నేను నిర్ణయము చేసికొనియే ఈ మాటలు చెప్పుచున్నాను. నీ ఇష్టము ప్రకారము లక్ష్మణుని సంరక్షణములో కాని, భరతుని సంరక్షణములోకాని ఉండుటకు నిశ్చయించుకొనుము. సీతా! శత్రుఘ్నుని సంరక్షణములోగాని సుగ్రీవుని సంరక్షణములోగాని, రాక్షసుడైన విభీషణుని సంరక్షణములో గాని ఉండుటకు నిశ్చయించుకొనుము. లేదా నీ కిష్టము వచ్చినట్లు చేయుము. సీతా! దివ్యమైన సౌందర్యముగల, మనోహరురాలవైన, తన ఇంటిలో చాలకాలము ఉన్న నిన్ను చూచి రావణుడు ఊరకుండజాలడు కదా?"(17-24)

అప్పుడు ప్రియమైన మాటలు వినుటకు తగిన ఆ సీత ప్రియునినుండి అప్రియమైన మాటలు విని, ఏనుగు తొండము చేత కదల్చబడిన లతవలె చాలసేపు మిక్కిలి వణికిపోయి కన్నీరు విడచెను. (25)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పదిహేనవ సర్గము సమాప్తము.

నూట పదహారవ సర్గము

సీత తగు సమాధానము చెప్పి తన పాతివ్రత్యమును పరీక్షించుటకు అగ్నిలో ప్రవేశించుట.

రాముడు కోపముతో ఈ విధముగా పరుషముగా, భయముకలుగునట్లు పలుకగా, ఆ మాటలు విని సీత చాల వ్యథ చెందెను. ఆ సీత ఆ గొప్ప జనసముదాయములో భర్త పలికిన, పూర్వ మెన్నడూ ఎరుగని భయంకరమైన మాటలు విని సిగ్గుతో క్రుంగిపోయెను. తన అవయవములలోనికి క్రుంగిపోవుచున్నదా అన్నట్లున్న ఆ సీత ఆ మాట లనే బాణముల ములుకులు శరీరములో ఉన్నవా

అన్నట్లు మిక్కిలి కన్నీళ్ళు విడచెను.(1-3)

పిమ్మట ఆమె కన్నీళ్ళతో తడిసిన ముఖమును తుడుచుకొనుచు గద్గదమైన వాక్కుతో మెల్లగా భర్తతో ఇట్లు పలికెను- "వీరుడా! ఒక సామాన్యపురుషుడు సామాన్యస్త్రీతో పలుకుచున్నట్లు నాతో ఇట్టి తగని, చెవులకు దారుణమైన, పరుషమైన మాట పలుకుచున్నా వేమి? ఓ! మహాబాహూ! నేను నీవు అనుకున్నట్లు ప్రవర్తించినదానను కాను. నన్ను విశ్వసింపుము. నా సచ్చరిత్రపై ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. ప్రాకృతస్త్రీల ప్రవృత్తిని పట్టి నీవు స్త్రీజాతినే శంకించుచున్నావు. నీవు ఇంతకు ముందు నన్ను పరీక్షించియే ఉన్నచో,(అనగా నా స్వభావమెట్టిదో నీకు తెలిసిన విషయమే గాన) ఈ శంకను విడువుము. ప్రభూ! నేను నా వశములో లేని స్థితిలో రావణుని శరీరము స్పర్శ కలిగిన దనగా ఆ విషయమునందు దైవముయొక్క అపరాధమే కాని అది నేను మనఃపూర్వకముగా చేసినది కాదు. కాని నా చెప్పుచేతలలో నున్న హృదయము మాత్రము నీయందే నిలచి ఉన్నది. పరాధీనమైన శరీరము విషయమున, అసమర్థురాలనైన నేను ఏమి చేయగలను? మానమును కాపాడువాడా! ఇంతకాలము కలిసి పెరిగి, కలిసి ఉండీ కూడ నీవు నే నెట్టిదాననో తెలిసికొనకపోయినచో నేను పూర్తిగా నశించినట్లే. రాజా! నన్ను వెదకుటకు మహావీరుడైన హనుమంతుణ్ణి పంపినావు. లంకలో ఉన్నట్లు తెలిసిన నన్ను అప్పుడే ఎందుకు త్యజించలేదు? వీరుడా! ఈ హనుమంతుడు ప్రత్యక్షముగా చూచి చెప్పిన పిమ్మట నీవు నన్ను త్యజించి ఉన్నచో నేను నా ప్రాణములు విడచి ఉండేదానిని. నీవు ఆవిధముగా చేసి ఉన్నచో జీవితమును సంశయములో పెట్టుకొని వ్యర్థముగా నీవు ఇంత శ్రమపడవలసి ఉండెడిది కాదు. నీ మిత్రులకు కూడ ఇంత నిష్ఫలమైన క్లేశము కలిగి యుండెడిది కాదు. ఓ! రాజశ్రేష్ఠుడా! నీవైతే కోపావేశముతో చిన్న బుద్ధిగల మానవుడు వలె స్త్రీ అనుదానికే ప్రాధాన్య మిచ్చినావు. సదాచారము నెరిగినవాడా! లోకప్రసిద్ధిని పట్టి నేను జనకునికి పుట్టినాను, కాని వాస్తవమున నాపుట్టుక భూమినుండి జరిగినది. అట్టి నా పుట్టుకకు, నా మంచి నడవడికకు నీవు ఏమాత్రము గౌరవమివ్వలేదు. నీవు బాల్యమునందు నా హస్తమును గ్రహించి వివాహమాడిన విషయమును ప్రమాణముగా గ్రహించలేదు."(4-16)

ఈ విధముగా పలుకుచు, ఏడ్చుచు, కన్నీటిచేత గద్గదముగా మాటలాడుచున్న సీత, దీనుడై ఆలోచనలో మునిగి ఉన్న లక్ష్మణునితో- "లక్ష్మణా! ఈ కష్టాలకు ఔషధమైన చితను నాకొరకు తయారు చేయుము. అసత్యమైన అపవాదుచేత దూషితురాలనైన నేను ఇంక జీవించుటకు ఇచ్ఛయించను. నా గుణములకు

సంతోషించని భర్తచే జనుల సమక్షమున విడవబడిన నాకు ఏ గతి పొందుట యుక్తమో ఆ గతిని పొందుటకై అగ్నిలో ప్రవేశించెదను." అనెను. (17-19)

లక్ష్మణుడు సీత మాటలు విని, రామునివైపు కోపావేశముతో చూచెను. అతడు రాముని ఆకారముచేత సూచింపబడిన అతని అభిలాషను తెలుసుకొని, అతని అభిమతము ప్రకారము చితను నిర్మించెను. ఆ సమయమునందు ప్రళయకాలమునందు సంహారముచేయు యముడువలె ఉన్న రాముణ్ణి ప్రతిమాలుటకు గాని, పలకరించుటకుగాని, చూచుటకు గాని ఏ మిత్రునకూ కూడ ధైర్యము లేకపోయెను. (20-22)

పిమ్మట సీత తల వంచుకొని నిలచియున్న రామునకు ప్రదక్షిణము చేసి ప్రజ్వలించుచున్న అగ్ని దగ్గరకు వెళ్ళెను. ఆమె దేవతలకు బ్రాహ్మణులకు నమస్కరించి అగ్ని దగ్గర అంజలి ఘటించి- "నా హృదయము ఎన్నడూ రామునినుండి దూరము కానిచో(రామునియందే స్థిరముగా ఉన్నచో) లోకమునకు సాక్షియైన అగ్ని నన్ను అన్ని విధాల రక్షించుగాక. రాముడు శుద్ధమైన చరితము గల నన్ను దుష్టురాలినిగా భావించుచున్నట్లయితే (నేను రాము డనుకొనుచున్నట్లు చరితము కలదానిని కానిచో) లోకమునకు సాక్షియైన అగ్ని నన్ను రక్షించుగాక. నేను మనస్సుచేత గాని, వాక్కుచేత గాని, కర్మచేత గాని, ధర్మములన్నీ తెలిసిన రాముణ్ణి అతిక్రమించకున్నచో అగ్ని నన్ను రక్షించుగాక. పూజ్యుడైన సూర్యుడు, వాయువు, దిక్కులు, చంద్రుడు, పగలు, సంధ్యలు, రాత్రి, భూమి, ఇతరదేవతలు నేను సచ్చరిత్ర కలదాని నని ఎరిగి ఉన్నచో అగ్ని నన్ను రక్షించుగాక" అని ప్రార్థించుచు, అగ్నికి ప్రదక్షిణము చేసి, ఏమాత్రమూ శంక లేని మనస్సుతో, ప్రజ్వలించుచున్న అగ్నిలో ప్రవేశించెను. (23-29)

అక్కడనున్న బాలులతోను, వృద్ధులతోను వ్యాకులమైన చాల పెద్దదైన జనసముదాయము ప్రకాశించుచున్న సీత అగ్నిలో ప్రవేశించుచుండగా చూచెను. శుద్ధమైన బంగారము వంటి కాంతి గల, శుద్ధమైన బంగారు ఆభరణములు ధరించిన ఆ సీత అందరి జనుల సమక్షమున ప్రజ్వలించుచున్న అగ్నిలోనికి దుమికెను. బంగారు వేదికతో సమానురాలైన ఆ సీత అగ్నిలోనికి దుముకుచుండగా అపుడు సమస్తభూతములు చూచినవి. అగ్నిలో ప్రవేశించుచున్న మహాభాగ్యవంతురాలైన ఆ సీత, చూచుచున్న మూడు లోకములవారికిని పవిత్రమైన నేతి ఆహుతి వలె కనబడెను. యజ్ఞములో మంత్రాలచేత సంస్కరింపబడిన



ఆజ్యధారవలె అగ్నిలో పడుచున్న ఆ సీతను చూచి స్త్రీలందరూ బిగ్గరగా ఏడ్చిరి. మూడులోకములు, దేవగంధర్వదానవులూ కూడా ఆమెను, శపింపబడి స్వర్గలోకమునుండి నరకములో పడుచున్న దేవతను వలె చూచిరి. ఆమె అగ్నిలో ప్రవేశించుచుండగా, రాక్షసులూ, వానరులూ కూడ అయ్యో! అయ్యో! అని చాల బిగ్గరగా, ఆశ్చర్యముగా అరచిరి.(30-36)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పదహారవ సర్గము సమాప్తము.

నూట పదిహేడవ సర్గము

రాముని వద్దకు దేవతలు వచ్చుట. బ్రహ్మదేవుడు నీవు మహావిష్ణువని చెప్పి రాముని స్తుతించుట.

ధర్మాత్ముడైన రాముడు ఇట్లు హా హా కారము చేయుచున్న వారి ఆర్తనాదములు విని దుఃఖించుచున్న మనస్సుతో, కన్నీళ్ళతో నిండిన నేత్రములతో ముహూర్తకాలము ఆలోచించుచు నిలబడిపోయెను. ఇంతలో కుబేరుడు, పితృదేవతలతో కూడిన యముడు, దేవతల ప్రభువైన ఇంద్రుడు, జలమునకు ప్రభువైన వరుణుడు, మూడు నేత్రములు గల, శ్రీమంతుడు, వృషభధ్వజుడూ అయిన మహేశ్వరుడు, సకల జగత్తును సృజించు, బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన బ్రహ్మదేవుడు - వీరందరూ కలసి

సూర్యుని వంటి విమానములచేత లంకానగరముచేరి రాముని వద్దకు వెళ్ళిరి. (1-4)

ఆ దేవతాశ్రేష్ఠు లందరూ హస్తాభరణములతో కూడిన దీర్ఘములైన భుజములను ఎత్తి దోసిలి కట్టి నిలచి రామునితో- "సకలలోకములకు కర్తవు, జ్ఞానవంతులలో శ్రేష్ఠుడవు, సర్వసమర్థుడవు అయిన నీవు సీత అగ్నిలో పడుచుండగా ఎందుకు ఉపేక్షించుచున్నావు? దేవతాగణములో శ్రేష్ఠుడవైన నిన్ను గూర్చి ఎందుకు తెలిసికొనుటలేదు? నీవు పూర్వకల్పములో, వసువులలో ఋతధాముడ వను వసువువు. మూడు లోకములను సృష్టించిన, ఇతర ప్రభువు లెవ్వరూ లేని ప్రజాప్రతివి. నీవు రుద్రులలో ఎనిమిదవ రుద్రుడవు. సాధ్యులలో ఐదవవాడవు. అశ్వినీ దేవతలు నీ చెవులు, సూర్యచంద్రులు నీ నేత్రములు. ఓ శత్రుసంహారకుడా! నీవు లోకములకు ముందు, వాటి నాశానంతరము కూడా ఉండువాడవు. అట్టి నీవు సాధారణమానవుని వలె సీతను ఉపేక్షించుచున్నావు." అని పలికిరి. (5-9)

లోకమునకు ప్రభువు, రఘువంశమునందు పుట్టినవాడు, ధర్మమును సంరక్షించువారిలో శ్రేష్ఠుడూ అయిన రాముడు ఆ దేవతానాయకునితో- "నేను దశరథకుమారుడైన రాము డను పేరు గల మానవుడను అనియే అనుకొనుచున్నాను. నేను ఎవరివాడనో, ఎందువలన ఇట్లున్నానో భగవంతుడవైన నీవు చెప్పుము." అనెను. (10, 11)

ఇట్లు అనుచున్న రామునితో వేదవేత్తలలో శ్రేష్ఠుడైన బ్రహ్మదేవుడు - "సత్యమైన పరాక్రమము గల రామా! నేను చెప్పుచున్న సత్యమైన మాట వినుము. నీవు స్వప్రకాశస్వరూపుడు, లక్ష్మీసమేతుడు, చక్రము ఆయుధముగా గలవాడు, సర్వసమర్థుడూ అయిన నారాయణుడవు. నీవు ఒక కొమ్ము గల వరాహమూర్తివి. భూతకాలములోని శత్రువులను జయించినవాడవు. భవిష్యత్తుకు సంబంధించిన శత్రువులను జయించగలవాడవు. వినాశరహితము, మధ్యయందు, అంతమునందు కూడ సత్యమూ అయిన బ్రహ్మ నీవే. లోకుల అత్యుత్తమధర్మము యజ్ఞము నీవే. నీ సైన్యము అంతటా వ్యాపించి ఉన్నది. నీవు నాల్గు భుజములు కలవాడవు. నీవు శార్ఙ్గమును ధరించువాడవు. ఇంద్రియములను నియమించువాడవు. మానవుల హృదయగుహలో నివసించువాడవు. పురుషులలో ఉత్తముడవు. అంతటా వ్యాపించి ఉన్నవాడవు. భూమికి సుఖము ఇచ్చువాడవు. గొప్ప బలము గలవాడవు. నీవు సేనానాయకుడవు. గ్రామాధిపతివి. నీవే బుద్ధి, ఓర్పు, ఇంద్రియనిగ్రహము. సృష్టిప్రళయములు. నీవు ఉపేంద్రుడవు. నీవే మధుసూదనుడవు. నీవు ఇంద్రునివంటి

పనులు చేయగలవాడవు. నీవే ఇంద్రుడవు. నీ నాభియందు పద్మమున్నది. యుద్ధములో వినాశము చేయువాడవు నీవే. నీవు శరణుజొచ్చిన వారిని రక్షింపగలిగిన శరణ మని దేవర్షులు చెప్పుదురు. (12-17)

నీవు వేలకొలది శాఖలు అనే కొమ్మలు, వందలకొలది విధివాక్యము లనే శిరస్సులు గల, గొప్ప కర్మాలోచనము చేయు వేదములు ఆత్మగా కలవాడవు. మూడు లోకములను సృష్టించినవాడవు. స్వతంత్రుడవు. నీవు సిద్ధులకు సాధ్యులకు అతి ప్రాచీనమైన ఆశ్రయమైనవాడవు. నీవే యజ్ఞము, నీవే వషట్కారము, నీవే ఓంకారము, నీవు అందరికంటే ఉత్కృష్టుడవు. నీ పుట్టుకను గాని, నాశమునుగాని, నీవు ఎవరవు అను విషయమునుగాని ఎవరూ ఎరుగరు. నీవు సకలప్రాణులలోను, గోవులలోను, బ్రాహ్మణులలోను, సమస్త దిక్కులయందు, ఆకాశమునందు, పర్వతములలోను, నదులలోను, కనబడుదువు. వేలకొలది పాదములు, వందలకొలది శిరస్సులు, వేలకొలది నేత్రములు గల లక్ష్మీసహితుడవైన నీవు సమస్తప్రాణులను, పర్వతములతో కూడిన భూమిని ధరించుచున్నావు. రామా! భూమికి అడుగున నీటిలో నీవు ఆదిశేషుని రూపములో మూడు లోకాలను, దేవగంధర్వదానవులను, ధరించుచు కనబడుచున్నావు. (18-23)

రామా! నేను నీ హృదయమును. సరస్వతీదేవి నీ నాలుక. ఓ ప్రభూ! నీ సమస్త అవయవములయందు దేవతలు రోమములుగా నాచేత నిర్మింపబడినారు. నీ కనురెప్పపాటు రాత్రి, కన్ను తెరచుట పగలు. విధినిషేధములు వేదములు, నీవు లేనిది ఏదీ లేదు. ఈ జగత్తంతా నీ శరీరమే. నీ స్థిరత్వమే భూమి. నీ కోపమే అగ్ని, నీ ప్రసాదము చంద్రుడు, నీవు విష్ణువు. పూర్వము నీవు మూడు పాదన్యాసములచేత మూడు లోకములను ఆక్రమించి, భయంకరుడైన బలిని బంధించి దేవేంద్రుని త్రిలోకప్రభువునుగా చేసినావు. సీత లక్ష్మీదేవి. నీవు ప్రకాశస్వభావము గల, కృష్ణవర్ణుడైన, ప్రజాపతి స్వరూపుడైన విష్ణువు. నీవు ఈ లోకమునందు రావణుని వధించుటకై మనుష్యశరీరము దాల్చినావు. ధర్మమును పోషించువారిలో శ్రేష్ఠుడవైన ఓ రామా! నీవు రావణుణ్ణి చంపి మా కార్యమును పూర్తిచేసితివి. ఇంక సంతోషముతో తిరిగి స్వర్గమును అధిష్ఠించుము. ఓ ప్రభూ! నీ వీర్యము అమోఘము. నీ పరాక్రమములు అమోఘములు. ఓ రామా! నీదర్శనము అమోఘము. నిన్ను స్తుతించుట అమోఘము. (24-30)

ఈ భూలోకములో నీయందు భక్తిగలవారు సార్థకమైన జీవితము కలవారు

అగుదురు. ప్రభువు, నిత్యుడు, పురాతనుడు, పురుషులలో శ్రేష్ఠుడూ అయిన నీ యందు భక్తిగలవారు ఇహలోకమునందు, పరలోకమునందు కూడా ఎల్లప్పుడూ తమ కోరికలను పొందెదరు. పురాతనేతిహాసమునకు సంబంధించిన ఈ దివ్యమైన స్తోత్రమును పఠించు మానవులకు ఎన్నడూ పరాభవము ఉండదు." అని స్తుతించుచు పలికెను.(31-33)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పదిహేడవ సర్గము సమాప్తము.

నూట పదునెనిమిదవ సర్గము

సీత పవిత్రురాలని చెప్పి అగ్నిదేవుడు సమర్పించగా రాముడు సంతోషపూర్వకముగా ఆమెను స్వీకరించుట.

అగ్నిదేవుడు బ్రహ్మ పలికిన శుభమైన ఈ వాక్యము విని, సీతను అంకముపై కూర్చుండబెట్టుకొని పైకి లేచెను. అగ్నిదేవుడు శరీరము ధరించి వెంటనే ఆ చితను పైకి త్రోసివేసి జనకుని కుమార్తె అయిన సీతను తీసికొని పైకి లేచెను. శుద్ధమైన బంగారు అలంకారములు, ఎఱ్ఱని వస్త్రములు ధరించిన సీత సూర్యుడువలె ఉండెను. ఆమె జుట్టు నల్లగా, వంకరగా ఉండెను. ఆమె శరీరముమీద నున్న పుష్పమాలలు గాని, ఇతరాలంకారములు గాని చెక్కుచెదరలేదు. ఆమె అగ్నిలో ప్రవేశించునపుడు ఎట్లుండెనో అట్లే ఉండెను. ఎట్టి దోషములు లేని బాలయైన ఈ సీతను అగ్నిదేవుడు తన అంకమునందు కూర్చుండబెట్టుకొని తీసికొని వచ్చి రామున కిచ్చెను.(1-4)

అప్పుడు లోకసాక్షి యైన అగ్నిదేవుడు రామునితో – "రామా! ఇదిగో నీ సీత; ఈమెయందు ఏమాత్రమూ పాపము లేదు. మంచి చరిత్రగల, పవిత్రురాలైన ఈ సీత వాక్కుచేత గాని, మనస్సుచేత గాని, బుద్ధిచేత గాని, చూపుచేత గాని, సచ్చరిత్రవిషయమునందు పట్టుదల గల నిన్ను అతిచరించలేదు. నీవు దగ్గర లేక దీనురాలైన వివశురాలైన ఈమెను పరాక్రమముచేత గర్వించిన రాక్షసుడైన రావణుడు నిర్జనవనమునందు అపహరించినాడు. నీయందే చిత్తము నిలిపి నీవే ఉత్తమగతియని తలచుచున్న ఈమెను అంతఃపురములో బంధించి దాచివేసినారు. ఈమెను భయంకరమైన బుద్ధిగల రాక్షసస్త్రీలు రక్షించుచుండిరి. నీయందే చిత్తమును నిలిపిన



సీత అనేకవిధములుగా లోభపెట్టబడినను, భయపెట్టబడినను ఈ రాక్షసుణ్ణి లెక్కచేయలేదు. విశుద్ధమైన భావము గల, పాపము లేని సీతను స్వీకరించుము. నీవు ఆమెను ఏమీ అనకూడదు, నేను ఆజ్ఞాపించుచున్నాను." అని పలికెను. (5-10)

మాటలాడువారిలో శ్రేష్ఠుడు, ధర్మాత్ముడు అయిన రాముడు సంతోషించిన మనస్సుగలవాడై, కన్నీటిచేత నేత్రములు వ్యాకులములు కాగా క్షణకాలముపాటు ఆలోచించెను. ధైర్యవంతుడు, గొప్ప పరాక్రమము గలవాడు, ధర్మమును పోషించువారిలో శ్రేష్ఠుడు అయిన రాముడు ఆ మాటలు విని, దేవతలలో శ్రేష్ఠుడైన అగ్నిదేవునితో– "పూజ్యుడా! మంగళప్రదురాలైన ఈ సీత రావణుని అంతఃపురములో చాలకాలము ఉండుటచే లోకములో తప్పక శుద్ధిని పొందుటకు నిర్దోషురాలని నిరూపించుకొనుటకు తగి ఉన్నది. సీతను శోధించకుండగా గ్రహించినచో లోకులందరూ దశరథపుత్రుడైన రాముడు, అయ్యో, ఎంత మూర్ఖుడు. కామమునకు వశమైన మనస్సుకలవాడు అని నన్ను గూర్చి చెప్పుకొనగలరు. ఎల్లప్పుడూ నా మనస్సులో మెదులుచుండే జనకరాజపుత్రియైన సీత ఇతరులయందు హృదయము లేని దనీ, నాయందు భక్తికల దనీ నాకు కూడ తెలియును. మహాసముద్రము తీరమును ఎట్లు దాటజాలదో అట్లే తన తేజస్సుతో రక్షింపబడుచున్న విశాలాక్షియైన ఈ సీతను రావణుడు అతిక్రమింపజాలడు; ముట్టజాలడు. సత్యమును ఆశ్రయించి ఉన్న నేను మూడు లోకములకు నమ్మకము కలుగుటకై సీత అగ్నిలో ప్రవేశించుచుండగా ఉపేక్షించితిని. దుష్టబుద్ధిగల ఆ రావణుడు పొంద శక్యము

కాని ఈమెను, ప్రజ్వలించుచున్న అగ్నిశిఖను వలె మనసా కూడ ఎదిరించుటకు సమర్థుడు కాడు కూడ. మంగళప్రదురాలైన ఈ సీతకు రావణుని అంతఃపురములోని ఐశ్వర్యముతో పనిలేదు. కాంతి సూర్యుని విడచి మరెక్కడికీ వెళ్ళనట్లు సీత నన్ను విడిచి మరెవ్వరి సంబంధమును పొందదు. జనకుని పుత్రియైన సీతతో సమానమైన పవిత్రురాలు ఈ మూడు లోకములలోను కూడ లేదు. ఆత్మాభిమానము కలవాడు కీర్తిని ఎట్లు వదలజాలడో అట్లే నేను ఈమెను వదలజాలను. నాయందు స్నేహము గల లోకపాలకులైన మీరందరూ ఈ విధముగా హితమును చెప్పుచున్నారు. ఈ హితవచనమును నేను తప్పక ఆచరించవలెను." అని పలికెను.(11-21)

విజయమును పొందినవాడు, గొప్ప బలము కలవాడు, మహాసుఖమునకు తగినవాడు, రఘువంశసంజాతుడు అయిన రాముడు ఇట్లు పలికి, తాను చేసిన పనికి అందరిచేత ప్రశంసింపబడుచు ప్రియురాలితో కలిసి సుఖమును సంతోషమును పొందెను.(22)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పదునెనిమిదవ సర్గము సమాప్తము.

నూట పందొమ్మిదవ సర్గము

మహాదేవుడు చెప్పగా సీతారామలక్ష్మణులు దశరథుని చూచి నమస్కరించుట.

రాముడు పలికిన ఈ శుభకరమైన వాక్యమును విని, పిమ్మట మహేశ్వరుడు మిక్కిలి శుభకరమైన వాక్యమును పలికెను- "శత్రుసంహారకా! నీవు ఈ పనిని అదృష్టవశముచేత పూర్తి చేసితివి. నీవు అదృష్టవశముచేత లోకమునకు రావణునివలన కలిగిన భయ మనే అత్యధికము, భయంకరమూ అయిన అంధకారమును తొలగించితివి. రామా! దీనుడైన భరతుణ్ణి, కీర్తిమంతురాలైన కౌసల్యను ఓదార్చి, కైకేయిని, లక్ష్మణుని తల్లియైన సుమిత్రను చూచి, అయోధ్యలో రాజ్యము పొంది, మిత్రజనమునకు ఆనందము కలిగించి, (పుత్రులను కనుటచేత) ఇక్ష్వాకుకులమునందు వంశమును నిలిపి, అశ్వమేధయాగము చేసి, గొప్ప యశస్సు పొంది, బ్రాహ్మణులకు దానములు చేసి, పిమ్మట నీవు స్వర్గమునకు చేరవలెను. మనుష్యలోకమునందు నీ తండ్రి, నీకు పూజ్యుడు, గొప్ప కీర్తిగలవాడు అయిన దశరథ మహారాజు ఈ విమానములో ఉన్నాడు. పుత్రుడైన నీచేత తరింపబడినవాడై

శోభాయుక్తుడైన ఈ దశరథుడు ఇంద్రలోకము చేరినాడు. నీవు లక్ష్మణసహితుడవై ఈతనికి అభివాదము చేయుము."(1-8)

లక్ష్మణసహితుడైన రాముడు మహేశ్వరుని మాటలు విని విమానాగ్రమునందు ఉన్న తండ్రికి నమస్కరించెను. ప్రభువైన రాముడు లక్ష్మణసహితుడై, తన తేజస్సుతో ప్రకాశించుచున్న, నిర్మలములైన వస్త్రములు ధరించిన తండ్రిని చూచెను.(9, 10)

విమానములో శ్రేష్ఠమైన అసనముమీద కూర్చొని ఉన్న ప్రభువైన దశరథమహారాజు ప్రాణముకంటె ఎక్కువగా ప్రియుడైన పుత్రుణ్ణి చూచి, ఆనందపరవశుడై, ఒడిలో కూర్చుండబెట్టుకొని, బాహువులతో కౌగిలించుకొని ఇట్లు పలికెను– "రామా! నీవు దగ్గర లేని నాకు, స్వర్గము గాని, దేవతాశ్రేష్ఠులు చేయు సంమానము గాని ఇష్టము కాదు. నీకు సత్యమును చెప్పుచున్నాను. శత్రువులను సంహరించి, ఆనందముతో నిండిన మనస్సుతో వనవాసనియమమును పూర్తిచేసికొనిన నిన్ను చూచి ఈనాడు నాకు చాల సంతోషము కలిగినది. రామా! నిన్ను అరణ్యమునకు పంపుటకై కైకేయి పలికిన మాటలు ఇంకా నా హృదయములో మెదలుచున్నవి. నీవు, లక్ష్మణుడు కుశలముగా ఉన్నట్లు చూచి, మీ ఇద్దరిని కౌగిలించుకొనిన పిమ్మట నేడు సూర్యుడు మంచునుండి దూరమైనట్లు దుఃఖమునుండి దూరమైతిని. పుత్రా! సుపుత్రుడవైన, మహాత్ముడవైన నీవు అష్టావక్రుడు ధర్మాత్ముడైన కహోలు డను బ్రాహ్మణుణ్ణి తరింపచేసి నట్లు నన్ను తరింపచేసినావు. సౌమ్యుడా! పురుషోత్తముడా! రావణుని వధకొఱకై దేవతలు ఈ విధము(అభిషేకవిఘ్నాదులు) చేసినట్లు ఇప్పుడే నాకు తెలిసినది.(11-18)

రామా! వనవాసమునుండి తిరిగి వచ్చి ఇల్లు చేరిన, శత్రుసంహారకుడవైన నిన్ను చూడబోవుచున్న కౌసల్య అదృష్టవంతురాలు గదా? రామా! అయోధ్యకు తిరిగి వెళ్ళిన నీవు రాజ్యాభిషిక్తుడవైన పిమ్మట నిన్ను మహారాజునుగా చూడగలిగిన ఆ జనులు కృతార్థులు కదా! నీవు అనురాగవంతుడు, బలవంతుడు, పరిశుద్ధుడు, ధర్మము ఆచరించువాడు అయిన భరతునితో కలియగా చూడవలెనని నా కోరిక. ఓ! సౌమ్యుడా! నీవు సీతతోను, బుద్ధిమంతుడైన లక్ష్మణునితోను కలసి అరణ్యములో నివసించి పదునాలుగు సంవత్సరములు గడిపినావు. వనవాసము పూర్తిచేసితివి, నీ ప్రతిజ్ఞ నిలుపుకొంటివి. యుద్ధములో రావణుని సంహరించి దేవతలకు సంతోషము కూడ కలిగించితివి. ఓ! శత్రుసంహారకుడా! గొప్ప పనిచేసి శ్లాఘించతగిన కీర్తి సంపాదించితివి. సోదరులతో కూడ రాజ్యము పాలించుచు దీర్ఘాయుర్దాయవంతుడవు అగుము."(19-24)

ఇట్లు పలుకుచున్న రాజుతో రాముడు అంజలి ఘటించి - "ధర్మములు ఎరిగినవాడా! కైకేయి విషయమునందు, భరతుని విషయమునందు అనుగ్రహము చూపుము. 'నిన్ను, నీ పుత్రుణ్ణి విడచివేయుచున్నాను.' అని నీవు కైకేయితో ఏ మాట పలికితివో, ఆ ఘోరమైన శాపము పుత్రసహితురాలైన ఆమెను స్పృశించకుండుగాక." అని ప్రార్థించెను. (25, 26)

దశరథుడు అంజలి ఘటించి ఉన్న రామునితో- 'అట్లే జరుగుగాక' అని పలికి, లక్ష్మణుణ్ణి కూడా కౌగిలించుకొని లక్ష్మణునితో- "లక్ష్మణా! నీవు రాముణ్ణి, విదేహరాజపుత్రియైన సీతను సేవించుట ద్వారా నాకు చాల సంతోషము కలిగించినావు. ధర్మఫలమును పొందినావు. నీవు ధర్మమును, ఈ భూలోకమునందు అధికమైన యశస్సును పొందగలవు. రాముడు ప్రసన్నుడైనచో స్వర్గమును, ఉత్తమమైన గొప్పతనమును కూడ పొందగలవు. లక్ష్మణా! నీకు మంగళమగుగాక. రామునకు సేవ చేయుచుండుము. రాముడు ఎల్లప్పుడు సకలలోకహితమునందు ఆసక్తి గలవాడు. ఇంద్రునితో కూడిన ఈ మూడు లోకములు, సిద్ధులు, మహర్షులు, మహాత్ములూ, ఉత్తమపురుషుడైన ఈ రాముని సన్నిధి చేరి పూజించుచున్నారు. అవ్యక్తము, నాశరహితము, దేవతల హృదయము, రహస్యమూ అయిన బ్రహ్మయే రాముడుగా అవతరించె నని చెప్పుచున్నారు. సీతాసహితుడైన ఈ రాముణ్ణి భక్తితో సేవించుచున్న నీవు ధర్మానుష్ఠానమును, అధికమైన కీర్తిని పొందినావు." అని పలికెను. (27-33)

రాజు లక్ష్మణునితో ఇట్లు పలికి, అంజలి ఘటించి నిలచిఉన్న కోడలిని, "ఓ! పుత్రీ!" అని పలకరించి, ఆమెతో మెల్లగా మధురముగా ఇట్లు పలికెను- "సీతా! రాముడు నిన్ను విడిచిపెట్టినందుకు కోపించకుము. రాముడు నీ హితమునే కోరి విశుద్ధికొరకై ఇట్లు చేసినాడు. పుత్రీ! ఇతరు లెవ్వరికీ చేయశక్యముకాని సచ్చరిత్రరూపమైన ఏ కార్యమును నీవు చేసినావో ఇది ఇతరస్త్రీల కీర్తిని కప్పివేయును. నీకు భర్తృశుశ్రూషను గూర్చి చెప్పవలసిన పనిలేదనునది నిజమే; అయినను నేను చెప్పవలయును. ఈతడే నీకు పరమదేవత."(34-37)

రఘువంశసంజాతుడైన దశరథమహారాజు, పుత్రులకు, సీతకు ఇట్లు ఉపదేశించి విమానముపై ఇంద్రలోకమునకు వెళ్ళెను. గొప్ప ప్రభావము గలవాడు, శోభతో కూడిన వాడు, రాజులలో ఉత్తముడూ అయిన దశరథుడు సంతోషించిన (పులకించిన) దేహము గలవాడై వెళ్లెదనని సీతారామలక్ష్మణులతో చెప్పి,

విమానమధిరోహించి తిరిగి స్వర్గలోకమునకు వెళ్ళెను.(38, 39)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట పందొమ్మిదవ సర్గము సమాప్తము.

నూట ఇరవైయవ సర్గము

రాముడు కోరగా ఇంద్రుడు, మరణించిన వానరులను జీవింపచేసి, దేవతలతో స్వర్గమునకు వెళ్ళిపోవుట.

దశరథుడు తిరిగి వెళ్ళిపోయిన పిమ్మట, పాకాసురసంహారకుడైన దేవేంద్రుడు, చాల సంతోషించుచు, అంజలి ఘటించి నిలచియున్న రామునితో– "మానవులలో శ్రేష్ఠుడవైన రామా! నీకు లభించిన మా దర్శనము వ్యర్థము కాకూడదు. నీవిషయములో సంతోషముతో ఉన్నాము. నీకేమి కావలెనో చెప్పుము." అనెను.(1, 2)

మహాత్ముడైన మహేంద్రుడు ప్రసన్నుడై ఇట్లు పలుకగా రాముడు చాలా ప్రసన్నమైన మనస్సు గలవాడై సంతోషించి– "దేవేంద్రా! నీకు నాయందు ప్రేమకలిగినచో నేను చెప్పబోవు దానిని సత్యము చేయుము. నా నిమిత్తమై పరాక్రమము చూపి యమలోకమునకు వెళ్ళిన వానరు లందరూ మరల జీవితమును పొంది లేచెదరుగాక. నా నిమిత్తమై పుత్రులకు, భార్యలకూ, దూరమైన వానరులందరు సంతోషించిన మనస్సులతో ఉండగా వాళ్ళను చూడవలెనని కోరుచున్నాను. ఈ వానరులందరు శూరులు, పరాక్రమము చూపించినవారు, మరణమును లెక్కచేయరు. అట్టివారు యుద్ధము చేయుచు మరణించినారు. దేవేంద్రా! వాళ్ళనందరినీ జీవింపచేయుము. నాకు ప్రియము చేయుటకై ఏ వానరులు మృత్యువును కూడా లెక్కచేయలేదో వాళ్ళందరు నీ అనుగ్రహమువలన తిరిగి వచ్చెదరుగాక. నేను ఈ వరమును కోరుచున్నాను. వానరులే గాక గోలాంగూలములు, భల్లూకములు కూడ ఏ రోగమూ లేక, గాయములు లేక, బలపౌరుషములతో నిండి ఉండగా చూడగోరుచున్నాను. ఈ వానరులు ఎక్కడెక్కడ నివసించెదరో అక్కడ అకాలమునందు కూడ పుష్పఫలములు, నిర్మలమైన ఉదకము కల నదులు ఉండుగాక." అని కోరెను.(3–10)

మహాత్ముడైన రాముడు పలికిన మాటలు విని మహేంద్రుడు సంతోషముతో– "నాయనా! రామా! నీవు అడిగిన ఈ వరము చాలా గొప్పది. నేను ఎన్నడూ రెండు

మాటలు పలకలేదు. అందువలన నీవు కోరినట్లు జరుగగలదు. యుద్ధములో రాక్షసులచేత చంపబడిన వానరు లందరు, భల్లూకములు, గోపుచ్ఛములు, ముఖములు బాహువులు తెగిపడియున్న వానరాదులు లేచెదరుగాక. వానరులు ఏ రోగములూ లేనివారై, గాయములు లేనివారై, అధికమైన బలపౌరుషములతో, నిద్రించిన వాళ్ళు నిద్రానంతరము లేచినట్లు లేచెదరు. అందరూ గొప్ప సంతోషముతో తమ మిత్రులతోను, బంధువులతోను, జ్ఞాతులతోను, కుటుంబమువారితోను కలిసికొనగలరు. గొప్ప ధనుస్సు ధరించిన రామా! అకాలములో కూడా వృక్షములు పుష్పములచేత విచిత్రవర్ణము కలవిగాను, ఫలములతో నిండినవిగాను కాగలవు. నదులు జలములతో నిండి యుండును." అని వరమిచ్చెను.(11-16)

ఆ వానరప్రముఖు లందరూ పూర్వము గాయములతో నిండిఉండి ఇప్పుడు గాయములు పోవుటచే సమముగా ఉన్న శరీరములతో నిద్రనుండి లేచినట్లు లేచిరి. ఆ వానరు లందరు ఇది ఏమిటని ఆశ్చర్యము చెందిరి.(17)

దేవతాప్రముఖు లందరు కార్యమునందు సఫలుడైన రాముణ్ణి చూచి, చాల సంతోషించి, లక్ష్మణసహితుడైన ఆ రాముణ్ణి స్తుతించి- "రాజా! ఇక్కడినుండి అయోధ్యకు వెళ్ళుము. వానరులను వారి స్థానములకు పంపివేయుము. నీయందు అనురాగము గల కీర్తిమంతురాలైన ఈ సీతను ఓదార్చుము. ఓ! శత్రుసంహారకుడా! నిన్ను గూర్చిన శోకముతో వ్రతమును (నియమములు) ఆచరించుచున్న నీ సోదరుడైన భరతుణ్ణి, మహాత్ముడైన శత్రుఘ్నుణ్ణీ, ఆందరు తల్లులనూ చూడుము. వెళ్ళి పట్టాభిషిక్తుడవై పౌరులకు ఆనందము కలిగించుము." అని పలికిరి.(18-21)

దేవేంద్రుడు లక్ష్మణసహితుడైన రామునితో ఇట్లు పలికి, సంతోషించుచు, ఇతరదేవత లందరితో కూడి సూర్యుని వంటి విమానములపై వెళ్ళెను. అప్పుడు లక్ష్మణసమేతుడైన రాముడు ఆ దేవత లందరికీ నమస్కరించి వానరు లందరినీ తమ స్థానములందు విశ్రమించుటకై ఆజ్ఞాపించెను. అప్పుడు రామలక్ష్మణులచే రక్షింపబడుచున్న, సంతోషించిన జనులు గల, కీర్తి గల ఆ మహాసేన శోభతో ప్రజ్వలించుచున్నదా అన్నట్లు చంద్రునిచే ప్రకాశింపచేయబడిన రాత్రివలె అంతటా ప్రకాశించెను.(22-24)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవైయవ సర్గము సమాప్తము.

నూట ఇరవై ఒకటవ సర్గము

రాముడు అయోధ్యకు వెళ్ళుటకు ఉద్యుక్తుడగుట. విభీషణుడు పుష్పకమును తీసికొనివచ్చుట.

ఆ రాత్రి అక్కడ శయనించి సుఖముగా మేల్కొనిన శత్రుసంహారకుడైన రాముని వద్దకు వెళ్ళి విభీషణుడు జయశబ్దము పలుకుచు, దోసిలికట్టి నమస్కరించి– "రామా! అలంకరించుటలో నేర్పుగల, పద్మములవంటి నేత్రములు గల ఈ స్త్రీలు స్నానసాధనములైన అంగరాగములను, వస్త్రములను, ఆభరణములను, చందనములను, దివ్యములైన అనేకవిధములైన మాలికలను తీసికొనివచ్చియున్నారు. వీళ్ళు యథోచితముగా నీకు స్నానము చేయించెదరు." అనెను.(1-3)

ఆ మాటలు విని రాముడు విభీషణునితో– "నీవు సుగ్రీవుడు మొదలైన వానరులను స్నానముకొరకై ఆహ్వానించుము. ధర్మాత్ముడు, సుఖములకు అలవాటు పడినవాడు, సుకుమారుడు, మహాబాహువు, సత్యమునకు ఆశ్రయభూతుడు అయిన భరతుడు నా నిమిత్తమై శ్రమపడుచున్నాడు. ధర్మమును ఆచరించుచున్న ఆ కైకేయీపుత్రుడైన భరతుడు లేకుండగా నాకు స్నానముగాని, వస్త్రములు గాని, అలంకారముగాని ఇష్టములు కావు. అయోధ్యానగరమునకు శీఘ్రముగా వెళ్ళు ఉపాయమును చూడుము. కాలినడకతో అయోధ్యకు వెళ్ళువారికి ఈ దూరము ప్రయాణమునకు చాల కష్టమైనది కదా?" అని పలికెను.(4-7)

విభీషణుడు రాముని మాటలు విని – "రామా! ఒక్క దినములో నిన్ను అయోధ్యానగరము చేర్చెదను. సాటిలేని పరాక్రమము గల రామా! సూర్యునితో సమానము, ఇచ్ఛను అనుసరించి ప్రయాణము చేయునది, ఉత్తమము అయిన పుష్పక మను, నా సోదరుడైన కుబేరుని దివ్యమైన విమానమును అధికబలవంతుడైన రావణుడు యుద్ధములో జయించి హరించినాడు. దానిని నీకొరకై రక్షించి ఉంచినాను. నీకు భద్రమగుగాక. మేఘమువంటి ఆ విమానము ఇక్కడ ఉన్నది. నీవు ఎట్టి దిగులు లేక ఈ విమానముపై అయోధ్యకు వెళ్ళవచ్చును. ప్రజ్ఞాశాలివైన రామా! నీకు నామీద అనుగ్రహ మున్నచో, నా గుణములను నీవు స్మరించుచున్నచో, నాయందు స్నేహభావమున్నచో ఇక్కడ ఉండుము. సోదరుడైన లక్ష్మణునితోను, భార్యయైన సీతతోను కలసిన నీవు నాచేత అన్ని భోగ్యవస్తువులను సమర్పించి పూజింపబడినవాడవై అటుపిమ్మట వెళ్ళవచ్చును. సైన్యముతోను, మిత్రగణముతోను కూడిన నీవు, నేను ఏర్పరచిన, యథాశాస్త్రముగా సమర్పింపబడిన, సంతోషముతో

కూడిన నా ఈ సత్కారమును స్వీకరింపుము. రామా! ప్రేమవలన, గౌరవమువలన, స్నేహమువలన నిన్ను బ్రతిమాలుచున్నాను. నేను నీ భృత్యుడను. నిన్ను ఆజ్ఞాపించుటలేదు." అని సవినయముగ పలికెను.(8-15)

రాముడు ఆ మాటలు విని, రాక్షసులు, వానరులు అందరూ వినుచుండగా విభీషణునితో- "శత్రుసంహారకుడవైన ఓ! వీరుడా! ఆలోచనలలో సాహాయ్యము చేయుటచేత, పనులచేత, అత్యధికమైన స్నేహముచేత నీవు అన్నివిధాలా నన్ను పూజించితివి. నీవు చెప్పినట్లుగా నేను చేయకపోవుట అనేది లేదు; కాని నా మనస్సు సోదరుడైన ఆ భరతుని చూడవలె నని తొందరపడుచున్నది. ఏ భరతుడు నన్ను వెనుకకు తీసుకొని వెళ్ళుటకు చిత్రకూటమునకు వచ్చినాడో, తలవంచి నమస్కరించుచు నన్ను ప్రార్థించిన ఏ భరతుని మాట ప్రకారము నేను చేయలేదో, అట్టి భరతుణ్ణి, కౌసల్యను, సుమిత్రను, కీర్తి గల కైకేయిని, మిత్రుడైన గుహుణ్ణి, పౌరులను, జానపదులను చూచుటకై నా మనస్సు తొందరపడుచున్నది. సౌమ్యుడా! విభీషణా! నాకు అనుజ్ఞ ఇమ్ము. నీవు నన్ను పూజించినట్లే. మిత్రుడా! కోపింపకుము, నిన్ను బ్రతిమాలుకొనుచున్నాను. వెంటనే విమానము తెప్పించుము. పని పూర్తిగా అయిన తరువాత నేను ఇక్కడ ఉండుట యుక్తము కాదు కదా!" అనెను.(16-22)

రాముని మాటలు విని రాక్షసేంద్రుడైన విభీషణుడు తొందరపడుచు సూర్యునితో సమానమైన ఆ విమానమును పిలచెను. దాని భాగములు బంగారముచేత విచిత్రములుగా ఉండెను. అంతటా వెండి కాంతితో కూడిన ఆ విమానమునందు చుట్టు ప్రక్కల వైడూర్యమాణిక్యవికారములైన అరుగులు, మండపములు, తెల్లని పతాకలచేత, ధ్వజములచేత అలంకరింపబడెను. ఆ బంగారు విమానములో బంగారు పద్మాలచేత అలంకరించబడిన బంగారు మేడలు ఉండెను. ముత్యముల, మణుల కిటికీలు గల ఆ విమానము చుట్టూ చిరుగంటలు, గంటలూ కట్టి ఉండుటచే మధురముగా ధ్వని చేయుచుండెను. విశ్వకర్మ నిర్మించిన ఆ విమానము మేరుపర్వతశిఖరమువలె ఉండెను. ముత్యములతోను, వెండితోను ప్రకాశించుచున్న పెద్ద మేడలతో అది అలంకృతమై ఉండెను. దాని క్రింది ప్రదేశమునందలి భాగములు స్ఫటికమాణిక్యములతో విచిత్రములుగా ఉండెను. దానియందు అంతటా మంచి విలువగల ఆస్తరణములు కప్పిన, అమూల్యములైన, వైడూర్యమణివికారములైన శ్రేష్ఠములైన ఆసనములు అమర్చబడి ఉండెను.(23-28)

మనోవేగము వంటి వేగము గల, ఎదిరింప శక్యముకాని ఆ విమానము

వచ్చినట్లు రామునకు తెలిపి విభీషణుడు అక్కడ నిలచెను. గొప్పబలము గల లక్ష్మణసమేతుడైన రాముడు అక్కడకు వచ్చిన, ఇచ్ఛానుసారము ప్రయాణము చేయు, పర్వతము వలె ఉన్న ఆ పుష్పకవిమానమును చూచి ఆశ్చర్యము చెందెను. (29,30)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవై ఒకటవ సర్గము సమాప్తము.


నూట ఇరవై రెండవ సర్గము

విభీషణుడు వానరులను సత్కరించుట; రాముడు విభీషణ వానరాదులతో పుష్పకముపై అయోధ్యకు బయలుదేరుట.

విభీషణుడు పుష్పములచేత అలంకరింపబడిన ఆ పుష్పకవిమానము తెప్పించి రాముని దగ్గర నిలచి చేతులు జోడించి, వినీతుడై తొందరపడుచు, "ఇంకా ఏమి చేయుదును?" అని అడిగెను. (1, 2)

రాముడు విమర్శించి, లక్ష్మణుడు వినుచుండగా ఆ విభీషణునితో స్నేహపూర్వకముగా– "విభీషణా! గొప్ప ప్రయత్నము, పనులు చేసిన ఈ వానరు లందరికీ రత్నములూ, అనేకవిధములైన ధనములూ ఇచ్చి సత్కరించుము. ఉత్సాహవంతులు, యుద్ధములలో ప్రాణభయము విడచినవారు, వెనుకకు మరలనివారు అయిన వానరులతో కలసి నీవు లంకను జయించినావు. ఈ వానరు లందరూ పనిచేసినవారే. వీరికి ధనములను, శ్రేష్ఠవస్తువులను ఇచ్చి వీరు చేసిన కర్మను సఫలము చేయుము. కృతజ్ఞుడవైన నీవు సంతోషము కలుగు విధముగా ఈ వానరవీరులకు సంమానము చేసినచో వీరందరూ ఆనందింతురు. నీవు త్యాగశీలుడవు, అందరినీ దగ్గరకు చేర్చుకొనువాడవు, ధనము సంపాదించువాడవు, దయ కలవాడవు, జితేంద్రియుడవు అనుచు అందరూ నీ దగ్గరకు చేరుదురు. అందుచేతనే నేను ఇట్లు చెప్పుచున్నాను. రాజా! ప్రేమించదగిన గుణము లేవీ లేక యుద్ధములకు తీసికొని వెళ్ళి చంపించే రాజును సైన్యము విడచివేయును." అని పలికెను. (3-9)

విభీషణుడు రాముని మాటలు విని ఆ వానరు లందరికీ రత్నములు, ధనము ఇచ్చి పూజించెను. వానరసేనానాయకులందరూ రత్నములచేత, ధనముచేత



పూజింపబడి నట్లు చూచి రాముడు అత్యుత్తమమైన ఆ విమానమును ఎక్కెను. సిగ్గుపడుచున్న కీర్తిమంతురాలైన సీతను సమీపమున కూర్చుండబెట్టుకొని పరాక్రమవంతుడు, ధనుర్ధరుడు అయిన సోదరుడైన లక్ష్మణునితో కూడ విమాన మెక్కెను. (10-12)

రాముడు విమానమునందు ఉండి, సకలవానరులను, మహావీర్యవంతుడైన సుగ్రీవుణ్ణి, విభీషణుణ్ణి పూజించుచు సాదరముగా- "వానరశ్రేష్ఠులారా! మీరు మిత్రుని కార్యము సాధించినారు. నేను మీకందరికీ అనుజ్ఞ ఇచ్చుచున్నాను. మీ కిష్టమైన విధముగా తిరిగి వెళ్ళుడు. సుగ్రీవా! స్నేహముగల, హితము కోరు స్నేహితుడు చేయవలసిన దంతా ధర్మము విషయమునందు భయము గల నీవు చేసినావు. నీవు సైన్యముతో కూడి శీఘ్రముగా కిష్కింధకు వెళ్ళుము. విభీషణా! నీవు లంకలో నేనిచ్చిన నీ రాజ్యములో నివసించుము. ఇంద్రుడూ, దేవతలూ కూడ నిన్ను ఎదిరింపజాలరు. నా తండ్రి రాజధానియైన అయోధ్యకు వెళ్ళెదను. అనుజ్ఞను కోరుచున్నాను. మీ అందరి దగ్గరా సెలవు తీసికొనుచున్నాను." అనెను. (13-17)

రాముని మాటలు విని వానరనాయకులు, వానరులు, విభీషణుడు వీరందరూ కూడా చేతులు జోడించి- "రాజశ్రేష్ఠుడా! మేము కూడ అయోధ్యకు వెళ్ళవలె నని కోరుచున్నాము. మమ్ముల నందరినీ కూడ తీసికొనివెళ్ళుము. సంతోషముతో వనాలలోను, ఉద్యానవనాలలోను సంచరించెదము. పట్టాభిషిక్తుడ వైన నిన్ను చూచి, కౌసల్యకు నమస్కరించి, శీఘ్రముగా ఇంటికి వెళ్ళిపోయెదము." అనిరి. (18-20)

వానరులు, విభీషణుడు ఇట్లు పలుకగా ధర్మాత్ముడైన రాముడు సుగ్రీవవిభీషణులతోను, వానరులతో– "నేను మీ అందరితో కలసి, మిత్రసహితుడనై అయోధ్య చేరి సంతోషము పొందుట అనునది ఒక ప్రియముకంటె ఇంకను ప్రియమైనది లభించినట్లే. సుగ్రీవుడా! వానరులతో కూడ శీఘ్రముగా విమానము ఎక్కుము. రాక్షసరాజా! విభీషణా! నీవు కూడ నీ అమాత్యులతో కలసి ఎక్కుము." అనెను. (21-23)

పిమ్మట సుగ్రీవుడు, వానరులు, అమాత్యులతో కూడిన విభీషణుడు సంతోషించుచు ఆ దివ్యమైన పుష్పకవిమానము ఎక్కిరి. వాళ్ళందరూ ఎక్కిన పిమ్మట కుబేరునికి సంబంధించిన ఆ ఉత్తమమైన విమానము రాముని ఆజ్ఞచేత ఆకాశముపైకి ఎగిరెను. రాముడు ఆకాశములో ఎగురుచున్న, హంసల ప్రతిమలతో కూడిన ఆ ప్రకాశించుచున్న విమానమునందు సంతోషించుచు, శ్లాఘింపబడుచు, కుబేరుడు వలె ప్రకాశించెను. ఆ వానరులు, భల్లూకములు, మహాబలవంతులైన రాక్షసులు, అందరూ కూడ ఆ దివ్యమైన విమానములో సుఖముగా ఇరుకు లేకుండగా కూర్చుండిరి. (24-27)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవై రెండవ సర్గము సమాప్తము.

నూట ఇరవై మూడవ సర్గము

రాముడు మార్గమధ్యమునందు ఉన్న ఆ యా స్థానములను సీతకు చూపుట.

హంసల ప్రతిమలతో కూడిన అత్యుత్తమమైన ఆ విమానము రాముని ఆజ్ఞ ప్రకారము గొప్ప ధ్వనిచేయుచు ఆకాశములోనికి ఎగిరెను. పిమ్మట రఘువంశమునకు ఆనందజనకుడైన రాముడు అంతటా దృష్టి ప్రసరింపచేయుచు చంద్రునివంటి ముఖముగల, మిథిలారాజకుమారియైన సీతతో ఇట్లనెను– "సీతా! కైలాసశిఖరమువంటి త్రికూట పర్వతశిఖరముమీద ఉన్న, విశ్వకర్మ నిర్మించిన లంకను చూడుము. వానరులు, రాక్షసులూ మరణించుటకు కారణమైన మాంసరక్తముల బురదతో నిండిన ఈ గొప్ప యుద్ధభూమిని చూడుము. సీతా! బ్రహ్మనుండి వరములు పొంది లోకములను పీడించిన రాక్షసరాజైన రావణుడు నీ నిమిత్తమై నాచేత చంపబడి ఇక్కడ పడిపోయినాడు. ఇక్కడ కుంభకర్ణుడు

చంపబడినాడు. ఇక్కడ ప్రహస్తుడు చంపబడినాడు. ఇక్కడ హనుమంతునిచేత ధూమ్రాక్షుడు చంపబడినాడు. ఇక్కడ మహాత్ముడైన సుషేణుడు విద్యున్మాలిని చంపినాడు. ఇక్కడ యుద్ధములో రావణుని పుత్రుడైన ఇంద్రజిత్తు లక్ష్మణునిచేత చంపబడినాడు. ఇక్కడ అంగదునిచేత వికటు దను రాక్షసుడు చంపబడినాడు. చూచుటకు కూడ శక్యముకాని విరూపాక్షుడు, మహాపార్శ్వుడు, మహోదరుడు, అకంపనుడు, బలవంతులైన మరికొందరు రాక్షసులు, త్రిశిరస్సు, అతికాయుడు, దేవాంతకుడు, నరాంతకుడు చంపబడినారు. యుద్ధోన్మత్తుడు, మత్తుడు అను ఇద్దరు రాక్షసశ్రేష్ఠులు, నికుంభుడు, కుంభుడు అను కుంభకర్ణుని పుత్రులు, వజ్రదంష్ట్రుడు, దంష్ట్రుడు, ఇంకను చాలామంది రాక్షసులు చంపబడినారు. ఎదిరింపశక్యముకాని మకరాక్షుణ్ణి నేను యుద్ధములో పడగొట్టితిని."(1-11)

మహాయుద్ధములో అకంపనుడు, పరాక్రమవంతుడైన శోణితాక్షుడు, యూపాక్షుడు, ప్రజంఘుడు చంపబడినారు. ఇక్కడ చూచుటకు భయంకరుడైన విద్యుజ్జిహ్వుడు, యజ్ఞశత్రువు, గొప్పబలముగల సుప్తఘ్నుడు,సూర్యశత్రువు, బ్రహ్మశత్రువు చంపబడినారు. ఇక్కడ వెయ్యికి మించిన సవతులతో కూడి రావణుని భార్యయైన మండోదరి అతనికొరకై విలపించెను. సీతా! మేము సముద్రమును దాటి రాత్రి విడిసిన సముద్రము రేవు ఇదిగో, ఇటు కనబడుచున్నది. ఓ! విశాలాక్షీ! ఇది నీకొరకై నేను, సగరచక్రవర్తి త్రవ్వించిన లవణసముద్రముమీద కట్టించిన, నలుడు కట్టిన సేతువు. సీతా! క్షోభింపశక్యముకాని, వరుణుని వాసమైన ఈ సముద్రమును చూడుము. ఇది అవతలి ఒడ్డు లేదా అన్నట్లు చాల విశాలముగా ఉండి గర్జించుచున్నది. శంఖములతోను, ముత్యపుచిప్పలోను వ్యాకులముగా ఉన్నది. సీతా! ఈ బంగారు మైనాకపర్వతము చూడుము. ఇది హనుమంతునికి విశ్రాంతికొరకై సముద్రమును భేదించుకొని పైకి లేచినది. ఇది సముద్రము మధ్యలో(అనగా సముద్రముమీద కట్టిన సేతువు మధ్యలో) సేన విడిది చేసిన చోటు. ఇక్కడ పూర్వము సర్వసమర్థుడైన శివుడు నన్ను అనుగ్రహించినాడు. అ కనబడుచున్నది మహాత్ముడైన సముద్రుని సేతుబంధ మను పేరుగల మూడులోకములలో పూజించబడిన తీర్థము. ఇది చాల పవిత్రము. మహాపాతకములను నశింపచేయునది. ఈ స్థలమునందు రాక్షసరాజైన విభీషణుడు నావద్దకు వచ్చినాడు. సీతా! ఇదిగో ఇక్కడ చిత్రములైన వనములు గల అందమైన సుగ్రీవుని నగరమైన కిష్కింధ కనబడుచున్నది. ఇక్కడనే నేను వాలిని చంపితిని."(12-22)

అప్పుడు సీత పూర్వము వాలి పాలించిన ఆ కిష్కింధానగరమును చూచి, ప్రేమసాధ్వసములతో కూడినదై, వినయపూర్వకముగా రామునితో – "రాజా! తార మొదలైన సుగ్రీవుని ప్రియభార్యలతోను, ఇతరవానరనాయకుల స్త్రీలతోను కలిసి నేను నీతో కూడ రాజధానియైన అయోధ్యకు వెళ్ళవలె నని కోరుచున్నాను." అనెను. సీత మాట విని, రాముడు "అట్లే అగుగాక." అని పలికి, కిష్కింధ చేరి, విమానమును నిలిపి సుగ్రీవునితో – "వానరరాజా! వానరనాయకులందరితోను – "మీరందరు మీ స్త్రీలతో కూడినవారై సీతతో కూడ అయోధ్యకు రండు" అని చెప్పుము. నీవు కూడ నీ స్త్రీలతో తొందరగా రమ్ము, వెళ్ళెదము." అని పలికెను. (23-28)

వానరప్రభువు, శ్రీమంతుడు అయిన ఆ సుగ్రీవుడు అమితమైన తేజస్సు గల రాముని మాటలు విని శీఘ్రముగా అంతఃపురములో ప్రవేశించి తారను చూచి, "ప్రియురాలా! మహాత్ములైన వానరుల భార్యలకు, నీకు కూడ రాముడు, సీతకు ప్రియము చేకూర్చుటకై, అనుజ్ఞ ఇచ్చినాడు. నీవు తొందరగా సిద్ధమగుము. వానరుల భార్యలను తీసికొని వెళ్ళెదము. వారికి అయోధ్యను, దశరథుని భార్యలను చూపెదము." అని పలికెను. (29-32)

తార, సుగ్రీవుని మాటలు విని వానరస్త్రీల నందరినీ పిలిచి "సుగ్రీవుడు, వానరులందరూ కూడ మీకు అనుజ్ఞ ఇచ్చినారు. అయోధ్యను చూచుటచేత నాకు కూడ ప్రియము చేయవలసి ఉన్నది. పౌరులతోను జానపదులతోను కూడి రాముడు పురములో ప్రవేశించుటను, దశరథుని అందరి స్త్రీల ఐశ్వర్యమును చూచెదము." అని చెప్పెను. (33-35)

తారచేత అనుమతింపబడిన ఆ వానరస్త్రీ లందరూ అలంకారములు ధరించి, ఆ విమానమునకు ప్రదక్షిణము చేసి సీతను చూడవలెనను ఉత్కంఠతో విమానము ఎక్కిరి. (36)

ఆ విమానము వానరస్త్రీలు ఎక్కిన పిమ్మట శీఘ్రముగా పైకి ఎగిరెను. అప్పుడు రాముడు చూచి ఋష్యమూకపర్వతము దగ్గర సీతతో మరల ఇట్లు పలికెను– "సీతా! ఇదిగో ఇక్కడ ఋష్యమూకపర్వతము కనబడుచున్నది. ఇది బంగారు ధాతువులతో, మెరుపులతో కూడిన మేఘమువలె ఉన్నది. ఇక్కడ నేను వానరప్రభువైన సుగ్రీవునితో కలుసుకున్నాను. వాలిని చంపుటకై నేను ఒడంబడిక కూడ చేసితిని. పద్మములు గలది, చుట్టూ విచిత్రములైన వనములున్నదీ అయిన ఈ పంపానది కనబడుచున్నది. నేను నీ వియోగముచేత చాల దుఃఖితుడనై ఇక్కడనే

విలపించితిని. ధర్మము నాచరించు శబరిని నేను ఈ పంపాతీరమునందే చూచితిని. ఓ! సీతా! జనస్థానమునందు ఈ మహావృక్షము కనబడుచున్నది. ఇక్కడనే రావణునిచేత, గొప్ప తేజస్సు గలవాడు, బలవంతుడు, పక్షులలో శ్రేష్ఠుడు అయిన జటాయువు, నీ నిమిత్తమై చంపబడినాడు. నేను ఖరుణ్ణి, దూషణుణ్ణి,గొప్ప పరాక్రమము గల త్రిశిరస్సునూ చంపిన మన ఆశ్రమము ఇదే. రాక్షసరాజైన రావణుడు నిన్ను బలాత్కారముగా అపహరించి తీసికొనిపోయిన పర్ణశాల ఇక్కడ కనబడుచున్నది. (37-45)

ఇది రమ్యమైన, నిర్మలమైన ఉదకము గల, శుభకరమైన గోదావరీనది. చుట్టూ అరటితోపులు ఉన్న అగస్త్యాశ్రమము కూడ కనబడుచున్నది. ఈ ప్రకాశించుచున్న ఆశ్రమము మహాత్ముడైన సుతీక్ష్ణుని ఆశ్రమము. సీతా! గొప్పదైన శరభంగాశ్రమము కూడ కనబడుచున్నది. ఇక్కడికే ఆనాడు సహస్రాక్షుడు, శత్రుపురవినాశకుడూ అయిన దేవేంద్రుడు వచ్చినాడు. ఏ తాపసులకు సూర్యునితోను, అగ్నితోను సమానుడైన అత్రిమహాముని కులపతియో అట్టి ఈ మునులు కనబడుచున్నారు. ఈ ప్రదేశమునందు నేను విరాధుణ్ణి చంపినాను. సీతా! ఈ ప్రదేశమునందు నీవు ధర్మాత్మురాలైన అనసూయను చూచినావు. సీతా! ఇదిగో పర్వతశ్రేష్ఠమైన చిత్రకూటము ఇక్కడ ప్రకాశించుచున్నది. భరతుడు ఇక్కడనే నన్ను బ్రతిమాలుకొనుటకు వచ్చినాడు. సీతా! ఇదిగో చిత్రములైన వనములు చుట్టూ ఉన్న ఆ యమునానది కనబడుచున్నది. శోభాయుక్తమైన ఈ భరద్వాజాశ్రమము కూడ కనబడుచున్నది. అనేకవిధములైన పక్షులతో వ్యాప్తమై బాగా పుష్పించిన అడవులు గలది, పవిత్రము, మూడు లోకములలో ప్రవహించునదీ అయిన గంగానది కనబడుచున్నది. ఇది నా మిత్రుడైన గుహుడు నివసించు శృంగిబేరపురము. సీతా! ఇదిగో! యూపస్తంభముల పంక్తులు గలది, అనేకవిధములైన వందలకొలది వృక్షములతో నిండినదీ, పుష్పించిన వనములు కలదీ అయిన ఆ సరయూనది కనబడుచున్నది. సీతా! మా తండ్రిగారి రాజధాని ఇదిగో; ఇటు కనబడుచున్నది. ఓ! వైదేహీ! తిరిగి వచ్చినావు. ఈ అయోధ్యకు నమస్కారము చేయుము."(46-55)

పిమ్మట ఆ సమస్తవానరులు, విభీషణాదిరాక్షసులు సంతోషముతో పైకి లేచి అయోధ్యానగరమును చూచిరి. అప్పుడు వానరులు, రాక్షసులూ కూడ తెల్లని మేడల పంక్తులు, విశాలములైన వీథులూ గల ఏనుగులతోను, గుఱ్ఱములతోను నిండిన, ఇంద్రుని అమరావతి వలె ఉన్న, ఆ అయోధ్యానగరమును చూచిరి. (56,57)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవై మూడవ సర్గము సమాప్తము.

నూట ఇరవై నాలుగవ సర్గము

రాముడు భరద్వాజమహర్షి ఆశ్రమములో దిగి ఆయన దర్శనము చేయుట.

పదునాల్గవ సంవత్సరము పూర్తియైన పిదప పంచమినాడు రాముడు భరద్వాజాశ్రమము చేరి మనోవాక్కాయనియతుడై మునికి నమస్కరించెను. రాముడు తపోధనుడైన భరద్వాజునకు నమస్కరించి – "పూజ్యుడా! అయోధ్యానగరములో సుభిక్షముగా ఉన్నట్లు, ఆరోగ్య మున్నట్లు వినుచున్నావా? భరతుడు పాలనకార్యమునందు సావధానముగా ఉన్నాడు కద! మా తల్లులు జీవించిఉన్నారు కద!" అని ప్రశ్నించెను. (1, 2)

రాముని మాటలు విని మహామునియైన భరద్వాజుడు సంతోషించుచు, చిరునవ్వుతో రామునకు ప్రత్యుత్తర మిచ్చెను – "భరతుడు మురికి పట్టిన శరీరముతో జటాధారియై నీ పాదుకలు ముందు ఉంచుకొని నీకోసమై ఎదురుచూచుచున్నాడు. ఇంట్లో అందరూ క్షేమమే. యుద్ధములో జయమును పొందు ఓ రామా! పూర్వము నీవు కైకేయి మాటను, తండ్రి ఆజ్ఞను పాలించుచు, రాజ్యభ్రష్టుడవై కేవలము ధర్మమును ఆచరించుటయందే అభిలాషతో సర్వస్వమును విడచి, అన్ని భోగములు పరిత్యజించి, వనములోని దుంపలను తినుచు, నారచీరలు ధరించి, తమ్మునితోను భార్యతోను కలిసి, కాలినడకచేత మహారణ్యములో ప్రవేశించుచుండగా చూచి నాకు అప్పుడు జాలి కలిగెను. ఇప్పుడు కార్యమును సాధించి, శత్రువులను సంహరించి, మిత్రబంధువులతో కలసి వచ్చిన నిన్ను చూచి నాకు చాల ఆనందము కలిగినది. రామా! నీవు జనస్థానములో ఉన్నప్పుడు అనుభవించిన, అధికమైన సుఖము దుఃఖమూ కూడ నాకు పూర్తిగా తెలిసినది. బ్రాహ్మణుల తపస్సును రక్షించుట అనే కార్యము చేయుటకై ప్రార్థింపబడి, నీవు ఆ మునుల నందరిని రక్షించుచుంటివి. నీ భార్యయైన, దోషశూన్యురాలైన ఈ సీతను రావణుడు హరించినాడు. (3–10)

ధర్మరక్షకుడవైన ఓ రామా! నీవు మాయామారీచుణ్ణి చూచుట, సీతాహరణము, నీవు కబంధుణ్ణి చూచుట, పంపకు వెళ్ళుట, సుగ్రీవునితో స్నేహము, వాలిని నీవు వధించుట, సీతను వానరులు వెదకుట, హనుమంతుడు చేసిన మహాకార్యము, సీత వృత్తాంతము తెలిసిన పిమ్మట నలుడు సేతువును నిర్మించుట, సంతోషించిన వానరనాయకులు లంకను కాల్చివేయుట, పుత్రబంధుమిత్రులతో, సైన్యముతో, వాహనములతో సహా బలముచేత గర్వితుడైన రావణుణ్ణి నీవు రణములో

సంహరించుట, దేవతలకు బాధకలిగించు, శత్రువైన అతనిని చంపిన పిమ్మట నీవు దేవతలతో కలియుట, వారు నీకు వరము లిచ్చుట, ఈ విషయము లన్నీ నేను తపోబలముచేత తెలిసికొన్నాను. ఇక్కడినుండి అయోధ్యకు వెళ్ళివచ్చే నా శిష్యులు అక్కడి వార్తలు కూడ నాకు చెప్పుచుందురు. శస్త్రధారులలో శ్రేష్ఠుడవైన రామా! నేను కూడ నీకు వరము ఇచ్చెదను. ఈ పూజను స్వీకరించుము. రేపు అయోధ్యకు వెళ్ళవచ్చును."(11-17)

శ్రీమంతుడైన రాముడు భరద్వాజుని వాక్యము తప్పక అట్లే చేసెదను అని శిరస్సు వంచి సంతోషపూర్వకముగా అంగీకరించి వరమును కోరెను - "పూజ్యుడవైన మహామునీ! నేను అయోధ్యకు వెళ్ళుచున్నప్పుడు మార్గములోని వృక్షము లన్నీ అకాలమునందుకూడా, ఫలించుగాక. తేనెను స్రవించుగాక. అమృతమువంటి అనేకవిధములైన అనేకములైన ఫలములు లభించుగాక."(18-20)

"అట్లే అగుగాక" అని ఆ ముని పలికిన వెంటనే అక్కడనున్న వృక్షములన్నీ స్వర్గములోని వృక్షములతో సమానము లయ్యెను. వారు వెళ్ళవలసిన మూడు యోజనముల దూరములో అంతటా కూడ పండ్లులేని చెట్లు పండ్లతో నిండెను. పూవులు లేనివి పూవులు పూసెను. ఎండిపోయినవి పూర్తిగా ఆకులతో నిండెను. అన్నిచెట్లూ తేనెను స్రవించెను. పిమ్మట సంతోషించిన ఆ వానరనాయకులు, స్వర్గమును జయించినవారు వలె ఆనందభరితులై, దివ్యములైన అనేకములైన ఆ ఫలములను ఇష్టానుసారము భుజించిరి.(21-23)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవై నాలుగవ సర్గము సమాప్తము.

నూట ఇరవై ఐదవ సర్గము

హనుమంతుడు గుహునకు, భరతునకు రాముని రాకను గూర్చి చెప్పుట.

పిమ్మట రాముడు అయోధ్యను చూచి, ప్రియవిషయము చేయదలచినవాడై, అట్టి ప్రియమును గూర్చి ఆలోచన చేసెను. బుద్ధిమంతుడైన రాముడు ఆలోచించి, పిదప వానరులపై దృష్టి ప్రసరింపజేసి, హనుమంతునితో– "వానరశ్రేష్ఠా! నీవు శీఘ్రముగా అయోధ్యకు వెళ్ళి రాజభవనములోని వారందరూ క్షేమమా అను విషయము తెలిసికొనుము. శృంగబేరపురమునకు వెళ్ళి, అరణ్యములో నివసించు, నిషాదప్రభువైన గుహునితో నా మాటగా కుశలమును చెప్పుము. నేను ఏ రోగము లేక, బాధలు తొలగి సుఖముగా ఉన్నానని విని గుహుడు సంతోషించగలడు. అతడు నాకు, నాతో సమానుడైన స్నేహితుడు. నిషాదుల ప్రభువైన ఆ గుహుడు సంతోషించి నీకు అయోధ్యకు వెళ్ళే మార్గమును, భరతుని వృత్తాంతమును చెప్పగలడు. నీవు నా మాటగా భరతునితో నా కుశలవృత్తాంతమును చెప్పుము. భార్యతోను, లక్ష్మణునితోను కూడిన నేను నా కార్యమును(పితృవాక్యపాలనమును) పరిపూర్ణముగా కావించితి నని చెప్పుము. బలవంతుడైన రావణుడు సీతను అపహరించుటను, సుగ్రీవునితో నా సంభాషణమును, యుద్ధములో వాలివధను అతనికి చెప్పుము. సీతను అన్వేషించుటను, నీవు అత్యధికమైన జలముగల, అనంతమైన సముద్రమును దాటి ఆమెను కనుగొన్న విధమును చెప్పుము. నేను సైన్యముతో సముద్రము చేరుటను, సముద్రుడు నాకు దర్శన మిచ్చుటను, సేతువును కట్టించుటను, రావణుని వధను చెప్పుము."(1–10)

బ్రహ్మేంద్రవరుణులు నాకు వరము లిచ్చుటను, మహేశ్వరుని అనుగ్రహముచేత నేను తండ్రిగారిని కలియుటను చెప్పుము. సౌమ్యుడా! నేను విభీషణునితోను, సుగ్రీవునితోను కలిసి వచ్చినట్లు, భరతునకు తెలుపుము. రాముడు శత్రువుల నందరినీ జయించి, చాలా ఉత్తమమైన కీర్తిని పొంది, కార్యమునందు సఫలుడై, మహాబలవంతులైన మిత్రులతో కలిసి వచ్చుచున్నా డని చెప్పుము.(11–13)

ఈ మాటలు విన్న పిమ్మట భరతుని ఆకారము(ముఖప్రసాదము మొదలగునది) ఎట్లుండునో నీవు గమనింపవలెను. నన్ను గూర్చి మరియేమైన జరిగినను అది గమనించవలెను. అక్కడ జరుగుచున్న వృత్తాంతము లన్నీ తెలుసుకొనుము. ముఖవర్ణముచేత, చూపుచేత, మాటలచేత, భరతుని ముఖభావాలను సరిగా తెలుసుకొనవలెను. సమస్తభోగాలతో సమృద్ధమై, ఏనుగులతో, గుఱ్ఱములతో,

రథములతో నిండియున్న తండ్రితాతలనుండి వచ్చుచున్న రాజ్యము ఎవరి మనస్సును మార్చివేయదు? ఇంతకాలము రాజ్యముతో సంబంధ ముండుటచేత శ్రీమంతుడైన భరతునకు తనకే ఈ రాజ్య ముండవలె నను కోరిక ఉన్నచో అతడే ఈ సమస్తభూమండలమును పాలించుగాక. హనుమంతుడా! భరతుని ఆలోచనను, ప్రయత్నాలను తెలిసికొని మేము అయోధ్యకు చాల దూరము వెళ్ళకముందే శీఘ్రముగా రమ్ము." అని పలికెను. (14-18)

ఇట్లు రాముడు ఆజ్ఞాపించగా హనుమంతుడు మనుష్యరూపమును ధరించి తొందరపడుచు అయోధ్యవైపు వెళ్ళెను. అతడు మహాసర్పమును పట్టదలచిన గరుత్మంతుడు వేగముగా ఎగిరినట్లు పైకి వేగముగా ఎగిరెను. హనుమంతుడు, పక్షుల సంచారస్థానమైన ఆకాశములోనికి ఎగిరి, భయంకరమైన గంగాయమునాసంగమమును దాటి, శృంగబేరపురముచేరి, గుహునివద్దకు వెళ్ళి శుభకరమైన వాక్కుతో సంతోషపూర్వకముగా – "నీ మిత్రుడు, కకుత్స్థవంశమునందు పుట్టినవాడు, సత్యమైన పరాక్రమము గలవాడు, సీతాలక్ష్మణసమేతుడు అయిన రాముడు నీ క్షేమమును అడుగుచున్నాడు. రాముడు భరద్వాజమహర్షి మాట ప్రకారము పంచమినాటి రాత్రి ఆ ఆశ్రమములో ఉండి, ఆ ముని అనుమతిచే(రేపు) బయలుదేరి రాగలడు. అట్టి రాముణ్ణి అచిరకాలములో చూడగలవు." అని చెప్పెను. (19-24)

సంతోషముతో గగుర్పాటు చెందిన శరీరము గల, గొప్ప తేజస్సు, వేగముగల ఆ హనుమంతుడు, మరొక ఆలోచన ఏమీ లేనివాడై వేగముగా ఎగిరెను. దారిలో పరశురామతీర్థమును, వాలుకినీనదిని, వరూథీనదిని, గోమతీనదిని, భయంకరమైన మద్దిచెట్ల అడవిని, వేలకొలది ప్రజలను, విశాలములైన జనపదములను చూచెను. అతడు తొందరపడుచు దూరమైన మార్గమును దాటి వెళ్ళి, దేవేంద్రుని ఉద్యానమైన నందనవనమునందు, చైత్రరథ మను ఉద్యానమునందు ఉన్న వృక్షములవలె ఉన్న, నందిగ్రామము సమీపమునం దున్న వికసించిన వృక్షములను సమీపించెను. అవి స్త్రీలచేతను, పుత్రులతో కూడిన బాగుగా అలంకరించుకొనియున్న, విహరించుచున్న వృద్ధులచేతను సేవింపబడుచుండెను. (25-28)

హనుమంతుడు అయోధ్యకు క్రోశుదూరములో నారచీరలు, కృష్ణాజినము ధరించి ఆశ్రమములో నివసించుచున్న, కృశించి దీనుడుగా ఉన్న భరతుని చూచెను. సోదరుని గూర్చిన దుఃఖముచేత కృశింపచేయబడిన ఆ భరతుడు, జడలు కట్టిన

జుట్టుతో మురికి పట్టిన దేహముతో ఉండెను. అతడు ఫలమూలములు తినుచు ఇంద్రియములను నిగ్రహించుకొని తాపసుడై ధర్మమును ఆచరించుచుండెను. ఎత్తైన జటాభారముతో నారచీరలు, చర్మము వస్త్రములుగా ధరించి నియమవంతుడై, పరిశుద్ధమైన మనస్సుతో బ్రహ్మర్షితో సమానమైన తేజస్సుతో ప్రకాశించుచుండెను. రామపాదుకలు ఎదుట ఉంచుకొని రాజ్యమును పాలించుచుండెను. లోకములో ఉన్న నాలుగు వర్ణముల వారిని ఎట్టి భయము లేకుండా రక్షించుచుండెను. శుద్ధమైన చరిత్రగల మంత్రులు, పురోహితులు, పనులలో సావధానచిత్తులైన సేనానాయకులు కాషాయాంబరధారులై అతని దగ్గర కూర్చొని ఉండిరి. ధర్మమునందు ఆసక్తి గల ఆ పౌరులు నారచీరలు కృష్ణాజినము ధరించిన రాజకుమారుడైన భరతుడు ఏ భోగములూ అనుభవించకుండా ఉండగా తాము భోగములు అనుభవించుటకు ఇష్టపడలేదు.(29-34)

సకలధర్మములు తెలిసిన, దేహము ధరించిన మరొక ధర్మమా అన్నట్లున్న భరతునితో, హనుమంతుడు అంజలి ఘటించి ఇట్లనెను- "నారచీరలు జటలు ధరించి దండకారణ్యములో నివసించుచున్న ఏ రాముణ్ణి గూర్చి నీవు దుఃఖించుచున్నావో ఆ రాముడు నీ క్షేమమును గూర్చి అడుగుచున్నాడు. ఓ! ప్రభూ! నీకు ప్రియమైన విషయమును చెప్పుచున్నాను. చాల దారుణమైన ఈ శోకమును విడిచిపెట్టుము. ఈ ముహూర్తములో నీవు, నీ సోదరుడైన రామునితో కలవబోతున్నావు. రాముడు రావణుణ్ణి చంపి, సీతను మరల పొంది, చేయదగిన కార్యమును పూర్తి చేసికొనినవాడై మహాబలవంతులైన మిత్రులతో కలసి వచ్చుచున్నాడు. గొప్ప తేజస్సు గల లక్ష్మణుడు, మహేంద్రునితో కూడిన శచీదేవి వలె రామునితో కూడిన కీర్తిమంతురాలైన సీతా కూడ వచ్చుచున్నారు."(35-39)

హనుమంతు డన్న మాటలు విని, భరతుడు సంతోషించి వెంటనే నేలమీద పడిపోయెను. సంతోషాతిరేకముచేత మూర్ఛ చెందెను. పిమ్మట భరతుడు ముహూర్తకాలములో లేచి, తెప్పిరిల్లి, ప్రియవార్త చెప్పిన ఆ హనుమంతుని కౌగిలించుకొని మూర్తీభవించిన సంతోషమైన అధికమైన ఆనందాశ్రువులతో అతనిని తడుపుచు- "సౌమ్యుడా! నా మీద జాలిగొనివచ్చిన నీవు దేవతాపురుషుడవా లేక మానవుడవేనా? ప్రియమైన వృత్తాంతమును చెప్పుచున్న నీవు ఇట్టి ప్రియమును చెప్పినందుకు నీకు లక్షగోవులను, నూరు గ్రామాలను ఇచ్చెదను. కుండలములు ధరించిన, సదాచారవతులైన, అవివాహితలైన పదహారుగురు కన్యలను భార్యలను గాను, బంగారు శరీరచ్ఛాయ గల, అందమైన ముక్కులూ, ఊరువులూ గల,

చంద్రునివంటి అందమైన ముఖములు గల, సకలాభరణములు అలంకరించుకొనిన, ఉత్తమ కులజాతులు గల స్త్రీలను వాళ్ళకు దాసీలను గాను ఇచ్చెదను." అని పలికెను.(40-45)

భరతుడు అత్యద్భుతవిషయమువంటి రాముని రాకను గూర్చి హనుమంతునినుండి విని, రాముని చూడవలె నను కోరికతో ఆనందభరితుడై మరల సంతోషముతో ఇట్లు పలికెను.(46)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవై ఐదవ సర్గము సమాప్తము.

నూట ఇరవై ఆరవ సర్గము

హనుమంతుడు సీతారామలక్ష్మణుల వనవాససమయమునందు జరిగిన వృత్తాంతములు చెప్పుట.

"చాల సంవత్సరములపాటు మహారణ్యమునకు వెళ్ళిన నా ప్రభువును గూర్చిన ఆనందకరమైన వర్ణనమును నేను వినుచున్నాను కదా! మానవుడు బ్రతికి ఉన్నచో నూరు సంవత్సరాలకైనా ఆనందము లభించును అను ఈ లోకోక్తి నా విషయమునందు కల్యాణకరముగా ఉన్నదని తోచుచున్నది. రామునకు వానరులకూ ఎట్లు, ఏ దేశమునందు, ఎందు నిమిత్తము సంబంధము ఏర్పడినది? అడుగుచున్న నాకు యథార్థమునే తెలుపుము." అని, బృసిపై కూర్చొనబెట్టి భరతుడు ప్రశ్నించగా హనుమంతుడు వనములో జరిగిన రాముని వృత్తాంతమునంతనూ చెప్పెను-(1-4)

"గొప్ప బాహువులు గల ఓ! ప్రభూ! నీ తల్లికి రెండు వరములు ఇచ్చుట, రాముడు అరణ్యమునకు పంపబడుట, పుత్రశోకముతో దశరథమహారాజు మరణించుట, నిన్ను దూతలద్వారా రాజగృహమునుండి రప్పించుట, అయోధ్యకు వచ్చిన నీవు రాజ్యమును అంగీకరించకపోవుట, సత్పురుషుల ధర్మమును పాటించుచు నీవు చిత్రకూటమునకు వెళ్ళి రాజ్యమును స్వీకరింపుమని పలుకుచు శత్రుసంహారకుడైన సోదరుని కోరుట, రాజు మాటమీద నిలచిన రాముడు రాజ్యమును అంగీకరించకపోవుట, అన్నగారి పాదుకలు తీసికొని నీవు మరల తిరిగి వచ్చుట - ఈ విషయములన్నీ నీకు జరిగినవి జరిగినట్లు తెలియును కదా! నీవు తిరిగి వెళ్ళిపోయిన పిమ్మట ఏమి జరిగెనో చెప్పెదను, వినుము.(5-9)

అప్పుడు నీవు తిరిగి వెళ్ళిపోయిన పిమ్మట రాముడు క్రొత్త మనుష్యులను చూచుటచేత భయపడిన మృగపక్ష్యాదులు గల, పీడింపబడినదా అన్నట్లు ఉన్న వనములోనికి ప్రవేశించెను. పిమ్మట అతడు ఏనుగులచేత మర్దింపబడిన, సింహవ్యాఘ్రమృగములతో వ్యాకులముగా ఉన్న, నిర్జనమై భయంకరముగా ఉన్న ఆ దండకమహారణ్యములో ప్రవేశించెను. సీతారామలక్ష్మణులు దట్టమైన ఆ అరణ్యములో వెళ్ళుచుండగా వారి ఎదుట విరాధుడు బిగ్గరగా అరచుచు కనబడెను. చేతులు పైకెత్తి గొప్ప ధ్వని చేయుచున్న అతనిని ఎత్తి, అరచుచున్న ఏనుగునువలె, ముఖము క్రిందకు ఉండునట్లు గోతిలో పడవేసిరి. సోదరులైన రామలక్ష్మణులు, ఎవ్వరూ చేయజాలని ఆ పని చేసి, సాయంకాలమునకు శరభంగుని సుందరమైన ఆశ్రమమునకు వెళ్ళిరి. శరభంగుడు స్వర్గమునకు వెళ్ళిన పిమ్మట రాముడు, మునులందరికి నమస్కరించి జనస్థానము చేరెను.(10-15)

ఒకనాడు శూర్పణఖ అను రాక్షసి రామునివద్దకు వచ్చెను. అప్పుడు రాముడు ఆజ్ఞాపించగా మహాబలశాలియైన లక్ష్మణుడు ఖడ్గము గ్రహించి ఆమె చెవులూ, ముక్కు ఛేదించెను. అక్కడ నివసించుచున్నప్పుడు మహాత్ముడైన రాముడు జనస్థానములో నివసించుచున్న పదునాలుగు వేలమంది రాక్షసులను చంపెను. కలసి యుద్ధరంగమునకు వచ్చిన రాక్షసులను ఒక్క రాముడు సాయంకాలమున (ఒకటిన్నర ముహూర్తకాలములో) సంహరించినాడు. రాముడు యుద్ధములో గొప్ప బలము, పరాక్రమము గల, తపస్సుకు విఘ్నముచేయు దండకారణ్యవాసులైన రాక్షసులను చంపివేసెను. ఖరుణ్ణి కూడ చంపెను. ముందుగా దూషణుణ్ణి, పిదప త్రిశిరస్సును చంపెను. అప్పుడు రాక్షసులు చచ్చిపోవుటచేత దుఃఖితురాలై, మూర్ఖురాలైన శూర్పణఖ రావణునివద్దకు వెళ్ళి చెప్పెను. రావణుని అనుచరుడైన మారీచు డనే భయంకరుడైన రాక్షసుడు రత్నవికారమైన మృగముగా అయి సీతను లోభపెట్టెను. అప్పుడా సీత రామునితో – "ఈ మృగమును పట్టుకొనుము; ఇది ఉన్నచో మన ఆశ్రమము సుందరముగాను, మనోహరముగాను ఉండును." అని పలికెను.(16-23)

అప్పుడు రాముడు ధనుస్సు హస్తమునందు ధరించి ఆ మృగమువెంట పరుగెత్తి, పారిపోవుచున్న దానిని వంగిన కణుపులు గల బాణముచేత చంపెను. ఓ! సౌమ్యుడా! అప్పుడు రాముడు మృగమును వెంబడించి వెళ్ళగా, లక్ష్మణుడు కూడా బైటకు వెళ్లగా రావణుడు ఆశ్రమములో ప్రవేశించెను. అంగారకగ్రహము ఆకాశమునందు రోహిణిని గ్రహించినట్లు రావణుడు సీతను బలాత్కారముగా

పట్టుకొనెను. ఆమెను రక్షింపదలచిన జటాయువును యుద్ధమునందు చంపి సీతను తీసుకొని శీఘ్రముగా వెళ్ళిపోయెను. పర్వతశిఖరమునందున్న, పర్వతమువంటి వానరులు సీతను తీసుకొని పోవుచున్న, రాక్షసరాజైన రావణుని ఆశ్చర్యముతో చూచిరి. మహాబలశాలీ, రాక్షసరాజు అయిన రావణుడు ఇంకను శీఘ్రముగా వెళ్ళి, మనోవేగమువంటి వేగము గల ఆ పుష్పకవిమానమును సీతతో కూడ ఎక్కి లంకలో ప్రవేశించెను. రావణుడు సీతను బంగారముచేత అలంకరించబడిన సుందరమైన గృహమునందు ఉంచి మాటలతో ఓదార్చి బ్రతిమాలుకొనెను. సీత, ఆ రావణునకూ అతని మాటలకూ గడ్డిపరకంత విలువ కూడ ఇవ్వలేదు. తరువాత ఆమె అశోకవనములో ఉండెను.(24-31)

రాముడు ఆ మృగమును చంపి వెనుకకు మరలెను. అప్పుడు తిరిగి వచ్చుచున్న రాముడు వనములో జటాయువును చూచి తన తండ్రికంటె కూడ ఎక్కువ ఇష్టుడైన జటాయువు చంపబడుట చూచి వ్యథ చెందెను. సీతను వెదకుచున్న, లక్ష్మణసమేతుడైన రాముడు గోదావరీనదీ ప్రాంతమునందు, పుష్పించిన వనప్రదేశములందు సంచరించెను. రామలక్ష్మణులు మహారణ్యములో కబంధు దను రాక్షసుణ్ణి కలిసిరి. పిమ్మట రాముడు కబంధుడు చెప్పగా ఋష్యమూకపర్వతమునకు వెళ్ళి సుగ్రీవుని కలిసెను. ప్రారంభమునందే వారిద్దరి సమాగమము ప్రేమతో, హృదయపూర్వకముగా జరిగెను. పూర్వము సుగ్రీవుణ్ణి అతని సోదరుడైన వాలి కోపముతో దూరముగా తరిమివేసెను. ఆ రామసుగ్రీవులు పరస్పరము సంభాషించుకొనుటచేత వారి స్నేహము చాల గాఢమయ్యెను. రాముడు గొప్ప శరీరము, బలమూ గల వాలిని యుద్ధములో తన బాహుపరాక్రమముచేత చంపి సుగ్రీవునకు స్వరాజ్యము లభింపచేసెను. రాజ్యమునందు స్థాపింపబడిన, సకలవానరసహితుడైన సుగ్రీవుడు "సీతను వెదకించెదను." అని రామునకు ప్రతిజ్ఞ చేసి చెప్పెను."(32-39)

మహాత్ముడైన వానరరాజు సుగ్రీవుడు ఆజ్ఞాపించి పదికోట్లు వానరులను అన్ని దిక్కులకు పంపెను. మేము వింధ్యపర్వతమునందు దారి తప్పి చాల దుఃఖముతో బాధపడుచుండగా చాల కాలము గడిచిపోయెను. జటాయువు సోదరుడైన, పరాక్రమవంతుడైన సంపాతి సీత రావణుని ఇంటిలో ఉన్న దని చెప్పెను. నేను దుఃఖముతో నిండిన నా మిత్రుల దుఃఖమును తొలగించుచు, నా బలమునే ఊతగా గొని నూరు యోజనములు దాటితిని. అక్కడ నేను అశోకవనములో ఒక స్త్రీని చూచితిని. ఆమె పట్టుచీర కట్టుకొని మాలిన్యముతో నిండి ఉండెను. దృఢమైన వ్రతమును పాలించుచున్న ఆమె ఆనందశూన్యురాలై ఉండెను. నేను ఆమెను

సమీపించి, దోషరహితురాలైన ఆమెను అన్ని విషయములు యథాన్యాయముగా అడిగి, ఆమెకు రామనామము గుర్తుగల ఉంగరమును ఆనవాలుగా ఇచ్చితిని. నేను సీతనుండి ఆనవాలుగా మణిని గ్రహించి, చరితార్థుడనై వచ్చితిని. తిరిగి వచ్చిన నేను కాంతిగల ఆ మణి రామునకు, ఆనవాలుగా ఇచ్చితిని.(40-46)

సీత వార్త విని రాముడు, మరణించనున్న రోగి అమృతమును త్రాగివలె, జీవితమునందు ఆశ కలవా దయ్యెను. ఉద్యమము చేయనున్నవాడై రాముడు ప్రళయకాలమునందు సమస్తలోకములను సంహరింపనున్న అగ్నివలె, లంకను నశింపచేయుటకై నిర్ణయము చేసెను. పిమ్మట సముద్రము చేరి నలునిచేత సేతువు నిర్మింపచేసెను. ఆ సేతువు ద్వారా వానరసేన సముద్రమును దాటెను. నీలుడు ప్రహస్తుణ్ణి, రాముడు స్వయముగా రావణకుంభకర్ణులను, లక్ష్మణుడు ఇంద్రజిత్తునూ చంపిరి. శ్రీమంతుడు, శత్రుసంహారకుడు అయిన రాముడు ఇంద్రయమవరుణులతోను, మహేశ్వర - బ్రహ్మదేవులతోను, దశరథునితోను కలసి వారివల్ల వరములను పొందెను. అక్కడికి వచ్చిన ఋషులు, దేవర్షులూ కూడ రామునకు వరము లిచ్చిరి. ప్రేమతో వారందరూ ఇచ్చిన వరములు తీసికొని రాముడు వానరులతో కలసి పుష్పకవిమానముపై కిష్కింధకు వచ్చెను. ఇపుడు రాముడు గంగాతీరము చేరి భరద్వాజముని ఆశ్రమములో ఉన్నాడు. రేపు పుష్యయోగము. అందుచే ఎట్టి విఘ్నములూ లేకుండగా రాముణ్ణి రేపు చూడగలవు."(47-54)

భరతుడు మధురములైన హనుమంతుని మాటలు విని సంతోషించి అంజలి ఘటించి మనస్సుకు సంతోషము కలిగించు విధముగా - "నా కోరిక చాలా కాలానికి తీరినది కదా" అని పలికెను.(55)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవై ఆరవ సర్గము సమాప్తము.

నూట ఇరవై ఏడవ సర్గము

రాముని సత్కారముకొరకై అయోధ్యలో ఏర్పాట్లు. రాముడు నందిగ్రామము చేరుట.

శత్రువీరసంహారకుడైన భరతుడు పరమానందకరములైన హనుమంతుని మాటలు విని, సంతోషించుచున్న శత్రుఘ్నుడ్ని- "పరిశుద్ధముగా ఉన్న నరులు దేవత లందరినీ, నగరములలోని చతుష్పథములందున్న మండలములను, సుగంధములతోను, పుష్పమాలల తోను వాద్యములతోను పూజించెదరుగాక. స్తుతులు పురాణములు తెలిసిన సూతులు, అందరు వైతాళికులు, వాద్యనిపుణులు, వేశ్యలు, కౌసల్యాది రాజభార్యలు, అమాత్యులు, సైన్యములు, సేనలు, స్త్రీగణములు, బ్రాహ్మణులు, రాజకుమారులు, శ్రేణీనాయకులు, గణములు రాముని చంద్రుని వంటి ముఖమును చూచుటకై బయలుదేరెదరుగాక." అని ఆజ్ఞాపించెను. (1-4)

శత్రువీరసంహారకుడైన శత్రుఘ్నుడు భరతుని మాటలు విని, వేలకొలది కర్మకరులను, పనివారిని వేరు వేరు పనులు చేయుటకు గుంపులు గుంపులుగా పిలిపించి- "ఈ నందిగ్రామమునుండి అయోధ్యవరకు పల్లములను పూడ్చివేయుడు. విషమముగాను, సమముగాను ఉన్న స్థానాలను ఆ భేదము లేకుండు నట్లు సమము చేయుడు. నేల నంతను మంచువలె చల్లనైన నీటితో తడపవలెను. మరి కొందరు అన్నివైపులా పేలాలు, పువ్వులు చల్లవలెను. అయోధ్యానగరములోని వీథులలో పతాకలు ఎగురవేయవలెను. సూర్యోదయము అగుసరికి ఇండ్లను అలంకరించవలెను. వందలకొలది మనుష్యులు మంచి వాసనగల, ఐదురంగుల చూర్ణములు, పుష్పమాలాపంక్తులు, విడిపువ్వులు విశాలమైన రాజమార్గమునందు చల్లవలెను. రంగులతో ముగ్గులు పెట్టి, మాలలు కట్టి పువ్వులు చల్లవలెను." అని ఆదేశించెను. (5-9)

అటు పిమ్మట శత్రుఘ్నుని ఆజ్ఞ విని ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలకుడు, సుమంత్రుడు సంతోషముతో బయలుదేరిరి. కొందరు ధ్వజములతో కూడిన, బాగా అలంకరించిన మదగజముల నెక్కి కొందరు బంగారునడుము త్రాళ్ళు గల, ఏనుగులతో కూడిన ఆడ ఏనుగులపైనా, గొప్ప మహారథులు రథముల మీదా శీఘ్రముగా బయలుదేరిరి. శక్తులు, ఋష్టులు, పాశములు, చేతులలో ధరించిన ధ్వజములు, పతాకలు గ్రహించిన వేలకొలది కాలిబంట్లు, చాల ముఖ్యమైన యోధులు ఎక్కిన, ప్రధానములైన వేలకొలది గుఱ్ఱములు

వెంట రాగా వీరులు బయలుదేరి వెళ్ళిరి. పిమ్మట దశరథుని భార్య లందరూ కౌసల్యను, సుమిత్రను ముందు ఉంచుకొని, వాహనము నెక్కి బయలుదేరిరి. వారందరు కైకేయితో కూడ నందిగ్రామము చేరిరి.(10-15)

అప్పుడు ధర్మాత్ముడు, ధర్మములు తెలిసినవాడు, మహాత్ముడూ అయిన భరతుడు అన్నగారి పాదుకలను శిరస్సుపై ఉంచుకొని ఆయనకు ఎదురుగా వెళ్ళెను. అతడు ఉపవాసములచేత కృశించి దీనుడై, నారచీరలను కృష్ణాజినమును ధరించి ఉండెను. ఇంత సుదీర్ఘకాలములో అతనికి సంతోషము తొలిసారిగా కలిగినది సోదరుని రాకను గూర్చి వినినప్పుడే. తెల్లటి పుష్పమాలలచేత అలంకరించబడిన శ్వేతచ్ఛత్రమును, బంగారముచేత అలంకరించిన, రాజుకు తగిన తెల్లని వింజామరలను కూడ తీసికొనివెళ్ళెను. శంఖధ్వనులతోను, భేరీధ్వానములతోను బయలుదేరిన అతనిని వందిమాగధులు స్తుతించుచుండిరి. బ్రాహ్మణశ్రేష్ఠులు, శ్రేష్ఠులు, శ్రేణుల నాయకులు, వర్తకులు, పుష్పమాలలు మధురపదార్థములు చేతులలో ధరించిన మంత్రులు, సచివులు ఆ భరతుని వెంట ఉండిరి. గుఱ్ఱముల డెక్కల చప్పుళ్ళచేతను, రథచక్రాంతముల ధ్వనిచేతను, శంఖదుందుభుల నాదముచేతను భూమి అదిరినట్లు అయ్యెను.(16-21)

అయోధ్యానగర మంతా నందిగ్రామము చేరెను. భరతుడు పరిశీలించి చూచి హనుమంతునితో- "నీవు కపికి సహజమైన చపలచిత్తత్వమును చూపలేదు కద! ఎందుచేతననగా కకుత్స్థవంశీయుడు, శత్రుసంహారకుడు, అన్నగారు అయిన రాముడు కనబడుటలేదు." అనెను.(22, 23)

భరతుడు ఆవిధముగా పలుకగా హనుమంతుడు సత్యమైన పరాక్రమముగల అతనితో విజ్ఞాపన చేయుచు వినయపూర్వకముగా అర్థయుక్తమైన ఈ వాక్యము పలికెను- "భరద్వాజముని అనుగ్రహముచే ఎల్లప్పుడు ఫలాలు గలవి, పుష్పించినవి, తేనెను స్రవించుచున్నవి, మదించిన తుమ్మెదలచే ధ్వనింపచేయబడినవీ అయిన వృక్షములు కనబడుటచే సంతోషించిన వానరుల భయంకరమైన ధ్వని వినబడుచున్నది. ఆ వానరసేన గోమతీనదిని దాటుచున్న దని అనుకొనుచున్నాను. ఓ శత్రుసంహారకా! భరద్వాజునకు దేవేంద్రుడు అట్టి వరమును ఇచ్చిఉన్నాడు. అందుచేతనే నీకు నీ సైన్యమునకు పూర్వము అతడు సకలగుణములతో కూడిన ఆతిథ్యమును ఇచ్చినాడు. ఆ సాలవనము వైపు పరాగవర్షము బయలుదేరినది. చూడుము. వానరులు సుందరమైన ఆ సాలవనమును కదల్చివేయుచున్నారని

తలచెదను. అదుగో! చంద్రునితో సమానమైన విమానము దూరమునుండి కనబడుచున్నది. దివ్యమైన ఈ పుష్పకవిమానము విశ్వకర్మ మనస్సుచేత నిర్మించినాడు. మహాత్ముడైన రాముడు రావణుణ్ణి, అతని బంధువులను చంపి ఈ విమానము సంపాదించినాడు. ప్రస్తుతము రాముని వాహనముగా ఉన్న, బాలసూర్యునితో సమానమైన, మనోవేగము గల ఈ దివ్యవిమానము బ్రహ్మదేవుని అనుగ్రహముచేత కుబేరునకు లభించినది. ఈ విమానములో సోదరులైన వీరులు రామలక్ష్మణులు, సీత, గొప్ప తేజస్సు గల సుగ్రీవుడు, విభీషణుడు ఉన్నారు."(24-31)

ఇంతలో "ఇడిగో రాముడు వచ్చినాడు" అని అనగానే స్త్రీలు, బాలురు, యువకులు, వృద్ధులు సంతోషముతో చేసిన ధ్వని మిన్నుముట్టెను. రథములనుండి, ఏనుగులనుండి, గుఱ్ఱములనుండి దిగి నేలమీద నిలచిన వాళ్ళందరూ విమానములో ఉన్న ఆ రాముణ్ణి ఆకాశములో ఉన్న చంద్రుణ్ణి చూచి నట్లు చూచిరి. భరతుడు దోసిలి కట్టి ఆనందముతో రామునకు ఎదురుగా ముఖము పైకెత్తి నిలచి తగు విధముగా స్వాగతవచనములతో రాముణ్ణి పూజించెను. బ్రహ్మదేవుడు మనసా సృజించిన ఆ విమానములో ఉన్న, రాముడు రెండవ దేవేంద్రుడువలె ప్రకాశించుచుండెను. భరతుడు మేరుపర్వతముమీద ఉన్న సూర్యుడు వలె, విమానాగ్రమునందున్న రామునకు వంగి నమస్కారము చేసెను. అంతలో చాల ఉత్తమము, హంసల ప్రతిమలు కలది, గొప్ప వేగముగలది అయిన ఆ విమానము రాముని ఆజ్ఞచేత నేలమీద దిగెను.(32-37)

రాముడు విమానము ఎక్కించగా సత్యమైన పరాక్రమముగల భరతుడు రాముణ్ణి చేరి మరల అభివాదము చేసెను. రాముడు చిరకాలానికి కనబడిన ఆ భరతుణ్ణి పైకి లేవదీసి తన తొడపై కూర్చుండబెట్టుకొని ఆనందముతో కౌగిలించుకొనెను. పిమ్మట శత్రుసంహారకుడైన భరతుడు సంతోషముతో లక్ష్మణుని వద్దకు, సీత వద్దకు వెళ్ళి, తనపేరు చెప్పుచు నమస్కరించెను. సుగ్రీవుణ్ణి, జాంబవంతుణ్ణి, అంగదుణ్ణి, మైంద-ద్వివిద-నీల- ఋషభులను కౌగిలించుకొనెను. అక్కడనే ఉన్న సుషేణుణ్ణి, నలుణ్ణి, గవాక్షుణ్ణి, గంధమాదనుణ్ణి, శరభుణ్ణి, పనసుణ్ణి కౌగిలించుకొనెను. ఇచ్ఛానుసారం రూపములు ధరించగలిగిన ఆ వానరులు మనుష్యరూపములు ధరించి సంతోషించుచు భరతుణ్ణి కుశలప్రశ్న వేసిరి.(38-43)

పిమ్మట దశరథపుత్రుడు, మహాతేజఃశాలి, ధర్మాత్ములలో శ్రేష్ఠుడూ అయిన భరతుడు సుగ్రీవుణ్ణి కౌగిలించుకొని- "సుగ్రీవా! నీవు మా నలుగురికీ ఐదవ

సోదరుడవు. స్నేహమును పట్టి మిత్రుడు ఏర్పడును. అపకారము చేయుట శత్రులక్షణము." అని పలికెను.(44, 45)

పిమ్మట భరతుడు విభీషణునితో – "అదృష్టవశముచేత నీవు సహాయుడవుగా ఉండి, చేయుటకు చాలా కష్టమైన పని చేసితివి. నీవు సహాయుడుగా ఉండుటచేత రాముడు చేయ శక్యము కాని పని చేయగలిగినాడు." అనెను. అప్పుడు వీరుడైన శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు నమస్కరించి వినయముతో సీత పాదములకు నమస్కరించెను. రాముడు, శోకముచేత కృశించినదై శరీరచ్ఛాయ మారిపోయిన తల్లి దగ్గరకు వెళ్ళి అమె మనస్సుకు సంతోషము కలిగించుచు వినయముతో పాదాభివందనము చేసెను. రాముడు సుమిత్రకు, కీర్తిగల కైకేయికి, సమస్తమైన తల్లులకు నమస్కారముచేసి పిమ్మట పురోహితుడైన వసిష్ఠుని దగ్గరకు వెళ్ళి నమస్కరించెను. "ఓ! మహాబాహూ! కౌసల్య ఆనందమును వృద్ధిపొందించు రామా! నీకు స్వాగతము." అని నగరజనులందరు అంజలులు ఘటించి నమస్కరించుచు రామునితో పలికిరి. ఆ నాగరికులు నమస్కరించుచు కట్టిన వేలకొలది దోసిళ్ళు రామునకు వికసించిన పద్మములవలె కనబడెను.(46-51)

ధర్మములను ఎరిగిన భరతుడు ఆ రాముని పాదుకలు తీసికొని స్వయముగా అతని పాదాలకు తొడిగి- అంజలి ఘటించి రామునితో ఇట్లు పలికెను. - "నీవు నా వద్ద న్యాసముగా ఉంచిన ఈ రాజ్యమును అంతనూ నేను తిరిగి అప్పగించుచున్నాను. నీవు అయోధ్యకు తిరిగివచ్చి రాజు కాబోవుట చూచుచున్నాను. అందుచేత నేడు నాజన్మ చరితార్థమైనది. కోరిక తీరినది. నీవు కోశమును, కోష్ఠాగారములను, గృహములను, సైన్యమును చూడుము. నీ తేజస్సుచేత నేను అన్నింటినీ పదిరెట్లు చేసినాను."(52-55)

సోదరునియందు ప్రేమగల భరతుడు అట్లు పలుకుచుండగా విని ఆ వానరులు, విభీషణుడు కన్నీళ్ళు రాల్చిరి. పిమ్మట రాముడు సంతోషముతో భరతుణ్ణి తొడపై కూర్చుండబెట్టుకొని, ఆ విమానముమీదనే సైన్యసహితుడై భరతుని ఆశ్రమము చేరి, సైన్యముతో ఆ విమానమునుండి దిగి నేలమీద నిలచెను. అప్పుడు రాముడు అత్యుత్తమమైన ఆ విమానముతో - "ఇటుపై ప్రభువైన కుబేరుని వాహనముగా ఉండుము. అనుజ్ఞ ఇచ్చుచున్నాను, వెళ్ళుము." అని పలికెను. అత్యుత్తమమైన ఆ విమానము రామునిచేత ఆజ్ఞాపించబడినదై కుబేరుని స్థానము చేరుటకై ఉత్తరము వైపు వెళ్ళిపోయెను. రావణుడు అపహరించిన ఆ పుష్పకవిమానము రాముని ఆజ్ఞ

ప్రకారము వేగముగా కుబేరుని దగ్గరకు వెళ్ళెను.(56-61)

పరాక్రమవంతుడైన రాముడు తనకు తగిన పురోహితుడైన వసిష్ఠుని పాదములకు, దేవతాప్రభువైన ఇంద్రుడు, బృహస్పతి పాదములకు నమస్కరించి నట్లు నమస్కరించి అతనితో పాటు వేరు ఆసనముమీద కూర్చుండెను.(62)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవై ఏడవ సర్గము సమాప్తము.

నూట ఇరవై ఎనిమిదవ సర్గము

భరతుడు రామునకు రాజ్యమును తిరిగి అప్పగించుట. రాముడు అయోధ్యలో ప్రవేశించి రాజ్యాభిషిక్తు డగుట.

భరతుడు శిరస్సుపై అంజలి ఘటించి సత్యమైన పరాక్రమము గల జ్యేష్ఠసోదరుడైన రామునితో- "నీవు మా తల్లి మాట మన్నించి నాకు రాజ్యము ఇచ్చినావు. నీవు నాకు ఇచ్చినట్లే నేను తిరిగి ఆ రాజ్యమును నీకు ఇచ్చుచున్నాను. మంచి బలము గల ఎద్దు ఒంటరిగా అనాయాసముగా లాగగలిగిన భారమును లేగదూడ ఎట్లు లాగజాలదో అట్లే నేను ఈ పెద్ద బరువును మోయజాలను. గొప్ప జలవేగముచేత బీటలు తీసి, జలమును స్రవించుచున్న సేతువువలె ఈ రాజ్యచ్ఛిద్రము, అనగా అనేక ఛిద్రములు గల రాజ్యము, సరిగా కప్పబడనిచో బంధింపశక్యము కాదు అని తలచెదను. శత్రుసంహారకుడవైన ఓ! వీరుడా! గాడిద గుఱ్ఱముయొక్క నడకను వలె, కాకి హంసయొక్క నడకను వలె నీ గమనమును నేను అనుసరించజాలను."(1-5)

"గొప్పబాహువులు గల మహారాజా! ఒకడు ఇంటి పెరటిలో ఒక మొక్క నాటినాడు. అది పెద్ద మ్రానుతో, విశాలములైన కొమ్మలతో, ఎక్కుటకు శక్యముకానంత పెద్దదిగా పెరిగినది. పుష్పించినది. కాని ఫలములను ఇవ్వకుండా వ్యర్థమైపోయినది. పాతినవాడు ఏ ఫలముకొరకై పాతినాడో అది అనుభవించలేకపోయినాడు. నీవు ప్రభువుగా ఉండి భృత్యులమైన మమ్ములను పోషించకపోయినచో ఈ చెట్టు విషయమే ఉపమానము. దీని అర్థము నీవు గ్రహించుము. మన తండ్రిగారైన దశరథుడు ప్రజాపాలకుడైన పుత్రుడు కావలెనని కోరి పుత్రేష్ట్యాదులు చేసి నిన్ను కనినాడు. నీవు ఇంత గొప్పవాడవైన పిమ్మట ఆయన ఉద్దేశించిన అసలు కార్యము చేయకున్నచో

ఆయన ఆశ వ్యర్థమైపోవును కదా! రామా! మధ్యాహ్నమునందు తపించుచున్న, ప్రకాశించుచున్న తేజస్సు గల సూర్యుణ్ణివలె, పట్టాభిషిక్తుడవైన నిన్ను జగత్తు ఇప్పుడు చూచుగాక. మంగళవాద్యములు మ్రోగుచుండగా, వడ్డాణములు, నూపురములు గలగలలాడుచుండగా, మధురమైన సంగీతధ్వనులు వినవచ్చుచుండగా మేల్కొనుము. నిద్ర పొమ్ము. జ్యోతిశ్చక్రము ఆకాశమునందు ఎంత కాలము తిరుగునో అంతకాలము భూమి ఎంతవరకు విస్తరించియున్నదో అంతవరకు నీవు ఈ లోకమునకు ప్రభుత్వము వహింపుము." అని పలికెను. (6-11)

శత్రుపురసంహారకుడైన రాముడు భరతుని మాటలు విని అట్లే అని అంగీకరించెను. రాముడు అంగీకరించిన పిదప భరతుడు మంగళకరమైన ఆసనము మీద కూర్చుండెను. పిమ్మట శత్రుఘ్నుడు ఆజ్ఞాపించగా సుఖమైన హస్తములు గల, చాల శీఘ్రముగా పనిచేయు, నేర్పు గల మంగళ్ళు రాముని వద్దకు వచ్చిరి. ముందుగా భరతుడు స్నానముచేసిన పిమ్మట గొప్పబలము గల లక్ష్మణుడు, వానరరాజైన సుగ్రీవుడు, రాక్షసరాజైన విభీషణుడు స్నానము చేసిరి. పిదప రాముడు జటలు విప్పించుకొని, స్నానము చేసి, చిత్రములైన పుష్పమాలలు ధరించి, చందనాదులు పూసుకొని, శ్రేష్ఠములైన వస్త్రములు ధరించి అక్కడ శోభతో ప్రకాశించుచు ఉండెను. పరాక్రమవంతుడు, శోభాసంపన్నుడు అయిన శత్రుఘ్నుడు రామునకు, లక్ష్మణునకు అలంకరణము చేయించెను. అప్పుడు ఉత్తమమైన మనస్సు గల దశరథభార్య లందరు సీతకు మనోహరముగా అలంకరణమును స్వయముగా చేసిరి. పిమ్మట పుత్రవాత్సల్యవంతురాలైన కౌసల్య, వానరభార్య లందరికీ, సంతోషముతో, ప్రయత్నపూర్వకముగా అలంకరణమును చేసెను. (12-18)

పిమ్మట శత్రుఘ్నుని ఆజ్ఞచేత, సుమంత్రుడు అన్ని అవయవములయందూ అందముగా ఉన్న రథమును గుఱ్ఱములు కట్టి తోలుకొని వచ్చెను. గొప్పబాహువులు గల, శత్రుపురజేతయైన రాముడు సూర్యమండలముతో సమానమైన, నిలచి ఉన్న దివ్యమైన రథమును చూచి, దానిని ఎక్కెను. మహేంద్రునితో సమానమైన కాంతి గల సుగ్రీవహనుమంతులు స్నానముచేసి దివ్యములైన వస్త్రములు ధరించి, సుందరములైన కుండలములు అలంకరించుకొని వెళ్ళిరి. ఆ సుగ్రీవభార్యలు, సీతా కూడ సమస్తాభరణములు, కుండలములు అలంకరించుకొని, నగరములను చూడవలె నను ఔత్సుక్యముతో వెళ్ళిరి. (19-22)

అయోధ్యలో దశరథుని మంత్రులు పురోహితుడైన వసిష్ఠుణ్ణి ముందు

ఉంచుకొని అభిషేకమును గూర్చి, ప్రయోజనకరములైన ఆలోచనలు చేసిరి. అశోకుడు, విజయుడు, సిద్ధార్థుడు సావధానచిత్తులై రాముని అభివృద్ధికొరకు , నగరసమృద్ధికొరకు ఆలోచనలు సలిపిరి. "విజయమునకు తగిన మహాత్ముడైన రాముని అభిషేకము నిమిత్తము ఏదేది చేయవలెనో దానిని అంతా మంగళపూర్వకముగా చేయుడు." ఈ విధముగా మంత్రులందరూ పురోహితునకు చెప్పి రాముణ్ణి చూడవలెనను అభిలాషతో శీఘ్రముగా నగరమునుండి బయలుదేరిరి. వేయికన్నులు గల దేవేంద్రుడు ఆకుపచ్చ రంగు గుఱ్ఱములు కట్టిన రథమును ఎక్కినట్లు దోషరహితుడైన రాముడు ఉత్తమమైన రథము నెక్కి నగరమునకు బయలుదేరెను. భరతుడు గుఱ్ఱముల కళ్ళెములు పట్టి సారథ్యము చేయుచుండగా శత్రుఘ్నుడు శిరస్సుపై ఛత్రమును పట్టెను. లక్ష్మణుడు వింజామర వీచెను. దగ్గరనే ఉన్న రాక్షసరాజైన విభీషణుడు చంద్రుడు వలె ఉన్న తెల్లని మరియొక వింజామర పట్టెను. ఋషిసంఘములు, దేవతలు, మరుద్గణములు ఆకాశముమీద చేరి రాముణ్ణి స్తుతించుచుండగా ఆ మధురధ్వని వినబడెను. (23-30)

గొప్ప తేజస్సు గల వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు, శత్రుంజయ మను పేరుగల పర్వతమువంటి ఏనుగును ఎక్కెను. వానరులు మనుష్యరూపములు ధరించి సకల అలంకారములు అలంకరించుకొని తొమ్మిదివేల ఏనుగులను ఎక్కి వెళ్ళిరి. పురుషశ్రేష్ఠుడైన రాముడు శంఖధ్వనులతోను, దుందుభిధ్వనులతోను, మేడల పంక్తులు గల ఆ అయోధ్యానగమునకు వెళ్ళెను. ప్రజ లందరూ, సుందరమైన ఆకారముతో ప్రకాశించుచున్న అతిరథుడైన ఆ రాముడు, ముందు భటులు నడుచుచుండగా, రథమునెక్కి వచ్చుచుండగా చూచిరి. ఆ పౌరులందరూ రాముణ్ణి జయజయధ్వానాలతో అభినందించగా రాముడు వారల అభినందనలను స్వీకరించుచు ప్రత్యభినందనము చేసెను. పిదప వాళ్ళు చుట్టూ సోదరులున్న ఆ మహాత్ముణ్ణి అనుసరించి నగరమువైపు వెళ్ళిరి. అమాత్యులతోను, బ్రాహ్మణులతోను, ప్రకృతులతోను కూడిన రాముడు, నక్షత్రములతో కూడిన చంద్రుడు వలె శోభతో ప్రకాశించెను. ఆ రాముడు తూర్యములు తాల-స్వస్తికవాద్యములు చేతులలో ధరించిన, మంగళవచనములు పలుకుచున్న సంతోషించిన వందిమాగధాదులు ముందు నడవగా నగరములోనికి వెళ్ళెను. అక్షతలు, బంగారము గ్రహించిన కొందరు మనుష్యులు, గోవులు, కన్యలు, బ్రాహ్మణులు, మధురభక్ష్యములు చేతులలో ఉన్న మనుష్యులు రాముని ముందు నడచిరి. (31-38)

రాముడు, తనకు సుగ్రీవునితో ఏర్పడిన స్నేహమును, హనుమంతుని

ప్రభావమును, వానరులు చేసిన ఆ మహాకార్యములను మంత్రులకు చెప్పెను. అయోధ్యాపురములో నివసించువా రందరూ వానరులు చేసిన ఆ పనులు, రాక్షసుల ఆ బలమును విని ఆశ్చర్యము చెందిరి. పిమ్మట విభీషణునితో తనకు ఏర్పడిన సంబంధమును గూర్చి కూడ మంత్రులకు చెప్పెను. ఈ విషయములన్నీ చెప్పుచు కాంతిమంతుడైన రాముడు వానరసహితుడై సుఖసంతోషములతో ఉన్న జనులతో నిండిన అయోధ్యానగరమును ప్రవేశించెను. అప్పుడు పౌరులు ప్రతిఇంటి మీద పతాకలు ఎగురవేసిరి. రాముడు ఇక్ష్వాకురాజులు నివసించు సుందరమైన తండ్రిగారి గృహముచేరెను. రాజపుత్రుడైన రాముడు మహాత్ముడైన తండ్రి గృహమును సమీపించి, దానిలో ప్రవేశించి, కౌసల్యకు, సుమిత్రకు, కైకేయికి నమస్కరించి ధార్మికులలో శ్రేష్ఠుడైన భరతునితో మంచి అర్థముతో కూడిన వాక్కుతో మధురముగా- "అశోకవనములతో కూడిన, ముత్యములతోను వైదూర్యమణులతోను వ్యాప్తమైన శ్రేష్ఠమైన నా గొప్ప గృహమును సుగ్రీవునకు నివాసముకొరకు ఇమ్ము." అని చెప్పెను. సత్యమైన పరాక్రమము గల భరతుడు రాముని మాటలు విని సుగ్రీవుణ్ణి చేతియందు పట్టుకొని ఆ గృహములో ప్రవేశపెట్టెను. పిమ్మట శత్రుఘ్నుడు ఆజ్ఞాపించగా కొందరు తైలదీపములు, పరుపులు, ఆస్తరణములను తీసికొని శీఘ్రముగా ఆ ఇంటికి వెళ్ళిరి. (39-47)

గొప్ప తేజస్సుగల భరతుడు సుగ్రీవునితో- "సమర్థుడవైన ఓ! సుగ్రీవా! రాముని అభిషేకముకొరకై దూతలను ఆజ్ఞాపించుము." అని పలికెను. సుగ్రీవుడు వెంటనే సమస్తమైన రత్నములచేత అలంకరించబడిన నాలుగు బంగారు కలశలను నలుగురు వానరులకు ఇచ్చి, "వానరులారా! తెల్లవారుసరికి నాలుగు సముద్రముల నీళ్ళు నింపిన ఈ కలశలతో వచ్చి ఎట్లు వేచి ఉండెదరో అట్లు చేయవలెను" అని ఆజ్ఞాపించెను. (48-50)

సుగ్రీవుని చేత ఈ విధముగా ఆజ్ఞాపింపబడిన, ఏనుగులవంటి, గరుత్మంతుల వలె శీఘ్రముగా వెళ్ళు మహాత్ములైన వానరులు శీఘ్రముగా ఆకాశములోనికి ఎగిరిరి. జాంబవంతుడు, హనుమంతుడు, వేగదర్శి, ఋషభుడు జలము నింపిన కలశములను తీసుకొని వచ్చిరి. వీరు ఐదువందల నదుల జలమును కలశలలో తీసికొనివచ్చిరి. బలవంతుడైన సుషేణుడు తూర్పుసముద్రమునుండి జలముతో నిండిన, సకలరత్నములచేత అలంకరించబడిన కలశమును తీసికొనివచ్చెను. ఋషభుడు దక్షిణసముద్రమునుండి జలపూర్ణమైన ఘటమును రక్తచందనవృక్షముల కొమ్మలు కప్పి శీఘ్రముగా తీసికొనివచ్చెను. వాయుదేవుని వంటి పరాక్రమముగల గవయుడు పశ్చిమసముద్రమునుండి చల్లని జలమును రత్నకలశములో

తీసికొనివచ్చెను. గరుత్మంతుని వంటి , వాయువువంటి పరాక్రమము గల సమస్తగుణములతో కూడిన ధర్మాత్ముడైన నలుడు ఉత్తరసముద్రమునుండి శీఘ్రముగా జలము తీసికొనివచ్చెను. అప్పుడు మంత్రులతో కూడిన శత్రుఘ్నుడు రాముని అభిషేకముకొరకు ఆ వానరశ్రేష్ఠులు తీసికొనివచ్చిన ఆ జలమును పురోహితుడైన వసిష్ఠునకు, మిత్రులకు చూపి సిద్ధముగా ఉన్నదని తెలిపెను.(51-58)

శ్రీ సీతారామ పట్టాభిషేకము

అప్పుడు బ్రాహ్మణులతో కూడిన వృద్ధుడైన వసిష్ఠుడు సావధానచిత్తుడై సీతాసమేతుడైన రాముణ్ణి రత్నపీఠముమీద కూర్చుండబెట్టెను. వసిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, విజయుడు అను ఎనమండుగురు మునులు నిర్మలము, సుగంధయుక్తము అయిన జలముతో అష్టవసువులు సహస్రాక్షుడైన దేవేంద్రునకు అభిషేకము చేసినట్లు రామునకు అభిషేకము చేసిరి. మిక్కిలి సంతోషించుచున్న ఆ వసిష్ఠాదులు ముందుగా ఋత్విక్కులైన బ్రాహ్మణులచేత, కన్యలచేత, మంత్రులచేత, యోధులచేత, నైగములచేత, ఆకాశమునందున్న దేవతలచేత, నలుగురు లోకపాలులచేత, గుమిగూడిన సకలదేవతలచేత అభిషేకము చేయించిరి. వీరందరూ నదీసముద్రాదిజలములతోనే కాక సమస్తమైన ఓషధుల రసములతో కూడ రామునకు అభిషేకము చేసిరి.(59-63)

పిదప మహాత్ముడైన వసిష్ఠుడు, పూర్వము బ్రహ్మ నిర్మించిన రత్నమయమైన, తేజస్సుతో ప్రకాశించుచున్న కిరీటమును సభామధ్యములో ఉన్న వివిధరత్నములు మాటిన పీఠముపై యథావిధిగా ఉంచెను. పట్టాభిషేకసమయమునందు పూర్వము మనుచక్రవర్తి, పిదప క్రమముగా ఆయన వంశమునకు చెందిన రాజు లందరు ఆ కిరీటమును ధరించెడివారు. ఆ మహాసభాభవనము బంగారముచేత అలంకరింపబడెను. చాల విలువైన వస్తువులతో శోభించుచుండెను. అనేకవిధములైన చాల అందమైన రత్నములతో అది చిత్రవర్ణమై ఉండెను. పిదప రత్నపీఠముపై ఉంచిన ఆ కిరీటమును తీసి వసిష్ఠుడు రాముని శిరస్సుపై అలంకరించెను. అనంతరము ఋత్విక్కులు రామునకు ఇతరాలంకారములు అలంకరించిరి. శత్రుఘ్నుడు రామునకు తెల్లని, సుందరమైన ఛత్రము పట్టెను. వానరరాజైన సుగ్రీవుడు తెల్లని వింజామర పట్టెను. రాక్షసరాజైన విభీషణుడు చంద్రుని వంటి మరియొక వింజామర పట్టెను.(64-69)



వాయువు దేవేంద్రునిచేత ప్రేరేపించబడినవాడై నూరు పద్మములు గల, ప్రకాశించుచున్న ఆకారము గల బంగారు మాలను రామునకు బహూకరించెను. వాయువు దేవేంద్రునిచేత ప్రేరేపించబడినవాడై రాజైన రామునకు సకలరత్నములతో కూడిన మణులచేత అలంకరించబడిన ముత్యాలహారమును కూడ ఇచ్చెను. (70,71)

అభిషేకము పొందుటకు అర్హుడైన రామునకు అభిషేకము జరిగిన ఆ సమయమునందు దేవతలు, గంధర్వులు గానము చేసిరి. అప్సరఃస్త్రీలు నాట్యము చేసిరి. రాముని అభిషేకమహోత్సవసమయమునందు భూమి సస్యసమృద్ధ మయ్యెను. వృక్షములు ఫలములతో నిండెను. పుష్పములు సుగంధము కల వయ్యెను. (72,73)

రాముడు ముందుగా ద్విజులకు లక్ష గుఱ్ఱములను, లక్ష క్రొత్తగా ఈనిన ఆవులను, నూరు ఎద్దులను ఇచ్చెను. రాముడు మరల బ్రాహ్మణులకు ముప్పైకోట్ల బంగారు నాణెములు, చాల విలువగల అనేకవిధములైన ఆభరణములు, వస్త్రములు ఇచ్చెను. రాముడు సూర్యకిరణములతో సమానము, మాణిక్యములతో నిండినదీ అయిన బంగారపు దివ్యమైన మాలను సుగ్రీవునకు బహూకరించెను. ప్రేమభావము గల రాముడు, వైదూర్యమణులతో నిండి చిత్రవర్ణములై ఉన్న, మణులచేత రత్నములచేత అలంకరించబడిన బాహుపురులను వాలిపుత్రుడైన అంగదునకు బహూకరించెను. (74-77)

శ్రేష్ఠములైన మణులతో కూడిన, చంద్రకిరణముల వంటి కాంతిగల శ్రేష్ఠమైన ముత్యాలహారమును, నిర్మలమైన దివ్యములైన రెండు వస్త్రములను, సుందరములైన అలంకారములను సీతకు ఇచ్చెను. జనకనందిని అయిన సీత హనుమంతుని వైపు చూచి, ఆ హారమును తన కంఠమునుండి తీసి ఆ వానరులందరి వైపూ, భర్త వైపూ మాటిమాటికి చూచెను. పరాభిప్రాయమును గుర్తించు సామర్థ్యము గల రాముడు సీతను చూచి – "సౌభాగ్యవతియైన ఓ సీతా! నీకు ఎవని విషయమునందు సంతోష మున్నదో, తేజస్సు, ధైర్యము, యశస్సు, నేర్పు, సామర్థ్యము, వినయము, నీతి, పౌరుషము, పరాక్రమము, బుద్ధి అను ఈ గుణములు ఎవనిలో ఎల్లప్పుడూ ఉన్నవో అతనికి ఈ హారమును ఇమ్ము." అనెను. నల్లని నేత్రములు గల ఆ సీత ఆ హారమును హనుమంతునకు బహూకరించెను. చంద్రుని కిరణముల సముదాయము వలె తెల్లగా నున్న ఆ హారమును ధరించిన వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు తెల్లని మేఘముతో పర్వతము ప్రకాశించి నట్లు ప్రకాశించెను. (78-83)

వానరులలోని పెద్దవాళ్ళందరూ, వానరశ్రేష్ఠులూ కూడా వస్త్రములు, రామునిచే భూషణములు బహూకరించబడి తగు విధముగా సత్కరించబడిరి. పిమ్మట, శత్రుసంహారకుడైన రాముడు ఆలోచించి, మైందద్వివిదులకు, నీలునకు సమస్తమైన కోరదగిన వస్తువులను ఇచ్చెను. రాముడు విభీషణుణ్ణి, సుగ్రీవుణ్ణి, హనుమంతుణ్ణి, జాంబవంతుణ్ణి, ప్రధానులైన వారందరినీ కోరదగిన వస్తువులు, పుష్కలమైన రత్నములు ఇచ్చి తగు విధముగా సన్మానించెను. వాళ్ళందరూ చాల సంతోషించిన మనస్సులతో వచ్చినట్లు గానే తిరిగి వారి వారి స్థానములకు వెళ్ళిరి. మహాత్ములైన ఆ వానరశ్రేష్ఠు లందరూ రామునకు నమస్కరించి, అతని అనుజ్ఞ పొంది, కిష్కింధకు వెళ్ళిరి. వానరరాజైన సుగ్రీవుడు రామపట్టాభిషేకమహోత్సవము చూచి, రాముని సన్మానము పొంది కిష్కింధాపురమును ప్రవేశించెను. తన కులధనమును పొంది రాక్షసరాజైన ధర్మాత్ముడు, గొప్పకీర్తికలవాడు అయిన విభీషణుడు కూడ ఆ రాక్షసశ్రేష్ఠులతో కలసి లంకకు వెళ్ళెను. (84-90)

గొప్పకీర్తి గల, మిక్కిలి ఉదారస్వభావుడైన రాముడు శత్రువులను సంహరించి రాజ్యము నంతను పరిపాలించుచు ఆనందముతో అనుభవించెను. ధర్మమునందు అత్యాసక్తి గల ఆ రాము డొకనాడు ధర్మమునెరిగిన లక్ష్మణునితో – "ధర్మము నెరిగిన ఓ లక్ష్మణా! మన వంశమునకు చెందిన పూర్వరాజులు అధిష్ఠించిన ఈ భూమిని నీవు కూడా నాతో కలిసి, బలముచేత పాలింపుము. మన పూర్వులు ధరించిన ఈ రాజ్యభారమును, నీవు యౌవరాజ్యభిషిక్తుడవై నాతో కలిపి మోయుము." అని

పలికెను. యౌవరాజ్యమును అంగీకరింపు మని ఎంత బ్రతిమాలినను లక్ష్మణుడు ఏ విధముగానూ అందుకు అంగీకరించకపోవుటతో మహాత్ముడైన రాముడు భరతుణ్ణి యౌవరాజ్యమునందు అభిషేకించెను. (91-94)

రాముడు అనేక పర్యాయములు పౌండరీకము, అశ్వమేధము, వాజపేయము, ఇంకా అనేక విధములైన యజ్ఞములు చేసెను. రాముడు పదివేల సంవత్సరములు రాజ్యము చేసి మంచి గుఱ్ఱములతో, అధికమైన దక్షిణలు ఇచ్చుచు నూరు అశ్వమేధయాగములు చేసెను. ఆజానుబాహువు, విశాలమైన వక్షఃస్థలము కలవాడు, ప్రతాపవంతుడు అయిన ఆ రాముడు, తనకు లక్ష్మణుడు అనుచరుడై ఉండగా ఈ భూమి నంతను పాలించెను. ధర్మాత్ముడైన రాముడు చాల ఉత్తమమైన రాజ్యమును పొంది, పుత్రులతోను, సోదరులతోను, బంధువులతోను కూడి అనేకవిధములైన యజ్ఞములు చేసెను. (95-98)

రాముడు రాజ్యమును పాలించిన కాలములో స్త్రీలు వైధవ్యదుఃఖమును పొందలేదు. క్రూరజంతువులవలన భయముకాని, వ్యాధులవలన భయము కాని లేకుండెను. లోకములో దొంగలు లేకుండిరి. ఎవ్వనికీ కూడ ఏ అనర్థము కలగలేదు. పెద్దవాళ్ళు చిన్నవాళ్ళకు ప్రేతకార్యము చేయు అవసరమెన్నడూ, ఎక్కడా కలగలేదు. అంతా ఆనందమయముగానే ఉండెను. అందరూ ధర్మపరులై ఉండిరి. రాముణ్ణే చూచుచు, అనగా రాముని మనస్సుకు బాధ కలుగును అను అభిప్రాయముతో, లేదా రాము దెక్కడ శిక్షించునో అను భయముతో, ప్రజలు ఒకరి నొకరు హింసించుకొనలేదు. రాముడు రాజ్యము చేయుచున్న కాలములో ప్రజలు వేలకొలది సంవత్సరములు వేలకొలది పుత్రులతో రోగములుగాని, దుఃఖముకాని లేనివారై ఉండిరి. (99-102)

ప్రజలు ఎక్కడ చూచినా రాముడు, రాముడు, రాముడు అని ఎల్లప్పుడు రాముణ్ణి గూర్చిన కథలు చెప్పుకొనిరి. రాముడు రాజ్యమును పాలించు కాలములో జగత్తు అంతా రామమయము అయిపోయెను. అప్పుడు వృక్షములు ఎట్టి వ్రణములు, అనగా క్రిమికీటకాదుల వలన గాయములు, లేక నిత్యము పుష్పఫలములతో నిండి ఉండెను. మేఘము తగిన కాలమునందు వర్షించుచుండెను. వాయువు స్పర్శ సుఖకరముగా ఉండెను. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు దురాశ లేక తమ తమ పనులతోనే తృప్తిచెందుచు తన తమ కర్తవ్యములు చేసికొనుచుండిరి. రాముడు రాజ్యము పరిపాలించుచుండగా ప్రజలు ధర్మతత్పరులై, అసత్య మనేది

లేక నివసించుచుండిరి. ప్రజలందరూ ఉత్తమలక్షణసంపన్నులే. అందరూ ధర్మమునందు ఆసక్తి కలవారే. రాముడు ఈ విధముగా పదివేల సంవత్సరములు రాజ్యము చేసెను.(103-106)

శ్రీమద్రామాయణ మాహాత్మ్యము

పూర్వము వాల్మీకి రచించిన ఈ ఆదివాక్యము ధర్మసంమతము. కీర్తిని ఇచ్చును. ఆయుర్దాయమును పెంచును. రాజులకు విజయము చేకూర్చును. అట్టి అర్షమైన ఈ ఆదికావ్యమును ఎవ్వడు చదువునో, ఎవ్వడు వినునో అతడు సమస్తపాపములనుండి విముక్తు డగును. రాముని పట్టాభిషేకము వరకు ఉన్న ఈ గ్రంథమును ఈ లోకములో వినినచో పుత్రులు కావలె నని కోరువాడు పుత్రులను, ధనము కావలెనని కోరువాడు ధనములను పొందును. రాజు భూమిని జయించి శత్రువులను అణగద్రొక్కివేయును. కౌసల్య రామునిచేత ఎట్లు జీవపుత్ర(జీవించిన పుత్రుడు కలది) అయినదో, సుమిత్ర లక్ష్మణునిచేత ఎట్లు జీవపుత్ర అయినదో, కైకేయి భరతునిచేత ఎట్లు జీవపుత్ర అయినదో అట్లే ఈ ఆదికావ్యమును చదివిన లేదా వినిన స్త్రీలు జీవపుత్రలై, పుత్రపౌత్రులతో కూడినవారై ఎల్లప్పుడూ ఆనందముతో ఉందురు. ఈ రామాయణ కావ్యమును, అక్లిష్టకర్మయైన రాముని విజయవృత్తాంతమును అంతనూ వినిన మానవుడు దీర్ఘాయుర్దాయము కూడ పొందును.(107-112)

పూర్వము వాల్మీకి రచించిన ఈ మహాకావ్యమును నమ్మకముతో, కోపమును జయించి వినువాడు కష్టములను దాటును. పూర్వము వాల్మీకి రచించిన ఈ కావ్యమును విన్నవారు ప్రవాసాంతమునందు బంధువులతో కూడ కలసి ఆనందముగా ఉందురు. ఈకావ్యమును విన్నవారు రామునినుండి కోరిన వరము లన్నింటినీ పొందెదరు. దీనిని వినుటచేత దేవత లందరూ వినువారి విషయమున సంతోషింతురు. దీనిని చదివినచో ఇంట్లో ఉన్న దుష్టభూతాదులు శాంతించును. రాజు భూమిని జయించును. ప్రవాసములో ఉన్నవాడు క్షేమముగా ఉండును. రజస్వలలైన స్త్రీలు ఈ రామాయణమును విన్నచో చాల ఉత్తములైన పుత్రులను కనెదరు. పురాతనమైన ఈ ఇతిహాసమును పూజించువాడు, చదువువాడు, సమస్తపాపములనుండి విముక్తుడై దీర్ఘాయుర్దాయమును పొందును. క్షత్రియుడు శిరస్సువంచి నమస్కరించి ఎల్లప్పుడు దీనిని బ్రాహ్మణునినుండి వినవలెను. ఈ రామాయణము నంతనూ ఎల్లప్పుడూ వినువానికి చదువువానికి ఐశ్వర్యము,

పుత్రలాభము కలుగును. సంశయము లేదు. దీనిని చదువుటచేత రాముడు ఎల్లప్పుడూ సంతోషించును; అనుగ్రహించును. అతడు నిత్యుడైన విష్ణువు కదా. రఘువంశమునందు శ్రేష్ఠుడైన రాముడు సాక్షాత్తు ఆదిదేవుడు, మహాబాహువు, పాపహరి, ప్రభువు అయిన నారాయణుడే. లక్ష్మణుడు ఆదిశేషుడు. (113-120)

ఓ జనులారా! పూర్వము ఈ విధముగా జరిగిన ఈ ఇతిహాసమును అడిగినవారికి నిర్భయముగా లేదా దృఢవిశ్వాసముతో చెప్పుడు. మీకు క్షేమమగుగాక. విష్ణువు బలము వృద్ధిచెందుగాక. ఈ రామాయణమును పఠించినా, వినినా దేవతలు అనుగ్రహింతురు. రామాయణమును వినుటచే పితృదేవతలు సంతోషింతురు. వాల్మీకి మహర్షి రచించిన రామునికి సంబంధించిన ఈ సంహితను భక్తిపూర్వకముగా వ్రాయు నరులకు స్వర్గమునందు నివాసము లభించును. గొప్ప అర్థము గల శుభకరమైన ఈ కావ్యమును చదివినవాడు కుటుంబాభివృద్ధిని, ధనధాన్యసమృద్ధిని, ఉత్తమస్త్రీలను, గొప్ప సుఖమును, ఈ భూలోకములో సకలకార్యసిద్ధిని పొందును. ఈ ఆఖ్యానము ఆయుర్దాయమును వృద్ధి పొందించును. ఆరోగ్యమును ఇచ్చును. కీర్తిని కలిగించును. సోదరప్రేమను పెంచును. సద్బుద్ధిని కలిగించును. శుభకరము. గొప్ప తేజస్సును వృద్ధిచేయును. అట్టి ఈ శ్రీమద్రామాయణమును సమృద్ధిని కోరు సత్పురుషులు నియమపూర్వకముగా వినవలెను.(121-125)

శ్రీమద్రామాయణమందలి యుద్ధకాండలోని నూట ఇరవై ఎనిమిదవ సర్గము సమాప్తము.

యుద్ధకాండము సమాప్తము.

యథా మధుకరస్తర్షాత్కాశపుష్పం పిబన్నపి,
రసమత్ర న విన్దేత తథాఽనార్యేషు సౌహృదమ్. (యుద్ధకాండ. సర్గ. 16. 14)

తుమ్మెద ఎంతో ఆసక్తితో రెల్లుపూవుపై వాలి మకరందమును త్రాగ ప్రయత్నించినా దానికి రసమేమీ ఎట్లు లభించదో అనార్యులతో స్నేహము కూడా అట్లే ఉండును.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే,
భయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ. (యుద్ధకాండ. సర్గ. 18.32)

ఎవ్వడైనను వచ్చి, 'నేను నీ వాడను.' అని చెప్పుచు ఒక్కమాటు నన్ను శరణు పొందిన చాలును వానికి సకలప్రాణులనుండి అభయము నిచ్చెదను. (ఇది రాముడి ప్రతిజ్ఞ.)

ప్రశమశ్చ క్షమా చైవ ఆర్జవం ప్రియవాదితా,
అసామర్థ్యఫలా హ్యేతే నిర్గుణేషు సతాం గుణాః. (యుద్ధకాండ. సర్గ.21. 14)

సత్పురుషులలో ఉన్న శాంతి, ఓర్పు, ప్రియముగ మాట్లాడుట అను ఈ గుణములను, గుణములు లేనివారు సామర్థ్యము లేకపోవుటగా పరిగణించు చుందురు.

మరణాన్తాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనమ్,
క్రియతామస్య సంస్కారో మమాప్యేష యథా తవ. (యుద్ధకాండ. సర్గ. 109. 25)

వైరములు మరణముతో సమసిపోవును. మేము అనుకున్న పని పూర్తి అయినది. ఇతనికి అంతిమ సంస్కారము చేయుము. ఇతడు నీకెట్లో నాకు కూడా ఇప్పుడు అట్లే. (రావణవధ తరువాత విభీషణునికి రాముడు చెప్పిన మాట.)



TLP PUBLISHERS

9 788192 771519